
ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవాలు

27, 28 డిసెంబర్ 2003

వజ్రోత్సవ సంచిక



1943-2003

60

సంవత్సరాలు

సభాస్థలి

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ 500 001

ఆంధ్ర సారస్వత పరిషత్తు

వజ్రోత్సవ సంచిక

ప్రధాన సంపాదకుడు

ఆచార్య సి. నారాయణ రెడ్డి

సంపాదకుడు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

సంపాదక వర్గం

ఆచార్య యం. కులశేఖర రావు

ఆచార్య ఎస్.వి. రామారావు

డా. తిరుమల శ్రీనివాసాచార్యులు

డా. డి. చంద్రశేఖర రెడ్డి

ప్రచురణ

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001

ఫోన్ నం. 24753724

ముద్రణ: 2003
ప్రతులు : 1,000

మూల్యం: రూ.250/-

ప్రతులకు:
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైద్రాబాదు-500 001
ఫోన్: 24753724

ముఖపత్ర రచన: **టి. బాబురావు**

ముద్రణ:
విష్ణ కంప్యూటర్ సర్వీసెస్
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైద్రాబాదు.
ఫోన్: 27676910

ఆముఖం

ఆంధ్ర సారస్వత పరిషత్తు మాతృసంస్థ. నిజాం రాష్ట్రంలో తెలుగుభాషాదీపం కొడిగట్టిన రోజుల్లో దాని పునః ప్రకాశానికి ఉద్యమించిన సంస్థ. మాడపాటి, సురవరం వంటి సారస్వతమూర్తుల ప్రేరణతో రూపుదిద్దుకొని ఆంధ్రదేశంలోనే అగ్రేసర సాహిత్యసంస్థగా నిలిచింది. మాన్యమిత్రులు కీ.శే. డా. దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవితం ఈ సంస్థ అభివృద్ధికి శ్రమించారు. పరిషత్తు రజతోత్సవం, స్వర్ణోత్సవాలు జరుపుకుని ఇటీవలే వజ్రోత్సవాలు వైభవంగా నిర్వహించుకున్నది. స్వర్ణోత్సవాలు, వజ్రోత్సవాలు నా ఆధ్యక్ష్యంలో జరగటం నా అదృష్టం. ఇప్పుడు పరిషత్తు ప్రాంగణం లీజుగ్రహణం నుంచి విముక్తం. నా విజ్ఞాపనను పురస్కరించుకుని పరిషత్తు ప్రాంగణంలోని స్థలాన్ని నామమాత్ర మూల్యానికి మాన్యముఖ్యమంత్రి శ్రీచంద్రబాబునాయుడుగారు పరిషత్తుకు అప్పగించారు. ఈ విషయంలో రెడ్డి ల్యాబ్స్ అధినేత డా. కె. అంజిరెడ్డిగారు స్వచ్ఛందంగా అందించిన ఆర్థికసహాయం అనితర సాధ్యం. నేను ఎం.పి. నిధులనుంచి ఇచ్చిన రూ.25 లక్షలతో పండిత శిక్షణ కళాశాల భవనం నిర్మాణంలో ఉంది. పరీక్షలు, ప్రాచ్యకళాశాల, పండిత శిక్షణ కళాశాల సుశిక్షితులైన అధ్యాపకులతో సమర్థంగా నడుస్తున్నాయి.

'పరిణతవాణి' వంటి వినూత్న కార్యక్రమం, సంస్కృతీ సప్తాహం, శతజయంతి రచయితల సప్తాహం వంటి సదస్సులు అనేకం నిర్వహించాం. వజ్రోత్సవాల సందర్భంలో భాషాసదస్సు, సాహిత్య సదస్సు ఏర్పాటు చేశాం. పరిషత్తు వేదిక నుంచి ప్రసంగించని ప్రముఖ సాహిత్యవేత్త లేడన్నది వాస్తవం. ప్రస్తుతం అనేక పండితులు, కవులు, విమర్శకులు, పరిశోధకుల వ్యాసాలతో ఈ వజ్రోత్సవ ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నాం. దీనికోసం ఆర్థికంగా, హార్దికంగా సహకరించిన వదాన్యులు, మేధావుల సౌజన్యం అభినందనార్హం. పరిషత్తు పక్షాన భవిష్యత్తులో సమధికోత్సాహంతో కార్యక్రమాలు రూపొందించటం జరుగుతుందని నా ప్రగాఢ విశ్వాసం.



(డా. సి. నారాయణరెడ్డి)

ఆంధ్ర సారస్వత పరిషత్తు సేవా నివేదిక

- ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

నిజాం రాష్ట్రాంధ్రులలో మాతృభాషాభిమానాన్ని పెంపొందించడానికి, ఆంధ్ర భాషాభివృద్ధికై అన్ని విధాల కృషి చేయటం కోసం 26 మే 1943 నాడు ఏర్పడిన సంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. 1942లో ధర్మవరంలో నవమాంధ్ర మహాసభ జరిగినప్పుడు కలిగిన ఆలోచన దశమాంధ్ర మహాసభ నాటికి రూపుదాల్చింది. శ్రీ బూర్గుల రంగనాథరావు, కీ.శే. భాస్కరభట్ల కృష్ణారావుగారు సమావేశకర్తలుగా , కీ.శే. లోకనంది శంకరనారాయణరావు గారు అధ్యక్షులుగా జరిగిన ఆనాటి సభ పరిషత్తు స్థాపన ప్రక్రియను సర్వాంగీణంగా రూపొందించింది. మొదటి కార్యవర్గాన్ని నియమించింది.

మొదటి కార్యవర్గంలోని పెద్దలు:

శ్రీ లోకనంది శంకర నారాయణరావు (అధ్యక్షుడు)
శ్రీ బుక్కపట్టణం రామానుజాచారిగారు (ఉపాధ్యక్షులు)
శ్రీ రంగమ్మ ఓబులరెడ్డి గారు (ఉపాధ్యక్షులు)
శ్రీ బిదురు వెంకటశేషయ్యగారు (ప్రధాన కార్యదర్శి)
శ్రీ బూర్గుల రంగనాథరావుగారు (సహాయ కార్యదర్శి)
శ్రీ మాడపాటి హనుమంతరావుగారు, సభ్యులు
శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు ,,
శ్రీ రావాడ సత్యనారాయణగారు ,,
శ్రీ భాస్కరభట్ల కృష్ణారావుగారు ,,
శ్రీ సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారు ,,
శ్రీ చిదిరె మఠం వీరభద్రశర్మగారు ,,
శ్రీ కాళోజి నారాయణరావుగారు ,,
శ్రీ నందగిరి వెంకట్రావుగారు ,,
శ్రీ పొల్కంపల్లి వెంకటరామారావుగారు ,,
శ్రీ జానపాటి సత్యనారాయణగారు ,,
శ్రీ వెంకటరాజేశ్వర జోషిగారు ,,
శ్రీ గవ్వా అమృతరెడ్డిగారు ,,
డా. మర్రి చెన్నారెడ్డిగారు ,,

ప్రథమంగా ఈ సంస్థకు కార్యస్థానం గోలకొండ పత్రికా కార్యాలయం.

పరిషత్తు ఆదర్శాలు, ఆశయాలు ఇవి:

1. సభలు, సమ్మేళనాలు నిర్వహించటం
2. ప్రాచీన సాహిత్యాన్ని, తత్ సంబంధి విశేషాల్ని సేకరించటం

3. పారిభాషిక మాండలిక పదకోశాలను తయారు చేయటం
4. ఇతర సంస్థల తోడ్పాటుతో సాహిత్యాభివృద్ధికి కృషి చేయటం
5. తెలుగులో పరీక్షలు నిర్వహించటం
6. రచయితలను ప్రోత్సహించటం
7. అనుబంధ శాఖల్ని స్థాపించటం
8. ఉత్తమగ్రంథాల్ని ప్రకటించటం

ఈ ఆశయాలతో ప్రారంభమైన పరిషత్తు కాలానుగుణంగా కార్యక్రమాల్ని తీర్చిదిద్దుకుని ముందుకు సాగుతున్నది.

పరిషత్తు ఆనాటి నిజాం రాష్ట్రంలో తెలుగు భాషా పునర్వికాసానికి కంకణం కట్టింది. ఈనాటి వయోజనవిద్య అక్షరాస్యత పథకం లాంటి కార్యక్రమాల్ని 1944లోనే మొదలుపెట్టింది. తెలుగులో ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తున్నది.

పరిషత్తు ఒక ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పి.డి.సి., బి.ఏ (ఎల్), ఎం.ఏ (ఎల్) కోర్సులు బోధింపబడుతున్నాయి. ప్రభుత్వం సహాయంతో నిర్వహింపబడుతున్న ఈ కళాశాల ఆంధ్రదేశంలోనే ప్రతిష్ఠను ఆర్జించుకున్నది. 300 మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పరిషత్తు ప్రాచ్యకళాశాలతోపాటు పండిత శిక్షణ కళాశాలను కూడా నిర్వహిస్తున్నది. పాత పద్ధతిలో 16 బ్యాచీలు నిర్వహింపబడ్డాయి. గత సంవత్సరం నుంచి ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన నూత్న విధానంలో రెండవ బ్యాచ్ నడుస్తున్నది. ప్రాచ్య కళాశాలలోను, పండిత శిక్షణ కళాశాలలోను సుశిక్షితులైన, అన్ని అర్హతలు కలిగిన అధ్యాపకులు పనిచేస్తున్నారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు చరిత్రలో మూడు ఘట్టాలున్నాయి. మొదటిది స్థాపన దశ. అందుకు కృషి చేసిన మహానుభావులు మాడపాటివారు, సురవరం వారు, లోకనంది శంకరనారాయణరావు, బిదురు వెంకటశేషయ్య, బూర్గుల రంగనాథ రావులాంటి పెద్దలు. రెండవ వికాసదశలో యావజ్జీవితం సంస్థ కోసం శ్రమించిన నైతాళికమూర్తి డా. దేవులపల్లి రామానుజరావుగారు. వారికి తోడుగా నిలిచిన పెద్దలలో ప్రముఖులు డా. గడియారం రామకృష్ణశర్మగారు. పరిషత్తు పరిరక్షణ దశలో దానిని ఆదుకున్న మహావ్యక్తి నేటి పరిషత్తు అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డిగారు. పరిషత్తు స్థలం ప్రభుత్వం నుంచి లీజుగా తీసుకున్నది. అయితే అందులో కొంత స్థలానికి లీజు కాలం ముగిసింది. అందువల్ల ప్రభుత్వం ఆ స్థలాన్ని నిర్ణీత మూల్యం చెల్లించి స్వాధీనం చేసుకోవలసిందనీ లేదా ప్రభుత్వానికి అప్పగించవలసిందనీ ఒత్తిడి చేసింది. అలాంటి పరిస్థితుల్లో సంబంధిత మంత్రివరేణ్యులతో, అధికారులతో అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డిగారు మాట్లాడి పరిషత్తు స్థాపన నేపథ్యాన్ని వివరించి ముఖ్యమంత్రిగారితో ప్రస్తావించి, పెద్దలతో విన్నపాలు పంపించి ఈ స్థల విషయాన్ని పరిష్కరించారు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో జరిగిన ఒక సభలో ముఖ్యమంత్రిగారు స్వయంగా పరిషత్తు స్థలాన్ని వారికే అప్పగిస్తామని సినారె సమక్షంలో వాగ్దానం చేశారు. అధ్యక్షులు ఈ స్థలం కొనుగోలుకు కావలసిన సొమ్ములో చాలా భాగం అంటే 14 లక్షలు రెడ్డిల్యాబ్స్ అధినేత డా. కె. అంజిరెడ్డిగారికి చెప్పి ఆర్థిక సౌజన్యంగా ఇప్పించారు. దానితో రూ.॥లు 25,72,793=00 ప్రభుత్వానికి చెల్లించి ఆ 3033 చ.మీ. స్థలాన్ని పరిషత్తు స్వాధీనం చేసుకుంది. డా. అంజిరెడ్డి గారి ఔదార్యం చిరస్మరణీయం.

పరిషత్తు రజతోత్సవాలు 1973లో జరిగాయి. డా. బెజవాడ గోపాలరెడ్డిగారు ఆ సభకు ప్రారంభకులు. డా. సి. నారాయణరెడ్డిగారు అధ్యక్షులుగా పరిషత్తు స్వర్ణోత్సవాలు 1994లో వైభవోపేతంగా జరిగాయి. అప్పటి భారతప్రధాని శ్రీ పి.వి. నరసింహారావుగారు ముఖ్యాతిథిగా ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు.

మా అధ్యక్షులు వజ్రోత్సవాలు జరపడం కోసం ట్రస్టు సమావేశం, కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి తగిన నిర్ణయాలు తీసుకున్నారు. పరిషత్తు స్థలాన్ని నామమాత్ర మూల్యానికి ఇచ్చివేసిన మాన్య ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారిని ఈ వజ్రోత్సవాల ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఆ సభలో సభాధ్యక్షులుగా డా. సినారెగారు పరిషత్తు స్థాపనలోని నేపథ్యాన్ని వివరించి ఈ సంస్థ కోసం కృషి చేసిన పెద్దలను స్మరించారు. ముఖ్యమంత్రిగారి సౌజన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగారు పరిషత్తుకు ప్రభుత్వ సహాయం ఉంటుందని అధ్యక్షుల వారికి హామీ యిచ్చారు. పరిషత్తుకు స్థలాన్ని అందించటంలో తమ అమూల్య సహాయాన్ని అందించిన పరిపాలనాదక్షులు, దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ శ్రీ కె.వి. రమణ, ఐ.ఏ.ఎస్.గారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఉన్నారు. వజ్రోత్సవ ప్రారంభ సభలో వారు స్వాగత ప్రసంగం చేశారు.

దశాబ్దాలుగా ఈ సంస్థ కోసం కృషి చేసిన మాన్యులు డా. గడియారం రామకృష్ణశర్మగారిని ఈ సందర్భంగా ఐదువేల రూపాయల నగదుతో శాలువాతో ముఖ్యమంత్రి గారు సత్కరించారు. పరిషత్తు ఉపాధ్యక్షులు ఆచార్య బిరుదురాజు రామరాజుగారు విశిష్ట అతిథిగా ఈ సభలో పాల్గొన్నారు. ప్రముఖ సాహితీవేత్తలతో, సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులతో, కార్యకర్తలతో సాహిత్యప్రియులతో 27 డిసెంబర్ 2003 నాడు జరిగిన వజ్రోత్సవ ప్రారంభసభ పరిషత్తు చరిత్రలో స్మరణీయ ఘట్టం.

ఈ సందర్భంగా భాషా సదస్సు, సాహిత్య సదస్సులు జరిగాయి. ప్రముఖులు చాలా మంది ఇందులో పాల్గొన్నారు. ఆ సదస్సుల నివేదిక ఈ సంచికలో పొందుపరుచబడింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన హోంశాఖామాత్యులు పరిషత్తు చేస్తున్న కృషిని అభినందిస్తూ సినారె సేవలను ప్రశంసించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు తొలినాళ్ల నుంచి ఎన్నో సాహిత్య సదస్సులు, సాంస్కృతిక సదస్సులు చేసింది. మహాభారతోపన్యాసములు, భాగవతోపన్యాసములు ఆయా సదస్సుల్లో ప్రముఖులు చేసిన ప్రసంగాలే. తరువాత అవి గ్రంథాలుగా వెలువడ్డాయి. పరిషత్తు ఎందరో రచయితల గ్రంథావిష్కరణ సభలు ఏర్పాటు చేసింది. గత దశాబ్దిలో నిర్వహించిన సదస్సులు అందరి మన్ననలు పొందాయి. ఆంధ్ర సంస్కృతీ సప్తాహం, శతజయంతి రచయితల సప్తాహం, తెలుగు సాహిత్యం-జానపద ప్రభావం, నవ్యాంధ్ర సాహిత్యం-తొలితరం విమర్శకులు, డా. ఆరుద్ర సాహిత్య సమాలోచన, భమిడిపాటి కామేశ్వరరావు శతజయంతి, తెలుగుభాష-వర్తమానస్థితిగతులు, పరివర్తన దిశలో ఆంధ్రుల జీవన విధానం, స్వాతంత్ర్య సమరంలో కవన శంఖారావం, రచయితలు-రాజకీయోద్యమాలు, ప్రసారసాధనాలు-తెలుగు భాషా సంస్కృతులు వంటివి పరిషత్తు నిర్వహించిన ప్రముఖమైన కొన్ని సదస్సులు. శీర్షికలను బట్టి వాటి ప్రాముఖ్యాన్ని గ్రహించవచ్చు. ఈ సదస్సులతోపాటు అధ్యక్షుల రూపకల్పనతో వెలువడిన ప్రసంగపరంపర 'పరిణతవాణి'. మొదటి దశలో డెబ్బది యేళ్లు పైబడ్డ వారు, తరువాత 65 ఏళ్ల పైబడ్డవారు, తమ జీవితానుభవాలను, రచనలను, సాహిత్యవేత్తలతో తమకున్న సంబంధాన్ని, సాంస్కృతికాంశాలను ఈ ప్రసంగాల్లో తెలియజేశారు. ఇంతవరకు ఈ ప్రసంగాలు ముప్పైకి పైగా జరిగాయి. ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఇందులో మొదట కొన్ని ప్రసంగాల్ని రెండు సంపుటాలుగా వెలువరించాం. తక్కిన వాటిని వీలును బట్టి వెలువరించాలని ఉంది. ఈ వినూత్న ప్రసంగశీర్షిక చాలా మంది సాహిత్యవేత్తల ఆదరణకు నోచుకుంది.

పరిషత్తు కొన్ని ధర్మనిధి ప్రసంగాలను ఏర్పాటు చేసింది. అవి: డా. దేవులపల్లి రామానుజరావు సంస్మరణ ప్రసంగం, శ్రీమతి ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ సంస్మరణ ప్రసంగం, శ్రీ బి.యన్.శాస్త్రి, ధర్మనిధి ప్రసంగం, కీ.శే. బెజవాడ గోపాలరెడ్డి సంస్మరణ ప్రసంగం. పరిషత్తు నిర్వహించిన, నిర్వహిస్తున్న కార్యక్రమాల విశేషవివరాలు రజతోత్సవ, స్వర్ణోత్సవ సంచికల్లో పరిషత్తు చరిత్రలో పొందుపరుచబడ్డాయి.

పరిషత్తు సమగ్ర కార్యక్రమాల పర్యవేక్షణకు ఆంధ్ర సారస్వత పరిషత్తు ట్రస్టు ఏర్పాటయింది. ఆ ట్రస్టుకు అధ్యక్షులు డా. సి. నారాయణరెడ్డిగారు. వారి నేతృత్వంలో ఈ ట్రస్టు పరిషత్తు ఆస్తులను పరిరక్షిస్తుంది.

పరిషత్తు భవన నిర్మాణంలో మరోఘట్టం పండిత శిక్షణ కళాశాల భవన నిర్మాణం. అధ్యక్షులు డా. సి. నారాయణ రెడ్డిగారు, ఎం.పి. ల్యాడ్ నుంచి ఇచ్చిన ఇరవై అయిదు లక్షలతో పడమట విశాలమైన ఖాళీ స్థలంలో పండిత శిక్షణ కళాశాల భవన నిర్మాణం జరుగుతున్నది. రెండు మూడు మాసాల్లో భవన నిర్మాణం పూర్తి అవుతుంది. పండిత శిక్షణ కళాశాలకు ప్రత్యేక భవనం ఉండాలన్నది అధ్యక్షుల ఆలోచన. వారికి ఆలోచన అంకురిస్తే అది కార్యరూపమైన తాలుస్తుంది, కావ్యరూపమైన ధరిస్తుంది. పరిషత్తు నిర్మాణాత్మక కృషిలో వారి హస్తబలం, వాగ్బలం అలాంటివి.

'యువభారతి' కార్యక్రమాలకు పరిషత్తు ఎంతగానో సహకరించింది. పరిషత్తు ప్రాంగణంలో జరిగిన ఆనాటి లహరీ సభలు మరవరానివి. 'రసరంజని' నాటక సంస్థకు పది సంవత్సరాలు ఆశ్రయమిచ్చి ఆదుకున్నది. నాటక కళకు ప్రోత్సాహం అందించాలన్న ఉద్దేశంతో ఆ సంస్థ కృషిని గమనించి అందించిన సహకారం ఇది. అయితే పరిషత్తు కార్యక్రమాలు విస్తరిస్తున్నందువల్ల, భవన నిర్మాణ కార్యక్రమం వల్ల ప్రస్తుతం ఆ సహకారాన్ని కొనసాగించడం సాధ్యపడలేదు. సురవరం వైజయంతి పరిషత్తు సహకారం ఎంతో ఉంది.

పరిషత్తులో 15 వేలకు పైగా గ్రంథాలతో ఒక గ్రంథాలయం ఉంది. ఇందులో చాలా ప్రక్రియలకు సంబంధించిన పరామర్శ గ్రంథాలున్నాయి. ఈ గ్రంథాలయాన్ని పరిశోధకులు వినియోగించుకోవడం జరుగుతున్నది. ఒక పుస్తక విక్రయశాల కూడా ఉంది. ఇందులో పరిషత్తు ప్రచురణలే కాకుండా కొందరు ప్రముఖ రచయితలు, రచయిత్రుల గ్రంథాలు కూడా విక్రయానికి లభిస్తాయి.

పరిషత్తు వేదిక సామరస్యవేదిక. ఇక్కడ ఎన్నో సాహిత్యవేదికలు నిర్వహింపబడ్డాయి. ఆంధ్రదేశంలో ఈ వేదిక నుంచి ప్రసంగించని సాహిత్య ప్రముఖులు లేరని చెప్పటం అతిశయోక్తి కాదు. పరిషత్తు ఆహ్వానించగానే సౌజన్యమూర్తులు ఎందరో మా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. సౌజన్యమూర్తులు మరి ఎందరో సాహిత్య కార్యక్రమాలకు ఆర్థిక సౌజన్యం అందిస్తున్నారు. ఈ వజ్రోత్సవ సంచిక కోసం అడిగిందే తడవుగా తమ రచనలను పంపి రచయితలు సహకరించారు. వారందరికీ ధన్యవాదాలు. ప్రకటనల రూపంలో ఆర్థికంగా సహకరించిన వదాన్యులందరికీ కృతజ్ఞతాంజలి.

పరిషత్తు కృషిలో పాలుపంచుకుంటున్న వారు ప్రముఖ రచయితలు శ్రీ గోవిందరాజు రామకృష్ణారావుగారు, సేవాభావంతో పరిషత్తు కోసం కృషి చేస్తు పరిపాలనాధికారి శ్రీ పాండురంగయ్యగారు. వారి సేవలు ప్రశంసనీయం.

పరిషత్తు వజ్రోత్సవాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడిన, కార్యవర్గ సభ్యులకు, వ్యవస్థాపకులకు, కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పక తప్పదు.

ఈ సంచికను సర్వాంగసుందరంగా ముద్రించిన విప్ల కంప్యూటర్ సర్వీసెస్ అధినేత శ్రీ విజయసేనారెడ్డిగారికి మరియు వారి సిబ్బందికి కృతజ్ఞతలు.

అందరికీ వందనాలు - అభినందనచందనాలు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు - పరీక్షలు

- డా॥ ఎన్.ఆర్. వెంకటేశం
పరీక్షా కార్యదర్శి

నిజాం ప్రభుత్వం పరిపాలిస్తున్న రోజుల్లో, తెలుగు భాషకు నిలువనీడలేని పరిస్థితుల్లో తెలంగాణాలో తెలుగు దీపం ఆరిపోకుండా చేతులు అడ్డుపెట్టి వెలుగులను ప్రసరింపజేయటానికి హైదరాబాదు గడ్డమీద జీవం పోసుకున్న సంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. తెలుగు భాషా సంస్కృతులు విరాజమానం కావటానికి, వ్యవహార విధేయం కావటానికి కరదీపికగా పరిషత్తు పనిచేసింది. ఆ రోజుల్లో తాలుకాల్లోనే మాధ్యమిక పాఠశాలలు ఉండేవి. అవీ ఉర్దూ మీడియంలో నడిచేవి. అందువల్ల ఆంధ్ర భాషా ప్రచారదృష్టితో ఇతరవృత్తుల్లో జీవిస్తున్న వయోజనులు, స్త్రీలు, బాలురు, వృద్ధులు సులువుగా పరీక్షల్లో పాల్గొనేటట్లు తెలుగు పరీక్షలు నిర్వహించవలసిన అవసరం ఆనాటి తెలంగాణాలో ఏర్పడింది. ఈ బాధ్యతను పరిషత్తు స్వీకరించి ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశ పరీక్షల్ని నిర్వహించాలని సంకల్పించింది. శ్రీమాదిరెడ్డి హనుమంతరావు నాయుడు, శ్రీ ఆదిరాజు వీరభద్రరావు పంతులు, శ్రీ లోకనంది శంకర నారాయణరావు, శ్రీ బిదురు వెంకటశేషయ్య గార్లతో ఏర్పడిన ఉపసంఘం మొదట ప్రవేశపరీక్ష పాఠ్యప్రణాళికను సిద్ధం చేసింది.

18, 19 జులై 1944 తేదీల్లో మొట్టమొదటిసారి పరిషత్తు ప్రవేశపరీక్ష నిర్వహించింది. హైదరాబాదు, అలియాబాదు-దర్వాజ, వరంగల్లు, ఖమ్మం, కరీంనగర్, శంకరంపేట, చినపెండ్యాల, మహబూబాబాదు కేంద్రాల్లో ఈ పరీక్ష జరుపబడింది. తర్వాత రెండవ సంవత్సరంలో 4,5,6 అక్టోబర్ 1945 తేదీల్లో ప్రాథమిక, ప్రవేశపరీక్షలు హైదరాబాదు, అలియాబాదు దర్వాజా, సికిందరాబాదు, వరంగల్లు, ఖమ్మం, ఇప్పగూడెం, ఆర్మూరు, గోపాలపేట, జనగామ, గద్వాల, టేక్మాల కేంద్రాల్లో నిర్వహించబడ్డాయి. ఆ తరువాత మాధ్యమిక స్థాయిలో మాధ్యమిక పరీక్ష ప్రారంభించబడింది. పరిషత్తు పరీక్షలు జిల్లాలలోని వివిధ కేంద్రాల్లో జయప్రదంగా నిర్వహించబడ్డాయి. పరిషత్తు శాఖలు, పరీక్షా కేంద్రాలు కొత్త ప్రాంతాలకు వ్యాపించాయి. అధిక సంఖ్యలో బాలురు, వయోజనులు, స్త్రీలు పరిషత్తు పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణులయ్యారు.

1951 మార్చి నెలలో విశారద పూర్వభాగపరీక్ష కేవలం హైదరాబాదు కేంద్రంతోనే ప్రారంభించబడింది. 1952మే నెలలో ఉత్తరభాగ పరీక్ష జరుపబడింది. అంతకంతకూ ఈ పరీక్షలపట్ల ఆదరణ అధికమైనందువల్ల సంవత్సరానికి రెండుపర్యాయాలు పరీక్షలు నిర్వహించటం మొదలయింది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనేకాక బొంబాయి, మదరాసు, బెంగుళూరు వంటి రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా పరీక్షా కేంద్రాలు విరివిగా వెలిశాయి. దాదాపు 187 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించబడ్డాయి. బాపట్ల వాస్తవ్యులైన శ్రీమతి నేమాని శేషమ్మగారు తమ భర్త జ్ఞాపకార్థం విశారద ఉత్తర భాగపరీక్షలో సర్వప్రథముడుగా నెగ్గిన విద్యార్థికి 1116 రూపాయల నగదు బహుమతిని ఏర్పాటు చేశారు.

పరిషత్తు పెద్దలు చేసిన నిరంతర కృషివల్ల అప్పటి హైదరాబాదు ప్రభుత్వం విశారద పరీక్షను మెట్రిక్ స్థాయి పరీక్షగా ఆమోదించింది. దాని ఫలితంగా విశారద పరీక్షలు ఉత్తీర్ణులైనవారు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులుగా నియుక్తులు కాగలిగారు. దూరదృష్టిలో పరిషత్తు నిర్వహించిన పరీక్షల ఫలితంగా పోలీసుచర్య జరిగిన వెంటనే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం స్థాపించిన తెలుగు ప్రాథమిక పాఠశాలలకు తెలుగు అధ్యాపకుల లోటు లేకుండాపోయింది.

ఇప్పుడు ప్రాథమిక, ప్రవేశ, విశారద పూర్వ, విశారద ఉత్తరభాగ పరీక్షలు సంవత్సరానికి రెండు పర్యాయాలు జరుపబడుతున్నాయి. అక్షరాస్యత పథకానికి, వయోజన విద్యకు, పాఠశాల విద్య కరువైనా చదువుకోగోరే జిజ్ఞాసువులైన విద్యార్థులకు ఈ పరీక్షలు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ దృష్ట్యా ఎంతగానో ఉపకరిస్తున్నాయి. విశారదలో ఉత్తీర్ణులైనవారు నేరుగా పి.డి.సి.లో చేరటానికి అర్హులు. లోగడ విశారద మరియు పిడిసిలో ఉత్తీర్ణులైన వారికి పండిత శిక్షణకు ప్రవేశార్హత ఉండేది. ఇటీవల ప్రభుత్వం పండిత శిక్షణకు బి.ఏ (లాంగ్వేజస్) / బి.ఏ (మాడరన్ తెలుగు) లో ఉత్తీర్ణతయే ప్రవేశార్హతగా నిర్ణయించటం వల్ల ఆ ప్రభావం పరిషత్తు పరీక్షల మీద పడింది. పూర్వం సంవత్సరానికి ఎనిమిదివేల నుంచి పదివేలదాకా విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాసేవారు. ప్రస్తుతం మూడువేల నుంచి నాలుగువేల దాకా మాత్రమే పరీక్షలు రాస్తున్నారు.

ఇంటర్ మీడియట్ పాసైన విద్యార్థులు టి.టి.సి./డి.ఎడ్ చేస్తే వారికి సెకండరీ గ్రేడ్ టీచర్లుగా ఉద్యోగార్హత ఉంటుంది. ఇంటర్‌మీడియెట్‌కు సమానమైన పి.డి.సి. చేసిన విద్యార్థులను ప్రభుత్వం పండిత శిక్షణకు అనర్హులను చేసింది. పి.డి.సి.లో ఉత్తీర్ణులైనవారు మళ్ళీ మూడు సంవత్సరాలు బి.ఏ(లాంగ్వేజస్) పాసైతేగాని పండిత శిక్షణకు అర్హులు కారు. ఈ విధంగా పి.డి.సి. చేసిన విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నది. పూర్వంలాగే విశారద మరియు పి.డి.సి. ఉత్తీర్ణతను పండిత శిక్షణకు అర్హతగా పరిగణిస్తే ఓరియంటల్ విద్యార్థులకు అన్యాయం జరుగదు. ఈ నేపథ్యంలో పరిషత్తు విశారద పరీక్షలకు కూడా ఆదరణ లభిస్తుంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు - హైదరాబాదు

1944 జూలై నుండి 2003 ఆగస్టు వరకు పరీక్షలలో పాల్గొనినవారు

క్రమ సంఖ్య	నెల	సంవత్సరం	ప్రాథమిక	మాధ్యమిక	ప్రవేశ	వి.పూర్వ	వి. ఉత్తర	మొత్తం అభ్యర్థులు
01	జూలై	1944	92	--	57	--	--	149
02	అక్టోబరు	1945	107	--	62	--	--	169
03	జనవరి	1947	167	--	68	--	--	235
04	జూలై	1949	657	1088	754	--	--	2499
05	మార్చి	1950	1824	2640	1527	--	--	5991
06	అక్టోబరు	1950	1603	1534	1065	--	--	4202
07	మార్చి	1951	--	--	--	165	--	165
08	మే	1951	1497	1505	993	--	--	3995
09	నవంబరు	1951	631	423	440	--	--	1494
10	మే	1952	578	386	539	101	43	1647
11.	డిసెంబరు	1952	522	355	402	--	--	1279
12.	జూన్	1953	310	170	87	87	36	892

క్రమ సంఖ్య	నెల	సంవత్సరం	ప్రాథమిక	మాధ్యమిక	ప్రవేశ	వి.పూర్వ	వి. ఉత్తర	మొత్తం అభ్యర్థులు
13.	జనవరి	1954	426	213	347	--	--	986
14.	జూన్	1954	825	511	742	174	48	2300
15.	జనవరి	1956	579	416	478	--	--	1473
16.	జూన్	1955	455	286	408	176	53	1377
17.	జనవరి	1956	578	349	307	--	--	1234
18.	జూలై	1956	501	310	321	192	48	1372
19.	జనవరి	1957	379	297	251	--	--	927
20.	సెప్టెంబరు	1957	332	289	224	76	62	983
21.	జూన్	1957	202	--	149	195	20	566
22.	జనవరి	1959	221	--	102	133	66	522
23.	జూలై	1969	229	--	109	125	56	519
24.	జనవరి	1960	202	--	79	150	47	478
25.	జూలై	1960	208	--	133	196	38	575
26.	ఫిబ్రవరి	1961	228	--	184	290	61	763
27.	జూలై	1961	307	--	186	278	107	878
28.	ఫిబ్రవరి	1962	278	--	216	403	119	1016
29.	ఆగస్టు	1962	165	--	103	191	105	564
30.	ఫిబ్రవరి	1963	369	--	199	344	190	1012
31.	ఆగస్టు	1963	143	--	342	207	132	824
32.	ఫిబ్రవరి	1964	495	--	340	296	114	1245
33.	జూలై	1964	335	--	587	466	128	1516
34.	ఫిబ్రవరి	1966	856	--	1142	1225	234	3757
35.	సెప్టెంబర్	1965	470	--	891	932	361	2654
36.	ఫిబ్రవరి	1966	532	--	1138	1403	466	3539
37.	జనవరి	1968	918	--	1289	2014	627	4849
38.	డిసెంబరు	1967	1116	--	1347	2709	747	5919
39.	డిసెంబరు	1968	852	--	889	1912	926	4579
40.	జనవరి	1970	629	--	573	1393	685	3280
41.	డిసెంబరు	1970	645	--	792	1525	574	3536
42.	జూలై	1971	164	--	183	619	527	1498
43.	జనవరి	1972	826	--	761	1468	457	351
44.	జూలై	1972	386	--	422	1097	609	251
45.	డిసెంబరు	1972	474	--	473	715	429	209

క్రమ సంఖ్య	నెల	సంవత్సరం	ప్రాథమిక	మాధ్యమిక	ప్రవేశ	వి.పూర్వ	వి. ఉత్తర	మొత్తం అభ్యర్థులు
46.	ఆగస్టు	1973	817	--	746	1992	875	443
47.	ఫిబ్రవరి	1974	524	--	390	1125	454	249
48.	ఆగస్టు	1974	710	--	462	1248	1069	348
49.	ఫిబ్రవరి	1975	409	--	243	639	440	172
50.	సెప్టెంబర్	1975	273	--	159	355	333	112
51.	ఫిబ్రవరి	1976	213	--	139	268	137	757
52.	నవంబర్	1976	456	--	216	312	182	1166
53.	జూలై	1977	258	--	254	189	81	782
54.	ఫిబ్రవరి	1978	235	--	191	186	106	718
55.	సెప్టెంబర్	1978	508	--	279	128	112	1027
56.	మార్చి	1979	294	--	209	146	80	729
57.	నవంబర్	1979	497	--	155	146	72	870
58.	అక్టోబర్	1980	596	--	369	219	66	1250
59.	మార్చి	1981	344	--	228	197	93	862
60.	సెప్టెంబర్	1981	342	--	150	172	112	776
61.	జూలై	1982	452	--	321	334	103	1210
62.	ఫిబ్రవరి	1983	221	--	233	420	110	984
63.	డిసెంబరు	1983	264	--	217	341	143	965
64.	డిసెంబరు	1984	386	--	195	607	246	1434
65.	ఫిబ్రవరి	1986	579	--	194	939	286	1998
66.	ఫిబ్రవరి	1987	771	--	328	1083	354	2536
67.	నవంబర్	1987	531	--	342	1000	472	2345
68.	ఆగస్టు	1988	305	--	204	943	539	1991
69.	ఫిబ్రవరి	1989	344	--	177	894	510	1925
70.	ఆగస్టు	1989	184	--	132	707	612	1635
71.	ఫిబ్రవరి	1990	557	--	245	1208	371	2381
72.	సెప్టెంబర్	1990	315	--	154	931	682	2082
73.	ఫిబ్రవరి	1991	517	--	308	1773	658	3255
74.	సెప్టెంబర్	1991	358	--	180	1653	987	3178
75.	ఫిబ్రవరి	1992	397	--	217	2011	1144	3759
76.	సెప్టెంబర్	1992	311	--	251	2653	1057	4272
77.	ఫిబ్రవరి	1993	371	--	280	3199	1625	5475
78.	సెప్టెంబర్	1993	208	--	133	2687	1706	4734

క్రమ సంఖ్య	నెల	సంవత్సరం	ప్రాథమిక	మాధ్యమిక	ప్రవేశ	వి.పూర్వ	వి. ఉత్తర	మొత్తం అభ్యర్థులు
79.	మార్చి	1994	229	--	126	2356	1692	4403
80.	సెప్టెంబరు	1994	153	--	165	3334	1073	4725
81.	ఫిబ్రవరి	1995	130	--	153	3205	1540	5028
82.	అక్టోబరు	1995	236	--	264	2652	1595	4747
83.	ఫిబ్రవరి	1996	173	--	157	2700	1842	4872
84.	సెప్టెంబరు	1996	110	--	69	3023	1608	4810
85.	మార్చి	1997	118	--	128	2434	1685	4365
86.	సెప్టెంబరు	1997	100	--	74	1649	1098	2921
87.	ఏప్రిల్	1998	92	--	74	1871	1189	3226
88.	అక్టోబరు	1998	121	--	71	2054	1172	3418
89.	అక్టోబరు	1999	62	--	37	1618	919	2636
90.	మే	2000	33	--	40	472	806	1351
91.	ఫిబ్రవరి	2001	11	--	25	485	303	824
92.	నవంబరు	2001	47	--	37	611	313	1008
93.	మార్చి	2002	32	--	57	592	455	1136
94.	సెప్టెంబరు	2002	3	--	54	865	377	1299
95.	ఫిబ్రవరి	2003	2	--	24	962	642	1630
96.	ఆగస్టు	2003	7	--	6	913	710	1636
	మొత్తం		38519	10772	31769	83748	41841	206649

ఆంధ్ర సారస్వత పరిషత్తు - ప్రాచ్య కళాశాల

- డా॥ డి. చంద్రశేఖర రెడ్డి

సర్వ విద్యలకు, జ్ఞానానికంతటికీ మూలాధారం భాష. భాష లేనిదే మానవుడి మనుగడ లేదు. ఏ శాస్త్రంలో పండితుడు కావాలన్నా, ఏ విద్యలో నిపుణుడు కావాలన్నా భాష తోడ్పాటు అవసరం. తరం నుండి తరానికి సంస్కృతి, జ్ఞానం భాష ద్వారానే సంక్రమిస్తున్నాయి. ఇటీవలి కాలంలో భాషాధ్యయనం పట్ల ప్రభుత్వాలు తగినంత శ్రద్ధ చూపడం లేదు. పైగా నిర్లక్ష్యం కూడా చూపుతున్నాయి. భారతీయులు తమ స్వంత భాషలను అధ్యయనం చేయడంలో కంటే పరాయిభాషల మీద మోజు చూపుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఇది మరింత ఎక్కువవుతూ ఉంది.

ఒక దేశంలో ఇన్ని భాషలు ప్రాచీనకాలం నుండీ లిఖిత సాహిత్యం కలిగి ఉండడం భారతదేశంలో తప్ప మరొక చోట కనిపించదు. క్రీస్తు పూర్వం నుండీ లిఖిత సాహిత్యం ఉన్న భాషలు భారతదేశంలో ఉన్నాయి. మధ్యయుగాలలో మరెన్నో భాషలు లిఖిత సాహిత్యాన్ని పెంపొందించుకున్నాయి. మన భాషలన్నీ సర్వసమృద్ధమయిన భాషలు. అపారమయిన సాహిత్యాన్ని సృష్టించుకున్న భాషలు. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న భాషలు. ఏ వ్యక్తి అయినా తన స్వీయ భాషలోనే సర్వవిధ వ్యవహారాలూ గడుపుకో గలిగిన సామర్థ్యం ఉన్న భాషలు. కాని ఆధునిక కాలంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిలో ప్రధానపాత్ర పోషించే అవకాశాలను మనం తగినంతగా వినియోగించుకోలేదు. మన భాషలను ఆ మార్గంలో వాడుకోవడం లేదు.

మన భాషలను మనం అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతో ఉంది. ఆ దిశలోనే ప్రాచ్యకళాశాలలు వెలిశాయి. భాషాధ్యయనాన్ని విస్తృత పరచడం, ఆధునిక అవసరాలకు అనుగుణంగా భాషాభివృద్ధిని సాధించడం, మన సాంస్కృతిక వారసత్వాన్ని స్థిరీకరించడం, జాతి మానసిక వికాసానికి దోహదం చేయడం ప్రాచ్య కళాశాలల ప్రధాన కర్తవ్యం.

ఆంగ్లేయుల పరిపాలనా కాలంలోనే ఆంధ్రదేశంలో ప్రాచ్య భాషాధ్యయన వేదికలుగా ప్రాచ్య కళాశాలలు వెలిశాయి. భాషాబోధన కోసం భాషా పండితులను తయారుచేయడం వీటి తొలి లక్ష్యం.

ఆంధ్రదేశంలో తొలి ఆధునిక ప్రాచ్యకళాశాల 1860లో స్థాపితమైన విజయనగరం మహారాజా సంస్కృత కళాశాల. తెలంగాణాలో 1929లో ప్రారంభమయిన శ్రీ వేదాంతవర్ధినీ సంస్కృత కళాశాల మొదటిది. 1950 తరువాత అనేక ప్రాచ్య కళాశాలలు వెలిశాయి.

1943లో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఏర్పడింది. కేవలం తెలంగాణా ప్రాంతంలోనే కాక ఆంధ్రరాష్ట్రమంతటా, భారతదేశంలోని ఆంధ్రేతర ప్రాంతాలలోనూ, విదేశాలలోనూ తెలుగు భాషాసాహిత్యాల వికాసానికి ఆంధ్రసారస్వత పరిషత్తు చేసిన కృషి అద్వితీయమైనది. ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలను అనేక చోట్ల నడిపి లక్షలాది మంది తెలుగు నేర్చుకోవడానికి, తెలుగు పట్టాలు పుచ్చుకోవడానికి ఆంధ్ర సారస్వత పరిషత్తు గణనీయమయిన కృషి చేసింది. దేశంలో తెలుగు పండితుల కొరత తీర్చడానికి ప్రయత్నించి సఫలమయింది.

ఈ కృషిలో భాగంగానే 1965లో ఆంధ్రసారస్వత పరిషత్తు తన ఆధ్వర్యంలో ప్రాచ్యకళాశాలను స్థాపించింది. 27-8-1965న నూకల నరోత్తమరెడ్డిగారి అధ్యక్షతలో కళాశాల ప్రారంభోత్సవం జరిగింది. అప్పటి ఆర్థికశాఖామంత్రి డా. మర్రి చెన్నారెడ్డిగారు కళాశాలను ప్రారంభించారు. శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు కళాశాల పాలక సంఘాధ్యక్షులు. ఆచార్య సరిపెల్ల విశ్వనాథశాస్త్రిగారు ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలకు తొలి ప్రధానాచార్యులు. ఆరంభంలో దివాకర్ల వేంకటావధానిగారు, బిరుదురాజు రామరాజుగారు, పాటిబండ మాధవశర్మ గారు, శ్రీరామశర్మగారు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు, కేశవపంతుల నరసింహాశాస్త్రి గారు, పెరవలి లింగయ్యశాస్త్రి

గారు ఎటువంటి ప్రతిఫలమూ తీసుకోకుండా అధ్యాపకత్వం నిర్వహించారు. ఆనాడు డిప్.ఓ.ఎల్., బి.ఓ.ఎల్. కోర్సులతో కళాశాల ప్రారంభమయింది. 1967-68లో ఎం.ఓ.ఎల్. కోర్సుకూడా ప్రారంభమయింది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాచ్యకళాశాలల్లో స్నాతకోత్తర తరగతులు కేవలం ఉస్మానియా విశ్వవిద్యాలయ పరిధిలోనే ఉన్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రాచ్యభాషలకు ప్రత్యేక బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లను ఏర్పరచడమే కాక ప్రత్యేక ఫాకల్టీని కూడా ఏర్పరచి ఆంధ్రప్రదేశ్‌లోని తక్కిన విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకంగా నిలిచింది.

ఆంధ్రప్రదేశ్‌లోని భిన్న విశ్వవిద్యాలయాలలో వేరు వేరు పేర్లతో కొనసాగుతున్న ప్రాచ్యభాషాకోర్సులకు సంబంధించి సరయిన అవగాహన కొరవడి వివిధ స్థాయిలలో రకరకాల ఇబ్బందులు ఎదురవుతూ ఉన్న సమయంలో ఈ కోర్సులకు రాష్ట్రమంతటా ఒకే రకమయిన పేర్లు, కోర్సుల పాఠ్యప్రణాళికలలో ఆధునిక అవసరాలకు తగినట్లుగా మార్పులు చేయవలసిన అవసరం ఏర్పడింది. అప్పటి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు కె. సచ్చిదానందమూర్తిగారి అధ్యక్షతన నియమితమైన ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు ఈ కోర్సులకు ప్రీ డిగ్రీ కోర్సు, బి.ఏ. (లాంగ్వేజస్), ఎం.ఏ. (లాంగ్వేజస్) అని పేర్లు పెట్టడం జరిగింది. ప్రిడిగ్రీ కోర్సు, బి.ఏ. (ఎల్)లో ఇంటర్మీడియెట్, డిగ్రీ స్థాయి ఇంగ్లీషును తప్పనిసరి సబ్జెక్టుగా ప్రవేశపెట్టడం జరిగింది. చరిత్రను కూడా అధ్యయనాంశంగా ప్రవేశపెట్టారు. దీనివల్ల బి.ఏ (ఎల్)లో ఉత్తీర్ణులయిన వారికి బి.ఎడ్., లా వంటి ఇతర పట్టాలకు అర్హత, సాధారణ డిగ్రీ పట్టభద్రులకు లభించే ఇతర అవకాశాలూ కూడా లభించాయి.

అయినా ఈనాటికీ ఈ కోర్సుల పట్ల ప్రభుత్వాధికారులకుగాని, విద్యాశాఖాధికారులకు గాని, విశ్వవిద్యాలయాల వారికి గాని, సామాన్య ప్రజలకు గాని పూర్తి అవగాహన కలిగినట్లు కనిపించదు. ఆ కారణంగా ప్రాచ్య భాషా పట్టభద్రులు అనేక కష్టాలపాలవుతున్నారు. ఒకప్పుడు లభించిన సదుపాయాలను ఆయా అధికారుల అనవగాహన కారణంగా కోల్పోతున్నారు. ఇంతకు ముందు ప్రీడిగ్రీ కోర్సు చేసిన విద్యార్థులు పండిత శిక్షణకు అర్హులు. వీరిని ద్వితీయశ్రేణి భాషా పండితులుగా నియమించేవారు. ఇప్పుడు ఈ శిక్షణను పట్టభద్రులకు మాత్రమే పరిమితం చేశారు. దీనివల్ల ప్రీ డిగ్రీ కోర్సు చదివిన విద్యార్థులకు శిక్షణావకాశం, ఉద్యోగావకాశం పోయాయి. ఇంటర్మీడియట్ పాసయిన వాళ్లు డి.ఎడ్.కు అర్హులు. వారిని సెకండరీగ్రేడు అధ్యాపకులుగా నియమిస్తారు. అటువంటప్పుడు ప్రీడిగ్రీ కోర్సు చేసిన వారికి శిక్షణావకాశం, ఉద్యోగావకాశం లేకపోవటం భయంకరమయిన అన్యాయం. అనేక సందర్భాలలో ప్రీడిగ్రీ కోర్సు సర్టిఫికెట్టు తీసుకున్న విద్యార్థులకు మీ సర్టిఫికెట్టు ఇంటర్మీడియట్‌తో సమానం అన్న ధ్రువీకరణ పత్రం తీసుకురమ్మని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కూడా అడుగుతుంటారు. ప్రభుత్వం దీనికి వివరణలతో ఉత్తరువులు జారీ చేయవలసిన అవసరం, ప్రీడిగ్రీ పాసయిన వారికి శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించవలసిన అవసరం ఎంతో ఉంది. ఇది తక్షణం జరగవలసిన పని.

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న ఈ ప్రాచ్య కళాశాల విద్యార్థులను ఆధునిక భాషావసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ ఉంది. ఆచార్య కె.కె. రంగనాథాచార్యులుగారు రెండు దశాబ్దాలపాటు కళాశాలకు ప్రధానాచార్యులుగా ఉండి కళాశాలకు ఆంధ్రదేశంలో ఒక విశిష్ట స్థానాన్ని, గుర్తింపును సంపాదించి పెట్టారు. సర్వా వేంకటశేషయ్యగారు, దుర్భా వేంకట కృష్ణమూర్తిగారు, ముదిగొండ శివప్రసాద్‌గారు, జి.వి. సుబ్రహ్మణ్యంగారు, రవ్వా శ్రీహరిగారు, శలాక రఘునాథ శర్మగారు, హరిహరనాథ్‌గారు, శౌరయ్యగారు, కృష్ణగారు, విశ్వనాథం గారు ఈ కళాశాలలో అధ్యాపకులుగా పని చేశారు.

పరాయితం కృష్ణమూర్తిగారు 1984లో రిటయిరయ్యారు. హిందీ లెక్చరరుగా ఒక దశాబ్దం పనిచేసిన గోపాలరావు గారు తమ ఉద్యోగాన్ని విడిచిపెట్టారు. డా. కె.వి. సింగరాచార్యులుగారు, డా. కె.వి. సుందరాచార్యులుగారు, డా. పి.వి. చలపతిరావుగారు, డా. కె. చక్రపాణిగారు సుదీర్ఘకాలం అధ్యాపకులుగా పనిచేసి ఉద్యోగవిరమణ చేశారు.

ఆచార్య కె.కె. రంగనాథాచార్యులుగారి అనంతరం డా. నాయని కోటేశ్వరిగారు ఒక దశాబ్దంపాటు ప్రధానాచార్య పదవిని సమర్థంగా నిర్వహించారు. తరువాత ఎం. నరహరిగారు ప్రధానాచార్య పదవిని చేపట్టి నిర్వహించారు. కళాశాలల అధ్యాపక సంఘంలో చురుకుగా పాల్గొని తమ వంతు పాత్ర నిర్వహించారు.

డా. నాయని కోటేశ్వరిగారు ప్రధానాచార్యులుగా ఉన్న సమయంలోనే కళాశాల రజతోత్సవాలు జరుపుకొన్నది. ఈ సందర్భంగా 'తెలుగు సాహిత్యం - చారిత్రక నేపథ్యం' అన్న పేరిట ఒక పెద్ద సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ప్రముఖ పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇవి 'తెలుగు సాహిత్యం చారిత్రక నేపథ్యం' అన్న పేరిట గ్రంథరూపం ధరించాయి.

ప్రస్తుతం డా. డి. చంద్రశేఖరరెడ్డి, ప్రధానాచార్యులుగా ఉన్నారు. డా. డి.వి.ఎస్.ఆర్.మూర్తి సంస్కృతంలో రీడరుగా శ్రీ బి. జితేందర్ రెడ్డి చరిత్ర అధ్యాపకునిగా, శ్రీమతి జి. దుర్గావతి, శ్రీమతి జి. మంగమ్మ, శ్రీమతి వై. సత్యవతి, శ్రీమతి బి. రాజరత్నం తెలుగు అధ్యాపకురాండ్రుగా, శ్రీ ఎస్. భరత్ ఆంగ్లాధ్యాపకునిగా పనిచేస్తున్నారు.

కళాశాల కార్యాలయంలో పి. లక్ష్మీనారాయణగారు, కార్యాలయం సూపరింటెండెంటుగాను, ఎం. నారాయణ అటెండరుగానూ మూడు దశాబ్దాలకు పైగా విధులను నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు.

ఆర్. నారాయణరావు రికార్డ్ అసిస్టెంట్‌గా, కె.లక్ష్మయ్య అటెండరుగా పనిచేస్తున్నారు.

కళాశాలలో ఇంతవరకు నాలుగు వేలకు పైగా విద్యార్థులు చదువుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో రికార్డు స్థాయిలో 380 మంది విద్యార్థులు ప్రవేశం తీసుకున్నారు. అధ్యాపకుల కృషితో విద్యార్థుల శ్రమతో కళాశాల ప్రతి సంవత్సరమూ మంచి ఫలితాలు సాధిస్తున్నది. పి.డి.సి., బి.ఏ.(ఎల్), ఎం.ఏ (ఎల్)లలో కళాశాల ప్రథములుగా ఉత్తీర్ణులయిన విద్యార్థులకు గోల్ల లక్ష్మయ్యానాయుడు, కాకాని సావిత్రి, నాగారెడ్డి లక్ష్మమ్మ, మాడభూషి రంగాచార్యుల పేర్ల మీద అవార్డులు ఇవ్వడం జరుగుతున్నది.

ఈ కళాశాల విద్యార్థులు వివిధ అంతర్కళాశాలల పోటీలలో పాల్గొని అనేక బహుమతులు గెల్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలలో ఉన్నతోద్యోగాలలో ఉన్నారు.

కళాశాల గ్రంథాలయంలో ఆరువేలకు పైగా ఎంపిక చేసిన విలువయిన గ్రంథాలున్నాయి. సాహిత్య సంచికలూ, పత్రికలూ ఉన్నాయి.

1967-68 విద్యా సంవత్సరం నుండి 'నెలవంక' పేరుతో కళాశాల ఒక సాహిత్య వార్షిక సంచికను ప్రతి ఏడాదీ క్రమం తప్పకుండా ప్రచురిస్తున్నది. అధ్యాపకులు, విద్యార్థులూ, సృజనాత్మక రచనలతోపాటు, విలువైన పరిశోధనా వ్యాసాలను 'నెలవంక'లో ప్రచురిస్తున్నారు.

ఏ విద్యాసంస్థ వికాసానికయినా ఉత్తమ నాయకత్వం అవసరం. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్యకళాశాల స్థాపించిన నాటి నుండి తుది శ్వాస విడిచే వరకు డా. దేవులపల్లి రామానుజరావుగారు కళాశాలను తమ బహిః ప్రాణంగా భావించారు. కళాశాలాభివృద్ధికి నిరంతరం శ్రమించారు.

రామానుజరావుగారి అనంతరం ఆంధ్ర సారస్వత పరిషత్తు బాధ్యతలతోపాటు కళాశాల పాలకవర్గ అధ్యక్ష బాధ్యతలను కూడా జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డిగారు స్వీకరించారు. వారి ఆధ్యక్షంలో కళాశాల సర్వతోముఖంగా వికసిస్తూ ఉంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారు కళాశాల కరెస్పాండెంటు బాధ్యతలను స్వీకరించి మార్గదర్శనం చేస్తున్నారు. వారి సమర్థ నేతృత్వంలో కళాశాల పురోగమిస్తూ ఉంది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తెలుగు పండిత శిక్షణ కళాశాల

ఆంధ్ర సాహితీ సంస్కృతుల పరిరక్షణకై అరవై సంవత్సరాల క్రిందట ఆవిర్భవించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు పలు దశలలో ప్రతిబంధకాలనెన్నింటినో ఛేదించి, ఆశయాలను సాధించి దశదిశల తన పేరు ప్రఖ్యాతులను చాటుకుంటూ భాగ్యనగర భాగ్యంగా సాహితీపరుల సౌభాగ్యంగా నగరం నడిబొడ్డున నేడు నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు జాతీయ భావాలచే ప్రేరితమై, భిన్న సాహిత్య సిద్ధాంతాలలోని మంచిని గ్రహించి, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించేందుకు కృషి చేస్తున్న సాహిత్య సంస్థ. ఈ సంస్థ చేపట్టిన పలు కార్యక్రమాలలో ఒక భాగం తెలుగు పండిత శిక్షణ కళాశాల.

తెలుగు పండిత శిక్షణ కళాశాల 22 అక్టోబరు, 1964 సం॥లో ప్రారంభించబడింది. నాటి నుండి పదహారు బ్యాచులలో తెలుగు పండిత శిక్షణ అభ్యర్థులు కోర్సులు పూర్తి చేసినారు. ఈ శిక్షణ కోర్సులో చేరడానికి అభ్యర్థుల కనీస విద్యార్హత బి.ఏ., తెలుగు; ఏం.ఏ., తెలుగు; భాషా ప్రవీణ, విద్వాన్; బి.ఓ.ఎల్., బి.ఏ. (ఎల్), విశారదతో డిప్.ఓ.ఎల్ లేదా పి.డి.సిగా ఉండేది.

కాని ఇటీవల నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిటిఇ), బెంగుళూరు, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యా కమీషనర్ మరియు సంచాలకుల వారి ఆదేశాల కనుగుణంగా శిక్షణ పొందే అభ్యర్థులు తప్పనిసరిగా పట్టభద్రులై ఉండాలని, తెలుగు తప్పనిసరిగా ఒక ఐచ్ఛిక విషయంగా అధ్యయనం చేసి ఉండాలనే నిబంధన ఏర్పడింది. వారి ఆదేశాలకనుగుణంగా యాభై మంది అభ్యర్థులతో 31.12.2002 నాడు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి గారిచే శిక్షణా కోర్సు ప్రారంభించబడింది.

ఈ శిక్షణ తరగతులకు ఎం.ఏ., ఎం.ఇడి., అర్హత కలిగినవారు బోధించవలెననెడి ప్రభుత్వ నిబంధనల కనుగుణంగా క్రింది అధ్యాపక వర్గాన్ని ఎంపిక చేయడం జరిగింది.

1.	ఆచార్య టి. శ్రీధర్‌రావు, M.A., M.Ed.,	ప్రధానాచార్యులు
2.	శ్రీ కె. శ్రీనివాసాచారి, M.A., M.Ed.,	ఉపన్యాసకులు
3.	శ్రీ టి.శేషగిరిరావు, M.A., M.Ed.,	ఉపన్యాసకులు
4.	శ్రీ పి. భాస్కరశర్మ, M.A., M.Ed.,	ఉపన్యాసకులు

ఇతర బోధనా సిబ్బంది

1.	శ్రీ ఎస్.సి. రత్నాకర్, B.A.	ఫిజికల్ డైరెక్టర్ (పార్ట్ టైం)
2.	శ్రీ టి. ప్రేమ్ కుమార్	అధ్యాపకులు-పని అనుభవం (పార్ట్ టైం)

అధ్యాపకేతర సిబ్బంది

1. శ్రీ బి. గోపాల్ రెడ్డి, B.Sc. గుమస్తా
2. శ్రీ దేవత సుధాకర్, M.Com. గుమస్తా కం టైపిస్టు

ఈ శిక్షణా కోర్సును 20 జూలై, 2003 వరకు 200 పని దినములతో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని పనిదినాలు, ఆదివారాలు, పండుగ రోజులలో కూడా తరగతులు నిర్వహించబడ్డాయి.

ఈ కోర్సులో ప్రధానాంశాలు.

1. విద్యాతాత్త్విక, సామాజిక ఆధారాలు - ప్రస్తుత విద్యాంశాలు
2. విద్యా మనో విజ్ఞాన శాస్త్రం
3. పాఠశాల నిర్వహణ, మూల్యాంకనం
4. తెలుగు బోధనా పద్ధతులు
5. వ్యాయామ విద్య
6. దృశ్య శ్రవణ విద్యాబోధన
7. పని అనుభవం - సాంఘికోపయోగ ఉత్పాదనలు
8. కంప్యూటర్ విద్య-పరిచయం

ఈ బ్యాచ్‌లోని యాభై మంది అభ్యర్థులలో నలభై తొమ్మిది మంది ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ గారిచే, సెప్టెంబర్ 2003లో నిర్వహించబడిన పరీక్షలకు హాజరై ముప్పై ఏడుగురు ప్రథమశ్రేణిలోను, పన్నెండు మంది ద్వితీయ శ్రేణిలోను కృతార్థులయినారు. ఒక అభ్యర్థి కోర్సు మధ్యలోనే విరమించుకున్నారు.

ప్రస్తుత సంవత్సరంలో శిక్షణ పొందగోరే అభ్యర్థులను ఎంపిక చేయడానికి ప్రభుత్వం జూలై, 2003 సంవత్సరంలో లాంగ్వేజ్ పండిట్స్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షను (ఎల్.పి.సెట్) నిర్వహించినది. వీరు ప్రభుత్వం నిర్వహించే కౌన్సిలింగు ద్వారా కళాశాలల్లో ప్రవేశాలు పొందుతారు. 2004 సం॥ ఆరంభంలో ఈ ప్రక్రియ పూర్తి కానున్నది. ఈ కళాశాలలో ప్రవేశం పొందే అభ్యర్థులు ఉత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దబడగలరని ఆశిస్తున్నాం.

ఆంధ్ర సారస్వత పరిషత్తు

వజ్రోత్సవాల సదస్సు - నివేదిక

- ఆచార్య ఎస్వీ రామారావు

తెలుగు మాగాణంలో కొనసాగిన సంస్కృతీ సాహిత్యాల వికాసంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన పాత్ర గణనీయమైనది. నిజాం నిరంకుశపాలనను ప్రతిఘటించి ఇంటింటా అక్షరజ్యోతిని వెలిగించి మాతృభాషా చైతన్యాన్ని ఉద్దీప్తం చేసిన సంస్థ పరిషత్తు. ఆరు దశాబ్దాల క్రితం 1943 మే 26న హైదరాబాదులో ఆవిర్భవించిన సారస్వత పరిషత్తు 1973లో రజతోత్సవాలను, 1994 జనవరిలో స్వర్ణోత్సవాలను ఘనంగా జరుపుకొని 2003లో వజ్రోత్సవాలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

2003 డిసెంబర్ 27వ తేదీ సాయంత్రం 6-45 గం.లకు ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆవరణలో వజ్రోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ నారా చంద్రబాబునాయుడుగారు ఈ ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సారస్వత పరిషత్తుకు కొండంత అండగా నిలిచి సారథ్యం వహిస్తున్న అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డిగారు సభకు అధ్యక్షత వహించి విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ కవి, గాయకులు డా॥ సుందర రామకృష్ణ స్వాగతపద్యాలతో సభ ప్రారంభమైంది. పరిషత్తు కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి పరిషత్తు కార్యక్రమ నివేదికను సమర్పించారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలపై సమభావంతో పరిషత్తు నిర్వహించిన సదస్సుల గురించి, ఆవిష్కరణ సభల గురించి వివరించారు. వజ్రోత్సవాల ఆహ్వానసంఘం అధ్యక్షులు, దేవదాయశాఖ కమీషనర్ శ్రీ కె.వి.రమణ గారు స్వాగత వచనాలు పలుకుతూ తెలంగాణలో అక్షరాస్యత వ్యాప్తికి పరిషత్తు చేసిన కృషిని వెల్లడించారు.

పద్మభూషణ్ ఆచార్య సి.నారాయణరెడ్డిగారు తమ అధ్యక్షోపన్యాసంలో ప్రతికూలమైన వాతావరణంలో తెలుగు సంస్కృతిని కాపాడుతూ తెలుగు వాణిని ప్రబలంగా వినిపించిన ఘనమైన చరిత్ర పరిషత్తుకు ఉందని ఉగ్గడిస్తూ, పరిషత్తు వికాసానికి దోహదం చేసిన మహనీయులను స్మరించారు. ఇంతకాలానికి స్వంత స్థలాన్ని సమకూర్చుకొని విస్తృత పరిధిలో సేవ చేయటానికి సహకరించిన ముఖ్యమంత్రికీ, ఆర్థికసాయాన్ని అందించిన రెడ్డి ల్యాబ్స్ ఛైర్మన్ డా॥ కె. అంజిరెడ్డిగారికీ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యఅతిథి శ్రీ చంద్రబాబు నాయుడుగారు జ్యోతి ప్రకాశనంతో వజ్రోత్సవాలను ప్రారంభించి, వజ్రోత్సవ సంచికను ఆవిష్కరించారు. తమ సహజవాగ్ధోరణితో సందేశాన్ని అందించి సభాసదస్సును అలరించారు. భవిష్యత్తులో భారతదేశం అగ్రగామిగా రూపొందగలదని, ఈ అభివృద్ధి కృషిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగణ్యంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ సభలో పరిషత్తు నిర్వహణలో బాధ్యతను వహించి విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యక్షులు, సుప్రసిద్ధ విద్వాంసులు చారిత్రక పరిశోధకులు శ్రీ గడియారం రామకృష్ణశర్మగారిని ఐదువేల రూపాయల నగదులో సన్మానించడం ముదావహం. తమకు జరిగిన సన్మానానికి స్పందిస్తూ రామకృష్ణశర్మగారు తెలుగు సారస్వత వికాసానికి పాటుపడిన పరిషత్తు స్థాపక సభ్యులను, చిరకాలం ఈ సంస్థకు సేవచేసిన కీ.శే. దేవులపల్లి రామానుజరావు మున్నగు వారి కృషిని కొనియాడారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ సంస్కృతాంధ్ర పరిశోధకులు ఆచార్య బి. రామరాజు

గారు పరిషత్తుతో తమకు గల చిరకాల అనుబంధాన్ని వివరిస్తూ నిరాదరణకు గురి అవుతున్న తెలుగుభాషను పరిరక్షించుకోవటానికి పరిషత్తు ఉద్యమరూపంలో కృషి చేయాలని పిలుపు నిచ్చారు. సారస్వత పరిషత్తు కోశాధ్యక్షులు మంత్రి రామారావుగారి వందన సమర్పణతో వజ్రోత్సవ ప్రారంభసభ ముగిసింది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవాల సందర్భంగా 2003 డిసెంబర్ 28వ తేది ఆదివారం నాడు భాషపై, సాహిత్యంపై రెండు ప్రత్యేక సదస్సులు అధికార భాషా సంఘం అధ్యక్షులు డా॥ పరుచూరి గోపాలకృష్ణగారు అధ్యక్షత వహించగా, అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షులు ఆచార్య పి. యశోదారెడ్డి ప్రారంభకులుగా పాల్గొన్నారు. గోపాలకృష్ణగారు మాతృభాష తల్లి చనుబాల వంటిదనీ, పరభాషలు డబ్బాపాలవంటివనీ, మాతృభాష వ్యక్తికి సహజమైన కళ్లుకాగా, పరాయిభాష కళ్లకు ధరించే అద్దాల వంటిదనీ హాస్యవ్యంగ్యోక్తులతో ప్రసంగించారు. ఆంగ్ల పదాలు దొర్లకుండా తెలుగును మాట్లాడే ప్రయత్నం చేయాలని, విద్యుత్తు-నీటిబిల్లులు, బస్సు-రైలు టికెట్లు, పాసుబుక్కులు మొ॥నవి. తెలుగులో ఉన్నప్పుడే భాషాభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. ఆచార్య పి. యశోదారెడ్డిగారు మాండలికాలతో కూడివున్నదే సిసలైన భాష అనీ, నేటి వ్యవహార భాషలోసామెతలు, జాతీయాలు లోపించి కృతకంగా తయారవుతున్నదని సోదాహరణ ప్రసంగం చేశారు. ఉపాధికల్పనకు అధికార భాషా సంఘం జి.వో.లు అవకాశాలు కల్పించాలని, ప్రకార్యభాషకు (functional language) విద్యారంగంలో ప్రాధాన్యం యివ్వాలని ఉగ్గడించారు.

భాషా సదస్సులో ముగ్గురు వక్తలు పత్ర సమర్పణ చేశారు. ముందుగా జి. వెంకటరామారావుగారు 'నిజాం సర్కారు హయాంలో తెలుగుభాషా స్థితిగతులు' గురించి విశదీకరించారు. 1880లో ఉర్దూను అధికార భాషగా ప్రకటించిన నిజాం ప్రభుత్వం 1918లో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్థాపించి ఉర్దూ మాధ్యమంగా విద్యాబోధనను ఎంతో సమర్థనీయంగా కొనసాగించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలుగుభాషా పరిస్థితి దయనీయంగా ఉన్న తరుణంలో బూర్గుల రామకృష్ణరావు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు ప్రభృతులు మాతృభాషలో విద్యాబోధనకు ఎంతో కృషి సల్పారని పేర్కొన్నారు. "బోధన పరిపాలనరంగాల్లో తెలుగు" పరిస్థితిని వివరించిన శ్రీ సి. ధర్మారావుగారు ప్రాథమిక విద్యాస్థాయిలో తెలుగుభాష ఎంతో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురి అవుతున్నదని విచారాన్ని వెలిబుచ్చారు. తెలుగు మీడియం పాఠశాలలు నిమ్నకులాల విద్యార్థులకు మాత్రమే పరిమితమైనాయన్న సత్యాన్ని వెల్లడిస్తూ బోధనాభాషగా తెలుగు భాషా స్థితి తగ్గిపోతున్న కొద్దీ ఆ భాష వినిమయంలో లేకుండా అంతరించి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిపాలనరంగంలో తెలుగు సాఫ్ట్‌వేర్ (కంప్యూటర్లు)ను ప్రవేశపెట్ట వలసిన అవసరాన్ని చాటిచెప్పారు. డా. డి. చంద్రశేఖరరెడ్డిగారు తమ పత్రంలో "భారతీయ భాషల్లో తెలుగు భాషా విలక్షణత" ను పేర్కొన్నారు. 2001 నాటి జనాభా గణనను బట్టి భారతీయ భాషల్లో తెలుగుభాషది ప్రథమ స్థానమని వచిస్తూ, ఉత్తరాది భాషలపై ద్రావిడ భాషా వ్యాకరణ ప్రభావం ఉందన్నారు. సంగీత గుణం (లయ), అక్షరాల్లో అందం, ఉచ్చారణలో మాధుర్యం మొదలైనవి తెలుగుభాషకు ప్రత్యేక లక్షణాలని, అవి ఇతర భాషల్లో అరుదుగా గోచరిస్తాయని పేర్కొన్నారు. నన్నయతో ప్రారంభమైన కావ్యధార, ప్రక్రియావైవిధ్యం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయని ఉగ్గడించారు. ఈ సదస్సుకు పరిషత్తు సహాయ కార్యదర్శి డా॥ మసన చెన్నప్ప సమావేశకర్తగా వ్యవహరించారు.

మధ్యాహ్నం జరిగిన సాహిత్య సదస్సుకు ఆచార్య ఎం. కులశేఖరరావుగారు అధ్యక్షులుగా, ఆచార్య ఎన్. గోపి గారు ప్రారంభకులుగా విచ్చేశారు. కులశేఖరరావుగారు భాషా, సాహిత్యరంగాలలో సారస్వత పరిషత్తు కావించిన

కృషిని వివరిస్తూ పరిషత్తు ప్రచురణలను, పండితుల ఉపన్యాసాలను ప్రస్తావించారు. పరిషత్తు కేవలం సభా ప్రాంగణంకాదని, విస్తృతమైన సాంస్కృతిక చరిత్రకు వేదిక అని డా॥ ఎన్.గోపి పేర్కొన్నారు. ప్రపంచీకరణం అన్నది మాతృభాషకు వ్యతిరేకం కాకూడదని, మాతృభాషా చైతన్యానికి యువతరం ఉద్యమించాలని ప్రబోధించారు. ఈ సదస్సులో కూడా ముగ్గురు వక్తలు పత్ర సమర్పణ చేశారు.

ముందుగా డా॥ పోరంకి దక్షిణామూర్తి గారు "మాడపాటి, సురవరం కథల" వైశిష్ట్యాన్ని సభ్యులకు పరిచయం చేశారు. మానసిక ప్రవృత్తిని చిత్రిస్తూ స్త్రీల పరాక్రమాన్ని చాటే మాడపాటి కథలను విశ్లేషించారు. నిజాం కాలం నాటి గ్రామీణ వ్యవస్థ, పోలీసు జులుంకు దర్పణం పట్టే సురవరం ప్రతాపరెడ్డి కథలను సమీక్షించారు. సమాజ చిత్రణతోపాటు హాస్య ప్రియత్వం, మాండలిక పలుకుబడులు ఆయన కథల్లో గోచరిస్తాయని పేర్కొన్నారు. తర్వాత డా॥ మలయశ్రీ గారు "మాండలిక భాషల్లో కవితా రచన" గురించి వివరిస్తూ ఇతర కవితారూపాల కంటే జానపద గేయాల్లో మాండలికాలు విరివిగా గోచరిస్తాయన్నారు. అయితే గాయకుల పొరపాట్ల వల్ల మాండలికాల్లో అపశబ్దాలు చోటు చేసుకున్నాయని సోదాహరణంగా పేర్కొన్నారు. "జానపద సాహిత్యంలో ప్రగతిశీల దృక్పథం" అన్న అంశంపై డా॥ రావి ప్రేమలత ప్రసంగించారు. స్త్రీని శక్తి స్వరూపిణిగా ప్రదర్శించే గ్రామదేవతల కథలు పౌరాణిక కథల కంటే ప్రాచీనమైనవని ఆమె వివరించారు. కులమత భేదాలు, వరకట్నాలు, ఆత్మహత్యలు మొదలైన సామాజిక రుగ్మతలకు జానపద సాహిత్యంలో తావు లేదని వచించారు. ఈ సాహిత్య సదస్సుకు పరిషత్తు పరీక్షా కార్యదర్శి డా॥ ఎన్.ఆర్. వెంకటేశం సమావేశకర్తగా వ్యవహరించారు.

వజ్రోత్సవాల ముగింపు సభ 28వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గం.కు దేవులపల్లి రామానుజరావు కళామందిరం హాలులో జరిగింది. రాష్ట్ర హోంశాఖామంత్రి గౌ॥ శ్రీ టి. దేవేందర్ గౌడ్ గారు ముగింపు సభకు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డిగారు సభాధ్యక్షత వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు, ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య రవ్వా శ్రీహరి గారు, గౌరవ అతిథులుగా విచ్చేసి పరిషత్తు కార్యక్రమాల వైశిష్ట్యాన్ని, సంస్థతో తమకు గల సాన్నిహిత్యాన్ని విశదీకరించారు. పరిషత్తు కార్యవర్గ సభ్యులు ఆచార్య ఎస్వీ రామారావు వజ్రోత్సవ సదస్సులను సమీక్షించారు. పరిషత్తు కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభకు స్వాగతం పలుకగా డా॥ సురవరం పుష్పలత వందన సమర్పణ చేశారు.

కైమోడ్పు

డా. మల్లెమాల

అఖిల భారతమందు - ఆంధ్ర సారస్వత
  పరిషత్తునకు గొప్ప చరితగలదు!
అన్ని భాషలకన్న - ఆంధ్ర సారస్వత
  పరిషత్తునకు గొప్పబాణిగలదు!
ఆణిముత్యముకన్న - ఆంధ్ర సారస్వత
  పరిషత్తునకు గొప్ప మెరుపు గలదు!
ఐరావతముకన్న ఆంధ్ర సారస్వత
  పరిషత్తునకు గొప్ప బలము గలదు!
పరమదుర్మార్గమగు నిజాంపాలనమున
బక్కచిక్కిన తెలుగిప్డు పిక్క బలిసి
భాగ్యనగరాన జయజయధ్వానములను
సల్పుటకు హేతువీ పరిషత్తు సుమ్మ!!

అరువది యేండ్లు పైబడిన, అంటదు వార్ధకమించుకేని, తా
పరువపు లేడి కూనవలె పర్వులు దీయుచు దేశమంతటన్
నిరుపమ ఖ్యాతినందుటకనేక మహాత్ముల దీక్షమూలమీ
తరుణమునందు వారి ఘనతన్ కొనియాడుచు కేలు మోడ్చెదన్!!

తెలుగు వాఙ్మయమునకు రెక్కలను దొడిగి,
శ్రేష్ఠతములైన కవుల ఆశీస్సులలది,
గగన వీధుల విహరింప నెగురవేసి
అమరమై వెల్గుచున్నదీ ఆవరణము!!

ఉన్నాతాశయములె ఉచ్ఛ్వాస నిశ్వాస
ములుగ నాడు పురుడు బోసుకొనిన
సంస్థ నేడు ఆంధ్ర సారస్వత చరిత్ర
కద్దమట్లు నిలిచి అలరు చుండె!!

వేసటెరుగక తుదిశ్వాస విడుచు వరకు
జీవితమ్మును పరిషత్తు సేవకొరకు
అంకితము జేసినట్టి మహామనీషి
మాన్య దేవులపల్లి రామానుజునకు
అమిత రుణపడి యున్నది ఆంధ్రజాతి!!

మాతృభాషా మహాదేవి మందిరం

శ్రమజలమ్ములు వోసి నిస్వార్థ పరులు
పెంచిన రసాలమిది శుకపిక నివాస
మాంధ్ర సారస్వత పరిషదాలయమ్ము
మాతృభాషా మహాదేవి మందిరమ్ము

- శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్యులు

పరిషత్తుకు పలుకునివాళి

డా. వేముగంటి నరసింహాచార్యులు

కII నారాయణమై, శివమై
సౌరభ్యాంచిత లతాంత సౌభాగ్యదమై
సారస్వత పరిషత్కుసు
మారామము పచ్చపచ్చనై శోభిల్లున్

సీII అన్యభాషాధాటి కడలుచు కొడిగట్టు
తెలుగుదివ్వెకు నూత్నదీప్తి గూర్చి,
ఆంధ్రభాషా జ్ఞాన మలవరించుటకునై
నియతిన్ పరీక్షలు నిర్వహించి,
ఆర్థిక స్థితిలేమి నదవదపడుచున్న
పేదల కుద్యోగ భిక్ష వెట్టి,
అలజడిపడుచున్న ఆంధ్రసారస్వత
పుంబూలపందిరి ప్రోదిచేసి

గీII భాగ్య దాయక హైదరాబాదునగర
మణికిరీటమై భాసిల్లి మలయుచున్న
ఆంధ్ర సారస్వత పరిషదమృత సంస్థ
దినదినాభ్యుదయముగ వర్ధిల్లుచుండె

కII పొత్త ముత్తైదువ మేల్
పొత్తములను క్రొత్తక్రొత్తపుత్తడినగలన్
హత్తించి అలరు మన పరి
షత్తున కభినందనముల చందన చర్చల్

సీII పావన గుణవల్లి దేవులపల్లిరా
మానుజాహ్వాయకళామందిరమ్ము
పండిత శిక్షణప్రాచ్యభాషా కళా
శాలా విరాజిత సౌధరాజి
సతతత సాహిత్య ప్రసంగవాణీపద
మంజీర శింజాన రంజనమ్ము
ప్రథితమహాకవీంద్ర సినారె మధుర
వచస్సుధారసవర్ణసౌమనసము

గీII కలిగి విలసిల్లి విఖ్యాతి గాంచినట్టి
ఆంధ్ర సారస్వతపరిషదమృతసంస్థ
భవ్యరీతి వజ్రోత్సవ వైభవమ్ము
జరుపుకొనుచుండె సహృదయసంస్తవముగ

కII తిరమై, భాషా కరమై,
సరస్వతీ దివ్యభవ్య చరణాంకితబం
ధురమై శ్రీ సారస్వత
పరిషత్తునకిత్తు కైతపలుకు నివాళిన్

భాషా సంస్కృతుల సరిత్తు

డా. జె. బాపురెడ్డి

ఆంధ్ర సారస్వత పరిషత్తు
వజ్రోత్సవం
ఆబాల గోపాలానికి ఆనందోత్సవం
తెలుగు సారస్వత మందిరంలో
నవ చైతన్య నాద సరస్వతి ఆరాధనోత్సవం
అరవై వసంతాలు అలరించిన
భాషా సంస్కృతుల వైభవోత్సవం.
సత్య సాహిత్య నారాయణులు
నిత్య నూతన సృజన శివానందంతో
నిర్వహిస్తున్న విద్యా విజ్ఞాన
బ్రహ్మోత్సవం-

కొమర్రాజు లక్ష్మణరావు
ఆదిరాజు వీరభద్రరావు
వెల్దుర్తి మాణిక్యరావు
మాడపాటి హనుమంతరావు
సురవరం ప్రతాపరెడ్డి
బూర్గుల రంగనాధరావు
బూర్గుల రామకృష్ణారావు
గడియారం రామకృష్ణశర్మ
దేవులపల్లి రామానుజరావు
బిరుదురాజు రామరాజు
దాశరథి కృష్ణమాచార్యులు
వంటి ఎందరో మహనీయులు, భగీరథులు
ఎండిపోతున్న తెలంగాణ మాగాణాలకు
దేశభక్తి శిఖరాలనుంచి దింపిన
నవజీవనాక్షర సరిత్తు- ఆంధ్ర సారస్వత పరిషత్తు

విశ్వవిఖ్యాత తత్వవేత్త
రాధాకృష్ణ పండితుడు
తుంగభద్ర తరంగోత్తుంగ గళంతో
అలంపురంలో ఆశీర్వదించిన చిరంజీవి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

పల్లె పల్లెలో తెలుగు పలుకుల
తోటలు నాటిన భాషాకృషీవలత్వం
ఆంధ్ర సారస్వత పరిషత్తు జవసత్వం
మాయాచీకట్లలో చిక్కుకున్న అమాయికులకు
విజ్ఞాన గ్రంథగంధాలను పంచిపెట్టిన
సేవాభావమరుత్తు-ఆంధ్ర సారస్వత పరిషత్తు!

పామరులను పండితులను చేస్తున్న
'ప్రాచ్య కళాశాలను' స్థాపించి
పండితులను ప్రతిభావంతులుగా దిద్దుతున్న
'శిక్షణా కళాశాల' ను నిర్వహించి
నేర్పు పరీక్షల్లో నెగ్గిన వారికి
ఉద్యోగ పర్వ 'ప్రవేశం' కలిగిస్తున్న
'విశారద' మన సారస్వత పరిషత్తు.

ఇప్పుడు ఇది
సనాతన తెలుగు సంస్కృతికి
అధునాతన కాంతి దుర్గం
ప్రాచీన అర్వాచీన భాషాసాహిత్యాలకు
సమీచీన ప్రగతి మార్గం.
"జ్ఞాన పీఠం" పై 'పద్మ భూషణా'చార్యుడై
మహాకవి నారాయణరెడ్డి
పరిషత్తు కన్న కలలకూ
ఆశలకూ, ఆశయాలకూ
వాస్తవరూపం కల్పిస్తున్న విజయోత్సవం-
ఈ వజ్రోత్సవం
సినారె ఎత్తి పట్టిన
అక్షర దీక్షా నక్షత్ర ఛత్రం క్రింద
చదువుల రాణికి - సంస్కృతి వాణికి
ఆవిష్కృతమౌతున్న
అమృతోజ్వల భవిష్యత్తు
ఆంధ్ర సారస్వత పరిషత్తు!

శ్రీతిరుపతి వేంకట కవుల జీవితం, రచనలు - అవధానాలు

- శ్రీ రాపాక ఏకాంబరాచార్యులు

"కవనార్థంబుదయించితిన్ సుకవితా కార్యంబె నావృత్తి యీ
భువ మద్దాన (దరింతు (దద్భవమె మద్భాగ్యంబు సర్వంబు మృ
త్యువు నేదాన జయించితిన్ రుజ జయింతున్ దాని చేపట్టి నా
కవనమ్మే భవదీయ తేజమని వక్కాణింతు విశ్వాత్మకా"

జగదాశ్చర్య కరావధాన కవితా సంపన్నులైన శ్రీ తిరుపతి వేంకటకవులు కారణ జన్ములు. కవనార్థంబు దయించిన సుకవులు, విద్వత్కవులు. వారి జననానికి పూర్వము అంధకారబంధురమై యున్న తెలుగు సాహిత్యాన్ని ఉద్ధరించటానికి జన్మించిన అవతార పురుషులు. అవధానముల ద్వారా, ఆశుకవితల ద్వారా ఇరవయ్యవ శతాబ్దంలో "అవధానయుగం" సృష్టించిన నవయుగ కవితా వైతాళికులు. వారి జన్మానికించుక పూర్వము రాజా స్థానాలలో కవి,పండితుల మధ్య నర్తించే కవితా కన్యను అవధానాశుకవితల ద్వారా ప్రజామధ్య మమునకు తీసుకొని వచ్చి ప్రజలలో కవితపై మక్కువ కలిగించిన వారు కవితా ప్రజాస్వామ్య వ్యవస్థాపకులుగా కీర్తి గడించారు. వేయేళ్ళసాహిత్య చరిత్రలో అవధాన కవిత్వం ద్వారా ప్రభువులను, ప్రజలను సమముగా అలరించిన కవి ప్రభువులు వారు. శతావధాన కవితా సామ్రాజ్య పట్టాభిషిక్తులు. ఆనాడు వారి ఆవధాన ప్రదర్శనలు తిలకించి నిరక్షరాస్యుడు అక్షరాస్యు డయ్యాడు. అక్షరాస్యుడు కవితలల్లడం ప్రారంభించినాడు. కవియైనవాడు అవధానాలు, ఆశుకవితలు చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఆనాడు వారి కవితా వెల్లువ పండితులను, పామరులను సమానంగా ముంచెత్తింది.

వారి అవధాన కవితా ప్రభావానికి తట్టుకోలేక వందలకొద్దీ విద్యావంతులు వారికి శిష్యులయ్యారు. ఆనా డాంధ్రదేశంలో ఎక్కడ చూచినా వారికి శిష్యులు, ప్రశిష్యులే, ఏకలవ్య శిష్యులే. విశ్వనాథ వారన్నట్లు "చెళ్ళపిళ్ళ వేంకన గురువంచుచెప్పుకొనగా నది గొప్ప తెలుంగునాడునన్" తిరుతి వేంకటకవులు అవధాన మరందధారలో కడుగని వారు ఆనాడు ఆంధ్ర దేశంలో లేరంటే అది అతిశయోక్తి కాదు. తెలుగు దేశంలో తిరుపతి వేంకటకవులు పర్యటించి అవధానాలు చేసిన తావులలో ఆనాడుఎక్కడ చూచినా కవులే, శతావధానులే, ఆశు కవులే, ప్రబంధ కర్తలే కనిపించేవారు. వారి కవితా ప్రభావమంతటిది. ఆనాడు ఆంధ్రదేశంలో ఖ్యాతి గాంచిన విద్వత్కవులు పండితులు వారి శిష్యులే. వేలూరి, వేటూరి, అవ్వారి, ఓలేటి, పింగళి, కాటూరి, విశ్వనాథ, దీపాల, మాధవపెద్ది,నెమలూరి మొదలైన వందల కొద్దీ వారి శిష్యగణంలో ఉన్నారు.

జంటగా కవిత్వం చెప్పడం, ఇద్దరు కలిసి గ్రంథ రచన చెయ్యడం అనే కృత్యాలకువారానాడాంధ్రదేశంలో ఒరవడి పెట్టారు. అవధానాలలో వారు "ఒకచరణం బతండు, మఱియొక్కొటి నేను మఱొక్కటాతడున్" అను నియమంతో జంటగా కవిత్వం చెప్పారు. విస్తృతమైన పరిధిలో యావదాంధ్ర దేశంలో జంట కవిత్వం చెప్పిన కవకవులజంట మరొక్కటి లేదు. అంతేకాకుండా "ఒక్కరు రచియించి రేనియును కాదగు తిర్పతి వేంకటీయమై" అను నియమముతో చివరి వరకు శతాధిక గ్రంథాలను వెలయించారు. వారి జంట నామం కూడా పాలునీరు కలిపిన రీతిలో "తిరుపతి వేంకట కవులు" అనునది చక్కగా కలిసింది. ఇతర జంట కవుల పేరులు వీరి జంటనామంవలె కలవలేదు. అది దైవ సంకల్పమని చెప్పాలి.

తిరుపతి వేంకటకవులు శతాధికగ్రంథకర్తలు. వైవిధ్యం గల సాహిత్య సృష్టి చేశారు. తెలుగులోను, సంస్కృతంలోను, వారు గ్రంథాలు రచించారు. అందులో

ప్రబంధాలు ఉన్నాయి, వచన రచనలున్నాయి, నాటకాలున్నాయి, అనువాద గ్రంథాలు, స్తోత్రాలున్నాయి, శతకాలున్నాయి, ప్రహసనాలున్నాయి, లఘు కావ్యాలున్నాయి, వివాద గ్రంథాలున్నాయి, కథలు - గాథలున్నాయి. ప్రబంధాలలో శ్రవణానందము వారికి గొప్ప పేరు తెచ్చిపెట్టింది. ఈ శృంగార రస కావ్యంలో ఒక్కొక్క పద్యం ఒక్కొక్క రసగుళిక. బుద్ధ చరిత్రము, శ్రీనివాస విలాసము, ఏలా మాహాత్మ్యము, పాణి గృహీత మొదలైన ప్రబంధాలు వారికి మంచిపేరుతెచ్చిపెట్టాయి. దేవీ భాగవతం వారి ప్రసిద్ధపురాణ గ్రంథాలలో ఒకటి.

2500 పుటలున్న 300 వ్యాసాలు - మూడు సంపుటాలుగా కథలు -గాథలు రూపొందాయి. ఇందు ఆసక్తికరమైన ఎన్నో కథలు, గాథలు, పద్యాలు, శ్లోకాలు నిక్షిప్తమైయున్నాయి. పాఠకుడు వీనిని ఆసక్తితో ఒక నవల చదువుతున్నట్లు పఠిస్తాడు. ఇది చదివిన పాఠకుడు ఒక కవిగానో, పండితుడుగానో రూపొందుతానడంలో అతిశయోక్తి లేదు.

పద్యాలలో స్వీయ చరిత్ర వ్రాసిన మొదటి కవి శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు. "జాతక చర్య" ఇటీవలి చర్య అను నామములతోనున్న ఈస్వీయ చరిత్రలో జంటకవులు జన్మించినది మొదలు - వారు పరమ పదించే వరకు అనేక జీవిత సంఘటనలు వారు హృదయం గమంగా పద్యాలలో వివరించారు. పద్యాలలో స్వీయచరిత్ర వ్రాయడానికి వీరే ఆద్యులు. తరువాత జాషువ "నా కథ" అన్న పేరుతో స్వీయ చరిత్ర వ్రాసు కొన్నారు.

ఆనాడు తిరుపతి వేంకటకవులకు - వేంకట రామకృష్ణ కవులకు, కొప్పరపు సోదరకవులకు, గురువులైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారలతో జరిగిన వాగ్యుద్ధాలు- తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వతమైన స్థానమేర్పరచు కొన్నాయి. తిరుపతి వేంకటకవులు ఆయా సందర్భాలలో వ్రాసిన వివాద గ్రంథాలు -"గీరతము", " గుంటూరు సీమ", "జయంతి" అనేవి ప్రసిద్ధినందాయి.

గిడుగు వేంకట రామమూర్తిపంతులు గారు వ్యావహారిక భాషా వాదాన్ని ప్రచారం చెయ్యడానికి మూడు దశాబ్దాలకు ముందే వేంకటశాస్త్రిగారు "పల్లెటూళ్ళ పట్టుదలలు" అను పేరుతో వ్యావహారిక భాషలో గ్రంథం వెలయించారు. తరువాత వారి "కాశీయాత్ర", "కథలు - గాథలు" అనుగ్రంథాలు కూడా వ్యావహారికభాషలో వెలసిన గ్రంథాలే.

వేంకటశాస్త్రిగారు ప్రసిద్ధ సభలలో రాగయుక్తంగా పద్యాలు చదువుతూ ఉంటే సభాసదులపై సమ్మోహనాస్త్రం వేసినట్లు వారు చెవులప్పగించి వినేవారు. వారి పద్యపఠనం శృతి పేశలంగా ఉండేది. ఆనాడు చాలా మంది కవులు ఆ బాణీలో పద్యాలు చదివే వారు.

వారి వచన రచనలు కాని, పద్యాలు కాని అలతి అలతి పదాలతో నుండి ప్రసాద గుణ భూయిష్టమై రసోపేతమై అలరారేవి. ద్రాక్ష కదళీఫలపాక మాధుర్యంతో ఒప్పారేవి.

భారత నాటకాలు - అందునా "పాండవోద్యోగ విజయాలు"అనే నాటకాలు పండిత పామర జనాలను ఆనాడే కాదు, ఈనాడు కూడా రంజింప చేస్తున్నాయి. గ్రామాలలో కూడా పల్లెజనం పొలాలలో కూనిరాగాలతో ఈనాటికీ వారి పద్యాలు చదువుతూనే వున్నారు.

అద్యతనాంధ్ర కవిప్రపంచ నిర్మాతలైన తిరుపతి వేంకటకవుల జీవితము రచనలు, వారి అవధాన నిర్వహణ విశేషాలు ఈ దిగువదిఙ్మాత్రంగా వివరింపబడ్డాయి.

శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రిగారి జననం, జన్మస్థలం, జననీ జనకులు :

శ్రీ దివాకర్ల తిరుపతి శాస్త్రి గారు 1872 మార్చి 26వ తేదీన పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం తాలూకాలోని ఎండగండి గ్రామంలో జన్మించారు. తల్లి శ్రీమతి శేషమ్మ, తండ్రి వేంకటావధానిగారు - గొప్ప వేద పండితులు, సూర్య దేవుని ఆరాధకులు.

విద్యాభ్యాసం :

తిరుపతి శాస్త్రిగారు బాల్యంలో ఎండగండిలోని బూర్ల సుబ్బారాయుడుగారి వీధిబడిలో ప్రాథమిక విద్య పూర్తి జేశారు. వారు తండ్రి గారి దగ్గర కాళిదాసు కావ్యాలైన రఘువంశము, కుమార సంభవము పఠించారు. పిమ్మట వారు తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమ ప్రాంతంలోని గంగలకుర్రు గ్రామంలో రెండు, మూడు సంవత్సరాలుండి గరిమెళ్ళ లింగయ్య అనే పండితుని దగ్గర భారవి కిరాతార్జునీయం, సంస్కృత భాషలోని కొన్ని భాణములను (లఘు రూపకాలు) అధ్యయనం చేశారు. పిమ్మట వారు ఎండగండి తిరిగివచ్చి ఆ గ్రామ సమీపంలోని పిప్పర గ్రామంలో పమ్మిపేరి శాస్త్రిగారి సన్నిధిలో మురారి అనర్ఘరాఘవం చదువుతూ మరొక ప్రక్క వేరే పండితునివద్ద న్యాయబోధిని అనే తర్క శాస్త్రమును పఠించారు. ఇంతలో కాశీ పండితులైన చర్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు షడ్దర్శనీవేది, గొప్ప వ్యాకరణ శాస్త్ర పండితులు తాడేపల్లి గూడెం సమాపంలో కడియెద్ద గ్రామం వచ్చి అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకొన్నారన్న సంగతి తిరుపతి శాస్త్రిగారి చెవిని పడింది. వెంటనే వారు కడియెద్ద ప్రయాణమయ్యారు. దారిలో పెంటపాడు గ్రామం చేరేసరికి అక్కడ నూజివీడు సంస్థానకవి, పండితులైన అభినవ పండితరాయ బిరుదాంకితులు, అవధాన విద్యా పితామహులైన విద్వాన్ మాడభూషి వేంకటాచార్యుల వారు అవధానం చేస్తున్నారని తెలిసి ఆ సభకు తిరుపతి శాస్త్రి గారు వెళ్ళారు. అక్కడ చర్ల బ్రహ్మయ్య శాస్త్రిగారి దర్శనమయ్యింది. బ్రహ్మయ్య శాస్త్రి గారు తిరుపతి శాస్త్రిగారిని శిష్యునిగా స్వీకరించారు. కొన్ని మాసాల తరువాత చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు కడియెద్ద వెళ్ళి అక్కడ బ్రహ్మయ్య శాస్త్రిగారి వద్ద వ్యాకరణ శాస్త్రం అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. ఆ విధంగా బ్రహ్మయ్య శాస్త్రిగారి దగ్గర వారివురు ప్రప్రథమంగా కలవడం జరిగింది. వారివురి మధ్య "అడవి యుసిరికాయ యలసముద్రపు టుప్పు" గలియురీతి మైత్రి గలిగి వీరలచటఁజదువుచుండిరి....." (జాతక చర్య పూ. 170 పద్యము)

ఈ కలయిక సాహిత్య చరిత్రలో శుభోదర్కమైంది, కళ్యాణ ప్రదమైందని చెప్పాలి.

శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి జననం, జన్మస్థలం, జననీ జనకులు :

శ్రీ చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు 1870 ఆగష్టు 9వ తేదీన (ప్రమోదూత శ్రావణ శుద్ధ ద్వాదశీ సోమవారం) ఫ్రెంచి యానాంలో జన్మించారు. తల్లి శ్రీమతి చంద్రమ్మ, తండ్రి కామయ్యగారు. శాస్త్రిగారిది కవి కుటుంబం. వారి పినముత్తాత చెళ్ళపిళ్ళ నరస కవి ప్రఖ్యాత కవీశ్వరులు. వారు "వేంకటేశ్వర విలాసము" "యామినీ పూర్ణ తిలక విలాసము" అను ప్రసిద్ధ కావ్యాలను రచించారు. వారి దగ్గరనున్న పలు తాళపత్ర గ్రంథాలను వెంకటశాస్త్రి గారు గ్రహించి వాటిని వినియోగించుకొన్నారు.

విద్యాభ్యాసం :

వెంకటశాస్త్రిగారి అక్షరాభ్యాసం, చదువు రాజమండ్రి దగ్గరి కడియంలో ప్రారంభమయ్యింది. ఏడు సంవత్సరాల వయస్సులోవారుకడియంలోని తెలుగు బడిలో చేరి విద్యాభ్యాసం చేశారు. బాల రామాయణం చదివారు. తరువాత వారి తల్లి దండ్రులు కడియం నుండి ఫ్రెంచి యానాం మకాం మార్చారు. ఇక్కడ వారు కొంత కాలం ఫ్రెంచి స్కూలులోను, మరికొంత కాలం నీలపల్లిలోని లోకల్ ఫండ్ స్కూలులోను, తరువాత మరల యానాం వీధిబడిలోను విద్యాభ్యాసంచేశారు. ఈ కాలంలో వారు తెలుగు కొంత, ఇంగ్లీషు కొంత నేర్చు కున్నారు. తరువాత వారికి సంస్కృతం నేర్చుకోవాలనే ఆసక్తి కలిగింది. వారు సంస్కృతములో పంచ కావ్యాలు, వ్యాకరణం అనేక మంది గురువుల వద్ద నేర్చుకొన్నారు. ఆ విషయాన్నే వారు నానారాజ సందర్శనములో "ఒక్కొక్క చోట నొక్కొకని యొద్ద నొకొక్క మాట చొప్పునన్ జక్కఁగ సంగ్రహించితిమి చాతురి మీఱఁగఁ

జెప్పు ప్రజ్ఞ..." (నానారాజ సందర్శనము - పూర్వార్ధము - 79 పద్యం) అన్న పద్యంలో ద్యోతక మౌతుంది. వెంకటశాస్త్రిగారి సంస్కృత విద్యాభ్యాసం చాలవరకు "కా" తో ప్రారంభమయ్యే గ్రామాలలో జరిగింది. అవి కాపుల పాలెం, కాటవరం, కాజులూరు, కడియెద్ద మొదలైన గ్రామాలు. ప్రప్రథమంగా వారు కాపులపాలెం (యానాం సమీపగ్రామం)లో అపర బృహస్పతి యనదగిన కానుకుర్తి భుజంగరావు గారి దగ్గర రఘువంశంలో మూడు సర్గలు (2, 3, 5 సర్గలు) రెండు సంవత్సరాలు అధ్యయనం చేశారు. భుజంగరావు గారు మంచి పండితులే కాక ఆయుర్వేద వైద్యులు, వారు ఆయుర్వేదంలో కొన్నిమందులు కనిపెట్టారు. పిమ్మట వారు కాటవరంలో (రాజమండ్రి సమీపగ్రామం) శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి దగ్గర కుమార సంభవంలో రెండు సర్గలు పూర్తి చేసి మేఘసందేశం మొదలుపెట్టి కొంత పూర్తి అయ్యేనాటికి గురువుగారి భార్య మరణించడం, వెంకటశాస్త్రి గారికి జబ్బు చెయ్యడం కారణంగా వారు యానాం తిరిగి వచ్చారు. కాటవరంలో ఉన్నప్పుడు వారు కొంత చదరంగం ఆడడంలో తరిఫీదు పొందారు. యానాం వచ్చిన తరువాత వారు కీర్తనలు వ్రాయడం, వేంకటేశ్వర. స్వామిపై శతకం వ్రాయడం మొదలు పెట్టారు. తోటి స్నేహితులతో చదరంగం ఆడేవారు.

పిమ్మటవారు కాజులూరు అనే గ్రామంలో రేగిళ్ళ కామశాస్త్రులు , పప్పు సోమయ్య, పప్పు సోమనాథశాస్త్రి గారల దగ్గర సంస్కృత కావ్యాధ్యయనం కొనసాగించారు. ఇక్కడ మేఘసందేశంలో తరువాత భాగం (30నుండి 63వ శ్లోకం వరకు) పూర్తి చేశారు. పిమ్మట వారు కాశీ వెళ్ళాలనే సంకల్పం నెరవేరలేదు. సామర్లకోట వెళ్ళి (కాకినాడ సమీపంలోని గ్రామము) అక్కడ శ్రీమాన్ ప్రతివాది భయంకర రాఘవాచార్యులుగారి దగ్గర భారవి మూడు సర్గలు, లఘుకౌముదిలో పంచసంధులు పఠించారు. పిమ్మటవారు కోలంక గ్రామం సమీపంలోని పిల్లంక గ్రామంలో అనంతాచార్యులు గారి వద్ద లఘు కౌముది, మాఘకావ్యంలో సప్తమ సర్గ అధ్యయనం చేశారు. తరువాత పల్లెపాలెం గ్రామంలో (ఇంజరం సమీపగ్రామం) భారవి చతుర్థ, పంచమసర్గలు శ్రీ మధునాపంతుల సూరయ్య శాస్త్రి గారి వద్ద అధ్యయనం చేశారు. శిశుపాల వధ ప్రారంభించారు. ఇంతలో వెంకటశాస్త్రి గారికి కంటి జబ్బుఅధికమయ్యింది. వైద్యం కోసం పాలకొల్లు దగ్గర చింతపఱ్ఱు వెళుతూ శాస్త్రిగారు బ్రహ్మయ్య శాస్త్రి గారిని కలవడం, వ్యాధి నయమయిన తర్వాత వారు కడియెద్ద వెళ్ళి బ్రహ్మయ్య శాస్త్రి గారి దగ్గర వ్యాకరణం నేర్చుకోవడం మొదలపెట్టారు. అక్కడ ప్రప్రథమంగా తిరుపతి శాస్త్రిగారితో స్నేహం కలిసింది. వారక్కడ వ్యాకరణం నేర్చుకొంటున్న సమయంలో "స్పర్ధతా వర్ధదే విద్యా" అన్నట్లు వారు పోటా పోటీగా చదవడం, అప్పుడప్పుడు ఘాటుగా సాహిత్య చర్చలు సాగించడం జరిగేది.

ఇంతలో వెంకటశాస్త్రిగారికి కాశీ వెళ్ళి అక్కడ వ్యాకరణ శాస్త్రం అధ్యయనం చెయ్యాలని, కాశీ వెళ్ళి నాలుగు మాసాలు అక్కడ ఉండి తల్లి దండ్రుల పట్టు వల్ల వారు తిరిగి స్వరాష్ట్రానికి వచ్చి మరల బ్రహ్మయ్య శాస్త్రి గారి దగ్గర వ్యాకరణ శాస్త్రాధ్యయనాన్ని కొనసాగించారు. ఇంతలో బ్రహ్మయ్య శాస్త్రి గారు తమ మకాము ధవళేశ్వరము నకు మార్చడం, తిరుపతి శాస్త్రి, వెంకట శాస్త్రిగారలు ధవళేశ్వరం వెళ్ళడం అక్కడ కొంతకాలం వ్యాకరణంనేర్చుకొని అక్కడ నుండి కాకినాడ అవధానం చెయ్యడానికి ఉభయులు వెళ్ళడం అక్కడ ప్రప్రథమంగా అష్టావధానం దురిశేటి శేషగిరిరావుగారి ప్రోత్సాహంతో చెయ్యడం జరిగింది.

వెంకట శాస్త్రిగారి తొలి అవధానాలు :

వెంకట శాస్త్రిగారు కడియెద్దలో బ్రహ్మయ్య శాస్త్రి గారి వద్ద వ్యాకరణం అధ్యయనం చేస్తూ, కాశీ వెళ్ళి అక్కడ వ్యాకరణం నేర్చుకొంటే బాగుంటుందని భావించి ద్రవ్యార్జన కోసం వారు రెండు గ్రామాలలో రెండు

అష్టావధానాలు చేశారు. మొదటవారు ప॥గో॥జిల్లా గణవరం గ్రామం దగ్గరలోని నిడమర్రు, తరువాత గుండుగొలనులోనుఅష్టావధానాలు చేశారు. శాస్త్రిగారితో కలిసి కందుకూరి కృష్ణశాస్త్రి గారనే పండితుడు కూడా ఉన్నారు. ఈ అవధానాలు శాస్త్రీయంగా కాకపోయినా కాశీవెళ్ళడానికి ధనార్జనకు వినియోగపడ్డాయి. ఈ అవధానాలలో ఎనిమిది మంది పృచ్ఛకులకుబదులు ఒకే పృచ్ఛకునికి ఒక్కొక్క పద్యం చొప్పున ఎనిమిది పద్యాలు చెప్పడం తిరిగి వానిని ధారణ చేసి అప్పజెప్పడం జరిగింది. కూడా ఉన్న కృష్ణ శాస్త్రిగారితో శాస్త్రార్థం చేశారు. సంపాదించిన డబ్బుతో వారు కాశీవెళ్ళి అక్కడ శ్రీ నోరి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి వద్ద వ్యాకరణం కొంత పఠించారు. ఇంతలో తండ్రి గారి బలవంతంమీద, బ్రహ్మయ్య శాస్త్రి గారి లేఖల వల్ల తిరిగి కాశీ నుండి తిరిగివచ్చారు. తిరిగి వచ్చినతరువాత గంగా సంతర్పణం కోసం వెంకటశాస్త్రిగారు మరల ముమ్మిడివరం, ఐనాపురం, కేశన కుర్రుగ్రామాలలో అష్టావధానాలు, ఆశు కవితలు చెప్పి ధనం సంపాదించి పూజలు చేసి తిరిగి బ్రహ్మయ్య శాస్త్రి గారి దగ్గర వ్యాకరణం చదవడాన్ని ప్రారంభించారు. విద్యాభ్యాసానంతరం బ్రహ్మయ్య శాస్త్రి గారి ప్రోత్సాహంతో తిరుపతి శాస్త్రిగారు వెంకట శాస్త్రిగారితో కలసివెళ్ళి కాకినాడలో మొదట అష్టావధానం తరువాత శతావధానం చేశారు.

తి॥వేం॥ కవులు నిర్వహించిన అష్టావధాన, శతావధాన స్వరూప స్వభావాదులు :

క్రీ.శ. పదమూడవ శతాబ్దం కడపటి దశకంనుండి ఆంధ్ర దేశంలో శతలేఖినీ పద్య సంధాన ధౌరేయులున్నా, అష్ట ఘంటావధానులున్నా అష్ట, శతావధాన స్వరూప, స్వభావాదులు మొదట ఆంధ్ర దేశానికి ఎరుక పరచిన మహనీయులు విద్వాన్ మాడభూషి వేంకటాచార్యులు గారు. ఆచార్యుల వారు బహుభాషా కోవిదులు, ప్రబంధ రచయితలు,ఏక సంథాగ్రాహి, అష్ట భాషా వ్యస్తాక్షరీ చణులు, శబ్ద గ్రహణ పారీణులు. పద్యమును కాని శ్లోకమును కాని అనులోమ, ప్రతిలోమములుగా పఠించ గలిగిన నేర్పరి.

ఆచార్యుల వారు అనుసరించిన పద్ధతినే తిరుపతి వేంకట కవులుకూడ అవధానములు నిర్వహించారు. అష్టావధానమునకు వారు ఈ విధంగా లక్షణము లేర్పరచుకొన్నారు.

శ్లో॥ కావ్యోక్తిః కవితోక్తి రంచిత కళావిద్భి సహాభాషణం
పౌరాణోక్తిరమందలౌకిక గిరో వ్యస్తాక్షరోక్తి స్సమం
ధీమద్భిశ్చతురంగ ఖేలన మథోసంఖ్యేయ పుష్పాళయో
యస్మిం త్స్యాద్యుగ పత్త దేవ కృతినామష్టావధానాభిదం
(శతావధాన సారము, ఉపో.పు viii)

అని సంస్కృతంలోను -

పౌరాణోక్తి కవిత్వ పుష్పగణనా వ్యస్తాక్షరుల్ లౌక్యగం
భీరోక్త్యంచిత కావ్యపాఠన కలా విద్భాషణంబుల్ ముదం
బారంగా ౘతురంగ ఖేలనము నీ యష్ట ప్రచారంబు లొ
ప్పారున్ శంకర! యేక కాలమునసేయష్టావధానమ్మనన్.
(శతావధానసారము, ఉపో.పుట ix)

అని తెలుగులోను అష్టావధాన స్వరూపాన్ని వారు విశదపరచారు. దీని ప్రకారము తి॥వేం॥ కవుల అష్టావధానాలలో వరుసగా 1. ఆకాశపురాణము. 2. కవిత్వము 3. పుష్పగణనము 4. వ్యస్తాక్షరి 5. అప్రస్తుత ప్రశంస 6. కావ్యపాఠము 7. శాస్త్రార్థము 8. చతురంగము అను ఎనిమిది అంశాలుంటాయి.

శతావధానానికి లక్షణాలీవిధంగా ఏర్పరచుకొన్నారు:

శ్లో॥ తత్తన్నామనవ మానసాద్భుతతమం వృత్తం తథావస్తుచ
స్వీకృత్య ప్రథమం శతాయ సరయం తత్పాద
మేకం వదేత్
భూయః కైర్పచబోధితః క్రమవశాత్పాదత్రయం
కీర్తయే
దేతన్నామ శతావధాన మథచేత్పద్యాని సంకీర్తయేత్
(శతావధాన సారము, ఉపో. పు. viii)

పృచ్ఛకులు కోరిన వస్తువును, ఛందస్సును స్వీకరించి నూరుమంది పృచ్ఛకులకు ప్రథమ పాదము చెప్పి పిమ్మట ఇతరులెవ్వరును గుర్తు చేయకుండగనే గుర్తుంచుకొని క్రమంగా మిగతా మూడు పాదములు చెప్పి వానిని అప్పుజెప్పుటయే శతావధానమనబడును.

అవధానములు చేయుట అంత తేలిక కాదు. కవిత్వం చెప్పే ప్రతి వ్యక్తి అవధానం చెయ్యలేడు. అవధానికి కొన్ని ప్రత్యేక శక్తులుండాలి. అవధాన కార్యనిర్వహణానికి కవికి "ధ" కార చతుష్టయము కావలెనని ముద్దల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారీ క్రింది శ్లోకములో చెప్పి యున్నారు.

"కవిర్య ద్యవధానీ స్యాత్సం పాద్యం ధ చతుష్టయమ్
ధైర్యం ధారా ధోరణీచ ధారణేతి సునిశ్చయమ్
(సాహిత్య ప్రబోధము, పుట 141)

ఈ శ్లోకం ప్రకారం అవధాన కవికి తప్పక 1. ఆశు ధార 2. ధారణ 3. ధైర్యము 4. ధోరణి అను నాలుగు శక్తులు ప్రధానంగా ఉండాలి. ఇవి లేకుండా అవధాని అవధాన ప్రక్రియ నిర్వహించలేడు. అవధానికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసములేకాకుండా సమయస్ఫూర్తి, చమత్కార సంభాషణ, సభా రంజకత్వము, ప్రత్యర్థుల నెదుర్కొను ధైర్యము, ఆశుధార, ధారణ మున్నగు ప్రత్యేక శక్తులు లేకుండా అవధానము చేయుట కష్టసాధ్యము. ఈ పైన పేర్కొనబడిన శక్తులుపుష్కలంగా తిరుపతి వేంకట కవులలో ఉండడం వలన సభా రంజకంగా వందలలో అవధానాలు నిర్వహించారు. వారు వనపర్తి సంస్థానంలో అందరు శతావధానం చెయ్యలేరు. వందమందిలో ఒకరు చక్కని కవిత్వం చెప్పగలిగితే అటువంటి వేయిమంది సరసమైన కవిత్వం చెప్పే కవులలో ఒక శతావధాని ఉంటాడని ఈ తేటగీతిలో నుడివినారు.

"నూటికొక్కడు చక్కని ధాటిగల్గి
సరసకవనమ్ము చెప్పెడి చతురు డుండు
నట్టివారలతోనేయి కుదు రొకడు
శతవధానాదికమ్మును సల్పుజాణ"
(నానారాజ సందర్శనము - ఉత్తరార్థము - 181 ప.)

వెంకటశాస్త్రిగారు ఒక పర్యాయము - అష్ట, శతావధానములలో అష్టావధానమే కష్టమని చెప్పారు. దానినే 'అష్టావధాన కష్టావలంబనము..." అనుపద్య పాదంలో కూడా చెప్పియున్నారు. దీనికి కారణం అష్టావధానం విభిన్నమైన 8 అంశములుండడమే. వారి శిష్యులు వేలూరి శివరామశాస్త్రిగారు శతావధానము కష్టమని వాక్రుచ్చినారు.

తి॥వేం॥ కవుల అవధాన నిర్వహణం :

తిరుపతి వేంకటకవులు ప్రప్రథమంగా కాకినాడలో అష్టావధానం పిమ్మటవారు బాదం వెంకటరత్నంగారి ప్రోత్సాహంతో కాకినాడలోనే తొలి సంపూర్ణ శతావధానం (21.2.1892) విజయవంతంగా చేశారు. ఆ సందర్భంలో వందమందికే కాదు వేయిమందికయినా సంస్కృతాంధ్ర భాషలలో సహస్రావధానం చేయగలమని "నిలిచియె వేయిపద్యముల నేర్పలరంగను...."అను పద్యంలో చెప్పియున్నారు. ఈ విషయాన్నే వారు "ఒక నూటే యన నేమిలెక్క..... కడున్ వేగమె వేయిమంది కయినన్ " సహస్రావధానం చేయగలమని వారి సామర్థ్యాన్ని చెప్పియున్నారు. కాకినాడలో "కింకవీంద్ర ఘటా పంచానన"బిరుదును గైకొని నారు. వారు కాకినాడ నుండి అమలాపురం, ఏలూరు, బందరు, మద్రాసు, నెల్లూరు, పిఠాపురం, బెజవాడ, విజయనగరము, హైదరాబాదు, గుంటూరు మొదలైన పట్టాణాలలో "నహిప్రతి" అన్నట్లు అష్ట, శతావధాన సభలు నిర్వహించారు.

గుంటూరులో తి॥ వేం॥ కవులకు - కొప్పరపు సోదరకవులకు మధ్య నియోగి - వైదీకుల మధ్య తగాదాలు ఏర్పడ్డాయి. తి॥ వేం॥ కవులు నియోగులను ఎప్పుడు దూషించకపోయినా మధ్యవర్తులు పెట్టిన తగాదాల వలన వారి మధ్య వివాదాలు ఏర్పడ్డాయి.

తిరుపతి శాస్త్రిగారు నియోగి. ప్రభువైన శ్రీ కొచ్చెర్లకోట వేంకట రామచంద్ర కృష్ణారావు - పోలవరం జమీందారు గారి దగ్గర ఆస్థాన కవులు. పింగళి కాటూరి కవులు. (నియోగులు) తిరుపతి వేంకట కవుల శిష్యులు. ఉభయజంట కవుల మధ్య ఏర్పడిన వివాదాల వల్ల గుంటూరులో సభలు ఏర్పరచారు. ఆ సభకు తి॥ వేం॥ కవులు వచ్చారుకాని కొప్పరపు కవులు రాలేదు.వేలూరి శివరామశాస్త్రిగారాసందర్భంలో నిరాక్షేపంగా, విజయ వంతంగా శతావధానం చేశారు. గురువులను వారించి శిష్యుడే - కొప్పరపు కవులకు సవాలుగా చేసిన అవధానం ఇది. ఆ సందర్భంలో శివరామ శాస్త్రిగారిని ఆశీర్వదిస్తూ తిరుపతి శాస్త్రిగారీ పద్యం చెప్పారు :

"జగతీ నాథులు పెక్కుమంది ముదిత స్వాతంబులం గాన్కలం
పఁగ సాంగంబు సలక్షణమ్ముగ శరద్వా వింశతిం బేర్మి హె
చ్చగ మాయేలిన యీవధాన కవితా సామ్రాజ్యభారంబు మో
యగఁబూనం గదవయ్య తండ్రి! శివరామయ్యా! చిరంజీవివై

(గుంటూరు కాలేజీ శతావధానము, పుట 27)

కొప్పరపు సోదర కవుల ఆశుకవితా ప్రాంతమైన వేమవరం అగ్రహారంలో తిరుపతి వేంకట శతావధాన సభ మహావైభవముగా జరిగినది. ఆ సభారంజకానికి ఒక ముఖ్య కారణము తిరుపతి వేంకట కవుల ముఖ్య శిష్యులలో ఒకరైన శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారి అత్యాశు కవితా ప్రదర్శనం నిర్వహించడం. తిరుపతి శాస్త్రిగారు అవ్వారివారిని ఆశీర్వదిస్తూ చెప్పిన పద్యం :

"ప్రకట తరాశు ధారను సభాసదులందఱు మెచ్చుచుండ నా
యకమణి సంతసింపఁగ నయారె! రచించిన వాఁడవీవు వా
రక యరవింద సుందర మరంద ఝరంబు స్రవించుండు నీ
సుకవిత గాచుకోఁగదవె సుబ్బన శాస్త్రి జగద్ధితంబుగన్"

(శతావధానసారము, పుటలు 136, 137)

నానారాజసందర్శనము:

తిరుపతి వేంకటకవులు పలురాజాస్థానాలు దర్శించి సంస్థాన ప్రభువుల ఎదుట ఆశువుగా పద్యాలు చెప్పి అవధానాలు చేసి వారిని రంజింప చేశారు. వారి సాహితీ జైత్రయాత్రలు ఆధునిక సాహిత్య చరిత్రలో వన్నె కెక్కాయి. పూర్వాంధ్ర కవులలో ఇటువంటి సాహిత్య విజయయాత్రలు నిర్వహించినవారు శ్రీనాథ మహాకవి మరియు జగన్నాథ పండితరాయలు. తిరుపతి వేంకట కవులు - గద్వాల, వనపర్తి, ఆత్మకూరు, వెంకటగిరి, విజయనగరము, విశాఖపట్టణము, మొగల్తూరు, కిర్లం పూడి, నూజివీడు, బొబ్బిలి, చల్లపల్లి మొదలైన సంస్థానా లలో ఘనంగా సన్మానింపబడ్డారు. మొదటవారు ఆయా యాస్థానాలలోని కవి పండితుల సవాళ్ళను ఎదుర్కొన్నా తుదకు వారు విజయం సాధించి ఘనంగా సన్మానింప బడ్డారు. రాజాస్థానాలు దర్శించినప్పుడు ఆయా సందర్భాలలో తిరుపతి వేంకటకవులను పరీక్షించ డానికి ఆస్థానకవులు, పండితులు వేసిన ప్రశ్నలకు, సమస్యలకు జంట కవులు సరసమైన ప్రత్యుత్తరాలిచ్చారు. ఆయా సందర్భాలలో వారు చెప్పిన పద్యాలు ఈ నాటికీ సాహితీ రససింధువుల రసనాగ్రాలపై తాండవిస్తున్నాయి. వారి ప్రతిభా విశేషాలు, అవధానాశు కవితా వైభవం గురించి గద్వాల సంస్థానంలో ఈవిధంగా వాక్రుచ్చారు.

సీ॥ "శతఘంట కవనమ్ము సల్పు సంగతి యన్నఁ
గరతలామలకమ్ము గాదెమాకు
అష్టావధాన కష్టావలంబనమన్న
"నంబి కొండయ దండనంబు" మాకు
ఆశుధారా కవిత్వాడంబర. బన్న
"నల్లేరు పై బండినడక"మాకు
సత్కావ్య నిర్మాణ చాకచక్యంబన్న
షడ్రసోపేత భోజనముమాకు

తే॥గీ॥ వ్యర్థమగు వాదములొనర్చు నట్టివారి
డంబమణఁగించు టాపోశనంబుమాకు
దానరాధేయ! కవి సముదాయగేయ
పండితవిధేయరామభూపాలరాయ

(నానా రా. సం, పూర్వార్థము, 50)

(కరతలామలకము = చేతిలో ఉన్న ఉసిరికాయ, నంబి కొండయ = గుడిలో నున్న పూజారి)

సంస్కృతాంధ్ర భాషలలో వారి కవితా మాధుర్యాన్ని ఈ విధంగా తెలిపారు :

సీ॥ "ముద్దుముద్దుగఁజెప్పఁబూనితిమా, వన్నె
లాఁడి తీయని మోవి లంచమిచ్చుఁ
గఠినమ్ముగా ఁజెప్పఁగడఁగితిమా, ప్రౌఢ
కాంత వక్షోజముల్ కాన్కలొసఁగుఁ
దీక్షరీతిఁజెప్ప ఁదెరకొంటెమా, వాలుఁ
గంటి లేఁజూపు సుంకమ్మొసంగు
మిశ్రరీతినిఁజెప్ప మే కొంటిమా, బోటి
బిగువు కౌఁగిలి పన్ను ఁబెట్టితీఱు

తే॥గీ॥ నాశుధారా కవిత్వమ్మునందు కొంటి
మేనియభిసారికయు దండమిచ్చి తీఱు
నాంధ్ర గీర్వాణ భాషలయందు మాకు
దళిత పండిత లోపగద్వాల భూప.

(నానా.రా.సం,పూ- 51)

తి॥వేం॥ కవులు విజయనగరంలో ఆనందగజపతి మహారాజును దర్శించి వారు చెప్పిన పద్యాలు రస రమ్యములై శోభిల్లుతున్నాయి. అందలి ఒక పద్యం :

"స్థైర్యము లేని చిత్త, మవధాన మెఱుంగని సత్కవిత్వ, మౌ
దార్యము లేని హస్తము, యథార్థతలేని రసజ్ఞ, మంచిమా
ధుర్యము లేని గానము, మృదుత్వము లేని వచఃప్రసంగ, మై
శ్వర్యములేని భోగము, నసారము లియ్యవి దంతి భూవరా!

(నానా రా.సం. పూ - 89)

ఆత్మకూరు సంస్థానం దర్శించినప్పుడు అక్కడి కవి, పండితులు తి॥వేం॥కవులు పండితులు కాదన్నపుడు మీసములపై సరసమైన పద్యం ఈ విధంగా చెప్పారు :

"దోసమటంచెఱింగియును దుందుడుకొప్పఁగఁ బెంచినార మీ
మీసము రెండు భాషలకు మేమె కవీంద్రుల మంచుఁదెల్పఁగా
రోసము గల్గినన్ గవివరుల్ మము గెల్వుఁడు, గెల్తురేని యీ
మీసము దీసి మీపద సమీపములన్ దలవంచి మ్రొక్కమే"

(నానా రా. సం. పూ- 179)

విశాఖ పట్టణంలో గోడే గజపతిరావుగారి సందర్శనం కోసం వెళ్ళి అర్జీ పెట్టుకొనగా జమీందారు గారు దర్శనమీయకుండానే ఒక పళ్ళెంలో పది రూపాయలు పెట్టి పంపగా వారు ఆ ద్రవ్యాన్ని తిరస్కరించి ఒక పద్యం ఈ విధంగా వ్రాసి పంపారు.

"సంగరశక్తి లేదు, వ్యవసాయము సేయుట సున్న, సంతలో
నంగడి వేసి యమ్ముటది యంతకు మున్నె హుళక్కి, ముష్టికిన్
బొంగు బుజాన వైచుకొని పోయెద మెక్కడి కేని, ముష్టి చెం
బుంగొని పెట్టు మొక్కటి యమోఘ మిదేకద! దంతిరాణ్నృపా"

(నానా రా. సం. పూ- 46)

తి॥ వేం॥ కవులు - తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడి చిన్నారాయప్రభువును దర్శించారు. వారు జంటకవులను బాగా సన్మానించేవారు. వారిని చూడగానే జంటకవులు చెప్పిన పద్యం :

"శ్రీనాప్పారెడి నీదు వర్ణనకు నై చేయూప శబ్దార్థముల్
"నేనే వచ్చెద నేనె వచ్చెదను నేనే వత్తు నేవత్తు నే
నేనేనే" యని వచ్చి మీ ఁదఁబడు మేమెద్దాని ఁగైకొందు మె
ద్దానిన్ వీడుదుమో చిన్న నృపతీ! దానప్రధానాకృతీ"

(నానా.రా. సం. పూ-208)

ఇందు జంటకవులు శబ్ద చమత్కారముతోపాటు లౌక్యాన్ని ప్రదర్శించారు. చిన్నారాయప్రభువు సాహితీ ప్రియులే కాక, ఇటువంటి మహాకవులను సంతృప్తి పొందే విధంగా సన్మాన, సత్కారాలు గావించుట వారికి పరిపాటి. అందువల్లనే తిరుపతి వేంకటకవులట్టి సరసమైన పద్యం చెప్పారు.

ఆంధ్ర దేశంలో ఆనాడు తి॥ వేం॥ కవుల అవధానాలను తిలకించని ఆంధ్రుడు లేడంటే అది అతిశయోక్తి కాదు. ఆ భావాన్నే వారీపద్యంలో ఎరుక పరచారు.

"మాడకు మాడయెత్తుగల మాటలు నేరిచి సత్కవిత్వమే
మీడుగ జోడు(గా (జెవుల కింపుగ(జెప్ప(గ నేర్చినాము మా
చూడని వారు లేరు మము(జూడని వారును లేరుగాన మా
పోడిమి బుచ్చి తమ్మయ విభూ! కన(గా వలె(జిన్న రా(ట్ప్రభూ!

(నానా. రా. సం. పూ- 218)

విశ్వనాథవారు వెంకట శాస్త్రిగారినుద్దేశించి ఒక పర్యాయము "వానలో దడియని వారు మద్గురు వధాన మృదూక్తి మరందధారలో (గడుగని వారు మాకెచట(గన (గరారిల(దెల్గు నా(డునన్" అని అనడంలో కూడా వారి ప్రచారాన్ని తెలియజేస్తుంది.

ఆత్మకూరు సంస్థానంలో ప్రత్యర్థులనెదుర్కొని వారికి ప్రత్యుత్తరముల నొసగి రాజావారికి శ్రీనివాస విలాస ప్రబంధమును అంకితం చేసిన సందర్భంలో వారికి రాజావారు గజారోహణోత్సవం గావించారు. ఆ సందర్భంలో జంట కవులు చెప్పిన పద్యం చరిత్ర ప్రసిద్ధమైనది.

"ఏనుగునెక్కి నాము ధరణీం(ద్రులు (మొక్క(గ నిక్కినాము స
న్మానములందినాము బహుమానములన్ (గహించి నారమె
వ్వానిని లెక్కపెట్టకనివారణ దిగ్విజయంబొనర్చి ప్ర
జ్ఞానిధులంచు(బేరుగొని నారము నీవలనన్ సరస్వతీ !

(నానా. రా. సం. పూ- 247)

ఈపద్యంలో సరస్వతీ అనగా శారదాదేవి అని అర్థం పైకి కనిపిస్తున్నా తి॥ వేం॥ కవులను ఆనాడు ప్రముఖంగా ఎదుర్కొన్న బాల సరస్వతీ బిరుదాంకితులైన శ్రీనివాసా చార్యులుగారే అని తెలుస్తుంది.

ఆత్మకూరు సంస్థానంలోనే ప్రత్యర్థులు గావించిన విమర్శలకు ప్రతిగా వెంకటశాస్త్రిగారి పద్యంలో దీటైన సమాధానమిచ్చారు.

"అభినవరామలింగ బిరుదాంకు(డ నాకవనమ్మునందు నీ
యభణవు(గాండ్లు తప్పు లిడ నర్హు లె?" "కా"దని తప్పుదిద్ద మా
యభయులలోన నొక్క(డు మఱొక్కని కిందగు(గాక యుర్విచే
నభము శుభమ్మునుం దెలియ కార్చెడి దేబెలు మాకు లెక్కయే?

(నానా.రా.సం. పూ-161)

జడపై చాటు పద్యాలు :

గద్వాల సంస్థానం తి॥ వేం॥ కవులు దర్శించినపుడు రాజావారు వారిని పరీక్షింపదలచి స్త్రీవెనుక భాగంలో ఉన్న జడపై పద్యం చెప్పవలసిందిగా కోరినప్పుడు వారు చెప్పిన పద్యం.

సీ॥ పురుషాయిత మొనర్చు పూ(బో(డి కటిమీద
నాట్యమ్ము సల్పు పుణ్యమ్ముకొఱకొ
ఘననితంబ స్థలంబును పెన్నిధానంబు
బహు భద్రముగను గాపాడుకొఱకొ
తానాశ్రయించు కాంతకు వెన్కభాగమ్ము
ననుగూడ సౌందర్యమునుపుకొఱకొ
పదిమంది దృష్టులు పడిన (గంటకమంచు
నూయించి కనపడకుండు కొఱకొ
తే॥గీ॥ వేణి కాంతల వెన్నంటి వ్రేలు చుండె
లేకయుండిన నిధువన లీల కుపచ
రించు నంగమ్ము వెదుటనే సంచునించ
దాని కట్లుండ నేయుపద్రవము వచ్చె?

(నానా.రా.సం.పూ-103)

(పురుషాయితము = ఉపరతి, నితంబము = పిరుదు, మొల, నిధువనము = కలయిక)

ఈ పద్యం చెప్పిన తరువాత రాజావారు స్త్రీకి ముందు భాగంలో వున్న అంగములకు ఏ ఉపద్రవములు వస్తాయి. అన్నప్పుడు మరల జంట కవులీ పద్యం చెప్పారు.

"ఎదుటన్ వర్తిలు నట్టి యంగములకెంతేని న్న ఖాదిక్షతా
పద పల్మాఱును గల్గు సంగతిని (దా(బ్రత్యక్షమున్ జూచి నె
మ్మదిలో భీతిలి చాటు చోటనుచు సంభావించి వెన్నంటుచున్
బొదలం బోలును వేణి లేకునికి (దాముందుండ కట్లుండునే?

(నానా.రా.సం. పూ-104)

(నఖము = గోరు, క్షతము = గాయమునొందినది, పొదలు = పెరుగు)

రాజావారీ రెండు పద్యాలతో సంతృప్తి పడి జంట కవులకు ఘనమైన సన్మానం చేశారు.

తిరుపతి వేంకటకవులు అద్భుతమైన చాటువులు చెప్పారు. అందొకటి.

"ఒకయేగానికిఁ జిన్ని కుఱ్ఱనికి నాయుష్కర్మ చేయించి దా
నికినై కాని యొసంగి, "తక్కుసగమున్‌దె "మ్మన్న నాచేత లే
దకటా!" నాగను ! క్షౌరపుం గృతికి ఁదానంగీ కృతింజొన్పు లౌ
భ్యకులాయమ్మగు ముద్దరాలి చరితం బాలించితే!తిర్పతీ!

(నానా.రా.సం.ఉత్త.ప-202)

ఆయుష్కర్మ = క్షౌరము, లౌభ్యము= లోభత్వము, పిసినిగొట్టుతనము, కులాయమ్ము =చోటు, ముద్దరాలు = ముగ్ధస్త్రీ.

ఆత్మకూరు సంస్థానికి తి॥వేం॥కవులు బండిలో వెళుతూ దారిలో వెంకట శాస్త్రిగారు తిరుపతి శాస్త్రిగారితో చెప్పిన పద్యం. ఓ తిరుపతి శాస్త్రి మనము వెళ్ళే సంస్థానం లోని రాజా వారెట్లున్నారో తెలుసా! ఒక ముగ్ధస్త్రీ తన చిన్న పిల్లవానికి క్షౌరం చేయించడానికి మంగలికి ఏగానికి కుదిర్చి కాణీ యిచ్చి మిగతా సగము ఇమ్మని కోరితే నా దగ్గర ఏగాణి లేదంటే మిగతా ఏగాణీకి నాకు క్షౌరం చేయమన్నట్లున్న రాజావారి దగ్గరకు వెళుతున్నాము. అని ఈ పద్యం చెప్పారు అంటే ఆనాటి ఆత్మకూరు ప్రభువులోభి అనీ, అతడు మనకు డబ్బు ఎక్కువ ఇవ్వడనే ధ్వనితో వెం॥శా॥గారు చెప్పిన పద్యం.

తిరుపతిశాస్త్రిగారు పోలవరం జమీందారు ఆస్థాన ప్రవేశం:

రెడ్డి పోలవరం సంస్థానాధీశ్వరులైన శ్రీ కొచ్చెర్ల కోట వేంకట రామచంద్రకృష్ణారావుగారు మంచి సాహితీ ప్రియులు. తి॥వేం॥ కవుల ప్రతిభను వారి అవధానములు, ఆశు కవితలు,గ్రంథ రచనల వివరాలు తెలిసికొని "బుద్ధ చరిత్రము" అను ప్రబంధాన్ని వ్రాసి వారికి అంకితమివ్వ వలసినదిగా కోరినప్పుడు తి॥వేం॥కవులా ప్రబంధాన్ని రచించి 1900 సం॥లో వారికి అంకితం చేశారు. దానిపై జంట కవులను తమ ఆస్థానంలో కుదురుకోమని ఆహ్వానించారు.

వెంకటశాస్త్రిగారు ఏ నరనాథుని ఆస్థానకవిగా ఉండడానికి ఇష్టపడలేదు. అందువల్ల తిరుపతి శాస్త్రిగారిని పోలవరం జమీందారుని ఆస్థానకవిగా ఉండుమని ప్రోత్సహించగా తిరుపతి శాస్త్రిగారు 1901లో కాకినాడలో పోలవరం జమీందారు ఆస్థానకవిగా ప్రవేశించి 1918 వరకు పోలవరం జమీందారుగారి ఆస్థానకవిగా ఉన్నారు. జమీందారుగారు 1918లో మరణించగా తిరుపతి శాస్త్రిగారు - కోలంక- వీరవాసరం జమీందారిణి గారైనశ్రీమతి రావురామాయమ్మగారి ఆస్థానకవిగా ఉంటూ 1920లో కాకినాడలో పరమపదించారు. మధుమేహంతో వారుబాధపడుతూ తనువు చాలించే ముందు మాటరాక కుమారుని పిలిచి కాగితంపై మూడు పద్యాలు సూర్యనారాయణ స్వామిని ప్రార్థిస్తూ వ్రాశారు. అందులో ఒకపద్యం.

"దయయే మూలను డాఁగెనో? భవదుదాత్తంబైన మంత్రం బన
మయదం బేమయి పోయెనో? యమల నామప్రాభవం బెందులో
వ్యయమై పోయెనో? దేవ! భక్తునకు సంప్రాప్తించునే ? మేహనా
ర్మయ మాయామయ, మెంతమోసమిది యౌరా! సూర్య
నారాయణా!

(దివాకరాస్తమయము, పుట 2)

"సరస్వతి" పత్రిక (1889 -1912) నిర్వహణం :

1889లో ప్రారంభింపబడిన "సరస్వతి" పత్రిక తిరుపతి శాస్త్రిగారు 1901 నుండి నిర్వహించడం మొదలుపెట్టారు. వారీ పత్రికలో ముద్రించడానికి సంస్కృతంలో ఉన్న నాటకాలను - బాలరామాయణము, ముద్రారాక్షసము, మృచ్ఛకటికము తెలుగులోనికి అనువదించి సరస్వతి పత్రికలో ప్రకటించారు. అంతేకాక వారు స్వంతంగా వ్రాసిన "పాండవ విజయము" "ఎడ్వర్డ్ పట్టాభిషేకము నాటకము" "సువర్ణపాత్రికము"ల ను కూడా వారు ప్రకటించారు. మరియు వచన కావ్యాలుగా

బిల్హణుని "విక్రమాంక దేవ చరిత్రము", వీరనంది యొక్క "చంద్ర ప్రభచరిత్రము", బాణుని "హర్ష చరిత్రము"ను తెనిగించారు. సువర్ణపాత్రికము, హర్ష చరిత్రము, వ్యసన విజయము, ఇవి అసంపూర్ణముగానే మిగిలి ఉన్నాయి. తిరుపతి శాస్త్రిగారు "గజానన విజయము" అనే నాటకాన్ని కూడా వ్రాశారు. ఆర్యమత బోధినిలో ప్రకటించడానికి తిరుపతి శాస్త్రిగారు అప్పయ్య దీక్షితులవారి "వైరాగ్యశతకా"న్ని కూడా అనువదించారు.

ప్రఖ్యాత తెలుగు భాషా పోషకులైన శ్రీ చెలికాని లచ్చారావుగారు చిత్రాడలో (పిఠాపురం దగ్గర) "ఆంధ్ర భాషా విలాసిని" అనుపత్రిక నిర్వహించారు. దానిలో ప్రకటించడానికి తి॥శా॥గారు పింగళి సూరన్న - ప్రభావతీ ప్రద్యుమ్న కావ్యాన్ని నాటక రూపంలో వ్రాయడం మొదలు పెట్టారు కాని అది అసంపూర్ణంగానే మిగిలిపోయింది. తరువాత దానిని వెంకటశాస్త్రిగారి పూర్తి చేశారు. రవీంద్ర నాథ్ టాగోర్ చిన్న కథలు కొన్ని తెలుగులోనికి తిరుపతి శాస్త్రిగారి పేరుతోనే అనువదించారు. ఈ అసంపూర్ణ రచనలు పూర్తిజేయకుండానే తిరుపతి శాస్త్రిగారు 1920లో మరణించారు.

చె॥వెం॥శా॥గారు బందరు హిందూ హైస్కూలులో అధ్యాపకత్వం నిర్వహించడం :

వెంకట శాస్త్రిగారు 1903నుండి 1916 వరకు 13 సంవత్సరాల కాలం వారు బందరు హిందు హైస్కూలులో తెలుగు పండిత పదవి నిర్వహించారు. ఈ కాలంలో శ్రీయుతులు వేటూరి ప్రభాకరశాస్త్రి పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, విశ్వనాథ సత్య నారాయణ, సర్వా వెంకట శేషయ్య మొదలైన శిష్యులు వందల సంఖ్యలో వెంకటశాస్త్రి శిష్యులుగా ఖ్యాతి నార్జించారు. వెంకట శాస్త్రిగారి శిష్యులలో మొదటి తరం వారుశ్రీయుతులు వేలూరి శివ రామశాస్త్రి అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి ఓలేటి వెంకటరామశాస్త్రి నెమలూరి వెంకటశాస్త్రి మొదలైన వారున్నారు.

"... సత్కవి చెళ్ళపిళ్ళ వేంకట గురువంచుచెప్పి కొనగా గొప్ప తెలుంగునాడునన్" అని విశ్వనాథవారు రామాయణ కల్పవృక్షంలో వ్రాయడం ప్రత్యక్షర సత్యం. వెంకట శాస్త్రిగారి దగ్గర శిష్యరికం చేసినట్లు ముద్ర వేయించుకోడానికి పలువురు యువకులు ఉబలాట పడేవారు.

ఈ కాలంలోనే తి॥వేం॥ కవుల గ్రంథాలు చాల వరకు బందరు భైరవ ప్రెస్‌లో ముద్రింపబడ్డాయి. వెంకటశాస్త్రిగారు, వేలూరి శివరామశాస్త్రిగారు తెల్లవారు ఝామున లేచి భైరవ ప్రెస్ అరుగుమీద కూర్చొని సాహిత్యచర్చలు, పద్య పఠనం,జంటగా పద్యాలు చెప్పడం జరిగింది.

తి॥వేం॥ కవులకు - వేంకట రామకృష్ణకవులకు - కొప్పరపు సోదరకవులమధ్య వివాదములు :

వెంకటశాస్త్రిగారు బందరులో ఉద్యోగిస్తున్న కాలంలో వేంకటరామకృష్ణ కవులతోను, కొప్పరపు సోదర కవులతోను, తిరుపతి వేంకట కవులకు వివాదాలు ఏర్పడ్డాయి. వేంకటరామకృష్ణ కవులు, తూ.గో.జిల్లా పిఠాపురం సంస్థానంలో ఆస్థాన కవులు. వారిలో ఒలేటి వెంకట రామశాస్త్రిగారు కొన్ని మాసాలు వెంకట శాస్త్రిగారి దగ్గర ఇంజరంలో చదువు కొన్నారు. వేంకట రామకృష్ణ కవులు పిఠాపురం సంస్థానంలో ప్రవేశించిన కాలంలో గురువులను గురించి చెప్పినప్పుడు ప్రధాన గురువులైన చర్ల నారాయణశాస్త్రిగారిని పేర్కొని, వెంకటశాస్త్రిగారిని చెప్పకపోవడం, తంపుల మారులైన కొందరు ఇంజరంలో జరిగిన వివాహసందర్భంలో భోజనాల సమయంలో తిరుపతి వేంకటకవులకు వేంకట రామకృష్ణకవులు ఈశ్వర వేఱుల వంటి వారు అని విమర్శించడంలో తి॥వేం॥కవులకు - వేంకటరామకృష్ణ కవులకుమధ్య వివాదాలు ఏర్పడ్డాయి. (నాగుపాముకు ఈశ్వర వేరును చూపితే అది నిలిచి పోతుంది) వేంకట రామ కృష్ణకవులు ప్రథమంగా తిరుపతి వేంకటకవుల భారత నాటకాలలోని "పాండవాశ్వమేధము"

అనే నాటకాన్ని విమర్శించి అందు నూరు తప్పులను చూపుతూ 'శతఘ్ని' అనువిమర్శ గ్రంథాన్ని ప్రకటించారు. శతఘ్ని అంటే ఫిరంగి అని ఒక అర్థం, రెండవ అర్థం నూరు దోషాలున్న గ్రంథం అని వారి భావన. దానిపై తిరుపతి వేంకట కవులు అవేమీ తప్పులు కావు, ఒప్పులే అని "పాశుపతము" అను పేరుతో వారు గ్రంథాన్ని వెలువరించారు. దానిపై మరల వేంకట రామకృష్ణ కవులు -"పరాస్త పాశుపతము" అను విమర్శ గ్రంథాన్ని వెలువరించగా - తి॥వేం॥ కవులు -"పునశ్చరణము" అనే గ్రంథం వ్రాసి పరాస్త పాశుతాన్ని ఖండించారు. వేంకట రామకృష్ణ కవుల శిష్యులైన శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు"పాణి గ్రహీత -శ్రవణానంద శృంఖల" అను విమర్శ గ్రంథాన్ని ప్రకటించగా దానిపై తి॥వేం॥కవులు "శృంఖలా తృణీకరణము" అను గ్రంథాన్ని వెలువరించారు. వేంకటరామకృష్ణ కవులు "అట్టహాసము" అను విమర్శ గ్రంథం వ్రాయగా దానిని ఖండిస్తూ వేలూరి శివరామ శాస్త్రిగారు "తాలు కుట్టనము" అను గ్రంథాన్ని వెలువరించారు. ఇంతేకాక వేంకటరామ కృష్ణ కవులు "కవిత" అనే వార పత్రికలో "కోకిల కాకము" అనే, వేంకటేశ్వరార్థ శతకము"అను విమర్శ గ్రంథాలు ప్రకటించారు. తి॥వేం॥ కవులు వారి శిష్యులైన వేలూరి శివరామశాస్త్రిగారిపేరున "బిడాలో పాఖ్యానము" అను విమర్శ గ్రంథాన్ని వెలువరించారు. వేంకటరామకృష్ణ కవులు "రామకృష్ణ మహాభారతము" అను గ్రంథాన్ని వెలువరించగా దానిపై తి॥వేం॥కవులు "గీరతము" అను విమర్శ గ్రంథాన్ని వెలువరించారు. ఈ విధంగా వారు భయుల మధ్య వాగ్యుద్ధాలు - కొంతకాలం రసపట్టులో నడచాయి. తరువాత దివాకర్ల తిరుపతి శాస్త్రి, వేదుల రామకృష్ణ శాస్త్రిగారల మరణాలతో అవి సమసి పోయాయి.

నియోగి - వైదికి శాఖల మధ్యలో కొందరు రగిల్చిన చిచ్చువలన తి॥వేం॥కవులకు కొప్పరపు సోదర కవుల మధ్య వాగ్యుద్ధాలు ప్రారంభమయి ఉభయులు ఒకరిపై ఒకరు పద్యాలు విమర్శిస్తూ గుప్పించుకొన్నారు. వారి తరపున కొందరు, వీరి తరపున కొందరు సవాళ్ళు, ప్రతి సవాళ్ళు, చేసుకుని ఆనాడు గొప్ప విమర్శ సాహిత్యం సృష్టించారు. తిరుపతి వేంకటకవులు తరపున వారి శిష్యులు, త్రిపురనేని రామస్వామి చౌదరి, పింగళి లక్ష్మీకాంతం గారలు కొప్పరపు సోదర కవులను ఎదిరిస్తూ పద్యాలు వ్రాశారు. తి॥వేం॥ కవులకు, కొప్పరపు సోదర కవులకు గుంటూరు, వేమవరం అగ్రహారం మొదలైన స్థలాలు వాగ్యుద్ధాలకు ఆనాడు కార్యస్థానాలయ్యాయి. తిరుపతి వేంకటకవులు "గుంటూరు సీమ" అనేవివాదగ్రంథం వారానాడు రచించినదియే. తరువాత తిరుపతి శాస్త్రిగారి మరణానంతరం - వెంకటశాస్త్రిగారికి గురువులైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారితో వివాదమేర్పడింది. ఆ సందర్భంలో ఏర్పడినపద్యకావ్యమే "జయంతి" అనే ప్రఖ్యాత గ్రంథం. ఈ విధంగా తి॥ వేంకట కవులకు ఇతర కవులకు, ఏర్పడిన వాగ్యుద్ధాల వలన గొప్ప వివాద సాహిత్యం ఏర్పడి ఆనాటి సాహితీ ప్రియులందరికీ ఎంతో ఆనందాన్ని, ప్రయోజనం చేకూర్చింది.

వెం॥శా॥గారి కడియం నివాసం :

వెంకట శాస్త్రిగారు 1916 వ సంవత్సరములో బందరులో తెలుగు పదవికి రాజీనామా చేసి, కడియం గ్రామానికి తిరిగి వచ్చారు. అక్కడ ఉంటూ వారు రచనలు చేస్తూండగా జంట కవులలో రెండవ వారైన తిరుపతి శాస్త్రిగారు 1920లో పరమపదించారు. దానితో వారు ఒంటరి జీవితాన్ని గడపవలసి వచ్చింది. తిరుపతి శాస్త్రిగారిమరణానంతరం వెంకటశాస్త్రిగారు ఒకటి, రెండు అవధానాలు మధ్వశ్రీ కాశీ కృష్ణాచార్యులవారితోను, చివరిగా వేలూరి శివరామశాస్త్రిగారితో ఒక అవధానం చేసి అంతటితో వెంకట శాస్త్రిగారు అవధానాలు చేయడం మానివేశారు.

బందరులో సన్మానం :

వెంకటశాస్త్రిగారు బందరు తెలుగు పండిత పదవి

వదలి స్వగ్రామం వస్తున్న సందర్భంలో 1916 ఆగష్టు 5,6 తేదీలలో బందరు పట్టణంలో ఘనంగా సన్మానింప బడ్డారు. మొదటి రోజున మానవల్లి రామకృష్ణ కవిగారు అధ్యక్షత వహించారు. రెండవ రోజున వారికి గండపెండేర సన్మానం జరిగింది.

బందరులో వెంకటశాస్త్రి గారి షష్టి పూర్తి సన్మానములో మహోత్సవము :

శతావధాని శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశా స్త్రిగారి షష్టిపూర్తి మహోత్సవము 1933 సెప్టెంబరు30, అక్టోబరు ఒకటవ తేదీలలో బందరులో ఘనంగా జరిగింది. ఈ సన్మానాన్ని బందరు పౌరులు, మహాకవులు,పండితులు, వారి శిష్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంలో శాస్త్రిగారి బంధువులంతా బందరు తరలివచ్చారు. సన్మాన సభ రామా హైస్కూలులో జరిగినది. ఈ సభలో పింగళి కాటూరి కవులు రచించిన "సౌందర నందము" కావ్యాన్ని వెంకటశాస్త్రిగారికి అంకితం చేస్తూ.

"జగదాశ్చర్యకరావధానకవితా సంపత్తికిన్ మ్రొక్కి మీ
యుగళ స్నేహము (బ్రస్తుతించి భవదీయోదార భావప్రసా
దగుణోత్ఫుల్ల కృతి ప్రసూన విగళన్మారంద ధారా సురా
పగనోలాడి రచించి తెచ్చితిమిదేవా! నీకు నీ దక్షిణన్
(జాతకచర్య, ఉత్త. పుట 234)

కేతన తోడి పొత్తునకు (గేల్గలుపన్ దలపోసి కాదునీ
చేతము మెచ్చ(గా(గవిత చెప్ప(గ నేర్తుమటంచు (గాదు నీ
ఖ్యాతికి (గా, ది(కేమనిన, నద్యతనాంధ్ర కవి ప్రపంచని
ర్మాతకు భక్తిమై నుడుగఱల్ ఘటయించెడి పూన్కియే సుమా!
(జాతకచర్య,ఉత్త. పుట234)

అని భక్తితో కావ్యాన్ని అంకితం చేశారు. వెంకట శాస్త్రిగారికి శిష్యులలో మరి యొకరైన శ్రీ సర్వా వేంకట శేషయ్యగారు సుదర్శనోపాఖ్యానము నామాంతరము గల శశికళా స్వయంవరమను పద్య కావ్యమును శాస్త్రిగారికి అంకితమిచ్చారు.

ఈ సందర్భంలో పలువురు కవులు, శిష్యులు వెంకటశాస్త్రిగారికి పద్యోపహారాలు ప్రసాదించారు. ఆ సందర్భంలో వేలూరి శివరామశాస్త్రిగారి పద్యం చెప్పారు.

"ఎక్కడ (జూచినన్ గవులె యెక్కడ జూడ శతావధానులే
యెక్కడ (జూడ నాశుకవులెక్కడ (జూడ (బ్రంబధకర్తలే
దిక్కరులంచు (బేర్పడిన తిర్పతి వెంకట సూరులే(గు నా
ప్రక్కల నెల్ల నీ కడుపు పండినదమ్మ! తెలుంగు దేశమా!
(జాతకచర్య, ఉత్త. పుట 219)

నవయుగ కవి చక్రవర్తి యైన జాషువ శాస్త్రిగారి నీ విధంగా కీర్తించారు :

"తెలుగు జగాన నే(డు గడిదేరిన బాలకవీంద్రు లెల్ల మీ
పలుకుల పందిటన్ జిగురు బట్టిన మొగ్గలు మీ వధాన కౌ
శలమున నూగిపోయిన దిశావలయమ్ము ప్రసన్న బుద్ధియై
వలగొని మీకొసంగెడి నుపాయనముల్ గొనుమయ్య సత్కవీ!
(జాతకచర్య, ఉత్త. పుట 228,229)

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు సందర్భములో చెప్పినపద్యం.

పుడమిని బెక్కు సత్కవులు బుట్టిరిముట్టిరి సత్కవిత్వపున్
దొడిమలు, చెళ్ళపిళ్ళ కవితో(దులదూ(గెడు వారె! నానలో(
దడియనివారు మద్గురు వధాన మృదూక్తి మరంద ధారలో(
గడుగని వారు మాకెచట(గాన(గరారిల (దెల్గునాడునన్"
(జాతకచర్య, ఉత్త.పుట 239)

ఇంకను అనేకమంది కవులీ సందర్భంలో వెంకటశాస్త్రి గారికి పద్యోపహారాలు అర్పించారు. అందులో దివాకర్ల తిరుపతి శాస్త్రిగారి కుమారులు వేంకటావధానిగారి పద్యం కంటతడిపెట్టిస్తుంది.

స్మరణీయుండగు(గాక స్వీయ కవితా సామ్రాజ్యనిస్ఫూర్తికిన్
గురుతాస్ఫీతి వహించి తోడివడ్గు కూలంకషంబైనది
క్తరుణీ సేవిత సద్యశోరమకు భాగస్వామియానేంకటే
శ్వరు రూపమ్మున నున్న తండ్రికి నమోవాకమ్ములర్పించెదన్
(జాతకచర్య, ఉత్త. పుట 227)

కృష్ణా పత్రికసంపాదకులు శాస్త్రిగారి షష్టి పూర్తి మహోత్సవ సందర్భంలో వ్రాసిన కొన్ని వాక్యములు "వీరి కవిత్వము, ప్రాచీన కవిత్వమునకు భరతవాక్యము నవీన కవిత్వమునకు నాంది... తిరుపతి వేంకటకవుల కవిత్వము ఆధునిక కవిత్వమునకును ప్రాచీన కవిత్వమునకును సేతువు వంటిది. ప్రాచీన కవిత్వ మందలి దీప్తి గోచరిం చును. నవీన కవిత్వమందలి ప్రసాదము సౌలభ్యము పొడసూపును, వీరి రచనలు చిరకాలము వర్ధిల్లుననుటకు సందియము లేదు

బెజవాడ కాపురం :

వెంకటశాస్త్రిగారు చరమదశలో బెజవాడలో క్షీర సాగర్ బిల్డింగ్ లో ఉండే వారు. విజయవాడ వణిక్ ప్రవరుడైన శ్రీ చుండూరి వెంకటరెడ్డిగారి కోరిక మేరకు శాస్త్రి గారు విజయవాడలో కాపురముంటూ పురాణ గాథలు, వ్రత కథలు మొదలైన గ్రంథాలు వ్రాశారు. ఈ కాలంలోనే విజయవాడలో జాషువా మహాకవికి గండ పెండేర సన్మానం జరగడం దానికి వెంకటశాస్త్రి గారు అధ్యక్షత వహించటం జరిగింది.

అవిభక్త మద్రాసు రాష్ట్ర ఆస్థానకవి పదవి :

1949 సెప్టెంబరు నెలలో శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు తెలుగులో మద్రాసు ప్రభుత్వాస్థాన కవిగా నియమింపబడిరి. ఆనాడు మద్రాసు రాష్ట్రంలో తెలుగు, తమిళం, కన్నడం, మళయాళ భాషలలో ఒక్కొక్క భాషకు ఒక్కొక్క కవిని ఆస్థానకవిగా ప్రభుత్వం నియమించింది. తెలుగులో వెంకటశాస్త్రిగారు ఆస్థాన కవిగా నియమింపబడ్డారు. ఆ సమయానికి శాస్త్రి గారు మద్రాసు వెళ్ళి పదవిని స్వీకరించడానికి గల శారీరక దారుఢ్యము లేకపోవుటచే ముఖ్యమంత్రి శ్రీ పూసపాటి కుమారస్వామిరాజా వారు, మంత్రి గోపాలరెడ్డి గారు విజయవాడ విచ్చేసి శాస్త్రిగారిని ఆస్థానకవిగా నియమించి ఘనంగా సన్మానించారు. విజయవాడలో జరిగిన సన్మాన సభకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారు అధ్యక్షత వహించగా ఆనాటి ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రారంభోపన్యాసము చేస్తూ "ఇప్పుడు నేను కళ్ళు మూసికొని రాయి విసరినచో అది ఒక పండితునకో కవికో తలకు తగులు"నని చమత్కరించారు. దానిని బట్టి తెలియునదేమనగా ఆనాటి సభకు యావదాంధ్ర దేశము నుండి, ఆంధ్రేతర ప్రాంతాలనుండి వచ్చిన సాహితీ ప్రియులు ఇసుక వేస్తే రాలనట్లున్నారు. అంతగొప్ప సాహితీ సభ మరెప్పుడు ఆంధ్రదేశంలో జరిగి వుండదు. ఆ సభలో పద్యోప హారాలు ప్రసాదించారు. ఈ సందర్భంలో శ్రీ శివభారతం గ్రంథ రచయిత శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి గారీ విధంగా పద్యాలు పఠించారు.

"జయమేపార శతావధాన కవితా సామ్రాజ్య పీఠంబు న
చ్ఛయ శోమూలముగాఁగ నేలిన మహాసారస్వత జ్యోతిరు
చ్ఛయమౌ వేంకటశాస్త్రి యాంధ్ర,కవితా స్థానీ ప్రభుండయ్యె, న
న్నయ తిక్కన్నల నాటి వైభవము లీనాడయ్యె వాగ్దేవికిన్"

(ఆంధ్ర రచయితలు, పుట 287)

"కవి సభలిచ్చు గౌరవముగాదిది, యొక్క నృపాలుఁడిచ్చు గౌ
రవమును గాదు, కావ్యరసరంజిత భావుక యావదాంధ్ర గౌ
రవము ప్రజాప్రభుత్వము కరమ్మున వేంకటశాస్త్రి గారికిన్
నవ వరణ స్రజ మ్మిది యనన్య మపూర్వము గాదె తెన్నునన్"

(ఆంధ్ర రచయితలు, పుట 288)

ఆస్థానకవి పదవి లభించే నాటికి శాస్త్రిగారికి వయస్సు 79 సంవత్సరాలు . ఆ విషయాన్నే శాస్త్రిగారు ప్రత్యభివాదంలో. "పదకొండేడుల పైని రెండిపుడు నా ప్రాయంబు" అని చమత్కరించారు. అంటే 11×7 = 77 సం॥రాలు + 2 = 79) ఇప్పటికి నాకు లౌకికమైన ఆస్థానకవి పదవి లభించింది. ఇక విశ్వేశ! నీ సన్నిధిలో కవిగా ఉండే భాగ్యం కలుగజేయవలసిందిగా శాస్త్రిగారు కోరారు.

"కవులెల్లన్ జయపెట్టు వైభవమొసంగన్ లేదొ సచ్ఛిష్యవ
ర్గ విభూతిన్ గరుణింపవో తనుజనుర్భాగ్యంబు గైసేయవో

వివిధైశ్వర్యము లిచ్చి తింక నొకటే విశ్వేశి నీ సన్నిధిన్
గవిగా నుండ ననుగ్రహింపు మిదియే కామ్యంబు కామేశ్వరీ!

(ఇటీవలిచర్య, పుట 280)

వెంకటశాస్త్రిగారి స్వర్గారోహణము:

ఆస్థానకవి పదవి అలంకరించిన ఆరుమాసాలకే వెంకటశాస్త్రిగారు విజయవాడ పట్టణంలో పరమపదించారు. అది శివరాత్రి, పర్వదినం (15.2.1950) శాస్త్రిగారి పురాకృత సుకృతం వలన వారు పుణ్యదినమైన శివరాత్రి పర్వదినం నాడు స్వర్గస్థులవ్వడం విశేషం. ఆ సందర్భంలో వారి శిష్యులు పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పిన పద్యాలు స్మరణీయం.

"ఆంధ్ర కవితా జగద్గురు డమరపురికి
దరలిపోయెను శిష్య సంతతుల విడచి
సహజగీర్వాణవాణీ ప్రసక్తులైన
దేవతలు చెప్ప గల రింకదెల్గు కవిత"

"మరల దిరుపతి వేంకటేశ్వరుల జంట
కలిసెముప్పది యేండ్ల పైకాలమునకు
సాగగల దింక దిక్పాల సభల యందు
అద్భుతావహ శతావధానాంధ్ర కవిత"

(ఇటీవలిచర్య, పుట 290)

తిరుపతి వేంకట కవుల రచనలు :

తిరుపతి వేంకట కవులు శతాధిక గ్రంథ రచయితలు. రెండు భాషలకు మేమే కవీంద్రులము'' .... అని దోసమటంచెరింగియును... అన్న పద్యంలో తెల్పిన విధంగా వారు తెలుగులోను, సంస్కృతంలోను రచనలు చేశారు. ఉభయులు కలిసి కొన్ని రచనలు, వెం॥శా॥ గారు ప్రత్యేకంగా కొన్ని రచనలు, తిరుపతి శాస్త్రిగారు ప్రత్యేకంగా కొన్ని రచనలు చేశారు.కాని అవి అన్నీ తిరుపతి వేంకట కవుల రచనలు (తిరుపతి వేంకటీయము) గా చెల్లుతాయి. జాతక చర్యలో వారీ విధంగా నుడివినారు.

"ఇరువురుఁగూడియే రచనయెప్పుడుఁజేయుదు రొక్కవేళ నొక్కరొకటి, యొక్కరింకొకటి కైకొని చేయుదు, రందు హెచ్చుతగ్గులకు గానరాక యదియొక్కరు చేసిన భంగినుండు, నొక్కరు రచియించి రేనియును గాఁదగు తిర్పతి వేంకటేయమై.

ఇరువురులో ఒక్కరు రచించినా అది తిరుపతి వేంకటీయముగా చెల్లుతుంది.

(జాతకచర్య, పూర్వార్థము, ప-240)

తిరుపతి వేంకటకవులు సంస్కృత గ్రంథాలు వ్రాశారు. తెలుగులో ప్రబంధాలు సంతరించారు. నాటకాలు, ప్రహసనాలు, వచనరచనలు కథలు-గాథలు, పద్యాలలో స్వీయచరిత్ర, లఘుకావ్యాలు, శతకాలు, స్తోత్రాలు, వివాద గ్రంథాలు వెలయించారు.

సంస్కృతంలో వారు - కాళికాది స్తోత్రమాల - ధాతు రత్నాకరము - శృంగార శృంగాటకమ్ - కాళీసహస్రం - శుకరంభా సంవాదమ్ - మూల స్థానేశ్వర స్తుతి - ఓం నమశ్శివాయ స్తోత్రమ్ - క్షమాపణమ్ - మొదలైన రచనలు చేశారు.

ప్రబంధాలలో ముఖ్యంగా శ్రవణానందము - పాణిగృహీత - బుద్ధ చరిత్రము - లక్షణా పరిణయము - శ్రీనివాస విలాసము - ఏలా మాహాత్మ్యము - బొబ్బిలి పట్టాభిషేకము - పూర్వ హరిశ్చంద్ర చరిత్రము - శివభక్తి - సుశీల - పతివ్రత గోదేవి మున్నగునవి ఉన్నాయి. ఇందులో శ్రవణానందము ఆనాడు గొప్ప పేరు పొందినది. ఇది చదివి పొంగిపోయిన ఒక పాఠకుడు

ఒక శ్రవణానందమ్మున
నొకపద్యము నందుఁగలుగు నొకపాదమునం
దొక యక్కరమునకిచ్చిన
సకలంబగు రత్నగర్భ చాలునెతూపన్.

(కథలు, గాథలు, 3సం- పు.250)

శ్రవణానందములోని మనోహరమైన పద్యములలో నొకటి -

'ధనమాపోవును; మానమా చెడును, నిందా నెత్తిపై కెక్కు; లో
ననుమానింతురు తల్లిదండ్రులు, కులంబావన్నెకుందక్కు; నూ
తన మాంద్యమ్ము ఘటిల్లు, బందుగులు పంతం బొప్ప నిందింతు, రో
మనమా వద్దిక నాదు మాట వినుమా మర్యాద కాపాడుమా"!

(శావణానందము, పుట 86)

బుద్ధ చరిత్రము, ఒక ప్రఖ్యాత ప్రబంధము,ఎడ్విన్ ఆర్నాల్డ్ రచించిన "లైట్ ఆఫ్ ఏషియా" అనే గ్రంథాన్ని తెలుగులోనికి అనువదింపజేసుకుని, అశ్వఘోషుని బుద్ధచరిత్రమును చదివి దీనిని తి॥వేం॥కవులు రచించారు. వారి ప్రసిద్ధ గ్రంథములలో ఇది యొకటి. దీనిని పోలవరం జమీందారులకు అంకితమిచ్చారు. ఆత్మకూరు ప్రభువుల కోరిక మేరకు శ్రీనివాస విలాసమును తెలుగులోనికి అనువదించి ఆ ప్రభువునకేఅంకితమిచ్చి తి॥వేం॥ కవులు -గజారోహణం చేశారు.దేవీభాగవతంవారు అనువదించిన ప్రఖ్యాత పురాణము, ప్రధానంగా దీనిని తిరుపతి వేంకటకవులు, అనువదించినా ఇతరులకు కూడ వీలుకల్పించే ఉద్దేశ్యంతో వెంకటశాస్త్రిగారు -శ్రీయుతులు ఆకొండి రామమూర్తి, నిశ్శంకుల కృష్ణమూర్తి , దివాకర్ల వేంకటావధాని (తిరుపతి శాస్త్రిగారి కుమారులు) మరియు చెళ్ళపిళ్ళ చినవేంకట శాస్త్రిగారలను కొంత అనువదించుమని కోరి వారిచే కొంతభాగం అనువదింప జేశారు.

లఘు కావ్యాలలో రసికానందము -శనిగ్రహము - గ్రామ సింహము - బిడాలోపాఖ్యానము - దైవతంత్రము - వైరాగ్యశతకము - కాళీ సహస్రము - శతావధాన సారము - కలగూంగంప -నానారాజ సందర్శనము - వ్రతకథలు - పురాణకథలున్నాయి. తి॥వేం॥ కవులు దర్శించిన సంస్థానములలో చెప్పినపద్యాలు నానారాజ సందర్శనములో చోటు చేసుకొనగా వారు గావించిన శతాష్టావధానాలలోని పద్యాలు శతావధాన సారంలో ఉన్నాయి.

వారు రచించిన శతకాలలో ప్రధానంగా కామేశ్వరీ శతకము - ఆరోగ్య కామేశ్వరి - సౌభాగ్యకామేశ్వరి శతకాలను పేర్కొనవచ్చును. స్తోత్ర గ్రంథాలలో కాళికాది స్తోత్రములు - నమశ్శివాయ స్తోత్రము - ఆరోగ్య భాస్కర స్తవము - మృత్యుంజయ స్తవము - శివ స్తవము మొదలైనవి ఉన్నాయి.

వెంకటశాస్త్రిగారు నానాడు రచించిన 300 వ్యాసాలు (2500 పుటలు) కథలు - గాథలు రూపంలో మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. ఇవి అమూల్యమైన విషయాలతో కూడుకొన్నవేకాకుండా, పాఠకుడు చదువుచున్నంత సేపు ఒక నవల చదువుతున్నంత ఆసక్తిని కలిగిస్తాయి. ఎన్నెన్నో ఆసక్తికరమైన సంగతులిందున్నాయి. ఇవి చదివిన పాఠకుడు మంచి పండితునిగా, కవిగా రూపొందుతాడనడంలో అతిశయోక్తి లేదు.

ప్రప్రథమంగా తెలుగు సాహిత్య చరిత్రలో స్వీయచరిత్రను పద్యాలలో వ్రాసినకవి చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారనే చెప్పాలి. షష్టి పూర్తి అయ్యేవరకు గల చరిత్ర - "జాతక చర్య" అనే పేరుతోను, తరువాతి భాగం ఇటీవలి చర్యగాను పేర్కొన్నాయి. స్వీయచరిత్ర కనుక చివరి కొంతభాగం శాస్త్రిగారి రెండవ కుమారులు చెళ్ళపిళ్ళ దుర్గేశ్వర శాస్త్రిగారు పూర్తి జేశారు.

వివాద గ్రంథాలలో ముఖ్యంగా గీరతము - గుంటూరు - సీమ - జయంతి - మల్లేశ్వర విజ్ఞప్తి - కృష్ణ రాయ శతకం ప్రధానంగా పేర్కొననచ్చును. గీరతము ప్రధానంగా వేంకటరామ కృష్ణకవులతో వచ్చిన వివాదాన్ని పురస్కరించుకొని వ్రాసిన గ్రంథం. గుంటూరు సీమ కొప్పరపు సోదర కవులతో కలిగిన వాగ్యుద్ధానికి సంబంధించిన వివాద గ్రంథం. జయంతి వెం॥శా॥ గారికి గురువులైన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారితో తలపడిన సందర్భంలో వెలువడిన గ్రంథం.

తి॥వేం॥ కవులు వచన రచనలలో - విక్రమాంక దేవ చరిత్రము - చంద్రప్రభ చరిత్రము - హర్ష

చరిత్రము - సారస్వత విమర్శలు - శృంఖలా తృణీకరణము -దివాకరాస్తమయము - విక్రమ చెళ్ళపిళ్ళ - షష్టిపూర్తి - కాశీ యాత్ర - సతీజాతకము - టాగోర్ కథలు - ఆంధ్రభోజుడననేమి? మొదలైనవి వున్నాయి.

తిరుపతి వేంకట కవులు కొన్ని ప్రహసనాలు కూడా వ్రాశారు. అందులో ముఖ్యంగా పల్లెటూళ్ళో పట్టుదలలు - రసాభాసము - త్రిలోక విజయము - తవిటి రొట్టె ప్రహసనము -స్కూలు పిల్లల ప్రహసనము మొదలైనవి ఉన్నాయి.

ఒకవైపు అవధానాలు, ఆశు కవితలు, మరొకవైపు వారి శ్రవణా నందము మొదలైన ప్రబంధాలు తిరుపతి వేంకట కవులకు గొప్ప కీర్తి తెచ్చి పెట్టినా,వారి పాండవ నాటకాలలోని పద్యాలు సామాన్య ప్రజల నాలుకలపై తాండవిస్తున్నాయి. గ్రామాలలోని గోపాలురు సైతం పాండవోద్యోగ విజయాలలోని పద్యాలు కూనిరాగంతో ఈ నాటికీ గ్రామాలలో పాడడం మనము వింటున్నాము. సంస్కృతంలో ఉన్న నాటకాలనువారు అనువదించారు. రాజశేఖర కవి సంస్కృతంలో రచించిన కర్పూర మంజరి, బాలరామాయణం, బాలభారతము, విద్ధసాల భంజిక అను నాటకాలు శూద్రక మహాకవి రచించిన మృచ్ఛ కటికము, విశాఖదత్తుడు రచించిన ముద్రా రాక్షసమును వారు ఆంధ్రీకరించారు. ఇంతేకాక వారు అనర్ఘనారదము, దంభవామనము, సుకన్య, గజానన విజయం, ఎడ్వర్డు పట్టాభిషేక నాటకము, పండిత రాజము, సువర్ణ పాత్రికము, (రెండంకములు) వ్యసన విజయము (3 అంకములు) జీవానంద నాటకము, ప్రభావతీ ప్రద్యుమ్నము మొదలైన నాటకాలు వ్రాశారు.

తిరుపతి వేంకట కవులు కేవలం విద్వత్కవులే కాకుండా ప్రజల నాడిని పసిగట్ట గలిగిన మనస్తత్వ వేత్తలు కూడా. సంస్కృత భారతాన్ని మక్కికి మక్కికి అనువాదం చెయ్యాలని వారి అభీష్టం కాదు. కారణమేమంటే అంతకుపూర్వం చాలామంది కవీశ్వరులు భారతాన్ని ఆంధ్రీకరించారు.పైగా కవిత్రయ భారతం వచ్చిన తరువాత మరల భారతం ఆంధ్రీకరిస్తే ప్రజాదరణ పొందడం కష్టం అందువల్లనే వారు - భారతాన్ని యావత్తు ఆరునాటకాల రూపంలో వ్రాస్తే ప్రజాదరణ పొందవచ్చునని చక్కగా అవగాహన చేసుకొన్నారు ఫలితంగా వారు పాండవ జననము - పాండవ ప్రవాసము - పాండవోద్యోగము - పాండవ విజయము - పాండవాశ్వమేధము - పాండవ రాజ సూయము అను ఆరునాటకాలు రచించారు. ఇందులో పాండవోద్యోగ విజయాలు అనే పేరుతో తిరుపతి వేంకట కవుల నాటకం ఆంధ్రదేశంలో దాదాపు పదివేలకు పైగా ప్రదర్శనలిచ్చి సాహితీ రససింధువులైన ప్రేక్షకులను రసార్ణవములో ముంచి తేల్చాయి. ఈనాటికి కూడా ఆ నాటకాలు పలుపట్టణాలలోను, పల్లెలలోను ప్రదర్శింపబడు తున్నాయి. పొలాలలో పనిచేసే పాలికాపులను కదిలిస్తే వారు వెంటనే "అదిగోద్వారక ఆలమందలవిగో " అనియో "బావా ఎప్పుడు వచ్చితీవు సుఖులే భ్రాతల్ సుతుల్ చుట్టముల్.... ''అనియో రాయబార ఘట్టంలోని'' చెల్లియొ చెల్లకోతమకు "మహితాత్ముడ జాత శత్రువే యలిగిననాడు సాగరములన్నియు నేకము కాకపోవునే..." "జండాపై కపిరాజు ముందు సితవాజ శ్రేణియున్ గూర్చి నేదండంబున్ గొని తోలు స్యందనముపై...." "సంతోషంబున సంధి చేయుదురె''..... అనియో పద్యాలు ధారాళంగా పాడుతారు. ఇవి తిరుపతి వేంకటకవుల పాండవ నాటకాలకుండే ప్రత్యేకతను మరియు కవుల ఖ్యాతిని తెలియజేస్తాయి.

తిరుపతి వేంకట కవుల అవధానాలు :

శతాష్టావధానాల ద్వారా ఆశుకవితల ద్వారా ఆంధ్రదేశంలో కవితోద్యమం తెచ్చి సామాన్య ప్రజలలో కూడా కవిత్వంపై మక్కువ కలిగించిన నవయుగ కవితా వైతాళికులు తిరుపతి వేంకటకవులు. అవధానాల ద్వారానే జన బాహుళ్యంలో కవితా బీజాలను వెదజల్ల వచ్చునని తలచిన కవి ద్రష్టలు వారు. అవధాన

ప్రదర్శనల ద్వారా వారానాడు చూడని పట్టణం కాని, పల్లెకాని లేదనడంలో అతిశయోక్తి లేదు. వారు అష్టావధానాలు చెన్నపట్టణం, నెల్లూరు, వేంకట గిరి, విశాఖపట్టణం, ధవళేశ్వరం, కిర్లంపూడి, వీరవరం, అమలాపురం, గజపతినగరం, కేశన కుర్రు, రెడ్డి పోలవరం, అనకాపల్లి, మందసా, ఏలూరు, నూజివీడు, రాజమండ్రి, నర్సారావుపేట మొదలైన తావులందు, శతావధానాలు కాకినాడ, అమలాపురం, ఏలూరు, బందరు, బెజవాడ, విజయనగరం, క్రొత్తపల్లె, గద్వాల, నర్సాపురం, మొగల తుర్రు, పిఠాపురం, గుంటూరు, కోటరామచంద్రపురం, ఆలమూరు, పాలతేరు, వినుకొండ, నర్సరావుపేట, శ్రీకాకుళం, ఉర్లాము, నూజివీడు, తోట్ల వల్లూరు, బాపట్ల, వేమవరాగ్రహారం, పినపాడు, బ్రాహ్మణ కోడూరు, లక్ష్మీనరసాపురం, మొదలైన స్థలాలలో "నహిప్రతి" అనేవిధంగా అవధానాలు చేశారు.

"ఒక చరణం బతండు మఱియొక్కటి నేనుమ ఒక్కటా తడున్'' అను నియమముతో అవధానములలో జంటగా అవధానాలు నిర్వహించారు. ఒక్కొక్కప్పుడు ఇద్దరు కాకుండా కొన్ని అవధానాలు వేంకట శాస్త్రి గారొక్కరే నిర్వహించారు. 1901 ప్రాంతంలో వెంకటశాస్త్రిగారు వారి పినతండ్రి కుమారులైన చిన వెంకట శాస్త్రిగారితో కలిసి అనకాపల్లి నుండి మందసా వరకు అవధానాలు చేశారు. తిరుపతి శాస్త్రిగారు లక్ష్మీనరసాపురంలో ఒక్కరే అవధానం చేశారు. బందరులో వెంకటశాస్త్రిగారు కాశీకృష్ణాచార్యుల గారితో కలిసి ఒకటి, రెండుఅవధానాలు చేశారు. వెంకటశాస్త్రిగారి చివరి అవధానం - తేతలిలో 1924 మార్చిలో వేలూరి శివరామశాస్త్రిగారి తో కలిసి చేశారు.వెంకటశాస్త్రి గారితో కలిసి తిరుపతి శాస్త్రిగారు కాకినాడలో ప్రథమంగా అవధానం చేయడానికి వెళుతున్న సందర్భంలో వెంకటశాస్త్రిగారు అవధాన నిర్వహణంలో కొన్ని మెలకువలు తిరుపతి శాస్త్రి గారికి తెలుపడం వలన వారిని గురువుగా భావించి ఈ విధంగా కీర్తించారు.

"వితతాత్మీయ శతావధాన కవితా విద్యాపయోరాశి సం
భృత శిష్యాంబుద వాఙ్మయా మృతర సప్రీతాఖిలాంధ్ర క్షమా
ధృతరజ్య ద్రికావతంస కృతవంది స్తోత్రమాలా విభూ
షితు మా వేంకటశాస్త్రి నేఁబొగడెదన్ శిష్య స్వరూపమ్ముననన్
(శతావధాన సారము, ఉత్త. పుట్ట- 126)

తిరుపతి వేంకట కవులు గావించిన అవధానము లలో వారు పూరించిన సమస్యలు, దత్తపదులు, వర్ణనలు కడు రమ్యముగా నుండి పాఠకుల హృదయాలను సరసంగాను పూరించారు. నెల్లూరులో జరిగిన అష్టావధానములో ఒక పృచ్ఛకుడు ''సంధ్యావందన మాచరింపవలదా చౌశీతి బంధమ్ములన్" అను సమస్య నిచ్చి పూరింపుడని కోరారు. ఈ సమస్యలోనున్న విరోధము ఏమంటే- సంధ్యా వందనము - చౌశీతి బంధములతో ఆచరింప కూడదా? అని వాత్స్యాయనుని కామ సూత్రాలలో 84 బంధాలున్నాయి. వానితో సంధ్యా వందనము చేయడమేమిటి? ఆ విరోధాన్ని వారు చక్కగా తొలగించి పూరించారు.

"వింధ్యాద్రి ప్రభనొప్పు బల్కుచములన్ వేపట్టి పెంపొందు కా
మాంధ్యం బార్పగ లేక వెఱ్ఱివలె నేలఁ మంచి యీ రాతిరిన్
వంధ్యం జేసెదు? కాము కేళియనగా (బాండిత్యమా? లేక నీ
సంధ్యావందనమా? చరింపవలదా? చౌశీతి బంధమ్ములన్
(శతా.పూ.పుట 24)

అమలాపురం జరిగిన శతావధానంలో ఒక పృచ్ఛకుడు "మానవతీ లలామ కభిమానమె చాలును జీరయేటికిన్?'' అను సమస్యనీయగా తి॥వేం॥ కవులు దానిని గోపికా వస్త్రాపహరణం కథను దృష్టిలో నుంచు కొని సమస్యను సరసంగా పూరించారు.

"ఓ నవనీతచోర!కృపయుంచి పటమ్ముల నిచ్చి వేగ మా
మానము గావుమన్న వ్రజమానిని పల్కుల కెంతొ వింతన
వ్వానన సీమ (దోఁప(గమలాక్షుడు దానిటు పల్కె, మానినీ
మానవతీలలామ కభిమానమె చాలును జీరయేటికిన్ "
(శతా.పూ.పుట 12)

కిర్లంపూడిలో జరిగిన అష్టావధానంలో ఒక పృచ్ఛకుడు -"గణ చతుర్థినా(డు ఫణి చతుర్థి" అను సమస్యనిచ్చి పూరింపుడని కోరగా వారు ఈ విధంగా అర్థవంతంగా పూరించారు.

"ఎన్నిదినములాయె నిట నన్ను డించి నీ
వరిగి" యనిన (బత్ని కనియె భర్త
" నేటి కెన్న(గ(బది నెల లాయె(గా!నేడు
గణచతుర్థి; నా(డు ఫణి చతుర్థి " (శతా. ఉత్త.పుట 64)

సమస్యకు అర్థము - వినాయక చవితినాడు నాగుల చవితి అని అర్థము. దానిని - ఈ విధంగా పూరించారు. భార్యభర్తతో అన్నది కదా - మీరు నన్నిట దించి ఎన్నిరోజులయ్యింది అని అంటే - భర్త అన్నాడు - పదినెలలయ్యింది. దించినరోజు (నాడు) నాగుల చవితి,నేడు - వినాయక చవితి అని సమాధానం చెప్పాడు.

వీరవరంలో (పెద్దాపురం తాలూకా - తూ.గో.జిల్లా) జరిగిన అష్టావధానంలో "సరసుని వైపు వీపు నలచాన మొగంబటు గోడవైపు" అన్నసమస్యనిచ్చి ఆరంభంలో ఉంచి పూరింపుమన్నారు. వారిట్లు సరసంగా పూరించారు.

"సరసుని వైపు వీపు నలచాన మొగంబటు గోడవైపు,నా
సరసు(డు కేలుచాపు నలచానయు(జన్నుల(జేయి మోపు, నా
సరసు(డు కోర్కె(జూపు నలచాన దొడందొడలోన (దోపు, నీ
వరుసనె తెల్లవారె నొక వైఖరి నొక్కని కొక్క వేశ్యతోన్
(శతా.ఉత్త. పుట 66)

విశాఖ పట్టణంలో జరిగిన అష్టావధానంలో ఇచ్చిన" సతిసతి (గవియంగ(బుత్ర సంతతి కలిగెన్" సమస్యను సరసంగా నీవిధంగా పూరించారు.

"అతి కుతుకం బలరార(గ(
జతురత మెఱయంగ మదన శాస్త్రవిధమునన్
వితతంబగు తన సౌధ వ
సతిసతి(గవియంగ (బుత్ర సంత తికలిగెన్

స్త్రీ - స్త్రీ కూడగా పుత్రుడు కలుగడమేమిటి? ముందున్న సతిని - సౌధ వసతిగా మార్చారు. ఇప్పుడు సమస్య అర్థవంతమయ్యింది.

సమస్య " సూర్యుడుదయ శిఖరి నెక్కె(జుక్కలు వొడిచెన్" అను సమస్య కంద పద్యపాదములో అడిగి దానిని - కందంలో కాకుండా ఇతర ఛందస్సులో పూరింపుడని కోరగా వారు సరసంగా తేటగీతిలో చెప్పారు.

(గహణ దినమైనకతమున (గబళనంబు
సలిపె రాహువో కేతువో గిలితు(డయ్యు(
గార్యభారమున నట్టులే "సూర్యు(డుదయ
శిఖరి నెక్కె (జుక్కలు వొడిచెన్" దళముగ (శతా.పుట 73)

తిరుపతి వేంకట కవులు గావించిన అవధానము లలో దత్తపది ఒక అంశము. బాపట్లలో వారు నిర్వహించిన అవధానములో ఒక పృచ్ఛకుడు -"అలక -పలక-కలక-గిలక " అను పదములనిచ్చి(ద్రౌపది పరముగా పద్యము చెప్పవలసినదిగా కోరినప్పుడు వారు చెప్పినది.

"అలకలు తుమ్మెదల్ మఱియు నయ్యబలా మణి చెక్కు వ(జపు
బలక పసందుగా(దనరు, వాతెఱ మంకెన పూవు సొంపులుం
గల కరియాన (ద్రౌపదికి(గల్గునె యచ్చట నల్వ చెయ్దిచే
గిలకల నీరు తోడుపని కేవలమయ్యెది రాజ్ఞికృత్యమే
(శతా.పుట.127)

తి॥వేం॥ కవులు గావించిన అష్టావధానములలో "ఆకాశపురాణము" ఒక అంశము, వేంకట గిరిలో అవధానములో రాజావారి రామేశ్వరయాత్ర అను ఆకాశపురాణములో ఆంజనేయస్తవము నిట్లు గావించినారు.

సీ॥ కావ్యనాటకముఖో (గ్రంధముల్‌చదువని
వాని కబ్బిన మంచి (ప్రతిభయేల?
చతుర భామామణీ సాంగత్యమబ్బని
వానిదౌ నవ్య యౌవనమదేల?
అష్టశతావధానాది సత్క్రియ చేయ(
దగని యాకవి కవిత్వంబునేల?
త్యాగభోగాది భాగ్యము నంద (గాలేని
ధనికుని దైనయాధనమదేల?

తే॥గీ॥ నీ పదధ్యాన సంసక్తి నెగడ నట్టి
వాని జన్మంబదేల? సౌభాగ్యమేల
యహహా! సీతాతదీయ పత్యం ప్రియుగళ
కంజసంసక్త హృదయ, యోయాంజనేయ

(శతా. పుట. 34)

తిరుపతి వేంకటకవులు గావించి అవధానములలో 'వర్ణన' అంశమున చెప్పిన పద్యములు రసవత్తరములై పాఠకుని హృదయమును రంజింప జేయునవిగా శోభిల్లుచుండును. బందరులో వారు నిర్వహించిన సంపూర్ణ శతావధానవ ములో "లక్ష్మీపార్వతుల అన్యోన్య పరిహాస వచనములు" అను విషయముపై పద్యము కోరగా వారు చెప్పినది.

సీ॥ గంగాధరుఁడు నీమగండనినవ్వంగ
వేషధరుండు నీపెన్మిటనియె
నెద్దునెక్కును నీదునెమ్మెకాఁడని నవ్వ
గ్రద్ద నెక్కును నీమగండటనియె
వల్లకాడిల్లు నీ వల్లభున కనంగ
నడి సంద్రమిల్లు నీ నాథునకనె
నాట్యంబు సేయు నీ నాయకుండన నంగు
గావించు వెన్క నీ కాంతుఁడనియె

గీ॥ ముష్టికెక్కడికేగె నీ యిష్టుఁడనిన
బలి ముఖంబున కేగెనో లలన!యనియె
నిట్టులన్యోన్యమర్మము లెంచుకొనెడి
పర్వతాంభోధి కన్యల (బ్రస్తుతింతు"

(శతా. ఉత్త. పుట 115)

నూజివీడులో జరిగిన సంపూర్ణ శతావధానములో ఒక పృచ్ఛకుడు "బైసికిల్" పై శార్దూలంలో పద్యము చెప్పవలసినదిగా కోరినప్పుడు వెలువడిన పద్యం.

"నీరుంగోరదు గడ్డినడ్గ దొక కొన్నేనుల్వలన్ వేఁడదే
వాఁడే నెక్కిన గ్రింద ద్రోయ దొకడున్ బజ్జన్ భటుండుంట చే
కూరంగా వలదెందు బైస్కిలునకుంగోపం బొకింతేని లే
దౌరా! వాజికి సాటియైన యిది విశ్వామిత్ర సృష్టంబొకో!

(శతా. ఉత్త.పుట 92)

వెంకటశాస్త్రిగారు ప్రత్యర్థులను ఢీకొనడంలోను సభను రంజింప చేయడంలోను వారికివారే సాటి వేమవరాగ్ర హారంలో (గుంటూరు జిల్లా) శతావధానం చేస్తుండగా తి॥వేం॥ కవుల శత్రువర్గంలో ఒక పృచ్ఛకుడు చింతకాయమీద పద్యం చెప్పవలసిందిగా కోరినప్పుడు వెంకటశాస్త్రిగారు పాట చెప్పారు. అప్పుడు చింతాకుపై పద్యం చెప్పండి అని కోరాడు దానిపై శాస్త్రిగారు మంచి విషయం అడుగమనగా ఆ పృచ్ఛకుడు "చీకుముల్లు" మీద పద్యం చెప్పవలసినదిగాకోరినప్పుడు "నిన్ను గాల్చిన గాని నీ బుద్ధి మానవే ఛీ" అని వెంకటశాస్త్రిగారు మొదటి పాదం చెప్పగా -"అదేమిటండి నన్ను తిడుతున్నారు" అన్నాడు పృచ్ఛకుడు. దానిపై తిరుపతి శాస్త్రి గారన్నారు కదా! నిన్ను తిట్టడం కాదయ్యా అని "ఏమందునే చీకుముల్లు" అని సీస పాదం పూరించారు. సభ అంతా సంతోషంగా గొల్లుమన్నది. ఆ పద్యాన్ని తిలకించండి.

సీ॥ "నిన్ను గాల్చిన గాని నీబుద్ధిమానవే
ఛీ యేమనందునే, చీకుముల్ల!
దొంగరీతిని దూటి దొరకకుందువు గదే
ఛీ యేమనందునే, చీకుముల్ల!
పొరలోపలంజేరి పోటు గూర్చెదు గదే
ఛీ యేమనందునే, చీకుముల్ల!
పదమాశ్రయించియు బాధపెట్టెదు గదే
ఛీ యేమనందునే, చీకుముల్ల!

తే॥గీ॥ నిన్ను మర్యాదగా జూచునేని యెట్టి
దట్టు డేనియునీదు కోతలకు లోగు
చెప్పుదెబ్బకు దప్ప నీచెడ్డ గుణము
చీకదు సుమీ, యిసీ యిసీ, చీకుముల్ల!

(శతా. ఉత్త. పుట 130)

నూజివీడు శతావధానంలో "పకోడి"పై "ఉత్సాహ" ఛందస్సులో పద్యం చెప్పుడని కోరగా వారు చెప్పినది -

"సెనగపిండియుల్లిపాయ చిన్న మిర్పకాయలుం
జొనిపి యందు నల్లమింత చౌనిపి ముద్ద చేసియున్

అనల తప్తమైన నేతియందు వైచి వేచినం
జను(బకోడి యనెడు పేర(జక్కనైన ఖాద్యమై 50

విశాఖపట్టణంలో జరిగిన అష్టావధానంలో ఒక పృచ్ఛకుడు "మీసముల వలని నష్టము" ను గూర్చి పద్యముచెప్పుడని కోరగాచెప్పినది :

సీ॥ మెసవుచో నన్నంపు మెతుకు లో (జిక్కిన
బైవారి నెల్ల నవ్వంగజేయు(
దనముద్దియను ముద్దుగొనినచో నత్తులో
దవిలి యత్యంత బాధను ఘటించు
పొడుము పీల్చిన రెల్లుకడ లంకవృద్ధిచే
సినయట్లు మాలిన్యమును ఘటించు
తేనెపానము సేయుచో నెఱుంగక కొంచె
ముగ (దగిల్చిన (దెలుపును ఘటించు
గీ॥ పొట్టి దొచుట్ట (గాల్చినప్పుడొక కొంత
కాక దగిలిన సురసుర కాలిపొడు
వాసన ఘటింప(జేయు, వహ్వా! యట్టెన
వాసి మీసాలు లౌకికాగ్రేసరులకు"

(శతా.పూ. పుట- 40)

బందరు శతావధానంలో ఒక పృచ్ఛకుడు "తిరుపతి వేంకటేశ్వరుల సఖ్యము" ను గూర్చి పద్యము చెప్పవలసినదిగా కోరగా వెలువడిన పద్యమిది.

"నీర క్షీరము లట్టు లెల్లపుడు నీ నేస్తంబు గైకొంటిమ
క్రూరంబైన మనంబుతో నిదియ మాకుందెచ్చె (గీర్త్యాధికం
బేరే న్మైత్రిని గూర్చిచెప్పుకొనుచో దృష్టాంత మౌ(గాక పెం
పారం దిర్పతి వేంకటేశ్వరుల సఖ్యం బెల్లకాలంబునన్

(శతా. ఉత్త.పుట- 116)

తిరుపతి వేంకట కవులు అష్టావధానాలలో వ్యస్తాక్షరికి ఒసగబడిన పద్యాలు కాని, పద్యభాగాలుకాని అవలీలగా ప్రకటించేవారు. ఏ భాషలో వ్యస్తాక్షరికిచ్చిన విషయమైనా వారు ప్రకటించడం విశేషం. బందరులో గావించిన అష్టావధానంలో "మిస్‌లేనియస్ బలే శ్లోకమ్" అనే పేరుతో సంస్కృతం, ఇంగ్లీషు, అరవం, తెలుగు హిందూస్థానీ భాషలలోని మాటలను కలిపి శార్దూల విక్రీడితము ఛందస్సులో ఇవ్వబడిన దానిని వారు తేలికగా ప్రకటించారు.

అది -"యూయంతత్ర సిడౌన్ తథాపి
వెరివెల్ తస్మా న్మమాయాశశీ
నోగోసార్ మదరాసు కాయకరితం
హింగేందు బాయేందునం
నింగత్వారయ నింగకూద విడుదల్ నీవాడ నంటింగదా
కిస్వాస్తే మయి బోల్తె హుం అజి సునో
తక్సీర్ నమేరే ఉపర్ (శతా. అను.పుట 152)

తిరుపతి వేంకట కవులు శతావధానాన్ని సర్కస్ తలపించేవిధంగా నిర్వహించే వారని వారి పద్యంలోనే వెల్లడౌతుంది.

"తిరుపతి యేన్గుగా(గ గడిదేఱిన శిష్యులనేకులొప్పుమై(
బొరి (బొరి రోజుచున్ దనదు పొంతను బెబ్బులి పిల్లలట్లు చూ
పఱులకు (దోప(గేల నొకపాటిది బెత్తము (బూని వేంకటే
శ్వరు(డు శతావధానమను "సర్కసు" (జూపెడి(జూడు(డో బుధుల్

(శతా. ఉత్త.పుట- 134)

తిరుపతి వేంకటకవులు శారద రూపములో భూమిపై అవతరించిన పుంభావ సరస్వతులు. అవధానముల ద్వారా ఆశుకవితలద్వారా, వైవిధ్యంగల పలు ప్రసిద్ధ గ్రంథ రచనలద్వారా, పాండవోద్యోగ విజయాది పలు నాటకముల ద్వారా వారి అజరామరమైన కీర్తి ఆంధ్ర దేశములో నలుమూలల వ్యాపించినది. పండిత పామర జనుల రసనాగ్రములపై వారి పద్యాలు నాటికి,నేటికి ఏనాటికీ తాండవిస్తూనే వుంటాయి. వారికివే నా హృదయాంజలులు.

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః

తెలుగు గజల్ ప్రయోక్త దాశరథి గజళ్ళు

డా. తిరుమల శ్రీనివాసాచార్య

పదకొండవ శతాబ్దం నుంచి అరబ్బీ, పారశీ,తుర్కీ భాషలు భారతీయ జీవనప్రవాహంలో ప్రవేశించడం మొదలైంది. ప్రారంభదశలో ఈ భాషల పదజాలం భారతీయ భాషలలోకలిసిపోయింది. ఆ తరువాత క్రమంగా మధ్యప్రాచ్య దేశాల విజ్ఞానమూ సాహిత్య రూపాలూ వచ్చి చేరాయి. అలా నూతన రూపాలు వచ్చి చేరడంతో భారతీయ సాహిత్యాలలో కూడా వినూతన ప్రయోగాలు చోటు చేసుకున్నాయి.

పద్నాలుగవ శతాబ్దంనుంచి మన ప్రాచీనాంధ్ర సాహిత్యంలో అరబ్బీ,పారశీక భాషా పదాలు చేరుతూ వచ్చాయి. ఆ కాలంలోని కొందరు కవులు అరబ్బీ పారశీ భాషలను కూడా అభ్యసించారు. పదహారవ పదిహేడవ శతాబ్దులలో గోలకొండ రాజుల పోషణలో తెలుగు దేశంలోని చాలామంది విద్వాంసులు అరబ్బీ పారశీ భాషలలోనూ దక్షిణ దేశ భాషలలోనూ పాండిత్యాన్ని సంపాదించారు. ఆధునికాంధ్రభాషలో వేలకొలదిగా అరబ్బీ పారశీ ఉర్దూ భాషా పదాలున్నాయి. ఈ అన్య దేశీయ పదాలు లేకుండా ఈనాడు తెలుగు వ్యావహారిక మాండలిక భాషలను వ్రాయడం కష్టమే.

ఆంగ్ల సాహిత్య రూపాల లాగా ఉర్దూ సాహిత్య రూపాలు తెలుగు రచయితలపై అంతగా ప్రభావాన్ని కనబరచలేదు. పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలోనూ ఇరవైయవ శతాబ్దం ప్రారంభంలోనూ గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, ఉమర్ అలీషా, రాయప్రోలు సుబ్బారావు, దువ్వూరి రామిరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు వంటి కొందరు ప్రసిద్ధులైన తెలుగు రచయితలు గజల్ రుబాయీ వంటి పారశీ సాహిత్య రూపాల చేత విశేషంగా ప్రభావితులయ్యారు. అయితే వారు పారశీక గజళ్ళను రుబాయీలను తెలుగు సంప్రదాయ ఛ్ఛందస్సులైన ఉత్పల, చంపకాది వృత్తాలలోనూ తేటగీతి, ఆటవెలదివంటి పద్యాలలోనూ ద్విపదలలోనూ, రగడల్లోనూ అనువదించారు. స్వీయమైన మౌలికమైన గజళ్ళను రుబాయీలను మాత్రం వారు సృజించలేదు.

గజల్ అనే కవితాప్రక్రియ మొదట అరబ్బీ భాషలో ప్రభవించి, పారశీలోకి ప్రవేశించింది. అక్కడనుండి తుర్కీ, ఉర్దూ భాషలలోకి వ్యాపించింది. 'గజల్' అనేది అరబ్బీ భాషాపదం. ఈ పదాన్ని పారశీ ఉర్దూభాషలు స్వీకరించాయి. ఆ తరువాత, అనేక భాషలు ఆ పదాన్ని అనువదించకుండా అలాగే వాడుకున్నాయి. గజల్ అంటే ప్రియురాలితో సల్లాపం అని అర్థం. సాహిత్య రూపంగా ఈనాడు గజల్ అంటే సౌందర్యాన్నీ, సంయోగ వియోగాలనూ ఆహార పానీయాలనూ కీర్తి అపకీర్తులనూ పరిహాస ఉపదేశాలనూ మిథ్యా సత్యాలనూ అన్నింటినీ పొదుగుకున్న కవిత్వం. లయాత్మకమైన సౌందర్య మాధుర్యాలూ, భావప్రకటనలో సంక్షిప్తత, వస్తు వరణంలో స్వేచ్ఛ - అనే లక్షణాల వలన గజల్‌కు కవితా రూపంగా జనాదరణమూ ప్రశస్తీ ఏర్పడ్డాయి.

ప్రారంభదశలో అరబ్బీ భాషలో ప్రయుక్తమైనప్పుడు గజల్ ప్రక్రియలోని ప్రధాన వస్తువు శృంగారమే. గత సహస్ర సంవత్సరాలుగా అనేకవిప్లవాలు, సంస్కరణలు, వినూత్న కల్పనలు, విభిన్న వ్యక్తిత్వాలు, ఇంకా అనేక విషయాలు మానవసమాజంలో ఎన్నో మార్పులు తెచ్చాయి. మారుతున్న ఈ పరిస్థితుల వల్ల గజల్ వస్తువులో కూడా మార్పులు వచ్చాయి. ఫలితంగా గజల్‌లో శృంగారానికి బదులుగా సాంఘిక సంస్కరణలు, స్వేచ్ఛా ప్రియత్వం, అధిక్షేపం, హాస్యం, మతబోధ, ముఖస్తుతి, విద్వేషం మున్నగునవి ప్రవేశించాయి. ఇంతటి వస్తు వైవిధ్యంవల్ల గజల్ అంటే కవిత్వమే, కవిత్వమంటే గజలే అన్నంతగా ప్రశస్తి ఏర్పడింది. ఇరవైయవ శతాబ్ది ప్రారంభంలో ఉర్దూ కవులు తమ వైయక్తిక అభిరుచులకు అనుగుణంగా గజల్‌ను ప్రయోగించారు. ఉర్దూ హిందీ భాషలు ఈ శక్తిమంతమైన గజల్ ప్రక్రియ చేత సుసంపన్నమైనాయి. చాలా గజళ్ళలో భారతీయ స్వాతం

త్ర్యోద్యమం, భారతీయుల ఆశయాలు, ఆకాంక్షలు, మాతృ దేశాభిమానం వంటి అనేకాంశాలు చోటు చేసుకున్నాయి.

సంస్కృతం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో విద్వాంసుడైన మహాకవి దాశరథి ఉర్దూ గజల్ అవతరణ వికాసాలనూ సాహిత్యంలో దాని ప్రాముఖ్యాన్నీ ప్రభావాన్నీ గురించి గంభీరంగా విస్తృతంగా అధ్యయనం చేశారు. సంస్కృతాంధ్ర సంప్రదాయ సాహిత్య విజ్ఞానానికీ ఉర్దూ హిందీ ఆంగ్ల భాషా సాహిత్యాల ఆధునిక పరిజ్ఞానానికీ దాశరథి కవిత్వం ఒక సరస సంగమం. వారి కవిత్వం అనేక సంపుటాలుగా వెలువడిన విషయం సహృదయ విద్వల్లోకానికి తెలుసు. బహుభాషా వేత్తగా మహాకవిగా వారు ఉర్దూ, పారశీక, హిందీ, ఇంగ్లీషు భాషలనుండి చాలా రచనలు ఆంధ్రీకరించారు. గజల్ ప్రక్రియను 1966లో మొట్టమొదటిసారిగా తెలుగులో ప్రవేశపెట్టారు.

చిన్న నాడే దాశరథి ఆనాటి అధికార భాష అయిన ఉర్దూలోనే విద్యాభ్యాసం చేశారు. జక్కీ సాహెబ్ అనే అధ్యాపకుని ద్వారా గాలిబ్, ఇక్బాల్ మహాకవుల కవిత్వాలను విని, వారిపట్ల ఎనలేని అభిమానాన్ని పెంచుకున్నారు. గాలిబ్ శృంగార కవిత్వమూ ఇక్బాల్ విప్లవ కవిత్వమూ దాశంథి హృదయంపై ప్రగాఢమైన ముద్ర వేశాయి. ఈ ఇద్దరి కవిత్వ వ్యక్తిత్వానికి దాశరథి కవిత్వ వ్యక్తిత్వాలకు సహజమైన సామ్యాలు కూడా ఉన్నాయి. తొలిదశలో దాశరథి గజల్ కవితా సంప్రదాయానికి సార్వభౌముడైన గాలిబ్ గజళ్ళలోని తనకు నచ్చిన మణిపూసల వంటి కొన్ని షేర్లను ('షేర్' అంటే రెండు పాదాల కవిత-ద్విపదలాగా) గ్రహించి, వాటిలోని భావాన్ని క్లుప్తత చెడకుండా రెండుపాదాలలోనే ఇమిడ్చారు. అత్యవసరమనుకున్న చోట మాత్రం నాలుగు పాదాలుగా పెంచారు. అనువాదంలో ఆటవెలదిని, తేటగీతిని వాడుకున్నారు. ఎక్కడో ఒకటి రెండుచోట్ల ద్విపదను, రగడను ఉపయోగించుకున్నారు. అలా అనువదించిన కవితలను 'గాలిబ్ గీతాలు' అనే గ్రంథంగా 1961లో ప్రకటించారు. ఉత్తమ అనువాద కవితగా ఈ గ్రంథం 1965లో ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారి బహుమతిని కూడా అందుకుంది.

దాశరథిగారు గాలిబ్ గజళ్ళనే కాక గాలిబ్ సమకాలికుడైన మీర్ మహాకవి ఉర్దూ గజళ్ళలోని కొన్ని షేర్లను కూడా ఆటవెలదులుగా తేటగీతులుగా ద్విపదలుగా ముత్యాలసరాలుగా అనువదించారు. 1966లో ప్రచురితమైన 'కవితా పుష్పకం' లోని మీర్ కవితా మాధుర్యం' అనే కవితా ఖండికను ఇందుకు ఉదాహరణంగా గ్రహించవచ్చు.

గాలిబ్, మీర్‌వంటి మహాకవుల కవితా సౌందర్యాన్ని దర్శించిన తరువాత దాశరథిగారికి ఉర్దూ గజల్ స్వరూపాన్ని తెలుగులో ప్రవేశింపచేయాలనే సంకల్పం కలిగింది. మలిదశలో వారు స్వీయ భావసంపదతో కవితాత్మకంగా ఉర్దూగజల్ నియమానుసారంగా మౌలికమైన తెలుగు గజళ్ళను రచించారు. అలా కొన్ని గజళ్ళను మంజరి, వల్లరి అనే పేర్లతో 1966లో ఆంధ్ర ప్రభ సచిత్రవారపత్రికలో వరుసగా వెలువరించారు. 1966 డిసెంబర్‌లో వెలువడిన దాశరథిగారి 'కవితా పుష్పకం' అనే కవితా సంపుటిలో ' కామన' అనే శీర్షికతో ఒక గజల్ ప్రచురితమైంది. అయితే దాశరథి గారు దాన్ని గజల్ అని చెప్పలేదు. ఇలా వివిధ పత్రికలలో ప్రచురితాలైన గజళ్ళను దాశరథిగారు 1984లో 'జ్వాలా లేఖిని' అనే సంపుటిలో రెండవ భాగంగా 'సాఖీనామా' అనే పేరుతో ప్రచురించారు. ఈ సంపుటిలో మొత్తం తొమ్మిది గజళ్ళున్నాయి. 5.10.1966నాటి ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురితమై ఏ కవితా సంపుటిలోనికి ఎక్కని దాశరథి గారి ఒక గజల్ లోని 'మఖ్తా' ఉన్న షేర్‌ను మాత్రం డా॥కె. గోపాలకృష్ణ రావుగారు 'తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము'' అనే తమ గ్రంథంలో (పుట. 142) ఉదాహరించారు. ఆ పంక్తులివి.

"ఎన్నడైనా ఎప్పుడైనా నిన్ను గూర్చే పాడెద
అంతకంటే 'శరథి' గళమున ఏరాతనా లేదులే'

ఇలా ఈ గజళ్ళ నన్నింటిని కలుపుకుంటే దాశరథి గారు మొత్తం పదకొండు గజళ్ళను రచించినట్లు తెలుస్తున్నది.

ఈ సందర్భంలో తెలుగుగజల్ ప్రయోక్తఅయిన దాశరథిగారిని గూర్చి డా॥ కె. గోపాలకృష్ణరావు గారు వ్రాసిన ఈ పంక్తులు పేర్కొనదగినవి. "అచ్చమైన గజల్ స్వరూపమును తెలుగుమూసలో దింపిన గౌరవము, దాశరథి గారికి లభించుచున్నది." (తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము - పుట 110, ప్రచురణ 1968)దాశరథిగారే స్వయంగా 'తమ జ్వాలాలేఖిని' (1984) కవితా సంపుటిని గూర్చి వ్రాస్తూ ఇలా అన్నారు "నేను గజల్ రుబాయీ ప్రక్రియలను ఉరుదూ హిందీ పారసీ , స్పానిష్ భాషలలో అధ్యయనం చేసి, పరిశోధన జరిపి, తెలుగులో కొంత విస్తృతంగా ఈ ధోరణిలో రచన చేశాను", "ఈ సంపుటిలోని కవితలు వివిధ పత్రికల్లో ప్రచురితములు".

ఇప్పటికి తెలిసినంతవరకు దాశరథిగారు 1966లో రచించిన "రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడిచిరానా

నీచిన్ని నవ్వుకోసం స్వర్గాలు గడిచిరానా" అనేదే మొట్టమొదటి తెలుగుగజల్‌గా భావించవచ్చు. ఎందుకంటే ఈ గజల్‌నే డా. కె గోపాలకృష్ణరావుగారు ప్రప్రథమంగా తమ గ్రంథంలో ఉదాహరించారు. అంతే కాకుండ, 'జ్వాలాలేఖిని' సంపుటిలో ప్రచురితమైన గజళ్ళలో కూడా ఈ గజలే మొదటిది. ఈ రెండు కారణాలు "రమ్మంటే చాలుగానీ" అనేది మొట్టమొదటి తెలుగు గజల్ అనడానికి బలాన్ని చేకూరుస్తున్నాయి.

'గజల్' అనే శబ్దానికి అర్థం "ఇంతులతో మంతనాలు" అన్నారు దాశరథి. "గజల్" అంటే ప్రియురాలితో ఏకాంతమున జరిపే ప్రణయ సల్లాపమని నైఘంటికార్థం" అని వివరించారు ఉర్దూ భాషా సాహిత్యవేత్తలు శ్రీ సదాశివగారు - "ఉర్దూకవుల కవితా సామగ్రి - కొందరు సుప్రసిద్ధ కవులు" అనే గ్రంథంలో. (పుట.3, ప్రచురణ. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ 1970) "గజలంటే అనేకార్థాలున్నా ప్రియురాలితో సల్లాపం" - అని వ్రాశారు మహాకవి ఆచార్య సి.నారాయణరెడ్డి గారు - తమ 'తెలుగు గజళ్ళు' సంపుటిలో.

గజల్ సంగీత సాహిత్యాల సరస సమ్మేళనం. ప్రణయ కవితారీతి అయిన గజల్‌లోని వస్తువు విప్రలంభ శృంగారమే - మొదట్లో. అందుకే "మానవుని మధుర వేదనకు ఇది ప్రతీక" - "ఇందులోని గులాబీలు బుల్బులు పిట్టలు, ఒకానొక మధుర భావనకు సంకేతాలు. అట్లే మధుశాల, మధువందించే 'సాఖి' జీవితవైభవానికి చిహ్నాలు" అని వివరించారు దాశరథిగారు తమ 'జ్వాలా లేఖిని' లో.

"కవితా ప్రపంచంలో గజల్ ఒక అందాల పూలతోట. వందల సంవత్సరాలుగా అరబ్బీ పారసీ ఉర్దూ కవులు ఈ తోటను తమ గుండెలు పిండి పెద్దచేశారు. ఈ తోటలోని పూల గుబాళింపు విశ్వాన్నే ఉర్రూత లూగించింది " అని డా॥దాశరథిగారూ, " ఉర్దూభాషలో గజల్ ఒక కమనీయ కవితా లహరి; ఒక గులాబీల గుళుచ్చం, ఒక మత్తకోకిల రసాత్త కూజితం" అని మహాకవి డా॥ సి. నారాయణరెడ్డిగారూ గజల్ కవితా సౌందర్యాన్ని అభివర్ణించారు.

గజల్ మాత్రా గణబద్ధమైన గేయకవితా ప్రక్రియకు సంబంధించింది. గజల్ ఛందాన్ని గూర్చి వివరిస్తూ శ్రీ సదాశివగారు- "కొన్ని మాత్రలున్న పంక్తిని (పాదద్వయాన్ని) బహర్ అంటారు. 'ఫేలన్ ఫేలన్ ఫేలన్‌ఫే' ఇదొక బహర్', 'ఫాయిలాతున్ ఫాయిలాతున్ ఫాయిలాతున్' ఇదింకొక బహర్. 'మఫూలన్ మఫూలన్ మఫూలన్ మఫూలన్' ఇది మరొక బహర్. ఇంకా ఇలాటి బహర్‌లు కొన్ని వున్నవి. ఏ బహర్‌లోనైనా గజల్ చెప్పవచ్చు. ఏదేని ప్రత్యకమైన బహర్‌లోనే చెప్పవలెనన్న నియమం లేదు" అని అన్నారు. బహర్‌ను గేయచ్ఛందస్సులోని గతివిశేషంగా భావించవచ్చు ననుకుంటాను. అంటే త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్రగతుల్లో ఏ గతిలోనైనా గజల్‌ను రచించవచ్చునని భావం. గజల్‌లోని పాదాలన్నింటిలోనూ మాత్రా సంఖ్యా సమత్వం ఉండాలి. గజల్ పాట కాబట్టి, గజల్ లోని మొదటి రెండు పాదాలను పల్లవిగా భావించవచ్చు. చెప్పదలచుకున్న భావం ఈ రెండు పాదాలలో ముగిసి తీరాలి. పాదాన్ని 'మిస్రా' అంటారు. రెండు పాదాల కవితను 'షేర్' అంటారు. షేర్‌ను పాటలోని 'చరణం'గా అనుకోవచ్చు. అంటే - ప్రతిషేర్ రెండు సమభాగాలుగా

విరుగుతుందని అర్థం. గజల్‌లోని మొదటి షేర్‌ను 'మత్లా' అంటారు. గజల్‌లో ఐదు మొదలుకొని ఎన్ని షేర్ లైనా ఉండవచ్చు. సాధారణంగా పదిహేను షేర్లను మించవు. అయితే ముప్పయి ఒక్క షేర్లున్న గజల్ కూడా ఉన్నట్లు గజల్ చరిత్ర చెపుతున్నది. గజల్ మొదటి షేర్ అయిన ' మత్లా'లోని రెండుపాదాలకూ చివర ఖాఫియా, రదీఫ్ అనే అంత్య ప్రాసలుంటాయి. మిగతా షేర్లలో రెండవ మిస్రాకు (పాదానికి) మాత్రమే ఈ అంత్య ప్రాసల నియమం ఉంటుంది. గజల్‌లోని చిట్ట చివరి షేర్‌ను 'మఖ్తా' అంటారు. అందులో కవి తన 'తఖల్లుస్' ను తెలుపుకుంటాడు. 'తఖల్లుస్' అంటే కవి కలంపేరు లేదా కవి నామముద్ర. ప్రతిషేర్‌లోని చివరి పదంకంటె ముందున్న పదం 'ఖాఫియా' అంటారు. అంటే అంత్య ప్రాసకు ముందుండే మరొక ప్రాసపదం అన్న మాట. ఈ ఖాఫియా పదాలు సమానమైన ఉచ్చారణ కలిగి ఉండాలి. షేర్‌లోని చిట్టచివరి పదాన్ని 'రదీఫ్' అంటారు. రదీఫ్ మాత్రం అదే పదమై ఉండాలి. అందుకే గజల్ కవికి ఖాఫియాలు దొరకడం కష్టం. వాటికి సముచితమైన రదీఫ్‌ను జోడించడం మరీ కష్టం. అందువల్ల గాలిబ్‌వంటి కొందరు ఉర్దూ గజల్ కవులు రదీఫ్ లేకుండా ఖాఫియా నియమంతోనే షేర్లను పూర్తి చేశారు. "రదీఫ్ చేరుటవలన తబలావాద్యంలో ముక్తాయింపు లాంటిది ఖాఫియా. లాస్యంలో నూపుర ఝుంకారంలాంటిది రదీఫ్" అని అంటూ గజల్‌లోని ఖాఫియా రదీఫ్‌ల సంగీత ప్రాముఖ్యాన్ని వర్ణించారు శ్రీ సదాశివగారు. గజల్‌లో ఏషేర్ భావం ఆ షేర్ కే. ఒక షేర్‌తో మరో షేర్‌కు ఖాఫియా సంబంధమే కాని అర్థ సంబంధముండదు. అందుకే గజల్‌లో ఒకే విషయం చెప్పాలనే నియమం లేదు.

గజల్ కవితలోని ప్రధాననియమం క్లుప్తత. అందుకే ఆచార్య సి. నారాయణరెడ్డిగారు గజల్ స్వరూప స్వభావాలను వివరిస్తూ -"సరస భావన చమత్కార ఖేలన, ఇంపూ కుదింపూ గజల్ జీవ లక్షణాలు" - అని చక్కగా చెప్పారు. తమ 'తెలుగు గజళ్ళు' సంపుటిలో. అందుకే రససిద్ధులైన గజల్ కవులు సంక్షిప్తత కోసం సముచిత శబ్ద ప్రయోగాన్నీ ధ్వనినీ ఆశ్రయిస్తారు. గజల్ వ్రాయడమంటే రవ్వను చెక్కడంలాంటిదనీ బిందువులో సింధువును కుదించటంలాంటిదనీ అన్నారు దాశరథి గారు.

గజల్‌లో వచ్చిన మార్పులను వివరిస్తూ దాశరథి గారు -"కాల ప్రవాహపు రాపిడి వలన గజల్ ఎన్నో మార్పులకు లోనైంది. వాయులీనంనుండి మన సంగీతం వెలువడినట్లు గజల్‌లో జాతీయత తొణికిస లాడింది. గులాబీ, బుల్బులి - స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంకేతాలైనవి. 'శక్తి కొలది సాక్షాత్కార'మన్నట్లు గజల్‌లో కనరాని భావచిత్రం గానీ వినరాని ధ్వనిగానీ లేదు" అని అన్నారు. "అది జోల పాడుతుంది; జ్వాల లేపుతుంది" - అని ఒక్కమాటలో గజల్ వస్తు విస్తృతిని కవితాత్మకంగా చెప్పారు మహాకవి సి. నారాయణరెడ్డి గారు.

దాశరథిగారు రచించినవి మనకిప్పటికి లభించినవి పదకొండు గజళ్ళే అయినా వాటిలో వస్తువైవిధ్యానికీ భావ సౌందర్యానికీ కొరతలేదు. వారి గజళ్ళల్లో శృంగారం, ఆశావాదం, దేశభక్తి, విప్లవ చైతన్య ప్రబోధం, శాంతి కాముకత , ధర్మరక్షణం, తాత్త్వికత, స్వేచ్ఛాకాంక్ష, విషాద స్మృతి వంటి - అనే అనేకాంశాలున్నాయి.

'కుపిత ప్రణయిని' అనే గజల్‌లోని –
"మమత పొంగు నవ మధువు మాకిడ కున్నా
మధువు తడికి మెరిసే నీపెదవులె చాలు"
'కామన' అనే శీర్షిక గల గజల్ లోని–
"వలపునై నీ హృదయసీమల నిలువవలెనని ఉన్నది
పిలుపునై నీ అధర వీధుల పలుకవలెనని ఉన్నది"
"చైత్రమాస నవోదయమ్మున చల్లగాలికి ఆడుతూ
పువ్వునై నీ కొప్పులోనే నవ్వవలెనని ఉన్నది"
"నన్ను చూచీ కోపగించే కన్నులందలి కెంపునే
తారహారముగా గళమ్మున దాల్చవలెనని ఉన్నది"
"స్నేహసూత్రము పడుగుపేకల జేరి రెపరెపలాడగా
పైటనై నీ ఎడదపైనే వ్రాలవలెనని ఉన్నది" –

అనే చరణాలలోని ప్రణయ భావసౌందర్యం రమణీయం. వలపుగా ప్రేయసి హృదయ సీమలో

నిలవాలనీ, పిలుపుగా ఆమె అధరవీధులలో పలుకాలనీ, అలాగే ఆమె కొప్పులో పువ్వుగా నవ్వాలనీ, ఆమె ఎడదపై పైటగా వాలాలని ప్రియుడు ఆకాంక్షించడం ఎంతో సరసంగా ఉంది. కుపిత ప్రేయసి కన్నుల్లోని అరుణిమను ప్రేమికుడు తన కంఠంలో హారంగా ధరించాలని ఉవ్విళ్ళూరడం హృద్యంగా ఉంది. 'జ్వాలాలేఖిని' లోని ఎనిమిదవ గజల్‌లోని -

"ఎలమావి కొమ్మల కోయిల పలుమారు ఈలలు వేయుట

పొదరింట కోరిక పండుట అవి నీకు జ్ఞాపక మున్నవా"

అనే చరణం సంయోగ శృంగారాన్ని ధ్వనిమంతంగా సూచిస్తున్నది.

"రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడిచిరానా

నీ చిన్నినవ్వుకోసం స్వర్గాలు గడిచిరానా" -- అనే గజల్‌పల్లవీ, అందులోని

"పగబూని కరకువారు బంధించి ఉంచినారు

ఏనాటికైన గానీ ఈ గోడపొడిచి రానా" అనే చరణమూ బానిస అయిన వ్యక్తి వియోగ శృంగారాన్ని సూచిస్తూనే మరోవైపు ఆ వ్యక్తి స్వేచ్ఛా ప్రియత్వాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

'జ్వాలాలేఖిని' లోని మూడవ గజల్‌లో బాలికలను రకరకాలుగా వర్ణించారు దాశరథిగారు -

"ఎవ్వరు మీరు? బాలికలా?

ఎగిరే దీప జ్వాలికలా?" అనే గజల్‌లోని

"శరధి రచించేనాటికల

మురిపించే నవచూలికలా? - అనే చివరి చరణం - 'మఖ్తా' దాశరథి నాట్యశాస్త్ర పాండితీ ప్రౌఢినీ భావనా బలాన్నీ చాటుతున్నది. 'చూలిక' అంటే ఒక నాటకాంగం. అర్థోప క్షేపకాలైన విష్కంభాదులలో చూలిక ఒకటి. తెర లోపలినుండి పాత్రలు సూచ్యార్థాన్ని సూచించడాన్ని చూలిక అంటారు. ఇలా బాలికలవర్ణనలో ఉల్లేఖా లంకారాన్ని ప్రయోగించారు దాశరథి.

"ముళ్ళనీడల్లో పువ్వులున్నాయి

నాదు కన్నీట నవ్వులున్నాయి" - అనే గజల్ పల్లవీ, ఇందులోని

"యాత్ర నడిదారి ఆగిపోనేలా?
నీలగగనాన దివ్వెలున్నాయి"
"ఎగిరి పోలేక వగపునీకేలా?

గుండెలో ఎన్ని గువ్వలున్నాయి" - అనే చరణాలూ దాశరథి ఆశావాదానికి అందమైన ఉదాహరణాలు.

"మండిన గుండెల యెండిన పెదవుల మధుకణ మొక్కటి చిలకవులే

త్రావినవారే మరిమరి త్రావగ వలదనియైనా పలక వులే"

అనే గజల్ పల్లవి, సమాజంలోని నిర్ధనిక ధనిక వ్యత్యాసాలను ఎత్తి చూపుతుంది. ఈ గజల్‌లోని -

"మాయబావిలో కూలినవారిని లాగే దెవ్వరు పైపైకి

జ్ఞానపు త్రాటిని పరుగెత్తించెడి సత్యము పేరిటి గిలకవులే"

అనేచరణం తాత్త్వికతకు దర్పణమై భాసిస్తున్నది. కవి భావించిన ప్రేయసి, ఒక దివ్యశక్తికీ ఈశ్వరత్వానికీ సంకేతంగా నిలుస్తున్నది.

'కన్నీట తడిసిన గజల్' అనే శీర్షికగల గజల్ ఒక స్మృతి కవిత. బంగ్లాదేశ్ అధ్యక్షుడు ముజీబ్ మరణ వార్తను విని, తమ దుఃఖాన్ని ఈ గజల్‌లో వ్యక్తం చేశారు దాశరథిగారు. 1972లో తూర్పు పాకిస్తాన్ తిరుగుబాటు చేసి బంగ్లాదేశ్‌గా అవతరించింది. షేక్ ముజిబుర్ రహమాన్ ప్రధానిగా ఆ తర్వాత అధ్యక్షునిగా బంగ్లాదేశ్‌ను పరిపాలించారు. 1975లో ఆంతరంగిక కల్లోలాల ఫలితంగా సకుటుంబంగా ముజిబుర్ రహమాన్ హత్య గావించబడ్డారు. ఈ దారుణ హత్యవల్ల దాశరథి కవిహృదయం కరుణరసప్లావితమై ఈ గజల్‌ను సృజించింది. దాశరథి విశ్వమానవతా వాది. ఎక్కడ అన్యాయం జరిగినా ఆతని హృదయం స్పందిస్తుంది. ఇక ఈ గజల్ 'మఖ్తా' ఇది-

"నాడు నేను నిద్దురలో పీడకలలు చూశాను
మధురభావ వాహినిలో విషపుటలలు చూశాను" ఈ గజల్ లోని -
"పీడకలలు నిజమాయె వీరవరుడు పడిపోయె
అతని ఇంటి వాకిలిలో తెగిన తలలు చూశాను"
"చేదునిజం చూశాను వేదనలో మునిగాను
కంటినీట తడిసిన ఈ ఒంటి గజలు వ్రాశాను"

-అనే చరణాలు ముజీబ్ విషాదమరణాన్ని దాశరథి హృదయ వేదనను అద్దంలోవలె చూపిస్తున్నాయి.

దాశరథి గజళ్ళలో అనేక సూక్తులు మౌక్తికాలుగా ప్రకాశిస్తున్నాయి. ఉదాహరణకు - 'చెల్లు' అనే గజల్‌లోని-

"దివ్వెలు వెలిగించగానె మసకలు చెల్లు
నవ్వులు వొలికించగానే అలకలు చెల్లు' అనే పల్లవీ
"అంది అందనట్లుంటే అనురాగాలు
అనుక్షణం చెంతవుంటే అంతాచెల్లు" అనే చరణాలూ. సార్వకాలిక సూక్తులే.

దాశరథి గజళ్ళలో ఆరవగజల్ 'నాపతా' చాలా పెద్దది. ఇందులో పన్నెండు షేర్లున్నాయి. ఒక్కొక్క షేర్‌లో ఒక్కొక్కభాగం మనోజ్ఞంగా విరిసి ఉంది. ఈ గజల్ దాశరథి మహనీయ కవిత్వ వ్యక్తిత్వాలకు మణి దర్పణంగా భాసిస్తున్నది. నిజంగానే ఆ మహాకవి 'పతా'ను (అంటే విలాసాన్ని - చిరునామాను) వివ రిస్తున్నది కవితాత్మకంగా ! ఈ గజల్‌లోని 'మత్లా' ఇది -

"ఇన్ని నాళ్ళకు తెలుపమంటివి ఎందుకొరకే నాపతా
నిన్ను బోలిన కఠినులకు నేనెన్నడైనా లాపతా"

ఇక ఇందులోని చరణాలు తిలకించండి.

"అడిగినప్పుడు చెప్పకుండుట ఎడదగల నా కొప్పదు
ఏ సమయమున నేనెక్కడుందునొ వ్రాసుకోవే నా పతా"
-

ఇందలి 'ఎడదగల నా కొప్పదు" - అనే మాటలు దాశరథి హృదయవాదాన్ని తెలుపుతున్నది.

"వేగుచుక్కను నిద్రలేపీ విద్య నేర్పే కోర్కెతో
వీణతీగను మీటబోయే చెలి నఖాగ్రము నాపతా"
అనే చరణం దాశరథి వైతాళికత్వాన్ని చాటగా, -

"తెల్లవారే వేళ కమలము కళ్ళు విప్పేటప్పుడు
బాలభానుడు తొంగి చూచే ప్రాగ్దిశాగ్రము నాపతా" అనే షేర్ వికాసశీలమైన దాశరథి చైతన్యధారను ప్రకటిస్తున్నది.

"పానశాలావరణమందున ప్రాణదానము సేయగా
మధువు నొసగే 'సాఖి'లో చనరోచిరగ్రము నాపతా"
- అనే షేర్ దాశరథి శృంగార రసికతను చాటుతున్నది. 'సాఖి లోచనరోచిరగ్రము' అనే సమాసం దాశరథికి గల శబ్ద శక్తిని మెరిపిస్తున్నది.

"శిశిర రాక్షసి గుండెలందున చిగురుజొంపము లూగగా
పాటపాడే పరభృతము గలనవకుజాగ్రము నా పతా" - అనే

చరణం దాశరథి సృజనాత్మకతనూ జగద్ధిత సంకల్పాన్నీ సూచిస్తున్నది.

"కరకు రాళ్ళే కరగునట్లుగ కవిత వ్రాసే వేళలో
కాంతి విరిసీ శాంతి కురిసే కవి కరాగ్రము నాపతా"
- అనే చరణం దాశరథి కవితాశక్తినీ శాంతి ప్రియత్వాన్నీ అభివ్యక్తం చేయగా,

"లోక కంటకుడైన దైత్యుని పీక ముక్కలు సేయగా
ముక్కు సూటిగ ఎక్కుపెట్టిన హరి శిఖాగ్రము నాపతా"

అనే పంక్తులు దాశరథి ధర్మదృక్పథాన్ని ధ్వనింప జేస్తున్నవి. 'హరిశిఖాగ్రము' అనే సమాసం పాండితీ మండితం. హరి, అంటే ఇక్కడ శ్రీరామచంద్రుని, శిఖాగ్రము అంటే ఆగ్నేయ బాణాగ్రము - అంటే దాశరథి శిఖాగ్రం అన్నమాట. ఈ సందర్భంలో లోక కంటకుడైన దైత్యుడు రావణుడే. ఆ రావణుని పాలిటి దాశరథి దాశరథే అన్నమాట. ఈ మాటలు-

"దానవుల నంతమొందింప నేను కూడ
రామకృష్ణావతార ధారణ మొనర్తు" -

అన్న దాశరథి మాటలను స్మృతికి తెస్తున్నాయి.

"విప్లవములు వర్ధిల్లు వేళల వీరవర్యుల కనులలో

ధగధగాయిత నవ దవానల కీలికాగ్రమునాపతా"

అనే చరణం దాశరథి స్వాతంత్ర్య విప్లవ చైతన్యాన్ని వ్యక్తం చేయగా -

"మంచుకొండల పొంచి చూచే వంచకుల నెదిరించెడి

భరత సేనా పౌరుషాంచిత కేతనాగ్రము నాపతా" అనే

చరణం దాశరథి దేశభక్తికి సాహిత్య దర్పణం. దాశరథి మహాకవేకాదు, నిజాంనవాబు నెదిరించి, తెలంగాణ నిగళాలు పడగొట్టిన స్వాతంత్ర్య సమర యోధుడు కూడా. 'రుద్రవీణ' (1950) కావ్యాన్ని తెలంగాణాకు అంకితం చేయడం, 'జ్వాలాలేఖిని' (1984) కవితా సంపుటిని 'ప్రేమాంజలి'గా స్వాతంత్ర్య సమరయోధులకు అంకితం చేయడం దాశరథి అచ్చమైన దేశభక్తికి అక్షర తార్కాణాలుగా భావించవచ్చు. ఈ విధంగా దాశరథి గజళ్ళలోని కవితా వైభవం వస్తు విస్తృతీ సహృదయులను అలరింపజేస్తున్నవి.

దాశరథి గజళ్ళలోని ఛందోవైవిధ్యం విప్పారి కని పిస్తుంది. ఉర్దూ గజళ్ళలోని నియమాలను తెలుగు గజళ్ళల్లో పాటించారు దాశరథి. ఆతని గజళ్ళు గేయ గతులైన త్రిశ్ర, చతురశ్ర, ఖండ, మిశ్రగతుల్లో నడిచాయి. పాదాలలో తొంబైశాతం యతియోప్రాస యతియో పాటింపబడ్డాయి. ఉదాహరణకు - 'రమ్మంటే చాలుగానీ' అనే గజల్ ఖండగతిలో, 'చేరువలో లేకున్నా' అనే గజల్ త్రిశ్రగతిలో, "ఎవ్వరు మీరు? బాలికలా?"- గజల్ చతురశ్ర గతిలోనూ "ఇన్నినాళ్ళకు తెలుప మంటివి" అనే గజల్ మిశ్రగతిలోనూ సాగాయి.

గజళ్ళలోని పాదాలలో సాధారణంగా మాత్రా సంఖ్యా సమత్వాన్ని పాటించారు. కొన్ని పాదాలలో ఒకటో రెండో మాత్రలు తక్కువగానూ, ఎక్కువగానూ చోటు చేసుకున్నాయి. అర్థదృష్టితో సంగీతదృష్టితో లఘువును గురువుగా మార్చడంవల్ల, గురువును లఘువుగా మార్చడం వల్లనూ మాత్రా సమత్వం సమ కూరుతుంది. దాశరథిగారికి అర్థదృష్టి అధికం. ఒక మాత్ర ఎక్కువైతే లెక్క చేయరు. ఛందస్సు కోసం సుశబ్దాన్ని నిర్లక్ష్యం చేయరు.

దాశరథి గజళ్ళలో షేర్లు (చరణాలు) 5 నుండి 12 వరకు ఉన్నాయి. గజళ్ళలో మత్లా, మఖ్తా, నియమాలను పాటించారు. 'మఖ్తా'లో తఖల్లుస్ (కలంపేరు)ను ప్రయోగించారు. దాశరథిగారి తఖల్లుస్- శరథి'. వారి పదకొండు గజళ్ళల్లో మూడింటిలో మాత్రమే తఖల్లుస్‌ను ప్రయోగించారు.

ఇక గజల్‌లోని షేర్ చివర ఉండే అంత్య ప్రాస నియమాలైన ఖాఫియా రదీఫ్‌లను పాటించారు - దాశరథి. ఉదాహరణకు -

"రమ్మంటే చాలుగానీ రాజ్యాలు విడిచి రానా

నీ చిన్ని నవ్వుకోసం స్వర్గాలు గడిచిరానా"- అనే గజల్‌లోని చరణాలలో "నడిచి రానా, తుడిచి రానా, ముడిచిరానా, పొడిచి రానా" - అనే ఖాఫియా, రదీఫ్‌లు పాటించారు. వీటిలో నడిచి, తుడిచి, ముడిచి, పొడిచి అనేవి ఖాఫియాలు. 'రానా' అనేది రదీఫ్. ఇలాగే 2,4,5,7, 9 సంఖ్యగల గజళ్ళలోనూ, 'కామన' అనే గజల్ ('కవితా పుష్పకం' లోనిది) లోనూ ఇవి పాటింపబడ్డాయి.

ఖాఫియా లేకుండ ఒక్క రదీఫ్‌నే వాడిన గజల్ కూడా ఉంది. ఉదాహరణకు - ఎనిమిదవ గజల్‌లోని

- "అలనాడు చేసిన బాసలు అవి నీకు జ్ఞాపక మున్నవా

చెలికాని తీయని సైగలు అవి నీకు జ్ఞాపకమున్నవా"

అనే షేర్‌ను గమనించవచ్చు. ఈ గజల్‌లో ప్రతిషేర్ చివరకు 'అవి నీకు జ్ఞాపకమున్నవా'అనే మాటలే వస్తాయి - మన శతక పద్యాలలోని 'మకుటం'లాగా ఈ మాటనే రదీఫ్‌గా భావించాలి. ఇందులో ఖాఫియా లేదన్నమాట.

కొన్ని గజళ్ళలోని ఖాఫియాల స్వరూపంలో కొన్ని సందర్భాలలో కొంత స్వేచ్ఛను కూడా తీసుకున్నారు దాశరథిగారు. ఉదాహరణకు -

"దివ్వెలు వెలిగించగానె మసకలు చెల్లు

నవ్వులు వొలికించగానే అలకలు చెల్లు" అనే గజల్‌లో మసకలు, అలకలు, ఖాఫియాలు, చెల్లు అనేది రదీఫ్. అయితే మొదటి షేర్ చివర 'వలపులు అన్న ఖాఫియాను ప్రయోగించి, తర్వాతి షేర్లలో మాత్రం పలకరింపులు, పాయిలో, త్రుటిలో, బింకం, అంతా అనే ఖాఫియాలను వాడారు. వీటిలో సమానోచ్చారణ లేదు. అలాగే 9వ గజల్‌లో -కలలు, అలలు, తలలు, శిలలు, మొలలు అనే సమానమైన ఉచ్చారణ గల ఖాఫియాలను ప్రయోగించి చివరి రెండు చరణాలలో నడలు, గజలు అనే పదాలను ఖాఫియాలుగా ఉపయోగించారు.

దాశరథి గారు తాము రచించిన గజళ్ళు కొన్నింటికి శీర్షికలు పెట్టారు. నిజానికి గజళ్ళకు శీర్షికలు పెట్టాలన్న నియమం ఏమీ లేదు. మొత్తం మీద దాశరథిగారు గజల్ ప్రధాన నియమమైన క్లుప్తతను సాధించారు. సంగీత సాహిత్యాల రంగరింపు గజల్ అనే సత్యాన్ని నిరూపించారు.

తెలుగు, ఉర్దూ భాషలు రెంటినీ తమ రెండు కళ్ళుగా భావించిన మహాకవి దాశరథి ఉర్దూ గజల్ ప్రక్రియను, రుబాయీ ప్రక్రియను రెంటినీ తెలుగులో ప్రవేశపెట్టారు. వారు తెలుగు గజల్ తెలుగు రుబాయీ ప్రయోక్తగా ఆంధ్ర సాహిత్య చరిత్రలో భద్రమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇలా అవతరించి వికసించిన తెలుగు గజల్ అనే పూలతోటకు ఇటీవల మహాకవి ఆచార్య సి. నారాయణరెడ్డి గారు తమ 'తెలుగు గజళ్ళ' సృజనతో సువర్ణ స్పర్శతో మరింత సౌందర్యాన్నీ శోభనూ సమకూర్చారు. ఈ తెలుగు గజల్ కవితా ప్రక్రియకు ప్రస్తుతం మరింత వన్నె వాసీ తెస్తున్నారు.

కర్పూర వసంతరాయలు - దేశదృష్టి

డా. అనుమాండ్ల భూమయ్య

కొండవీడు రాజధానిగా ఆంధ్రదేశాన్ని 1386 నుండి 1402 వరకు పరిపాలించిన కుమారగిరిరెడ్డి జీవితంలోని ఒక కోణాన్ని వస్తువుగా స్వీకరించి డా. సి. నారాయణ రెడ్డిగారు శృంగార రస ప్రధానంగా మలచిన గేయకావ్యం కర్పూర వసంతరాయలు. మొదటిసారి 1957లో ముద్రింపబడింది. సహృదయ పాఠకులను విశేషంగా ఆకట్టుకున్న ఈ చారిత్రక కావ్యం ఇప్పటికి ఐదు ముద్రణలు పొందింది. తొలినాళ్ళలో కవికి ఎక్కువ పేరు తెచ్చిన కావ్యమిది.

'శ్రీకృష్ణుడు ధర్మరాజునకు వలె కాటయ వేముడు కుమారగిరికి రాజ్యప్రాప్తిలో తోడ్పడి వుంటాడని' చెప్పే ఒక శ్లోకం -

కుమారగిరికి వసంతరాయలు, కర్పూర వసంత రాయలు అనే బిరుదులున్న విషయం-

లకుమ రాజనర్తకియే కాక కుమారగిరికి 'ప్రియా సదృశీ ప్రియ'యై యున్న విషయం-

కుమారగిరి వసంతరాజీయమనే నాట్య శాస్త్రాన్ని రచించిన విషయం -

ఈ చారిత్రిక అంశాలనాధారంగా చేసుకొని నారాయణరెడ్డిగారు తన విశేష కల్పనా చాతుర్యం చేత పెంచి అయిదు ఆశ్వాసాల కావ్యంగా తీర్చిదిద్దినారు. శృంగార రసానికి అనుగుణంగా రచన, అలంకారాలు, వర్ణనలు, సన్నివేశాలు కూర్చబడిన విధానం సహృదయ పాఠకులకు సువిదితం.

చరిత్రలో లేని రాణిపాత్రను సృష్టించి కావ్యా రంభంనుండి కావ్యాంతం వరకు పూసల్లో దారంగా తీర్చటం నారాయణరెడ్డిగారి కల్పనా చాతుర్యానికి పరా కాష్ఠ. ఈ పాత్ర సృష్టి నారాయణరెడ్డి గారి దేశదృష్టికి నిదర్శనం. లకుమ, కుమారగిరి నాయికా నాయకులుగా శృంగార రసప్రధానంగా నిర్మించబడిన కావ్యంలో దేశానికి ప్రతీకగా రాణి పాత్ర సృష్టింపబడటం ఒక నవ్యత. శృంగార రసాత్మకమైన పూర్వ ప్రబంధాల మార్గంలో సాగిన ఈ కావ్యం ఈ దేశ భావనాదృష్టిని కలిగి ఉన్నందు వల్ల వాటికి భిన్నంగా, ఒక వినూతనత్వాన్ని కలిగిందిగా చెప్పబడుతుంది. దేశానికి స్వాతంత్ర్యం అప్పుడప్పుడే వచ్చింది. భారతదేశం తమది అనే సగర్వభావం దేశ ప్రజల హృదయాల్లో ఆనందతాండవం చేస్తుంది. ఈ విధమైన భావన కలిగిన నారాయణ రెడ్డిగారు దేశానికి ప్రతీకగా రాణి పాత్రను సృష్టించి ఈ కావ్యాన్ని రూపొందించి నారు. ఈ పాత్రను కరుణ రసభావ స్రోతస్వినిగా చిత్రించినారు.

తాను జరిపే వసంతోత్సవంలో నాట్యప్రదర్శన కావించిన లకుమ పట్ల కుమారగిరి ఆకర్షితుడై ఆమెను రాజనర్తకిని కావించి, ఆమె సన్నిధిలోనే కాలం గడుపుతూ పరిపాలనకు దూరమైనాడు. తనకూ దూరమై ప్రజలకు దూరమైన రాజును, రాణి తగినయుక్తితో లకుమకు దూరం చేస్తుంది. అప్పుడు, రాజు దేశపరిపాలనా బాధ్యతను తిరిగి స్వీకరిస్తాడు. ఇది కావ్యంలోని కథాంశం. లకుమనృత్యాన్ని చూసి రాజు ఆమెకు చేరువ కావటంతో కావ్యం ప్రారంభమవుతుంది. లకుమకు రాజు చేరువవు తున్న ప్రథమ సన్నివేశంనుండే రాణి, రాజును గమనిస్తూ, వారిస్తున్నట్లు కవిచెప్పినాడు.

"ద్రుత లయను పల్కెను మృదంగము
ఆడినది లకుమ చరణాంగము

ప్రభువు తన్మయుడయ్యె
ప్రభువు చిన్మయుడయ్యె

ప్రభువు లకుమాలగ్న
పంచ ప్రాణుండయ్యె.

అతడామెనుజేర అడుగు నించుక లేపె
రాణి యాతని భుజాగ్రాన చేయిని మోపె

ఒక్క మారుగ ప్రభువు
ఉల్కిపడి తను తాను చూచికొనె".

ఇది ప్రథమాశ్వాసంలోని విషయం. వేశ్యయైన లకుమపట్ల ఆకర్షితుడవుతున్న రాజును రాణి మొదటి నుండి గమనిస్తు రాజు ఆ ప్రయత్నాన్ని వారిస్తుందన్న విషయాన్ని ఈ సన్నివేశం తెలుపుతుంది. ఇది మొదలుగా రాజు ఆ లకుమపట్ల ప్రవర్తించే తీరును వర్ణించిన ప్రతిసారి రాణి విషయాన్ని చెప్పి, ఆమె అసహానాన్ని, వేదనను, దుఃఖాన్ని కవి చిత్రిస్తూనే వచ్చినాడు.

1. రాజు విరహం: లకుమనే తలచుకొంటున్న రాజుకు నిద్ర పట్టదు. శయ్యమీద దొర్లుతున్న రాజు ప్రవర్తనను ప్రక్కన ఉన్న రాణి గమనిస్తూనే ఉంది. అది గ్రహించిన రాజు తనను తాను 'దోషి'గా భావించు కొంటాడు -

"ఈ ప్రక్కకు పొరలె
ఆ ప్రక్కకు పొరలె
పాన్పుగాదు చంద్రనిప్పు
పై ఆతడు దొరలె"

"అందె ఘల్లుమనెను పతి యె
డంద జల్లుమనెను
పాట రవళితోచె; రేడు
పాన్పునుండి లేచె

తన ప్రక్కనేదొ కదలినప్పుడాలించి
రాజు గిర్రున తిరిగి రాణిని విలోకించె

పండు వెన్నెల నీటి పాయ లోపలనీది
ఆమె కన్నులు మెరసియాడె మీనములట్లు

దోషివలె నృపతి యెంతో కుంచితాంగుడై
తల త్రిప్పికొని మేను తల్పమ్ముపై వాల్చె"

రాజు లకుమా విరహవేదన పొందుతు కలలో లకుమను చూచి ఆమెను సంబోధించి ఆమె కొంగును లాగినాడు. కాని అది ప్రక్కన నిద్రిస్తున్న రాణి కొంగే -

ఆమె లకుమయై సాగెను
ఔను లకుమయై సాగెను

ప్రభువంతట 'లకుమా' యని
వసనాంచలమును లాగెను

పాన్పుపైన రాణి 'ప్రభూ!
ప్రభూ!' యంచు పిలిచెను

భుజము వట్టి హెచ్చరించి
మోమును స్పర్శించెను.

రాజు కనులు విప్పి చూచె
లకుమ లేదు - రాణి తోచె
క్రుంగి, చేతిలోని రాణి
కొంగునంత జారవిడిచె"

ఇది ద్వితీయాశ్వాసంలోని సన్నివేశం

2. రాజనర్తకిగా లకుమ : లకుమ సాన్నిహిత్యాన్ని కోరిన రాజు ఆమెను రాజనర్తకిగా చేయదలుచుకున్నాడు. ఆ వార్త నగరంలో వ్యాపించింది. రాణికి తెలిసింది. ఈ వార్త రాణికి కర్ణకఠోరంగా ఉందన్నాడు కవి -

'రాణికావార్త క
ల్వ నెలంత చెవులలో
ఖరకరుని అశ్వరిం
ఖల చప్పుడుగ తోచె"

లకుమను రాజనర్తకిగా నియమించటానికి రాజు సభ చేసినాడు. రాజు ప్రక్కకు కూర్చున్న "రాణిలో తిమిరంపు నీడలు" పొడ సూపినాయంటాడు కవి.

3. లకుమతో రాజు తీర్థసేవ : లకుమ దివ్యాభినయ అమృతాభిషేకాన్ని పొందదలచిన రాజు లకుమను తన వెంట తీర్థయాత్రకు తీసుకొని వెళుతాడు. వెంట తనను తీసుకొనిపోకుండ లకుమను తీసుకొని వెళుతున్నందుకు రాణి బాధపడింది; ఏడ్చింది.

"అర్ధాంగికి చేసెడి మ
ర్యాద యిదేనా ప్రభూ!
పట్టమహిషి యన్నందుకు
ఫలిత మిదేనా ప్రభూ!
కుమిలి కుమిలి తనలోనే
గొల్లున ఏడ్చినది రాణి"

దక్షవాటికలోని భీమేశ్వరాలయంలో లకుమ శివ పార్వతుల వలపు ఘట్టాన్ని అభినయిస్తుంది. ఆ సందర్భంలో రాజు 'చిత్రం' గా లకుమను సంబోధించి కౌగలించుకుంటాడు. పరవశించిన రాజు

"భవుని కవుగిటన్ పార్వతి
పార్వతి కవుగిటన్ భవుడు
నా కౌగిట నీవు వోలె
నీ కౌగిట నేను వోలె"

అని అంటాడు. రాజు కౌగిలిలో ఒదిగిన లకుమ ఆ మాటలు విని తన్మయురాలై రాజును బిగిగా కౌగలించి "నాదేవర నాగుండియ పాదున రతనాల మొల్క" అని పల్కుతుంది. ఈ సందర్భంలో రాణిని ప్రస్తావిస్తాడు కవి. కొండవీటిలో ఉన్న రాణికి 'వికృత స్వప్నం' వచ్చి నేలపై పడినట్లు చెప్పుతాడు.

లకుమ అపుడె తొలిసారిగ
రాయని తన మనసార కౌగిలించె
అచట కొండవీటి రాణి
అతి వికృత స్వప్నమ్మున కలవరించె

ఇచట రేడు లకుమను తన
హృదయ పట్టమహిషిగా ప్రతిష్ఠించెను
అచట రాణి కలలో శ
య్యపై పొరలి పొరలి నేలపై దొరలెను.

రాజు మరల 'లకుమా'యని
ప్రాణ పంచకము నదించగా పిల్చెను
రాణి అచట మేలుకాంచి
'ప్రభూ' యంచు బిక్కు బిక్కుమని యేడ్చెను

రాజు మనసులోనుండి రాణి తొలగిపోయి ఆ స్థానంలో లకుమ స్థిరపడిన సన్నివేశమిది. ఇది తృతీయా శ్వాసాంతంలోని అంశం.

లకుమను హృదయంలో నిలుపుకొన్న రాజు తీర్థ యాత్రలు ముగించుకొని ఆమెను తన సౌధంలోనికి తీసుకొని వెళతాడు. లకుమ ఆ రాక రాణికి జడుపును కలిగిస్తుంది. రాణికి లోకమంతా చీకటి మయం. హృదయమంతా శూన్యం.

రాణి నిల్చినది హ
ర్మ్య గవాక్ష మాలంబనముగ
లకుమ నడచినది రే
నికి ప్రక్కగా ఒయారముగ

సుడిగాలి చరచినటు
జడిసి పోయెను మహారాజ్ఞి
వడదెబ్బతాకినటు
వడకిపోయెను మహారాజ్ఞి

ఆమె నేత్రములందు
అమవసలు జడలు విరబోసికొనె
ఆమె హృదయాంగణము
నందు శూన్యము చోటు చేసికొనె.

(చతుర్థాశ్వాసం)

4. లకుమయే లోకంగా రాజు : తీర్థయాత్రలను ముగించుకొని వచ్చిన పిదప కేళీమందిరాన్ని నిర్మించి అచట లకుమ చేసే నృత్యాన్ని చూస్తు రాణిని, రాజ్యాన్ని మరచి లకుమయే లోకంగా రాజు తనకాలాన్ని గడుపు తున్నాడు. మొదట లకుమ నృత్యానికి ముగ్ధుడైన రాజు ఇప్పుడు ఆమె తనులావణ్యానికి దాసుడు "లకుమయే అతని లీలా మహాసామ్రాజ్యమున రాణి". రాజు వేశ్యా లోలుడని ప్రజలకు తెలిసింది. రాజు రాజ్యపరాఙ్ముఖుడని శత్రురాజులకుతెలిసింది. అంతఃకల్లోలాలు రేగినాయి. కాటయ వేముడు వాటిని అణచివేసినాడు. ఈ సందర్భంలో రాణికి వ్యాధి సంక్రమించినట్లు కవి చెప్పినాడు -

- "అంతఃకల్లోలము లుబికెను"
- "మహారాజ్ఞి మంచము పట్టెను"
-"అగ్ని పర్వతమటు లఖిల రాజ్యమ్ముడికె"

రాజ్యానికి ప్రతీకగా రాణి చిత్రింపబడుతున్నందు లకు కవి స్పష్టంగా చూపిన మొదటి నిదర్శనం.

రాణి వ్యాధిగ్రస్తయై పరితపించటాన్ని గమనించిన కాటయ వేముడు కేళీ మందిరంలో నున్న రాజుదగ్గరకు పోయి దేశంలో కలిగిన అశాంతిని, రాణి వ్యాధిగ్రస్తయైన

విషయాన్ని, మంత్రులు మొదలైనవారు మీరాక కోసం ఎదురు చూస్తున్నారని మీరొకసారి ఆస్థానానికి రావలసిందని రాజుకు చెప్పినాడు.

కాటయవేముని కోరిక మేరకు ఆస్థానానికి వచ్చి రాజు, లకుమ కాలు బెణికిందనే వార్త విని వెంటనే లేచి లకుమను చేరుకొంటాడు. "సభకిది తిరస్కారము, సభ్యతకు సీత్కారము" అని రాజు ప్రవర్తనను విమర్శించి రాచకొల్వు చెల్లాచెదురై పోతుంది. లకుమ తోడిదే లోకంగా రాజుకాలం గడుపుతున్నాడనటానికి ఇది నిదర్శనం.

5. రాణి పరితాపం : రాజు సభను ఇట్లా అవమానించినాడని తెలిసి రాణి పరితపించింది. తన నోదార్చ వచ్చిన కాటయ వేమునిపై బడి ఏడ్చింది. ఈ సందర్భంలో రాణి చెప్పిన ధర్మ శాస్త్రానుగుణమైన మాటలు దేశమే మాతయై చెప్పినట్లుగా సాగినాయి.

"రేడు నా అంతఃపురమునకు
రా డనెడు దుఃఖమ్ము కన్నను
రాచగద్దెను విడిన వార్తయె
రంపమున గోసినది తండ్రీ!

ఆటకత్తెల నాదరించుట
అధిపులకు ధర్మమ్మెకానీ
వారి యడుగుల మ్రోల బ్రతుకును
ధారవోయుట యేటి న్యాయము?

కేళికా మందిరము కన్నను
ఓలగమ్ము పవిత్రమైనది
వ్యక్తికన్నను దేశసౌభా
గ్యమ్ము ఆదరపాత్రమైనది

ప్రభువు లలిత కళాజగత్ స
మ్రాట్టనుచు నేనెంత మురిసితి
అంతమాత్రమ్మునని దేశ
మ్మతనికొక గవ్వైన కాదా!"

- పంచమాశ్వాసం

రాణి చెప్పిన మాటలువిన్న కాటయ వేముడు మరోసారి కేళీమందిరంలో నున్న రాజుకడకుపోయి రాణి అనారోగ్యాన్ని గూర్చి చెప్పి ఆమెను ఓదార్చగానైనా రమ్మంటాడు. రాణియే దేశం అన్న విషయాన్ని కవి ఈ సందర్భంలో మరింత స్పష్టం చేస్తాడు.

"భూదేవి కపరావతారమౌ రాణి
పొగిలి మంచము పట్టె నో మహీజాని"

"కడకు దేశమ్ముకొరకైనను సరే మీరు
అర్ధాంగ లక్ష్మినోదార్చగా పోవలయు"

కాటయ ఇట్లా చెప్పి పోయిన పిదప, లకుమ కూడా రాణి కడకు వెళ్ళుమని రాజుకు చెప్పుతుంది.

"పట్టమహిషి వ్యాధి మహో
పప్లవమ్మునకు సూచిక
రాణిగారి సేమము దే
శాన కమృత రసవీచిక"

లకుమ మాటల్లోను రాణియే దేశమన్న విషయాన్ని కవి తెలిపినాడు; లకుమకు సమాధానంగా రాజు చెప్పిన మాటల్లోను ఇదే విషయాన్ని స్పష్టం చేసినాడు -

"రాణి యనగ భూదేవికి ప్రతినిధి"

6. రాణి ప్రత్యక్ష చర్య: సభాస్థానానికి రమ్మని ఒకసారి, వ్యాధిగ్రస్తయైన రాణిని ఓదార్చ రమ్మని ఒకసారి రాజుకు కాటయ వేముడు చేసిన విన్నపం విఫలమయిన తరువాత, రాజును రాచమార్గంలో పెట్టటానికి స్వయంగా రాణి పూనుకుంటుంది. రాత్రి వేళ ఒంటరిగా లకుమ కేళీ మందిరానికి రాణి వెళ్ళి దేశం కోసం రాజును విడిచిపెట్టిపొమ్మని ప్రార్థనా పూర్వకంగానే ఆదేశిస్తుంది. రాణి ఈ ఆదేశంలో రాజాజ్ఞ ధ్వనిస్తుంది. రాజు అసమర్థుడై నప్పుడు రాణియే రాచకార్యాన్ని నిర్వహించిన విధమిది -

"నిన్ను రాయలు కన్నులందున
నిల్పినందుకు పరితపించను
కాని, దేశమ్మును తృణమ్మటు
కాలద్రోయుట ఎట్లు సైతును

దేశమొకదెస నీవు ఒక దెస
తేల్చుకొను మెయ్యది ఘనమ్మో

వ్యక్తి సంఘములందు ఎయ్యది
ప్రథమ గణ్యమొ చెప్పవమ్మా!

గుండె రాయిగ జేసికొని కడ
కొక్క మాటయె యందునమ్మా!
భూపతిని ఎటులైన విడిపో
వుటయె నీకు అవశ్యమమ్మా!"

వ్యక్తి ముఖ్యమా, దేశం ముఖ్యమా! అన్నది దేశ స్వరూపిణియైన రాణి ప్రశ్న. దేశం వేసిన ప్రశ్నకు వ్యక్తియైన లకుమ కూడ దేశమే ముఖ్యమన్న సమాధానానికి వచ్చింది. ఈ విషయ మెరుగని వాడు రాజు. విషయ మెరిగిన లకుమ ఎరుగని రాజుకు ఎరుకపర్చింది - ఆత్మ బలిదానం చేసుకొని. లకుమ మరణానికి విలపించి నప్పటికి లకుమ చెప్పిన విషయంతో రాజు కళ్ళు తెరచి నాడు. కళ్ళు తెరచిన రాజుకు దేశం కనిపించింది; రాణి కనిపించింది.దేశ ప్రజలు కనిపించినారు -

"ఓ సఖీ! యే మందువో నీవు? ఇంకేమి
వ్యష్టికన్నను దేశ దృష్టియే గరిష్ఠమని"

వ్యష్టి కంటే దేశం ప్రధానమన్నది ఈ కావ్య మిచ్చిన సందేశం. కవి స్వయంగా కాకుండ, ఈ సందేశాన్ని కల్పించిన రాణి పాత్ర ద్వారా వ్యక్తం చేసినాడు. కావ్యారంభంలో రేఖామాత్రంగా కన్పించిన రాణి, కావ్యాంతానికి క్రమంగా ప్రాధాన్యతను సంతరించు కొన్నది. కవి చెప్పదలుచుకొన్న సందేశం కావ్యాంతానికి స్పష్ట రూపాన్ని పొందింది. కావ్యమంతటా రసభావ సన్నివేశాలు కావ్యాంతంలో ఈ సందేశం కావ్యరసానంద రూపం చేసిన ఉపదేశమిది.

దేశానికి ప్రతీకగా రాణి పాత్రను కల్పించి డా. సి. నారాయణ రెడ్డిగారు ఉత్కృష్టంగా తీర్చిదిద్దినారు. పూర్వ ప్రబంధ కవితా మార్గాన్ని 'దేశదృష్టి' వైపు మరల్చిన నవ్య కావ్యం ఈ కర్పూర వసంతరాయలు. అలనాటి ఆ దేశదృష్టి భావనయే కవితా మార్గంలో కవిని నడిపిస్తు విశ్వంభరను రచింపజేసింది. జ్ఞానపీఠ పురస్కార గ్రహీతగా చేసింది.

ప్రాచీనాంధ్ర సాహిత్యం - స్నేహ సంబంధాలు

డా. ఎస్వీ రామారావు

మానవజాతి మనుగడకు ఆధారములైన సంబంధాలలో ప్రధానమైనవి - స్త్రీ పురుష సంబంధాలు, స్నేహ సంబంధాలు, పాలక పాలిత సంబంధాలు. పాలక, పాలిత సంబంధాలు రాజకీయ పరిస్థితుల కారణంగా ఏర్పడుతాయి. స్త్రీపురుష సంబంధాలు కౌటుంబిక పరిస్థితుల ఆధారంగా నెలకొంటాయి. స్నేహ సంబంధాలు సామాజిక స్థితిగతులు మూలంగా రూపొందుతాయి. ఇది స్థూలమైన విశ్లేషణ మాత్రమే. నిజానికి కుటుంబం, సమాజం, రాజకీయం - మూడూ పరస్పర ఆధేయాలు, పరస్పర ప్రభావితాలు అన్నది లోక విదితం. ప్రాచీనాంధ్ర సాహిత్యంలో చారిత్రక నేపథ్యంలో ప్రతిబింబితమైన స్నేహ సంబంధాల పరిశీలనమే ప్రస్తుతాంశం.

తొలి తెలుగు కావ్యావిర్భావం ఒక సామాజిక ప్రయోజనంలో కూడుకొన్న మధుర ఘట్టం. ఆంధ్ర భారతావతరణకు పాలక సంబంధం కొంతవరకు హేతువైనా - స్వస్థాన వేష భాషాభిమానంతో మాతృభాషలో కావ్యరచనకు శ్రీకారం చుట్టి సామాజిక బాధ్యతను నిర్వహించాడు నన్నయ భట్ట మహాకవి. ఈ బాధ్యతా నిర్వహణలో స్నేహ సంబంధం అత్యంత కీలక మైన పాత్రను వహించటం ఆసక్తికరమైన అంశం.

"పాయక పాకశాసనికి భారత
ఘోరరణంబునందు నా
రాయణునట్లు వాసిగ ధరామర వంశ
విభూషణుండు నా
రాయణ భట్టు వాఙ్మయదురంధరుడుం
దనకిష్టుడున్ సహా
ధ్యాయుడునైన వాడభిమత స్థితి తోడయి
నిర్వహింపగాన్" (ఆది. అవ-25)

అని తనకు ఇష్టుడూ, సహాధ్యాయుడూ, వాఙ్మయ దురంధరుడూ అయిన నారాయణ భట్టును మహాభారతావతారికలో కృతజ్ఞతా పూర్వకంగా స్మరించాడు నన్నయ.

నారాయణభట్టు వాఙ్మయ దురంధరతను గురించి తెలుసుకోవాలంటే నందంపూడి శాసనం చూడాలి. క్రీ.శ 1053లో రాజరాజ నరేంద్రుడు నారాయణ భట్టుకు నందంపూడి గ్రామాన్ని అగ్రహారంగావిస్తూ ఒక తామ్ర శాసనం వేయించాడు. ఈ శాసన రచయిత నన్నయ భట్టు. అందులో రాజరాజ వంశవర్ణనతోపాటు నారాయణ భట్టు వంశం వివరాలు, పాండితీ విశేషాలు కూడా వెల్లడవుతాయి-

"యః సంస్కృత కర్ణాట ప్రాకృత
పైశాచికాంధ్రభాషాసు
కవిరాజ శేఖర ఇతి ప్రథితః సుకవిత్వ విభవేన
కవిర్మనీషా లవ దుర్విదగ్ధన్
మనోహరాభిర్నిజసూక్తిభిర్యః
కుర్వన్నగర్వాన్పటు బిభర్తిన్ కవీభ
వజ్రాంకుశనామసార్థం"

సంస్కృతం, పైశాచి, ప్రాకృతం, కన్నడం, ఆంధ్ర భాషలలో చక్కని కవిత్వం చెప్ప గల్గినవాడై కవి రాజశేఖర బిరుదునూ, మనోహర కవితోక్తులతో కవుల గర్వాన్ని అణచి కవీభ వజ్రాంకుశ బిరుదునూ వహించిన నారాయణ భట్టు సరస్వతీ కర్ణావతంసంగా, అష్టాదశా వధారణ చక్రవర్తిగా ప్రసిద్ధి గడించినవాడనీ ఈ శాసనం వెల్లడిస్తున్నది.

అంతటి మహా పండితుడు కాబట్టే మహాభారత రచనలో నన్నయ భట్టుకు తోడుగా నిలవగలిగినాడు. భారతరచనను మహాభారత యుద్ధంతోనూ - నారాయణ భట్టును శ్రీకృష్ణ పాత్రతోనూ పోల్చటంలోనే నన్నయ ఎదుర్కొన్న ఇబ్బందులు ధ్వనిస్తున్నాయి. తెలుగులో కావ్యరచనకు పూనుకొన్న నన్నయకు గీర్వాణ భాషాభిమానులైన నాటి పండితుల నుంచి ఎన్నో ఆటంకాలు ఎదురై వుంటాయి.

"పరమ వివేక సౌరభ విభాసిత సద్గుణ పుంజ వారిజో

త్కర రుచిరంబులై సకల గమ్య సుతీర్థములై
మహామనో
హర సుచరిత్ర పావన పయః పరిపూర్ణము లైన
సత్సభాం
తర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి
వేడుకన్"

అంటూ విద్వత్సభలను కొనియాడి ఆ వెంటనే తన మిత్రుని సహాయాన్ని స్మరించాడు నన్నయ. మర్యాద కోసంవాటిని సత్సభలుగా పేర్కొన్నా అవి ఆయన్ను ఇబ్బందిపెట్టిన పండిత పరిషత్తులే.

సకల సూరి సభారమ్యంబగు తృతీయపర్వము,
సభారంజనమై సర్వమనోజ్ఞము నాల్గవ పర్వము,
ఉద్యోగ పర్వమిమ్మగు సభలన్,
ద్రోణ పర్వమమరున్ సభలన్,
సభల విస్తరిల్లి శల్యపర్వమతిశయిల్లు,
కృపాయితమై స్త్రీ పర్వము వెలయు సుకవి
పండిత సభలన్

అని పలుచోట్ల సభలను ప్రస్తావించాడంటే ఆ రోజుల్లో వాటికి గల ప్రాబల్యం అవగతమవుతుంది. కన్నడం మొ॥ భాషల్లో వెలువడిన భారత కావ్యాల గురించి తెలిసినవాడు కాబట్టి నారాయణ భట్టు నాటి పండితుల వాదాలను ఎదుర్కొని నన్నయ అనువాద పద్ధతిని సమర్థించి అతనికి బాసటగా నిలిచాడు. బాల్యమిత్రుడు చేసిన ఈ సహాయానికి కృతజ్ఞతాబద్ధుడై నన్నయ కావ్యావతారికలో అతణ్ణి స్మరించి సాహిత్య చరిత్రలో శాశ్వతమైన స్థానం కల్పించాడు.

నన్నయ సహాధ్యాయి అయిన నారాయణభట్టు వేంగీ రాజ్యాన్ని ఆక్రమించ జూచిన పశ్చిమ చాళుక్యుల వద్ద ఉద్యోగిగా వున్నా అనంతర కాలంలో రాజమహేంద్ర వరానికి తిరిగి వచ్చి ఆ రెండు రాజ్యాల మధ్య సఖ్యతకు దోహదం చేశాడని చారిత్రకులు భావిస్తున్నారు. ఆ విధంగా నన్నయ నారాయణుల స్నేహం రాజరాజ నరేంద్రునికి కూడ ఉపకారకమైంది. ఈ ఉపకారానికి బదులుగానే రాజరాజు నారాయణ భట్టుకు నందంపూడి అగ్రహారాన్ని ప్రసాదించాడు. చారిత్రక నవలా రచయితగా ప్రసిద్ధి గడించిన నోరి నరసింహశాస్త్రిగారు 'నారాయణభట్టు' నవలలో నన్నయ నారాయణ భట్టుల స్నేహశీలానికి స్నిగ్ధమధురమైన రూపకల్పన చేశారు.

నరసింహ శాస్త్రిగారు "మల్లారెడ్డి" నవలలో రెడ్డి రాజుల కాలానికి చెందిన మరొక స్నేహ సంబంధ గాథను రమ్యంగా చిత్రించారు.

"నా తమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుడు
నిన్నాతత
శ్రీ తోడన్ సముపేతు జేసి ఎలమింజేపట్టి
మాకిచ్చుటం
జేతోమోద మెలర్ప రామకథమున్ జెప్పించి
యత్యుత్తమ
ఖ్యాతిం బొందితినింక నేను దనియన్
గావ్యామృతాస్వాదనన్"
(హరివంశం పూ. 1-39)

ప్రోలయ వేమారెడ్డి తన ఆస్థాన కవి అయిన ఎఱ్ఱాప్రెగడతో వచించిన పద్యం ఇది. వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డికీ, ఎఱ్ఱాప్రెగడకూ మధ్య వున్న స్నేహానుబంధాన్ని సూచిస్తుంది. ఇది కేవలం పాలక పాలితుల మధ్య వున్న సంబంధం కాదు. చాళుక్య యుగంలోని స్నేహబంధం భారతావతరణకు దోహదం చేస్తే రెడ్డి రాజుల కాలంనాటి ఈ అనుబంధం రామాయణ కావ్య సృష్టికి దారి తీసింది.

అద్దంకి రాజైన ప్రోలయ వేమారెడ్డి తన తమ్ముడు మల్లారెడ్డికి సముద్ర తీరస్థ గ్రామాలమీద, ద్వీపాంతర వ్యాపారం మీద అధికారం ఇచ్చాడు. మల్లారెడ్డి మోటుపల్లి మున్నగు ఓడ రేవులను అభివృద్ధి పరచి వర్తకాన్ని అభివృద్ధి చేశాడు. ఆ సందర్భంలోనే గుడ్లూరులోని నీలకంఠేశ్వర స్వామి భక్తుడైన ఎఱ్ఱయతో పరిచయం కలిగి స్నేహంగా పరిణమించింది. మల్లారెడ్డితో స్నేహం కుదిరిన తర్వాత ఎఱ్ఱన గుండ్లకమ్మ తీరాన వున్న చెదలువాడలో నివాసం ఏర్పరచుకొన్నాడు. రామభక్తుడై మల్లారెడ్డి చెదలవాడలో రామాలయాన్ని కట్టించాడు. ఆలయంలో రామలక్ష్మణ

విగ్రహ ప్రతిష్ఠాపనకు వేమారెడ్డి చెదలువాడకు విచ్చేసి నప్పుడు ఎర్రన కవిని ఆతనికి పరిచయం చేశాడు. క్రీ.శ. 1325లో ఈ రామాలయానికి వేమారెడ్డి ఒక అగ్రహారం ఒసగి దానికి రెడ్డి మల్లవరం అని నామకరణం చేశాడు. ఈ సమయంలో ఎర్రనను రామాయణం రచించమని కోరాడు.

రెడ్డి మల్లవరంలోని విగ్రహ ప్రతిష్ఠకు, ఎర్రా ప్రెగడ రామాయణ రచనకు ఏదో సంబంధం వుందని వేలూరి శివరామ శాస్త్రిగారు సముచితంగా ఊహించారు. ఎర్రన రామాయణం అలభ్యంగా వున్నా అందలి కొన్ని పద్యాలు మాత్రం లభించాయి. మల్లారెడ్డి మూలంగా వేమారెడ్డి ప్రాపకం లభించాక ఎర్రన ఆయన ఆస్థానకవిగా స్థిరపడి హరివంశం వ్రాసి ఆయనకు అంకితం ఇచ్చాడు. ఈ విధంగా ఎర్రయ మల్లారెడ్డిల మధ్య ఏర్పడిన స్నేహం ప్రబంధ పరమేశ్వరుని అభ్యున్నతికి తోడ్పడింది.

కవి సార్వభౌముడు శ్రీనాథుడు, వణిక్ ప్రముఖుడు అవచితిప్పయశెట్టి మధ్య గల స్నేహ సంబంధం ప్రాచీనాంధ్ర చరిత్ర లోని మరొక మధురఘట్టం. తిప్పయ శెట్టి వంశీకులు రెడ్డి రాజుల యుగంలో వాణిజ్య కార్యకలాపాలను నిర్వహిస్తూ దేశాన్ని ఆర్థికంగా పరిపుష్టం చేశారు. తిప్పయ తండ్రి దేవయశెట్టి ప్రోలయ వేమారెడ్డి ప్రాపుతో మోటుపల్లి మున్నగు రేవులద్వారా విదేశ వ్యాపారం కొనసాగించాడు. కొండవీటి ప్రభువు అన వేమారెడ్డి ఏటేటా వసంతోత్సవాలు జరుపుతూ చందనం, కస్తూరి, కర్పూర ఖండాలు వెదజల్లుతూ కర్పూర వసంత రాయలుగా విఖ్యాతి గడించాడు.

ఈ పరిమళ ద్రవ్యాలను నెల్లూరు పావాణి సెట్టి కుటుంబానికి చెందిన అవచితిప్పయ దేశ విదేశాలనుండి దిగుమతి చేసేవాడు. శ్రీనాథుడు బాల్యంలో తిప్పయ శెట్టి వెంట కొండవీడు వెళ్ళి ఈ వసంతోత్సవాలను చూసి వుండటం చేతనే తనకావ్యాలలో వాటిని ఘనంగా వర్ణించాడు. కొమారగిరి సువర్ణ భాండాగార అధ్యక్షుడైన తిప్పయ సెట్టి

"జంబూద్వీప భూభవన మండలీ మకుట మండనాయమానంబగు కొండవీడు పురంబు రాజధానిగా గీర్తి లతాధిష్టి తాష్టాదశ ద్వీపాంతరాళుండగు కొమరగిరి వసంతనృపాలువలన నాందోళికాచ్ఛత్రచామరత రంగాది రాజ్యచిహ్నములు పడయ నమ్మహారాజునకు ప్రతి సంవత్సర వసంతోత్సవంబులకుందగిన కస్తూరి కుంకుమ సంకుమద హిమాంబు కాలాగురు గంధసార ప్రభృతి సుగంధ ద్రవ్యంబు లొడగూర్చియు జీని సింహళ తవాయి హురుమంజి జలనోగి ప్రభృతి నానా ద్వీప నగ రాకరంబులగు ధనకనక వస్తువాహన మాణిక్య గాణిక్యంబులు దెప్పించి కవిగమకివాదివాంశిక వైతాళి కాదులగు నర్థి జనంబులకు నర్థంబుల గుప్పించియు (ఇచ్చేవాడు. హర. అవ. 7)

అవచి తిప్పయ కాంచీపురాన్ని స్థావరంగా చేసుకొని దేశవిదేశాలతో వాణిజ్యం నెరపాడు. శ్రీనాథ తిప్పయల మధ్యగల గాఢ స్నేహాన్ని హరవిలాస కావ్యం మనోజ్ఞంగా చిత్రించింది. శ్రీనాథుడు తన ప్రభువైన పెదకోమటి వేమారెడ్డికి సంబంధించిన రాచకార్యంమీద క్రీ.శ. 1395 ప్రాంతంలో కంచికి వెళ్ళి బాల్యమిత్రుడైన అవచి తిప్పయను కలుసుకొన్నాడు. వయసులో తనకన్నా పిన్నవాడైన శ్రీనాథుడు మహాకవిగా ఎంతగా ఎదిగి పోయాడో తెలుసుకొన్న తిప్పయ అతణ్ణి అనురాగంతో గౌరవించాడు.

"ఉభయ భాషా కవిత్వ ప్రయోగ కుశలు
బాలసఖు గారవించి తాత్పర్యమొప్ప
నవచి దేవయ త్రిపురారి యక్షరాజు
(నవచి త్రిపురాంతకుండల కాధిరాజు -
పాఠాంతరం)
హితహితోక్తులు వెలయగ నిట్టులనియె"

(హర విలాసం. అవ. 8)

"ఆగమ జ్ఞాన నిధివి తత్త్వార్థఖనివి
బహు పురాణజ్ఞుడవు శుభ భవ్యమతివి
బాల సఖుడవు శైవ ప్రబంధమొకటి
యవధరింపుము నా పేర నంకితముగ"

(హర. అవ. 12)

అన్న బాల్యమిత్రుని కోరికను శ్రీనాథుడు అక్షరాలా నెరవేర్చాడు -

"శుభముహూర్తమున నిజాంతరంగ మంగళాయ తనాధిష్ఠిత కుమారాచల త్రిపురాంతకుం డవచిదేవయ త్రిపురారి కృతిస్వామిగా హరవిలాసంబను ప్రబంధంబు సెప్పంధొడంగి యమ్మహా ప్రబంధముఖ తిలకాయ మానంబగు తదీయ వంశం బభివర్ణించెద" (హర. అవ-13) అంటూ పదిహేడు పద్యాలలో (అవ. 17-41) అతని వంశవర్ణన చేశాడు.

తర్వాత ఐదు షష్ఠ్యంతాలు, ఆశ్వాసారంభ - అంత ములలోని ఇరవై ఎనిమిది పద్యాలలో (7 ఆశ్వా ×4 = 28) ఘనంగా కీర్తించాడు. అంతటితో తృప్తి పొందక, హర విలాసకావ్యాన్ని తిప్పయసెట్టి వంశానికి మూల పురుషుడైన చిరుతొండనంబి కథతోనే ప్రారంభించాడు-

"అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా చెప్పంబూనిన హర విలాసంబను ప్రబంధంబునకు ప్రథమవిలాసంబైన కృతి నాయకుని వాణిజ్య వంశంబునకు కూటస్థుండైన కిరాటకుల శ్రేష్ఠుండగు చిరుతొండనంబి చరిత్రంబు చెప్పెద" (హర. 1 ఆ -1)

ఈ విధంగా హరవిలాస ప్రబంధం తిప్పయ కాలంనాటి రాజకీయ, వాణిజ్య విశేషాలతో పాటు అతని కుటుంబ విశేషాలను వెల్లడి చేస్తుంది. అవచి దేవయ, మాచాంబల పుత్రుడైన తిప్పయ కుటుంబాన్ని ఒక్క పద్యంలో చక్కగా పరిచయం చేశాడు -

"ధీ చతురుల్సహోదరులు తిర్మల సెట్టియు
చామిసెట్టియున్
మాచన, విశ్వనాథ, చినమల్ల కుమారులు వీర
లాత్మజుల్
శ్రీ చెలువంబు గైకొనిన చేడియ యన్నమదేవి
భార్యగా -
గోచరమే నుతింప నయకోవిదునిం
ద్రిపురాంతకాధిపున్."
(హర.అవ - 31)

బాల్యమిత్రునికి చరిత్రలో శాశ్వతస్థానం ఆర్జించి పెట్టిన శ్రీనాథమహాకవి స్నేహశీలతకు నిదర్శనంగా నిలచిన మరొక కావ్యం క్రీడాభిరామం. రెడ్డిరాజ్యం అస్తమించాక ఆశ్రయం కరువైన శ్రీనాథుడు 1428 -38 మధ్య కాలంలో విజయ నగరానికి తరలివెళ్ళాడు. మార్గమధ్యంలో వినుకొండ వల్లభరాయనితో అతనికి పరిచయం కలిగింది. వల్లభరాయుడు కడపజిల్లాలోని మోపూరుకు గ్రామాధికారిగా వుండేవాడు. విజయనగర రాజ్యంలో అతనికున్న పలుకుబడిని గమనించి అతనితో స్నేహం చేసి కొంతకాలం అతని దగ్గర వున్నాడు శ్రీనాథుడు.

వల్లభరాయుడు మంచికవి. సాహితీ ప్రియుడు. అతని చాటు పద్యాలను శ్రీనాథుడు క్రీడాభిరామంలో ప్రస్తుతించాడు. మోపూరు భైరవస్వామి తిరునాళ్ళలో క్రీడాభిరామం వీధిరూపకాన్ని ప్రదర్శింప జేయాలన్న వల్లభ రాయని కోరికను నెరవేర్చాడు. క్రీడాభిరామ కర్తృత్వం గురించి కొంతవివాదంవున్నా అందులో ముప్పాతిక ముప్పిసం పద్యాలు శ్రీనాథుని రచనలే అని అతని ఇతర కావ్య పద్యాలతో, పదాలతో తైపారు వేసి వేటూరి ప్రభాకర శాస్త్రిగారు సోపపత్తికంగా నిరూపించారు.

రూపకానికి ప్రస్తావనగా వల్లభరాయని వంశవర్ణన చేయటమే కాక అతని పట్లగల స్నేహభావంతో ఆ గ్రంథాన్ని అతని పేరుమీదనే ప్రకటింపజేశాడు. మంచన శర్మ, టిట్టిభసెట్టి అన్న ఇద్దరుమిత్రులు ఓరుగల్లు నగర సంచారంలో పొందిన అనుభూతులే క్రీడాభిరామం ఇతివృత్తం. అందుచేత ఈ రూపక వస్తువు కూడా స్నేహితుల పరస్పర వ్యవహారానికి సంబంధించిందే. వినుకొండ వల్లభరాయనితో ఏర్పడిన స్నేహానికి ప్రతి రూపమే క్రీడాభిరామ కావ్యం అంటే అత్యుక్తికాదు.

"ఆపదలకు సఖుడైనట్లు చుట్ట
మాపాటిగా నేరడారసి చూడ"

అని స్నేహంవిలువను చాటి చెప్పాడు రంగనాథ రామాయణ కర్త గోన బుద్ధారెడ్డి. ఇంకా 16వ శతాబ్ది తర్వాతి ప్రబంధాలను కూడా సూక్ష్మ పరిశీలన కావిస్తే ఈ సంబంధాన్ని గురించిన పెక్కు అంశాలు సువ్యక్తం కాగలవు.

ఆధునిక యుగంలో కూడా పలువురు కవులు, రచయితలు, స్నేహభావ వైశిష్ట్యాన్ని సుమధురంగా ఎలుగెత్తి చాటారు. స్నేహం కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనుదీయని డామన్ పితియస్‌ల గాథను ముత్యాల సరాలలో కరుణ రసార్ద్రంగా చిత్రించాడు గురజాడ అప్పారావు.

"స్నేహ పూరంబుతో ప్రకాశించి మించె
మానవులు పెట్టుకొన్న సమాజ దీప
మదిచెదిరి చింది పంకిలమయిన సకల
హీనమగుగాదె ఇండ్ల వాకిండ్ల వరుస"

అని సమాజదీప్తికి ఆధారం స్నేహమని రాయప్రోలు సుమ కోమలంగా చాటి చెప్పాడు.

ప్రజా కవి కాళోజీ

"తరుగు పెరుగుల మాట ఎరుగునా స్నేహంబు
స్నిగ్ధతను వీడునా స్నేహమెపుడైన"

అని స్నేహంలోని స్నిగ్ధ మాధుర్యాన్ని చవి చూపాడు.

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయి" అన్న కవి వాక్కుతో ఈప్రశంస ముగిస్తాను.

ప్రబంధ సాహిత్యం - పారమార్థిక ప్రయోజనం

డా. మసన చెన్నప్ప

ప్రబంధ కవులందరూ ఆస్తికులే. వారికి వేదాల పట్ల ఎంత గౌరవమో పురాణాల పట్ల అంత గౌరవం ఉంది. భగవంతుని అవతార వాదాన్ని మనస్ఫూర్తిగా నమ్మి అభివర్ణించిన వారు ప్రబంధ కవులు. వారెంతటి లౌకిక దృష్టి గలవారో అంతటి పారమార్థిక దృష్టి గలవారు. భౌతికమైన జగత్తును అభివర్ణిస్తూనే, శాశ్వత సుఖాన్ని అందించే మోక్షాన్ని ఎంతగానో కొనియాడినారు.

"ఉడుముండదె నూరేండ్లును
పడియుండదో పేర్మిపాము పదినూరేండ్లున్
మడుగున కొక్కెర యుండదె
కడునిలపురుషార్థపరుడు కావలె సుమతీ"

మానవుడు ఎంతకాలం జీవించినప్పటికీ, చతుర్విధ పురుషార్థాలను అవశ్యం సాధించవలసి వుంది. పురుషార్థ సాధకుడు కావడమే మనుష్య ధర్మమని సుమతి శతక కారుడు మనకుపదేశిస్తున్నాడు.

బహుశా ప్రబంధకవులు కూడా ఈ దృక్పథంతోనే ప్రబంధాలు రచించినట్లు కనిపిస్తున్నది.

ప్రబంధ రాజమైన మనుచరిత్ర పారమార్థిక ప్రయోజనాన్ని సాధించిన ఉత్తమ రచన. ప్రవరుడు అచ్ఛమైన వైదికుడు. నిత్యాగ్ని హోత్రి. విషయ పరాఙ్ముఖుడైన శ్రోత్రియుడు. ప్రవరుని కథ ద్వారా పెద్దన రెండు ప్రయోజనాలు సాధించాడు. ఒకటి, భోగలాలసతో కూడిన విషయ పరాయణతకు అవమాన తిరస్కారాలు కల్గించడం, రెండు విషయ పరాఙ్ముఖమైన ధార్మిక ప్రవృత్తికి విజయాన్ని కల్గించడం. ధర్మ బద్ధమైన జీవనానికి మోక్షాన్ని నిర్దేశించినవాడు పెద్దన.

మనుచరిత్ర ఆరంభంలోనే కవి శఠకోపయతీంద్రులను "ఆశ్రిత జనదురితచ్ఛల గాఢధ్వాంత సమితి శఠకోపయతిన్" అని స్తుతించాడు. ఇంకా మనుసంభవం కలిధ్వంసకం అని ఉగ్గడించాడు.

ప్రవరవరూధినీ ఘట్టాన్ని తాత్త్విక దృష్టితో పరిశీలించినప్పుడు, ధర్మార్థకామ మోక్షాలకు పెద్దన ఆయా వ్యక్తులను ప్రతీకలుగా చెప్పినట్లు ఒక అభిప్రాయం కలుగుతుంది.

ధర్మం - ప్రవరుడు
అర్థం - మాయా ప్రవరుడు
కామం - వరూధిని
మోక్షం - సిద్ధుడు

మరొక అడుగు ముందుకేసి చెప్పాలనుకున్నప్పుడు ప్రవర వరూధినీ మాయా ప్రవరులు త్రిగుణాలకు ప్రతీకలుగా నిలుస్తారు.

సత్త్వం - ప్రవరుడు
రజస్సు - వరూధిని
తమస్సు - మాయా ప్రవరుడు

సత్త్వ గుణాధిక్యతచేత ప్రవరుడు దేవతల్లో ఒకడుగా, రజోగుణాధిక్యంచేత వరూధిని మానవమాత్రురాలుగా, తమోగుణాధిక్యంచేత మాయాప్రవరుడు రాక్షసుల్లో ఒకడుగా భావింపబడుతారు. ఇది గుణాలను బట్టి చేసిన మానవ విభజన మాత్రమే. మానవ రాక్షస స్వభావాల కంటె భిన్నమైన దేవతాస్వభావమే గొప్పదని మనుచరిత్ర నిరూపిస్తుంది. ప్రవరుడు నిజంగా దేవత. వివిధా ధ్వర నిర్మల ధర్మకర్మ దీక్షా పరతంత్రుడు.

ప్రవరుని ముసుగులో మాయా ప్రవరుడు వరూధినితో కలిసి భోగాలనుభవించి తిరిగి వెళ్ళిపోయే ముందు ఇలా అంటాడు -

"ఎవ్వడు మీదెఱుంగక యథేచ్ఛ సుఖైక రతిన్
జరింపగా
నవ్వల వంశహాని, వ్రతహాని యశోధన హాని
పుట్టదా

నవ్వెడ నమ్మనుష్య పశువయ్యవివేకి చెడున్
జగంబునన్
నవ్వగపాలు రౌరవమునన్ బడ పాలును
నిందపాలునై" 3.135.

కేవలం కామ పురుషార్థాన్ని ఆశ్రయించిన వానికి కలిగే నష్టాలను పెద్దన మాయా ప్రవరుని ద్వారా వెల్లడించిన తీరు మనకు ఆశ్చర్యాన్ని కల్గించక పోదు. "మీ దెఱుంగక" అంటే పరమ పురుషార్థాన్ని తెలుసుకోక అని అర్థం.

నైదికుడైన పెద్దన ప్రవరుణ్ణి నైదిక నిష్ఠాగరిష్ఠునిగా అభివర్ణించాడు. అతిథి మర్యాదల విషయంలోను, యజ్ఞ యాగాదుల విషయంలోను, దానధర్మాల విషయంలోను, యమనియమాదులను అనుష్ఠించే విషయంలోను ప్రవరుని పాత్రను పెద్దన పరమ పురుషార్థానికి అభి ముఖంగా నడిపించాడు.

ముక్కు తిమ్మన ముద్దు పలుకులతో తీర్చిదిద్ద బడినపారిజాతాప హరణ ప్రబంధం సత్యాకృష్ణుల మధ్య ఏర్పడ్డ మనస్పర్థలను తెలుపుతుంది. సత్య అలుక చెందగా, కృష్ణుడు ఆమెను ఓదార్చడమే గాక పారిజాత వృక్షాన్నే ఆమె పెరటి చెట్టుగా నాటటం మొదలైన అంశాలను పైకి వర్ణించినప్పటికీ ఆ ప్రబంధం అంతర్గతంగా పరమార్థాభిముఖంగా రచింప బడింద నడంలో సందేహం లేదు. ఎక్కడ పరమేశ్వరుడుంటాడో అక్కడ ఐశ్వర్యం ఉంటుంది. జ్ఞానం ఉంటుంది, అమృతం ఉంటుంది అనటానికి నిదర్శనంగా కృష్ణుడు (పరమేశ్వరుని అవతారం) లక్ష్మి (ఐశ్వర్యం) నారదుడు (జ్ఞానం) పారిజాత పుష్పం(అమృతానికి సంకేతం) ఒక చోట కలిసి ఉండడం చూస్తాం.

ఈ ప్రబంధం ఆధారంగా చతుర్విధ పురు షార్థాలను ఆయా పాత్రలతో క్రిందివిధంగా సమన్వ యించ వచ్చు.

ధర్మం - కృష్ణుడు
అర్థం - రుక్మిణి
కామం - సత్య
మోక్షం - నారదుడు

మోక్షానికి సాధనాలు నాలుగు. ఒకటి ధర్మా చరణం. రెండు వైరాగ్యం. మూడు షట్కసంపత్తి. నాలుగు ముముక్షుత్వం.

ఆముక్తమాల్యద విష్ణు పారమ్యాన్ని ప్రబోధించి నప్పటికీ పరమ పురుషార్థమైన మోక్షాన్ని శ్రేష్ఠమైందిగా ఉద్ఘాటిస్తుంది. మోక్ష సాధనాలను ఆముక్త మాల్యదలోని ఆయా పాత్రలకు ఈ విధంగా అనుసంధానించి చెప్పవచ్చు.

1. ధర్మాచరణం - విష్ణు చిత్తుడు
2. వైరాగ్యం - కేశిధ్వజుడు
3. షట్కసంపత్తి - మాలదాసరి (శమం, దమం, దుష్టులకు దూరంగా వుండడం, శ్రద్ధ, చిత్తైకాగ్రత అనేవే షట్కసంపత్తి)
4. ముముక్షుత్వం - బ్రహ్మ రాక్షసుడు.

తన రాజ్యం ఖాండిక్యుని వశమైంది. ఈ సందర్భంలో కేశిధ్వజుడు పొందిన వైరాగ్యాన్ని రాయలు వర్ణించిన తీరు ఆయన పారమార్థిక దృష్టికి ఒక ఉదాహరణ.

"ఆకేశిధ్వజుడంత నాన్నపుని, రాజ్యంబెల్లజేరన్
ఫలం
బాకాంక్షింపక 'గెల్తుమృత్యువునవిద్యన్
పుట్టకుందున్ తుదన్
జాకుందున్ వడి' యంచు యోగనియతిన్
జ్ఞానాశ్రయుండై మఖా
నీకంబుల్ రచియించు చందొకటికిన్ తీక్షించి
తానున్న చోన్"

మృత్యువును జయించడం, పునర్జన్మ లేకుండా చేసుకోవడం, యోగాన్ని అవలంబించడం, జ్ఞానాన్ని ఆశ్రయించడం మొదలైన విషయాలు పరమ పురు షార్థానికి సోపానాలు.

కేశిధ్వజుడు ఇంకా ఇలా అంటాడు

"పరలోక సుఖము శాశ్వత
మరయ; మహీరాజ్య సౌఖ్యమల్పానేహః
పరిభోగ్యం; బిందులకై
దురితము గావించి తొలగుదునె పరమునకున్"

పరలోక సుఖం అంటే మోక్షం. దాని ముందు మహీరాజ్యం తృణప్రాయం. కనుకనే మోక్ష పురుషార్థాన్ని సాధించాలని అతని పట్టుదల.

విషయ సంసర్గం బంధానికీ, విషయ వైముఖ్యం ముక్తికీ కారణ మౌతాయన్నసత్యాన్ని రాయలు వ్యక్తపరిచాడు.

"ప్రాణి కోటికెల్ల బంధంబు, మోక్షంబు
చేరుటకును మనసు కారణమ్ము
విషయ సంగియైన వినుబంధకారి; ని
ర్విషయ మైన, ముక్తి విభావకారి"

శబ్ద స్పర్శరూపరసగంధాలైదు విషయాలు. వీటితో సంబంధం కలిగి ఉండడమే బంధం అవుతుంది. సంబంధంలేకుండా ఉండడమే ముక్తి. ఐతే ఈ బంధ మోక్షాలకు హేతువు మనస్సే అని చెప్పడంలో రాయల దార్శనికత ద్యోతకమవుతుంది.

ఖాండిక్యుడు "మనమున కెద్ది శోభాశ్రయము?" అని ప్రశ్నించినప్పుడు కేశిధ్వజుడొసగిన సమాధానం పూర్తిగా ఆధ్యాత్మికమైంది.

"అనిన కేశిధ్వజుడు వానికనియె; బ్రహ్మ.
మాశ్రయంబు మనమ్మున; కదియ పరము
నపరముననంగ బొలుచు; నందపరమనగ
మూర్తము, పరంబనగ నమూర్తమనఘ!"

మూర్తము - పాంచభౌతికమైన ప్రపంచం. అమూర్తము - పరమాత్మ. ప్రపంచం మృత్యురూపం. పరమాత్మ అమృతరూపం. మృత్యువును విడచి అమృతత్వాన్ని పొందాలని ఉపనిషత్ సందేశం.

మత్స్య ధ్వజుని కథలో కూడా పరమార్థానికి సంబంధించిన విషయమే ప్రస్తావింపబడింది. రాజు భోగిని ఇంటికి రాత్రి సమయంలో భోగాభిలాషియై బయల్దేరగా ఒక విప్రుడు పలికిన పలుకులు గమనింపదగ్గవి.

"వినియె నెలల్చ తుర్యయిని, వృష్టి దినాళికి;
రాత్రికైదివం
బున; జరకై వయస్సునను; బూని పరంబున
కిప్పుడుద్యమం
బనువున జేయగా వలయు నంచు పురోహిత
ధర్మమాత్యగీ
ల్కొనల విప్రుడా ద్విజులలోన సుభాషితమున్
పఠింపగన్"

వర్షాకాలంలో నాల్గు నెలలు సుఖించడానికి 8 నెలలు కష్టపడి సంపాదించాలి. అట్లే రాత్రికోసం పగటిపూట ముసలితనంకోసం యౌవనంలో సంపాదించాలి. అదేవిధంగా పరలోకంలో సుఖపడడానికి ఈ జన్మలోనే ప్రయత్నించాలని సుభాషితం.

పరమ వైష్ణవుడైన మాలదాసరి మంగళకైశికీ రాగంతో భగవంతుని కీర్తిస్తాడు. అతడు బ్రహ్మరాక్షసునికి చ్చిన మాట ప్రకారం తిరిగి వచ్చి పలికిన పలుకులు విష్ణువు దక్క మరొక దైవం లేడన్న విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

"ఎవ్వనిచూడ్కి చేసి జనియించు జగంబు,
వసించు నిజ్జగం
బెవ్వనియందు, డిందుమజియెవ్వని యందిది,
యట్టి విష్ణుతో
నివ్వల నొక్కవేల్పు గణియించిన
పాతకినౌదునేడనే
నెవ్విధినైన నిగ్గదియనేని" యనన్ విని
బంధమూడ్చినన్"

పాట ఫలితంగా బ్రహ్మరాక్షసునికీ, ఆ తర్వాత మాలదాసరికీ భవబంధాలు తొలగిపోతాయి. వారిద్దరికీ విష్ణు సామ్రాజ్యం లభించింది. ఆముక్తమాల్యద పూర్తిగా విష్ణు పారమ్యమైన కథలతో అలరారుతుంది.

రాయలు విష్ణుచిత్తుని కథను పరమరమణీయంగా చిత్రించాడు. విష్ణుమూర్తి యెడ గోదాదేవికి గల భక్తి ప్రపత్తులు అపారమైనవి. విష్ణు చిత్తునిఇల్లు విష్ణుకథలతో

ఎల్లవేళల ప్రతిధ్వనిస్తూ ఉండేది. అతిథి మర్యాదలకు ఆతని ఇల్లు పెట్టింది పేరు. పంచమహాయజ్ఞాలలో ఒకటైన అతిథి యజ్ఞాన్ని పెద్దన వలెనే రాయలు కూడా అద్వితీయంగా అభివర్ణించాడు.

"ఆనిష్ఠానిధి గేహసీమ నడు రేయాలించినన్
మ్రోయునెం
తేనాగేంద్ర శయానుపుణ్య కథలున్ దివ్య
ప్రబంధానుసం
ధానధ్వానము "నాస్తి శాక బహుతానాస్త్యుష్ణతా
నాస్త్యపూ
పో, నాస్త్యో దన సౌష్ఠవంచ, కృపయాభోక్తవ్య
మన్మాటలున్"

పింగళి సూరన కళాపూర్ణోదయం కల్పిత కావ్యమే అయినప్పటికీ అందలి ద్వారకాపుర, తిరుమల, కాంచీపుర, శ్రీరంగ, రామేశ్వరాదిక్షేత్రవర్ణనలు, యమునా కావేరీ తీర్థవర్ణనలు సూరన లౌకిక పారలౌకిక దృష్టికి అద్దం పడుతున్నాయి.

శ్రీరాముని చరిత్రను గానం చేస్తూ సూరన

"పరమంబగు నీ నామము
కరమామ్నా యములు తారక బ్రహ్మముగా
నిరతిన్ వినుతింపగ నా
తరమే" అని నామ సంకీర్తన గావించాడు.

సూరన యోగ విద్యాభ్యాస కుశలుడనడానికి కళాపూర్ణోదయం ఐదవ ఆశ్వాసంలోని స్వభవుని కథ చక్కని నిదర్శనం.

"విమలాత్మక! వినుము ప్రశ
స్తము జీవాత్మ పరమాత్మ సంయోగము యో
గమన, తదంగము లెనిమిది
క్రమమున వినిపింతు తత్ప్రకారము దెలియన్"

అష్టాంగయోగం పరమ పురుషార్థమైన మోక్షానికి మార్గం చూపుతుంది. పతంజలి యోగదర్శనం పఠిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

సూరన పరబ్రహ్మ స్వరూపాన్ని సగుణమని, నిర్గుణమని రెండువిధాలుగా అభివర్ణించి, సామాన్యులకు సగుణోపాసన సుకరమని తేల్చి చెప్పాడు.

"సగుణమనంగ నింకవిను, శంఖ సుదర్శన
ముఖ్యచిహ్నితం
బగు పురుషోత్తమాకృతి; తదన్యము నిర్మల నిత్య
చిన్మయం
బగు పరమాత్మ రూప; మదియబ్బుట
దుర్లభమెట్టి వారికిన్
సుగుణ విలాస చింతనము సల్పగ (జల్పగ
గాని భూసురా!"

సూరన చేసిన శారదాపీఠవర్ణన అతని పారమార్థిక విషయ పరిజ్ఞానానికి చక్కని ఉదాహరణ.

"ఋగ్వేద ఘోష సమృద్ధి పెంపొకచోట
నొకచోట యాజుషాభ్యుదయ మహిమ
సామగానధ్వాన చాతుర్యమొకచోట
నొకచోట నాథర్వ ణోక్తి గరిమ..."

తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యం, ఘటికాచల మాహాత్మ్యం ఈ రెండూ వైష్ణవ క్షేత్ర పారమ్య గ్రంథాలు.

"పాండురంగ మాహాత్మ్యం" ఆరంభంలో కుమారస్వామి శివుణ్ణి అడిగిన సందర్భాన్ని గమనిస్తే పాండురంగ క్షేత్ర ప్రభావం ఎలాంటిదో అర్థమవుతుంది.

"సర్వాతి శాయియైన దేవుడేనియు, నటువంటి
తీర్థమేనియు
నట్టి సుక్షేత్ర మేని భోగాపవర్గ దాయిగలదేని
యెఱిగింపు తడయక" అని కుమారస్వామి ప్రశ్నిస్తాడు.

అప్పుడు శివుడు ఈ కథ కొందరికి వినిపింపదగనిదంటాడు. కాని కుమారునికి, పార్వతికి మాత్రం వినిపిస్తాడు.

"శఠమతికి నాస్తికునకు పాషండునకును
కర్మముగుఱించి యాచించు గర్వితునకు
నీ పరమగోప్యమోపుత్ర ! యోపురంధ్రి
తప్పిదారియు నెఱిగింప తరము గాదు"

పుండరీక క్షేత్రం శివుని మాటల్లో భోగాపవర్గాలకు కేంద్రం. భోగం అంటే లౌకిక సుఖం. అపవర్గం అంటే మోక్షం. ఈ పుండరీక క్షేత్రంలోనే నిగమశర్మ లాంటి వాళ్ళు కనిపిస్తారుగాని నిగమశర్మకు వారెవరూ సాటిరారు. కాశీ ఖండంలోని మహానంద గుణనిధులను, శివరాత్రి మాహాత్మ్యంలోని సుకుమారుణ్ణి, నారసింహ పురాణం లోని మందేహుణ్ణి, నిరంకుశోపాఖ్యానంలోని నిరంకుశుణ్ణి, ఉద్భటారాధ్య చరిత్రలోని మదాలసుణ్ణి దుష్ప్రవర్తనలో ఒక్క నిగమశర్మ మాత్రమే అధిగమించా డంటే ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు. పాండురంగ మాహాత్మ్యంలో వర్ణింపబడిన ఆగస్త్య, గాణాపత్య, సాంకర్షణ, జాబాలి, బ్రహ్మ, కలశ, పితృ, చక్ర, లక్ష్మీ, పౌండరీక, ముక్తకేశ, సంగమ తీర్థాలు తెనాలి రామకృష్ణుని భక్తి ప్రపత్తులను చాటుతున్నాయి.

పౌండరీక దేవతల పూజావిధానాన్ని కవి కన్నులకు కట్టినట్లు వర్ణించాడు. రాధాకృష్ణుల చరిత్ర కవి పారమార్థిక దృష్టికి చక్కని ఉదాహరణ.

కృష్ణుడు రాధకు ప్రత్యక్షమైన తీరు కడు హృద్యం.

"ఇంద్రచాపంబుగాదిది మౌళితటమున
సవరించు బర్హిపింఛంబుగాని
భిదుర ఘతంబు గాదిది, పాంచజన్య సం
జాత గంభీర ఘోషంబుగాని
యాశ్రయించిన బలాకావళిగాదిది,
హారి ముక్తాహార యష్టిగాని
ఇదికోల మెఱుగు గాదుదితబంగారంపు
పసిడి గ్రమ్మెడు పచ్చపట్టుగాని
వృష్టిగాదిది కరుణాంబు వృష్టిగాని
నీలమేఘంబుగాదిది, నీలవర్ణు
డౌర! నా మ్రోల ప్రత్యక్షమయ్యె" ననుచు
హర్షపులకిత తనువయ్యె నవ్వధూటి

పరమేశ్వరుని యొక్క సర్వవ్యాపకత్వం ఇందులో వర్ణింపబడింది.

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని ప్రారంభపద్యమే కథా సూచనతోపాటు కవి పారమార్థిక దృక్పథాన్ని తెలియ జేస్తుంది.

"శ్రీ విద్యానిధియై మహామహిమచే
చెన్నై వసిష్ఠాజ లూ
తావాతాశన సామజాటవిక గో
త్రాదేవ నత్కీర రా
జీవాక్షీయుగ యాదవాధిపులకున్
శ్రేయస్కరంబైన యా
ర్యావామాంగము దివ్యలింగము మదీ
యాభీష్టముల్ సల్పెడిన్"

వసిష్ఠునికి, బ్రహ్మకు , సాలెపురుగుకు, పాముకు, ఏనుగుకు, బోయవాడైన తిన్ననికి, హరద్విజునికి, నత్కీరునికి, వేశ్యాతనయలకు, యాదవాధిపునికి, ముక్తిని ప్రసాదించిన దివ్యలింగం నా అభీష్టాలను తీర్చుగాక అని ధూర్జటి శివస్తుతి గావించాడు. శివభక్తి అనే ఏక సూత్రంతో ధూర్జటి ప్రబంధ రచన చేశాడు. కీటకానికి, చక్రికి, మదాంధునికి, చివరికి బహుజీవహంతకైనను సంసార బంధాన్ని తొలగించి మోక్ష నిధిని అందించే శక్తి కేవలం కాళహస్తి పుణ్యక్షేత్రానికుందని ధూర్జటి తలంచాడు.

ధూర్జటి సాకారోపాసన చేసినప్పటికీ నిరాకార వ్యాపక పరబ్రహ్మనే స్తుతించినట్లు ఈ పద్యాన్ని గమనిస్తే విషయం స్పష్టమవుతుంది.

"తన ఇల్లాలఖిలైకమాత, తన
సంతానంబుభూతవ్రజం,
బనులాపంబులు వేదముల్, తన
విహారాగారముల్ మౌని హృ
ద్వనజంబుల్, తన సేవకుల్ కమలజాత
శ్రీధరుల్ గాజెలం
గిన దేవోత్తమ నమ్మహాత్ముతరమే
కీర్తింపగా నేరికిన్"

జగన్మాతయైన పార్వతి ఇల్లాలుగా, సకలప్రాణికోటి సంతానంగా పలుకులు వేదాలుగా, విహారక్షేత్రాలు

మునుల హృదయపద్మాలుగా బ్రహ్మవిష్ణులు సేవకులుగా గల దేవదేవుణ్ణి కీర్తించడం ఎవరికీ శక్యం కాదని ధూర్జటి అభిప్రాయం. ఈ వర్ణనను బట్టి భగవంతుడు సర్వ వ్యాపకుడన్న విషయం ధ్రువ పడుతుంది. ఆకారం లేనప్పుడే సర్వవ్యాపకత్వం సిద్ధిస్తుంది.

తిన్నడు మూఢభక్తితో శివుణ్ణి ప్రసన్నం చేసుకున్నాడు. "నాకుంజుట్టము తల్లిదండ్రులు చెలుల్ నాధుండు నీదైవమే" అని మిత్రులతో చెప్పిన తిన్నని భక్తి అపూర్వమైనది. శతకంలోను ధూర్జటి ఈ అభిప్రాయాన్నే వెలువరించాడు - "అమ్మయ్యంచును ఎవరినేనన్నన్ నిన్ను నౌ సుమీ" నాతల్లి దండ్రులను పిలుస్తున్నానని నీవనుకోకు, ఈ జన్మలో నాతల్లీ, తండ్రీ గురువూ అన్నీ నువ్వే అంటాడు ధూర్జటి. శ్రీకాళహస్తి మాహాత్మ్యంలోని నత్కీరుని కథ విలక్షణమైంది.

నత్కీరుడు ఈశ్వరుని పద్యంలో తప్పుబట్టి, శాపగ్రస్తుడై కుష్ఠు వ్యాధిచే బాధపడి స్వర్ణముఖీనదిలో స్నానంచేసి పవిత్రుడయ్యాడు. శివుని సాక్షాత్కరించుకొని విన్నవించుకొన్న తీరు శాస్త్రవిహితమైంది.

"ఈ సంసారము దుఃఖా
వాసానందంబు; దీని వర్జింపంగా
నేసుఖము గలుగు దయ న
న్నా సుఖమున గూర్పవే కృతార్థుడనగుదున్"

"అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః" (సాంఖ్య దర్శనం, 1-1)

ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధి దైవికం అని మూడు రకాల దుఃఖాలు. వీటిని పూర్తిగా తొలగించుకోవడమే అత్యంత పురుషార్థం(మోక్షం). ఈ మూడు రకాల దుఃఖాన్నే ధూర్జటి సాంసారిక దుఃఖం అన్నాడు. దాన్ని తొలగించి మోక్షానందాన్ని ప్రసాదించమని శివుణ్ణి వేడుకొన్నాడు.

ధూర్జటి ప్రకృతి వర్ణనల్లోను ఆధ్యాత్మిక విషయాలను పొందు పరిచినాడు.

"ఉదయగ్రావము పానవట్ట, మభిషేకోద
ప్రవాహంబువా
ర్ధి, దరధ్వాంతము ధూప ధూమము, జ్వలద్దీప
ప్రభారాజి కౌ
ముది, తారానివహంబు లర్పిత సుమంబుల్
గా తమోదూర సౌ
ఖ్యదమై శీతగభస్తిబింబ శివలింగం బొప్పె
ప్రాచీదిశన్"

తూర్పున చంద్రుడనే శివలింగం ఉదయించింది. అది ఎలాగుందంటే తూర్పు కొండ పానవట్టంగా, సముద్రమే అభిషేకోదకంగా, చీకటి - ధూపపు పొగగా, వెన్నెల దీపకాంతిగా, తారలు పూలుగా కలిగి తమోదూర సౌఖ్యదమై అలరారుతుందట. ఇక్కడ తమస్సంటే చీకటితో పాటు అజ్ఞానం గ్రహింపబడుతుంది. అజ్ఞానం భవ బంధానికి హేతువు. జ్ఞానం ముక్తికి హేతువు. "జ్ఞానాన్ముక్తిః" అని వేదాంత దర్శనం చెబుతుంది. ధూర్జటి దృష్టిలో శివలింగం అజ్ఞానం అంటే అంధకారాన్ని తొలగించి మనకు జ్ఞానమనే అమృతాన్ని అందివ్వగల్గుతుంది.

ప్రబంధ కవులు వేదాలను, పురాణాలను, సమంగా గౌరవించి అనుసరించినట్లు కనిపిస్తున్నది. పురాణాల నుంచి కథలను గ్రహించినప్పటికీ వాటికి లౌకిక పారమార్థిక విషయాలను జోడించి అత్యద్భుతంగా ప్రబంధ రచన గావించారు.

ఇహపర సుఖాలను అందించేదే ధర్మం. అర్థకామాల కంటే విశేషంగా ధర్మాన్ని అవలంబించినప్పుడు అది మోక్షానికి అర్హతను కల్పిస్తుంది. ప్రబంధ సాహిత్యాన్ని అవలోకనం చేసినప్పుడు వైదిక జీవన విధానాన్ని అనుసరించి ఆచరించిన ప్రవరుడు విశేషంగా మననాకర్షిస్తాడు. మానవ జీవన పద్ధతికి ప్రవరుడు ప్రతీక. సిద్ధునిచేత, అగ్నిచేత, తల్లిదండ్రుల చేత, శిష్యుల చేత, లోకాల చేత కీర్తింపబడిన వాడు ప్రవరుడు. కళాపూర్ణోదయంలోని శాలీనుడు, తుంబురుడు, ఆముక్తమాల్యదలోని విష్ణుచిత్తుడు, యామునా చార్యుడు మాలదాసరి, కేశిధ్వజుడు, పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మఅక్క మొదలైన వారు పారమార్థిక జీవితానికి పట్టుగొమ్మలు. వీళ్ళంతా జ్ఞానాన్ని ఆశ్రయించి ముక్తికి

అర్హత సంపాదించినవారు. ఇక తిన్నడు మొదలైన వారు భక్తి చేత పరమాత్మను ప్రసన్నం చేసుకొన్నవారు. తిర్యక్కులకు సైతం మోక్షార్హత కలదని నిరూపించినవాడు ధూర్జటి. ఎంత దుర్మార్గుడైనా క్షేత్ర ప్రభావం చేత మోక్షార్హతను సంపాదించగలడని నిరూపించినవాడు తెనాలి రామకృష్ణుడు.

పై విషయాలను గమనించినప్పుడు చతుర్విధ పురుషార్థాలను వర్ణించి వాటిలో అర్థకామాల కంటె, ధర్మ, మోక్షాలే శ్రేష్ఠమైనవని నిరూపించడానికి ప్రబంధ కవులు ప్రయత్నించినట్లు స్పష్టమవుతుంది. ఏనాటికైనా మానవుడు పరమ పురుషార్థాన్ని పొందాలన్నదే ప్రబంధ కవుల అభిమతం !

తెలుగులో అధిక్షేప కావ్యాలు (ప్రాచీన యుగము)

డా. బి. రామరాజు

అధిక్షేపమంటే తిట్టు. అధిక్షేప కావ్యాలంటే తిట్టు కావ్యాలు. కావ్యమనేమాట ఒక చిన్న పద్యం మొదలు మహాగ్రంథం వరకు చెల్లుతుంది. కనుక తెలుగులోను మన ప్రాచీన కవులు ఎటువంటి తిట్టు కవిత్వం రచించినారో స్థాలీపులాక న్యాయంగా మనవిచేస్తాను. బాధ, కష్టాలు, అసహ్యం, పగ, అవమానం వంటివి తిట్టు కవిత్వానికి కారణాలనేకం. మనిషికి మాట పసరానికి దెబ్బ అనేది తెలుగు సామెత. బుద్ధి చెప్పటానికి మనిషిని తిట్టాలెనని పశువును కొట్టాలెనని ఈ సామెతకర్థం. కనుక మన ప్రాచీన కవులు తిట్లను కూడ నీతిని ఉపదేశించటానికే వాడినారన్నమాట. తమ కవిత్వంలో అనవసరంగా తప్పులు పట్టేవారినో, కుకవులనో, తమను సత్కరించనివారినో, మెచ్చి యిచ్చేటప్పుడుఅడ్డుపడే వాళ్ళనో అపకారం చేసినవారినో, బోకులనో, పీడించే దుష్టులనో, దుర్మార్గులనో, ప్రార్థిస్తే ఆదుకోనివారినో - దేవతలైనాసరే - కవులు తిట్టి పోసినారు. అవి వట్టి తిట్లు మాత్రమే కాక అందులో రమణీయార్థాలు, వ్యంగ్యార్థాలు, శ్లేషాద్యలంకారాలు, ఉక్తివైచిత్రి ఉండడం చేత కవిత్వ ప్రశస్తిని పొందినవి. వ్యక్తులు, స్త్రీలు, పురుషులు, సమాజము, వివిధ కులాలు, వృత్తులు, దేశకాల పాత్రములు, వివిధ వర్గాలవారు ఈ అధిక్షేప కవిత్వానికి పాత్రమైనారు. తెలుగు కవులు నేరుగా తిట్టినవాళ్ళు, పిల్లిమీదనో కుక్కమీదనో పెట్టి తిట్టినవాళ్ళు, మెత్తగా తిట్టినవాళ్ళు, మోటుగా తిట్టినవాళ్ళు, సభ్యతా మర్యాదల తిక్రమించకుండా తిట్టినవాళ్ళు, బండబూతులు తిట్టిన వాళ్ళు - ఈ విధంగా నానావిధాలుగా ఉన్నారు. అధిక్షేప కవిత్వం పద్యంలో, గద్యంలో, దండకంలో విడి విడి ముక్తకాలుగా సందర్భానుసారంగా ప్రాస్తావికంగా, చాటువులుగా, శతకాలుగా, కావ్యాలుగా, రెండర్థాల కావ్యాలుగా తీరు తీరులా ఉన్నది.

ముందుగా నన్నయాది మహాకవుల రచనల్లో ఆయా సందర్భాలలో కనిపించే అధిక్షేప కవిత్వం ఎటువంటిదో మనవి చేస్తాను. ధర్మరాజు రాజ సూయం చేసినప్పుడు భీష్ముని ఆదేశానుసారం శ్రీకృష్ణునికి అర్ఘ్యమిస్తాడు. అది సహించని శిశుపాలుడు

సీ॥ ఈతని వృద్ధని యెరిగి పూజించితే
వసుదేవుడుండంగ వసుమతీశ
ఋత్విజుండని విచారించి పూజించితే
ద్వైపాయనుండుండ ధర్మయుక్తి
ఆచార్యుడని వినయమున పూజించితే
కృతమతుల్ ద్రోణుండు కృపుడునుండ
భూనాధుడనియెడుబుద్ధి పూజించితే
యాదవుల్ రాజులే యవని మీద
పూజనీయులైన పురుషులలోపల,
నెవ్వడయ్యె కృష్ణుడిట్టులేల
పూజ్యులయినవారి పూజింపనొల్లక,
భీష్మ పనుపు జేసి బేలవయితి" అని అధిక్షేపిస్తాడు.

ఇది నన్నయగారి సభాపర్వం ద్వితీయాశ్వాసంలోని పద్యం. తిక్కన గారి అధిక్షేపం ఎంత నర్మగర్భంగా వ్యంగ్యంగా ఉంటుందోవినండి. కీచకుని వలన తనకు జరిగిన భంగపాటును ద్రౌపది విరాటరాజుకు నిండు సభలో ఎరుక చేస్తుంది. అది మర్యాదా భంగమని కంకుభట్టు వేషంలో ఉన్న ధర్మరాజు ద్రౌపదిని మందలిస్తాడు. ద్రౌపది అసహ్య వేదనతో ధర్మరాజును ఇట్లా అధిక్షేపిస్తుంది.

ఆ॥ నాదు వల్లభుండు నటుడింత నిక్కంబు,
పెద్దవారియట్ల పిన్నవారు
కాన పతుల విధమ కాకయే శైలూషి
గాననంగరాదు కంకు భట్ట!

మన ప్రాచీన కావ్యాల పీఠికల్లో కుకవినింద సుకవి స్తుతి అనే అంశాలు తరుచుగా వుంటాయి. ఈ సంప్రదాయాన్ని పాటించిన తొలికవి నన్నెచోడుడు. ఆతడు కుమారసంభవం పీఠికలో కుకవినింద చేస్తూ

"చెనసి గుణమైన దోషంబు చేయనేర్చు,
కుకవి కృతులందు దోషంబు గుణము సేయ
నేరడది యట్ల ! దొంతులు సేరినాయి,
దోర్వ నేర్చుగాకయేమి సేర్వ నేర్చు"

అని అధిక్షేపించినాడు. కుక్క దొంతులు దొర్లిస్తుందే కాని పేర్చలేదు. అట్లాగే కుకవులు గుణాన్ని దోషం చేస్తారే గాని దోషాన్ని గుణం చేయలేరని దీని తాత్పర్యం.

శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో కాశిని శపించిన వ్యాసులవారిని పరమ శివుడు అధిక్షేపించినపద్యంలో ఎన్ని తీర్ల తిట్లున్నాయో వినండి.

సీ॥ ఓరి దురాత్మ నీవారముష్టింపచా
భాస యోజన గంధి ప్రథమ పుత్ర
దేవరన్యాయ దుర్భావనా పరతంత్ర,
బహుసంహితావృథా పాఠపఠన
భారత గ్రంథ గుంభన పండితమ్మన్య,
నీ వా మదీయ పత్నికి నశేష
కైవల్య కల్యాణఘంటా పథమునకు,
కాశికాపురికి నిష్కారణంబ
శాపమిచ్చెదనని యనాచారసరణి
నడుగు వెట్టినవాడవహంకరించి
పొమ్మునిర్భాగ్య మాయూరి పొలము వెడలి,
యెచటికేన్ శిష్యులును నీవు నీ క్షణంబ"

నిద్రపోతున్న ఉప పాండవులను మధ్య రాత్రి దొంగచాటుగా వచ్చి క్రూరంగా చంపిన అశ్వత్థామను పోతన్నగారు తమ భాగవతంలో ద్రౌపదిచేత చాలా సభ్యంగా మెత్తగా తిట్టించిన పద్యం వినండి.

ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం
చిద్ద్రోహంబును నీకు జేయరు బలోత్సేకంబుతో చీకటిన్
భద్రాకారుల పిన్నపాపల రణ ప్రౌఢ క్రియా హీనులన్
నిద్రాసక్తుల సంహరింప నకటా నీ చేతులెట్లాడెనో!

భాగవతంలోనే హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుడు విష్ణు భక్తుడైనందుకుగర్హిస్తూ ఈవిధంగా అధిక్షేపించినాడు.

"అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శే
షాంగ శ్రేణికి రక్షసేయు క్రియ నీ యజ్ఞుం కులద్రోహి దు
ష్సంగుం కేశవ పక్షపాతి నధముం జంపించి వీరవ్రతో
త్తుంగ ఖ్యాతి జరించెదన్ కులము నిర్దోషంబు గావించెదన్"-

ఇంతవరకు ఉదాహరించినది ఆయా మహాకృతుల్లో సందర్భాను సారంగా చెప్పిన అధిక్షేప పద్యాలు. సంపూర్ణంగా అధిక్షేపంకోసం వ్రాసిన తెలుగు కృతులు కూడ చాలా వున్నవి. అట్టి వాటిలోక్రీడాభిరామం అగ్రగణ్యం. శ్రీనాథుని శృంగార జీవితము, ఆడంబరమైన పర్యటనలు, మొదలైన వాటిని అధిక్షేపిస్తూ శ్రీనాథుణ్ణి ఆతని స్నేహితుడు అవచి తిప్పయసెట్టినీ మనసులో పెట్టుకొని మంచనశర్మ టిట్టిభ సెట్టి అనే పాత్రలు కల్పించి శ్రీనాథుని శైలినే అనుకరిస్తూ అక్కడక్కడ శ్రీనాథుని పద్యాలనే వాడుకుంటూ వినుకొండ వల్లభరాయడు క్రీడాభిరామమనే వీధిని రచించినాడు. ఇది కాకతీయుల నాటి ఓరుగల్లుకు దర్పణం పట్టే రచన. ఇందులో ఆయా కులాలు తెగలకు చెందిన స్త్రీలను అధిక్షేపించే పద్యాలు ఆధునిక సమాజానికి నచ్చవు. నోరులేని పక్షి గనుక కోడిని తిట్టే పద్యం ఒకటి ఉదాహరిస్తాను. స్త్రీ పురుషులు రాత్రంతా క్రీడాసక్తులై ఉండగా తెల్లవారుతుండగా కూసిన కోడిని ప్రియుడు ఇట్లా తిడుతాడు.

"ఎట్టకేలకు నలుక రేయెల్లదీర్చి యువిద
యధరామృతముగ్రోలుచున్న నాకు
పాన విఘ్నంబుగా మ్రోసె పాపజాతి,
జాతి చండాలమైన వేసడపు కోడి"

కేవలం తిట్టు కవిత్వానికే అంకితమైన కావ్యాలలో తెనాలి రామలింగని శప్తవిజయము, చిత్రకవి వెంకట రమణకవి సకలవర్ణనా పూర్ణరామాయణము, కూచిమంచి జగ్గకవి చంద్రరేఖా విలాపము, పిండిప్రోలు లక్ష్మణకవి రావణదమ్మీయమనే ద్వ్యర్థికావ్యము, రేకపల్లి మహాదేవకవి చిన్ని వెంకట నరసీయము మొదలైనవి కొన్ని మాత్రమే. ఈ కావ్యాలన్నీ బూతుల మయం, సభ్యతా మర్యాదలను ఉల్లంఘించేవే. సాధారణంగా కావ్యారంభంలో ఉండే పద్యం భగవన్నుతి పరంగానో లేక కృతిపతికి మంగళా శాసనం చేసేదిగానో ఉంటుంది. కూచిమంచి జగ్గకవి తన కృతినాయకునికీ విధంగా మంగళాశాసనం చేసినాడు.

"శ్రీకంఠుండు భుజంగభూషణుడు భస్మీభూత పంచాస్త్రు డ
స్తోకాటోపబల ప్రతాప పురరక్షోదక్ష సంశిక్షణుం
డాకా శోజ్జ్వల కేశపాశుడు త్రిశూలాంకుండు తా
నీకం జింతలపాటి నీలనృపతిన్ వీక్షించు నేత్రత్రయిన్"

శివుడు నీలాద్రిరాజును మూడుకండ్లతో చూడాలె నని కవి ఆకాంక్ష. మూడవ కన్నుతెరిస్తే మిగిలేది బూడిద. జగ్గకవికి నీలాద్రి రాజుమీదఉన్న కోపం అంత గొప్పదన్న మాట. పూర్వకవి స్తుతిలోకూడ జగ్గకవి తనకంటే పూర్వులైన తిట్టుకవులనే స్మరించటం ఈ కావ్యంలోని మరో విశిష్టత.

క॥ భీమకవి రామలింగని,
స్త్రీ మన్మధుడై వెలుంగు శ్రీనాథకవిన్
రామకవి ముఖ్యులను ప్రో
ద్దామగతింజిత్తవీధి దలచికడంకన్" అంటూ వేముల వాడ భీమకవిని, తెనాలి రామలింగని, శ్రీనాథుని, తురగా రామకవిని స్మరించినాడు.

సంస్కృతంలో వలెనే తెలుగులో శతక ప్రక్రియ బహువిషయ విస్తృతమైనది. భక్తి, నీతి, మతం, శృంగారం, హాస్యం అధిక్షేపం, చరిత్ర, తత్త్వం, మొదలైన అనేక విషయాలు ఆలంబనగా వెలసిన శతకాలు తెలుగులో వేల సంఖ్యలో ఉన్నవి. ఈ తీరు శతకాల్లో అధిక్షేపాత్మక మైన పద్యాలనేకం ఉన్నవి. మల్లికార్జున పండితారాధ్యుల శివతత్త్వ సారంలో

క॥ "ప్రాజ్ఞులు వేదజ్ఞులు లో,
కజ్ఞులు చేకొంద్రె గతశిఖాగాయత్రీ
యజ్ఞోపవీతనాస్తికు,
లజ్ఞులు చేకొంద్రు గాక యద్వైతమజా" అంటూ

క॥ శివనిందావిషయంబగు,
నవమానము సెప్పునట్టి యప్పుస్తకముల్
అవిచారంబున గాల్పగ,
నవుచెప్పెడి వానిజంపనగునీశానా"
అంటూ అద్వైతులనూ శైవేతరులనూ అధిక్షేపించిన పద్యాలున్నవి.

ధూర్జటి మహాభక్తుడు రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకంలో

శా॥ రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు వారిచ్చునం
భోజాక్షీ చతురంతయానతురగీభూషాదు లాత్మవ్యధా
బీజంబుల్ తదపేక్షచాలు పరితృప్తింబొందితిన్ జ్ఞానల
క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ముదయతో శ్రీకాళహస్తీశ్వరా"

అంటూ చేసిన ప్రార్థనలో కూడ రాజదూషణం ఉన్నది.

ఒకప్పుడు తెలుగు వీధి బళ్ళలో బాగా ప్రచారంలో ఉండిన శేషప్ప నరసింహాశతకంలో

సీ॥ మాన్యంబు లీయసమర్థుడొక్కడులేడు,
మాన్యముల్ జెరుప సమర్థులంత
యెండిన యూళ్ళగోడెరిగింపడెవ్వడు,
పండిన యూళ్ళకు ప్రభువులంత
యితడు పేద యటంచు నెరిగింపడెవ్వడు,
కలవారి సిరులెన్నగలరు చాల
తనయాలిచేష్టల తప్పెన్నడెవ్వడు,
పెరకాంతరంకెన్న పెద్దలంత

గీ॥ యిట్టి దుష్టుల కధికార మిచ్చినట్టి,
ప్రభువు తప్పులటంచును బలుకవలెను
భూషణవికాస శ్రీధర్మ పురినివాస,
దుష్ట సంహార నరసింహ దురితదూర"

అంటూ అన్ని కాలాలకూ పనికి వచ్చే అధిక్షేపాత్మక పద్యం రచించినాడు.

నీత్యుపదేశక శతకాల్లో సుమతి, భాస్కర, కుమారీ, కుమార, వేమన శతకాలు చాలా ప్రశస్తమైనవి. సుమతి శతకకారుడు.

క॥ కనకపు సింహాసనమున,
శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునం
దొనరగపట్టము గట్టిన,
వెనుకటి గుణమేల మాను వినురా సుమతీ

క॥ "చీమలు పెట్టిన పుట్టలు,
పాముల కిరవైన యట్లు పామరుడు దగన్
హేమంబు గూడబెట్టిన,
భూమీశుల పాలజేరుభువిలో సుమతీ"

అంటూ అల్పులనూ, లోభులనూ అధిక్షేపించినాడు. భాస్కర శతకకారుడు

ఉ॥ "ఊరక సజ్జనుండొదిగి యుండిన
నైనదురాత్మకుండు ని
ష్కారణమోర్వలేక యపకారము చేయుట
వాని విద్యగా
చీరలు నూరుటంకములు చేసెడివైనను
పెట్టె నుండగా
చేరి చినిగిపోగొరుకు చిమ్మట కేమి
ఫలంబుభాస్కరా" అంటూ

నిష్కారణంగా పరులకు కీడుచేసే దుర్మార్గులను అధిక్షేపించినాడు. లోకవృత్తం యావత్తు సమీక్షిస్తూ నీతి నుపదేశించే శతకాల్లో వేమనశతకం చాలా గొప్పది, వేమన

"అల్పుడైనవాని కధికారమిచ్చిన,
దొడ్డవారి నెల్ల తొలగగొట్టు
చెప్పుతినెడు కుక్క చెరకు తీపెరుగునా,
విశ్వదాభిరామ వినురవేమ"

అంటూ అల్పబుద్ధివారిని అధిక్షేపించినాడు. కేవలం అధిక్షేపమే(ప్రధానంగా ఉన్న శతకాలు తెలుగులో చాలా వున్నవి. కవి చౌడప్ప శతకము, కూచిమంచి తిమ్మకవి, భర్గ, కుక్కుటేశ్వర శతకాలు; కూచిమంచి జగ్గకవి భక్తమందార శతకము, అడిదము సూరకవి రామలింగేశ శతకము, పోలిపెద్ది వెంకట రాయకవి వేణుగోపాల శతకము తిట్లదండకము, వంకాయలపాటి వెంకట రాయకవి మదనగోపాల శతకము, గువ్వల చెన్నని శతకము; గోగులపాటి కూర్మనాధుని సింహాద్రి నార సింహ శతకము; చట్రాతి లక్ష్మీనరసుకోదండరామ శతకము; కాసుల పురుషోత్తమ కవి ఆంధ్రనాయక శతకము; భల్లా పేరయ్య భద్రగిరిశతకము వంటివి కొన్ని మాత్రమే. చౌడప్ప తిట్టుకవిత్వం చెప్పిన వారిలో ఘనుడు. పదినీతులు పదిబూతులు పది శృంగారములుగల్గు పద్యములు సభన్ చదివినవాడే అధికుడని చౌడప్ప అభిప్రాయం. నీతినుపదేశించటానికే బూతునా శ్రయించినట్లు చౌడప్పఘంటాఘోషంగా చాటినాడు. "తగుపాటి కవులకియ్యని మొగముండల కేలగలిగె మూతిని మీసల్, దిగగొరుగ డాయెమంగలి", "ఇయ్యగ నిప్పించగల యయ్యలకేగాక మీసమందరికేలా? రొయ్యకు లేదా బారెడు" అంటూ దాతృత్వం లేనివారిని అధిక్షేపించినాడు. వ్యాజోక్తిని ఆశ్రయించి భగవంతుణ్ణి కూడ అధిక్షేపించిన మహాకవుల్లో కాసుల పురుషోత్తమకవి, గోగులపాటి కూర్మనాధుడు అగ్రగణ్యులు. కృష్ణాతీరం లోని శ్రీకాకుళం ప్రాచీనాంధ్ర దివ్య క్షేత్రం. అక్కడి దేవుడు శ్రీకాకుళాంధ్ర విష్ణువు. శ్రీకృష్ణ దేవరాయల కాలం దాక గొప్ప వైభవాన్ని అనుభవించిన ఆ దేవుడు గోల్కొండ సుల్తానుల కాలంనుండి దైన్యం అనుభవించ సాగినాడు. ఆ దయనీయ స్థితిని గమనించిన కాసుల పురుషోత్తమ కవి తన ఆంధ్ర నాయక శతకంలో,

సీ॥ పూతనా కుచకుంభ పూర్ణవిషస్తన్య
పాయివై బ్రతికిన భాగ్యమేమి?
కాళియాశీవిషగ్రసన ప్రమాదంబు గడచి
జీవించిన ఘనత యేమి?
చాణూరమల్ల దోస్తంభఘట్టన కోర్చి
లబ్ధ జయుడవైన లాభమేమి?
సాళ్వ రాజామోఘశక్తి ప్రయోగంబు
మరలించుకొనిన సామర్ధ్యమేమి?

గీ. బడుగుదాసరి వలెనన్న వస్త్రములకు ,
పరుల కాశింతువిచట నీ పంతమేమి?
చిత్రచిత్ర ప్రభావ దాక్షిణ్య భావ,
హత విమతజీవ శ్రీకాకుళాంధ్ర దేవ

అని ఆక్రోశించినాడు. అట్లాగే విధర్మీయుల సైన్యాలు సింహాచలమునూ ఆ ప్రాంతజనులనూ కొల్లగొట్టి హింసించినపుడు క్రోధాగ్నితప్తుడైన గోగులపాటి కూర్మనాథకవి తన సింహాద్రి నారసింహ శతకంలో

సీ॥ పాలీయ వచ్చిన భామిని ప్రాణంబు
లపహరించి చెలంగినట్లుగాదు
యాగోత్సవంబున కతిమోదమున

బిల్వనంపు మామను ద్రుంచినట్లుగాదు
చేతగాకొక నరుచేత చుట్టంబుల
నందర జంపించినట్లుగాదు
తుంగ గల్పించి యుత్తుంగ వంశద్రోహ
మాచరించి చెలంగునట్లు గాదు

గీ॥ పరబలంబిది నీ ప్రజ్ఞపనికి రాదు,
లెమ్మికను మీనమేషముల్లెక్క యిడక
చొరవ తురకలుగొట్టగా చుక్క యెదురె,
వైరి హరరంహ సింహాద్రి నారసింహ

అంటూ నరసింహస్వామిని ఉపాలంభించి నాడు, వాచ్యార్థంలో ఈ రెండుశతకాలు పైకి అధిక్షేపంగా ఉన్నా అంతరంగంగా భగవన్నుతిపరమైన వ్యంగ్య శతకాలు. ఈ అలంకారాన్ని వ్యాజనింద అంటారు.

అధిక్షేపాత్మకమైన చాటువులు వేములవాడ భీమ కవి, మేధావిభట్టు, బడబాగ్ని భట్టు, శ్రీనాథుడు, ప్రౌఢకవి మల్లన, తెనాలి రామలింగము, అల్లసాని పెద్దన, భట్టుమూర్తి, కందుకూరి రుద్రయ్య, ఎరవల్లి పర్వతన్న, బొడ్డుచర్ల వెంగన్న, రాళ్ళబండి పట్టాభిరామరాజు, మోచెర్ల వెంకన్న, అడిదము సూరకవి, రేకపల్లి సోమనాథుడు, అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి మరింకెందరో చాలా రచించినారు. ఇట్టి పద్యాలు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సంపాదించిన చాటుపద్య మణిమంజరిలోను, దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు సంపాదించిన చాటుపద్య రత్నాకరం లోనూ నూర్లసంఖ్యలో ఉన్నవి. శ్రీనాథుని శృంగార జీవితాన్ని నిందించిన రాజమహేంద్రవరపు పండితులను శ్రీనాథుడు అధిక్షేపించిన పద్యంతో దీనిని విరమిస్తాను.

హంసీయానకు కామికిన్నధమరోమాళుల్ నభఃపుష్పముల్
సంసార ద్రుమమూలపల్లవగుళుచ్ఛంబైన యచ్చోటి వి
ద్వాంసుల్ రాజమహేంద్ర పట్టణమునన్, ధర్మాసనంబుండి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావమనుచున్ తర్కింతు రెల్లప్పుడున్

శ్రీవానమామలై వరదాచార్యులు

డా. ఎం. కులశేఖరరావు

ఆధునిక యుగంలో తెలుగు కవిత అనేక విధాల పోకడలు పోయింది. ప్రాచీన పద్ధతినుండి తప్పుకొని కొత్త మార్గాన్ని అవలంబించాలని చాలమంది కవులు ఇరవదవ శతాబ్ది ప్రారంభంనుండి ప్రయత్నాలు ప్రారంభించినారు. కందుకూరి వీరేశలింగం గారు వ్రాసిన సరస్వతీ నారద సంవాదంలో, ఆనాటి కవులు ప్రాచీన కవిత్వంలో మార్పులు రావాలని ఎట్లా కోరుకున్నారో స్పష్టమైంది. ఇంగ్లీషు వారు ఈ దేశాన్ని పరిపాలించడం ప్రారంభం కావడంతో, దేశీయుల దృష్టి పాశ్చాత్య సాహిత్యాలపై మరలింది. మన విద్యావిధానంలో భారతీయులు ఆంగ్లం అభ్యసించడమే దానికి ముఖ్య కారణం. ఆ సమయంలో ఇంగ్లీషు సాహిత్యంలో కాల్పనికోద్యమం మనవారిని బాగా ఆకర్షించింది. తత్ఫలితంగా ఆ సాహిత్యంలోని కవుల కుండే ఉద్రేకం, సరసత్వం, ప్రణయ సమారాధన ఈ కవులు తమ సొంతం చేసికొన్నారు. అందుచేతనే మన కవులు సహజంగానే భావకవిత్వం వ్రాసి పాఠకుల మన్ననలను అందుకొన్నారు. ఈ భావ కవులు దాదాపు 25 సంవత్సరాలు కథా కావ్యము, ఖండకావ్యము, గేయము, ప్రేమకవిత, ప్రబోధ కవిత, ప్రకృతి కవిత, స్మృతి గీతము, పల్లీయ కవిత్వం మొదలైన ప్రక్రియలను విజయవంతంగా నిర్వహించినారు.

కొంతకాలం గడిచేటప్పటికి, భావకవిత్వానికి కాల దోషం పట్టినట్టయింది. అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమం రావడం వలన కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండవలెననే ఒక దృక్పథానికి ప్రాధాన్యం ఏర్పడింది.ప్రకృత్యారాధన, ప్రేమకవిత్వం వంటివి సమాజానికి ఉపకరించేవి కావు. మానవుడు అభ్యుదయం వైపు అడుగు వేయవలసి ఉన్నది అని సామాజికులతో బాటు కవులుకూడ భావించడం ప్రారంభించినారు. నిజానికి ఇది ఒక దేశవ్యాప్తమైన ఉద్యమం. ఇంగ్లీషులో దాన్ని ప్రోగ్రెస్సు కవిత్వం అంటే తెలుగు కవులు దాన్ని అభ్యుదయ కవిత్వం అని నామకరణం చేసికొన్నారు. చాలమంది కవులు ఈ దారిలో పయనించి ఉత్తమ కవిత్వాన్ని సృష్టి చేసినారు. వారందరికి నాయకత్వం వహించినవారు శ్రీశ్రీ అని చెబితే అతిశయోక్తి కాదు. ప్రాచీన కవిత్వంపై తిరుగుబాటు, నూతన వస్తుగ్రహణం, మానవత్వం విలువల ప్రకటన, ప్రజల కష్ట సుఖాలపై ఆలోచన అభ్యుదయ కవితలకు ఆటపట్టైనాయి. అభ్యుదయ కవులందరి మీద మార్క్సిజం ప్రభావం ఉన్నదని, ఒక విధంగా ఈ ప్రక్రియ కూడ పాశ్చాత్య దేశాల భావజాలానికి లోబడి తెలుగులో ఆవిర్భ వించిందని విమర్శకులు భావిస్తారు.

అభ్యుదయ కవుల అభ్యుదయ భావాలు లోకంలో, సమాజంలో మార్పులు తీసికొని రావడానికి విఫలం అయినాయని భావించిన కొందరు కవులు విప్లవ కవులుగా తమను తాము స్థాపించుకొని, రివల్యూషన్ రావాలని వాంఛించి కవితలు వ్రాయడం ప్రారంభించి నారు. అభ్యుదయ కవిత్వంలో ఉండే కొద్దిపాటి లయను, మాత్రాగణముల పోకడనుకూడ వారు తమ రచనల్లో త్యజించినారు. విప్లవకవుల వలననే తెలుగు కవిత్వంలో వచన పద్యానికి వ్యాప్తి వచ్చింది. విప్లవకవుల్లోనే మరికొందరు తమను తాము దిగంబర కవులమని ప్రకటించు కొని సమాజంలోని అన్యాయాలమీద ఆగ్రహం ప్రకటించి, కవితతో తమ భావాలను వ్యక్తం చేసినారు. ఈ కవులను ఆగ్రహోదగ్రులైన కొందరు యువ కవులుగా గ్రహించవచ్చును.

ఆధునిక యుగంలో ఇటువంటి నూతన ప్రక్రియలు, వెలువడుతున్నప్పటికి, ఆంధ్రదేశంలోని కవి పండితులను, ప్రాచీన కావ్యప్రభావం వదలిపెట్టలేదు. వీరేశలింగంగారు వ్రాసిన శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్య నైషధం మొదలుకొని, ఎందరో కవులు అనేకకావ్యాలు రచించి ఉన్నారు. వీటిలో కథ ప్రాచీనం కావచ్చు, నవీనం

కావచ్చును. ఛందోబద్ధంగా ఉండేపద్య రచననే చాలా మంది కవులు రచనా మాధ్యమంగా గ్రహించినారు. అలంకారాలు, వర్ణనలు దాదాపు ప్రాచీన మార్గంలోనే ఉంటాయి. అయినా, దేశభక్తి మానవ సంస్కృతిపై అనురక్తి, స్వాతంత్ర్యేచ్ఛవంటి నూతన భావాలు వీరు ఆలంబనంగా చేసి కొంటారు. ఇతిహాస కథోద్భూతంగా ఉండాలని, చతుర్వర్గ ఫలోపేతంగా ఉండాలని, ఉదాత్త నాయకాశ్రితంగా ఉండాలని, ఈ రచయితలు భావించి నారు. ఇటువంటి కావ్యాలను, మహాకావ్యాలని, నవీన సంప్రదాయ కావ్యాలని విమర్శకులు పేర్కొంటారు.

ఆధునిక యుగంలో ఇటువంటి నవీన సంప్రదాయ కావ్యాలు దాదాపు నూరు నూటఇరువది దాకా వెలువడి నాయి. వీటిలో పురాణాలు, మహాకావ్యాలు, ప్రబంధాలు కనిపిస్తాయి. శివభారతం, రాణాప్రతాప సింహచరిత్రము, శ్రీమద్రామాయణ కల్పవృక్షం, ఆంధ్రపురాణం, సౌందర నందం మొదలైనవి ప్రధానంగా చెప్పవలె. వీటిలో ప్రాచీన ఇతివృత్తం ఉన్నది. సంప్రదాయ పద్యరచన ఉన్నది. కావ్యానికి ఉండే నవ్యత ఉన్నది. అందుచేతనే ఈ కావ్యాలు చదువరులను అలరిస్తూనే ఉన్నవి. ఈ నవ్య సంప్రదాయ కావ్య పరంపరలో శ్రీ వానమామలై వరదాచార్యుల వారి పోతన చరిత్ర కూడ తగిన స్థానాన్ని గ్రహించింది.

వేయి సంవత్సరాలుగా తెలుగు వాఙ్మయాన్ని సుసంపన్నం చేసిన ప్రాచీన కవులెందరో ఉన్నారు. వారికి కూడ ఉదాత్త చరిత్ర ఉన్నది. కాని, చాలా సందర్భాలలో వారి జీవిత విశేషాలు స్వల్పంగానే తెలియవస్తున్నాయి. అందుచేతనే కాబోలు, తిక్కన గారి వంటి వారిని గురించి ఒకటిరెండు కావ్యాలు తప్ప మరింకను వెలువడలేదు. అదృష్ట వశాత్తు ఆంధ్ర మహాభాగవతాన్ని రచించిన బమ్మెర పోతనను గురించి, ఆయనకు సన్నిహితుడుగా భావింపబడుతున్న కవిసార్వభౌముడు శ్రీనాథుని గురించి కొన్ని విశేషాలు ప్రచారంలో ఉన్నాయి. వాటిని విని తెలుగువారు ఆనందిస్తు ఉంటారు. ఈ విశేషాలను అన్నింటిని సేకరించి, శ్రీవానమామలై వరదాచార్యుల వారు పోతన చరిత్ర అనే పేరుతో ఛందోబద్ధమైన కథాకావ్యముగా రచించినారు.

మన దేశానికి స్వాతంత్ర్యం రాకపూర్వం, దేశ వాసులందరిలో దేశభక్తి ఉన్నట్లుగానే, కవులలోకూడ దేశంమీద అభిమానం ఉండేది. కాని, పరిస్థితులు విషమంగా ఉన్నకారణంగా ప్రత్యక్షంగా, మాకు స్వాతంత్ర్యం కావాల, విదేశీ పాలకులు వెళ్ళి పోవాలె అని చెప్పే అవకాశం ఉండేదికాదు. అందుకే ఆ నాటి కవులు దేశమును ప్రేమించుమన్నా, ఏ దేశమేగినా ఎందు కాలిడినావంటి గేయాలు వ్రాసి వ్యంగ్యంగా దేశభక్తిని లోకంలో వ్యాప్తి చేయడానికి ప్రయత్నం చేసినారు. గడియారం శేషశాస్త్రిగారు శివభారతం రచించి, భారత దేశానికి స్వాతంత్ర్యం రావాలని పరోక్షంగా ఉద్బోధ చేసినారు. ఆ పద్ధతిలోనే వరదాచార్యులు, పోతన్న కవి తాను కవితామార్గంలో స్వాతంత్ర్యాన్ని కాంక్షించిన విధానం గురించి, దాన్ని సాధించిన పద్ధతి గురించి ఉల్లేఖించి నారు. ఎన్ని ఇక్కట్లు కలిగినా, తన యిష్టదైవ మైన శ్రీరామునికి అంకితంచేసి కవి తన స్వాతంత్ర్యాన్ని ఎట్లా నిలుపుకొన్నాడో ఈ కథ మనకు వ్యక్తం చేస్తుంది.

కావ్యాల్లో కథలు చెబుతున్నపుడు, హృద్యంగా చెప్ప వలెనని ప్రతి కవి కోరుకుంటాడు. పోతన శ్రీనాథాదుల వృత్తాంతాలు లోకంలో వ్యాప్తిలో ఉండగా వాటిని గ్రహించి, కొన్ని చక్కని కల్పనలుచేసి కథను మనోహరం చేసినాడు కవి. తెలుగులో శ్రీ మద్భాగవత రచనకు పూర్వరంగంగా ఒక వృత్తాంతాన్ని ఈ కవి కల్పించు కోవడం ఇచట గ్రహించ వచ్చును.

పోతన తెలుగుభాషలో వ్యాసప్రోక్త భాగవతాన్ని రచించే వృత్తాంతం ఇంద్రునికి తెలిసిందట. దేవభాషలో కాక, ఒక దేశభాషలో శ్రీ మద్భాగవతాన్ని ఎవరైనా రచించడం దేవరాజుకు ఇష్టం లేదు. ఇంద్రుడు తన పరివారంతో వెళ్ళి విష్ణుమూర్తిని దర్శించి, ఈ అవాంఛిత రచనను వారింపుమని ప్రార్థించాడు. కాని, సత్కృతిని విష్ణుమూర్తి నివారించడు కదా. అందుచేత, తపస్సమాధి వహించని కవి, మహాకావ్యం వ్రాయడం సాధ్యం కాదు

కాబట్టి, పోతన తపోనియమాన్ని భంగం చేయడానికి ప్రయత్నించుమని ఇంద్రునికి సలహానిచ్చాడు. అపుడు ఇంద్రాదులు సింగభూపాలాదులై జన్మించి, ఆంధ్ర భాగవతం నరాంకితం అయ్యేటట్లు చేసి, దాని మోక్ష ప్రదత్వానికి, విఘ్నం చేయడానికి ప్రయత్నం చేసినారు. ఈ వృత్తాంతం వరదాచార్యుల వారికల్పితమే. దీని వలన పోతనకావ్యానికి ఒక పూర్వరంగం సిద్ధమైంది. విష్ణుమూర్తి తనభక్తుడైన పోతన్నను రక్షించి తన శరణాగతవత్సల త్వాన్ని ప్రదర్శించే మరొక అవకాశం కలిగింది. ధర్మాన్ని ఉద్ధరించే పనిచేయడం సాధ్యమైంది. ఇది అతిలోకమైన వృత్తాంతం అయినప్పటికి, భాగవత రచనకు, తెలుగు భాష, సంస్కృతానికి ఏమాత్రం తీసిపోదు అని నిరూపిం చడం సాధ్యమైంది. ఈ విధంగా కవి తన కల్పనా సామర్థ్యంతో బాటు, తన సొంత భాషపై అభిమానాన్ని, ప్రేమను వ్యక్తం చేసే సదవకాశం లభించింది. కథలో ప్రతి నాయకుణ్ణి సృష్టించే సదవకాశం లభించింది.

వరదాచార్యుల వారు, పోతన కథను తన కావ్య వస్తువుగా ఎన్నుకొనడంలోని ఔచిత్యాన్ని గురించి ఆలోచించవలె. పోతన సహజ కవియైనా, ప్రవృత్తిపరంగా గొప్పభక్తుడు. శ్రీమన్నారాయణమూర్తి దశావతారాలను వర్ణించే మహాభాగవతాన్ని తెలుగులో ఆవిష్కరించడానికి పూనుకొన్నవాడు. భక్తి భావం మీద ఆయనకు చాల శ్రద్ధ ఉన్నది. శ్రీమద్భాగవతంలో, గజేంద్రుడు, ప్రహ్లాదుడు, ధ్రువుడు,అంబరీషుడు వంటి మహావిష్ణు భక్తుల కథలను మనోహరంగా, అనితర సాధ్యంగా చిత్రించినాడు. ఏ కథ చెప్పినా ప్రపత్తి, శరణాగతి, చెప్పి విశిష్టాద్వైత సిద్ధాంతం మీద తనకున్న ప్రత్యయాన్ని ప్రదర్శించినాడు. 'నీవే తప్ప నితఃపరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్' అనడంలో ప్రపత్తి తత్త్వం 'అన్యధాశరణం నాస్తి త్వమేవ శరణం మమ'అనే భక్తి భావమే. ఇక స్వయంగా, శ్రీరామచంద్రుని సాక్షాత్కారం చేసికొన్న మహానుభావుడు పోతన్న. మెరుగు చెంగట నున్న మేఘంబు కైవడి మనోహర రూపంలో శ్రీరాముడు ఆయన ఎదుట నిలబడి భాగవతాన్ని రచింపుమని కోరినాడు. అందుచేతనే భాగవతాన్ని పోతన వ్రాసినా పలికించెడువాడు రామభద్రుడే కదా.

ఇటువంటి భక్తి భరిత కావ్యాన్ని వరదాచార్యులవారు ఎన్నిసార్లు మననం చేసినారో! దానివలన ఆకర్షింపబడి, ఆ కవి చరిత్రను తన కావ్య వస్తువుగా ఎన్నుకొన్నారు. పోతన వలెనే వరదాచార్యుల వారు కూడ పరమ భాగవతోత్తములే. నిష్ఠ, నియమాలు కలిగిన ఆచార్యులు, గురుముఖతః తిరుమంత్రోపదేశం పొంది వంశపారం పర్యంగా వచ్చే విశిష్టాద్వైత సంప్రదాయాన్ని నిరంతరం ఆచరించిన భాగవతోత్తముడు. ఇటువంటి ఆధునిక కవి పోతన వంటి ప్రాచీన కవిచేత ఆకర్షింపబడడంలో ఆశ్చర్యం లేదు. పైగా ఈ ఇద్దరుకవులకు ఇటువంటి పోలికలు ఉండడం చేతనే కాబోలు ఆయనకు అభినవ పోతన అనే బిరుదం లభించింది. అది సార్థకమైంది కూడ.

పోతనగారు తన కావ్యంలో ఎక్కడా చెప్పని ఆయన గురువును గురించి లోకంలో ప్రచారం ఉన్నది. ఆ గురువుగారి పేరు చిదానందయోగియట. ఆ మహాను భావుడు, పోతన భక్తిభావాన్ని మెచ్చుకొని, అతనికి రామతారక మంత్రాన్ని శారదామంత్రాన్ని ఉపదేశించి నాడట. లోకంలో ఉండే ఈ వృత్తాంతాన్ని గ్రహించడంలో ఔచిత్యం లేకపోలేదు. వైష్ణవులు గురుముఖతః తిరు మంత్రోప దేశం పొందితేకాని, తమ జన్మ సార్థకమైందిగా భావించరు. ఎంతటి సహజపండితుడైనా, బమ్మెర పోతన గురుముఖంగా మంత్రోపదేశం లేనిదే, ఇంతటి మహా కావ్యం వ్రాయగలడా అని వరదాచార్యులవారు భావించి ఉంటారు. ఆయన వైష్ణవోత్తముడు కదా. అట్లా భావించడం చేతనే ఈ పోతన చరిత్రలో చిదానంద యోగికి తనపాత్ర లభించింది కథకు ఒక పట్టు దొరికింది.

చాలాకాలంగా తెలుగు సాహిత్యకులు పోతన గారి నివాసస్థానాన్ని గురించి చర్చించుకొంటున్నారు. ఓరుగల్లుకు సమీపంలో ఉండే బమ్మెర నివాసియా లేక రాయలసీమలో ఉండే ఒంటిమిట్ట నివాసియా అనేదే ఈ చర్చ. ఈ రెండు పక్షాలకు తగిన ఆధారాలు న్నాయని ఈ చర్చ చేసేవారు చెబుతారు. పోతన చరిత్ర వ్రాసిన వరదాచార్యుల వారు ఈ వివాదంలో దిగినవారు కాదు. పైగా కథా

కథనంలో ఒక మంచి సమన్వయం సాధించుకొన్నారు. పోతన బమ్మెర లోనే జన్మించినాడు. అక్కడనే మంత్రోపదేశం జరిగింది. దాని సమీపంలో ఉండే నదీతీరంలోనే శ్రీరామ సాక్షాత్కారమైంది. భాగవత రచన అక్కడనే కొనసాగింది. ఒక బలహీన పరిస్థితిలో దానిని కర్నాట నృపాలునికి అంకితంచేసే అభిప్రాయం కలిగింది. కాని మెట్టు గిరిమీద సరస్వతీ దేవి సాక్షాత్కరించి, కన్నుల నీరుపెట్టుకొని విలపించింది. పోతన్న ధైర్యం వహించి తన నరాంకిత భావాన్ని మరల్చుకొన్నారు. అయినా కర్ణాటరాజ చమూపతి, ఎంతవారించినా వినక కావ్యాన్ని అపహరించు కొని పోతుండగా, సింగ నృపాలుని సైనికులు అతన్ని ఎదరించి కృతిని రాచకొండకు తీసికొని పోయినారు. ఇదంతా చూసిన పోతన్నకు విరక్తిభావం కలిగింది. అతడే కాంతంగా తీర్థయాత్రలకు బయలు దేరినాడు. వైష్ణవ క్షేత్రాలైన కంచి, శ్రీరంగము, తిరుమల క్షేత్రాలను దర్శించి చివరకు తిరుపతికి సమీపంలో ఉండే ఒంటిమిట్టకు చేరినాడు. అక్కడ వేంచేసి ఉండే శ్రీరామ చంద్రుని దర్శించినాడు. అక్కడనే కొంత కాలము నివసించినాడు. తన కావ్యాన్ని రామునికే అంకితం చేసినాడు. ఈ కథవలన బమ్మెరలోను, ఒంటిమిట్టలోను పోతన నివసించినాడని సమన్వయం కుదిరి, వివాదాలకు అవకాశం తొలగి పోయింది.

చారిత్రకంగా చూస్తే, బమ్మెర పోతన, శ్రీనాథుడు, ఒకే కాలంలో నివసించినట్లుగా కన్పిస్తుంది. అయితే వారిరువురు మధ్య వయస్సులో భేదం ఉండవచ్చును. వారు పరస్పరం బాంధవ్యం కలిగినవారు అనడానికి మనకి చారిత్ర కాధారాలు లేవు. కాని, వారి బాంధవ్యాన్ని గురించి తెలుగువారు చెప్పుకొంటూనే ఉన్నారు. పోతన చరిత్ర కర్త, చరిత్రలోనికి పోక, లోకంలోని కథనే గ్రహించి, కథాకథనానికి, కావ్యానికి మంచి సంఘటనలను కల్పించి కథను ఆకర్షవంతంగా చేసినాడు. శ్రీనాథుని చెల్లెలు పోతన భార్య, శ్రీనాథుని కూతురు శారద పోతన కుమారుడైన మల్లన భార్య. ఈ రెండు విధాల బాంధవ్యాన్ని చెప్పడం చేత కథకు మంచి పట్టు ఏర్పడింది. పోతన భాగవతం వ్రాసిన తరువాత , ఆయన శిష్యులు శ్రీనాథుని దర్శించడానికి సింగభూపాలుని ఆస్థానం లోనికి వెళ్ళినారు. అక్కడ తమ గురువుగారి పద్యాలు కొన్నివినిపిస్తే, శ్రీనాథుడు, సింగన వినడం సంభవించింది. తన రాజ్యంలో వెలువడిన భాగవతాన్ని తాను అంకితం పొందవలెనని సింగన భావించినాడు. శ్రీనాథుడుకూడ ఆమోదించగా, రాజుగారి అభిప్రాయాన్ని పోతనకు శ్రీనాథుడు బోధించాడు. రామ భక్తుడైన పోతన దీని కంగీకరిస్తాడా? అతని మనస్సులో మార్పు కలుగ లేదు. ఇదే సందర్భంలో కవి తిప్పన్న అనే పోతన అన్నగారిని ప్రవేశపెట్టి కథను కొంత మలుపు తిప్పించి నాడు. కథ ఇంపుగా ఉండి చదవడానికి మనోహరమైంది.

కవియైన వానికి ఎప్పుడో ఒకప్పుడు, రచనలో ఆటంకం రాకమానదు. పోతన్నకు కూడ ఒకసారి 'అలవైకుంఠ పురంబులో' అనేపద్యం ప్రారంభించగా ఆపద్యం పూర్తి కాలేదట. దాన్ని మరింత ఆలోచించి తరువాత పూర్తి చేయవచ్చునని పల్లెకు వెళ్ళినాడట. శ్రీరాముడు పోతనకు సాక్షాత్కరించిన ఇష్టదైవం. తన భక్తునికి ఏదైనా ఆటంకం కలిగితే సహిస్తాడా. అందుచేత, ఆ శ్రీరాముడు, రామవర్మ అనేబ్రాహ్మణుని రూపంలో, పోతన యింటికి అతిథిగా వచ్చి ఆ పద్యాన్ని పూర్తి చేసి వెళ్ళినాడు. అంతేకాదు. సింగభూపాలుని సేనాని భాగవతాన్ని అపహరించుకొని పోతూ వుంటే, శ్రీరాముడే వరాహ రూపంలో అతనితో పోరాడి ఆగ్రంథం తిరిగి పోతనకు దక్కించినాడు. శ్రీరాముడు భక్త పరాధీనుడు. రాజాశ్రయం కోరక, దైవాన్నే శరణువేడిన భక్తుని కాపాడడంలో వెనుకాడడు కదా. వరదాచార్యుల వారు విశిష్టాద్వైతంలోని ప్రపత్తిమార్గాన్ని విశ్వసించేవారు. అందుచేత, భగవంతునికి భక్తునికి ఉండే సంబంధ బాంధవ్యాలను , ఇటువంటి సందర్భాల్లో చాల చక్కగా చిత్రించి భగవంతుని భక్త పరాధీనతను స్పష్టంగా ప్రకటించినారు.

కవిగారు, ఈ కావ్యంలో కొన్ని అతిలోక విషయాలు కూడ ప్రవేశ పెట్టినారు. ఇవి కొన్నిలోకంలో ప్రచారంలో ఉన్నవి కూడ. శ్రీనాథుడు తన గొప్పతనాన్ని ప్రకటించ

డానికి తన పల్లకిమోసే బోయీలను తప్పుకో మన్నాడు. అప్పుడా పల్లకి యథాపూర్వకంగా పయనించిందే కాని, పడిపోలేదు. ఇది చూచి పోతన కుమారుడు మల్లన, హలం దున్నుతున్న వాడు ఎడ్లను విప్పివేసి, అవి లేకుండగనే నాగలితో భూమిని దున్నించినాడట. ఈ సంఘటనను, కొంతకాలం క్రిందట వెలువడిన పోతన సినిమాలో (నాగయ్యగారు పోతన వేషం వేసినారు) చాల చక్కగా చిత్రించినారు. బహుశా, పాఠకుల వినోదం కొరకు, ఆచార్యుల వారు ఈ ఘట్టాన్ని తన కావ్యంలో వ్రాసి వుంటారు. అట్లాగే పండితుల్లో చెప్పుకొనే, ఉదంతం ఒకటి ఉన్నది. రుక్మిణీకల్యాణంలో 'బాలకమరె' అనగానే పోతన కుమార్తె కుంపటిలో పడి పోయిందని, నెలత, 'యౌవనంబు నిండియుండె' అన్నప్పుడు ఆమె పునర్జీవితురాలైందని, ఈ కవి కూడ తన కథలో చేర్చుకొన్నాడు. కావ్యంలో అద్భుతాలు వ్రాయడం తప్పేమి కాదు. అదికాక ఋషితుల్యుడైన పోతనకు సిద్ధవాక్య సంపన్నత ఉన్నదని, ఆయనమీద గౌరవంతో ఈ ఘట్టాన్ని ఆచార్యుల వారు తమ కావ్యంలో వ్రాసి ఉంటారు. దీని వలన పోతనకు, కవిగారి కావ్యానికి వన్నె వచ్చిందే తప్ప లోపం ఏమీ ఏర్పడలేదు.

'సిరికిం జెప్పడు, శంఖ చక్రయుగమున్ జేదోయి సంధింపడు' అనే గజేంద్ర మోక్షంలోని పద్యాన్ని విని, మరియేమి చేయడానికి వెళ్ళినాడు విష్ణుమూర్తి అని శ్రీనాథుడు పోతనను ఆక్షేపించినాడట. పోతన అతనికి బుద్ధి చెప్పడానికి శ్రీనాథుడు భుజిస్తూఉండగా ఒక రాయిని బావిలోవేసి శారద బావిలో పడిందని అరచినాడట. అప్పుడు శ్రీనాథుడు తింటున్న చేయితోనే పరుగెత్తి వస్తే, బావా తాడు, నిచ్చెన తేలేక పోయినావా? వట్టి చేతులతో ఏమి చేయడానికి వచ్చినావు? అని ప్రత్యాక్షేపణ చేసినాడట. ఈ కథ రవంత సాహిత్య వాసన ఉన్న కుటుంబాల్లో చెప్పుకొంటారు. ఈ సంఘటనను, ఈ కావ్యంలో ఆచార్యులవారు శారద పూలమొక్కలకు నీరుపోస్తూ ఉండగా, తాడుతెగి చేద నూతిలో పడిందని, శారదయే పడిపోయిందని భావించి, శ్రీనాథుడన్నము తింటున్న చేతితోనే నూతి వద్దకు పరుగెత్తుకొని వచ్చినాడని కొద్ది మార్పుతో, కల్పనతో వ్రాసినారు. ఇట్లా చేయడం వలన తన పద్యంలోని ఔచిత్యాన్ని సమర్థించుకొనడానికి పోతన కృత్రిమంగా ఏమీ చేయవలసిన పనిలేకపోయింది. సహజంగానే శ్రీనాథునికి కనువిప్పైంది. లోకంలో ఉండే కథకంటే, ఈ కల్పన అందంగా ఉన్నదని చెప్పనని లేదు.

వరదాచార్యులవారు పోతన చరిత్రను నిర్మించుకొని, పూర్వాపరాలను సమన్వయించేసి, కథను చెప్పడంలో పది ఆశ్వాసాలు సరిపోయినాయి. కాని, దాన్ని కొంచెం పొడిగించి పన్నెండు ఆశ్వాసాల దాక కొనసాగించినారు. ఈ రెండుఆశ్వాసాల్లో కవి, ఒంటిమిట్ట రఘు నాథునికి పోతన చెప్పినట్లుగా, నరసింహ వరాహావతార గాథలను, గజేంద్రమోక్షణము, రుక్మిణీ కల్యాణ వృత్తాంతాలను వర్ణించినాడు. దానివలన రెండు ప్రయోజనాలు నెరవేరినా యనుకొంటాను. విష్ణుమూర్తి ఏకవింశ దవతారాల్లో నరసింహావతారం ముఖ్యమైందే. బాల భక్తుడైన ప్రహ్లాదుని రక్షించి, దుష్టుడైన హిరణ్యకశిపుని అంతం చేయడంతో విష్ణుమూర్తి శిష్ట రక్షణ దుష్ట శిక్షణ అనే కార్యక్రమం పూర్తి అయింది. గజేంద్ర మోక్షకథలో, భక్తుడు ఆర్తి పొంది, శరణువేడిన వృత్తాంతం ఉన్నది. విష్ణుమూర్తి తన భక్తు డెట్టి వాడైనా కాపాడుతాడు అనే తాత్త్విక విశేషం ఉన్నది. రుక్మిణీ దేవి, ఒక ప్రియురాలుగా కాక, ఒక మహాభక్తు రాలిగా, శ్రీ కృష్ణుని వరించి ఆయనను వివాహమాడింది. ఆమె భక్తికి వివశుడై కృష్ణుడామెను వరించినాడు. పోతన విష్ణు భక్తుడే కాని ఆయనది లౌకికమైన పాత్ర. ప్రహ్లాదుడు, గజేంద్రుడు, రుక్మిణీ దేవి పౌరాణికమైన భక్తులు,పోతన కథతో బాటు, ఈ భక్తుల కథలను వ్రాసి తన కవిత్వాన్ని సార్థకం చేసి కొందామని ఆచార్యులవారు భావించి ఉంటారు. కవి స్వయంగా వైష్ణవుడు కావడం వలన ఈ విధంగా భావించడం సహజమే కదా.

పోతనగారు తన భాగవత గ్రంథాన్ని పండ్రెండు స్కంధాల్లో రచించినారు. వరదాచార్యుల వారి చరిత్ర పది ఆశ్వాసాల్లోనే ముగిసింది. పోతన చరిత్రను కూడ

భాగవతంవలె ద్వాదశస్కంధపరిమితం చేయవలెనని కవి భావించడంలో అనౌచిత్యం లేదు. పోతన వ్రాసిన విష్ణుమూర్తి కథలను మిగిలిన రెండాశ్వాసాల్లో రచించి, దాన్ని భాగవత సదృశంగా రూపొందించినాడు కవి. బహుశా ఇదిరెండవ ప్రయోజనం.

మహాకావ్య లక్షణాలను మన్సులో పెట్టుకొని కావ్యరచన చేసిన వరదాచార్యుల వారి కావ్యంలో ద్యూతం, సముద్రం వంటి ఒకటి రెండు తప్పించి మిగిలిన అష్టాదశ వర్ణనలను చేసినారు. పోతనగారు సహజ పరిసరాల్లో పత్నీసంగమం చేయడంలో శృంగారవర్ణన సహజ మనోహరంగా ఉన్నది.

భోగిని, సింగ భూపాలుని సభలో నాట్యం చేసే వర్ణన, ఇంపుగా ఉండడమే కాక, కవిగారికి నాట్యశాస్త్రంపై ఉండే అవగాహన కూడ స్పష్టమైంది. ఈ ఘట్టాన్ని వ్రాయడానికి ఆయన శ్రద్ధగా నాట్య శాస్త్రాన్ని అధ్యయనం చేసినట్లు వారు చెప్పగా నేను విన్నాను. ఆచార్యులవారు గ్రామ వాతావరణంలో పెరిగిన వారు కాబట్టి పల్లెటూళ్ళను అందంగా వర్ణించినాడు. అంతేకాదు పట్టణ సౌందర్యాన్ని కూడ వారు వైభవోపేతంగా వర్ణించి దృశ్యాలను కన్నులకు కట్టించినారు. ఇతర వర్ణనలు కూడ కావ్యానికి అందాన్ని సమకూర్చినాయి.

వానమామలై వరదాచార్యుల వారు కావ్యాన్ని పూర్వ కవుల్లాగ ఛందోబద్ధంగా రచించినారు. వారు ప్రాచీన కావ్యాలను శ్రద్ధతో పఠించి, అక్కడ ఉండే ఛందస్సును అందులోని శిల్పాన్ని పరిపూర్ణంగా అవగాహన చేసికొని ఈ కావ్య రచనకు పూనుకొన్నారు. వారు ప్రాచీన కవుల్లో ఎవరిని ఎట్లా అనుసరించినారు, అందులోని శిల్పం ఎట్లా ఉన్నది అని పరిశీలించడానికి మరొక వ్యాసం వ్రాయవలసి ఉంటుంది. ఇక్కడ నాకు ఆ అవకాశం లభించలేదు.

ఆధునిక యుగంలో నవ్యసంప్రదాయ కావ్యాల ప్రస్తావన వచ్చినపుడు, శ్రీవానమామలై వరదాచార్యుల వారి పోతన చరిత్రము ప్రముఖంగా నిలుస్తుందని చెప్పడంలో సందేహం లేదు.

తెలంగాణా పోరాట నవలలు

డా. ముదిగంటి సుజాతారెడ్డి

భారతదేశంలో సాగిన వివిధ స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలల్లో తెలంగాణా విమోచనోద్యమం ఒక ప్రత్యేక మైంది. తెలంగాణా పోరాటంగా అది ప్రసిద్ధి చెందింది. క్రీ.శ. 1687లో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గోలకొండ రాజ్యాన్ని జయించి రాజప్రతినిధిగా నిజాముల్ ముల్క్ ఆసిఫ్ జాహీని నియమించాడు. 1707లో ఔరంగజేబు మరణించాడు. మొఘల్ రాజ్యం పతనమ్ముఖమైన సందర్భం చూసుకొని నిజాముల్ ముల్క్ 1724లో స్వాతంత్ర్యం ప్రకటించు కొన్నాడు. తర్వాత అతనికి బ్రిటిషువాళ్ళతో తిప్పళ్ళు తప్పలేదు. 1765లో రెండో నిజాం కోస్తా జిల్లాలను, 1800లో రాయలసీమ జిల్లాలను బ్రిటిషు వాళ్ళకు ధారాదత్తం చేశాడు. దాంతో తెలంగాణా మహా రాష్ట్ర కన్నడ ప్రాంతాలతోపాటు నిజాం పరిపాలనలో ఉండిపోయింది. భౌగోళికంగా, రాజ కీయంగా, చారిత్ర కంగా, సాంస్కృతికంగా ప్రత్యేక అస్తిత్వంతో దాదాపు నూట యాభై సంవత్సరాలుగా మనుగడ సాగించింది. మొదటి నుంచీ ఈ ప్రాంతానికి ట్రిలింగాన్, తెలంగానా, తెలంగాణా పేరున్నట్లుగా క్రీ.శ. మొదటి శతాబ్దం గ్రీకు భౌగోళికుడు టాలమి వ్రాతలను బట్టి ముస్లింల వ్రాతలను బట్టి తెలుస్తున్నది. తెలంగ + ఆణం - అంటె తెలంగులు నివసించే ఆణం-అంటే ప్రాంతం అని తెలంగాణా పదానికి అర్థం. ఆంధ్ర అనే పదం, జాతి గురించి మనకు ఐతరేయ బ్రాహ్మణం (కీ.పూ.8వ శతాబ్దం) లో ప్రసక్తి వుంది. చంద్రగుప్త మౌర్యుని ఆస్థానంలో వుండిన మెగస్థనీసు అనే గ్రీకు రాయబారి మౌర్య సామ్రాజ్యంలో "ఆంధ్రు"లున్నారని వాళ్ళకు ముప్పై మూడు బలమైన కోటలు ఉన్నాయని వ్రాసాడు. తర్వాత శాతవాహనరాజులను పురాణాలు "ఆంధ్రరాజు" లని పేర్కొన్నాయి. వాళ్ళు ఆంధ్రజాతికి చెందినవారు కావటం చేతనో లేక ఆంధ్ర భూములను పరిపాలించడం చేతనో వాళ్ళకా పేరు వచ్చి వుంటుంది. కాని ఆంధ్ర ప్రదేశ్‌కు సరిహద్దు ప్రాంతాల్లో వున్న తమిళులు కన్నడిగులు ఇక్కడి వాళ్ళను "తెలంగు"లనే పిల్చేవారని తెలుస్తున్నది. దాన్ని బట్టి తెలంగులనే జాతి వుండేదని చెప్పవచ్చును. మహాభారతంలో తెలుగుజాతి ప్రసక్తి వుంది. వాళ్ళు దుర్యోధనుని పక్షంలో కురుక్షేత్ర యుద్ధంలో పోరాడారని తెలుస్తున్నది. తెలంగాణా ప్రాంతం కాకతీయుల కాలంనాటికి వీరశైవమత ప్రాబల్యంతో ఒక ప్రత్యేకమైన సాంస్కృతికమైన అస్తిత్వాన్ని సంపాదించుకుందని చెప్పవచ్చును. అంతకు ముందు వేములవాడ చాళుక్యుల కాలంలో కూడా తెలంగాణ, జైన, శైవ మతాలప్రాబల్యంతో తనదైన ఉనికిని పొందిందని అనవచ్చును. తర్వాత ముస్లింల పాలనలో ఉర్దూ, పారసీ ప్రభావాలతో విభిన్నమైన సాంస్కృతికమైన గుర్తింపును పొందింది. ఉత్తర భారతంలో మొఘల్ సామ్రాజ్యం లక్నోలో అవధ్‌నవాబుల రాజ్యం (1857) కూలిపోయిం తర్వాత అక్కడ రాజా స్థానాల్లో ఉన్నతోద్యోగులెందరో హైద్రాబాద్‌కు వలసవచ్చి నిజాంరాష్ట్రంలో స్థిరపడిపోయారు. దాంతో యిక్కడ పాలితులు, పాలకులు అనే భేదం వర్గభేదం విస్తరించింది. పూర్తిగా ఫ్యూడల్‌వ్యవస్థ ఏర్పడింది. భూస్వాముల చేతుల్లోకి చాలభాగం వ్యవసాయ భూములు చేరి పోయాయి. కాపులు రైతులంతా పంటపండించే కౌలుదారులుగా మాత్రమే మిగిలిపోయారు. కష్టం వాళ్ళ వంతు అయింది. ఫలాలు ఫ్యూడల్ దొరల పాలయి ప్రభువైన నిజాం ధనవంతు డయ్యాడు. సంపన్నులకు సామాన్యులకు మధ్య అగాధం వుండేది. వృత్తి పనుల వాళ్ళు, మాలమాదిగలు తమ భుక్తికోసం పనులు చేసే దానికన్నా దొరలకు దేశ ముఖులకు సేవలు, వెట్టి పనులు చేయటంలోనే కాలం గడిచిపోయేది. శోషణ దోపిడీ హింసలతో వాళ్ళ జీవితం గడిచేది. ఎప్పుడైతే గాంధీజీ నాయకత్వంలో భారత దేశంలో స్వాతంత్ర్యోద్యమం ఉద్భుతమైందో నిజాం రాష్ట్రంలోనూ క్రమంగా ఆ గాలులు ప్రవేశించాయి. కాని చాలా నిర్బంధాలుండటంచేత మొదట భాషాపరమైన సాంస్కృతికపరమైన గుర్తింపుల కోసం ప్రయత్నాలు

జరిగాయి. 1920లో ఏర్పడిన ఆంధ్రజన సంఘం రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాల యోద్యమం, మాతృభాషాభిమానం, అక్షరాస్యతల కోసం కృషి చేసింది. 1930లో అది ఆంధ్ర మహాసభగా రూపొందింది. అంత వరకు భాషా నాగరికతల కోసం కృషి సాగించిన ఆంధ్ర జనసంఘం ప్రజాచైతన్యానికి కృషి ప్రారంభించింది. నీలగిరి, తెలుగు, సుజాత, గోలకొండ మొదలైన పత్రికలు జనచైతన్యానికి దోహదం చేశాయి. క్రమంగా వెట్టిచాకిరి, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతంచేయడం మొదలు పెట్టారు. 1944లో ఆంధ్ర మహాసభనుంచి వేరుపడి అతివాదులు కమ్యూనిస్టు సిద్ధాంతాల మీద ఆధారపడిన భూపోరాటాన్ని చేపట్టారు. నిజాం రాష్ట్ర స్వాతంత్ర్యంతోపాటు దున్నేవాడిదే భూమి అనీ భూపంపకం జరగాలని కమ్యూనిస్టుల ఉద్యమం సాగింది. ఈ విధంగా నైజాం విమోచనం కోసం ఒకవైపు కాంగ్రెసులు, కమ్యూనిస్టులు పోరాటం చేశారు. మరోవైపు ఆర్యసమాజం సామాజిక ధార్మికోద్యమాలే కాక స్వాతంత్ర్య పోరాటం కూడా సాగించింది. "అంజుమనే తబ్లీ గులిస్లాం"వంటి సంస్థలు కింది వర్గంలోని ప్రజలను ముఖ్యంగా మాలమాదిగలను వాళ్ళకు సమాజంలో వున్న అంటరాని తనాన్ని ఆధారం చేసుకొని ముస్లింలుగా మార్చటం చేశారు. ముస్లింల జనసంఖ్య ఎక్కువగా వుంటే నిజాం రాష్ట్రాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించుకో వచ్చునని వాళ్ళు తలంచారు. అటువంటి మత మార్పిడులను ఆర్యసమాజం "శుద్ధి" కార్యక్రమాలతో ఎదిరించింది. ఈ విధంగా ముక్కోణాలుగా జరిగిన తెలంగాణా పోరాటాన్ని ఆనాటి ఫ్యూడల్ వ్యవస్థను భూపోరాటాన్ని చిత్రిస్తూ కథలే కాక అనేక నవలలు వ్రాయబడినాయి.

భారత దేశంలో స్వాతంత్ర్యానంతరం రెండు ప్రధానమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒకటి - దేశ విభజన. రెండు - తెలంగాణా పోరాటం. అవి చేసిన గాయాలు ఇప్పటికీ బాధిస్తూనే ఉన్నాయి. అప్పుడు జరిగిన మారణహోమం, విధ్వంసం, మానభంగాలు, ప్రజల వలసలు, కాందిశీకులైన ప్రజల చేదు అనుభవాలు ఎంతో వేదనను సృష్టించాయి. "హ్యూమన్ ట్రామా" ను కలిగించాయి. అవి చెరగని మానని గాయాలుగా మారాయి. అవి ఇప్పటికీ రచయితలకు నవలా వస్తువులుగా వున్నాయి. దేశవిభజన - "పార్టిషన్"కు సంబంధించిన ఇతివృత్తాలతో ఇంకా నవలలు, సినిమాలు, టీవీ సీరియళ్ళు వస్తూనే వున్నాయి. తెలంగాణా ఉద్యమం - సాయుధ పోరాటం, ఆ పోరాటం కాలంలో జరిగిన మారణహోమం, విధ్వంసం అత్యాచారాలు, బీభత్సం ఎంతో వేదనను పుట్టించాయి. ఒకవైపు రజాకార్లు, ఇంకో వైపు కమ్యూనిస్టులు సాయుధులై పోరాటం చేయటం పరిస్థితులు అర్థంకాని సామాన్య జనుల జీవితాలను అస్తవ్యస్తం చేశాయి. ఫ్యూడల్ దొరలు తమ అధికారం, ఆస్తులను నిలుపుకోవ టానికి నిజాం పాలన కొనసాగాలని రజాకార్లకు మద్దతునియ్యటం, వాళ్ళ మద్దతుతో రజాకార్ల ఆగడాలు, దౌర్జన్యాలు ప్రజల్లో భయభ్రాంతులను సృష్టించాయి. కమ్యూనిస్టులు సాయుధులై తెలంగాణా స్వాతంత్ర్య సాధనతోపాటు ఫ్యూడల్ వ్యవస్థను భూస్వాములను నిర్మూలించి భూములను పేదరైతులకు పంచాలనే ఉద్యమాన్ని నడపటం ఒక పెద్ద యుద్ధ వాతావరణాన్ని విప్లవావేశాన్ని ప్రజా చైతన్యాన్ని సృష్టించాయి. ఆ విధమైన విప్లవ పోరాటం భారతదేశంలో ఎక్కడా జరుగని ఒక అపురూప చారిత్రక సంఘటన. రష్యాలో మాత్రమే అప్పటికి జరిగిన దృష్టాంతం కన్పించింది. అందుచేతనే తెలంగాణా పోరాటం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. పై రెండు సంఘటనల్లోని "హ్యూమన్ ట్రామా" ఇప్పటికీ రచయితల్లో కవుల్లో స్పందన కలిగిస్తూనే వుంది. ఇప్పటికీ తెలంగాణా పోరాటం రచయితలకు నవలా వస్తువుగా ప్రేరణను ఇస్తూనే వున్నది.

తెలంగాణా పోరాటం జరుగుతున్న కాలంలోనే 1947లోనే ఆ పోరాటాన్ని చిత్రిస్తూ బొల్లిముంత శివరామకృష్ణ "మృత్యుంజయులు" అనే నవలను వ్రాసాడు. తర్వాత 1950లో మహీధర రామమోహనరావు "ఒనమాలు", "మృత్యువు నీడల్లో", లక్ష్మీకాంత మోహన్ "సింహగర్జన" తిరునగరి రామాంజనేయులు "సంగం" నవలలు రచించారు. అయితే ఈ నవలలు పార్టీతో సంబంధమున్న వాళ్ళు ఆంధ్ర ప్రాంతాల్లో వున్న పార్టీ

ఆఫీసుల్లో పత్రికల్లో పనిచేస్తూ తెలంగాణాలోని పోరాటాన్ని గురించి తెలిసిన వాళ్ళు వ్రాసిన నవలలు. ఈ నవలల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆ సిద్ధాంతాల కనుగుణమైన ఇతివృత్తం, పాత్రల చిత్రణ, సంఘటనలు వుండటం చూస్తాం. తెలంగాణా జనజీవితంతో గాని అనుభవైక వేద్యమైన జనవేదనతోగాని వాళ్ళకు ప్రత్యక్ష పరిచయం లేదు.

ప్రజా జీవన సంస్కృతి, సంస్కృతి మూలాలనుంచి వెలికి వచ్చే బాధలు వాళ్ళ నవలల్లో కన్పించవు. దళితునిగా పుట్టి దళిత అనుభవం దళిత స్పృహ వున్న వాళ్ళు వ్రాస్తేనే దళితవేదనల అభివ్యక్తి గాఢంగా వుంటుందని అంటారు. స్త్రీవాదులు సైతం స్త్రీవేదనల అభివ్యక్తి స్త్రీలే బాగా చేయగలుగుతారని అంటారు. అదేవిధంగా తెలంగాణాలో పుట్టి పోరాటంలో పాల్గొన్న లేదా పోరాట కాలంలో పుట్టి పెరిగిన వ్యక్తుల అభివ్యక్తి గాఢంగా వాస్తవికంగా వుండటం స్వానుభవం స్వానుభూతులు చిక్కగా యదార్థంగా వుండటం జరుగుతుంది. ఆ విధంగా తెలంగాణా పోరాటంలో మొదలునుంచీ పాల్గొని సాహిత్యాభిలాషి, సాహిత్య రచనలు చేసిన రచయిత వట్టికోట ఆళ్వారు స్వామి. ఆయన తెలంగాణా పోరాటాన్ని చిత్రిస్తూ 'ప్రజలమనిషి గంగు' అనే నవలలను రచించాడు.

వట్టికోట ఆళ్వారు స్వామి తెలంగాణా పోరాటానికి 'ఎపిసెంటర్' వంటిదయిన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మాదారం గ్రామంలో పుట్టాడు. స్వయంకృషితో విద్యనభ్యసించాడు. ఆంధ్ర మహాసభల్లో చురుకుగా పనిచేశాడు. మొదట కాంగ్రెసు వాదిగా వున్నా 1944లో ఆవిర్భవించిన అతివాదుల్లో చేరి తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. అతడు ప్రజల మనిషిగా ఎదిగిన స్వానుభవమే "ప్రజల మనిషి" కథానాయకుడు కంఠీరవం పాత్రలో ప్రతిబింబించింది. 1938హైద్రాబాదు స్టేట్ కాంగ్రెస్ ఏర్పడింది. దానికి పూర్వం తెలంగాణా పల్లెల్లో భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరీ, ప్రజల అజ్ఞానం, నిస్సహాయతలు, వాళ్ళమీద సాగే శోషణ దోపిడీలు అత్యాచారాలుఎట్లా వుండేవో రచయిత ఈ నవలలో వాస్తవికంగా చిత్రించాడు. ఇత్తెహాదుల్ ముసల్మీను అనే సంస్థ నిజాం అండదండలతో మాలమాదిగలను నిరుపేదలను ముస్లింలుగా మారు స్తుండేది. అయితే ముస్లింలుగా మారిం తరువాత వాళ్ళు వెట్టి చేయటానికి నిరాకరించటంతో దొర రామభూపాలరావు చాటుగా వాళ్ళను మళ్ళీ హిందువులుగా మార్పిస్తాడు. ఇందులో అతని స్వార్థమే వుంది. కాని కంఠీరవం ప్రజలు ఆర్థికంగా బాగు పడితే మతమార్పిడులుండవని విశ్వసిస్తాడు. కొమురయ్య కౌలుదారీ భూమి అతని స్వంతం కావడం ఆ భూమి పోరాటంలో కంఠీరవం నాయకుడై నిలవటం జరుగుతుంది. కంఠీరవం ప్రజల మనిషిగా ఎదిగే ఇతివృత్తమే ఈ నవలలో ఉంది. ఒకవిధంగా ఆంధ్ర మహాసభ గ్రామ సమస్యలను పేద రైతుల భూమి సమస్యలను పట్టించుకునే సంస్థగా ఎదగడమే ఈ నవలలో రచయిత చిత్రించిన క్రమ పరిణామం. ప్రజా చైతన్యవికాసం. వట్టికోట ఆళ్వారుస్వామి "గంగు" నవలలో 1940-45 మధ్యకాలంలోని తెలంగాణా రాజకీయ ప్రజాఉద్యమాలను చిత్రించాడు. కమ్యూనిస్టులు సాయుధ రైతాంగ పోరాటాన్ని ఆరంభించే క్రమాన్ని చిత్రించే నవల. కాని ఈ నవల రచయిత మరణంతో అసంపూర్తిగా మిగిలిపోయింది.

1956కు పూర్వ తెలంగాణాలో ఉద్యమ స్ఫూర్తితో కథలు, కవిత్వం చాలా వచ్చాయి. కాని నవలా రచన జరగలేదు. నవలా రచనను చేపట్టిన మొదటి రచయిత వట్టికోటనే అని చెప్పాలి. ఆయన 1952 లో "ప్రజల మనిషి" నవలను రచించాడు. అది 1955లో దేశోద్ధారక గ్రంథమాల చేత ప్రచురింపబడింది. "గంగు" నవల 1965లో వట్టికోట మరణానంతరం ప్రచురింపబడింది. ఆయన 1961లో 47వ ఏట మరణించాడు. ఈనాటి వయః ప్రమాణాలతో చూస్తే ఆయన చాలా తక్కువ వయస్సులోనే మరణించాడు. చాలా ఏండ్లు ఆయన వంట పనులు చేస్తూ స్వయంకృషితో విద్య నభ్యసించటం లోనే గడచి పోయింది. సహజమైన సాహిత్యాభిలాష, రచనా ఆసక్తి, సృజనాత్మకతలుండటం చేత చాలా తొందరలోనే కథలు వ్యాసాలు నవలలు రచించటం మొదలు పెట్టాడు. తెలంగాణా నుంచి మొదటి నవలా రచనా ప్రయత్నం. అంతకుముందు ఒద్దిరాజు సోదరులు,

వి.ఆర్. అవధాని నవలలు వ్రాసారు కాని అవేవి దొరకటం లేదు. 1955 లో "ప్రజల మనిషి" నవలను ప్రచురిస్తూ "మనవి" అనే ముందు మాటలో వట్టికోట "చాలా భయంతో ఈ నవలను బయటికి తెస్తున్నాను" అని చెప్పాడు. శిల్పం, ఇతివృత్తం, పాత్రలు, సంభాషణలు, వాతావరణం, జీవనతత్వం ఏవిధంగా పోషింపబడ్డా ఏయోమోనని చాల సంకోచాన్ని ప్రదర్శించాడు. ఆ నవలను 1952లోనే రచించి మూడేండ్లు మిత్రులకు వినిపించి చర్చించాడు. సూచనలను స్వీకరించాడు. - దీన్నంతటినీ బట్టి తెలంగాణాలో నవలావిర్భావం జరిగిన తొలిరోజుల్లో ఇక్కడి రచయితల్లో వున్న భయ సంకోచాలతో కూడిన వాతావరణం ఎటువంటిదో తెలుస్తున్నది. ఇక్కడ సాహిత్య వాతావరణం, ఎంత వెనుకబడి వున్నదో దీన్నిబట్టి చెప్పవచ్చును. బ్రిటిషాంధ్ర ప్రాంతంలో 1872లోనే నవలావిర్భావం జరిగింది. అంటె అప్పటికి తెలుగులో నవల పుట్టి ఎనభై సంవత్సరాలైంది. 1952నాటికి స్వతంత్ర నవలలు అనువాద నవలలు తెలుగులో ఎన్నో వచ్చాయి. కాని ఒక తెలంగాణా రచయిత తన చారిత్రక సాంస్కృతిక సాహిత్య నేపథ్యం లోనే 1952లో తన నవల అందరి ఆదరణను పొందు తుందో లేదో అనే పరిస్థితిలోనే వున్నాడు. అంతగా సంకోచించినా వట్టికోట ఆళ్వారు స్వామి తెలంగాణా పోరాట నవల "ప్రజల మనిషి" అతి ఉత్తమ నవల. ప్రజల జీవితాన్ని గ్రామీణ వాతావరణాన్ని తెలంగాణా పరిస్థితులను ఉన్నదున్నట్లుగా చిత్రించాడు. పాత్రల పేర్లు సంఘటనలు జరిగిన స్థలాలు అంతా తెలంగాణా వాతావరణాన్ని పోషించాయి. అక్కడక్కడా పాత్రల సంభాషణల్లో వట్టికోట తనుపుట్టిన ప్రాంతమైన నకిరేకల్లు, సూర్యాపేట ప్రాంతాల్లో మాట్లాడే మాండలిక భాషను ప్రయోగించి ప్రజాజీవన సంస్కృతులను సహజంగా చిత్రించాడు. కాని వీటన్నిటితో సమకాలిక జీవితాన్ని చిత్రించే నవల అందులో తెలంగాణా ప్రాంత జీవితాన్ని సమస్యలను చిత్రించే నవల కాబట్టి అది ఎటువంటి ప్రతిక్రియను పుట్టిస్తుందో అని వట్టికోట జంకి వుంటాడు.

నవల సమకాలిక జీవితాన్ని చిత్రించాలి, వ్యాఖ్యానించాలి అంటారు. అవే నవల ప్రధాన లక్షణాలు. అవి "ప్రజల మనిషి" నవలలో వున్నాయి. అంతేగాక నవల ప్రధాన పాత్రలో రచయిత వ్యక్తిత్వం, జీవితం, ఆదర్శాలు, ఆశయాలు ప్రతిఫలిస్తుంటాయి. రచయిత జీవిత ప్రస్థానం కన్పిస్తుంది. ఆ లక్షణాలన్నీ ప్రజల మనిషి నవలలో ఉన్నాయి. అదే అంతకుముందు వచ్చిన నవలల్లో ఈ ప్రతిఫలనాలు లేవు.

తర్వాత 1964లో దాశరథి రంగాచార్యులు "చిల్లర దేవుళ్ళు" నవలను వ్రాశారు. ఆ నవలను ప్రచురించటానికి కూడా ఆయన వెనుకముందాడారు. ఎందరికో ఆ నవలను చదివి వినిపించాడు. అయినా దాన్ని ప్రచురించటానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆఖరికి 1969లో ఒకపత్రికలో ఆ నవల ధారావాహికంగా వచ్చింది. అందర్నీ ఆకర్షించింది. "చిల్లర దేవుళ్ళు" నవల కమ్యూనిస్టు ఉద్యమానికి పూర్వం తెలంగాణాలోని దొరల దౌర్జన్యాలను వర్ణించే నవల. కరణంవంటి గ్రామాధికారులు ప్రజలనెట్లా మోసంచేసేవాళ్ళో చిత్రింపబడింది. దొరలు, దేశ్‌ముఖులు, గ్రామాధికార్లు, వతన్‌దార్లు, వీళ్ళే చిల్లరదేవుళ్ళు. వాళ్ళ దౌర్జన్యాలను ఆగడాలను దాశరథి సహజంగా చిత్రించాడు. ఈ నవలకు సీక్వెల్‌గా "మోదుగు పూలు, జనపదం" నవలలను దాశరథి రచించాడు. పాత్రల చిత్రణ, సంభాషణలు పాత్రో చితంగా వున్న మాండలిక భాష వాస్తవికతను పోషించాయి.

దాశరథి తర్వాత బి.ఎన్.శాస్త్రి "విప్లవజ్వాల", కందిమళ్ళ ప్రతాపరెడ్డి "బందూక్" నవలలు వ్రాశారు. "విప్లవజ్వాల" నవల రావినారాయణరెడ్డిగారికి అంకితంగా ఇయ్యబడింది. 1994లో ముదిగంటి సుజాతారెడ్డి "మలుపు తిరిగిన రథచక్రాలు" నవల తెలంగాణా ఉద్యమాన్ని ఆ తర్వాత పరిణామాలను చిత్రించే నవల. ఈ నవలలో ప్రధాన పాత్ర దొర కూతురు సరళ. ఆమె దృష్టికోణంలో నవల నడుస్తుంది. ఒక రచయిత్రి ఉద్యమ స్ఫూర్తిని చిత్రించటం, ఒక స్త్రీ దృష్టికోణంతో చిత్రించటం ఈ నవలలో విశేషం. ఇది చారిత్రక కాల్పనిక (Historial Romanticism) నవల. చార్లెస్ డికెన్స్ ఫ్రెంచి విప్లవాన్ని

తదనంతర మానవచరిత్రను ఒక ప్రేమ కథతో ముడి పెట్టి చిత్రించాడు. అదే విధంగా రష్యన్ విప్లవం పాస్టర్నాక్ రచించిన "డాక్టర్ జివాగో" నవలలోను ప్రేమకథ నేపథ్యం లోనే చిత్రింపబడింది. వ్యాఖ్యానింప బడింది. ఈ రెండు నవలల్లో వలెనే "మలుపు తిరిగిన రథచక్రాలు" లో చారిత్రక పోరాటం, ప్రజల వేదన, దొరల దౌర్జన్యాలు చిత్రింపబడినాయి. అమెరికన్ సివిల్ వార్‌ను ప్రజల జీవితాల్లో ఏర్పడిన అస్తవ్యస్తతను మిషల్ మార్గరెట్ "గాన్ విత్ ద విండ్" నవలలో ప్రేమ వృత్తాంతం నేపథ్యంలోనే చిత్రించింది. "విప్లవ జ్వాల, మలుపు తిరిగిన రథ చక్రాలు నవలల్లో ప్రేమ కథ నేపథ్యంలోనే తెలంగాణా ఉద్యమాలు, పోరాటం చిత్రింపబడినాయి. ప్రేమ వృత్తాంతంలో ప్రతీకాత్మతతో కూడిన పాత్రలను సృష్టించటం వుంటుంది. మలుపు తిరిగిన రథ చక్రాలు నవలలో అట్లా సరళ ఆమె స్వేచ్ఛ సమానత ప్రజాస్వామ్యానికి ప్రతీక పాత్ర. నవల చివర విప్లవ వీరుడు సరళ మరణశయ్యకు చేరుకొని, ఆమె మనుమరాలిని పెంచటానికి అంగీకరించటం అతడు ప్రజల్లోకి ప్రజాస్వామ్యంలోకి హింసను విడిచిపెట్టి శాంతి మార్గంలోకి రావటం ప్రతీకాత్మకంగా చిత్రింపబడింది. అదేవిధంగా "చిల్లరదేవుళ్ళు" నవలలో సారంగపాణి సంగీత ప్రియుడు. అది దౌర్జన్యం ,హింసకు వ్యతిరేకమైన రాగాత్మక ప్రవృత్తికి ప్రతీక. పాణి సంగీతం దొరను ఆకర్షించటం దొర తన కూతురుకు సంగీతం చెప్పించాలనుకోవడం అన్నీ ఆ పాత్ర రాగాత్మకత వైపు పయనించటానికి ప్రతీకలు. నవల చివరలో దొర తప్పిపోయిన మేనల్లుడవటం, తన కూతురునిచ్చి పెళ్ళి చేయటం కూడా విశాలాంధ్ర భావనకు ప్రతీకలు! ఆ విధంగా రచయితలు నవలల్లో ప్రతీకాత్మకతతో పాత్రలను సన్నివేశాలను చిత్రించటంతో కథా గాంభీర్యంతో పాఠకులను మళ్ళీ మళ్ళీ చదివింపజేస్తాయి.

ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా తెలంగాణా పోరాటం రచయితలకు రచనా ప్రేరణనిస్తుందనటానికి నిదర్శనం 2002లో అంపశయ్య నవీన్ "కాల రేఖలు" ఆరువందల పేజీల బృహన్నవల. ప్రధాన పాత్ర రాజు నాలుగేండ్ల వయస్సునుంచి అతని విద్యాభ్యాసంతో ఆరంభమై టెన్త్ పరీక్ష వ్రాసేంతవరకు పన్నెండేళ్ళ కాలపరిధిలోని తెలంగాణా జీవితం, పోరాటం చిత్రితమైనాయి. రాజు దృష్టికోణంతో పరోక్షంగా అపరోక్షంగా, నవలేతివృత్తం నడుస్తుంది. ఆనాటి రాజకీయార్థిక సామాజిక పరిస్థితులను నవీన్ కండ్లకు కట్టేటట్లుగా సరళమైన, సశక్తమైన భాషలో చెప్పాడు. రాజు చిన్నాయన సత్తెయ్య తుపాకిపట్టి పోరాటంలోకి ఉరుకుతాడు. దాంతో పోలీసులు ఆ కుటుంబాన్ని అతని జాడ చెప్పమని వేధించటం , రజాకార్లు అతని వెంటపడటం, పోలీసు చర్య తర్వాత మిలిటరీ అతన్ని వెతకటం మొదలైన ఘట్టాలు సత్తెయ్య వంటి ఎందరో జీవితాల్లో జరిగిన చారిత్రక సంఘటనలు. స్త్రీలు, వడిసెల, కారప్పొడి, రోకలి బండలతో రజాకార్లను ఎదిరించటం, రజాకార్ల భయంతో రాజుకుటుంబం ఆంధ్ర ప్రాంతానికి వలసపోవటం చారిత్రక సత్యాలు. ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవంతో నవల ముగుస్తుంది. అవతరణోత్సవ సభకు డా. జయసూర్య వరంగల్ వస్తుంటే కొందరు "జై తెలంగాణ" నినాదాలతో అతన్ని అడ్డుకుంటారు. వరంగల్‌లో జరిగిన సభకు నెహ్రూ వస్తారు. రాజు ఆసక్తితో నెహ్రూ ప్రసంగాన్ని వింటాడు. రాజుకు సోషలిజంలో ఉన్న ఆసక్తిదానితో వ్యక్తమయింద నిపిస్తుంది. రాజు పాత్రలో రచయిత జీవించాడేమోనని కూడా చెప్పవచ్చు. నెహ్రూ అభ్యుదయ దృక్పథంతో కూడిన ఉపన్యాసంతో నవల ముగుస్తుంది. ఇరవై ఒకటో శతాబ్దంలో బోయ జంగయ్య కూడా దళిత దృక్కోణంతో తెలంగాణా పోరాటాన్ని చిత్రించాడు. ఆ నవల అచ్చులో వుంది.

తెలంగాణా పోరాటం, ఆనాటి ప్రజాజీవితం, ప్రజల కష్టాలు, వేదనలు ఎంతగా రచయితలు చిత్రించినా ఇంకా చెప్పవలసింది చాలావుందేమో అనిపిస్తుంది. అటువంటి ఇసుక పాతర వంటి ప్రజాజీవితాలను తెలంగాణా రచయితలు ఇంకా రచనా ప్రేరణతో తవ్వితీస్తూ చిత్రిస్తూనే వున్నారు.

వేమన పద్యాలు - యూరోపియన్ల ప్రమేయం

డా. ఎన్. గోపి

రవి అస్తమించని సామ్రాజ్యాన్ని స్థాపించిన ఆంగ్లేయుల ప్రభావం విశ్వ దేశాలన్నింటిపైనపడటం సహజం. భారతదేశం దానికి అపవాదం కాదు. అయితే తెలుగు సాహిత్య సేవలో యూరోపియన్ల ప్రమేయం అమేయం.

ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అనే సివిల్ సర్వెంటు వేమన పద్యాల సింహద్వారం గుండా తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాడు. ఇతడు 1817లో సివిల్ సర్వీస్‌లో చేరి తెలుగు జిల్లాల్లో పనిచేశాడు. గోదావరి, కృష్ణ, పెన్నా నదులపైన ఆనకట్టలు కట్టి ఆంధ్రను అన్నపూర్ణగా మార్చిన సర్ ఆర్థర్ కాటన్‌ను ఎట్లా గుర్తించుకుంటామో, కైఫీయత్తులను సేకరించి భూమిని సర్వేచేసి చరిత్రకు ఆధారాలను సమకూర్చిన కల్నల్ మెకంజీని ఎట్లా గుర్తుంచుకుంటామో, ఆరిపోతున్న తెలుగు దీపాన్ని చేతులు అడ్డం పెట్టి కాపాడిన బ్రౌన్‌ను కూడా అలాగే గుర్తుంచు కుంటాము. అలాగే విలియం హోవర్డ్ క్యాంబెల్, మేజర్ ఆర్. ఎం. మ్యాక్‌డొనాల్డ్, లాయనెల్ డేవిడ్ బార్‌నెట్, చార్లెస్ ఇ.గోవర్, హెన్రీబవర్స్, జెడిబి గ్రిబిల్ మొదలైనవారికి తెలుగువారు ఎంతో రుణపడి వున్నారు.

వేమన బ్రౌన్ దృష్టిలో పడటం పరమ యాదృచ్ఛికంగా జరిగింది. ఇంగ్లాండు నుండి ఓడలో మద్రాసు వస్తున్నప్పుడు అబేదుబ్వా అనే ఫ్రెంచి మిషనరీ రాసిన 'Hindu Manners, Customs and Ceremonies' అనే గ్రంథం చదివాడు. ఓ చోట వేమన ప్రసక్తి ఉంది. ప్రసక్తే కాకుండా ఒక వేమన పద్యానికి ఆంగ్లానువాదం కూడా ఉంది.

అది

"It is water - which causes mud,
It is water which removes it.
It is your will that makes you commit sin
and It is by your will alone that it can be purified"

ఇది బ్రౌన్‌ను ఎంతో ఆకర్షించింది. ఈ పద్యంలో భావం, భాష జటిల్యరహితంగా, సరళసుందరంగా ఉండడం బ్రౌన్ గ్రహించాడు. వేమన అభిప్రాయాలు యూరపియన్ భావధారకు దగ్గరగా ఉన్నట్లు గ్రహించాడు. ఈ రకంగా వేమన బ్రౌన్ మనసులో పడ్డాడు. వేమన పద్యాలు తెలుగురాని ఆంగ్లేయులకు తెలుగు నేర్చుకోడానికి ఉపయోగ పడతాయని బ్రౌన్ భావించాడు. వెంటనే తెలుగు నేర్చుకుంటూ వేమన పద్యాలను తాళపత్ర గ్రంథాలను సేకరించడం ప్రారంభించాడు. 1829లో వేమన పద్యాలు (Verses of Vemana) పేరుతో 693 పద్యాలతో ఓ ఆంగ్లానువాదం బ్రౌనే చేశాడు. మద్రాసు కాలేజీ బోర్డు వారి కోసం దీనిని 500 ప్రతులు ముద్రించగా 450 కాపీలు కనపడకుండా పోయాయి. కొన్ని కాలేజీ లైబ్రరీలో చెత్తాచెదారాల్లో కలిసిపోయాయి. వేమన పట్ల ఇష్టంలేని కొందరు శుష్క పండితుల వల్ల ఇది జరిగింది. ఈ అనాదరణకు బ్రౌన్ కలత చెందాడు. దీని ఒక కాపీ లండన్‌లోని ఇండియన్ ఆఫీసు లైబ్రరీలో వుంది. మళ్ళీ పదేళ్లకు అంటే 1839లో 1165 పద్యాలతో రెండవ ముద్రణ వేశాడు. బ్రౌన్ ఈ రెండు ముద్రణలకూ మంచి పీఠికలు రాశాడు. వాటిలో వేమన గురించి, తెలుగు గురించి, తనదైన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. తెలుగుభాష స్వర సౌష్ఠవం కలిగినట్టిదని అందుకే యూరోపియన్లు దీనిని 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' (Italian of the East) అన్నారని గుర్తించాడు. ఇటాలియన్ కూడా తెలుగువలెనే అజంత భాష, ఇంగ్లీషుపైన ల్యాటిన్ లాగానే తెలుగుపైన సంస్కృత ప్రభావాన్ని బ్రౌన్ పేర్కొన్నాడు. 18వ శతాబ్దంలో మహమ్మదీయుల దురాక్రమణవల్ల తెలుగు సాహిత్యం క్షీణదశకు చేరుకున్నదన్నాడు. బ్రిటిషు వారి హయాంలోనే దేశీయ సాహిత్యపునరుద్ధరణకు సదవకాశం ఏర్పడిందని ఆయన భావించాడు.

బ్రౌన్ వేమనను 'నా కవి' అన్నాడు I discovered him అన్నాడు. ఏకాంతవాసం వల్లనే పద్యాల్లో తనను తాను సంబోధించుకున్నాడని అనుకున్నాడు. మన తత్వగీతాల్లో ఈపద్ధతి ఉంటుందని ఆయనకు తెలియదు. వేమన అనేది పెట్టుకున్న పేరనీ, మొదటి పేరు కాదని బ్రౌన్ అభిప్రాయం. డ్యాంటే, హాఫీజ్ కవుల పేర్లు పెట్టుకున్నవనీ, అసలు పేర్లు డ్యురాన్ టే, మహమ్మద్ షెంసుద్దీన్ అని చెప్పుకొచ్చాడు.

వేదాంత సంప్రదాయం విషయంలో వేమన వ్యాసుని తత్వానికి చెందుతాడన్నాడు. సర్ విలియం జోన్స్ బ్రిటిషు న్యాయ కోవిదుడు వ్యాసుడిని భారతీయ ప్లేటో అని అభివర్ణించాడు. వేమన సూక్తులు ప్లేటో గూఢమతనిబంధనలకు చెందుతాయన్నాడు బ్రౌన్. బుద్ధి తన్ను తాను తెలుసుకున్నప్పుడే సత్యం సాక్షాత్కరిస్తుందని ప్లేటో ఉవాచ. వేమన నైతిక నియమావళి డెమోక్రటీస్ సూత్రాల్లాగా ఉన్నాయన్నాడు బ్రౌన్. డెమోక్రటీస్ గ్రీకు భౌతిక శాస్త్ర వేత్త. సత్ (being) అవికార ధర్మము కలిగి శాశ్వతమైనది. శూన్యం నుండి ఏదీ పుట్టదు, శూన్యంలో నశించదని డెమోక్రటీస్ సిద్ధాంతం. అలాగే బ్రౌన్ వేమనను గ్రీకుఅధిక్షేప కవి లూషియన్‌తో పోల్చాడు. కల్లమత స్వాములను ఇద్దరూ ఎండగట్టారు. వేమన జంగమ మతానికి చెందినవాడని బ్రౌన్ నిర్ధారించాడు.

బ్రౌన్ 30ఏండ్లకు పైగా హిందువులతో కలిసి ఉన్నా ఆయనతో పనిచేసినవారు తప్ప ఎవ్వరూ ఆయన దరి చేరలేదు. విగ్రహారాధనకు వ్యతిరేకి అయిన వేమన పద్యాలను ముద్రించినందుకు ఆయనను హిందూమత విరోధిగా భావించారు.

ఇక విలియం హోవర్డ్ క్యాంబెల్ వేమన గురించి ఏమన్నాడో చూద్దాం. ఇతడు క్రైస్తవ మిషనరీ (1859 -1910) ఎడింబరో విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. సంస్కృతం చదువుకున్నాడు. లండన్ మిషన్ సర్వీసులో చేరి కడప జిల్లాలో పనిచేశాడు. ఇతడు వేమనను బ్రౌన్ కంటే లోతుగా అర్థం చేసుకున్నాడు. వేమనను ప్రజా వాఙ్మయానికి చెందినవాడుగా గోవర్ అంచనా కట్టాడు. వేమన నూటికి నూరుపాళ్ళు కాపు అన్నాడు. అంటే వేమన పద్యాలను పూర్తిగా ఆపోసన పట్టాడన్నమాట. ఈయన వేమన బాల్యాన్ని గురించి ఊహించాడు. గురూపదేశాన్ని గురించి వివరించాడు. బ్రౌన్ లాగానే వేమన లింగాయత మతానికి చెందినవాడన్నాడు. వేమనపైన జనంలో ఉన్న అపోహలను ఖండించాడు. బ్రౌన్ వేమన పద్యాల ముద్రణను గోవర్ ప్రశంసించాడు. బ్రౌన్‌ను మేధా సంపన్నుడిగా అభివర్ణించాడు. వేమన పద్యాల్లోని భాషను వాడుక భాషగా గుర్తించాడు. వేమన స్త్రీ దూషణం చెయ్యటం వల్ల బూజుపట్టిన దురాచారం లోంచి బయటికి రాలేకపోయాడని చురకపెట్టాడు. మత సంస్కరణల విషయంలో గోవర్ వేమనను ఇంగ్లండుకు చెందిన జాన్ విక్లిఫ్ (Wycliffe, 1325 -84) జర్మనీవాడైన మార్టిన్ లూథర్ (1483-1546) లతో పోల్చాడు.

నిన్ను జూచుచుండ నిండును తత్త్వంబు
తన్ను జూచుచుండ తగులు మాయ
నిన్ను నెరిగినపుడె తన్ను దానెరుగును
విశ్వదాభిరామ వినురవేమ

అన్న వేమన పద్యాన్ని ఉదాహరించి Saint Paul కూడా ఇదే చెప్పాడని, సువార్తల ఆదర్శం కూడా ఇదేననీ "నేను మనుచున్నానుగాని, నాలో ఉన్నది నేను కాదు - ఆ క్రీస్తు ప్రభువే" అన్న వచనం అంతరార్థం ఇదేనని గోవర్ వ్యాఖ్యానించాడు.

ఇక మేజర్ ఆర్.ఎం. మ్యాక్ డొనాల్డ్ వేమనను తిరుగుబాటు కవిగా అభివర్ణించాడు. ఇతడు మద్రాసు స్టాఫ్ కోర్‌లో ఒక ఉద్యోగి. పేరును బట్టి స్కాట్లాండ్ వాడు కావొచ్చును. బ్రౌన్ వేమన పద్యాల పుస్తకాన్ని విపులంగా సమీక్షించాడుమ్యాక్. కొన్ని చోట్ల బ్రౌన్‌తో విభేదించాడు. బ్రౌన్ వేమన పద్యాల ప్రథమ ముద్రణలో వేమన 17వ శతాబ్దానికి చెందినవాడన్నాడు. రెండవ ముద్రణలో పాల్కురికి సోమనాథుని కాలం వాడన్నాడు. మొదటి దానిని ఒప్పుకుంటే షేక్స్ పియర్, బేకన్‌ల కాలానికి దగ్గరి వాడవుతాడు. రెండవదాని ప్రకారమైతే

చాసర్‌కు సన్నిహితుడవుతాడు. ఈరెండు వాదాలూ మ్యాక్‌కు నచ్చలేదు. బ్రౌన్ వేమనను ల్యూషియన్, ర్యాబెల్‌లతో పోల్చడాన్ని మ్యాక్ ఒప్పుకోలేదు. వారిద్దరు గద్య రచయితలు. పద్యకవి అయిన వేమనతో వారిని పోల్చనక్కరలేదు అన్నాడు.

లాయనెల్ డేవిడ్ బార్‌నెట్‌కు (1871 -1960) వేమనపట్ల పిచ్చి అభిమానం. ఇతడు బహుభాషా కోవిదుడు. బ్రిటిషు మ్యూజియంలో ప్రాచ్యశాఖకు అధిపతిగా ఉండేవాడు. వేమన ఒక కవిత్వ వ్యక్తి అనీ Poor Richard అని కొందరు వ్యాఖ్యానించటాన్ని ఆయన అంగీకరించలేదు. Poor Richard అనేది బెంజమిన్ ఫ్రాంక్లిన్ అనే అమెరికా ప్రముఖుని గుప్తనామం. ఇతడు బహుముఖ ప్రజ్ఞాశాలి.

పతిని విడువరాదు పదివేలకైనను
పెట్టి చెప్పరాదు పేదకైన
పతిని తిట్టరాదు సతిరూపవతియైన
విశ్వదాభిరామ వినురవేమ

ఈ పద్యాన్ని ఉదాహరిస్తూ దీనిలోని అర్థం మత్తయి సువార్తలోని క్రీస్తు ఆదేశములలో "నీ కుడి చెయ్యి చేసిన దానిని నీ ఎడమ చేతికి తెలియ నివ్వకు" తో పోలి వుందని బార్‌నెట్ భావించాడు.

జానపదవాఙ్మయ ప్రియుడైన చార్లెస్ ఇ.గోవర్ వేమన పద్యాలను తనదైన పద్ధతిలో విశ్లేషించాడు. ఇంగ్లండుకు చెందినవాడు. మద్రాసులో అనాథ శరణాలయానికి సెక్రటరీగా పనిచేశాడు. ఇతను వేమనను లోక కవిగా సంభావించాడు. అప్పటి చారిత్రక పరిస్థితుల్లో వేమన ప్రత్యేకతను ఈయన నిరూపించాడు.

తెలుగుప్రాంతంలో 'ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్' గా పనిచేసిన Henry Bowers (1874) వేమన పద్యాలను పాఠ్యపుస్తకాల్లోంచి తీసెయ్యాలని సిఫారసు చేశాడు.

"దీనిలో హిందూ బుద్ధికి కేవలం ప్రతికూలమైన పద్యాలున్నాయి. వీటివల్ల హిందూ విద్యార్థులను క్రైస్తవంలోనికి కలుపుకునే ప్రయత్నంతోనే ప్రభుత్వం వీటిని పెట్టిందనే అభిప్రాయం వ్యాపించి ఉంది" అని అన్నాడు. ఈ పుస్తకం పట్ల బ్రాహ్మణులకు వ్యతిరేకత వుంది. నూటికి ఎనభై మంది ఉపాధ్యాయులు బ్రాహ్మణులే కాబట్టి వీటిని బోధించటానికి నిరాకరిస్తున్నారు అని అభిప్రాయపడ్డాడు. అయితే వ్యక్తిగతంగా వేమన పట్ల బవర్సుకు విశేష గౌరవమున్నదని ఆయన మాటల వల్లనే తెలుస్తుంది.

ఇలా పాశ్చాత్యుల దృష్టిని ఆకర్షించిన వేమన నిజంగా విశ్వమానవుడే.

(8.10.2003న లండన్ నెహ్రూ సెంటర్‌లో ఇచ్చిన ఇంగ్లీషు ఉపన్యాసానికి తెలుగు సేత)

పోతన చరిత్రము - మధుర భక్తితత్వం

డా. రావికంటి వసునందన్

నవ్య సంప్రదాయ కవిత్వానికి తెలంగాణా ప్రాంతంలో బలమైన ప్రతినిధి అభినవ పోతన బిరుదాంచితులు, విద్యా వాచస్పతి డా.వానమామలై వరదాచార్యులు. 4వేల పై చిలుకు పద్య గద్యాలలో మహాకవి పోతన జీవితం కథా వస్తువుగా వీరు రచించిన మహాకావ్యం "పోతన చరిత్రము". భావకవిత్వ ప్రభావం దేశంలో ఉధృతంగా కొనసాగుతున్న కాలంలో ఉదయించిన ఈ మహాకవి తెలుగుల పుణ్యాపేటి ఐన పోతన్న కథను మహాకావ్యంగా మలచడంలోనే ఆయన విశిష్టత ప్రకటితమౌతున్నది.

"పోతన చరిత్రము" అనేక మహాకావ్య లక్షణాల సారం. వివిధ సాహిత్య ప్రయోజనాల సమాహారం. వస్తువరణంలోనే విలక్షణత వెలార్చిన ఉత్తమకథాకావ్యం. భక్తి వేదాంత సాహిత్యజీవనవతత్వాల మేలి కలబోత. వాటిలో ఒకటి ఆచార్యుల వారునిరూపించిన మధురభక్తి తత్వం.

భక్తి తత్వాన్ని నిరూపిస్తూ నారదుడు అమృతమయత్వం దాని లక్షణంగా పేర్కొన్నాడు. - అమృత స్వరూపాచ (నారదభక్తి సూత్రాలు 1-3) . అలాంటి భక్తిగల జీవులను సిద్ధులుగా, అమృతరూపులుగా, తృప్తులుగా, మత్తులుగా, స్తబ్ధులుగా ఆత్మారాములుగా సిద్ధాంతీకరించాడు - యల్లబ్ధ్వాపుమానీసిద్ధోభవతి, అమృతోభవతి, తృప్తోభవతి (1-4); యత్ జ్ఞాత్వా మత్తోభవతి, స్తబ్ధోభవతి, ఆత్మారామోభవతి (1-6) . అలాంటి వారెవరైనా ఉన్నారా అని విచారించి బృందావన గోపికలను అట్టి జీవులుగా నిర్ణయించాడు - యథావ్రజ గోపికానాం (1-21). ఈ మధురభక్తిని వరదాచార్యుల వారు తమకవితాత్మగా కృష్ణ చరితంలో వికసింపజేశారు. మధురభక్తి ప్రధానులైన జీవులను ఐహిక వాంఛలు లౌకిక మర్యాదలు ప్రకృతి నిరోధాలు కట్టివేయలేవనే అంశం 'పోతన చరిత్రము' లోని ఈ పద్యంలో స్ఫురిస్తున్నది.

"ఱాల గరిగించు మురళీ స్వరంపు సొంపు
గాన మాలింపజాలు వ్రేకాంత లెల్ల
నుదధి సరిగమ మెదగోరునదుల బోలి
పరువిడుదురె నిరోధమ్ము సరకు గొనక"

(12 -140)

"మద్గుణశ్రుతి మాత్రేణ మయిసర్వగుణాశ్రయే! మనోగతి రవిచ్ఛిన్నా యథాగంగాంభసోంబుధౌ! లక్షణం భక్తి యోగస్య నిర్గుణ హ్యుదాహృతం ! అహైతుక్య వ్యవహితా యాభక్తిఃపురుషోత్తమే" అన్న కపిలుని మాటలకు (భాగవతం - 3-29-11, 12)పై పద్యం ఒక కవిత్వ ప్రతిబింబం. "గానమాలింప జాలు" అనే పదాల్లో గోపికల అర్హత నిరూపింపబడింది. ఆ గానం రాళ్ళను కరిగించేది- ఓంకారనాదాత్మకం అనేది ధ్వని.

జీవేశ్వర సంగమ కాంక్షతోపాటు, నిరోధాలను పరిగణించక పోవడం మధుర భక్తితత్వంలో మరొక అంశం.

"క్రొత్త మీ చర్యలని మగల్ కోతవెట్ట
అత్తలును నుక్కు పాదాలనణచిపెట్ట
చేడియల చిత్తములు హరిన్ చిక్కువడెను
బంధుతతి శౌరి గననీని బంధమిడెను

(పో.చ.12 -147)

ఈ కట్లను, లోక సంప్రదాయపు గట్లను తెంచుకొని భేద దర్శన రహితంగా గోపికల చిత్తవృత్తి జగమంతా కృష్ణమయంగా భాసించింది.

"శ్రీగోవింద పదార వింద యుగళీ సేవామృతా స్వాదనా
భోగాయత్త విమత్త చిత్తలయి తాముస్ గోపికా రూపముల్
నాగేహమ్మిది నా సుతుండితడు నా నాథుండు నాబాంధవుల్
నా గోత్రాతము నా శరీరమును నానాత్వమ్మునే ఏమరన్"

(పో.చ. 12-141)

ఆ సద్యఃపర నిర్వృతిని పద్యంలో అద్భుతంగా వర్ణించారు ఆచార్యుల వారు.

"పాలుగొల్వు మన గోపాలు గొల్చెదనని
పరవశయగు గోపతరుణి యొకతె
వెన్ననమ్ము మన నే వెన్ను నమ్ముదునని
యొడలెరుంగని గొల్ల పడుచొకర్తు
గోవిందురాకుండ నావంక గనుమన
గోవిందు గనరను గోపి యొకతె
దధిజిల్కు మననందు దధిశాయి దర్శించి
ప్రేమ జిల్కవెయను లేమయొకతె
బాననిండి స్రవించినన్ భామయొకతె
పాలు పిదుకుచునె భూమిపాలొనర్చు
వెన్న పడినను ద్రచ్చుచు వెలది యొకతె
కాచుటేమరి హరిరాక గాచుచుండు"

(పో.చ.12 -146)

కవిత్వ సాహిత్య వ్యాసంగాలలో భక్తి వేదాంత తత్వ చర్చ ఈ రోజుల్లో అంతగా రుచించకపోవచ్చును గాని; ఒక మహాకవి అనుభవించిన మనో మథనం, చేసిన మహాభావన మననయోగ్యమని భావిస్తాను. గోపికల వంటి పారవశ్యం తన్మయత కలగడానికి ఎన్ని జన్మల సాధన కావాలి? (జన్మాంతర సహస్రేషు తపోధ్యాన సమాధిభిః నరాణాం క్షీణ పాపానం కృష్ణే భక్తిః ప్రజాయతే) అలాంటి పరమ ప్రేమ -భక్తి పై పద్యం మొదటి నాలుగు పాదాల్లో పరిణతి క్రమంలో సూచింపబడింది. సంకల్పం - గోపా లుని కొల్తుననుట; ఫలసిద్ధి -దధియందు ఉదధిశా యిని దర్శించుట - ఇవి వరుసగా మధురభక్తి దశలు, గోపికలలో పరాకాష్ఠ ఐన స్థితి. బాన నిండి పోతున్నా గమనించక ఒక భామ పాలు పిండుతూనే ఉన్నదట. భక్తి రసదుగ్ధంతో శరీర భాండం (మనో భాండం) నిండిపోయినా తనివి చెందక ఇంకా హరి మనన శీలంతో నిరంతర భావనలోనే ఉన్నదశ అది అని ఆ పదాలకర్థం. లోకంలో నన్నెందుకురా ఇంకా పిండుతున్నావంటారు. అంటే, చెప్పిందే చెప్పి, చేసిందే చేసి వేధించడమని భావం. ఆ పాలను భూమి పాలు చేస్తున్నారు అనటంలో -తమకు కలిగిన పరమేశ్వర మనన సౌభాగ్యాన్ని భూమిలో అందరికీ పంచుతున్నారనే భావన ఉన్నది. వెన్న పడినా గమనించక ఇంకా చిలకటంలో పరాభక్తి పరాకాష్ఠ చెందింది. భగవంతుడు ప్రత్యక్షమైనా గమనించక నిరంతర సాధనలో, తపస్సులో ఉన్న భక్తుని లక్షణం ఇది. ఆ దశలోతన చింతనలో మ్రాన్పడిన ప్రేయసిని ప్రియుడు తట్టి లేపినట్టుగా భగవంతుడే భక్తుని మేల్కొల్పాలి. ఇదే పరాభక్తి లక్షణం. పరవశత లక్షణం. మధురభక్తి సిద్ధాంత లక్షణం. త్యాగరాజ స్వామి శ్రీరామచంద్రుడు, అన్నమయ్య వేంకటేశ్వరుడు, ఉమర్ ఖయ్యాం సాకీ - సాహిత్య తత్వ విచారంలో మధురభక్తి తత్వానికి ఆలంబన మైన మూర్తులు.

ఈ ఘట్టంలో అభినవ పోతన ప్రయోగించిన శబ్దాలన్నీ సాంకేతికాలు, ధ్వనిమంతాలు. ధ్వని కావ్యం ఎందుకు ఉత్తమమని అనాదిగా లాక్షణికులు అనుకుం టున్నారో ఈ పద్యాలు పరిశీలిస్తే అవగత మౌతుంది.

ఈ క్రమంలో అత్యద్భుతమైన మరొక పద్యం -

ఉరకవేయనేల యప్పురిని భూమి
నరుగు చీమలున్ కృష్ణుచిత్తరువు దీయు
పదిగ నాకాశమున బాఱు పక్షులేని
గతుల కృష్ణనామాక్షర తతినె వ్రాయు

(పో.చ. 12-190)

మహాకవీ ! నమోనమః

ప్రాచీన కావ్యాల్లో వేట వర్ణనలు

డా. ఎస్.ఆర్. వెంకటేశం

వేట ఆదిమానవునికి జీవనాధారంగా ఉండేది. అరణ్యజీవనస్థితి, అనాగరిక జీవనస్థితి, నాగరికజీవన స్థితి - ఇలా దశలు మారుతూ వచ్చినప్పటికీ, మనిషి వేటను మాత్రం విడిచి పెట్టలేదు. మానవుని పరిణామ దశలన్నింటినీ ఆధునిక సమాజంలో ఏకకాలంలో దర్శింపవచ్చు. ఒకవైపు సమాజం నాగరిక జీవన విధానాన్ని అనుసరిస్తుంటే, మరోవైపు నాగరికతకు దూరమై ఆటవిక జీవనాన్ని గడుపుతున్న జాతులవారు తరతరాలుగా వేటను తమజీవనోపాధిగా అవలంబిస్తున్నారు. ఆది మానవునితో మొదలైన వేట ఆధునిక కాలం వరకూ ఇలా కొనసాగుతూనే ఉంది.

తిక్కన సప్త వ్యసనాల్లో వేటను నాల్గవ స్థానంలో పేర్కొన్నాడు.

వెలది జూదంబు పానంబు వేట పలుకు
ప్రల్లదంబును, దండంబు బరుసదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ము సేత
యనెడు సప్త వ్యసనముల జనదు తగుల

(ఉద్యోగ పర్వం 2-44)

మూలంలో వ్యాసుడు స్త్రీ, జూదం తర్వాత వేటను మూడవస్థానంలో పేర్కొన్నాడు. శిష్ట సమాజం వేటను ఒక వ్యసనంగా భావించి, మనిషి ఆ వ్యసనంలో చిక్కుకో వద్దని హితవు పలికింది. అయినా రాజులు వినోదం కోసం, ఆటవికులు భుక్తి కోసం వేటాడం మానలేదు సరికదా కొనసాగించారు.

తెలుగు కావ్యాల్లో అక్కడక్కడ వేటవర్ణనలు కనిపిస్తాయి. రాజులు వినోదం కోసమో, గ్రామీణులను, వారి పంటలను కాపాడే నెపంతోనో వేటకు బయలు దేరినట్లు కవులు వర్ణించారు. చెంచులు, ఎరుకలు, బోయలు, కోయలు మొదలైన ఆటవిక జాతుల వారు కూడ వేటాడినట్లు వర్ణనలున్నాయి. రాజులు వేటకు వెళ్ళేటప్పుడు వేటగాళ్ళు వారిని అనుసరించటం సర్వసాధారణం.

వేటను వివిధ కవులు వివిధ రకాలుగా వర్ణించారు. వేటగాళ్ళు, వేటకుక్కలు, వేట పరికరాలు, వేటల రకాలు, వేటాడే విధానం మొదలైన అంశాలు ఈ వర్ణనల్లో చోటు చేసుకున్నాయి.

మృగయా విహారం:

నాచన సోముడు హంసడిభకుల వేట వినోదాన్ని, కొరవి గోపరాజు విజయపాలుని వేట అనుభవాన్ని, పిల్లలమర్రి పిన వీరభద్రుడు దుష్యంతుని మృగయా వైదుష్యాన్ని, అల్లసాని పెద్దన స్వరోచి మృగయా విహారాన్ని, ధూర్జటి తిన్నని వేట విన్యాసాన్ని, మట్ల అనంత భూపతి కకుత్స్థుని వేటపాటవాన్ని, పాలవేకరి కదిరీ పతిమణి మండనుని మృగయా నైపుణ్యాన్ని, శంకర కవి హరిశ్చంద్రో పాఖ్యానంలో హరిశ్చంద్రుని వేట విధానాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. పొన్నగంటి తెలగన్న, తరిగొప్పుల మల్లన్న వేటల విహారాన్ని వివరించారు. తాళ్ళపాక పెదతిరుమలా చార్యులు వేంకటేశ్వర వచనల్లో 'గంటవేట'ను ప్రస్తావించాడు. సాంబోపాఖ్యానం ద్వితీయాశ్వాసంలో 23 పద్యాల్లో వేట వర్ణింపబడిందని సురవరం ప్రతాపరెడ్డిగారు ఆంధ్రుల సాంఘిక చరిత్రలో గ్రంథస్థం చేశారు.

వేటపరికరాలు:

వేట పరికరాలు లేనిదే వేట సాగదు.పరికరాలు లేకుండా వేటకు వెళ్ళటం వీరుడు కత్తిలేకుండా యుద్ధానికి వెళ్ళటం లాంటిది. అందువల్ల వేటలో పరికరాలు అత్యావశ్యకమైనవి. వేటను వర్ణించేటప్పుడు పరికరాలను, సాధన సంపత్తిని వర్ణించక తప్పదు.

దుష్యంతుడు వేటకు వెళ్ళేటప్పుడు ఉరులు, జిగురు కండె, తెరలు, బోనులు, వారువారెనలు మళ్ళు, వలలు, పేట్లు, గోళ్ళు, దీములు మొదలైన పరికరాలను ఆటవికులు తెచ్చారని శకుంతలా పరిణయంలో పిల్లల మఱ్ఱి పినవీరన వర్ణించాడు (1-116).

శ్రీకాళహస్తి మాహాత్మ్యంలో ధూర్జటి తిన్నడు వేటకు వెళ్ళే సందర్భంలో అనేక వేట పరికరాలను పేర్కొన్నాడు. తెరచీర కట్టలు, ప్రోగు చుట్టలు, దొడ్డివల, లేటివల, కుందేటి వల, పందివల, సవదండ వల, మకరి వల, ఎలుకల వలమొదలైన వలలతోపాటు ఉరులు, ఉరిగోలలు,బోనులు, చిక్కాలు, జిగురు కండెలు, దీపుత్రాళ్ళు , వాడిత్రాళ్ళు, తలముళ్ళు మొదలైనవి తీసికొనివెళ్ళినట్లు చెప్పాడు (3-46). చంద్రభాను చరిత్రలో తరిగొప్పుల మల్లన్న పెక్కు వేట పరికరాలను వర్ణించాడు. వలలు, ఉరులు, సిడులు, పిసులు, వంకర దుడ్డులు, పందిపోట్లు, దీములు, గొరకత్తెర్లు, జిగురు మోకులు, బోనులు, గాలి ఉరులు, బొంగులు, మిడివిళ్ళు, బంధాలు, కొమ్ములు, పాయలు , వల్లెత్రాళ్ళు, చివ్వల తడికలు మొదలైన పరికరాలను వేటలో ఉపయోగించారని తెలిపాడు (2-21). పొన్నగంటి తెలగన్న యయాతి చరిత్రలో కుందేటి వలలు, ఎలుకల వలలు, సవదండ వలలు, పందిటి వలలు, మకిల వలలు మొదలైన వలలను వర్ణించాడు (1-10).

పాలవేకరి కదిరీ పతి శుకసప్తతిలో రెండవ కథలో మణిమండనుడనే రాజు మృగయా విహారాన్ని వర్ణిస్తూ వేట పరికరాలను ఇలా పేర్కొన్నాడు.

వంకర గుదియలు వలత్రాళ్ళు మ్రోకులు
బిసలు మాఱుమ్ములు పెద్ద విండ్లు
పచ్చకట్టెల గుదుల్బలు తుపాకులు నెద్దు
లేనుంగులు సివంగు లిట్టిపోతు
లొడిగ కుంపటులాకు తడికెలు ప్రోగుత్రా
ళ్వాడి గొడ్డండ్లు మవ్వంపుటురులు
పాది గువ్వలు మోటు పలకలు పోటు గుం
జలు చిక్కములు నురుల్జాగిలములు
జిగురు కండెలు గాలపు జివ్వ వెదురు
లాదియగు సాధనంబులు నలవరించు
కొని హుటాహుటి నడలతో బినుగులెల్ల
గదిసి నడిచిరి యమ్మహీకాంతు నఱుతున్

(1-156)

ఇందులో వంకర గుదియలు, వలత్రాళ్ళు, ప్రోగు త్రాళ్ళు, ఆకుతడికెలు, మవ్వంపుటురులు, చిక్కాలు, జిగురు కండెలు, గాలపు చివ్వ మొదలైన సాధనాలతో పాటు తుపాకులను, వాడి గొడ్డళ్ళను వర్ణించడం విశేషం.

వేటకుక్కలు:

వేటలో పరికరాలు ఎంత అవసరమైనవో వేట కుక్కలు కూడ అంత అవసరమైనవే. వేటగాళ్ళకు వేట కుక్కలు ప్రాణప్రదమైనవి. అందుకే వాటి రూపాన్ని బట్టి,స్వభావాన్ని బట్టి వాడపు చురుకు దనాన్ని బట్టి ప్రేమతో పేర్లు పెట్టుకుంటారు. స్వరోచి మృగయా విహార వర్ణనలో అల్లసాని పెద్దన 18 వేటకుక్కల పేర్లను ఒకచంపక మాలలో చెప్పాడు. ఆ పద్యం -

పులియడు బూచిగాడసుర పోతుల రాజను మంతిగాడు చెం
గలువ సివంగి భైరవుడు కత్తెర సంపగి వెండిగుండు మ
ల్లెలగుది వాయువేగి చిటిలింగడు సాళ్వుడు వత్సనాభి యే
కలముల మిత్తి గబ్బియనగాగలవాని గ్రహించి రుద్ధతిన్

(4-32)

చంద్రభాను చరిత్రలో కూడ మల్లన 15 వేటకుక్కల పేర్లను తెలిపాడు (2-24). జాతర, పుట్టచెండు, నెరజాణ, గయ్యాళి, కరాళి, దిట్ట, చింబోతు, తుపాకి, జోగి, సుఖభోగి, తుటారి, తలారి, మారి, సంగాతి, లకోరి అనేవి ఆ పేర్లు.

పిల్లలమఱ్ఱి పినవీరన కూడ 20 వేట కుక్కల పేర్లను ఒక సీసపద్యంలో గుది గుచ్చాడు. అవి పులిమల్లడు, అడవి పోతుల రాజు, గరుడుడు, గాలి వేగం, పందేల పసిడి, విష్ణు ప్రసాదం, వెండిగుండుల పరి, పచ్చి మిర్యాల, వెఱ్ఱి పుచ్చకాయ, వేట మాణిక్యం, విరవాది, మెడబలిమి

పేట్టువాడు, వకారి, పిడుగు తునక, జిగురుడు, చిత్రాంగి, శ్రీరామబాణం, పులియడు, కస్తూరి, బొడ్డుమల్లె (1-108). వేటకుక్కల పేర్లతోపాటు వాటి విహారాన్ని కూడ పినవీరన ఈ క్రింది విధంగా చిత్రం కట్టించాడు.

గళనాళముల ద్రుంచె కారుపోతులకొన్ని
  తోలాడె కొన్ని శార్దూలములను
ఎలుగుల కొన్ని మేనుల నఖంబుల వ్రచ్చు
  చమరీ మృగంబుల చంపె కొన్ని
కొరప్రాణముల చేసి కూల్చె దుప్పులకొన్ని
  చెండె మన్నుల కొన్ని గుండలలియ
కరచె పందుల కొన్ని కంఠరాంతరముల
  కొండ గొరియల మన్ని కొనియె కొన్ని

చటుల గతి కొన్ని కణుజుల సంహరించె
వెంటబడి కొన్ని శశముల విత్తు మాన్చె
కొన్ని జింకల ప్రేవులు గుచ్చి వైచె
కుక్కలాటవికంబులు నుక్కు మిగిలి (2-14)

ఈవిధంగానే శుకసప్తతిలో జాగిలాల వేట (1-126), కుకుత్స్థ విజయంలో పందులకు జాగిలాలకు జరిగిన జగడం (4-36) వివరంగా వర్ణించబడింది.

వేటల రకాలు:

వేటలు పలురకాలు. ధూర్జటి తిన్నడు చేసిన వేటలను వర్ణిస్తూ తెరవేట, జాగిలాల వేట, దీము వేట, డేగవేట, ముంగివేట, సివంగి వేట, ఏదు వేట, ఇర్రివేట, గంట వేట, ఎద్దు వేట మొదలైన వేటలను పేర్కొన్నాడు (3-47).దీము వేటలో పశుపక్ష్యాదులను పట్టటానికి పశుపక్ష్యాదులనే నియమిస్తారు. వలలు పన్ని పట్టటాన్ని 'తెరవేట' అంటారు. అడవిలో ఒకవైపున వలలు పన్ని, లేదా కందకాలు తీసి, వాటిమీద ఆకులుకప్పి - మరో వైపునుంచి గంటలు, ఢంకాలు, కొమ్ములు,తప్పెట్లు మొదలైనవి వాయిస్తూ, అల్లరి చేస్తూ వలలు పన్నిన వైపుకు జంతువులను జోపటాన్ని 'గంట వేట' అంటారు. 'దీమువేట'లో ధూర్జటి మూడు విభాగాలు చూపాడు (3-46). సివంగులు, కుక్కలు,కృష్ణ, కురంగాలు, ముంగిసలు, ఎద్దులు జంతువిభాగంలోనివి కాగా; విధి వేటకు ఎన్నదగిన విహంగ విభాగంలో సెలకట్టెలు, సాళువలు, డేగలను చేర్చాడు. పాది వేటకు పనికి వచ్చే పతంగాలైన పూరేడు, కారుకోడి, కేరజం, కౌజు, కక్కెర మొదలైన వాటిని మూడవ విభాగంలో చెప్పాడు.

కొరవి గోపరాజు డేగవేట, చేపలవేటతోపాటు జింకలు, మనుబోతులు, కణుజులు, లేళ్ళు, ఇర్లు, దుప్పులు, ఏకలాలు, ఎలుగులు, పులులు మొదలైన జంతువుల వేటలను పేర్కొన్నాడు (1-236, 244). డేగవేటలో కెరిజాలు, పూరేళ్ళు, పాల గుమ్మలు, గోరు వంకలు, వెలిచెలు, బెగ్గురు పిట్టలు,కొంగలు,కొక్కెరలు, కక్కెరలు, కారుకోళ్లు, చెమరబోతు, కౌజు మొదలైన పక్షులను వేటాడినట్లు వర్ణించాడు. భూమిమీద చేసే ఈ వేటలతోపాటు చేపల వేటను కూడ గోపరాజు వర్ణించాడు. క్రొమీనులు, వాలుగలు, పాపరలు, మారుపులు, బేడసాలు,గెండెలు, వెలిమట్టలు, కొడిపెలు, బక్కెమట్టలు, రొయ్య, పరిగ, ఇంగిలికం, చీరచింపుజెల్ల, నారజెల్ల, కుంటముక్క అనే చేపల రకాలను పేర్కొన్నాడు.

నన్నె చోడుడు కూడ కుమార సంభవంలో గాలంతో చేపలు పట్టటాన్ని వర్ణించినట్లు 'కాకతీయుల కాలంనాటి సామాజిక జీవితం' (పుట 164) లో రచయిత ప్రస్తావించాడు.

కేయూర బాహు చరిత్రలో ఎలుకల వేట, పెంపుడు డేగలు, వేట కుక్కలు ప్రస్తావించబడ్డాయి (3-295).

మట్ల అనంత భూపతి తెరవేట, దీము వేట, బోను వేటలను వర్ణించాడు (4-71, 98). వలలు పన్నటం, కాపు గప్పటం, సీసపు గుళ్ళతో ఇర్రుల కొంకుల కేసి కొట్టటం, ఉరులు పెట్టటం మొదలైన పద్ధతులను తెలిపాడు. పందుల వేటను వివరంగా చెప్పటమే గాక; ఇర్రుల వేట, మనుబోతుల వేట, మాతంగ వేటలను కూడ పేర్కొన్నాడు.

అయ్యల రాజు నారాయణామాత్యుడు చేపల వేటలో ఉపయోగించే పరికరాలను వలలను, చేపల

పేర్లను వివరించాడు (4-184, 185). కొడమ, తి(్రడ్డ కొడమ, ద్రొబ్బుడు, పటం, చాప, ఎత్తెల, గూడ, జల్లిగూడ, లుంటగాలం, సురుగాలం, ఒసుకు,గొరకు మొదలైన పరికరాలను; మెడవల, సన్నపువల, డొంక వల, మిండ ముక్కిడి వల, దాటుడువల, ఎడవల, కుండెవల మొదలైన వలలను పేర్కొన్నాడు. జాలరి పట్టే చేపల రకాలను ఈ క్రింది సీస పద్యంలో వర్ణించాడు.

కొరద దాసరికొయ్య కొఱ్ఱమీనులసము
చ్చంగి బేడిసి జెల్ల చాఱమీను
వాలుగ ముకుదొమ్మ వల్లిక తట్ట పు
త్తడి కాసు పూమీను కడిసెలంబు
పక్కె చిత్తర నీరు పాపెర మలుగు మీ
నరుజు నిల్లెపు చేప ఆకుజెల్ల
మిసి కల్లురుజు నడమీను తొల్లిక ఱాతి
గొరక మాపురమును గుంట ముక్కు

మోర పక్కెర దొందును గూర ముక్కు
పుల్లు రుజు గెజ్జె గెండయు బొమ్మడాయ
యల్లెదముప్పుచేపయు గొల్లదొందు
పరిగె రొయ్యాదియగు మీల బట్టునతడు (4-187)

ఇందులో కవి 40 పైగా చేపల పేర్లను చెప్పాడు. నేడు కొన్ని పేర్లు తెలియనప్పటికీ, వాడుకలో ఉన్న పేర్లే ఎక్కువగా ఉన్నాయి.

తెలుగు కవులు సందర్భానుసారంగా చేసిన వేట వర్ణనలను పరిశీలిస్తే వేట సాంగోపాంగాలు, దాని విస్తృతి, వైవిధ్యం ప్రకటిత మౌతాయి.

కాలాతీత వ్యక్తులు - సమకాలీనత

డా. పి. సుమతీ నరేంద్ర

20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రక్రియలన్నిటిలో బహుళ జనాదరణ పొందిన ప్రక్రియ నవల. సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించడానికే నవల ఆవిర్భవించింది. కొంత దాకా ఆ ప్రయోజనం నెరవేరింది. అయితే అది స్వాతంత్ర్యపోరాటకాలం గనుక పునరుజ్జీవనంలో భాగంగా చారిత్రక నవల అవసరమైంది. మంచి చారిత్రక నవలలు రచింపబడిన కాలమది. అవి తమ ఉద్దిష్ట ప్రయోజనాన్ని సమర్థవంతంగా నిర్వహించాయి. 1947లో స్వాతంత్ర్యంవచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిందని సంబరపడి పోయి లక్ష్యసాధన తరువాత ఏర్పడే శూన్యంలో పడిపోయింది సమాజం. రచయితలు సమాజంలో భాగమేకదా.

నవల కొత్త పుంతలు తొక్కడం స్వాతంత్ర్యానికి పూర్వమే ప్రారంభమైంది. స్త్రీ స్వాతంత్ర్యాన్ని ఉద్దేశించినట్లుగా కనబడే చలం నవలలు లైంగిక వివక్షను మాత్రమే దృష్టిలో పెట్టుకున్నాయి. కొంతవరకు స్త్రీలలో స్త్రీల పట్ల పురుషులలో కొత్త ఆలోచనలు రేకెత్తించడానికి అవి చాలా బాగా పనిచేశాయి. విశ్వనాథ నవలలు విస్తృతంగా వస్తున్న విదేశీ సంస్కృతి సంప్రదాయాలను అడ్డుకోవడానికి మాత్రమే ఉద్దేశించబడ్డాయి. అంతేకాకుండ కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్న భారతదేశంలో స్త్రీకి గృహ పరిధిలోనే భద్రత ఉంటుందని ఇల్లువిడిచి బయట కాలుపెడితే పతనమేనని హెచ్చరించాయి. దీన్ని తిరోగమనంగా భావించి తిరస్కరించడం జరిగింది.

ఆ తరువాత ఫ్రాయిడ్ ప్రభావంతో వచ్చిన మనోవిశ్లేషణాత్మక నవలల్లో కొత్త విషయాలు ప్రస్తావించబడ్డాయి. మనిషి ప్రవర్తనను ఆతని పెంపకం, పరిసరాలు చాలా ప్రభావితం చేస్తాయని ప్రతిపాదించిన గోపీచంద్, బుచ్చిబాబు తెలుగు నవలా సాహిత్యానుశీలన సందర్భంలో చిరస్మరణీయులు. తామున్న సమాజాన్ని సహజంగా, సమర్థవంతంగా చిత్రీకరించిన వారిలో రావిశాస్త్రి కొడవటిగంటి కుటుంబరావు ప్రథమ శ్రేణిలో నిలుస్తారు. ఇదే వరుసలో చెప్పుకోవలసిన వారు ముప్పాళ రంగనాయకమ్మ, డా.పి. శ్రీదేవి. కొంతవరకు ఇల్లిందల సరస్వతీ దేవి. సహజంగా వ్రాయడాన్నే కొలమానంగా తీసుకొంటే డా.పి. శ్రీదేవినే ముందుగా చెప్పుకోవాలి.

1957లో ఆమె రచించిన ఒకే ఒక్క నవల కాలాతీత వ్యక్తులు. ఏ సాహిత్యమైనా కాలపరీక్షకు తట్టుకొని నిలబడిందంటే అదే ఉత్తమ సాహిత్యం అనుకోవాలి. వందిమాగధులు, పత్రికలలో విశేష ప్రచారం, ఒక వర్గంవారు తమ భుజాలకెత్తుకొని మోయడం సాహిత్యాన్ని బతికించడానికి తాత్కాలికంగా మాత్రమే పనిచేస్తాయి. నిజానికి ఇవేవీ లేని రచయిత్రి డా. పి. శ్రీదేవి. ఆమె వ్రాసిన కాలాతీత వ్యక్తులు నవల కాలపరీక్షకు నిలబడగలిగిన అంశాలను గమనిస్తే మనకుకొన్ని విషయాలు బోధపడతాయి. చదివించే శైలి, పదునైన భాష, సమాజంలో మనకు అడుగడుగున కనిపించే పాత్రలు, వాటిని సహజంగా చిత్రీకరించే నేర్పు ఈ నవలను ఇంతకాలం నిలబెట్టాయి.

నిజానికి కాలాతీత వ్యక్తులు నవల అది రచించబడిన కాలానికి ఎంతగా వర్తిస్తుందో ఇప్పటికీ అంతే వర్తిస్తుంది. కాలానికి అతీతమైన నవల ఇది. తానున్న కాలానికంటె ముందుకు వెళ్ళి, రానున్న పరిణామాలను అర్థం చేసుకొని, భవిష్యత్తులో కూడ పనికి వచ్చే నవలను వ్రాసింది డా. శ్రీదేవి.

ఇక నవల విషయానికి వస్తే కథ మధ్య తరగతి యువతీయువకులకు సంబంధించిందే. ముఖ్యంగా అప్పుడప్పుడే స్థిరపడుతున్న స్వాతంత్ర్యానంతర ఆంధ్ర దేశంలో ఆడపిల్లలు విచిత్రమైన పరిస్థితులలో చిక్కుకున్నారు. ఒక వైపు ప్రాచీన సాంప్రదాయం, మరోవైపు అధునాతన పాశ్చాత్య సంస్కృతీ ప్రభావం

వారిని ఊపిరి తిప్పుకో నీకుండ చేశాయి. కట్టుబాట్లను పూర్తిగా మన్నించ లేరు. ఛేదించుకొని బయటికి వెళ్ళనూ లేరు.

ఇందిర, కళ్యాణి, వసుంధర ఈ పాత్రలను చూస్తే మనకదే అర్థమౌతుంది. స్వేచ్ఛకావాలి. కాని ఎంతకావాలో తెలియదు. కలలు కనడం యువతీ యువకులకు సహజం. అయితే ఆ కలలను వాస్తవాలుగా మలచు కోవడానికి ఏం చేయాల్నో తెలియదు. ఇటువంటి ద్వైధీ భావంతో సతమతమౌతుంటారు యువతీయువకులు. సహజంగానే ఇదే ఈ నవలలో కనిపించే ప్రధానాంశం. రకరకాల మార్గాలలో తమకు తోచిన విధంగా ప్రవర్తిస్తూ తమతమ పరి స్థితులను జీవన స్థితి గతులను మెరుగు పరుచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు ఈ నవలలోని వ్యక్తులు.

ఇక్కడ ఒక్క విషయం కాలాతీత వ్యక్తులు అనగానే కొంతమందికి మహానుభావులు అనే అర్థం స్ఫురిస్తుంది. ఆ దృష్టితో చదువుతూ పోతారు. చివరికి ఈ నవలలో అందరూ అతి సామాన్యులే కనిపించే టప్పటికి నిరాశ పడతారు. నిజానికి కాలానికి అతీతమైన వ్యక్తులు అంటే గొప్పవారు అనే అర్థమే కానక్కరలేదు. ఒకే ఒక్క కాలానికి పరిమితమైన వారుకాక అన్ని కాలాలల్లో ఉండేవారు అనే అర్థంలో రచయిత్రి ఈ పేరు పెట్టారు. అది ఆమె ఉద్దిష్టార్థమైనపుడు మనం కూడా దాన్నేం స్వీకరించాలి. ఇందులో కనిపించే ఇందిర, కళ్యాణి, ప్రకాశం, వసుంధర, కృష్ణమూర్తి, చక్రవర్తి ఇత్యాదులు ప్రతికాలంలో ప్రతిచోట అగుపిస్తూనే ఉంటారు. పేర్లు వేరు కావచ్చు. పరిస్థితులు మారవచ్చు. కొంతమేరకు స్వభావాలు అటూ ఇటూగా ఉండవచ్చు. కాని మనుష్య స్వభావాలు మాత్రం సాధారణంగా ఇలాగే వుంటాయి. ఈ పాత్రలు సృష్టింపబడిన కాలానికి మాత్రమే పరిమితమైన పాత్రలు కావు. అంతకుముందు కాలంలో ఉండి ఉంటారు ఇలాంటి వ్యక్తులు. ఇకముందు కూడా తారసపడుతూనే వుంటారు. ఈ పాత్రలకు కాల అవధిలేదు. కాలానికి అతీతమైనవన్నమాట.

నవలలో డా. పి. శ్రీదేవి కల్పించిన సన్నివేశాలు చాలా సహజమైనవి. పాత్రల మనస్తత్వాలు కూడా అంతే సాధారణంగా చిత్రింపబడ్డాయి. దాంతో ఒక నవలను చదువుతున్నట్లు కాక జరిగిన ఇతివృత్తాన్ని ఒకరు చెప్తుంటే దాన్ని మనం వింటునట్లుగ ఉంటుంది. అతిశయోక్తులు, అసాధారణ వ్యక్తిత్వాలు, అతి మంచితనం, త్యాగాలు అపార్థాలు, అనుమానాలు ఇవేవీ ఈ నవలలో కని పించవు. ఈ సన్నివేశంలో ఎవరైనా ఇలాగే ప్రవర్తిస్తారు, ఇది ఇలాగే జరుగుతుంది అనిపించేటట్లు స్వాభావికంగా వర్ణించింది డా.పి. శ్రీదేవి. అందువలన సమకాలీన సమాజాన్ని ఏమాత్రం దాచకుండ ఎలివేట్ చేయకుండ ప్రతిబింబించిన నవల కాలాతీత వ్యక్తులు అని మనకనిస్తుంది. ఇంత నేటివిటీ మరే నవలలోను మనకు కనిపించదు. ఒకవేళ కనిపించినా చదివించే శైలి కొరవడుతుంది. సాధారణంగా తెలుగు నవలల్లో జరిగేదిదే. చదివించే నవలలు స్వాభావికంగా ఉండవు. స్వాభావికంగా ఉండే నవలలు చదివించేటట్లుండవు. ఈరెంటి మధ్య మంచి సమన్వయాన్ని సాధించిన రచయిత్రి ఈమె. అందుకే కాలాతీత వ్యక్తులు సమకాలానికి కూడా సంబంధించింది అయింది.

ఒక్కొక్క పాత్రను మనం కొంచెం లోతుగా గమనించి చూద్దాం. ముఖ్యంగా స్త్రీ పాత్రలను అద్భుతంగా చిత్రించింది రచయిత్రి. అంటే గొప్పగా అని కాదు సహజంగా అని అర్థం. రచయిత్రి కావడం వలన డాక్టరు కావడం వలన ఆమె ఆడపిల్లల అనుభూతులను అనుభవాలను అంత బాగా చిత్రించగలిగింది. ఇందులో ఇందిర పాత్రను తీసుకొంటే ఆమె ఒక మధ్య తరగతి ఆడపిల్ల. తల్లి చిన్నప్పుడే పోయింది. బాధ్యతా రహితుడైన తండ్రి పెంపకంలో ఆమెకు ఏ తీపి జ్ఞాపకాలు మిగల్చకుండానే బాల్యం గడిచిపోయింది. మద్యం వాసన వేస్తున్న తండ్రి పెదాలు ఆమెకు ఆప్యాయతను పంచి ఇవ్వలేదు. ఇల్లుగడవడం కోసం చదువు ఆపేసి చిన్న ఉద్యోగంలో చేరుతుంది. తండ్రి బాధ్యత కూడా నెత్తిమీద పడుతుంది. అందరి ఆడపిల్లల లాగానే ఇందిరకూ ఆశలు, కలలు, కోరికలు ఉంటాయి అని ఆమె తండ్రి

అనుకోడు. అదే ఇందిరకు అర్థంకాదు మొదట్లో. రానురాను తండ్రి తన మీద ఆధారపడి జీవించడాన్నే కోరుకుంటున్నాడని తనకు పెళ్ళి చేసి పంపించే ఉద్దేశ్యమే అతనికి లేదని అర్థం చేసుకుంటుంది. తన ఆర్థిక పరిమితులకు తండ్రి వ్యసనం తోడౌతుంది. తీరని కోరికలు, ఆర్థికమైన ఒత్తిడులు ఆమెను లొంగదీసుకోవాలని ప్రయత్నిస్తుంటాయి. ఇందిర జీవితాన్ని చూచి భయపడి ఒదిగి ఉండాలనుకోదు. దాన్ని ఎదిరించి వీలైతే జయించి తనకిష్టమైన మార్గంలో జీవించాలనుకుంటుంది. తన కోరికలను తీర్చుకోవడానికి ఇతరుల మీద ఆధారపడవలసి వచ్చినా లెక్క చేయదు. పరిస్థితులు ప్రతికూలించినా వాటిని తనకు అనుకూలంగా మలచుకొనే ప్రయత్నం చేస్తుంది. ఆ ప్రయత్నంలో అవతలి వాళ్ళను బాధించడానికి కూడా వెనుకాడదు. తేలికగా ఒక్కమాటలో చెప్పాలంటే ఒట్టి స్వార్థపరురాలు అనిపిస్తుంది. కాని అది పూర్తిగా ఇందిరను అర్థం చేసుకున్నప్పుడు చెప్పేమాట కాదు. పైన అలా కనిపించే ఇందిరలో మానవత్వం ఉంది. చేతనైనంతలో ఇతరులకు సహాయం చేసే గుణముంది. అయితే తనకు ఇష్టం లేకపోతే చేరదీసిన వారిని వదులుకొనే తెగువ వుంది. విలువల విషయానికి వస్తే సమాజాన్ని చూసి భయపడే వ్యక్తిత్వం కాదు ఇందిరది. తనకు ఏమీ ఇవ్వని సమాజాన్ని తనెందుకు గౌరవించాలి అనుకుంటుంది. తనకు ఎప్పుడు ఎలా ఉండాలి అనిపిస్తే అలాగే ఉంటానంటుంది. ఎవరికోసం తాను మారాలి అనుకోదు. ఒక సారి ఒక తప్పు చేసినంత మాత్రాన దాన్ని సవరించుకోవడం కోసం వివాహం చేసుకుంటానంటే వద్దంటుంది. అలాగే వివాహం చేసుకున్నానని తనమీద పెత్తనం చెలాయిస్తానంటే కుదరదని ముందే చెబు తుంది. 21వ శతాబ్దంలో స్త్రీ కోరుకునే సంపూర్ణ స్వేచ్ఛను ఇందిర కోరుకున్నట్లు అర్థం అవుతుంది మనకు. ఆడపిల్లలు అనగానే నెత్తిమీద నీళ్ళ కడవలు పెట్టుకొని తిరిగే పనేం లేదని ఇందిర పాత్ర ద్వారా రచయిత్రి సూచిస్తుంది.

ఈ విషయం ఇంకాబాగా చెప్పడానికే ఆమె కళ్యాణిని సృష్టించింది. చదవగానే మొదట అందరికీ నచ్చేపాత్ర కళ్యాణిది. అణకువ, మంచి, మర్యాద ఉన్న మధ్యతరగతి ఆడపిల్లకు కళ్యాణి ప్రతినిధి. ఆలోచిస్తే మాత్రం కళ్యాణి అంత మెతకగ ఉండవలసిన అవసరమేమిటో మనకు బోధపడదు. కళ్యాణిలా ఏ ఆడపిల్ల అయినా ఎందుకుండాలి అనే ప్రశ్న మనల్ని వేధిస్తుంది. నిజమే సగటు మధ్యతరగతి ఆడపిల్లకు వచ్చే కష్టాలన్నీ కళ్యాణికి వచ్చాయి. అయితే ఆమెకు అన్ని సందర్భాలలో స్నేహితుల అండదండలు దొరికాయి. పాఠకుల సానుభూతి కూడా లభిస్తుంది. అయినా ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, దేనికో సంకోచిస్తూ, తనను తాను తక్కువ చేసుకుంటూ జీవితాన్ని చూచి భయపడుతూ, బాధపడుతూ ఇతరుల సానుభూతి కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఇది అంత ఆశించవలసిన పరిస్థితేం కాదు. ఇలాంటి సెల్ఫ్ పిటీ ఉన్న వ్యక్తులు మనకుసమాజంలో లెక్కకు మిక్కిలిగా కనిపిస్తుంటారు. వీళ్ళు ప్రశాంతంగా బ్రతకలేరు. ఇతరులను బ్రతకనివ్వరు. అలజడితో, ఆందోళనతో, అపనమ్మకంతో వీళ్ళజీవితం గడిచిపోతుంది. మనం పొందగలిగే స్ఫూర్తి ఏమీ ఉండదు. అంతా అయిపోయి తాను ఇష్టపడ్డ వ్యక్తి తనకు లభించిన సందర్భంలో కూడా కళ్యాణి ఈ జరిగేదంతా నిజమేనా అని సంశయిస్తుంది. తాను నష్టజాతకురాలు అనుకుంటూ తన వలన అందరికీ కష్టాలు వస్తాయనే మూఢ నమ్మకంతో ప్రవర్తిస్తుంటుంది. ప్రకాశం వంటి పిరికివాడ్ని ప్రేమించి మోసపోతుంది. అందులో తన తప్పేం లేదనుకుని ఇందిరను మాత్రమే దోషిగా చూస్తుంది. అసలు అందరినుంచీ తాను సహాయం పొందుతుందే కాని తానై ఎవరికీ ఏ సహాయం చేయదు. అభిప్రాయ భేదాలు వచ్చి విడిపోయి చివరికి అనుకోకుండ కలుసుకున్నప్పుడు కూడా ఇందిర కళ్యాణిని పలకరిస్తుందే కాని కళ్యాణి ఇందిరను కావాలనుకోదు. నిజానికి కళ్యాణి వంటి వాళ్ళే అసలైన స్వార్థపరులు. తమలోకి తాము ముడుచుకొనిపోతూ సమాజాన్ని ఏమాత్రం గౌరవించని, సమాజానికి ఉపయోగపడని భీరువులు వీళ్ళు. ఇలాంటి వాళ్ళను ఆదరించిన ఇందిర, వసుంధర నిజంగా మెచ్చుకోదగినవారు. వీళ్ళ ముగ్గురిలో

ఉదాత్తంగా కనిపించే వ్యక్తి వసుంధర. ఆమెకు ఆర్థికంగా ఉన్న వసతి వలన సామాన్యుల సమస్యలు కొన్ని తెలియకుండ పెరుగుతుంది. కుటుంబంలో ఉన్న సుస్థితి వలన ఆప్యాయత, అనురాగం, కోరకుండానే ఆమెకు లభించాయి. ఆరోగ్యకరమైన అనుబంధాల మధ్య పెరిగింది ఆమె. అయితే కళ్యాణిని ఇంటికి తెచ్చుకొని ఆశ్రయమిచ్చినతర్వాత ఆమెకు చాలా విషయాలు తెలియడం జరిగింది. తనకు డబ్బు ఉందే కాని దాన్ని తన ఇష్టం వచ్చిన వారికోసం ఖర్చుపెట్టే స్వాతంత్ర్యం లేదు. తన ప్రేమాభిమానాలు కుటుంబానికే పరిమితమై ఉండాలి కాని తన చుట్టూ వున్న వారికోసం పంచే అవకాశం లేదు. తాను ఒకవిధంగా బందీ. కాకపోతే అందమైన బందిఖానా, ఖరీదైన చెరసాల. కృష్ణమూర్తి తనను వదిలి వెళ్ళి పోయాడని బాధపడుతుంది తాత్కాలికంగా. కాని తనకు తగినవాడిని కాదనే భావంతోనే తనకు ఇంకా ఉన్నతమైన స్థితిని కాంక్షించే అతను తన జీవితం నుండి తప్పుకొన్నాడని క్రమంగా అర్థం చేసుకొని అతని వివాహానికి కూడా హాజరౌతుంది. ఈ క్షమాగుణం ఇందిరలో కూడా ఉంది. కాని కళ్యాణిలో లేదు. మనిషిని మహోన్నత వ్యక్తిగా చేసేది ఔదార్యం. అదిలేక పోవడమే కళ్యాణి లో లోపం. అది ఉండడమే వసుంధర గొప్పతనం. ఇలాంటి వ్యక్తులు సమాజంలో అరుదుగానే కనిపిస్తారు. కాని వీరి వలననే సమాజం జీవించదగినదిగా ఉంటుంది.

పురుష పాత్రలలో పిరికివాడిగా కనిపించే ప్రకాశం వ్యక్తిత్వం లేనివాడు. కళ్యాణిని ప్రేమించానను కుంటాడు. కాని ఆమె ప్రక్కన నిలబడే ధైర్యం లేనివాడు. అలా అని స్పష్టంగా చెప్పడు. లేనిపోని ఆశలను కళ్యాణిలో కల్పిస్తాడు. ఆమె కష్టకాలంలో కనుమరుగౌతాడు. ఇందిర అంటే భయపడతాడు. అలాగని ఆమెకు దూరంగా వెళ్ళలేడు. తెలియని ఆకర్షణకు లోనౌతుంటాడు. తాను మంచివాడిననీ, ఇందిర తనను ప్రలోభ పెడుతుందనీ అనుకొని తృప్తి పడుతుంటాడు. ఇలాంటి వ్యక్తులు లోకంలో తరచుగా తారసపడుతుంటారు. లోకంలో అందరూ చెడ్డవాళ్ళు , స్వార్థపరులు తాము మాత్రమే మంచివాళ్ళు అనుకుంటుంటారు. ఇలాంటి వెన్నెముక లేని వాళ్ళు ప్రేమించామని భ్రమపడుతూ కళ్యాణి లాంటి వాళ్ళను భ్రమపెడుతూ బాధ పెడుతూ భగ్న ప్రేమికులమని అనుకుంటారు. వీళ్ళ కదోతృప్తి. ఏ మేనమామనో అడ్డం పెట్టుకొని ప్రేమ ఫలించలేదని వాపోతుంటారు. ఇలాంటి పిరికివాళ్ళు ప్రేమ పేరుతో అమ్మాయిలను కలల ప్రపంచం దాకా తీసికొని వెళ్ళి అక్కడ ఏ ఆధారం లేకుండ వదలి వేస్తారు. కళ్యాణి లాంటి వారైతే ఏడుస్తూ కూర్చుంటారు. ఇందిర లాంటివారు తమ మనసులలో నుంచి వారిని తొలగించుకొని ముందుకు సాగిపోతారు.

ఇందులో విచిత్రమైన వ్యక్తి కృష్ణమూర్తి. అంతో ఇంతో ఆర్థిక స్తోమతు గలిగి కాలక్షేపం కోసం మాత్రమే కాలేజీ చదువులకు వచ్చే యువకులకు అచ్చమైన ప్రతినిధి ఈ కృష్ణమూర్తి. దేన్నీ సీరియస్‌గా పట్టించుకోడు. ఎప్పటికేది తోస్తే అది చేసేస్తుంటాడు. లాభనష్టాలను బేరీజు వేసుకొంటూ ప్రవర్తించడు. తోచిన సహాయం చేస్తాడు. ప్రతిఫలాన్ని ఆశించడు. అది ఒక గొప్ప పని అని కూడా అనుకోడు. అసలు తనకేం కావాల్నో ప్రత్యేకంగా ఆలోచించడు. అలాంటి వాడు సహజంగానే ఇందిరపట్ల ఆకర్షితుడౌతాడు. కళ్యాణికి మానవత్వంతో సహాయం చేస్తాడు. కళ్యాణిని ఆదుకోకుండా వెళ్ళగొట్టిందని ఇందిరమీద కోపం తెచ్చుకుంటాడు. ఇందిరకు దూరం అవుతాడు. కళ్యాణిని ఆదరించిన వసుంధరకు దగ్గరౌతాడు. ప్రతిఫలాపేక్ష ఏమీ లేకుండా రామినాయుడికి వైద్యం చేయించడం దగ్గరనుంచీ, అతని మరణవార్తను మూర్ఖులైన అతని కొడుకులకు తెలియజేయడం వరకు తనకు చేతనైన విధంగా కళ్యాణికి సహాయంచేస్తాడు. ఈ విధంగా వసుంధర దృష్టిలో మంచివాడుగా ముద్ర పడుతాడు. కాని కృష్ణమూర్తికి తానేమిటిటో తనకు తెలుసు. వసుంధర అను కొంటున్నంత ఉత్తముడిని కాననీ తెలుసు. ఇంకా ఆమెకు చేరువయ్యే అవకాశం ఉన్నా ఆపని చేయకుండా ఆమెనుండి దూరంగా జరిగిపోయి తనకుతగిన వ్యక్తి ఇందిరేనని గుర్తిస్తాడు. పైగా వసుంధరకు ఇంకా మంచి వ్యక్తి తారసపడతాడని ఆమె అందుకు

అర్హురాలని భావిస్తాడు. మొదట్లో దేన్నీ పెద్దగా పట్టించు కోనట్లు కనిపించే కృష్ణమూర్తి క్రమంగా పరిణతిపొంది ఉదాత్తంగా ప్రవర్తించడం ఆశ్చర్యం గొలుపుతుంది.

ఈ నవలలో మొదటినుంచీ చివరి వరకు ఒకే తూగుతో వ్యవహరించిన వ్యక్తి చక్రవర్తి. కళ్యాణి జీవితంలో ఎదుర్కొన్న సమస్యలను అర్థం చేసుకొని తాము ఒకరి కొకరం తోడుగా ఉండాలని అనుకొం టాడు. ఎప్పుడూ ఆ అభిప్రాయాన్ని మార్చుకోడు. కళ్యాణి తటాపటాయించినా ఆమెకు తోడుగా నిలిచి వుంటాడు. ఆమెకు కొత్త జీవితాన్ని ప్రసాదించడానికి పూనుకొంటాడు. వ్యక్తిత్వం లేని ప్రకాశంతో పోల్చి చూస్తే చక్రవర్తి మరీ ఎత్తుగా కనిపిస్తాడు.

పాత్రలు ఏ నవలకైనా అత్యంత ప్రధానమైనవి. సన్నివేశాలు ఎన్ని సృష్టింప బడినా, ఇతివృత్తం ఎంత ఆసక్తిదాయకమైన దైనప్పటికీ అవి మనసుకు హత్తుకునేలా చేసేవి పాత్రలే. అలాంటి పాత్రలను సృష్టించి వాటికి ప్రాణం పోసింది రచయిత్రి. అందుకే కాలాతీత వ్యక్తులు చదివి ముగించిన తర్వాత ఆ పాత్రలు మనకు చిరపరిచితాలుగా మనోఫలకంపైన నిలిచి పోతాయి. మరపురాని ఆ పాత్రలను సృష్టించి వాటి ద్వారా మనుష్యులు ఎలా ఉండాల్నో ఎలా ఉండకూడదో తెలియజేస్తారు డా. శ్రీదేవి.

ఇక పోతే స్త్రీల విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు పెరిగిన ఈ శతాబ్దంలో కూడా ఆమె సృష్టించిన పాత్రలు మార్గ నిర్దేశం చేసేవిగా ఉండడం విశేషం. స్త్రీ పురుషులు భార్యాభర్తలైన సందర్భంలో కూడా స్నేహితుల మాదిరిగా ఉండాలి కాని బానిస యజమాని హోదాలలో ఉండకూడ దని చెప్పిస్తుంది ఇందిర పాత్ర చేత. అయితే ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించినట్లుగా కాక చాలా సహజమైన తనదైన ధోరణిలో ఇందిర ఇలా అంటుంది. ఈ మాటల ద్వారా రచయిత్రి స్త్రీ స్వాతంత్ర్యానికి ఎంత ప్రాధాన్యమిచ్చిందో తెలుస్తుంది. స్త్రీవాద భావజాలం లేని కాలంలో స్త్రీవాద లక్షణంగా బలంగా చెప్పదగిన మాటలతో ఈ నవల ముగుస్తుంది. సమస్యలకు భయపడి పారిపోవడం, నిరాశా నిస్పృహలకు లోను కావడం, ప్రాణాలు తీసుకోవడం లేదా ప్రాణాలు తీయాలనుకోవడం ఆధునిక యువతలో కనిపిస్తున్న ఈ తరుణంలో శ్రీదేవి ఇందిర ద్వారా చెప్పించిన మాటలు గుర్తుంచుకో దగినవి. "బతికున్న ప్రతిమనిషికీ సమస్య లుంటాయి. సమస్యలు లేనిది చచ్చిపోయిన వాళ్ళకి మాత్రమే"

"నీకు ఆయుర్దాయం ఎన్నాళ్ళు అంటే నీ జీవిత కాలంలో నిండుగా బతుకు. నిర్భయంగా బతుకు. రోజుకి పదిసార్లు చావకు. ఇంకొకళ్ళని చంపకు. నీకు తారసిల్లిన మనుష్యుల్లో అణగి మణగి ఎక్కడైనా లోలోపల కొంచెం మానవత్వం ఉంటేదాన్ని బైటకితీయడానికి ప్రయత్నించు" అన్న ఇందిర మాటలు అందరూ అన్ని వేళలా గుర్తుంచు కోదగిన ఆచరించదగిన మాటలు.

స్త్రీలు వివాహానంతరం సర్దుబాటు అలవరచు కుంటారు. అయితే వ్యక్తిత్వాలను చంపుకొని బానిసలుగా జీవించవలసిన అవసరం ఎంతమాత్రం లేదని ఇందిర ద్వారా చెప్తుంది రచయిత్రి. "కృష్ణమూర్తీ! నీతో ఎంత దూరం రమ్మన్నా వస్తాను గాని ఏ ఘట్టంలోనూ నా వ్యక్తిత్వాన్ని చంపుకోలేను. ఆ మాత్రం అర్థం చేసుకొని, నా అవసరాలను గౌరవించటం నేర్చుకొని నన్ను నాయిష్టం వచ్చినట్లు ఊపిరి పీల్చుకోనిస్తావా - నువ్వు సుఖపడగలవు. నన్నూ సుఖపెట్టగలవు. లేదా ఇద్దరికీ నరకం తప్పదు. ఇద్దరం కలిసి ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళం చూస్తూ కూర్చుందుకు కాదు ఇలా దగ్గరికి వచ్చింది. ఇద్దరం కలిసి ఒకే లక్ష్యం వైపు చూడగలిగితేనే సార్థకం. అంతేగాని నాన్న ఒక రకం జైలులోకి వెళితే, నేను ఇంకోరకం జైలులోకి వచ్చాననుకోకు" - ఈ మాటల ద్వారా స్త్రీ పురుష సంబంధాలలో సమానత్వం ఉండాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తుంది రచయిత్రి. స్త్రీవాదం ఇంకా వేళ్ళూనుకోకముందే, చాలాముందే స్త్రీవాద దృక్పథాన్ని కలిగిన డా. శ్రీదేవి తొలితరం సాంఘిక నవలా రచయిత్రి కావడం గమనించదగ్గ విశేషం. ఆ తర్వాత కాలంలో రచయిత్రులు ప్రేమ అనే మత్తుమందు రంగరించి తమ రచనా కౌశలాన్ని మేళవించి నవలలు పుంఖాను

పుంఖాలుగా రచించారు. వాటి వలన స్త్రీలలో రచనాసక్తి పెరిగింది కాని సామాజిక ప్రయోజనం కొరవడింది. స్త్రీలను ఊహాలోకంలో విహరింపజేసే నవలలు తరువాత వచ్చి, కాలాతీత వ్యక్తులు వంటి మంచి సామాజిక స్పృహ కలిగిన నవల గుర్తు లేకుండా పోవడం విచారకరం. ఈ నవలలో ఎక్కడా రచయిత్రి పైవిషయాలను ప్రతిపాదిస్తున్నట్లు గాని, పాత్రలు చర్చిస్తున్నట్లుగాని కనిపించదు. యధార్థంగా జరిగిన కథను చెప్తున్నట్లుగా సాగుతుంది. సహజత్వానికి దగ్గరగా ఉండడం వలన నమ్మశక్యం గాని కల్పనలు లేకపోవడంవలన ఈ నవల మన మనసుకు హత్తుకుంటుంది. యువతీయువకుల మధ్య ఉండే ఆకర్షణలు, అపోహలు, అనుమానాలు అన్నీ ఉన్నా ఇది సహజత్వానికి దగ్గరగా నిర్మించబడిన నవల. 20వ శతాబ్దంలో వ్రాయబడినా 21వ శతాబ్దంలో కూడా జరిగే దానికి అవకాశమున్న ఇతివృత్తం ఈ నవలలో ఉండడం చేత ఇది కాలాతీతమైనదని చెప్పవచ్చు.

తిక్కన రాజనీతి

డా. వి.వి.యల్. నరసింహారావు

అనల్ప కవితా శిల్పకోవిదుడుగామాత్రమే కాక అద్భుత రాజనీతి చతురుడుగా కూడా ప్రసిద్ధికెక్కిన చారిత్రిక పురుషుడు తిక్కన - అంటే కవిబ్రహ్మ మాత్రమే కాక మంత్రి మణిగా కూడా ప్రసిద్ధి వహించాడన్నమాట.

ఒక కవి తన ప్రజ్ఞాప్రాభవాలతో ఒక సన్నివేశాన్ని ఊహించి కల్పనచేయటం వేరు. అటువంటి సన్నివేశాలు తన జీవితంలోనే తారసిల్లినప్పుడు ఆ అనుభవంతో ఆయా విశేషాలు కావ్య రూపంలో నిక్షేపించటం వేరు. అదృష్ట వశాత్తు తిక్కనకు ఈరెండు విధాలైన అనుభవ విశేషాలు చక్కగా సమకూడినై. అందువల్లనే ఆయన జీవితమూ కవితా జీవితమూ సమగ్ర సుందరమైనాయి.

క్రీ.శ. 1210 నుంచీ సుమారు 1288 వరకు దాదాపు 78 సంవత్సరాల పూర్ణజీవితం. తిక్కన నలభయ్యో పడిలో నిర్వచనోత్తర రామాయణం రచించి యాభయ్యో పడిలో యజ్ఞంచేసి అరవయ్యో పడిలో విరాటమాదిగా భారతాంధ్రీకరణం మొదలుపెట్టి పదిపదమూడు సంవత్సరాలు నిరాఘాటంగా దాన్ని కొనసాగించాడు.

నిర్వచనోత్తర రామాయణం నెల్లూరి మండల విభుడైన మనుమసిద్ధికి అంకితమియ్యబడింది. తాను ఆ ప్రభువు కొలువులో మంత్రిగా దండనాథుడుగా పనిచేసిన రోజుల్లో ఆగ్రంథం ఆ ప్రభువుకు అంకిత మైంది. ఇది క్రీ.శ. 1257 ప్రాంతం కావచ్చు.

మంత్రి మణిగా తిక్కన సాధించిన ఘనవిజయాలు చరిత్రకెక్కిన విషయాలే. సాహితీ గ్రంథాల సాక్ష్యం కూడా ఉన్నది.

మనుమసిద్ధికి దాయాదులైన అక్కన బయ్యనలు ఆ ప్రభువును పదవీచ్యుతుణ్ణి చేసి రాజ్య భ్రష్టుణ్ణి చేయగా తిక్కన ఓరుగంటి ప్రభువైన గణపతి దేవుణ్ణి దర్శించి ఆయన సహాయమర్థించి తద్వారా అక్కన బయ్యనలను తుదముట్టించి తిరిగి మనుమసిద్ధిని నెల్లూరి సింహాసనం లో ప్రతిష్ఠింపజేశాడు. ఈ అంశాలు 15వ శతాబ్ది ఆరంభం లో కాసె సర్వప్ప రచించిన సిద్ధేశ్వర చరిత్రలోనూ, 18వ శతాబ్ది ఆరంభంలో కూచిమంచి జగ్గకవి రచించిన సోమదేవరాజీయంలోనూ స్పష్టంగా ఉన్నాయి.

తనకు ప్రభువైన మనుమసిద్ధికి తిక్కన చేసిన లోకోత్తర సేవ ఇది. కేవలం కవి మాత్రుడుచెయ్యగల పనికాదు ఇది. రాజకార్య దురంధరుడైన మహామంత్రి దండనాథుడు మాత్రమే చెయ్యగల పని యిది. రహస్య గోపనంలో కాని ఉపాయాలలో కాని ఏమాత్రం లోపం జరిగినా మొత్తం పథకమంతా బెడిసికొట్టే సందర్భంలో అలా జరగకుండా ఎంతోచాకచక్యంతో ఈ మహాకార్యాన్ని నిర్వహించాడు తిక్కన. అందువల్లనే కేతన దశకుమార చరిత్ర కావ్యంలో తిక్కనను వర్ణించిన తీరు అక్షర సత్యమనిపిస్తుంది.

'నీతి విద్యానిపుణు'డనీ, 'నీతి సంపదాఖండల పూజ్యు'డనీ, 'భాసుర నయశిక్షు'డనీ, 'ధీ సంపత్సార నిత్యు'డనీ, 'మనుమసిద్ధి మహీశ సమస్త రాజ్య భార ధౌరేయు'డనీ, 'సామాద్యుపాయ విదు'డనీ, 'అరిసచివ మహోపాయహరు'డనీ, 'నరపతి నయవిద్యా నైపుణ్యప్రాభావు'డనీ- ఇన్ని మాటలెందుకు? 'నీతి చాణక్యు'డనీ తిక్కన ప్రజ్ఞా ప్రాభవం కేతన మనసారా నోరారా గానం చేశాడు. అభినవదండి బిరుదాంకితుడు మూల ఘటిక కేతన తిక్కనకు సాక్షాత్తూ శిష్యుడు కావచ్చు. తన కావ్యాన్ని గురువుగారికి అంకితం చేసి వుండవచ్చు. అంతమాత్రాన తిక్కనను గూర్చి వ్రాసిన విషయాలు అత్యుక్తులని కొట్టిపారెయ్యటానికి వీలు లేదు. కారణం అవి చారిత్రక సత్యాలు కూడా కావటమే.

తిక్కన నిజజీవితంలో మంత్రిమణిగా ప్రదర్శించిన అద్భుత రాజనీతి చాతుర్యం భారతాంధ్రీకరణ సమయంలో అపూర్వంగా తోడ్పడి ఉండవచ్చు. అందు వల్లనే రాజనీతి నిరూపణ సందర్భాలలో తిక్కన రచన అసదృశంగా నడిచింది.

దాయాదులైన దుర్యోధనాదుల వల్ల రాజ్యభ్రష్టుడైన ధర్మరాజు కథవ్రాసేటప్పుడు తిక్కనకు రాజ్యభ్రష్టుడైన మనుమసిద్ధి జ్ఞప్తికి రాకమానడు. కౌరవ పాండవుల నడుమ జరిగిన రాయబారాల్లో ద్రుపద పురోహిత, సంజయ, కృష్ణులు ప్రదర్శించిన రాజనీతి వైశారద్యంలో తిక్కనకు భాగస్వామ్యం తప్పదు. కృష్ణుని రాయబారం విఫలమైనా - గణపతి దేవునితో తిక్కనజరిపిన రాయబారం సఫలమైంది. సామ్య సందర్భాలూ, వ్యక్తుల గుణగణాలు వేరు కాబట్టి ఏమైనా తిక్కనకు నిజజీవితంలో సిద్ధించిన రాజనీతి విషయక -అనుభవ పరిపాకం భారతాంధ్రీకరణలో అపూర్వంగా ఉపయోగపడి వుండవచ్చు.

వ్యాస హృదయం ఆమూలం అవగతం చేసుకున్న మనీషి తిక్కన. రాయబారిగా కృష్ణుడు బయలుదేరు తున్న సందర్భంలో ధర్మజు డాయనతో చెప్పవలసిన దంతా చెప్పి చివరకు ముత్యం వంటి మాట ఒకటన్నాడు.

"అస్మాన్ వేత్థ, పరాన్ వేత్థ, వేత్థార్థాన్, వేత్థ భాషితుమ్;
యద్య దస్మద్ధితం, కృష్ణ! తత్తద్వాచ్యస్సుయోధనః"

దీన్ని తిక్కన ఇలాఅనువదించాడు.

"మమ్మెఱుగు, దెదిరినెఱుగుదు, నెమ్మి యెఱుగు, దర్థ సిద్ధి నెఱిఁయెఱుగుదు; వాక్యమ్ముల పద్ధతి నెఱు గుదు, పొమ్మెవ్వడ నేను నీకు బుద్ధులు చెప్పన్!"

మూలాన్ని యథాతథంగా అనుసరిస్తూనే తిక్కన కొసమెరుపుగా అద్భుత మైన ఒక విసురు విసిరిం పించాడు ధర్మజుని చేత - అదేమంటే

"పొమ్ము ; ఎవ్వడ నీకు నేను బుద్ధులు చెప్పన్;" అనే మాట.

తిక్కన వాక్చతురతకూ, రాజనీతి చతురతకూ, తెనుగు దనాన్ని పుక్కిలించే ప్రౌఢ వాగ్విన్యాసానికీ ఇది గీటురాయి. ఇట్లా రచన చెయ్యడానికి తిక్కనకు స్వీయ జీవితానుభవాలు ఎంతగానో తోడ్పడ్డాయి.

మనుమసిద్ధి స్వయంగా తిక్కనను గణపతి దేవునొద్దకు రాయబారిగా పంపకపోయినా - పంపించినట్లే భావించి స్వామి కార్యం స్వకార్యంగా నెరవేర్చి ప్రభువు పట్ల తన కృతజ్ఞతా ఋణం శాశ్వతంగా తీర్చుకున్నాడు.

రాయబారి అయినవాడికి ఆత్మ జ్ఞానం,పరజ్ఞానం, అర్థజ్ఞానం, శబ్దజ్ఞానం,హితజ్ఞానం అన్నీవుండాలి. అన్నిటి కంటే ముఖ్యమైనది అంతరంగ పరిశుద్ధి. దీనినే ఉపధా పరిశుద్ధి అంటారు. మంత్రిమణిగా తిక్కనకు ఈ లక్షణం పుష్కలంగా సిద్ధించి ఉన్నది.

ఆర్య సంస్కృతిని అందలమెక్కించిన అంశాలలో భారత రాజనీతి శాస్త్రం ఒకటి. దండనీతి రాజనీతిలో అంతర్భాగమే. భారతీయములైన చతుర్విద్యల్లో దండ నీతికి ఎంతో ప్రాముఖ్యం ఉన్నది. చతుర్విద్యలంటే అన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి. అన్వీక్షకి విజ్ఞానవిషయ ప్రధానం. త్రయి ధర్మాధర్మ విషయ ప్రధానం; వార్త అర్థానర్థ విషయ ప్రధానం. దండనీతి నయానయ విషయ ప్రధానం. దండనీతిలో అర్థశాస్త్ర నీతిశాస్త్రాలు అంతర్భూతాలు. వీటిలో ప్రాచీన భారత రాజనీతి, ప్రజాపాలనం, సంగ్రామాలు, తత్సంబంధిత దండనీతి విశేషాలు మొదలైన పెక్కువిషయాలు విపులంగా వివరించబడినాయి. బాగా వెనుకకుపోయిచూస్తే అర్థశాస్త్ర విజ్ఞాన ప్రవర్తకులు మనువు, బృహస్పతి, శుక్రుడు, పరాశరుడు, భారద్వాజుడు మొదలైన ఋషి కల్పులు. ఈ విషయాలు కౌటిల్యుని అర్థశాస్త్రంలోనూ వివరించ బడినై. ఈ విశేషాలన్నీ తిక్కనకు కరతలామలకాలు. అందువల్లనే కాబోలు కేతన, తిక్కనను - "నీతి చాణక్యుడ"డనీ, "రాజనీతి విద్యానైపుణ్యప్రౌఢభావుడనీ" ప్రస్తుతించాడు.

తిక్కన రచితంగా ప్రసిద్ధి పొంది అలభ్యంగా వున్న 'విజయసేనమనే కృతి' ఒకటున్నది. పెదపాటి జగ్గకవి సంకలనం చేసిన ప్రబంధ రత్నావళిలో ఇందులోని పద్యాలు ఉటంకించబడినాయి. అట్లాగే అప్ప కవీ, కస్తూరి రంగకవి కూడా ఒకటి రెండుదహరించారు.

కథానాయకుడైన విజయసేనుడు రాజనీతిలో ప్రగల్భుడు. సాధారణంగా ప్రభువు సంపత్సమేతుడు కావాలంటే కొన్ని లక్షణాలు అలవరుచుకోవాలి. అవేవంటే

శా. ఉత్సాహ ప్రభు మంత్రశక్తుల నజేయుండై పరీక్షించినన్
దిత్సావ్యగ్రుడుకాక నిగ్రహముతో దేశంబు కాలంబు సం

పత్సామగ్ర్యము చూపి శక్యము దెసన్ ప్రారంభియై భూప్రజా
వాత్సాల్యార్థ మనస్కుడైన పతి శశ్వత్ శ్రీ సమేతుండగున్

దిత్సావ్యగ్రత అంటే దానాలు చెయ్యాలనేఇచ్ఛ ముమ్మరంగా ఉండటం. దానివల్ల ఖజానా వట్టిపోయే ప్రమాదం ఉంది. సప్తాంగాలను రాజు విస్మరించరాదు.

తే॥గీ॥ మహిమచెడదు స్వామ్యమాత్య సుహృత్కోశ
రాష్ట్ర దుర్గ బల పరాయణులకు
నీవు నిదియు నెఱిగి కావింపు సప్తాంగ
సంగ్రహంబు నీతి శాస్త్ర నిపుణ

పద్యాల నడకతీరు, విషయవైపుల్యం తిక్కన రచన అని అనటానికి అనువుగా వుండటవే కాక ఈ విషయాలు శాంతి పర్వంలో భీష్ముడు ధర్మరాజునకు చెప్పినవి కూడాను. స్వామ్యమత్యాది సప్తాంగాలు సువిస్తృతమైన నీతి శాస్త్రంలో వివరించబడిన అంశాలే. నీతి శాస్త్రమనేది "లోక చరిత్ర నిర్మలీకరణానికి ఆవశ్యక" మని కూడ భీష్మోపదేశం.

భారత గ్రంథాన్ని ధర్మశాస్త్రజ్ఞులు ధర్మశాస్త్రమనీ, నీతి విచక్షణుల్ నీతిశాస్త్రమనీ ప్రస్తుతించడం సహజమే. విదురనీతి, కణిక నీతి, మొదలైన నీతి విశేషాలతో పాటు భీష్ముడు ధృతరాష్ట్రుడు ధర్మజునకు చెప్పిన నీతి విశేషాలు కూడా ముఖ్యమైనవే.

తిక్కన రాజనీతి వైశారద్యం గూర్చి ప్రస్తావించే టప్పుడు ఒకపేచీ ఉన్నది. వ్యాసుడు చెప్పినవీ -తిక్కన మాత్రమే చెప్పినవీ ఏఏ నీతి విశేషాలున్నాయో వాటిని విడమరిచి చెపితే తప్ప ఏది వ్యాసుడి ప్రతిభో ఏదితిక్కన ప్రతిభో చెప్పటం కష్టం. రెంటినీ కలగాపులగం చేసి చెప్పటం భావ్యం కాదు.

అంపశయ్యమీదనుండి భీష్ముడు ధర్మజునకు - దండనీతి జన్మప్రకారం వివరిస్తున్నాడు.

రాజు ఎల్లవేళలా మృదుస్వభావుడై ఉంటే అతన్ని అందరూ చులకనగా చూస్తారు. మరీ తీక్షణంగా వున్నా లోకం అతనికి పెడమొగమౌతుంది. కాబట్టి సమయోచితంగా మృదు తీక్షణతలు రెండూ ఉండాలి. పైగా ఓర్పుగల రాజును నీచజనులు నిత్యం పరిభవిస్తారు. మావటీడు ఏనుగు తలమీద కెక్కినట్లు వారు ప్రభువు నెత్తి కెక్కటానికి ప్రయత్నిస్తారు. ఇవన్నీ వ్యాసుడు చెప్పిన విశేషాలే.

మృదుర్హిరాజా సతతం లంఘ్యో భవతి సర్వశః
తీక్ష్ణా చ్చోద్విజతే లోకః తస్మాత్ఉభయమాచర.
క్షమమాణం నృపం నాత్యం నీచఃపరిభవేత్ జనః
హస్తియంతా గజస్యేవ శిర ఏవారు రుక్షతి

తిక్కన ఈ సందర్భాన్ని ఇలా అనువదించాడు.

సీ. మేదినీపతి అతిమృదువైన మావంతు
డేనుంగు నెట్లట్ల యెక్కి యాడఁ
జూచు (దేకువ చెడి నీచపుఁబ్రజ; క్రూరుఁ
డగునేని లోకంబు బెగడుగుడుచు
గాన వసంతంబు భానుని చాడ్పునఁ
దగియెడు పాటితో ధరణి ప్రజల
నుచితవర్తనముల నొందించునది యిది
రాజ ధర్మములకు రాజు సుమ్ము.

వ్యాసవాక్యాన్ని మరింత అలంకరించి రాజనేవాడు వసంతకాలపు సూర్యునివలె మృదు తీవ్రతలు రెండూ కలిగి వుండాలని మూలవాక్యాన్ని రమ్యతరం చేశాడు. అంతేకాదు ప్రజలకు, తగిన నడవడి నేర్పటమనే రాజధర్మం రాజధర్మాలకే మకుటాయమనే మాట తిక్కన భావించిన రాజనీతి లక్ష్యాన్ని స్పష్టం చేస్తుంది.

ప్రజారంజనం ప్రభుకర్తవ్యాలలో ముఖ్యమైనది. దీనితోపాటు అవసరమైన తావున దండనీతిని విస్మరించరాదు. దండనీతి ప్రయోగం నిర్దుష్టంగా న్యాయంగా ఉండాలి.

"దండము పరీక్షా విశుద్ధి పూర్వకముగ వలయు"
"తన తలంపు వెంటఁదమకించి ప్రజకునొ
వ్వగఁజరించుటయును దగదుపతికి" అంటూ భీష్ముడు ధర్మజునకు దండనీత్యుపదేశం చేశాడు.

"పార్థివో జాయతే (తాత!) దండనీతి విశారదః
తతో జగతి రాజేతి సతతం శబ్దితం బుధైః"

దండనీతి విశారదుడైన ప్రభువు ప్రజా రంజకుడు కావటం ముఖ్యం. పండిత మతాన్ని అనుసరించి రాజశబ్దం అప్పుడే సార్థకమౌతుంది.

ఈ అభిప్రాయాన్ని కొంచెం పొడిగిస్తూ తిక్కన

"రాజ నామమునకు భాజనంబై మహా
ద్భుత చరిత్రుండగు పురుషుడొకడు
కలిమికి మూలంబు" - అని నిష్కర్షగా చెప్పాడు.

ఆశ్రమవాస పర్వంలో కూడా ధృతరాష్ట్రుడు ధర్మజునకు ఉపదేశించిన రాజనీతి విశేషాలలోతిక్కన అనుభవ పరిపాకం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

కార్యసాధన రాజు నయజ్ఞభృత్యకోటి వల్ల మేలు కలిగి నప్పుడు వారి చేతలు పేరు పేరున గ్రుచ్చి కొనియాడుతూ మనుగడ అగ్గలం చెయ్యాలంటాడు. అంటే బహుమతులు పారితోషికాల వంటివి ఇచ్చి మన్నించాలని అర్థం. లేకపోతే ఒకోసారి భృత్యులు ప్రబల వైరులుగా మారవచ్చు.

అంతేకాదు, చేరువన్నృపులకు వైరబంధం కలగటం కూడా రాజు మర్చిపోరాదు. ఉదాసీనులైన సమీప వర్తనులు రాజునకు మిత్రులౌతారనేది మరో ముఖ్యమైన రాజనీతి.

తిక్కనమంత్రి మనుమసిద్ధిని సింహాసనంలో పునః ప్రతిష్ఠితుణ్ణి చెయ్యటానికి ఈ రాజనీతి విశేషాలెంతగానో ఉపకరించి వుంటాయి.

నిజానికి మంత్రి కుండదగిన లక్షణాలన్నీ తిక్కనలో పుష్కలంగా వున్నాయి. ఇంతకూ మంత్రి కుండవలసిన లక్షణాలేవిటి? ఈ విషయంలో ప్రాచీనుల అభిప్రాయాలను సమీక్షిస్తూ చాణక్యుడు ముత్యంవంటి మాట సెలవిచ్చాడు. "ఏ ఏ సామర్థ్యాలు ఎవరిలో ప్రచురంగా వుంటాయో ఆయా కార్యాల్లో అతన్ని అమాత్యుడుగా నియోగించడం మేలు." అంటే జన్మ సిద్ధంగా వచ్చిన గుణాల వల్ల కూడా మంత్రి సమర్థుడై యుండాలని ఆయన అభిప్రాయం. అయితే భారద్వాజ, విశాలాక్ష పరాశరులు మంత్రి లక్షణాలను చాణక్యుని కంటే ముందే వివరించారు. అందులో పరాశరమతాన్న నుసరించి చూస్తే - "ప్రభువు పట్ల స్వచ్ఛమైన ప్రేమానురాగాలు ఉన్నవాడే మంత్రి అనీ, ప్రభువును ఆపదల్లోంచి రక్షించగల సమర్థుడే మంత్రి" అనీ స్పష్టం.

మనుమసిద్ధి నృపాలుని విషయంలో తిక్కన మంత్రికి ఈ గుణాలన్నీ సమకూడి ఉన్నాయి. అందువల్లనే తిక్కన కవిబ్రహ్మగా మాత్రమేగాక, మంత్రిమణిగా కూడా చిరయశోభాజనుడైనాడు.

ఆయన రాజనీతి వైశారద్యం అటువంటిది.

కేతన అభివర్ణించినట్లు తిక్కనామాత్యుని యిల్లు అటు వేద నినాదాలకూ, ఇటు వీరనినాదాలకూ నిలయమైనది.

వీరనినాదంబు వేదనినాదంబు
పాయక యే ప్రొద్దుల మ్రోయుచుండు
భూసుర ప్రకరంబు సేసలు చల్లంగ
పాయకెన్నియొ కుటుంబములు బ్రతుకు
బ్రాహ్మణావళికి ధారలు వోసిన జలము
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసగిన పత్రికల పుత్రికలను
పాయక కరణముల్ వ్రాయుచుంద్రు
మానధనుడైన తిక్కనమంత్రి యింట
మదనసము డైన తిక్కన మంత్రి యింట
మహిత యశుడైన తిక్కన మంత్రి
యింట మంత్రి మణియైన తిక్కన మంత్రి యింట

కవిబ్రహ్మ అయిన తిక్కన కవితా విశారదుడైతే మంత్రిమణి అయిన తిక్కన రాజనీతి విశారదుడైనాడు.

పురుషకారంతో దుష్కరకార్యాలు సాధించి, పురుషార్థాలలో అర్థ కామాలకంటే ధర్మమోక్షాలకే ప్రాధాన్యమిచ్చిన తిక్కన రాజనీతి కోవిదుడైన పూర్ణ పురుషుడు.

జానపద సాహిత్యం - సాంస్కృతిక వాదం

- డా. కసిరెడ్డి వెంకటరెడ్డి

సాహిత్యాన్ని మూడు భాగాలుగా విభజించు కొని ప్రస్తుతం అధ్యయనానుశీలనాలు కొనసాగుతున్నాయి. ప్రాచీన సాహిత్యం ఆధునిక సాహిత్యం - జానపద సాహిత్యం అనే ఈ మూడింటిలో అంతర్విభాగాలు ఎన్నో ఉన్నాయి. జానపద సాహిత్యంలోని వస్తువు ఆధారంగా వివిధ వాదాలతో (Thought of Schools) అధ్యయనమూ కొనసాగుతుంది. ఈ వివిధ వాదాల సమీకృత అధ్యయ నాల వల్ల అనేక వినూత్నాంశాలు వెలికి వస్తున్నాయి.

వివిధ వాదాలు - అధ్యయనం

పురాగాథా వాదం (Mythological theory) : ఇదివరకే ప్రస్తావించబడ్డ వివిధ వాదాల్లో ఇది ఒకటి. జానపద సాహిత్యంలోని పౌరాణికాంశాల ఆధారంగా ఈ వాదానికి కొన్ని లక్షణాలను సమకూర్చి అధ్యయనం చేయడమే పౌరాణిక వాదం. పురాణగాథలు మూలాలుగా ఈ సాహిత్య ప్రాదుర్భావ వికాసాలు జరిగాయని ఈ వాదం బలంగా నిరూపించి అధ్యయన శీలురకు దిశా దర్శనం చేసింది.

రెండవది వలసవాదం (Migrational theory) : అనేక కారణాల వల్ల ఒకదగ్గరి మనుష్యులు మరో చోటికి వెడతారు. అక్కడివారు ఇంకోచోటికి వెడతారు. ఈ విధంగా వలస వచ్చి స్థిరపడడం నిరంతరం జరుగుతూనే ఉంటుంది. దీనివల్ల తమ పుట్టు ప్రదేశంలోని వస్తు రూపాలెన్నో తాము స్థిరపడ్డ ప్రదేశంలో విస్తరిస్తాయి. ఇటువంటి వాటినే వలసవాదం క్రింద అధ్యయనం చేయడం జరుగుతున్నది.

మూడవది నృశాస్త్రలేదా మానవశాస్త్రవాదం (Anthropological theory): ప్రపంచంలోనే మానవులు భిన్న దేశాలలో భిన్న ప్రాంతాలలో ఉన్నా మనోవికాసం మాత్రం ఒకే విధంగా ఉన్నదని ఈవాదం సారాంశం.

నాల్గవది చారిత్రక భౌగోళిక వాదం : వలసవాద విస్తరణమే ఇది. అనేక చారిత్రక భౌగోళిక కారణాలవల్ల ఏర్పడ్డ పరిస్థితుల ఆధారంగా సాహిత్య ప్రాదుర్భావం జరిగి, ఆ పరిస్థితులకు సంబంధించిన అంశాలు ఆ సాహిత్యంలో చోటు చేసికొంటాయి.

ఐదవది మనోవిశ్లేషణావాదం (Psychoanalytical theory): ఇది తీరని కోరికలనుండే సాహిత్య రూపంలో భావజాలం ఆవిర్భవించిందని తెలుపుతుంది. ప్రధానంగా ఇందులో లైంగిక దృష్టే ఉంటుంది.

ఆరవది నిర్మాణవాదం (Structural theory) : కొన్ని కథాంశాలతో, ప్రకార్యాలతో (Elements & Functions) కథా గమనం ఉంటుందని చెబుతుంది. ప్రధానంగా రూపదృష్టే ఉన్నా అంతర్గత నిర్మాణ దృష్టి కూడా ఉంది.

ప్రధానంగా జాన పదవిజ్ఞాన సాహిత్యాల ప్రాదుర్భావ వికాసాలను వీటి ఆధారంగా అధ్యయనం చేయవచ్చు. అయితే యాదృచ్ఛికవాదం, త్యాగవీరవాదం, ఆరోప వాదం, నీతివాద, ప్రాఙ్మానవ క్షీణ జ్ఞాపక పునరు త్థాన వాదం, భాషా వికృత మూలవాదం, కర్మకాండవాదం మొదలైనవి వినిపిస్తున్నాయి. ఇవన్నీ కూడా ఆయా అంశాలను ప్రతిపాదించే ఆంశిక సత్యాలే.

వీటికి మూలం ఏది!

అయితే పూర్ణ సత్యం ఏదైనా ఉందా! ఉంటే అది ఏది? అది ఇది అనీ మనం నిర్ధారించ గలుగుతామా! ఆలోచించాలి.

ఆధ్మాత్మిక ప్రపంచంలో దివ్యత్వాన్ని గురించి అనేక వాదాలు వినిపిస్తున్నాయి. ఆ దివ్యత్వం ఏది? కవిత్వంలో ఆత్మమూల సిద్ధాంతంగా ఆనందవర్ధనుని ఆత్మవాదం చెప్పుకోవచ్చు. అదేవిధంగా ఆధ్మాతిక ప్రపంచంలో సత్ ఒక్కటే (ఏకం సత్ విప్రా బహుధా వదన్తి) కాని దార్శనికులూ

- మేధావులు దానిని తమతమ దర్శనాల కనుగుణంగా అనేక విధాలుగా చూపించారు - ప్రవచించారు.

ఈ భిన్నత్వాన్ని మన్నిస్తూనే మానవుడు ఏకత వైపుగా పయనిస్తాడు. ఇన్ని ఉపాధులున్నాయి; ఇన్ని ఉపాధుల్లోని ఆత్మ ఒక్కటే (ఆత్మావత్ సర్వభూతాని, మమాత్మా సర్వభూతాని, ఏకః పరాత్మా బహుదేహావర్తీ). కాని అలా దర్శించేందుకు ఎదగాలి. చెట్టులోని చైతన్యం, పాములోని చైతన్యం, స్వామిలోని చైతన్యం, సామాన్యుని లోని చైతన్యం అన్నీ ఒక్కటే అన్నది సత్యం.

అందుకే ఎల్లకాలం నిలిచే ఆ ఆత్మనే ఆ చైతన్యాన్నే ఆ ప్రాణాన్నే, ఆ దివ్యత్వాన్నే ఋషి వాల్మీకి సత్యం అన్నారు. ఇది చెదరని సత్యం (Eternal Truth) .

'సత్యమేవ ఈశ్వరో లోకే
సత్యే ధర్మః ప్రతిష్ఠితః
సత్యమూలాని సర్వాణి
సత్యాన్నాస్తి పరంపదమ్'

ఈ ప్రపంచంలో సత్యమే దైవం. సత్యం లోనే ధర్మం ప్రతిష్ఠితమై ఉంది. సమస్తానికి సత్యమే మూలం, సత్యాన్ని మించిన పరమ పదమింకొకటి లేదు.

సత్, సత్యం, చిత్, ఆత్మ, చైతన్యం, ప్రాణం ఎలాగా అన్నిటికి మూలమో, అదేవిధంగా జానపద సాహిత్య మూలమేదో అన్వేషించాల్సి వుంది. అది పూలదండలో దారంలా కనిపించాలి. మూలానికి విస్తరణకు కూడా ఇదే దోహదం చేసిందనే అభిప్రాయం బలపడాలి. ఈ దిశలో అధ్యయనం జరగాలి.

శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు, కొర్నిపాటి సుబ్బరాజుగారి ప్రాణత్యాగం అనే కథగాని కథనొకటి సాక్షిలో ప్రచురించారు. తనకు వచ్చే పనిచేసి పొట్ట పోసుకోడం (ఘంటంతో తాళపత్రాలు, ఇతర పత్రాలు వ్రాయడం) తప్ప అయాచితంగా వచ్చిన దేదీ సుబ్బరాజు స్పృశించడు. ఈ దిశలో నవాబుతో కూడా అంత సూటిగా వ్యవహరిస్తాడు. జైలుపాలవుతాడు. జైలు ఎదురుగానే కూతురు చనిపోతుంది. భార్య చనిపోతుంది. మందులులేక చచ్చిపోతారు. తిండిలేక చచ్చిపోతారు. అధికారుల దౌష్ట్యానికి బలై చచ్చిపోతారు. ఇన్ని జరుగుతున్నాయి. తన ప్రాణం మీదికి వచ్చింది. ప్రాణం పోయే స్థితి. పోయేది ఉపాధేగాని ప్రాణం కాదని తెలుసు. అది పోవాలంటే తన నెత్తిమీద ఉన్న భాగవతం తొలగాలి, ఆ భాగవతంలోని రాముడే అంతర్యామి. ఆ రాముడు అయోధ్యరాముడైతే కావచ్చు; కాని ఆయన ఆత్మా రాముడే. ఆ ఆత్మారాముని స్థానం ఇది. ఇది ఆయన ప్రాణం పోయిన తర్వాత గాని బహిర్గతం కాదు.

సీ॥ వీధి పురాణంపు వేదికపై నీవు
పారాయణపుఁ బీఁట పైని నీవు
దృశ్య ప్రబంధంపుఁ దెరలసందుననీవు
మృతివార్త శ్రుతిఁ బడ్డ యెదను నీవు
గొల్ల సుద్దుల తేకుడొల్లలందున నీవు
యక్షగానపు చిందులందునీవు
చండాలు బుజముపై మొండితంబుర నీవు
తోలు బొమ్మల సంత గోల నీవు

పడుకగదుల గోలనీవు, భక్తహృదయ
రసనలను నీవు , యాయా వరతను నీవు
సృష్టి నీమయమో! నీవు సృష్టిమయమొ?
యెట్లయిననేమి? రామ! రక్షింపుమయ్య!

అంతా రామమయం. ఈ రామం చైతన్యమే. అది అంతటా వున్నది. నామ రూప భేదాలతో కనిపిస్తున్నది.

సరిగా ఇదే స్థితి జానపద సాహిత్యాధ్యయనానికి సంబంధించిన వివిధ వాదాలది.

సంస్కృతీ సంస్కారాలు :

మానవుని పుట్టుకనుండి అంత్యేష్టి వరకు అనేక సంస్కారాలు జరుగుతాయి. ఈ సంస్కారాలనే షోడశ సంస్కారాలంటారు. ఇవి, వీటితో పాటు మరెన్నో ఉప సంస్కారాలు జానపదుల జీవితాల్లో కనిపిస్తున్నాయి.

1. గర్భాధానం 2. పుంసవనం 3. సీమంతోన్నయనం

4. జాతకర్మ 5. నామకరణం 6. నిష్క్రమణం 7. అన్న ప్రాశనం 8. చూడాకర్మ 9. కర్ణవేధ 10. ఉపనయన 11. వేదారంభం 12. సమావర్తనం13. వివాహం 14. వానప్రస్థం 15. సన్యాసాశ్రమం 16. అంత్యేష్టి.

వీటితోపాటు కొత్త బట్టలు కట్టించడం, చీరెసారెలు పెట్టడం, బాలింతను ముట్టించడం, పురిటి పండగ చేయడం, బారసాల చేయడం, వివాహ సందర్భంలో అనేక దేశీయాచారాలు పాటించడం..... ఇలా ఎన్నో విశిష్టంగా నిర్వహింపబడతాయి. వీటన్నిటి అంతస్సూత్రం ఒకటుంది. అదే సంస్కృతి. సంస్కృతి ఆధారంగా ప్రస్థాపించేదే సాంస్కృతిక వాదం. జానపద విజ్ఞాన శాస్త్రవేత్తలు ఇది వరకే ప్రవేశ పెట్టిన అనేక అధ్యయన పద్ధతులకు (School of Thoughts) ఇదే మూలం.

ఆధునిక పదజాలం - సంస్కృతి :

ఆధునిక కాలంలో సంస్కృతిని ఆయా భావాలకు వాడడం జరుగుతున్నది. రామాయణమ్మ సంస్కృతిపై రంగనాయకమ్మ విషం కక్కింది. ఈమెదొక విష సంస్కృతిఅని పిలుచుకోవడం ఉన్నది.


ఒక రాజకీయ నాయకుడు డబ్బుల కొరకు పార్టీ ఫిరాయించాడు. మరొకడు తన అధికార సుస్థిరత్వం కొరకు తన ప్రతికక్షిని అంతం చేయించాడు. ఇంకొకడు తన తాబేదారులకు, తన పక్షంవారికే పదవులన్నీ అంటగట్టాడు....వెరసి ఇవన్నీ కలిపి రాజకీయ సంస్కృతి అవుతాయి.

ఇదేవిధంగా ఆయా సందర్భాలను బట్టి వ్యాపార సంస్కృతి, కుల సంస్కృతి, వ్యవసాయ సంస్కృతి, పాశ్చాత్య సంస్కృతి, ప్రాచ్య సంస్కృతి, ప్రాచీన సంస్కృతి, ఆధునిక సంస్కృతి, సినిమా సంస్కృతి ... ఇలా ఎన్నో పదబంధాలేర్పడ్డాయి. సంస్కృతి పదాన్ని జోడించడానికున్న నేపథ్యాన్ని పరిశీలిస్తే అది సర్వత్రా విస్తరించి మూలాధారంగా నిలచిన పదమా అనిపిస్తుంది. చివరికి విష సంస్కృతి అన్నట్లు దుష్ట సంస్కృతి అనే పదంకూడా పరివ్యాప్తమై ఉంది.

వస్తు సంస్కృతి :

అయితే జానపద విజ్ఞానంలో ఒక ప్రధాన విభాగం పేరు వస్తు సంస్కృతి(Material Culture) భౌతికంగా మనిషికుపకరించే, ఆయా వృత్తి వ్యవసాయాదుల్లో ఉపయోగించుకొనే అనేక పరికరాలు, సాధనాలు, సొమ్ములు, వస్తువులు ఈ విభాగం క్రిందికి వస్తాయి. ఒక పనిచేయాలంటే దానికో ఉపకరణం కావాలి. ఆ ఉపకరణాల్లో జానపదత్వం ఉంటుంది. ఈ కారణంగా జానపద విజ్ఞానంలో అంతర్భాగంగా దీనిని పేర్కొనడం జరిగింది. రిచర్డు ఎం. డార్సన్ విభజించిన ఆ పద్ధతి ఇది.

జానపద విజ్ఞానం



డార్సన్ విభజనకు జానపదుల భాష (Folk speech) కూడా చేర్చడం జరిగింది. మౌఖిక సాహిత్యంలో సంస్కృతి ఉంది. వస్తువులో సంస్కృతి ఉంది; జానపదుల సాంఘికా చారాలలో సంస్కృతిఉంది. జానపదుల ప్రదర్శన కళల్లో సంస్కృతిఉంది. జానపదుల భాషలో సంస్కృతి ఉంది.

ఈ సంస్కృతి వీటన్నింటిలో ఉంటుంది;ప్రక్కన ఉంటుంది; ఆధారంగా ఉంటుంది; పైన ఉంటుంది; కదలికనిస్తుంది; పరిమళంలా వ్యాపించేటట్లు చేస్తుంది.

సాంస్కృతిక వాదం (Cultural Theory) :

సంస్కృతి మూలంగా, సంస్కృతి ఆధారంగా వికసించిందే సాంస్కృతిక వాద సాహిత్యం. సంస్కృతి

ఒకమూలం (element). ఇది జానపద సాహిత్య అధ్యయనానికి ఎలా దోహదం చేస్తుందో కొన్ని గేయాల ఆధారంగా పరిశీలిద్దాం.

ప్రొద్దున్నె ప్రొద్దున్నె లేద్దామా!
అందుగల పువ్వులు కోద్దామా!
కోసినవి రాసులగ పోద్దామా!
సాలింటి కాడ సన్న దారము తెద్దామా!
దాసరింటికాడ సన్నసూది కొందామా!
అన్నిటిని దండలుగ గుచ్చుదామా!
దేవుడూ గుళ్ళోకి పోదామా!
కిర కిర తలుపులు తీద్దామా!
దేవుడు మెడలో వేద్దామా!

(త్రివేణి, ఆంధ్ర దేశ జానపద గేయాలు, పుట.3)

ఇందులోని అంశాలు పరిశీలిద్దాం. ప్రొద్దున్నే లేవడం, పూలు కోయడం, రాశిగా పోయడం, దండ లల్లడం, రోజువారిపనే. కాని ఆ దండల్ని దేవుని మెడలో వేయడమే సంస్కృతి. విగ్రహమనేది కేవలం ప్రతీక మాత్రమే. ఈ ప్రతీక విశ్వ చైతన్య ప్రతీక. విశ్వాత్మను సంభావించడమే సంస్కృతి. ఇలా దేవుని మెళ్ళో వేయడమనే సంస్కృతి లేకుంటే ఈ పాట పుట్టదు. అంతేగాక దీని అధ్యయనం కూడా ఈ విధంగా కొనసాగదు. మెడలో అలంకరించడం అనేది ఆచారం అనవచ్చు. కాని విశ్వ చైతన్యమైన ఆ దివ్యాత్మను సంభావించే సంస్కృతి అనీ, అదే ఈ పాటలోని ఆత్మ అనీ అధ్యయనం కొనసాగించాలి. అప్పుడు జానపద సాహిత్య ప్రాదుర్భావ వికాసాలకు ఈ సాంస్కృతిక చైతన్యమే ఆధారం అన్న ఆలోచన స్థిరరూపం ధరిస్తుంది.

ఓ విసుర్రాతి పాటలోని సాంస్కృతికాంశాన్ని పరిశీలిద్దాం. ఆమెను భర్త సరిగా చూచుకోవడం లేదు. ఈ సంగతి ఆమె అత్తకు కూడా తెలుసు. ఆమె ఆవేదనతోనే ఈ విషయం కోడలితో అన్నది. ఆ కోడలు అన్న మాటల్లోనే సాంస్కృతికాంశం దాగి ఉన్నది.

"వానా గొట్టదాయే వరుదెల్ల దాయే
అవ్వా మన వికిట్లా వరుదెక్కాడీదే
నువు బోయీ పొరుగింట్లా పంటే నా కొడుకా
నీయాలి శోకంబు వరుదాలై పారే
అత్తారో ఓ అత్తా మైరాసా అత్తా
నీ కొడుకు నీలా కాంతూడేమన్నాడత్తా

కోడలా కోడలా చిన్నా నా కోడలా
నా కొడుకూ నీలా కాంతూ నిన్నొల్లాడాటా

వల్లకుంట వలిసేది వలవిగ్రమేమీ
రచ్చల్ల పెదబావ మెచ్చిన్నా చాలూ
నాసాటి యారాండ్లూ అక్కన్నా చాలూ
నా అత్తమామల్లు సరెనన్నా చాలూ
నా సాటి మరదుల్లు వదినన్నా చాలూ
యారాండ్ల పిల్లల్లు అవ్వన్నా చాలూ
(త్రివేణి, ఆంధ్ర దేశ జానపద గేయాలు, పుట. 159)

ఈ గీతంలో భర్త తనను వల్ల నంటున్నాడన్న సంగతి తెలిసినా ఆ కుటుంబంలో (సమష్టి) తానుండా లనే నిశ్చయించుకొంది. రచ్చల్ల పెదబావ ఆ ఊరికే పెద్ద, ఆయన తన గుణాన్ని మెచ్చు కొంటే ఊరే మెచ్చుకొంటుంది. తన భర్తలోని తాత్కాలిక వికృతి శాశ్వతంగా ఉండదు. తనను ప్రస్తుతానికి కాదన్నా తాను వలపు తలపులతో అతన్నేమీ ఆశించదు. అతనిలో పరివర్తన కొరకు ఎదురు చూస్తుంది. ఆ ఇంట్లోని తోటికోడండ్రు, అత్తామామలు, మరదులూ, తోటి కోడండ్ర పిల్లలు తనను ప్రేమతో అభిమానంతో చూడాలనే ఆమె కోరుకుంటున్నది. ఆమె కోరిక తీరుతుంది. ఇంత పెద్ద కుటుంబం నుండి తానెందుకు విడిపోవాలి. కుటుంబంలో మగని ప్రేమకే ప్రాధాన్య మున్నా మొద్దయిన మగణ్ణి చిగురింప చేయాలి. అందుకే తానక్కడే ఉండాలి. ఇదే కుటుంబ సంస్కృతి . ఈ అంశమే ఈ గీతంలో ఆత్మ. ఆ ఆత్మ వేదన వరదై పారుతున్నది. ఆ వరదలో ఆభర్త కొట్టుకపోక తప్పదు. "కుటుంబ ఏకత" అనేదే ఇందులోని సాంస్కృతికాత్మ. ఆ భావన వల్లనే ఈ గీతం నిలదొక్కు కొన్నది. అందుకే

సాంస్కృతిక వాదంతో మున్ముందు జానపద సాహిత్యాన్ని అధ్యయనం చేయాలనడం.

ఉపశ్రుతి

అయితే పురా గాథల్లో, నృశాస్త్రాంశాల్లో, వలస చారిత్రకాదివాదాల్లోనే ఇది అంతర్భవిస్తుందని,కర్మకాండ వాదానికిది సన్నిహితంగా ఉంటుందనీ, అన్ని ప్రక్రియలనూ, అన్ని సాహిత్యాంశాలను దీని క్రింద పరిశీలించడం సాధ్యం కాదని కొందరనవచ్చు. శరీరంలోని భిన్నాంగాలు నిలవడానికి ప్రాణం (చేతన, ఆత్మ) ఎలా ఆధారమో సంస్కృతి అనే ఆత్మ జానపద సాహిత్య ప్రాదుర్భావ వికాసాలకు మూలాధారమని భావించి అధ్యయనం కొనసాగినప్పుడు, పుట్టుకొని వచ్చిన ప్రశ్నలన్నింటినీ సమాధానం లభిస్తుంది.

జాషువా కవిత్వంలో హాస్యం

డా. ఎండ్లూరి సుధాకర్

కవిత్వంలో హాస్యం పలికించడం, పండించడం అంత ఆషామాషీ కాదు. పైగా జాషువా కవిత్వంలో హాస్యమా?! అని అబ్బురపడే తరం కూడా ఇవాళ లేకపోలేదు. కొందరు విమర్శకులు జాషువాను కురుచ దృక్పథంతో చూస్తారు కానీ జాషువా కవిత్వకాంతి బహుముఖీనమైంది. నవరసాలలో కరుణ రసాన్నీ, హాస్యరసాన్నీ పోషించడం కష్టం. ఈ రెండు రసాలూ జీవితంలో అనుభవించడం తెలిసినవాడే కవి అవుతాడు. కళాకారుడవుతాడు. హాస్యం మనిషిని ఆరోగ్యవంతంగా నిలబెట్టే పరమౌషధం. అందుకేనేమో 'హాస్యబ్రహ్మ' జంధ్యాల మూడు ముక్కల్లో హాస్యతత్త్వాన్ని హాయిగా చెప్పగలిగాడు.

"నవ్వు ఒక భోగం
నవ్వించడం ఒక యోగం
నవ్వకపోవడం ఒక రోగం"

ఉటంకింపులో తేడా వున్నా విషయం మాత్రం ఇది.

మహాకవి జాషువా (1895-1971) కడుపారా నవ్వగల కవిచక్రవర్తి. అదే స్థాయిలో నవ్వించగలిగిన చతురుడు. నా మాటల్లో కంటే, రసజ్ఞురాలైన ఆయన చిన్నకూతురు హేమలతా లవణం మాటల్లో వినండి - జాషువా నవ్వు రుచి తెలుస్తుంది.

"అనేక యిబ్బందులలో కూడా నవ్వగల ధీరోదాత్తుడు నాన్నగారు"

తాను ఛలోక్తులు విసరడమే కాక తనమీద ఎవరైనా ఛలోక్తులు విసిరినా ఆయన ఆనందించేవాడు. "కవి గారూ! మీ మీసాలపై నిమ్మకాయలు నిలబెట్టవచ్చే అని ఎవరైనా అంటే నిమ్మకాయలేమిటి గుమ్మడికాయలే నిలబెడతా సంపెంగనూనె ఉంటే అనేవారు."

జాషువా కవిత్వం, చార్లీచాప్లిన్ నటన రెండూ ఒకటే. ఇద్దరూ పేదరికాన్ని అనుభవించినవారే. ఇద్దరూ అవమాన పీడితులే. అయితేనేం దరిద్ర దేవతను భలే ఆటపట్టించారు. చాప్లిన్ అభినయంలోనూ, జాషువా అభివ్యక్తిలోనూ గొప్ప లాలిత్యం తొణికిసలాడుతూ ఉంటుంది. జాషువాను పూర్తిస్థాయి హాస్యకవిగా ముద్రవేయలేం. కానీ ఆయన ఖండకావ్యాల్లో ఎండుద్రాక్షల్లా తియ్యని హాస్యం తగులుతూనే ఉంటుంది. ఎంత మహాకవి అయినా అతడి కవిత్వంలోనూ, వ్యక్తిత్వంలోనూ కొంత సెన్సాఫ్ హ్యూమర్ ఉండాలి. అలా ఉన్న కవుల్నే కాలం గుర్తుపెట్టుకుంటుంది. ఈ రహస్యం జాషువాకు బాగా తెలుసు. ఆయన ఒక చోట ఈ నిజాన్ని అక్షరబద్ధం చేయడం జరిగింది కూడా.

హృదయం బావశ్యకమగు
సదా మహాకవికి, విశ్వసత్యపరతయున్
బెదరని గుండెయు హాస్యము
బొదిగిన చతురోక్తి ముఖ్యములు తలపోయన్

'నా కథ'

ఈ హాస్యం పొదిగిన చతురోక్తుల్ని జాషువా కవిత్వంలో పట్టుకోగలిగితే ఒక నవ్వుల ఖజానా దొరికినట్టే.

'అనాథ' కావ్యం అత్యంత కరుణ రస భరితమైంది. చాప్లిన్ సినిమాల్లోని పేదరికం లాగే ఉంటుంది. హంగ్రీ థర్టీస్‌లో ఈ రచన పుట్టింది.

ఓ పేద విధవరాలు, ఆమె ఆరుగురు సంతానం, దయనీయమైన ఆమె దుర్భర జీవితం 'అనాథ' కావ్య వృత్తాంతం.

ఒకరోజు ఆ అనాథ తన ఆరుగురు పిల్లలతో అడుక్కోవటానికి బయలుదేరుతుంది. నిలువ నీడలేని ఆ కుటుంబం ఉరుములు, మెరుపులతో కూడిన పెద్ద వర్షంలో చిక్కుకుంటుంది. కాసేపటికి వాతావరణం సర్దుకుంటుంది. ఆ సన్నివేశాన్ని జాషువా ఎలా వర్ణించాడో గమనించండి.

"మగడు గొట్టిన రోదించి మానుకున్న
పెద్ద గయ్యాళి వలె వాన వెలసిపోయె

మమతలుడిగిన సన్యాసి మనసు వోలె
గగన మండలంబెల్ల నిష్కలుషమయ్యె"

హృదయవిదారకమైన సందర్భాల్లో కూడా జాషువా ఉపమాన చమత్కారం కనిపిస్తుంది. ఇటువంటి చోట్ల చార్లీ చాప్లిన్ నటనని గుర్తుకుతెస్తుంది.

1916-1919వరకు జాషువా జీవికకోసం రాజమండ్రిలో ఉన్నాడు. వృత్తి : మూకీ చిత్రాలకు కథా వాచకత్వం. కదిలే బొమ్మలకు పెద్ద గొంతేసుకుని సంభాషణలు చెప్పినా సంభావన మాత్రం మృగ్యం. సినిమా వాళ్ళు కళాకారులకు డబ్బులెగ్గొట్టి నానా తిప్పలు పెట్టడం జాషువా తన ఆత్మకథలో రాశాడు.

ఆనాటి తన కష్టాన్ని ఎంత కమ్మగా చెప్పుకున్నాడో చూడండి.

"ఇద్దరు సుతలుం కూరిమి
ముద్దియ మేరాంబ తోడ ముట్టెడు జీతం
అద్దెకు ముద్దకు చాకలి
పద్దుకు సరిపోక పెక్కు పాట్లంబడితిన్"

ఇలా అయితే ఇక లాభం లేదనుకొని జాషువా ఆర్మీలో చేరుదామని నిశ్చయించుకున్నాడు. అవి మొదటి ప్రపంచ యుద్ధం **(1914-1919)** జరిగే రోజులు. జాషువాకు అక్కడ కూడా విధి వక్రీకరించింది. ఎలాగో చూడండి.

"కదనమున సైనికుడనై
బదుకుట మేలంచు సిద్ధపడి రిక్రూటింగ్
సదనమున కేగ ముగిసెం
గదనంబానాడె యేమి గ్రహచారంబో!"

జాషువా ఒకచోట ఇలా అంటాడు. 'పేదరికము పెద్ద వింత విద్యాశాల. అందులోన లజ్జగానపడదు' జాషువా తన కష్టాల్ని దైన్యంగా కాకుండా, ధైర్యంగా నవ్వుతూ చెప్పడం ఆయనకే చెల్లింది. బహుశా దళిత జీవితం ఈ అనుభవం నేర్పి ఉంటుంది.

ఇంట్లో గడవకపోయినా, చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా జాషువా సన్మానాల్లో పెట్టిన కొత్త బట్టలు ధరించి బయట దర్జాగా కనిపించేవాడు. అది చూసి లోకులే కాదు, లోపలివాళ్ళు కూడా జాషువా దగ్గర నాలుగు డబ్బులున్నాయని ఆడిపోసుకునేవాళ్ళట. ఈ వైనాన్ని జాషువా సరదాగా చెప్పుకున్నాడు.

"కలవారిచ్చిన పట్టు వస్త్రములతో గన్పట్టునన్ జూచి, శ్రీ
గల వాడీతడటంచు నల్వురన, నాకర్ణించి, నాకన్న కొ
డ్కులు జుట్టాలును డబ్బు లేదనిన సంకోచింతురీనాటిక
న్యుల మాటేల? ప్రచారమందు బుతమున్ శుద్ధానృతంబయ్యెడిన్"

జాషువా రాజమండ్రిలో ఉంటున్నప్పుడే ఒకసారి పుష్కరాలు వచ్చాయి. జాషువా పుష్కరదృష్టి విలక్షణమైంది. 'అఖండగౌతమి' మీద పద్యాలు రాసి పడవలు చేసి గోదాట్లో వదిలాడు. చుట్టుపక్కల ఘాట్లన్నీ తిరిగాడు. కొబ్బరిముక్కల కోసం, చిల్లర నాణేల కోసం ఎగబడే పేద భిక్షుకుల్నీ చూశాడు. వాళ్ళని ఈనడించుకుంటున్న భక్త జననందోహాన్ని గమనిస్తున్నాడు. ఈలోపు ఒకచోట నుండి కలకలం వినిపించింది.

"ఒక్క భక్తవరుని వొడిసి యెత్తుకపోయె
మొసలి యొకటి నీట మసలుచుండి
'మేలు మేలు పర్వకాలాన చచ్చుట
పున్నె' మనిరి చూచుచున్నవారు."

విషాద హాస్యానికి ఈ పద్యం ఒక మచ్చుతునక. అంతేకాదు ప్రజల అజ్ఞానానికి మెత్తని చురక. ఒక్కొక్కసారి జాషువా హాస్యంలోనూ కొంటెతనం కనబడుతుంది. ఆయన అనుభవించిన అంటరానితనం కొంత కారణం కావచ్చు. ఉక్రోషం పుట్టినప్పుడు ఆయన కలం వ్యంగ్యాన్ని ఆశ్రయిస్తుంది. బ్రహ్మలాంటి వాణ్ణి సైతం ఆటపట్టించడానికి కూడా వెనుకాడడు.

'కనబడవేమిర జగము కల్పన

చేసిన గారడీడ?' అని నిలదీస్తాడు. అంతటితో ఊరుకోడు. ఊరుకుంటే జాషువా ఎందుకవుతాడు? ఈ అవక తవక సృష్టి చేసిన చతుర్ముఖుణ్ణి భూమ్మీదకు రావద్దని ఇలా వెటకారంగా హెచ్చరిస్తాడు. వస్తే నిన్ను 'జూ'లో పెడతారని చమత్కరిస్తాడు.

"నాలుగు మోములుం తలలు నాలుగు దాలిచి వత్తువేమొ? యీ కాలము వారు మానిసి మొగంబిది పద్మము కన్నదంచు జంత్వాలయ మందు జేర్తురు సుమా! కమలాసన! ప్రస్తవంచునీ నాలుగు నోళ్ల మొత్తుకొనినన్ వినరొక్కరు విశ్వసించరున్"

(కొత్తలోకము)

జాషువాలో గొప్ప సమయస్ఫూర్తి కనబడుతుంది. మంచి అవధానికుండే సరసగుణం ఇలాంటి పద్యాల్లో తేటతెల్లమవుతుంది. 'అల్లుడు' అనే ఖండికలో జాషువా ఎక్కుపెట్టిన ఈ సమస్యాత్మక పాదం పరిశీలిస్తే నవ్వు రాక మానదు.

'పురుషాకారత నున్న ... జాలతనిలో
పుంస్త్వంబు లేకుండినన్'

మరో చోట కూడా జాషువా మహిళల పక్షాన నిలిచి మగవాళ్ళని ఇలా ఎద్దేవా చేస్తాడు.

"పెండ్లియాడిన భార్యల పిప్పిజేసి
తరుముచున్నవి పురుష భూతములు కొన్ని
స్త్రీత్వమిడి యట్టివాని శిక్షింపవోయి ...."

(కొత్తలోకము)

భగవంతుడికి జాషువా చేసిన ఈ వ్యంగ్య నివేదనలో వేదనాత్మక హాస్యం ధ్వనించడంలేదా?

జాషువా హాస్యాన్ని కొన్నిసార్లు పండితులు కోపగించుకున్న సందర్భాలు లేకపోలేదు. ఆచారాల మీద జాషువా అధిక్షేప ధోరణికి సనాతనులు కొంత కినుక వహించారు.

అలాంటిదే ఈ పద్యం -

'నిను చూపుమనుచు నేనర్చకుని వేడ
చూడమంచు గుడిని చూపినాడు
గుడికిబోయి జూడ గుండ్రాయివైనాడ
వెందుకిట్టులైతి వేడ్పువచ్చె'

(కొత్తలోకము)

'బ్రతికి యున్న సాయిబాబెన్నడు గాడు
చావకున్న వట్టి సాయిబయ్య
తిరుమలేశుడైన తెలియడీ యర్థంబు
చావు బ్రతుకులోని సారమిదియ'

(గబ్బిలము)

జాషువాది హాస్యప్రవృత్తి ఉన్న హృదయం. ఒక్కోసారి సామాజిక మార్పులే ఆయన హాస్యానికి ప్రేరకాలవుతాయి. ఇరవయ్యో శతాబ్దపు ప్రారంభంలో ఆధునికతకీ, సంప్రదాయానికీ మధ్య సంఘర్షణ ఎదురైంది. ఎలా అయ్యిందో జాషువా 'పిలక' అనే ఖండికలో గట్టిగా పట్టుకున్నాడు. ఆనాటి యువకుల్లో కొందరు ఫ్యాషన్ కోసం హెయిర్ కటింగ్ చేసుకునేవారు. ఆచారం కోసం పిలకను కూడా అట్టేపెట్టుకునేవారు. ఈ రెంటికీ పొసగని తనం మీద జాషువా విసుర్లు వినండి.

"కుచ్చుల క్రాఫింగును గని
మచ్చర పడి పిలకజుట్టు మారు మొగంబై
కచ్చకు తలకావలి దరి
ముచ్చెన గుంటలు జారి ముడి వేసికొనెన్.

నేనైన నుండవలయున్
తానైన న్నిల్వవలయు తలమీద నటుల్
గాని యెడ నుభయకులములు
ఖూనీ గావలయు వట్టి గుండుండవలెన్"

జాషువా కవిత్వంలో పొలిటికల్ సెటైర్ కూడా కనబడుతూ ఉంటుంది. అవకాశం దొరికనప్పుడల్లా రాజకీయ నాయకుల్ని ఎండగడుతూ ఉంటాడు. కొంత కాలం జాషువా ఎం.ఎల్.సి.గా ఉన్నాడు. అందువల్ల ఆయనకు అసెంబ్లీ తంతు ప్రత్యక్ష పరిచయం. నలభై ఏళ్ళనాడు ఎటువంటి అభ్యర్థులుండే వాళ్ళో జాషువా పద్యం చదివితే మనకు నవ్వు రాక మానదు.

"చేతులెత్తుడన్న చేతులెత్తెడి వారు
నిలువుడన్న లేచి నిలుచువారు
చదువుకొన్నవారు చదువెరుంగని వారు
ఉభయ సభలలోను ఉందురచట"

జాషువాకి హాస్యం జీవితంలోంచి పుట్టింది. మంచి హాస్యం మన చుట్టూ ఉంటుందనటానికి ఆయన పద్యాలు చక్కటి ఉదాహరణలు. చదువు సంధ్యలు

లేకుండా, ఏ పని పాట చేయకుండా, ఊరికే తిని కూర్చునే కొడుక్కి ఏదైనా పని అప్పచెప్పితే ఏం జరిగిందో చూడండి.

"జాబు పోస్టుచేసి సరగరమ్మని పల్క
వినయముట్టి పడగ స్వీకరించు
మరచినాడంచు మరునాడు కొనివచ్చి
చెక్కు చెదరకుండ చేతికొచ్చు"

(ఖం. కా - 5)

రేడియో మీద ఎన్నో ఛలోక్తులున్నాయి. ఆ రోజుల్లో రేడియో వినడం గొప్ప. అప్పో సొప్పో చేసి దాన్ని కొనడం స్టేటస్ సింబల్‌గా భావించేవాళ్ళు. ఆనాటి రేడియో కార్యక్రమాల మీద జాషువా గమ్మత్తయిన కామెంట్ చేయడం గమనార్హం.

నాల్గు వందలిచ్చి నట్టిల్లు సగమిచ్చి
మెచ్చి చేతులార తెచ్చుకొంటి
రేడియో మెషేను చేడియా! దయచేసి
పాడకమ్మ! చలిది పాత పాట

(ఖం.కా - 4)

ఏ రేడియోనైతే జాషువా ఆడిపోసుకున్నాడో అందు లోనే కొంతకాలం కార్యక్రమ ప్రయోక్తగా ఉద్యోగం చేయడం ఒక చమత్కారం.

'పానుగంటి' వారి 'కంఠాభరణం' నాటకంలో అనుకుంటాను. ఒక పాత్ర ఇలా అంటుంది.

"ఏమేవ్ కవులొస్తున్నారు. కర్ర పట్రా" అని. తాము గొప్ప కవులమని విర్రవీగే సమకాలీన రచయితల మీద జాషువా నవ్వు పుట్టించే అక్షింతలు ఎంత అందంగా వేశాడో చూడండి.

"నా కవిత్వంబునందు రత్నములు గలవు
వాని బెకిలించి చూపెడు వాడు లేడు
కాలమిట్లున్నదని మొనగాడు వోలె
పలుకు కవిగాడ! యేటికీ స్వాతిశయము?

ఏవీ యా రతనంబులు
నీవే పెకలించి చూపి, నీ యింటికి గొం
పోవోయి! యట్లొనర్పగ
నీవలనన్ గాదొ! యింక నీల్గెదవేలా?"

అప్పటి సమకాలీన (భావ) కవుల మీద జాషువా విసిరిన విసుర్లు ఇప్పటి అత్యాధునిక కవులకు కూడా వర్తిస్తాయి. అంతెందుకు? రకరకాల ఇజాల పేర పాశ్చాత్య ఫ్యాషన్ల మోజులోపడి వచన కవిత్వంలో ప్రయోగాలు చేస్తున్న పద్ధతి మీద జాషువా నిరసన ప్రకటించాడు.

"ఈ బిత్తల తోకబీకుడు కవిత్వపు ఫక్కిననాదరిం చెదన్" అని తిట్టినా అందులో చేదు హాస్యం లేకపోలేదు. కవిత్వ ప్రస్తావన వచ్చింది కాబట్టి జాషువా ఎప్పుడూ సుకవుల పక్షమే వహించాడు.

'ఎవడు సుఖించెనో తెలుపు మీ
కవితా కళ నభ్యసించి ....' అని

సానుభూతి వ్యక్తం చేస్తాడు. కవిగాడి బ్రతుకు శ్రీరామరామ అంటూ "ఈ బిరుదముల్ ఈ కాలి పెండారముల్ దుప్పట్లక్కర తీర్చునా? సుకవులెందున్ మందభాగ్యుల్ గదా!" అని మధనపడ్డాడు. ఈ మధనలోనూ ఒక మందహాసం లేకపోలేదు. అసలు కవిగా పుట్టడమే ఒక శాపం అంటాడు జాషువా. అంతేకాదు అందులోనూ పద్యం రాయడం ఎంత కష్టమో, ఎన్ని తిప్పలు పడాలో జాషువా చెప్పిన తీరు చూస్తే మనం నవ్వు ఆపుకోలేం.

"గణబాధ రవ్వంత గడచి ముందుకు సాగ
తగ్గవో! యని యతిస్థానమురుము
యతిని మచ్చికచేసి యడుగు ముందుకుసాగ
ప్రాసంబు కుత్తుక బట్టి నిలుపు
ప్రాసవేదన దాటి పయనంబు సాగింప
భావంబు పొసగకిబ్బంది పెట్టు
భావంబు పొసగించి పద్యంబు ముగియింప
రసలక్ష్మి కినిసి మారాము సేయు
ఇట్టి ప్రతిబంధకంబుల నెల్ల గడచి
గట్టుకెక్కుదమన్న వ్యాకరణ శాస్త్ర
మాదరింపదు శబ్ద మర్యాద గాన
రాక; కవిగాని బ్రతుకు శ్రీరామ రామ"

పద్య నిర్మాణంలో ఇన్ని పరేషాన్లు ఉన్నాయి గనకే ఆధునికులు ఈ చాకిరీ నుంచి తప్పించుకున్నారు. ఫ్రీ వే (Free Way) లాంటి ఫ్రీ వెర్స్ (Free Verse) ను ఎంచు కున్నారు. ఇన్ని కష్టాలు పడి పద్యం రాయడమంటే మాటలా? మజాకా? జాషువా చెప్పాడు గనుక పద్య కవుల కష్టం గుర్తించి అభినందించి కరచాలనం చేయవలసిందే!

జాషువాలో అవధాన లక్షణాలు అంతర్లీనంగా దాగున్నాయి. తిరుపతి వెంకటకవుల, కొప్పరపు సోదర కవుల ప్రభావం చిన్నప్పుడు ఆయన మీద బలంగా వుండేది. బాల్యంలో చేసిన అవధాన సాధన పెద్దయ్యాక కవిగా ఆయనని మరింత బలోపేతుణ్ణి చేసింది. పేర్లు కుదరలేదు గానీ బాల్యమిత్రులైన దీపాల పిచ్చయ్య శాస్త్రికీ గుర్రం జాషువాకీ జోడీ కుదిరి వుంటే దేశంలో గొప్ప అవధానులుగా వీళ్ళ కీర్తి దీప్తివంతమయి ఉండేది. తెలిసిన పద్యమే అయినా మళ్ళీ ఒకసారి చదువుకొని మనసారా నవ్వుకుందా!

"నా పేరు ముందు నిల్పం
పాపం బదియేమొ జాషువా పిచ్చులగున్
నా పేరు చివర నిల్పిన
శాపంబిడినట్లు పిచ్చ జాష్వాలయ్యెన్"

పిచ్చయ్య శాస్త్రి, జాషువాలది అపురూప స్నేహం. ఇద్దరూ వినుకొండలో కలిసి చదువుకున్నారు. చిన్నప్పుడు పిచ్చయ్యశాస్త్రి పిలకతో ఆడుకునే తుంటరి తనం పెద్దయ్యాక కూడా పోలేదు. ఇద్దరూ ఎంతో ప్రసిద్ధులైనా అవకాశం దొరికినప్పుడల్లా జాషువా పిచ్చయ్యశాస్త్రిగారి పిలకను ప్రేమగా పలకరించేవాడట!

జాషువా తన చీకటి జీవితంలో నవ్వుల దీపాల్ని వెలిగించుకున్నాడు. దళిత సాహిత్యంలో లోపించిన హాస్య స్పర్శ కొంత జాషువాతోనే భర్తీ అవుతుంది.

జాషువా హాస్యానికి ఒక సామాజిక ప్రయోజనం ఉంది. చార్లీ చాప్లిన్ తన చిత్రాల ద్వారా సాధించింది కూడా ఇదే ....

సాహిత్య చరిత్ర శాస్త్రం (Literary historiography)

డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ

ఒక జాతి చరిత్రను సమగ్రంగా వ్యాఖ్యానించే అనేక రూపాల్లో సాహిత్య చరిత్ర ఒకటి. రాజకీయచరిత్రే చరిత్ర అనుకొనే రోజులు ఎప్పుడో చెల్లిపోయాయి. ఒక జాతి సమగ్ర చరిత్రను తెలిపే రూపాల్లో రాజకీయ చరిత్ర, సామాజిక చరిత్ర, ఆర్థిక చరిత్ర, సాంస్కృతిక చరిత్ర వంటివి మరెన్నో ఉన్నాయి. అందులో ప్రముఖ మైనది, మరింత సజీవమైనది సాహిత్య చరిత్ర.

1.1. చరిత్ర అంటే ఏమిటి? అందులో పరిగణనీయ మయ్యే ముఖ్యాంశాలేమిటి? వాటిని నడిపించిన లేదా రూపీకరించిన శక్తులేమిటి? వాటి వెనకున్న హేతు స్వరూపం ఏమిటి? ఆ హేతు స్వరూపాన్ని (అదే అసలైన చరిత్ర) నిర్మించే తీరుతెన్ను లెలాంటివి? మొదలైన ప్రమాణాలను చర్చించే /వివరించే శాస్త్రక్రమాన్ని 'చరిత్ర శాస్త్రం' (historiography) అంటాము. సాహిత్య చరిత్ర పరంగా ఉన్న ఈ శాస్త్రక్రమాన్ని సాహిత్య చరిత్ర శాస్త్రం (literary historiography) అంటాము. తులనాత్మక సాహిత్యానికి సంబంధించిన శాస్త్ర క్రమం (methodology)లో ఇది అత్యంత మహత్వ పూర్ణమైన స్థానాన్ని ఆక్రమిస్తున్నది. సాహిత్య చరిత్ర శాస్త్ర క్రమాన్ని సరిగ్గా గుర్తించి, సాహిత్య చరిత్రను శాస్త్రీయంగా నిర్మించుకోలేనప్పుడు, మనకు నిజమైన 'సాహిత్య చరిత్ర' లభించదు. కేవలం 'చారిత్రక కాలపట్టిక'లు మాత్రమే ఉంటాయి. ఇవ్వాళ సగటున ముప్పాతిక మువ్వీసం మనకున్నవి కవుల - కృతుల కాలానుక్రమ పట్టికలేకాని, సాహిత్య చరిత్రలు కావు అనేది అందరూ అంగీకరించే సత్యమే. అందువల్లే కొన్ని విశ్వవిద్యా లయాల్లో చరిత్ర అనేమాట సయించక సాహిత్య వికాసం అనే మాటను ప్రవేశపెట్టారు. కాని చరిత్ర నిర్మాణానికి సంబంధించిన శాస్త్ర క్రమం (మెథడాలజీ - హిస్టారియో గ్రఫీ) ప్రమాణాలు పాటింపబడక పోవడం వల్ల, ఆ వికాసాలు, అవ్వారి చరిత్రలకు పర్యాయా లయ్యాయి.

1.1.1 సాహిత్యచరిత్ర అనే మాటను స్థూలంగా వాడుకొన్నప్పటికీ అందులో మూడు తరహాలను లేదా సందర్భాలను వివక్షలోనికి తీసుకోవలసి ఉంటుంది. అవి 1. సాహిత్యపు చరిత్ర (History of Literature) 2. సాహిత్యంగా చరిత్ర (History as Literature) 3. చరిత్రగా సాహిత్యం (Literature as History). స్థలాభావం వల్ల ఈ మూడింటిని దృష్టాంత సహితంగా వివరించే అవకాశం ఇక్కడ లేదుకానీ, ఈ మూడింటికి మధ్య భేదం, పరస్పర సంబంధం సహృదయులకు సుబోధకమే. సాహిత్య చరిత్ర నిర్మాణంలో మొదటిదీ, మూడవదీ ప్రధాన ఆలంబనాలు కాగా, రెండవది గౌణంకాదు - ఫలస్వరూపమవుతుంది. ఆకరాలనుండి చరిత్రను నిష్పన్నం చేయడంలోని అసలు కీలకం అదే... మాటవరస వచ్చిందని కాదుకానీ, ఈ సందర్భంలోనే మనం గుర్తుంచుకోవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, భారతీయ చరిత్ర శాస్త్రంలోని లేదా భారత దేశానికి సంబంధించిన సాంప్రదాయిక చరిత్ర నిర్మాణ దృక్పథంలోని అతి కీలకమైన అంశం కూడా అదే - సాహిత్యంగా చరిత్ర (History as Literature) ను చూడడం.

1.1.2 ప్రతి చరిత్రా ఆ జాతి సాంప్రదాయిక సాంస్కృతిక దృక్పథంతో నియంత్రిత మవుతుంది. అలా కానప్పుడు, అది చరిత్రగా బహుళ జనామోదం పొందదు; సముచిత ప్రయోజనమూ సిద్ధించదు. భారతీయ, సాహిత్యాల చరిత్ర నిర్మాణంలో ఈ అంశం కొంత ఎక్కువ పాలు ప్రాముఖ్యాన్ని చూపుతున్నది. అందువల్లే మన సాహిత్య చరిత్రలు అధిక భాగం 'కవుల - కృతుల, వాటి అందచందాల కాలపట్టిక'లుగా మారడం సంభవిస్తున్నది. దాన్ని కొంత సశాస్త్రీయంగా, సహేతుకంగా మార్చుకోవడం, మలుచుకోవడం మన తక్షణ కర్తవ్యమవుతున్నది..... ఈవ్యాసం ప్రయోజనం ఇంతే .... సాహిత్య చరిత్ర శాస్త్రానికి సంబంధించిన అంశాలనన్నిటినీ వివరించటం ఈ వ్యాసం ఆశయం

కాదు. తక్షణ కర్తవ్యాల పరిపూర్తికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను గురించి చర్చించడమే ఈ వ్యాసరచనలోని లక్ష్యం.

2.0 ముందుగా 'చరిత్ర ' అంటే ఏమిటో కొద్దిగా చూద్దాం. జేమ్స్ జాయిస్ రాసిన యులిసిస్ అనే సుప్రసిద్ధ నవలలో ఒక పాత్ర 'చరిత్ర ఒక భయంకర దుస్స్వప్నం. దాన్నుంచి మెలకువ పొందడానికి తంటాలు పడుతు న్నాను' అంటాడు. ప్రముఖ అమెరికన్ వాణిజ్యవేత్త హెన్రీ ఫోర్డ్ హిస్టరీ ఈజ్ బంకొ(bunk) అనేశాడు. నెపోలియన్ చక్రవర్తి "చరిత్ర అంటే అందరూ ఒప్పుకొనే కాకమ్మ కథ" అన్నాడు. సగటున రాజకీయవాదులు ధన బలో పేతులు ఇలాగే అన్నారు. ఒకరికి చరిత్ర అంటే భయం, మరొకరికి అది లాభం లేని ముడిసరుకు. అందుకే చరిత్ర విద్య ఇటీవలి కాలంలో నిరాదరణ పొందుతున్నది.

2.1 అయితే చరిత్ర అంటే అదికాదు......గతకాలపు అనుభవ ప్రమాణాలతో, వర్తమాన అవగాహనలకూ, భవిష్యత్ సవాళ్ళకూ శాస్త్రీయమైన మార్గం చూపేది. ఒక జాతి త్రికాలాబాధ్యమైన వ్యక్తిత్వానికి నిలువెత్తు చిత్రం వంటిది. ఆ జాతి అంతస్సత్త్వాన్ని, తత్త్వాన్ని ప్రతిఫలించేది. చరిత్రకు సంబంధించి అందరి కంటె ప్రాచీనంగా అరిస్టాటిల్ కంటె కూడా మునుపే, డయోని సియస్ (క్రీ.పూ. 408) ఇచ్చిన నిర్వచనం ఇప్పటికీ ప్రామాణికమైనదే. హెచ్చు ఉపాదేయమైనదే. ఆయన మాటల్లో 'History is Philosophy drawn from examples' (అరిస్టాటిల్ Rhetorica 11,2) ఇక్కడ ఉదాహరణలు అంటే యధార్థ జీవితంలో సంభవించిన దృష్టాంతాలనే అర్థం. ఆ దృష్టాంతాలతో మనం నిర్మించుకొనే ఒక జీవన తత్త్వశాస్త్రం చరిత్ర. అరిస్టాటిల్ కూడా అంత సమగ్ర నిర్వచనం ఇవ్వలేదు. ఆయన 'చరిత్ర అంటే మారని గతం తాలూకు అకౌంటు' అన్నాడు. ఈ గతాన్ని భగవంతుడు కూడా మార్చ లేడన్నాడు. బహుశః ఆ స్ఫూర్తితోనే కార్లైల్ 'చరిత్ర అంటే మరణించిన వాస్తవాలు, తేదీల దస్తావేజు' అని తేల్చి వేశాడు. చాలా ఇటీవలి కాలం దాకా ఇలాటి చర్చే సాగేది. ఒక పరిపూర్ణతా (perfection) సాధనలో మానవుడు పొందే ప్రగతే (progress) చరిత్ర అని యాక్టన్ వంటి మహానుభావుడు పేర్కొనేదాకా ఎక్కువభాగం ఇదే స్థితి. యాక్టన్ నిర్వచనం ఒక విధంగా చూస్తే డయోనిసియస్ నిర్వచనానికి ఒక వ్యాఖ్యానం. అసలు ఇ. హెచ్. కార్ (E.H.Carr) ప్రకారం ' చరిత్ర అంటేనే వ్యాఖ్యానం'. అది ఆ ప్రగతికి వ్యాఖ్యానం. ఆ పరిపూర్ణతకు వ్యాఖ్యానం. ఆ ఆదర్శ తత్త్వానికి వ్యాఖ్యానం.

2.2 సాహిత్య చరిత్రకు కీలకం ఇక్కడే ఉంది. ప్రతిజాతికీ ఒకవ్యక్తిత్వం ఉంది. ఆ వ్యక్తిత్వానికి ఒక సంకేత పూర్వకమైన వ్యాఖ్యానం, సజీవ చిత్రణం సాహిత్యం. కేవలం చిత్రణమేకాదు, పూరణం కూడా. ప్రతి వ్యక్తిత్వంలోనూ ఒక వాస్తవమూ ఉంది. ఒక ఆదర్శమూ ఉంటుంది. ఆదర్శమెప్పుడూ నిరంతర భవిష్యమే. ఇవ్వాల్టి దాకా ఆదర్శమనుకొన్న దాన్ని సాధించేశామంటే, అది నేటి వాస్తవంలో భాగమై పోతుంది. దాని స్థానే మరో ఆదర్శం మొలకెత్తుతుంది. అలా నిరంతర భవిష్యమైన ఆదర్శాన్ని భావనేత్రంతో దర్శించి, వాస్తవానికి పూరణగా చిత్రించేదే సాహిత్యం.

కనుక సాహిత్య చరిత్రలో కేవలం నిన్నటి దాకా ఉన్న ఋజువూ, నేటి వాస్తవం, భవిష్యదాకాంక్షల సమన్వయం చాలదు. ఆ నిరంతర భవిష్యమైన ఆదర్శంతో సమన్వయింప చేయాలి. అప్పుడే అది సాహిత్య తత్త్వంగా పరిణమిస్తుంది. మానవజీవితంలో ఆదర్శ ఐక్యస్థితి గతుల అధ్యయనమే తత్త్వ శాస్త్రం. అది విశ్వానికి - మానవజీవితానికి సంబంధించిన వివిధ రంగాలలోని ఐక్యత కావచ్చు. త్రికాలాల ఐక్యత కావచ్చు. వస్తుతః రెండూ ఒకటే. సాహిత్య తత్త్వం కూడా అంతే. విభిన్న రూపాల - వస్తువుల - చారిత్రక గతిని చాటి చెప్పే శక్తుల - నిరంతర భవిష్యంగా భాసించే ఆదర్శాల ఐక్య స్థితిని - గతిని లేదా తత్త్వాన్ని వివిధ కృతుల నిదర్శనాలతో నిరూపించి చెప్పేదే సాహిత్య చరిత్ర. విడివిడిగా కృతులు విశిష్టాలు. సమష్టిగా అవి చరిత్ర కుపకరించే నిదర్శనాలు. సాధారణ సాహిత్య అధ్యయనంలో ఆ విశిష్టతలూ వాటి సౌందర్యాలు ప్రధానం. చరిత్రలో అవి అందించే సంకేతాలూ, సంక్లిష్ట నిదర్శనాలు

ప్రధానం. కృతి నిదర్శనంతో ఒక సాహిత్య తత్త్వాన్ని నిరూపించేది సాహిత్య చరిత్ర అవుతే, ఆ నిరూపణల తంత్రాన్ని వివరించేది సాహిత్య చరిత్ర శాస్త్రం. అందులో కొన్ని తంత్రాలను ప్రస్తుతం చూద్దాం.

3.0 సాహిత్య చరిత్ర మార్గానికి పితామహుని వంటి వాడు 19వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచి విమర్శకుడు, హిపొలిట్ టేన్ (Hippolyte Taine). 1863లో వెలువడ్డ తన 'ఆంగ్ల సాహిత్య చరిత్ర' మున్నుడిలో ఈయన మూడు ముఖ్యమైన అంశాలను ప్రతిపాదించాడు. అవి జాతి (race), పరిసరాలు (Surroundings) తత్కాల యుగం (epoch) అనేవి. సమకాలిక విప్లవ చరిత్ర కారుడైన లెపోల్డ్ ర్యాంక్ (Leopold Ranke) ప్రభావంతో ఆయన ఆలోచనలను సాహిత్యానికి అనువర్తింప జేస్తూ, ఒక సాహిత్య గమనాన్ని చారిత్రక గతిలో నిరూపించి చెప్పే ప్రధాన అంశాలుగా పై మూడింటిని టేన్ గుర్తించాడు.

మొదటి ప్రచురణ మున్నుడిలో పై మూడు మాటలను పేర్కొన్న టేన్ తరువాత వాటినే కొద్దిగా మార్చి, 1. జాతి (race), 2. కాలస్థితి లేదా సందర్భం (moment), 3. భావపరిసరం (milieu) అని స్థిరపరిచారు. ఇక్కడ జాతి అంటే కేవలం జన సముదాయం అని కాదు, ప్రతి జాతికీ, ఉన్న విశిష్ట ప్రతిభ, వ్యక్తిత్వం అని అర్థం. 'తెలుగు జాతి మనది, నిండుగ వెలుగు జాతి మనది' అనే పంక్తుల్లో కవిభావం తెలుగు మాట్లాడే జనసమూహం అని కాదు. తెలుగువ్యవహారం చేత గుర్తించబడే విశిష్ట ప్రతిభ, దాన్ని కలిగి ఉన్న ఒక మహా పరంపర అని అర్థం. జాతి అనే మాటతో, సదా అభివ్యక్త మయ్యేది, ఆ జాతి గత ప్రతిభ విశిష్టత లేదా ప్రత్యేక శక్తి మాత్రమే. ఇది ఆ జాతి "సాహిత్య నాగరకత" సారం. ఆ ప్రతిభ సమకాలీనమైన సందర్భాలకు పరిసర సన్నివేశాలకు అనుగుణంగా పరివర్తన శీలమై ఉంటుంది. కనుక ఒక జాతి సాహిత్యం అంటే, ఆ సాహిత్యంలో అభివ్యక్త మవుతున్న ఆ జాతి గత ప్రతిభ (సాముదాయిక, సాంప్రదాయిక ప్రతిభ) దాన్ని ప్రభావితం చేస్తున్న ఆనాటి సందర్భం, లేదా ఆ కాలస్థితి; దాన్ని నియంత్రిస్తున్న, విస్తరింపచేస్తున్న / తీర్చిదిద్దుతున్న ఆ పరిసర భావ సన్నివేశం. ఈ మూడు ఒక్కటిగా అల్లుకొని రూపొందుతున్న సృజనాత్మక అభివ్యక్తి అని అర్థం. దాన్ని నిరూపించి చెప్పడమే సాహిత్య చరిత్ర లక్ష్య మంటారు హిపొలిట్ టేన్. మిల్టన్ తాను ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకొంటున్నప్పుడే, ఇరవయ్యో ఏటే తాను ఈ జాతి సదాస్మరించే ఒక మహాకావ్యం రాస్తాను అని డైరీలో రాసుకున్నాడు. ఆ తర్వాత ఇరవై సంవత్సరాలు ఎన్నెన్నో రాశాడు. ఏవీ నిలవలేదు. అన్నీ చిన్నచితకగానే మిగిలిపోయాయి. తినటానికి తిండిని కూడా సంపాదించి పెట్టలేక పోయాయి. దుర్భర దారిద్ర్యానికి, కంటిచూపు తగ్గిపోయి అంధకారం తోడయింది. ఆ కాల స్థితి (moment) ఆయన గుండెల్లో కలిగించిన ముద్రకు, తీవ్రంగా కలిగిన మతపరమైన ఘర్షణకు, విశ్వాసానికి, ప్రతీకగా నలభయ్యో ఏడు దాటాక 'ప్యారడైజ్ లాస్ట్' మహాకావ్య అవతరణ జరిగింది. జాషువా గారి గబ్బిలంలోని రెండు భాగాల అవతరణ వెనుక, ఆయా కాలాల కాలస్థితి ప్రభావం ఉంది. సన్నివేశ ప్రభావం కూడా ఇలాంటిదే. టేన్‌ప్రకారం ఇది ఒకవైపు సాహిత్య పరమైంది. మరోవైపు తాత్త్వికమైంది కూడా. అంటే ప్రతి కాలంలోనూ ఒక సాహిత్య సన్నివేశం, ఒక బౌద్ధిక /తాత్త్విక సన్నివేశం రెండూ కలిసి ఉంటాయి. ఒక్కో కాలంలో ఒక్కో ప్రక్రియ ఒక్కో శిల్ప సంప్ర దాయం, ఒక విధమైన వస్తురీతి జనప్రియమై ఉంటాయి. అదంతా నాటి సాహిత్యసన్నివేశం. అలాగే ఓ తాత్త్విక దృక్పథం, వైజ్ఞానిక అవగాహన, సామాజిక, రాజకీయ ప్రతిస్పందన మిళితమైన ఓ భావజాలం ఉంటుంది. అది అప్పటి తాత్త్విక/బౌద్ధిక (intellectual) సన్నివేశం. ఈ రెండురకాల భావజాలాలు, భావ సన్నివేశాలు రచయితను/రచనను స్వాభిముఖం గానో, ప్రతిముఖం గానో ప్రభావితం చేస్తూనే వుంటాయి. చరిత్రకారుడు ఈ సన్నివేశాన్ని దాని స్వాభిముఖ/ ప్రతిముఖ స్పందనను స్పష్టంగా నిర్వచించి చూపవలసి ఉంటుంది. ఆ నిరూపణమే చరిత్రగా రూపు దిద్దు కొంటుంది. టేన్ జాతి ప్రతిభ - కాలస్థితి - భావసన్నివేశం అనే మూడు అంశాలను పేర్కొన్నప్పటికీ, ఇందులో ముఖ్యమైంది మూడవదే. మొదటిది పేరుకే కాని, వివరంగా చర్చించడానికి ప్రతిదాంట్లోనూ పట్టు దొరికేది కాదు - రెండవది మూడవ దాంట్లో పర్యవసిస్తుంది. కనుక తార్కిక

స్థాయిలో టేన్ మూడు అంశాలను పేర్కొన్నా, పర్యవసానంగా భావ పరిసరం అనే మూడవదే మిగులు తుంది.

3.1 టేన్ ప్రతిపాదనలతో సాహిత్యచరిత్ర అధ్యయనంలో ఒక కొత్తయుగమే ప్రారంభమయింది. అప్పటికి ఎంతో కాలంనుండి నిరీక్షించిన శాస్త్రీయ పంథా అనేది సాహిత్య అధ్యయనంలో తలెత్తిందన్న సంతృప్తి ఏర్పడింది. 18వ శతాబ్ది ఆంగ్ల సాహిత్య అధ్యయనమంతా ప్రధానంగా అభిరుచి స్పందన - అభినందన (appreciation) ల ఆధారంగా సాగినదే. కావ్య సౌందర్యం పట్ల స్పందన, అభినందన బాగానే ఉన్నా, శాస్త్రీయ విశ్లేషణకు అవి దూరమే. అంచేత నిజమైన తార్కిక ప్రీతి పరితలో కలగదు. రసానందంలో తార్కిక ప్రీతి ప్రథమ ఘట్టం. సృజనలో సైతం ఓ శాస్త్రీయ రీతి ఆవిష్కృత మైనప్పుడే ఆ తార్కిక ప్రీతి ఏర్పడేది. ఆ తర్వాత , అది కలిగించేవిశ్వాసం ఆధారంగా, తన్మయీ భావం వైపు మనస్సు అభిముఖమవుతుంది. అది శిఖర స్థాయిని చేరినప్పుడు రసానందం 19వ శతాబ్దిలో విజ్ఞాన శాస్త్రం ప్రత్యక్షప్రమాణం (verifiable fact), వ్యక్తి నిరపేక్షత (objectivity) ల ఆధారంగా ఒక విప్లవాన్ని సృష్టించాక, శాస్త్రీయ అనుశీలనారీతికి బలమైన పునాదులు ఏర్పడి, ఇతర అధ్యయన రంగాల్లో కూడా అలాటి భావ విప్లవమే రావాలన్న ఆకాంక్ష మొదలైంది. ఫలితంగా మానవీయ అధ్యయన రంగాల్లో రూపుదిద్దుకున్న మొదటి శాస్త్రీయ మార్గం చరిత్ర అని అమెరికన్ ఎన్సైక్లోపేడియా ఆఫ్ సోషల్ సైన్స్ స్పష్టం చేస్తున్నది. చరిత్ర సంయోజనంతో సాహిత్య అధ్యయనం ఎట్టకేలకు శాస్త్రీయ మార్గాన్ని చేపట్టిందనీ, వ్యక్తి నిరపేక్ష అధ్యయనం మొదలయిందని 19వ శతాబ్ది సాహిత్య అధ్యేతలు సంబరపడ్డారు. ఆ సంబరం అందించిన మహా ఫలమే - డబ్ల్యు.జె. కోర్ట్ హోప్ రచించిన ఇంగ్లీషు కావ్య చరిత్ర (History of English Poetry). టేన్ చేసిన ప్రతిపాదనలు ఇందులో సంపూర్ణ ఫల రూపాన్ని పొందాయి. ఒక తార్కిక ప్రతిపాదన వేరు - దాని వాస్తవిక నిరూపణ వేరు - టేన్ ప్రతిపాదనలు వాస్తవిక ఆవిష్కరణకు లొంగే అంశాలేనని ఈ కావ్య చరిత్ర నిరూపించింది. అంతకు మునుపు 1860లలో థామస్ వార్టన్ మొట్టమొదటి సారిగా 'హిస్టరీ ఆఫ్ ఇంగ్లీష్ పొయెట్రీ' ని 1032 పుటల ఉద్గ్రంథ రూపంలో ప్రచురించినా అది కవుల - కృతుల సుదీర్ఘ పరిచయాల సంకలనమే అయిందికాని, కావ్య చరిత్ర కాలేదు. తన రచన మున్నుడిలో ఆలోచనా శయం "to pursue the progress of our national poetry from a rude origin and obscure beginnings to its perfection in a polished age" అనిఎంత ఉదారంగా ప్రకటించినప్పటికీ, ఆ ప్రగతి పరిణామాన్ని మాత్రం వార్టన్ నిరూపించలేకపోయాడు. టేన్ మార్గాన్ని ఆయన అనుసరించలేకపోయాడు. ఆ మార్గాన్ని తొలుతగా అనుసరించి, దాన్ని కృతార్థం చేసింది కోర్ట్ హోప్. 1895 -1910ల మధ్యదీర్ఘ పరిశ్రమ ఫలంగా వెలువడ్డ ఈ రచనలో, కోర్ట్ హోప్, బ్రిటిష్ నాగరకత జాతిప్రతిభ, బ్రిటిష్ రాజకీయ సంస్థల విధానం రెండింటినీ సమన్వయించి చూస్తూ, ఇంగ్లాండు చరిత్ర అంతటా వ్యక్తి వాదానికి - సమష్టి వాదానికి మధ్య తార్కిక (డయలెక్టికల్) సంఘర్షణ కొనసాగుతూనే వచ్చిందనే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తాడు. ఆ సిద్ధాంతపు వెలుగులో, కావ్యపరిణామాన్ని పరిచయం చేస్తాడు. ఆ తరువాత సుమారు దశాబ్దం పిమ్మట 12 సంపుటాలుగా వెలువడిన 'కేంబ్రిడ్జి హిస్టరీ ఆఫ్ ఇంగ్లీష్ లిటరేచర్' సాహిత్య చరిత్రలో 'యుగం' అంటే ఆ కాలస్థితి నాటి సాహిత్య తాత్త్విక వాతావరణం / భావ పరిసరం ప్రాధాన్యాన్ని తిరుగు లేకుండా ప్రతిష్ఠించింది.

3.2 ఫలితంగా సాహిత్య చరిత్రలో యుగ భావన యుగ చేతనల నిరూపణ అత్యంత ప్రధాన స్థానమాక్ర మించింది. అయితే దురదృష్ట మేమిటంటే ఆ యుగ భావన - చేతనల ప్రస్తావన, ప్రస్తావనవరకే పరిమితమై ఆ తరువాత యథా ప్రకారంగా విడివిడి కావ్య-కర్తల పరిచయమే కొనసాగుతూ రావడం.... ఆ చేతన కాలక్రమంలో ఎలా పరిణమిస్తూ వచ్చిందో చెప్పక పోవడం, కొన్నిచోట్లయితే యుగ విభజనే ప్రధాన చర్చనీయాంశమై పోవడం... రాజకీయసంస్థల/ పోషక

సంస్థల - లేదా -వ్యక్తుల (రాజు/రాణి) పరంగా యుగ విభజన చేయడమా? (ఆరుద్ర సంపుటాల్లోలాగా); వారు సాహిత్యంపై నేరుగా చూపిన ప్రభావం ఏమీ లేనప్పుడు ఆ విభజన అర్థరహితమైనది కనుక, సాహిత్యాన్ని ప్రభావితం చేసిన ప్రముఖ కవుల పరంగా, విభజన చేయాలనడం (తెలుగులో స్థూలంగా పింగళి వారి పద్ధతి అందాం); ఆ ప్రముఖ కవులు కూడా తమ రచనల వరకే పరిమితమైన వారు కాని, తమ కాలాన్నంతటినీ ప్రభావితం చేసినవారు కాదు. (ఉదాహరణకు నన్నయ యుగమే. నన్నయ యుగానికి నన్నయే తప్ప అనుసరణ లేదు, ప్రభావ వికసనమూ లేదు), కనుక వారి పరంగా కూడా విభజన అశాస్త్రీయమే. వారి కాలంలోని భావజాలాల పరంగా విభజన శాస్త్రీయమైనదనడం; ఒకేకాలంలో భిన్న భావజాలాలుంటాయి, ఒక సంకీర్ణత ఉంటుంది. కనుక అదీ అశాస్త్రీయమైనదే ననడం; వీటన్నిటి కంటె చరిత్రలో సర్వజనామోదంగా మారినకాలక్రమాను రీతినే కొద్దిగా సాహిత్య పరిసరానికి అనుగుణంగా మార్చుకొని అనుసరించడం సముచితమనడం (స్థూలంగా 'కవిత్వ వేది' పద్ధతి అందాం) ఇలా భిన్న వాదోపవాదాలు సాగుతూ వచ్చాయి కాని వాటివల్ల నిరూపించి చెప్పిన యుగచేతనా స్వరూప, స్వభావాలుకాని, కాలక్రమంలో-యుగాంతరాలలో - అది పొందిన పరిణామ నిరూపణ కాని తెలుగు సాహిత్యచరిత్ర వరకూ తీసికొంటే మృగ్యమే.

3.3 టేన్, కోర్ట్ హోప్‌ల మార్గం సాహిత్య చరిత్రల నిర్మాణానికైతే ఉపయోగపడవచ్చు కాని, చారిత్రక దృష్టితో సాహిత్య విమర్శకుమాత్రం ఉపకరించదు అనే బలమైన వ్యతిరేకతే అమెరికన్ నవ్యవిమర్శా (New Criticism) మార్గంలో బలపడింది. 'మనం ఛాసర్ కవి శబ్దం సంపత్తి, వ్యుత్పన్నత, వ్యాకరణ పాండిత్యం, మరికొంత ముందుకు వెళ్ళి ఆయన కాలం, పరిసరం, నాటి సామాజిక - సాంస్కృతిక విధానాలు - విశ్వాసాలు - ఇవన్నీ ఎన్ని తెలుసుకొన్నప్పటికీ ఛాసర్ కావ్యాన్ని అర్థం చేసికోకనే పోవచ్చు. కావ్యంలో కావ్యాస్వాదన వేరు, కావ్య చరిత్రాదికాల అవగాహన వేరు,' అంటూ ఈ మార్గంలోని ముఖ్య బలహీనతను టి.ఎస్. ఎలియట్ తన 'విమర్శ పొలిమేరలు' (The Frontiers of Criticism) లో విశదపరుస్తాడు. అంతకంటె బలంగా ర్యాన్‌సమ్, క్లియంత్ బ్రూక్స్ ప్రభృతులు చారిత్రక విమర్శ మార్గాన్ని తిరస్కరిస్తారు. 'ప్రతి రచన స్వయం సత్తాక (autonomous) మైనది.ప్రతి రచయిత ప్రతిభ కూడా అంతే. ఇలాటి పరిసరాలు, ఇలాంటి యుగ చేతనలు, ఇలాటి ప్రతిభను రూపీకరిస్తాయనే సూత్రాన్ని ఎవ్వరూ చేయలేరు. కనుక వాటి చట్రంలో రచనలను, రచయితలను కొలత వేయడం అర్థరహితం' అన్నది నవ్యవిమర్శకుల వాదన సారాంశం. చారిత్రక విమర్శలో అనుకోకుండా రూపొందిన నియంత్రవాద (deterministic) ధోరణికి ఇది ప్రతిఘటన. ఇక్కడ గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన అంశం ఒకటుంది. చారిత్రక దృష్టితో ఒక రచననో, రచయితనో పరిశీలించడం వేరు - అది చారిత్రిక విమర్శ. పలు విమర్శా మార్గాలలో అదొకటి; సాహిత్య చరిత్ర నిర్మాణం వేరు - అక్కడ రచనల సమాహారం - వాటిలో అంతర్లీనంగా ఉన్న భావసూత్రం, పరస్పర సాపేక్షతలు, పరివర్తనలు, పరిణామాలు వివక్షలోకి వస్తాయి. కనుక సాహిత్యచరిత్రకుపకరించే ప్రమాదాలను చారిత్రక విమర్శ విధానానికి అన్వయించి దరిమిలా కలిగే అతిరేకతలను వ్యతిరేకించడం సరైన ఫలితాలనివ్వదు. అతిరేకతలు లేకుండా అన్వయమున్నప్పుడు, ఆ ప్రమాణాలవల్ల కలిగే ఫలితాలు సత్ప్రమాణాలు గానే ఉంటాయి.

3.4 ఈ అతిరేకతలకు విరుగుడుగా రూపుదిద్దు కొన్న మార్గాన్ని 'నవ్య చారిత్రక వాదం' (Neo historicism) అని వ్యవహరిస్తారు. అమెరికన్ నవ్య విమర్శకులు, కావ్యానికీ, కావ్య రూపానికీ పట్టం కడుతూ, కావ్య చరిత్రను, నేపథ్యాన్ని విస్మరించడంలోని అతార్కికతను వారికి దగ్గర్లోనే ఉన్న లయనల్ ట్రెలింగ్ ఎత్తిచూపుతూ, "చారిత్రక విమర్శ మార్గాన్ని ఖండిస్తూ నవ్యవిమర్శకులు ఒక సాహిత్య రచన కూడా చారిత్రిక సంఘటనే, ఆ రచనా చారిత్రకత కూడా మన కళాస్వాదనలో భాగమే

నన్ను ముఖ్యమైన విషయాన్ని మరచిపోయారు -" అని పేర్కొంటాడు. 20వ శతాబ్దం నడిమి భాగానికి నవ్య విమర్శకుల ప్రభావం తక్కువయ్యే కొద్దీ ఆర్.ఎస్.క్రేన్, రాల్ఫ్‌కోహెన్ ప్రభృతుల కృషిలో నవ్య చారిత్రక వాదం ప్రాణం పోసుకోసాగింది. సాహిత్య చరిత్ర అంటే సాహిత్య రూప వైవిధ్యాల చరిత్రే. వివిధ సమాజాలలో వివిధ రూప భేదాలు ఎలా తలెత్తుతున్నాయి? ఒక రచనకూ దాని వెనకాలి రూపభేద చరిత్రకూ సంబంధ మేమిటి? సారూప్య, వైవిధ్యాలకు కారణా లేమిటి? అనేవి క్రేన్ దృష్టిలో ప్రధానాంశాలు. సాహిత్య రూప భేదాలకు, అవి ఉత్పన్నమయ్యే సామాజిక - ఆర్థిక సన్నివేశాలకు మధ్య ఘనిష్ఠ సంబంధముండడానికి కారణాలేమిటి? ఆ రూప భేదాలలో ఆ సామాజిక ఆర్థిక సంబంధం ఏ మేరకు ప్రతిఫలిస్తున్నది. వాటిని స్పష్టంగా గుర్తించి, వ్యాఖ్యానించడం విమర్శకుని చారిత్రిక బాధ్యత కాదా? అన్నవి రాల్ఫ్ కోహెన్ దృష్టిలో ప్రముఖమైన అంశాలు. ఈ ప్రశ్నలు రష్యన్ రూప విమర్శకు దగ్గరగా (అమెరికన్ రూపవిమర్శను నవ్య విమర్శ అనడం పరిపాటి) కోహెన్ దృక్పథం వెనుక మార్క్స్ వాద ప్రభావముంది. "The process of history is the gradual unfolding of the laws of Reason" అన్న జర్మన్ తాత్త్వికుడు హెగెల్ తార్కిక సూత్ర విస్తరణ ఉంది. ఆ హేతు సూత్రాల ఆవిష్కరణను ఉత్పత్తు (Products) ల పరంగా మార్క్స్ పరివర్తింప చేస్తే, ఆ ఉత్పత్తులు -వాటికున్న సామాజిక - ఆర్థిక వ్యవస్థల ఆధారాలను సాహిత్య రూప వైవిధ్యానికి అన్వయిస్తూ కోహెన్ సాహిత్య చారిత్రక గతిని నిరూపించాలని ఆలోచిస్తాడు. ఆ ఆలోచనలతో ప్రమేయం లేకుండా, కేవలం ప్రక్రియాపరమైన రూపాత్మిక (Formalistic) అంశాలతో సాహిత్య చరిత్రను నిర్మించ బూనడం నేల విడిచిన సాము అవుతుంది. తెలుగులో మొదటి సారిగా ప్రక్రియాత్మక అంశాలను, రూప వైవిధ్య లక్షణాలను పరిగణనలోనికి తీసికొని సాహిత్య చరిత్రను నిరూపించిన /నిర్మించిన ఘనత ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికి దక్కుతుంది. అయితే వారి అనుశీలనంలోని ముఖ్యమైన పరిమితి - రూపవైవిధ్యానికీ వాటికి కారణమైన సామాజిక - ఆర్థిక - సాంస్కృతిక సన్నివేశాలకు మధ్య సంబంధాన్ని ఆవిష్కరించకపోవడమే. అయితే ఆయన విడిగా సాహిత్య చరిత్ర రాయాలని సంకల్పించలేదన్నమాట ఇక్కడ గుర్తుంచుకోవాలి. తమ దృక్పథం నుంచి సాహిత్యాంశాల అనుక్రమణికను వారు వ్యాఖ్యానించారు కాని, సాహిత్య చరిత్ర రచనకు సంకల్పించలేదు.

4.0 సాహిత్య చరిత్ర నిర్మాణ విధానాల్లో మరో ముఖ్యమైన భేదం - భావనాపరమైన చరిత్ర. సాహిత్య రచనలోని 'రచన' యావత్తూ ఒక 'భావన'కు ఇచ్చే కళాత్మక నిర్మాణమే. రచనను చూడడం వేరు. దానికి ఆధారమైన భావనను చూడడం వేరు. సాహిత్య విమర్శలో ఆ రచన - కళాత్మక నిర్మాణం - ప్రధాన స్థానమాక్రమిస్తే, సాహిత్య చరిత్రలో దానికి భూమిక అయిన భావన ప్రధాన స్థానమాక్రమిస్తుంది. కనుక సాహిత్య చరిత్ర అంటేనే భావనల చరిత్ర (History of Ideas) గా గ్రహించే మరో పద్ధతి ఉంది. ఈ పద్ధతికి చెందిన ప్రముఖ సాహిత్య వేత్త ఎ.ఒ. లవ్‌జాయ్ 1940లో 'జర్నల్ ఆఫ్ ద హిస్టరీ ఆఫ్ ఐడియాస్' అనే పత్రికను స్థాపించి విజయవంతంగా నడిపాడు. చరిత్రలో ఒక అనాహతమైన జీవ బంధముందంటాడు లవ్‌జాయ్. 'సృష్టిలోని సమస్త ప్రాణి జాతులూ ఒక వరుసలో బంధించబడి ఉన్నాయి. ప్రతిప్రాణి జాతికీ తనకుపైన, దిగువన ఉన్న ప్రతి ప్రాణి జాతితో ఘనిష్ఠమైన జీవసంబంధం ఉంది' అంటూ ఈ జీవ బంధాన్నే ఆయన అస్తిత్వపు గొలుసు (chain of being) గా అభివర్ణిస్తూ దాన్ని ఒక సాహిత్య క్రమానికి, క్రమానుగతమైన రచనల సమాహారానికి అన్వయిస్తూ, ఆ జైవిక బంధాన్ని ఆవిష్కరించడమే చరిత్రకారుని కర్తవ్యమంటాడు లవ్ జాయ్. తన దృక్పథం నుండి 18వ శతాబ్ది ఆంగ్ల సాహిత్యంలో ఆ జైవిక బంధం ఎలా అభివ్యక్తమైందో అతి గాఢంగా వివేచిస్తాడు. ఆయన వివేచన, సాహిత్య చరిత్రను సాహిత్య భావనల చరిత్రగా చూసే ఓ కొత్త దృక్పథాన్ని ప్రతిష్ఠించింది. (చాలా

విశ్వవిద్యాలయాలలో సాహిత్య చరిత్ర పేపర్‌ను, (History of Ideas) గా గుర్తించి తదనుగుణంగా బోధించడం గమనార్హం. ఉదాహరణకు ఢిల్లీ విశ్వ విద్యాలయంలో ఉర్దూ శాఖ)

4.1 అసలు భావన అంటే ఏమిటి? దానివివేచనా క్రమం ఏమిటి? అనేవి ముఖ్యమైన ప్రశ్నలు. భావనా సూత్రాన్ని (Doctrine of Ideas) ను మొదటగా పాశ్చాత్య తాత్త్విక ప్రపంచానికి పరిచయం చేసింది ప్లేటో. ఆయన తన ఆదర్శ రాజ్యంలోని ఆదర్శ పౌరులకు నిర్దేశించిన విద్యావిధానంలోని ఉన్నత విద్యలో తొలిమెట్టుగా Doctrine of Ideas ను బోధించాలనుకుంటాడు. ఆధునిక విద్యా ప్రపంచానికి పునాది గ్రీకు తాత్త్విక ప్రపంచమే కదా....భావన అంటే ఏమిటి? అదికేవలం ఊహకాదు. ఇంద్రియాలతో మనంగ్రహించే దానిని 'గుర్తించడం' (Perception) అందాం. ఈ భౌతిక బోధ (పర్సెప్షన్) సువ్యవస్థీకృత మైనప్పుడు కలిగేది 'మనోబోధ' (Conception) దీన్ని భావం అని కూడా అనవచ్చు. అంటే ఇంద్రియాత్మకంగా గ్రహించిన ఒక రూపం /అనుభవం తాలూకు అంతస్సత్వాన్ని ఆ దశలో మనస్సుతో గ్రహిస్తున్నామన్నమాట. అంటే ఆ రూపం /అనుభవం తాలూకు పరిమితులు గుర్తిస్తున్నామన్న మాట. ఆ పరిమితులను గుర్తించినప్పుడు మనలోని ప్రతిభ మేల్కొని 'అది ఇలాగుంటే బాగుండు' లేదా దాన్ని ఇలా మారిస్తే బాగుండు వంటి ఊహలను కలిగిస్తుంది. అది భావన (Idea) దీన్నే విల్ డ్యూరాంట్ మాటలను అరువు తీసికొని కొద్దిగా మార్చి చెబితే 'Organised sensation is perception; organised perception is conception; and an organised complementation to conception is Idea' అని నిర్వచించవచ్చు. ఈ ఐడియా లేదా - భావనా వ్యాపారంలో మూడు దశలున్నాయంటాడు ప్లేటో. అవి Idea - law - Ideal అనేవి. మనకో కొత్త ఊహ - భావన - కలిగింది. కాని దాన్ని వ్యక్తం చేయాలంటే ఒక నిర్దిష్టమైన పూర్వరచిత నియమావళిని అనుసరించాలి. అదే 'లా'. అలా వ్యక్తం చేస్తున్నందుకు ఒక నిర్దిష్టమైన ప్రయోజనం లక్ష్యం కూడా ఉండాలి. ఆదర్శవంతమైన ఆ లక్ష్యమే 'ఐడియల్' అంటే 'ఐడియా' అన్నది తార్కికంగా ఒక నిర్దిష్ట నియమాన్ని, విస్పష్టమైన ప్రయోజనాత్మక ఆదర్శాన్ని అందిస్తుందన్న మాట.

4.2 ప్రతిసాహిత్య రచన కూడా అంతే. రచయిత తన అనుభవంలోకి వచ్చిన వివిధ భావాలలోని అంతస్సత్వాన్ని, వాటి పరిమితులను గుర్తించి, వాటిని మనస్సుతో భావించి , అందులో లేనిదాన్నో, తప్పిపోయిన దాన్నో, తక్కువైన దాన్నో గుర్తుపట్టి, దాన్ని తన ఊహతో భావనగా పరివర్తింపచేసి దాన్నివ్యవస్థీకరించి అభివ్యక్తం చేయడానికి రచనా క్రియను నిర్వహిస్తాడు. మామూలుగా మనకు దర్శనమిచ్చే 'రచన' బాహిర రచన అయితే, ఈ భావనా వ్యాపారమంతా 'మనో రచన' అన్నమాట. కాల్‌రిడ్జ్ ఇమాజినేషన్ పేరిట ఉద్దేశించింది ఈ మనోరచనా వ్యాపారాన్ని లేదా, భావననే, దాన్ని మనం ప్రతిభకు సమానార్థకం చేసేసుకొన్నాము. Image making power is Imagination. ఆ ఇమేజ్ అనేది ఐడియాకు తొలి అభివ్యక్త రూపం. రచనాభివ్యక్తి అంతా తొలిపునాది. ప్రతి రచనా, ఒక సాంస్కృతిక అభివ్యక్తి. ఒక సంస్కృతి సజీవ దాఖలా (document) ఒక చారిత్రక ఘటన. అలాటప్పుడు ఒక రచనా పరంపర, రచనా సంప్రదాయం ఊరకే ఏర్పడుతున్నదా? ప్రతి ఘటనకు మరో ఘటన సంవర్తిత ప్రేరకమో, వివర్తిత ప్రేరకమో, లేదా వికల్పమో కాదా? వాటి మధ్య తార్కికతను ఆవిష్కరించడ మంటే వాటికి భూమికలైన భావనల అంతస్సంబంధాన్ని, తార్కిక సజీవ క్రమానుగత సంబంధాన్ని (chain of being) నిరూపించడమే కదా!.... ఈ దృష్టితో చూస్తే సాహిత్య చరిత్ర ఎక్కువ సమర్థవంతమయ్యేది. దాన్ని 'భావనా చరిత్ర' (History of Ideas) గా గ్రహించినప్పుడే... అంటే ఆ సాహిత్య చరిత్ర మొదట ఒక భావనా దర్శనమన్నమాట ... క్రోచే అనే ప్రసిద్ధ ఇటాలియన్ తత్త్వవేత్త చరిత్రను ఒక తత్త్వ దర్శనంగా అభివర్ణిస్తూ చరిత్ర గతంలో కాదు, చరిత్రకారుని శిరస్సులో

ఉందంటాడు. ఉత్తమ చరిత్రకారుడు, తాను పొందిన భావనలదర్శనాన్ని పఠితకు చారిత్రక కథనంచేసి చెబుతాడు.

5.0 చరిత్ర అవిచ్ఛిన్నమైన ఒక మహాపరంపరను చెప్పే కథనం అనేది మనం తరచూ వినే మరో మిథ్యా కల్పన. ప్రతి సాహిత్యచరిత్రా, ఆ సాహిత్య సంప్రదాయాన్ని నిరూపించి చెబుతుందంటాము. సంప్రదాయ మంటే అవిచ్ఛిన్నంగా కొనసాగే భావ పరంపర అని అభివర్ణిస్తాము. అందులోని సత్యమెంత. నిజానికి సంప్రదాయ మనేది ఒక పద్ధతి /విధానం యొక్క కొనసాగింపు కాదు. మరో భిన్న విధానంతో ఏర్పరచుకొనే సయోధ్య సమన్వయం. క్రమానుగత మవుతున్న పరస్పర విరుద్ధ /విభిన్న భావ జాలాలను పాక్షికంగానో, లేదా పూర్తిగానో తిరస్కరిస్తూ లేదా పరివర్తింప చేస్తూ సాధించే సమ్యక్సమన్వయాన్ని మనం సంప్రదాయంగా వ్యవహరిస్తుంటాము. దీన్ని ఆంగ్లంలో ఇలా నిర్వచించడానికి ప్రయత్నిస్తాను : Tradition is the synthesis of conflicting/contrastive idealogies coming in sequences, either rejecting or modifying either of them partially or fully మనం సాధారణంగా చెప్పుకొనే పద్ధతి, కట్టుబాటు, ఆచారం, విశ్వాసం, అలవాట్లు వగైరాలన్నీ ఆ సంప్రదాయానికి బాహిర ప్రతీకలే లేదా రూపాలే. సంప్రదాయమంటేనే ఒక భావజాలం, పరస్పర విరుద్ధ / వ్యతిరేక భావజాలాలమధ్య రూపొందించే సమన్వయ భావజాలం. ఆ సమన్వయాన్ని దాని వెనుక ఉన్న సంఘర్షణలను, కొన్నింటిని త్రోసిరాజంటున్న స్థితినీ గుర్తించకుండా, సంప్రదాయమనగానే ఒక అవిచ్ఛిన్నమైన విధానం మనుకోవడం బౌద్ధిక స్థాయిలో పొరబడడమే అవుతుంది. రష్యన్ ఫార్మలిస్టులు ముఖ్యంగా విక్టర్ శ్లోవ్స్కి అతని అనుచరులూ వ్యక్త బరచిన అభిప్రాయాలు ఇక్కడ అవశ్య స్మరణీయాలు. 'సాహిత్య చరిత్ర అంటే ఏదో ఒక మహాపరంపర, సంప్రదాయం అవిచ్ఛిన్న ఇతిహాసం కాదు. అది అకారణంగా హఠాత్తుగా సంభవించే విచ్ఛిన్నతల చరిత్ర; భూతకాలంతో జరిగే భయంకర విచ్ఛేదాల చరిత్ర. ఇలాటి చరిత్రలో ప్రతిసాహిత్య వర్తమానమూ తన వెనుకటి తరం సన్మానించిన ప్రమాణాలను తిరస్కరిస్తుంది. తన తరం సాహిత్య విలువల్ని, వాటిని పరిగణించే ప్రమాణాలను రూపొందించుకొంటుంది. సాహిత్య స్వరూపమే ఇలాంటి అనవరత పరివర్తనను అనివార్యమనిపిస్తుంది. ఎంచేతంటే, ప్రతిసాహిత్య రూపమూ అవతరించి, పూర్ణ వికాసం పొందాక తప్పనిసరిగా పాతదై పోతూ తన సార్థకస్థితిని కోల్పోతుంటుంది. అప్పుడు దాని స్థానంలో మరొకటి రావడం తప్పనిసరవుతుంది. నిజమైన సాహిత్యచరిత్ర అంటే ఇలా నిరంతరం సాగేపరివర్తనల వాటి స్వరూప స్వభావాల దాఖలా (document). Frederick Jameson రచించిన The Prison-house of Language ను అనుసరిస్తూ సి.ఎన్. రామచంద్రన్ సాహిత్య విమర్శ (కన్నడలో) శ్లోవ్స్కి అనుచరులు వ్యక్తబరచిన ఈ భావాలు, ప్రతి సాహిత్య చరిత్రకు అక్షరశః మార్గ దర్శకాలు.

6.0 పిండీకృత సారంగా, ఉత్తమ సాహిత్య చరిత్రకు ఈ క్రింది మూడు ప్రధాన దృక్కోణాలుంటాయని ప్రతిపాదిస్తున్నాను. అవి:

1. కాలాను క్రమణిక (Chronological dimension)

2 సౌందర్యాత్మక దృక్కోణం (Aesthetic dimension)

3. సామాజిక - సాంస్కృతిక దృక్కోణం (Socio-cultural dimension)

ఈ మూడూ క్రమంగా ఒకటి మరోదానిపై ఆధారపడి ఉంటుంది. అయితే దేనికదే తన ప్రాధాన్యాన్ని స్పష్టంగా కలిగి ఉంటుంది. మొదటిది రెండవదాని మీద, రెండవది మూడవ దాని మీద ఆధారపడి ఉంటుందని, కేవలం మూడవదాని ఆధారంగానో, లేదా రెండవదాని ఆధారంగానో సాహిత్య స్వరూప, స్వభావాలను 'వ్యాఖ్యానించ' బూనడం అశాస్త్రీయమే అవుతుంది. మూడింటి మధ్య సమతూకాన్ని సమన్వయాన్ని పాటించడమే చరిత్రకారుని ప్రజ్ఞ. ఈ చరిత్రకారుని

'ప్రజ్ఞ' లో అటు లయనల్ ట్రిలింగ్ తన వ్యాసానికి శీర్షికగా వరించిపెట్టిన 'The sense of the past'తోపాటు, ఇటు టి.ఎస్.ఎలియట్ కవితాత్మకంగా అభివ్యక్తీకరించిన the pastness of the present, the presentness of past లతో కూడిన ద్వైపాక్షిక దర్శనం (binary vision) కూడా మిళితమై ఉంటాయి. ఆ సమ్యక్ ప్రజ్ఞ ఉన్నప్పుడే సాహిత్య చరిత్రకారుడు, సాహిత్య చరిత్ర తత్త్వ దర్శనాన్ని క్రోచె అన్నట్లు తన 'ఆలోచన'లో పొంది ఇతరులకు అందించగలడు.

6.1 కాలానుక్రమణిక ప్రతి చరిత్రకు ప్రాథమిక స్వరూపం. అదిలేకుండా చరిత్ర లేదు, అయితే అంతవరకే అయితే 'చరిత్ర' ఉండదు. అది చరిత్రకు కావలసిన ప్రాథమికచట్రాన్ని (బేసిక్ ఫ్రేం) ఇస్తుంది. చరిత్ర అంటే సంఘటనల కూర్పు కాదు. సంఘటనల వెనుక ఉన్న హేతువుల తీర్పు. ఆ తీర్పుకు మరో పేరే కాలం. కాలం అంటే తేదీల మాసాల గణనం కాదు. సమస్త మానవ చేతన సారం (సింథసిస్). చేతనకు పర్యాయ రూపం. చరిత్ర అంటేనే భావచేతనా చరితమే కనుక, కాలాను క్రమణికను ఆ దృష్టితో ఆ హేతువుతో అనుసంధానించ వలసి ఉంటుంది. భావచేతనకు - హేతువుతో ఇచ్చే ప్రాథమిక వర్గీకరణ రీతి కాలాను క్రమణిక అని నిర్వచిస్తే సరిపోతుంది. ఆ దృష్టితో చూసినప్పుడే చరిత్రలో కాలానుక్రమణిక మహత్తు అర్థమవుతుంది. లేకుంటే అది కేవలం శుష్కమైన కాల పట్టికో, పేటికో అవుతుంది. (పిరియడ్, పేట్రనేజ్, గ్రేట్ పొయెట్ వంటివన్నీ ఈ చట్రంలోనే చేరిపోతాయి).

6.2. సౌందర్యాత్మకదృక్కోణం, కేవలం కావ్యంలోని చమత్కారాలను, శిల్పపు తీరును, వాటి ప్రశంసలను, లేదా పరివర్తనలను చెప్పటంతో సరిపెట్టుకొనేది కాదు. అది కావ్య వికాసం వెనుక నిశ్చలంగా త్రికాలా బాధ్యంగా సగుణంగా మెరిసే ఆత్మస్వరూపం. 'ఈస్థటిక్స్' అన్నది, తత్త్వ శాస్త్రం లోని ఒక ప్రధానాంశం; భాగం. "Aesthetics is the study of ideal form or beauty' అంటాడు విల్ డ్యూరాంట్ తన తత్త్వశాస్త్ర కథ (స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ)లో. ఆ నిర్వచనాన్ని మరికొంత విస్తరించ వలసిన అవసరముంది. రూపాన్ని వస్తువును, ఆదర్శ వాస్తవంతో సమన్వయించి తీర్చే తీర్పు సౌందర్యం అనడం సబబుగా, సంక్షిప్తంగా ఉంటుందనుకొంటాను. దీన్నే ఆంగ్లంలో 'aesthetics is the organisation of form and content to give an ideal perspective అని నిర్వచించవచ్చు. ఆ తీర్పు ప్రధానంగా కలిగిన కళాతాత్త్విక దృష్టితో కాలక్రమంలో సాహిత్యం పొందుతున్న మార్పుల వెనుక నిశ్చలంగా వెలిగే, దాని సగుణ ఆత్మతత్త్వాన్ని చరిత్ర కారుడు ఆవిష్కరించి నప్పుడే , ఈ దృక్కోణ నిర్వహణ సార్థకమవుతుంది.

6.3 ప్రతి సాహిత్యం ఒక సంస్కృతికి సజీవ తార్కాణం, దాఖలా, డాక్యుమెంట్. ఆ జాతి నాగరకతను, సంస్కృతిని, దాని సాక్షాదనుభవాలను, పోరాటాలను, ఆకాంక్షలను, అందుకోవలసిన ఆదర్శాలను ఒకటిగా కలిపి కళ్ళెదుట ప్రదర్శించే చరిత్ర. దాని వికాసాన్ని ఆవిష్కరించే ఏ చరిత్రకారుడైనా, దాని భూమిక, వెన్నెముక అయిన సంస్కృతి నుంచీనే సాహిత్యవికాసాన్ని వ్యాఖ్యానించి, తత్త్వ దర్శనం చేయించవలసి ఉంటుంది. సామాజిక - సాంస్కృతిక భూమికను విశ్లేషించి, సమన్వయించి చూపని ఏ సాహిత్య చరిత్రా, చరిత్రకాదు. అది కేవలం 'సాహిత్యపు కథే' అవుతుంది.

6.4 కాలానుక్రమణిక ఒక ప్రాథమిక స్వరూపం, చట్రాన్ని ఇస్తే, సామాజిక,సాంస్కృతిక దృక్కోణం అంగాంగాలను, వాటి తార్కిక అన్వయాలను కూరిస్తే సౌందర్యాత్మిక దృక్కోణం దాని ఆత్మను దర్శనీయం చేస్తుంది. ఈ మూడూ సమంగా కలిగి ఉన్నదే సరైన సాహిత్య చరిత్ర. వాటిని ఎలా నిర్వహించాలి అని చెప్పడం సాహిత్య చరిత్ర శాస్త్రంలో భాగమే కాని, వాటిని వివరించ డానికి స్థలాభావం వల్ల ఇక్కడ సాధ్యం కాదు.

6.5 పిండితార్థంగా, సాహిత్య చరిత్ర శాస్త్ర స్వభావ మంటే ఏమిటో తెలిసి, వెలువడ్డ సాహిత్య చరిత్రలు భారతీయ సాహిత్యంలో బాహు విరళం. కృష్ణ చైతన్య

ఆంగ్లంలో రచించిన మలయాళ సాహిత్య చరిత్ర, ఎస్.కె. దాస్ గారి హిస్టరీ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ (సాహిత్య అకాడమీ) ప్రాజెక్టులో భాగంగా వెలువడ్డ రెండు (8,9) భాగాలు వంటివి కొద్దిమాత్రమే towards a literary history of India అనే చిన్న గ్రంథంలో భారతీయ సాహిత్య చరిత్రలో ఉత్పన్నమయ్యే కొన్ని ముఖ్య సమస్యలను చక్కగా సుజిత్ ముఖర్జీగారు ఆవిష్కరించారు. ఆ సమస్యలను అనుశీలించి మాదిరి ప్రాయంగా నైనా ఉపకరించే చక్కటి సమగ్ర చరిత్ర ఇంకా రావలసి ఉంది. దాస్‌గారి పై రచన ఆ లోటును కొంత దాకా తీర్చింది.

6.6 చివరగా ట్రెవల్యాన్ (Trevelyan) అనే సుప్రసిద్ధ బ్రిటిష్ చరిత్రకారుడు తన 'Social history of England'లో 'సాహిత్య నాగరకత' (Literary civilisation) జాతి నాగరకతలోని అనేక భాగాల్లో ముఖ్యమైన ఓ భాగం విశిష్టతనుగురించి వివరిస్తూ సాహిత్యచరిత్ర మహత్తతను తెలిపే మాటలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. "The whole civilisation of a people, their intellectual, moral and spiritual image as it is determined by their social and political background is reflected more in their literature than in any other activity"

పై మాటల్లోని అంతస్సత్యాన్ని పట్టుకొని నిరూపించేదే అసలైన సాహిత్య చరిత్ర. ఎలా నిరూపించి చెప్పాలో తెలిపేది సాహిత్య చరిత్ర శాస్త్రం.

"కాపుబిడ్డ" కావ్య సౌందర్యం

డా. పేర్వారం జగన్నాథం

తెలుగులో రైతును కావ్య నాయకునిగా చేసుకొని వచ్చిన కావ్యాలు చాలా తక్కువ. పాశ్చాత్య దేశాల్లో మాత్రం రైతులు ఇంకా తదితర గ్రామీణ వృత్తుల వారి జీవిత విశేషాల్ని వర్ణిస్తూ పెక్కుకావ్యాలు వచ్చినట్లు వింటున్నాం. ఐతే దువ్వూరి రామిరెడ్డిగారు "కృషీవలుడు" అనే లఘుకావ్యాన్ని 1919లో ప్రచురించినారు. అప్పటికే మన తెలుగులో నవ్య కవిత్వం ప్రారంభమైంది. తెలుగులో కాపును కావ్యనాయకునిగా చేసుకొని వచ్చిన మొదటి కావ్యంగా దీన్ని చెప్పవచ్చు. దీనికి ఉపోద్ఘాతం రాస్తూ కట్టమంచి రామలింగారెడ్డిగారు - "ఆంధ్ర వాఙ్మయమున ప్రకృతము ప్రసిద్ధికి వచ్చుచుండెడు గణ్యములగు నూతన సృష్టులలో నీ కావ్యమొకటి . విషయమందును, భావములందును ఇయ్యది మన దేశముయొక్క నవజీవితమునకు జేరినది....కృషీవలుల జీవితమును ప్రధానాంశముగ గ్రహించిన తెలుగు గ్రంథములలో నిది మొదటిది" అంటూ శ్లాఘించినారు. ఇందులో కోడి కూతతో మేల్కొని తిరిగి రాత్రి పరుండే దాకా విస్తరించిన కర్షకుని వ్యావసాయిక వృత్తిధర్మాన్ని రామిరెడ్డిగారు మనోహరంగా వర్ణించినారు. ఐతే ఇందులో కథేమీ ఉండదు. దీని తరువాత చెప్పుకోదగిన కావ్యం గంగుల శాయి రెడ్డిగారి "కాపుబిడ్డ". దీన్ని కవి 1937లో మొదటిసారిగా వెలువరించినారు. ఇందులోనూ కథ ఉండదు. దీనికిన్ని కట్టమంచివారు "కవిత్వము బహు బాగుగానున్నది. విషయము ఉత్తమోత్తమము" అంటూ తమ అభిప్రాయం వెలి బుచ్చినారు. సురవరం ప్రతాపరెడ్డిగారు దీనికి పరిచయవాక్యములు రాస్తూ "పూర్వ కవులకు రాజులతో రాణులతో కాలము గడచెను. ఇప్పటికవులకు యెంకమ్మలతో బుచ్చమ్మ లతో, చింతామణులతో కాలము గడచుచున్నది. కాని దేశమునకు, తత్సౌభాగ్యమునకును, శరీరమునకు వెన్నెముకల వంటి వారగు కాపువారల ముచ్చట్లు, ఎవ్వరికిని కాబట్టవు. కాపు స్త్రీల కష్టములనైన తెలిసికొను శ్రమ యెవ్వరికిని గలుగ లేదు" అంటూ కొనియాడినారు. ఆ తరువాత వానమామలై జగన్నాథాచార్యుల రైతు రామాయణం (1980) ఎన్నదగింది. ఇందులో కవి రామాయణకథకు సమాంతరంగా రైతుకథను వర్ణించి నాడు. అట్లాగే తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారూ, పల్లా దుర్గయ్యగారూ కాపుల కడగండ్లను దయ నీయంగా వర్ణిస్తూ కొన్ని ఖండికలు రచించినారు.

గంగుల శాయిరెడ్డి గారు స్వయంగా కృషీవలుడు. అటు హలం పట్టినాడు. ఇటు కలం పట్టినాడు. హలం పట్టినా, కలం పట్టినా నిరాడంబరంగా జీవించినాడు. ఈ విషయంలో ఆయనకు బమ్మెర పోతన మార్గదర్శి. ఆయన కవిత్వంలోనూ పోతన ఛాయలు కనిపిస్తుంటాయి. శాయిరెడ్డిగారు జీవించిన జీడికల్లు ప్రాంతంకూడ పోతన స్వస్థలమైన బమ్మెరకు అనతి దూరంలో ఉంటుంది. జీడికల్లులో సుప్రసిద్ధ రామాలయమున్నది. బమ్మెర శివారు గ్రామమే పాలకుర్తి. ఇది పాల్కురికి సోమనాథుని కన్న పవిత్ర శైవ క్షేత్రం. ఈ గ్రామాలన్నీ పూర్వపు జనగామ తాలూకా లోనివి. అదేమి విచిత్రమో కాని ఈ ప్రాంతం కవులకు రాజుల నాశ్రయించే అలవాటు లేదు. ఆ ఆచారానికి వాళ్ళు దూరంగా వున్నారు. శాయిరెడ్డిగారు వేషభాషల్లో అచ్చమైన పల్లెటూరి రైతుగా కనిపించేవాడు. ఆయన కవిత్వమెంతటి సరళసుందరమో, హృదయమంతటి స్ఫటిక సదృశమైంది. వక్రత ఆయన కవిత్వంలో ఉంటుంది కానీ మాటలో మన్ననలో సూటిదన ముంటుంది.

గంగుల శాయిరెడ్డిగారు వరంగల్లు జిల్లా రామచంద్ర గూడెంలో 1890లో జన్మించినారు. చిన్నతనంలో ప్రాచీన కావ్యాల్ని శ్రద్ధగా అధ్యయనం చేసినారు. ఆర్య సమాజం, స్టేట్ కాంగ్రెస్, ఆంధ్ర మహాసభల్లో చురుగ్గా పాల్గొనేవారు. నిజాంకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో

పాల్గొని జైలుకుకూడ వెళ్ళినారు. చివరికి జీడికల్లులో స్థిరపడి అక్కడి రామాలయ అభివృద్ధికి ఎన్నో విధాలుగా కృషి చేసినారు. కొన్నాళ్ళు జీడికల్లులో సంస్కృత పాఠశాలలు నిర్వహించినారు. పేద విద్యార్థులకోసం వసతి గృహాన్ని నెలకొల్పినారు. వయోజనుల కోసం కొన్ని వాచకాల్ని కూడ రచించినారు. ఆంధ్ర సారస్వత పరిషత్తులో సభ్యులై సాహిత్య కార్యక్రమాల్ని చేపట్టినారు. ఇట్లా అనేక రంగాల్లో శాయిరెడ్డిగారు తమ సేవలనందించి చివరికి 1975లో పరమపదించినారు.

ఇక ప్రస్తుత కావ్యం "కాపుబిడ్డ" గూర్చి పరిశీలిద్దాం. ఇందులో మొత్తం 148 పద్యాలున్నాయి. ఇవన్నీ దేశీయ ఛందస్సులో ఉండడం గమనార్హం. అట్లాగే శాయిరెడ్డిగారి వేషభాషలుకూడ సీదాసాదాగా దేశీయమైనవే ఉంటాయి. ఇది ఏకాశ్వాస లఘు కావ్యమే అయినా మధ్య మధ్య కవి వివిధ శీర్షికలుంచి కాపు వ్యావసాయిక జీవితాన్ని వర్ణించి నాడు. కావ్యం సంప్రదాయబద్ధంగా 'శ్రీ'తో ప్రారంభమై మంగళాశీస్సులతో ముగుస్తుంది. శ్రీలక్ష్మీ దేవి పదముల నొత్తుతుండగా, సర్పశయనుడై, నవ్వుతూ కృపాళుడై ఉన్న శ్రీమన్నారాయణుని గొల్తునని ఇష్టదేవతా స్తుతితో కవి కావ్యాన్ని ప్రారంభించినాడు. ఈకావ్యాన్ని చదువుతుంటే ఆధునిక నాగరికత సోకని ఏదో ఒక మారు మూలలో ఉన్న పల్లెటూరులో తిరుగాడిన అనుభూతి కలుగుతుంది. సందర్భాన్ని బట్టి అక్కడక్కడ ఆయా ఋతువుల్ని వర్ణించినాడు. గ్రామీణ జీవితాన్నీ, పల్లెటూరి వాతా వారణాన్నీ బాగా ఆకళింపుచేసుకున్నవాడు కనుక కర్షకుల కడగండ్లను కన్నులకు కట్టేటట్లుగా వర్ణించినాడు. ఇష్ట దేవతా స్తుతి తరువాత పద్యంలో శాయిరెడ్డిగారు నాగలిని స్తుతిస్తున్నాడు. ఆ తరువాత మరొక పద్యంలో వ్యావసాయకపు పనిముట్లను పేరు పేరునా పేర్కొని వాటిని పూజిస్తున్నానంటున్నాడు. ఇట్లా నాగలినీ, వ్యావసాయిక పనిముట్లనూ ఇంతవరకూ ఏ కవీ స్తుతించిన జాడలేదు. ఇది శాయిరెడ్డి గారి ప్రత్యేకత. కర్షకులపైన ఆయనకున్న ఆదరాభిమానాలు అంతటివి. ఆ పద్యాన్ని ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

గొడ్డలి, గుద్దలి, కొడవలి, పాఱల
దంతెల కాడిని త్రాళ్ళకట్టి
జడ్డి గంబును గొట్టు నడ్డ గుంటుకలను
పలుగుల పొన్నుల నెలుగు పీట
గడ్డ పాఱను కొండి కట్టుల జిమ్మట
కీలుకత్తిని తలకోల గుదల
కొమిరెల కదురుల కొక్కుల బిల్లను
కందెన కొమ్మును కమ్మకత్తి
బండి పానక రాగోలల ప్రణుతి జేసి
యెద్దు కొమ్ములు వృక్షాదు లింపు సొంపు
జాజు సున్నము కట్ల చే పూజజేసి
హోలికుల చర్యలం గూర్చి యభినుతింతు

ఇందులో ఉదాహరించిన పనిముట్లలో మనకు కొన్నింటికి అర్థం తెలియదు. ఇవి నిఘంటువుల్లోకి ఎక్కినవో లేదో! వీటిలో కొన్నింటికి బొమ్మలు వేసి చూపితే కాని అర్థంకానివి ఉన్నాయి. ఇటువంటి పదాల్ని, భాషా వేత్తలు భద్రపరచ వలసి ఉంటుంది.

వ్యవసాయపు పనుల్లో భర్తలకు భార్యలెట్లా చేదోడు వాదోడుగా ఉండి సహకరిస్తుంటారో మరొక పద్యంలో కవి ఇట్లా వర్ణిస్తాడు.

దట్టంపు చెట్టుల కొట్టి కుప్పలు వేయ
నారాసులను గొల్వనతివవచ్చు
మిట్టపుట్టల ద్రవ్వి మట్టంబు సేయగా
పుర్వు బుట్రల జంపబోటివచ్చు
మదపు టెద్దుల గట్టి యదను పైదున్నగా
విత్త నంబుల వేయవెలది వచ్చు
పైరుచుట్టు వెలుగు పలుమారు బెట్టగా
గడ్డి గాదము దీయ కాంతవచ్చు.
ఇతర కార్యాదులను భర్త వెతికి సేయ
మంచెపై నెక్కి గాచు నాచంచలాక్షి
పంటబండించి క్రమముగా బంచిపెట్టు
దంపతుల బూల బూజించి దండమిడుదు.

ఇందులో ఆదర్శదాంపత్య భావాన్ని కవి ప్రదర్శిస్తున్నాడు. భార్యాభర్తల పరస్పర సహకారంతోనే వ్యవసాయాభివృద్ధీ, తద్వారా దేశీయాభివృద్ధీ జరుగుతుందనేది ఇందులోని ధ్వని. ఈ పద్యంలో మరో విశేషం కూడా ఉన్నది. ఒక చపలాక్షి మంచెనెక్కి చేనుపై పక్షులు వాలకుండా చూస్తున్నదట. మంచెపై నెక్కినవాళ్ళు నలు వైపులా కనులార్పకుండా చూస్తుండాలి. ఇక్కడ కవి సందర్భోచితంగా చపలాక్షి అనే పదాన్ని ప్రయోగించాడు.

మరో పద్యంలో శాయిరెడ్డిగారు రైతులను మౌనులు, తాపసులు, సంయములు, యతులతో పోలు స్తున్నాడు. ఇంతటి ఉదాత్తంగా రైతును సంయమీంద్రు లతో పోలుస్తూ వర్ణించిన కవి తెలుగులో మరొకడులేడు. ఇద్దరి ప్రవృత్తు ల్లోనూ ధార్మిక దృష్టి ఉంటుందనేది ఇందులోని ధ్వని. ఆ పద్యం -

పనియున్న లేకున్న బ్రాహ్మీముహూర్తాన
తప్పక లేచెడి తాపసేంద్ర
తెలిసియో తెలియకో దినమునకొక సారి
తానంబు చేసెడి మౌనిచంద్ర
ఉండియోలేక నోయుత్త మాహారంబు
చక్కగా గుడి చెడి సంయ మీంద్ర
వచ్చియో రాకనో వదరుబోతువుగాక
మిత భాషితము సేయుయతి కులేంద్ర
కుటిల నటనముగర్వము కొంటెతనము
వన్నె చిన్నెలు లేని సద్వర్తనుడవు
ఈగి యందనురాగివో యోగిచంద్ర
కర్షకా చేతులెత్తి నే గౌరవింతు

సమాజంలో రైతుకు అత్యున్నతమైన స్థానం ఉన్నదన్నది దీనిలోని ధ్వని.

మరొక పద్యంలో కవి అడవుల్లో దొరికే వివిధ రకాలైన కాయలు పండ్లను వర్ణిస్తాడు. ఇందులోనూ కొన్నింటిని మనం గుర్తించడం చాలా కష్టం. వాటిగూర్చి మళ్ళీ రైతులే వివరించాలి. వీటిని కూడ నిఘంటువుల్లోకి ఎక్కించవలసి ఉంటుంది. ఆ పని భాషావేత్తలు చేయాలి. చివరగా ఒక విషయం. ఒక చోట కవి చెప్పిన -

కొను బంధించి జనసేవ బూనడేని
జిహ్వచే నొరుపాట్లను జెప్పడేని
యర్లు నిష్పాక్షికంబుగా నమరదేని
పుట్టనేటికి భారమై భూమిపైన

అనే పద్యం పోతన చెప్పిన "నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని" అనే పద్యాన్ని తలపింపజేస్తున్నది. శాయిరెడ్డి గారు పోతన భాగవతాన్ని బాగా అధ్యయనం చేసినాడని ఊహించవచ్చు.

ఇట్లా గంగుల శాయిరెడ్డి "కాపుబిడ్డ" కావ్యాన్ని భాషాడంబరం లేకుండా, సహజ కవిత్వం ఉట్టిపడేట్లుగా సరళ సుందరంగా వర్ణించినాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవాల సందర్భంగా కవిగారికి నా కైమోడ్పులు.

'కీర్తనీయ చరిత కృష్ణశర్మ'

డా. మృణాళిని

ఆధునిక తెలుగు కళా రంగంలో గొప్ప సాహిత్య వేత్తలు ఉన్నారు. అత్యున్నత స్థాయి విమర్శకులూ ఉన్నారు. అనమానులైన అనువాదకులున్నారు. బహుభాషా కోవిదులూ ఉన్నారు. సంగీతశాస్త్రం ఎరిగిన వారూ ఉన్నారు. వాగ్గేయకారులూ ఉన్నారు. కానీ పైన చెప్పిన అన్నింటినీ తనలోనే ఇముడ్చుకున్న వాళ్ళు చాలా అరుదు. అరుదైన ప్రతిభ కలిగి, వాటన్నిటికీ మించిన వ్యక్తిత్వం కలిగిన మహనీయులు శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ. అతి తక్కువ రచనలతోనే, అత్యధిక ప్రభావాన్ని సాహిత్యంపై ప్రసరింపజేసి, తన ముద్రను సుస్థాపితం చేసిన మహానుభావుడు రాళ్ళపల్లి. ఆయన రాసింది చాలాకొన్ని. రాయగలిగి, రాయకుండా వది లేసినవే అనేకం. అందుకు కారణం శర్మగారి బద్ధకం కాదు; ఆయన విమర్శక కృపాణానికి ఆయన రచనలు కూడా మినహాయింపు కాదు; అందుకే తను రాసిన చాలా రచనలను ఆయనే తిరస్కరించి, అచ్చుకు కూడా పంపలేదని ఆయన సన్నిహితులైన వారికి తెలుసు. ఆయనలోని ఈ పరిపూర్ణత్వ ఆకాంక్షవల్లే ఆయన చాలా తక్కువ రచనలు చేశారు. తన ఇంటికి వచ్చిన పండి తులతో చర్చిస్తున్నపుడు, విద్యార్థులకు వివరిస్తున్నపుడు, గ్రంథ పఠనంలో భాగంగా పుస్తకంపై వ్యాఖ్యలు రాస్తున్నపుడు జాగ్రత్తగా గమనించినవారు, ఆయన తన ప్రతిభకు, పాండిత్యానికి తగినన్ని రచనలు ఏ కోశానా చేయలేదని గుర్తించారు.

1893 జనవరి 23న జన్మించి, 1979 మార్చి, 15న దివంగతులైన శర్మగారు పరిపూర్ణ జీవి. తన జీవితంలో తృప్తినీ, ఆనందాన్నే తప్ప, అసంతృప్తిని, నిరాశను ఏనాడూ దగ్గరికి రానివ్వని పూర్ణ పురుషుడాయన. అనంతపురం జిల్లా, కల్యాణ దుర్గం తాలూకా రాళ్ళపల్లిలో, కర్ణ మడకల కృష్ణమాచార్యులు, అలిమేలు మంగమ్మలకు జన్మించిన శర్మగారు, అమ్మమ్మ లక్ష్మమ్మకు దత్తత పోవడంవల్ల, రాళ్ళపల్లి ఇంటి పేరు అయింది. అది జగద్విదితం అయింది. చిన్నప్పుడు తండ్రే గురువుగా సంస్కృత తెలుగు సాహిత్యాలు చదువుకున్న ఆయన కట్టమంచి రామలింగారెడ్డి సాహచర్యంతో ఆంగ్ల భాష, ఆధునిక దృక్పథాలతో పరిచయం పెంచుకుని తన ఆలోచనా పరిధిని విస్తృతం చేసుకున్నారు. రాళ్ళపల్లి వారి రచనల్లో కావ్యాలు (తారాబాయి, మీరాబాయి, శ్రీమహిశూర రాజాభ్యుదయాదర్శః) ఉన్నాయి; అనువాదాలు (శాలివాహన గాథాసప్తశతీ సారము, నృత్త రత్నావళి, సుందర పాండ్య విరచిత ఆర్యా) ఉన్నాయి. విమర్శనా గ్రంథాలు (వేమన సారస్వతోపన్యాసములు, సారస్వతా లోకము, నాటకోపన్యాసములు, గానకలె, సాహిత్య మత్తు జీవన కలె) ఉన్నాయి. పరిష్కరణలు (తాళ్ళపాక సంకీర్తనలు, శ్రీమదాంధ్ర మహాభాగవతము, పాండురంగమాహాత్మ్యము) ఉన్నాయి. ఇవి కాక అధిక సంఖ్యలో అత్యంత ప్రామాణికాలయిన పీఠికలు, వ్యాసాలు ఉన్నాయి. ఇవి సంగీతం పైనా, సాహిత్యం పైనా కూడా వచ్చినవి. దాదాపు 38 ఏళ్ళు మైసూరులో తెలుగు పండిత పదవిని నిర్వహిస్తున్నపుడే రాళ్ళపల్లివారు తమ రచనలన్నీ చేశారు.

విమర్శ చేసినా, అనువాదం చేసినా రాళ్ళపల్లివారిది ప్రత్యేకమైన శైలి. విమర్శలోని వివిధ భాగాలైన పాఠ్య విమర్శ (Textual criticism), సామాజిక విమర్శ, (sociological criticism) చారిత్రక విమర్శ (historical criticism), తులనాత్మక విమర్శ (Comparative criticism), కళా సౌందర్య విమర్శ(aesthetic criticism) అన్నీ, తను రాసిన రెండు, మూడు పుస్తకాల్లోనే అసాధారణ రీతిలో చేపట్టడం శర్మగారి విమర్శనావైదుష్యానికి నిదర్శనం. తెలుగు వారిలో మొదటి biographical విమర్శనా గ్రంథం రాసింది బహుశా వీరేనేమో. అందరూ నడిచిన బాటను నడిచిన బాటసారి కాదు శర్మగారు. తన స్వంత గొంతును వినిపించిన సృజన జీవి. అందుకే, వేమన పైనా, అన్నమయ్య పైనా, రాయలనాటి సాహిత్యం పైనా, తెలుగు నాటకాల పైనా, మరీ ముఖ్యంగా నిగమశర్మ అక్క పైనా

ఆ తర్వాత ఎందరు ఎన్ని గ్రంథాలు రాసినా, రాళ్ళపల్లి వారిని ఉటంకించక తప్పలేదు. ఆయనతో విభేదించిన వారు కూడా ఆయన తర్క బుద్ధికీ, శాస్త్రీయ పరిశోధనా విధానానికీ, నిష్పాక్షిక వైఖరికీ, సహృదయతకూ తలవంచక తప్పలేదు. 'వేమన కవిత్వము గాలి వంటిది, అది చూడని చోటు లేదు, దొరకని తావు లేదు. కావుననే యందరును నుపయోగింపక తీరదైనను అతనిని పిలిచి మహాకవియని మర్యాద చేయుట కెవరికిని కాబట్టక పోయినది' అని అంటూ వేమనను మొదటిసారి మహాకవి అన్నది శర్మగారే. ఈనాడు వేమనకు ఎంత ఉన్నత స్థానం ఇస్తున్నామో మనకు తెలుసు. దానికి బీజం నాటింది బ్రౌను దొర అయినా, వేమనపై విస్తృత పరిశోధన జరగడానికి ప్రేరణ ఇచ్చింది మాత్రం రాళ్ళపల్లి వారే. అన్నమయ్య విషయంలోనూ ఇది నిజమే. ఆయన పరిష్కరించి, రాగాలు ప్రకటించిన 108ని అనుసరించే తక్కినవారు అన్నమయ్య పాటలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళారు. స్వయంగా శర్మగారు అన్నమయ్య కీర్తనలు పాడగా విన్నవారు ఆయనే అన్నమయ్య అవతారమని అనడం అందరికీ తెలిసిందే.

వేమన, అన్నమయ్యలను తెలుగువారికి సుపరిచితుల్ని చేసిన ఘనత రాళ్ళపల్లి వారికే దక్కుతుంది. అతి తక్కువ విషయాలపై అతి కొద్దిగా రాసినప్పటికీ, శర్మ గారిని ఆధునిక విమర్శకులలో తొలి పంక్తిలో నిలిచే వారిగా పండితులు, సాహిత్య చరిత్రకారులు పరిగణించడానికి కారణాలు ఆలోచించవలసి ఉంది. తిమ్మావఝుల కోదండ రామయ్యగారు, శర్మగారి విమర్శ వ్యక్తిత్వాన్ని వర్ణిస్తూ, మనన శీలత, సమదర్శిత, శిల్పదృష్టి, నిర్భీకత, కవితోడి ఆత్మీయతా భావము ఆయనలో ఉన్నాయని చెప్పారు. ఇది అక్షరాలా నిజం. కవి అంతరంగంలోకి తొంగి చూడగల ప్రతిభ, అసాధారణమైన వ్యాస రచనా శైలి శర్మగారి విమర్శకు ఉన్నత స్థాయిని కల్పించాయి. విమర్శకుడి అభివ్యక్తి ఎలా ఉండాలన్నదానికి శర్మగారిని పరమ తార్కాణంగా చెప్పవచ్చు. కవి పట్ల ఆదరం, కావ్యంపట్ల సహృదయత, లోపాలను సున్నితంగా, వ్యంగ్యంగా చెప్పగల లాలిత్యం, అలతి వాక్యాలతో చెప్తున్నా, ప్రతి పదం వెనకా అవ్యక్తంగా ఉన్న లోతులు, కవి నివ్యష్టిగా కాక, ఒక సామాజిక సందర్భంలో చూడాలన్న అవగాహన - శర్మగారి విమర్శ లక్షణాలు. ఈ లక్షణాలు ఏ కాలంలోనైనా, సద్విమర్శకుడికి అవసరమే. అందుకే రాళ్ళపల్లి వారి విమర్శ మూడు గ్రంథాలకే పరిమితమైనా, వాటి లోతులు తరగనివి. భావ, వస్తు, రచనల్లో భావానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన విమర్శకుడిగా, అభిరుచి విమర్శకుడిగా పండితులు పేర్కొన్న రాళ్ళపల్లి వారు తన విమర్శలో అన్నిటి కంటే ఔచిత్యానికి పెద్దపీట వేశారు. 'రసమేది ఐనను మనము సహజముగా నేర్పరచుకున్న నీతి, ధర్మము, ఆనురూప్యము, సౌమనస్యము మొదలగు హద్దులను మీరిపోయినచో దాని ఫలమగు ఆనందమును మనమనుభవింపజాలము' (నాటకోపన్యాసములు) అనడంలో ఆయన ఔచిత్యం అన్నిటికంటే ముఖ్యమని భావించినట్లు స్పష్టం.

విమర్శకులకే కాదు; అనువాదకులకు కూడా ఆయన ఆదర్శప్రాయుడే. సంస్కృతం, ప్రాకృతం, కన్నడం, తమిళం, తెలుగు, ఆంగ్ల భాషల్లో పాండిత్యం ఉన్న ఈ విద్వాంసుడు అనువాద ప్రక్రియకే వన్నె తెచ్చారు. ముఖ్యంగా హాలుని గాథాసప్త శతి అనువాదం ఈనాటికీ ఒక ప్రామాణిక అనువాద గ్రంథంగా పరిగణింపబడుతూ ఉంది. మూలానికి అన్యాయం చేయకుండ, విధేయంగా ఉంటూనే,అనువాదంలో తెలుగుదనం తెచ్చి, 'గాథ' ను ఒక రమణీయ కావ్యంగా తీర్చిదిద్దారని పండితులు ప్రశంసించిన అనువాదమిది.

శర్మగారి అనువాద శైలికి ఉదాహరణ :

'రూపన్న రెడ్డి కూతురి
రూపే యగు గాని యొరుల రూపును రూపే
ఆ పల్లెవారు వేలుపు
లైపోయిరి దాని రెప్పలార్పక కనుచున్'

శర్మగారి అభిప్రాయాలతో ఏకీభవించని వారు సైతం వారి వచన రచనా శైలికి ముగ్ధులు కావడం అందరికీ తెలిసిందే. అందులోని చేవ, జీవం,హాస్యం, లోతు అనితర సాధ్యమైనవి. ఆప్తుడైన కట్టమంచివారితో, రంగనాథ రామాయణ కర్తృత్వం గురించి అభిప్రాయ

భేదం వచ్చినపుడు ఆయనరాసిన వాక్యాలు సుప్రసిద్ధాలు.

'వారి శక్తి యుక్తులు గౌరవించినంత హార్దముగా వారి అభిప్రాయములను అంగీకరించుట నావంటి వారికి పలుమారు గల్గు భాగ్యముకాదు. అవి చాలమట్టుకు అపూర్వములు, స్వచ్ఛందములు, విప్లవాకములు'.అతి తక్కువ పదాలలో గొప్ప అర్థాన్ని అందించడం వారి ప్రత్యేకత. ఒక అధ్యక్షోపన్యాసంలో 'తత్త్వము విచారించితి మేని చాదస్తముల యంతస్తును దాటి లోతుకు దిగి చూడగల్గుటయే ఉత్తమ సంస్కారమునకు గుర్తు. అట్లు చేయలేనిది వట్టి పైపూత' అన్నారు. అటువంటిదే మరొకటి - ' ఒకవస్తువునందలి భిన్న భిన్న భాగముల ఏర్పాటు శాస్త్రము. భిన్న పదార్థములనొక చోట జేర్చి చేయు కూర్పు కళ', 'తర్కము నోరు మూయును;కానీ హృదయమును మూయజాలదు'. ఇలాంటివెన్నెన్నో . బహుశా ఆయన వచనాన్ని, ఆయన పాండిత్యాన్ని తెలుగువారి కంటే కన్నడిగులే సరిగా అర్థంచేసుకున్నారనీ, అభినందించారనీ అంటే అతిశయోక్తి కాదు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత యు.ఆర్. అనంతమూర్తి, ఈ వ్యాస కర్తతో 'రాళ్ళపల్లి వారి కన్నడ రచన శైలినుంచి నా వంటి వారెందరో అందమైన వచనం రాయడం నేర్చుకున్నాం' అని చెప్పారంటే, వారికి ఆ భాషపై ఉన్న అధికారం, వారికి ఆ దేశంలో లభించిన ఆదరణ అర్థమవుతాయి.

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారుఎంతటి సాహిత్య పారంగతులో అంతటి సంగీత విద్వాంసులన్నది తెలిసినదే. సాహిత్య ప్రియులు ఆయనను తమ వాడి గానూ, సంగీతజ్ఞులు తమవాడిగానూ చెప్పుకోవడం మామూలే. ఆయన అన్నమయ్య గురించి, త్యాగయ్య గురించి చేసిన విశ్లేషణ సంగీత సాహిత్యాల సంబంధం గురించి ఆయన విశేష పరిజ్ఞానానికి తార్కాణాలు. స్వయంగా వాగ్గేయకారుడు. దాదాపు 20 కృతులవరకూ రచించి, స్వరపరిచారు. రెండు తప్ప తక్కినవన్నీ సంస్కృతంలో రాసినవే. హిందోళ రాగంలోని 'మహాదేవి దరహాస కలయాం'కృతిని విని తను ఎంత పరవశుడైనదీ శ్రీపాద పినాకపాణి గారు ఒకచోట చెప్పారు. అలాగే ఒకసారి శర్మగారు ఒక్కరూ కూర్చుని త్యాగయ్యకృతి 'తెరతీయగరాదా' విన్నపుడు తన మనసులో ఎలాంటి భావోద్వేగం కలిగినదీ సుదీర్ఘంగా వివరిస్తూ ఇలా ముగిస్తారు ప్రసిద్ధ కన్నడసాహితీవేత్త వి. సీతారామయ్య గారు 'ఆనాడు త్యాగయ్యగారు -ఈనాడు శర్మగారు ....ఆనాటి వారి పాట నా జీవితంలో గొప్ప అనుభూతిగా నిలిచిపోయింది. ఈ యాభై ఏళ్ళలో ఎన్నో మార్లు నెమరు వేసికొని నన్ను నేనే మరచిపోయాను. ఆ పాటలోని ప్రతి చరణమూ కవితగా, కృతిగా, సంగీతంగా కృతార్థ మైనట్లుగా అనిపించింది' (అనంత రాగం. పుట 131). అన్నమయ్య కృతులకు గాయకులు ఇష్టం వచ్చినట్లు రాగం మార్చుకుంటారని శర్మగారు ఏనాడో ఊహించారు. (ఈ రోజుల్లో ఎవరి ఇష్టం ఇచ్చినట్లు వారు అన్నమయ్య కీర్తనలు పాడడం మనం చూస్తూనే ఉన్నాం). దాని గురించి ఇలా అంటారు 'నేటి కొత్త రేపటికి ప్రాతగా మారక తీరదు. ఇంతే కాదు. కర్త యుపయోగించిన పదములు భావములును ప్రాత పడినట్లు మనకు తోపవచ్చును గదా. అప్పుడు వానిని గూడ మన రుచికి దగినట్లు మార్చుటకు పూను కొంటిమేని మన నవ్యప్రియత్వపు దెబ్బకే ప్రాచీన మహాకవియును తట్టు కోలేడు'

రాళ్ళపల్లి వారిని కొన్ని పదవులు వరించాయి. కానీ వాటిపై ఆయనకు ఏ పాటి కోరికా, శ్రద్ధా లేవు. నిజానికి ఆయన వ్యక్తిత్వంలోని ప్రధానమైన గుణాలు వినయం, కీర్తి, కనకాలను ఆశించకపోవడం. లేకుంటే , ఈనాటికీ వాడుకలో ఉన్న 'ఆకాశవాణి', 'శిశువిహార్' వంటి పేర్లను తనే పెట్టినట్టు ఆయన బాగా ప్రచారం చేసుకోక పోయారా? రవీంద్రుడి ఎదుట కూర్చుని ఆయన చదువు తూండగా 'జనగణమన' రాసుకుని వెంటనే పాడేసి ఆ విశ్వకవినే మెప్పించానని చెప్పుకోకపోయారా? బాల్యం నుంచీ, ఏ విషయాన్నయినా ఒక్కసారి వింటే పట్టుకునే ఏకసంథా గ్రాహిత్వాన్ని ప్రకటించుకోక పోయారా? తనలో ఎంత ప్రతిభ ఉన్నా ఏమీ లేనట్లు భావించేవారు. ప్రచారానికీ, ఆర్భాటానికీ చాలా దూరంగా ఉండేవారు. చివరికి సంగీతంలో నిష్ణాతులైన తన పిల్లలను (ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు) కూడ తన కీర్తనల

గురించి ప్రపంచానికి చెప్పమని అడగలేదు. (ఇటీవలే వారి పెద్ద కుమారుడు, రాళ్ళపల్లి ఫణిశాయి తండ్రిగారి కృతులను కన్నడ లిపిలో మట్టుతో సహా ప్రచురించి సంగీత ప్రియులకు అందుబాటులోకి తీసుకు వచ్చారు) అందరినీ గౌరవించడం, ఎవ్వరినీ ద్వేషించకపోవడం, కించపరచకపోవడం, భగవంతుడిపట్ల శరణాగతి ప్రకటన తప్ప, ఏ కోరికా కోరకపోవడం, తన బాధలు, సమస్యలు ఎవరికి భారం చేయకపోవడం- ఇలాంటి గుణాలవల్ల ఆయన అన్ని వయసుల వారికీ ప్రేమాస్పదుడూ, వందనీయుడూ అయ్యారు. సంస్కరణ అన్నది ఉద్యమాలనుంచే కాదు, హృదయసంస్కారం నుంచి జనిస్తుందని నిరూపించారు శర్మగారు. అందుకే తన కుటుంబంలోని బాలవితంతువుకు సంగీతం నేర్పి, దాని ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యం కలిగే మార్గం చూపడమే కాక, స్త్రీలు ఎవరి మీదా ఆధారపడే పరిస్థితి ఉండకూడదని చెప్పేవారు.

ఆయన అన్నివేళలా శిష్యులకు పాఠం చెప్పేవారు. చదువు, సంగీత శిక్షణల్లో మాత్రం ఏ కొంచెం రాజీ ధోరణి చూపేవారు కాదు. సంగీతంలోగాని, జీవితంలో గాని అపశ్రుతిని ఆయన సహించలేకపోయేవారు. శ్రుతి శుభగత్వం ఆయన వాచికంలోనూ, జీవన శైలిలోనూ, ప్రవర్తనలోనూ ప్రస్ఫుటంగా కనిపించిన లక్షణం. అందుకే ఆయనకు చేరువగా వచ్చిన వారందరూ ఆ సుస్వర వాతావరణంలో పునీతులై బయటకు వచ్చేవారు. అందుకే, ఆయనను ఒక్కసారి చూసినవారు కూడా మరువలేక పోయేవారు. ఆయన రూప సౌందర్యం,వ్యక్తిత్వ వైభవం అటువంటివి.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి గురించి, మరో మహామనిషి, కీర్తి శేషులు తిరుమల రామచంద్రగారు అన్న మాటలు అక్షర సత్యాలు.

'బహువాఙ్మయాలలో తలస్పర్శి పాండితి, దాని మీగడ తరగ అనదగిన సహృదయత, దాని బాహిర రూపమనదగిన కమ్మని కవిత, దానికి గమకమైన గాన గరిమ, వాటన్నిటి సమాహారమనదగిన సచ్చరిత్ర పటిమ, దాని ప్రతికృతి అయిన మహితాకృతి, దానిని ప్రతిఫలించే పరిశుద్ధాభి రుచి, దానితో బారలు సాచి స్పర్థించే సదభి వ్యక్తి రాళ్ళపల్లివారి 'అపురూప స్వరూప రేఖలు'. అందుకే అన్నారు చిలుకూరి నారాయణరావు గారు -

"రాళ్ళపల్లిలోన రాళ్లెన్ని పుట్టెనో
రాళ్ళలోన వజ్రాలు పుట్టె
వజ్రాలలోన వలపెట్లు పుట్టెనో
కీర్తనీయచరిత కృష్ణశర్మ"

మనిషిని మలిచేదే సాహిత్యం మనసులు విరిచేది కాదు!

డా. పోరంకి దక్షిణామూర్తి

మనిషి మనసు తీరడానికి సాహిత్యం పుట్టింది.

మనసుపడ్డ మనిషితోనే సాహిత్యం పుట్టింది.

వెలుగూ వెన్నెలా, చెట్టూ గుట్టా, ఊరూ ఏరూ, పువ్వూ నవ్వూ, గాలీ గంధం, పడతీ పరువం అతన్ని ఉర్రూతలూపాయి.

బాధాభయమూ, ఆశానిరాశా, రోగమూ రొష్టూ, చితీ చింతా అతన్ని విలవిల్లాడించాయి.

వావీవరసా, స్నేహమూ సౌహార్దమూ, పండుగా పబ్బమూ, ఆటా మాటా అతనికి ఉల్లాసమిచ్చాయి; పెదవులపై నవ్వులు మొలిపించాయి; 'చతురులు' పలికించాయి.

అతనికి మనసయినదీ, అతని మనసులో మెదిలినదీ - నచ్చినదీ నచ్చనిదీ ఏదయినా - మనసు విప్పినదెల్లా అతను చెప్పుకొంటూ వచ్చాడు; నలుగురికి వినిపిస్తూ వచ్చాడు. అందులో అందాలు చూపించాడు; మనసులు ఉరకలెత్తించాడు; నెత్తురు ఉడుకులెత్తించాడు; కడగండ్లు పలికించాడు; కన్నీళ్ళు కురిపించాడు; కొనకంట మెరిపించాడు; దారులు చూపించాడు.

అతని మనసే పాటయింది; పద్యమయింది; విను విందుల కావ్య బంధమయింది.

నిండుతనంతో నడక పొసగినప్పుడు అది వచనాన్ని రచించింది. ఆకట్టుకొంటూ కట్టినది కథ అయింది. ముద్దు ముచ్చట్లాటకు మూట విప్పింది.

ఇదంతా తెలుసు మనకు. ఇది మనసు అలరిస్తుందనీ తెలుసు. అందుకని దీన్ని సాహిత్య మంటున్నాం. అయినా ఇంతమట్టుకే సాహిత్యమంటే ఒప్పలేం. సాహితీ విహంగానికి ఇదొక్క రెక్క మాత్రమే! అవతలి పక్క మరొకటున్నది కదా! ఒకటి సృజనాత్మక సాహిత్యం, మరొకటి శాస్త్రీయసాహిత్యం. ఒకటి అనుభూతి ప్రధానం; మరొకటి ఆలోచనాత్మకం. విహాయసవిహారానికి రెండు రెక్కలూ అవసరమే. ఇటు గుండెకు హత్తుకొనేదీ కావాలి; అటు బుద్ధికి పదును పెట్టేదీ కావాలి.

సాహిత్యం ఎందుకన్న ప్రశ్నకు ఎన్నడూ తావు లేదు. అయినా దానికి సమాధానముంది. మనిషికి మేలు కోరేదెందుకో మనం సాహిత్యం కోరేది అందుకు!

భగవంతుడిచ్చిన సహజాతాలతో మనుషులే కాదు, జంతువులూ బతుకుతాయి. మనిషి బతుకు వాటి బతుకులాంటిది కాదు మరి! సహజాతాలకే పరిమితమయిపోతే అది జంతుస్థాయిని దాటి పోనూ లేదు; మరి మారాముళ్ళలో చిక్కుపడితే అడుగంటకనూ పోదు.

పరిణామక్రమంలో మనిషికి ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరాలు రెండు-ఒకటి బుద్ధివికాసం; రెండు వాగ్విలాసం. ఈ రెంటినీ పొదువుకున్నది కనకనే సాహిత్యం గొప్పదయింది. సహజాతాలతో పుట్టి పెరుగుతున్న మనిషి సంపూర్ణ ప్రకాశంతో ప్రయోజకుడు కావడానికి ఉపకరించే సాధనం సాహిత్యమే. ఎలాగంటే - సహజాతాల్లో మంచివీ చెడ్డవీ రెండూ ఉన్నాయి. అవి అలాగే నిలిచిపోతే మంది మూకల్లోనే లెక్క. జంతువులు మందలుగా ఉండవచ్చు. మందలు సమాజాలు కావు కదా! మంద ఎలాగున్నా ఏ జంతువూ బాధపడదు. దేని బతుకుదానిదే; దాని వ్యక్తిత్వం దానిదే. కాని, మనిషికి కుటుంబముంది. బంధు మిత్ర బృందాలున్నాయి. చుట్టూ సమాజముంది. సంస్కృతి ఉంది. శాసక కార్యనిర్వాహక, న్యాయపాలక వ్యవస్థలున్నాయి. ప్రభుత్వేతర సంస్థలూ వ్యవస్థలూ ఉన్నాయి. ప్రాదేశిక పరిధిలో జాతీయత ఉంది. వీటన్నిటికీపైన, సర్వమానవ ఏకాత్మకతా భావన సుమేరు శిఖరంలా నిలిచే ఉంటుంది. వీటిని కాదన్న మనిషి బతికి బట్టకట్టలేడు. కాబట్టి అతడు సమష్టికోసం, వ్యష్టిసహజాతాలను కొన్నిటిని వదులుకోక తప్పదు. హింస, పరపీడన, దోపిడి, దురాక్రమణ,

అన్యాయం, అసత్యం, కరడుగట్టిన స్వార్థం, ఈర్ష్య, ద్వేషం, లోభం, మోహం, క్రోధం, ధర్మవిరుద్ధమయిన కామం, దురహంకారం వంటి వాటిని చాలా వరకు అదుపు చేసుకోకనూ తప్పదు. పూర్తిగా విడవగలిగిన - వాడంటూ కనిపిస్తే, తప్పకుండా చేతులెత్తి దండం పెడతాం.

మరొకపక్క -మైత్రి, సానుభూతి, సహకారం దయ, ధర్మం, ధృతి, క్షమ, త్యాగం, శౌర్యం, మర్యాద, మన్నన, ఓర్పు, నేర్పు, ప్రేమ, పరిశ్రమ, ఏకాత్మతాభావన వంటి సద్గుణాలను పనిగట్టుకొని అలవరుచుకోకనూ తప్పదు. మానవజాతి మనుగడకివి తప్పనిసరిగా కావలసిన మౌలిక ధర్మాలు. 'మనం ధర్మాన్ని నిలిపితే అది మనను నిలుపుతుం' దన్న మనువు నిజంగా మహానుభావుడు.

అందుచేత, జంతువుల మాదిరిగా సహజాతాలతో పుట్టిన వ్యక్తి మనిషిగా రూపుదాల్చడానికి అతడు తన వ్యక్తిత్వాన్ని సక్రమంగా మలుచుకోక తప్పదు. ఒక కొయ్యదుంగనో, బండరాతినో ఉలితో చెక్కి, సుత్తి దెబ్బలు పెట్టి సుందర శిల్పంగా తీర్చిదిద్దుతాడు పనివాడు. పనికిరాని భాగాలు తీసేసి పనికివచ్చే భాగాన్ని మంచిగా మలిచినప్పుడే శిల్పం సిద్ధమవుతుంది. మరి, కొయ్యాకాడు, బండాకాడు మనిషి: నోరు మూసుకొని పడి ఉండడానికి. అతన్ని చక్కదిద్దదలచిన 'శిల్పి'కి అతడు అణకువగా ఉండడు; లొంగడు. అయినా, అతడు పదుగురితో కలిసి బతకాలంటే తనను తానే చక్కదిద్దు కోవాలి. తనను తానే అదుపుచేసుకోవాలి. కూడనివి విడవడానికయినా, కావలసినవి అలవరుచుకోడాని కయినా బాధ్యుడు తానే కావాలి. ఇందుకు చేసే ప్రయత్నమే సంస్కారం. మనిషి పుట్టుక పుట్టినవాడు సంస్కారం అలవరుచుకుంటేనే 'సరయిన' మనిషి అవుతాడన్నది కృతనిశ్చయం.

మనిషికి తప్పని సరిగా కావలసిన ఈ సంస్కారాన్ని అలవరిచేది సాహిత్యం. సంస్కారాన్ని అలవరచకపోగా, అతనిలో దుష్టసహజాతాలను రెచ్చగొట్టి పూర్తిగా జంతు ప్రవృత్తికీ రాక్షసప్రవృత్తికీ, ఇంకా కిందికీ దిగజార్చేది సాహిత్యం కాదు. ముమ్మాటికీ కాదు!

మనదేశంలో, మనిషికి సాహిత్యాన్ని కూర్చే సాహిత్యానికి ఎన్నడూ, ఎంతమాత్రం కొదవలేదు. జానపదుల్లో పుట్టిన ప్రక్రియలయినా చదువుసాములు నేర్చినవారి రచనలయినా - ఏ ప్రాంతంలో పుట్టినా, ఏ భాషలో పలికినా - అవి సాహిత్యాన్ని సంపన్నం చేస్తూ వచ్చినవే. సమగ్ర భారతీయ సాహితీ సంపత్తినీ సంస్కృతినీ అన్ని ప్రాంతాల్లో, అన్ని భాషల వారిలో పాదు కొలుపుతూ నిష్కృష్టతలోను, సుశాస్త్రీయ నిర్మాణ వ్యవస్థలోను ప్రపంచమేధావుల ప్రశంసలనందుకొన్న సంస్కృతం అనేక వేలసంవత్సరాలుగా మనకు అనుసంధాన భాషగా మనుగడసాగిస్తూ రావడం మన అదృష్టం.

వేదాలూ ఉపనిషత్తులూ పురాణాలూ ప్రధానంగా ప్రబోధాత్మకాలూ శాసనాత్మకాలూ అయినప్పటికీ వాటికున్న సాహిత్యపు విలువ చాలా గొప్పది. రామాయణం, మహాభారతం, ఇతర కావ్యాలు, నాటకాలు, పంచతంత్ర హితోపదేశకథలూ మొ॥ వి ఉత్తమ సృజనాత్మక సాహిత్య గ్రంథాలుగా విశ్వసాహిత్య వేదిక మీద చిరస్థాయిగా వెలుగొందుతున్నాయి. మనుధర్మ శాస్త్రం, కౌటిల్యుని అర్థశాస్త్రం, భరతుడి నాట్య శాస్త్రం, పతంజలి యోగసూత్రాలు చరకసంహిత, బ్రహ్మసూత్రాలు, వరాహమిహిరుడి బృహత్సంహిత మొ॥వి శాస్త్ర సాహిత్య భండారంగా నిలిచి ఉన్నాయి. ఒకటి రెండు శతాబ్దులకు పూర్వమే, ఇటువంటి మహాగ్రంథాలు కొన్ని అనేక ప్రపంచ భాషల్లోకి అనువాద మయాయి; ఇప్పటికీ మళ్ళీ మళ్ళీ అనువాద మవుతూనూ ఉన్నాయి.

ఆ గ్రంథాల్లో చిత్రించిన పరిస్థితులూ, ఆ కాలాల సమస్యలూ ఈనాడు లేకపోయినా, సమస్యల పరిష్కారాలన్నీ యథాతథంగా ఈనాడు మనకు వర్తించేవి కాకపోయినా సాహిత్య గ్రంథాలుగా వాటికున్న విలువ ఎన్నటికీ తొలగిపోనిది; మరపురానిది. ఏ గ్రంథంలో ఏ భాగం ఎవరికి ఎంత వరకు ఉపాదేయ మన్నది సమాజ పరిస్థితుల సమగ్రావగాహన మీదా, సమాజ సభ్యుల సమష్టి వివేకం మీదా ఆధారపడి

ఉంటుంది. తమకు నచ్చని గ్రంథాలను, గ్రంథకర్తలను కొందరు పనిగట్టుకొని తిట్టిపోసినా, నడి వీధిలో వాటిని తగల బెట్టినా నశించిపోయేవేమీ కావు అవి. ఈ దేశంలో ఉన్న ప్రతులన్నిటినీ కుప్పచేసి నిప్పుపెట్టినా, వివిధ భాషల్లో పుట్టిన అనువాదాలు విదేశాల్లో అందంగా అచ్చయివచ్చి మన గ్రంథాలయాలనే నింపుతాయి. ఏభైరూపాయల కిక్కడ దొరికే పుస్తకం ఐదువందల రూపాయల ధర పెట్టుకొని దిగుమతి అయి వస్తుంది. పుట్టిన పుస్తకానిది గట్టి ప్రాణమయినప్పుడు దాన్ని హతమార్చాలని మన మెంత చచ్చినా అది చావదు గాక చావదు!

సంస్కృత ప్రాకృతాల్లోని గ్రంథాలు అనేకం వివిధ ప్రాంతీయ భాషల్లోకి అనువాదాలుగానో, అను సృజనలుగానో వెలువడ్డానికి కారణం, ఆ గ్రంథాల విషయ గౌరవమే కాని మరేమీ ప్రధానం కాదు. వాటి అనువాదకులు స్వతంత్ర రచనలు చేయలేని అసమర్థులూ కారు. అందుకే అన్నాడు మురారి: 'రాముడివంటి మహానుభావుడు కావ్య నాయకుడిగా తగి ఉండగా, ఆయన్ని విడిచి మరొకరి కథ నేనెందుకు రాయాలీ?' అని. నన్నయగారు పెట్టిన వరవడిని తరవాతివారు మన్నిస్తూ వచ్చినందుకు మన మేమీ ఆశ్చర్యపోనక్కర లేదు. పద్యప్రక్రియారూపంలో తొలి తెలుగు నవల - కళాపూర్ణోదయం - కల్పించిన పింగళి సూరన ఒక్కడు చాలడూ - తెలుగువారి స్వతంత్ర కావ్య రచనా వైదగ్ధ్యాన్ని చాటడానికి? తెలుగు సాహితీ స్రవంతికి క్రీ.శ. 19 శతాబ్దిలో పెద్ద మలుపు వచ్చింది. పడమటి గాలులు వీచాయి. కొత్త వెలుగులు ప్రసరించాయి. పాఠకులకూ రచయితలకూ కొత్త అభిరుచులు ఏర్పడ్డాయి. కొత్త ప్రక్రియలనూ కొత్త ఆలోచనారీతులనూ పాదుకొలిపాయి. సమాజ వికాసోద్యమానికి పద్యంకన్న వచనమే చాలా అనుకూల మనిపించింది; అది అత్యవసరమూ అనిపించింది. పత్రికల ప్రచురణలు జరిగిన తరవాత అది నిజమని నిరూపణ అయింది.

ఇరవయ్యో శతాబ్ది ఆరంభకాలం నుంచీ తెలుగు సాహిత్యంలో నవచైతన్యం వెల్లివిరిసింది. మరిన్ని కొత్త ఆలోచనలూ కొత్త ప్రక్రియలూ కొత్త ధోరణులూ మొదలయాయి. వాడుక భాష వినియోగం రచనా రంగంలో దాదాపు అంతటా పెరిగింది. కొత్త రాజకీయ, సామాజిక, వైజ్ఞానిక, సాంస్కృతిక సిద్ధాంతాలు ప్రచారం పొందాయి; ప్రభావం చూపాయి. తెలుగు సాహిత్య వికాసానికి అవి చాలా తోడ్పడ్డాయి.

తెలుగు సాహితీ చైతన్య వికాసచరిత్రలో పూర్వ శతాబ్దులన్నీ ఒక ఎత్తు; ఇరవయ్యో శతాబ్ది ఒక్కటీ ఒక ఎత్తు. పూర్వపు పునాదులు ఇంకా పదిలంగా ఉండగానే కొత్తవాకిళ్ళు పచ్చతోరణాలు కట్టుకున్నాయి. పల్లెపల్లెలకూ పాకిన, దేశస్వాతంత్ర్యోద్యమం సామాన్య పౌరులకూ గృహిణులకూ నిరక్షరాస్యులకూ కూడా రాజకీయ విషయాసక్తి కలిగించింది. ఉత్సాహోద్రేకాలు ఊపు నిచ్చాయి. సమాజ సంస్కరణోద్యమం కూడా దానికి తోడుగా సాగుతూ పరిసర పరిస్థితుల నిశితావగాహనను పెంచింది. నిజానికి, తెలుగునాట, రాజకీయోద్యమం కంటె సంఘ సంస్కరణోద్యమమే అనేక దశాబ్దుల ముందు మొదలయింది. స్వాతంత్ర్య సాధన ప్రధాన లక్ష్యమయిన తరవాత సంఘ సంస్కరణ దానికి ఆనుషంగికమయింది. సమాజ మున్నంతకాలం సమస్యలుండక మానవు. కొన్ని త్వరగా పరిష్కార మవుతాయి. కొన్ని నిదానంమీద చక్కబడతాయి. కొన్ని మొండిరోగాల్లా నిలిచిపోతాయి. పాత సమస్యల స్థానంలో కొన్ని కొత్తవి పుట్టుకు వస్తాయి. సమస్యలు ఉత్పన్నం కావడం, పరిష్కార ప్రయత్నాలు జరగడం అనేవి నిరవధికంగా సాగుతూ ఉండేవే!

స్వాతంత్ర్యోద్యమకారుల్లో అత్యధికులు అహింసా మార్గానుయాయులే అయినప్పటికీ సాయుధ పోరాటపు వీరులనిపించు కున్నవాళ్ళు అక్కడక్కడ కొందరు ఉంటూనే వచ్చారు. అయినా దేశీయులు ప్రజాస్వామ్యానికే పెద్దపీట వేశారు. వర్గపోరాటాన్నీ విప్లవ విజయాన్నీ ఆకాంక్షించే వామపక్ష రాజకీయాలు కూడా ప్రజాస్వామ్య విధానానికి అనుకూలంగా ఉంటూనే వచ్చాయి.

నవసమాజం కులవివక్ష పనికిరాదని తీర్మానించింది. వెనకబడిన వాళ్ళకూ దోపిడికి గురి అయినవాళ్ళకూ

అంటరాని తనానికీ అవమానాలకూ గురి అయిన వాళ్ళకూ కులాలపేరిట, జనజాతుల పేరిట ఆరక్షణలు కల్పించింది. కాని సమష్టిమీద కుల ద్వేషాన్ని నిర్మూలించ లేకపోయింది. ధనిక నిర్ధనికుల మధ్య అఖాతాన్ని పూడ్చాలని ఆశించింది. అయినా, పూడ్చే ప్రయత్నం దానివల్ల కాకపోయింది; అంతరాన్ని పెంచే ధోరణులను అరికట్టలేకపోయింది. ఆశ్రిత పక్షపాతాన్నీ అధికారుల ఔద్ధత్యాన్నీ అరికడతామని ప్రకటనలు చేసింది. అయినా అవసరాలు వచ్చినప్పుడు పైరవీలు సాగిస్తూనే ఉంది; పనులు చేయించుకుంటూనే ఉంది (ఇది కేవలం వైఫల్యాల చిత్రవర్ణ దర్శని మాత్రమే కాబట్టి సాఫల్యాల ప్రసక్తికిక్కడ తావులేదు).

ఇవన్నీ జనానికి తెలుస్తూనే ఉన్నాయి. ప్రతినిత్యం పత్రికలు వీటిని చాటుతూనే ఉన్నాయి. జనాన్ని ఆకట్టుకొంటూనే ఉన్నాయి. నియతకాలిక పత్రికలతో బాటు దినపత్రికల సంఖ్య కూడా పెరిగింది. పాఠకుల సంఖ్య కూడా పెరిగింది. ప్రచార, ప్రసార మాధ్యాల్లో పత్రికల తరవాత చెప్పుకోదగ్గవి రేడియో, టీవీ. ఇవి ఇంటికీ చేరువయాయి.

ఈ పరిస్థితులన్నిటి సమిష్టి ప్రభావానికీ కలిగే స్పందనలను ప్రజాసామాన్యం కంటె రచయితలు ఎక్కువ స్ఫుటంగా, సమర్థంగా చెప్పగలగడం సహజం. కాబట్టి వారి రచనల్లో అవి ప్రతిఫలిస్తాయి. గత శతాబ్ది ఉత్తరార్థంలో వెలువడ్డ సాహిత్యం దీన్ని నిరూపిస్తుంది. ఇది అన్ని ప్రాంతాల, అన్ని వర్గాల, అన్ని కులాల వారి సమాహార కృషికి ఫలితమని గ్రహించవచ్చు.

మనం కొత్త శతాబ్దిలో అడుగుపెట్టి మూడేళ్ళు కావస్తున్నది. ఈనాడు వెలువడుతున్న సాహిత్యం తీరులూ తెన్నులూ సమాజానికి హితం కూర్చేవిధంగా ఉంటున్నాయా, లేదా అన్నది ప్రధానమయిన ప్రశ్న. ఉన్నాయనో, లేవనో ముక్తసరిగా చెప్పేస్తే సరిపోయే ప్రశ్న కాదిది.

ఏమంటే - ఈనాడు సాహిత్యంతో ప్రమేయమున్న కార్యరంగాల పరిధి చాలా విశాలమయినది. ఆ పరిధిలో ఉన్నవి పత్రికలు, రేడియో, సినిమాలు, టీవీ, పుస్తక రూపంలో వెలువడే వివిధ ప్రచురణలు. వీటిలో సృజ నాత్మక సాహిత్యమూ ఉంది, శాస్త్ర సాహిత్యమూ ఉంది (ఈ రెండూ కాక, కేవలం సమాచారం అందించడానికి పరిమితమయే వార్తలూ వ్యాపార ప్రకటనలూ వంటివి ఇక్కడ అప్రసక్తాలు). ఈ రెండు విభాగాలకూ విషయమే ప్రధాన మయినప్పటికీ దానికి వాహకం భాష.

దినపత్రికలన్న తరవాత ఎప్పటికప్పుడు వేడివేడి వార్తలను అందించడం అవసరమే. వాటిలో రాజకీయ వార్తలూ, సామాజిక విశేషాలూ, సంఘటనలూ, దుర్ఘటనలూ రకరకాలవి ఉంటూంటాయి. క్రీడలకూ వివిధ వినోదాలకూ సంబంధించినవి కూడా ఉంటాయి. వీటిని రుచిగాను, అప్పుడప్పుడు ఘాటుగాను వెటకారం గాను అందించడం మంచిదే. కాని విశేషశైలీవ్యామోహంలో పడి, చేసిన అపప్రయోగాలూ అసందర్భ పదప్రయోగాలూ పత్రికల్లో తరచు కని పిస్తున్నాయి. శబ్ద స్వరూపంమీదా వర్ణక్రమంమీదా శ్రద్ధ చూపకపోవడం పెద్దపెద్ద శీర్షికల్లో కూడా కొట్టవచ్చినట్టు కనిపించడం కద్దు. దొంగతనాలు, దోపిడులు, హత్యలు,మానభంగాలు, కుట్రలు, కబ్జాలు, మోసాలు, వ్యభిచారం, దౌర్జన్యం, దారుణహింస వంటి వాటితోనే పేజీలు నింపేసి సంతోషిస్తున్న పత్రికలు, పాఠకుల మనస్సుల్లో, సమాజం పట్ల ఏవగింపు, వైమనస్యం, ద్వేషం, నిరసన, నిరాశ వంటి ప్రతికూల భావాలను కలిగిస్తున్నామన్న జ్ఞానంలేకుండా పోతున్నాయి. మనస్సును వికలం చేస్తున్నాయి; బాధపెడుతున్నాయి; రోత పుట్టిస్తున్నాయి. కూడనివెన్నో సమాజంలో జరగడం లేదని కాదు. అంతమాత్రాన, ప్రతికూల భావాలను సంతులితం చేసే విధంగా కాని, వాటిని పరిహరించే విధంగా కాని, అనుకూల భావాలనుపెంచే బాధ్యత పత్రికలకు సమాజంపట్ల లేదా? మనస్సుకు తృప్తి, ఉల్లాసం, ఉత్సాహం, విజ్ఞానం, శాంతి, క్షాంతి కలిగించే సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక విషయాలకు ప్రాముఖ్యమియ్యక పోవడం పత్రికా పాఠకులకు అన్యాయం చెయ్యడం కాదా? చెడు ఆకర్షించినంతగా మంచి ఆకర్షించదన్నది నిజమే. కాని ఆ చెడునే పెద్దగా

చూపి, మంచిని చిన్న చూపు చూసి సామాజికుల మానసిక ఆరోగ్యాలను పాడు చేయడం పత్రికలకు ఉచితమేనా? తమకు తోచిన విధంగాను, కావలసిన విధంగాను ఏవో సర్వేలు జరిపి ఎక్కువమంది (కుర్ర కారు), పాఠకులు కోరుతున్నవే ప్రచురిస్తున్నా మనుకోడం సబబేనా? వార్తలూ విశేషాలూ అందించడమే కాక, సామాజికుల మానసిక వికాసానికి సాహిత్య, సాంస్కృతిక, ధార్మిక ప్రమాణాల పరిరక్షణకూ తమ బాధ్యత ఉందన్న సంగతి విస్మరించడం తప్పు; తప్పున్నర!

తెలుగులో రేడియో కార్యక్రమాలు ప్రసారం కావడం మొదలయి సుమారు డెబ్భయి సంవత్సరాలయింది. అందులో అన్ని వర్గాలవారికీ అన్ని స్థాయులవారికీ స్త్రీలకూ పురుషులకూ పిల్లలకూ అనువయిన వివిధ కార్యక్రమాలకు తోడు, సంగీత సాహిత్య సాంస్కృతిక మూల్యాలకు ప్రాముఖ్యమిచ్చే కార్యక్రమాలు శ్రోతలను అలరింపజేస్తూ వచ్చాయి. దేశీయుల్లో సాహిత్య సాంస్కృతిక విషయాభిరుచిని పెంపొందించాయన్న మాట నిశ్చయం. కాని, వివిధ భారతి వాణిజ్య ప్రసారాలు మొదలయిన తరవాత శాస్త్రీయ, లలిత సంగీత కార్యక్రమాలమీది ఆసక్తి కంటె సినిమా పాటల మీది మోజు ఎక్కువయింది. వెనకటి రోజుల్లో, రేడియో కార్యక్రమాల ప్రయోక్తలూ ప్రసారకులూ మంచి విద్వాంసులూ అనుభవజ్ఞులూ కావడం వల్ల సాహిత్యాది కార్యక్రమాల ప్రామాణికత విషయంలోనే కాక ప్రసంగకర్తల, ప్రకటనకర్తల వాచికం విషయంలో కూడా శ్రద్ధ చూపించేవారు. కాని ఇటీవలి కాలంలో, కొందరు ప్రకటనకర్తల వాచికంలో కొన్నికొన్ని ఉచ్చారణదోషాలు వినవస్తూండడం కద్దు. మొత్తంమీద ఆకాశవాణి, శ్రోతలకు కీడు చెయ్యలేదనే చెప్పవచ్చు.

టీవీ కార్యక్రమాలు మనకు పరిచయమయి దాదాపు ముప్ఫయి సంవత్సరాలయిందనుకుంటాను. దూరదర్శన్ సాహిత్య, సంగీత, నృత్యకార్యక్రమాలు చాలా వరకు మంచి స్థాయిలో ఉన్నాయని అప్పట్లో ప్రేక్షకులు చెబుతూండేవారు. శ్రద్ధగా గమనించే తీరుబాటు లేకపోవడం వల్ల, ఇటీవలి కార్యక్రమాలను గురించి నేనేమీ చెప్పలేను. కాని ప్రయివేట్ ఛానళ్ళు వచ్చిన తరవాత సాంకేతిక ప్రమాణాలు బాగున్నప్పటికీ సాహిత్య పరంగా ఉన్నత ప్రమాణాలు కనిపించడం లేదన్న విమర్శ వచ్చింది. భార్యాభర్తల మధ్య, అత్తాకోడళ్ళ మధ్యా తక్కిన బంధుమిత్రుల మధ్యరాగల అభిప్రాయభేదాలను గోరంతలు కొండంతలు చేసి, ఆగ్రహావేశాలను అదేపనిగా పురిగొలిపి, సౌజన్యాన్నీ సౌమ్యగుణాన్నీ సాత్త్వికతనూ సర్దుబాటు తత్త్వాన్నీ మంట గలిపి, హింస ప్రతిహింసలనూ, దుండగాన్నీ తోడు గలిపి, ప్రేక్షకుల కుటుంబసంబంధాలమీద ప్రతికూల ప్రభావాన్ని చూపుతూ వాటిని విచ్ఛిన్నం చేసే కార్యక్రమాలు విరివిగా వస్తున్నాయని కూడా ఫిర్యాదులున్నాయి. సామరస్యం సౌమనస్యం, సదవగాహన,సహకారం, సహనం వంటి సద్గుణాలను పెంపొందించి చిత్తసంస్కారం కలిగించలేని కార్యక్రమాలు ప్రేక్షకులకు మేలు చెయ్యవు గాక చెయ్యవు. హింసను, భార్యాభర్తల వివాహేతర సంబంధాలను, విలాసవంత మయిన జీవన విధానాలను, ఉద్రేకోన్మత్త స్వభావాలను అధికంగా చూపించే కార్యక్రమాలు సమాజానికి కీడు చేస్తాయనడంలో సందేహంలేదు. అటువంటివాటికి వ్యాపారపు విలువే తప్ప సాహిత్యపు విలువ ఉండదు. నైతిక విలువ అసలే ఉండదు. అందువల్లనే ఒక రచయిత, 'నట్టింట అంటు జాడ్యం' అన్నాడు టీవీని.

సినిమా రంగం ఇటీవలి మూడు దశాబ్దుల కిందటి వరకు సాహిత్యపరంగా ఉన్నత ప్రమాణాలను పాటించిందనే చెప్పవచ్చు. అటు తరవాత, సన్నివేశాల్లోనే కాక, పాత్రల ఆహార్యంలోను, సంభాషణల్లోను, పాటల్లోను మితిమీరిన శృంగారం, మోటు హాస్యం గొప్పగా చెలామణి కావడం మొదలయింది. ఇటీవలి పది పన్నెండేళ్ళుగా, సినిమాల్లో శృంగారానికీ బూతుకూ సరిహద్దు చెరిగిపోయింది. రెండర్థాల సంభాషణలూ చవకబారు సరసాలూ వెగటు పుట్టించే తైతక్కలాటలూ పాటలూ ఈ సమాహారకళను అధోగతికి దిగజార్చాయని బాధపడే వాళ్ళు ఎందరో ఉన్నారు. హింసతోను, సెక్సుతోను, మిరుమిట్లు గొలిపే విలాస వైభవ విభ్రమాల ప్రదర్శనల

తోను యువజనాన్ని మత్తులను ఉన్మత్తులనూ చేసి డబ్బు చేసుకోడం, దోచుకోడం ప్రధానమయిన వాళ్ళకు సాహిత్యపు విలువలపట్ల గౌరవ ముంటుంద నుకోడం పొరపాటే!

చివరికి, పుస్తకరూపంలో వచ్చే ప్రచురణలు. ఇవి పూర్తిగా సాహిత్య ప్రధానమయినవి. వీటిలో రకరకాల ప్రక్రియలున్నాయి - కథ, నవల, నాటిక, నాటకం, కవిత్వం (ఇందులో మళ్ళీ పద్య కవిత్వం, వచన కవిత్వం, దీర్ఘకావ్యం, ఖండకావ్యం వంటి అంతర్భేదాలూ ఉన్నాయి). వీటిలో ఏ ఒక్క ప్రక్రియను తీసుకొన్నా ఒక్కొక్క పరిశీలనాత్మక గ్రంథం రాయవలసి ఉంటుంది.

కాని ఈ సాహిత్య ప్రక్రియల్లో వస్తున్న రచన లన్నిటిలోనూ ఉన్న ఒక సామాన్య గుణాన్ని మాత్రం ఇక్కడ చెప్పుకోవాలి. వ్యక్తిగత, కుటుంబ పరిస్థితులతో బాటు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులకు ప్రతిస్పందించే చైతన్యం ప్రస్ఫుటంగా ఉంది. దీనికితోడు, కొన్నింటిలో, వివిధ రచయితల రాజకీయ, సామాజిక సైద్ధాంతిక నిబద్ధత కచ్చితంగా కనిపిస్తుంది. కొందరు రచయితలు ఏ సిద్ధాంతానికయినా విధేయులు కానూ వచ్చు; వాటి ప్రేరణతో రచనలు చెయ్యనూవచ్చు (ఏ సిద్ధాంతమూ సంపూర్ణ సత్యమూ సార్వకాలికమూ కాదన్నది వేరే విషయం). రచనా శిల్పపరమయిన ప్రమాణాలను విస్మరించకుండా ఏ సిద్ధాంత ప్రేరణతో నయినా రచనకు పూనుకోనూవచ్చు. ముఖ్యంగా, సృజనాత్మక రచనల్లో, వాద వివాదాలు అంతర్గర్భితంగా ఉన్నప్పుడు ఉండే విలువ, బహిరంగ యుద్ధ ప్రకటనల ఆయుధ సామగ్రి అయినప్పుడు ఉండదు. దోపిడి దారులు, అధికారోన్మత్తులు, నయవంచకులు, ధన మదాంధులు వంటి వారు ఒక పక్కా పీడితులూ తాడితులూ నిరుపేదలూ శ్రమ జీవులూ వంటివారు మరొక పక్కా భిన్న వర్గాలుగా సమాజంలో కనిపించే మాట వాస్తవమే. వాళ్ళు ఏ ఒక్క కులానికో, వర్గానికో పరిమితమయిన - వాళ్ళు కానే కారు. సమాజ సమష్టి శ్రేయస్సుకు భంగం కలిగించే దుర్గుణాలు కొందరిలో ఉన్న మాట యథార్థం. ఆ దుర్గుణాలు ఎవరిలో ఉన్నా సాహిత్యం ద్వారా అవి బహిర్గతం కావలసిందే. కాని, వాటికి మూలలను వెతకాలి. ఆ మూలాలు స్వార్థం కావచ్చు; సుఖాభిలాష కావచ్చు; అధికార ధనదాహాలు కావచ్చు మరేదయినా కావచ్చు. ఇవి వ్యక్తినిష్ఠమయినవి. అవి నిర్మూలం కావలసింది వ్యక్తి స్థాయినుంచి. అందుకు అతనిలో పరివర్తన రావాలి. తప్పులు దిద్దుకొని బాగుపడాలి. సాహిత్య రచన అందుకు ప్రేరణ కలిగించగలదు. వ్యక్తి స్థాయిలో మేలు చేసే సాహిత్యం క్రమంగా సమాజస్థాయిలో కూడా మేలు చేస్తుంది. ఇది గుర్తుంచుకున్న రచయితలు ఉత్తమ సాహిత్య స్రష్టలు కాగలుగుతారని చెప్పవచ్చు. వారికి 'మేలు' కొలుపు ఇప్పుడు అవసరం.

జానపద కథలు - చతురనాయికలు

డా. రావి ప్రేమలత

జాతికి సంస్కృతి నిలువెత్తు సంతకం
సంస్కృతికి మూలం జానపద విజ్ఞానం

-సి.నా.రె.

నేటి జాతి జీవన విధానానికి మూలం జానపద సంస్కృతి. లలిత కళలకు బీజం జానపదకళా రూపాలు. సాహిత్యానికి ఆధారం జానపద గేయాలు, కథలు. తర తరాలనుండీ మౌఖికంగా జీవిస్తున్న జానపదుల కథల్లో జాతి ఆచార సంప్రదాయాలు, ఆలోచనా విధానాలు, జీవిత విధానాలు వ్యక్తమవుతుంటాయి. జాన పద కథల ప్రయోక్తలు, ప్రవర్తకులు, ప్రచారకులు ఎక్కువగా స్త్రీలే. వీరు కథలను కాలక్షేపంకొరకూ, వినోదం కొరకే కాకుండా నీతిబోధకొరకూ ఆచార సంప్రదాయాల విలువలను వివరించడానికీ, మానవసంబంధాల ప్రాముఖ్యాన్ని తెలపడానికీ పిల్లలనాకట్టుకునే విధంగా కథలను కల్పించి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రయత్ని స్తుంటారు. అంతేకాకుండా తమ తరంవారికీ, తమ తర్వాత తరంవారికీ జీవితంలో ఎదుర్కోబోయే సమస్యలనూ, సమస్యలకు పరిష్కారా లనూ కథల్లో సూచిస్తారు.

జానపద కథల్లోని నాయికలు కష్టాలకు క్రుంగి పోయి ఆత్మహత్యలను చేసుకోరు, సమస్యలనుండి పారిపోరు. చాతుర్యంతో ధైర్య సాహసాలతో సమస్యలను మూడో కంటికి తెలియకుండా పరిష్కరించుకుంటారు. జీవితాన్ని తమకనుగుణంగా మలచుకుంటారు.

జానపద కథలకు గానీ, పాత్రలకుగానీ, ప్రాంతాలకు గానీ పేర్లుండవు. అవి సార్వకాలికాలు, సార్వజనీనాలు, సర్వవ్యాపకాలు[1]. స్త్రీలకు పురుషులతో సమానంగా స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవించడానికి హక్కు ఉంది. అయితే వాస్తవ జీవితంలో స్త్రీలపైన సామాజిక వివక్ష కొనసాగుతూనే ఉంది. స్త్రీలపైన హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉంటాయి. వేధింపులను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడే అతివల సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది.

అందం, అణుకువ ఆడవారికుండాలని అంటుం టారు. అయితే అందమైన స్త్రీలను మగవారు వేధింపులకు గురి చేస్తుంటారు. వీరిలో అణుకువ తోనే చాతుర్యంతో పరివర్తనను తీసుకొని రావచ్చని జానపద కథకులు కథను చెప్పుతుంటారు.

అనగా అనగా ఒక రాజు, ఆయన దగ్గరొక మంత్రి ఉండేవాడు. మంత్రి భార్య చాలా అందంగా ఉండేది. ఓసారి రాజు మంత్రి భార్యను చూచి ఈమె ఎంత అందంగా ఉంది అనుకుంటాడు. మంత్రి ఉంటే మంత్రి భార్య దగ్గరకు పోలేనని, మంత్రిని పని మీద వేరే ఊరికి పంపిస్తాడు. మంత్రికి రాజు ఆలోచన అర్థం అవుతుంది. ఇక భార్య తనకు దక్కదనే విచారంతో వెళ్ళిపోతాడు. భార్యతో మాత్రం ఏ సంగతి చెప్పడు. మంత్రి పోయిం తర్వాత రాజు మంత్రి ఇంటికి వస్తాడు. మంత్రి భార్య భర్త లేనప్పుడు రాజు తనింటికి వచ్చినాడంటే ఏదో చెడు కోరికతో వచ్చినాడని కొడుకును పిలిచి, "నాయనా, మీ నాయన గారు లేరు, మీ మామయ్య రాజుగారు ఎందుకు వచ్చారో తెలుసుకో" - అని రాజు వినేటట్టు చెప్పుతుంది. ఆమె మాటలను రాజు విని, మంత్రి భార్య తనను అన్నగా భావించింది కాబట్టి "చెల్లెలితో సమానమైన మంత్రి భార్యపైన కోరికను పెట్టుకోవద్దు" అని వెళ్ళిపోతాడు.

మంత్రి రెండు రోజుల్లో పని పూర్తిచేసుకొని వస్తాడు. కానీ భార్యను అనుమానించి, ఆమెను పుట్టింటికి పంపిస్తాడు. మళ్ళీ ఆమెను తీసుకొని రాడు.

పుట్టింట్లో మంత్రి భార్య, భర్త తనను ఎందుకు తీసుకొని పోవడం లేదో గ్రహిస్తుంది. తన తండ్రిని రాజాస్థానానికి వెళ్ళి న్యాయం చెప్పమని అడగ మంటుంది. ఆమె తండ్రి, రాజాస్థానానికి వెళ్ళి, రాజుతో, 'అల్లునికి నేను చేనులో పంట పండించుకొమ్మని

ఇచ్చాను. పంట కాలం వరకు చేనును పెట్టుకొని ఇప్పుడు వద్దంటున్నాడనీ, చేనును నాకే అప్పగించాడనీ ఇది న్యాయం కాదనీ, ఇన్ని రోజులు దున్నుకొని ఇప్పుడు వద్దంటే ధర్మం కాదు'' అని కూతురు చెప్పమన్న మాటలను చెప్పుతాడు.

ఆ ఆస్థానంలోనే ఉన్న మంత్రి "నా తప్పేమి లేదు, చేను దున్ని పంట పండించుకుంటే పులి వచ్చి చేనంతా మేసి పోయింది, నాకిక చేనును దున్నే శక్తి లేదు. పులిని ఎదిరించలేను'' - అని జవాబిస్తాడు.

మంత్రి జవాబును విని రాజు "మంత్రీ, పెద్ద పులి నువ్వన్నట్లే చేనును తినేద్దామనుకుంది, కానీ అన్నా చెల్లెలుగట్టు అడ్డం వచ్చింది. పులి ముందుకు వెళ్ళలేదు, అందుకే తిరిగి ఇంటికి పోయింది'' అని చెప్తాడు. రాజాస్థానంలో ఉన్న వారికి వీరి సంభాషణలు ఏమీ అర్థం కావు. కానీ మంత్రికి రాజు జవాబుతో జరిగిన విషయం తెలిసిపోతుంది.

తన భార్యకూ, రాజుకూ మధ్య అన్నాచెల్లెళ్ల భావమే ఉందని తెలుసుకొని, భార్యను మళ్ళీ తనింటికి తెచ్చుకొని సంతోషంతో సంసారం చేస్తాడు.

ఆత్మాభిమానం కల స్త్రీలు ఆర్థికంగా స్వతంత్రలైతే హింసా ప్రవృత్తి ఉన్న పురుషుల్లో పరివర్తనను తీసుకొని రావచ్చనీ, వారిని తమ కనుగుణంగా మార్చుకోవచ్చనీ జానపదకథలు పరోక్షంగా బోధిస్తాయి[2].

ఒక రాజు మిద్దె కెదురుంగా గుడిసె ఉంది. దాంట్ల మొగుడు పెండ్లాలుంటరు. మొగుడేమో రోజూ పొద్దూ కంగనే పనిమీది నుంచి రాంగనే పెండ్లాన్ని కొడ్తుంటడు. పెండ్లాం ఏడుస్తది ఊకుంటది. రాజు బిడ్డ వాళ్ళను మిద్దె మీద నుంచి చూస్తది. "ఇదేం పెండ్లం రోజూ మొగడు దెబ్బలు కొడుతున్నా, మళ్ళీ మొగనితోనే సంసారం చేస్తుంది. నేనైతే గుడ్డిగవ్వతో నన్న సంసారం చేస్తగని, ఇటువంటి మొగునితోని సంసారం చెయ్య'' అంటది. అప్పుడే మిద్దె కిందనుంచి ఒక రాజు పోతుంటడు ఆమె అన్న మాటలను ఇంటడు. "ఈమె మొగోడు లేకుండ ఒక్క గవ్వతోటి ఎట్ల బతుకుతది'' అని మనసుల అనుకుంటడు. ఆ ఊరి రాజు దగ్గరకు పొయ్యి "నీ బిడ్డను నేను పెండ్లి చేసుకుంట'' అంటడు. సరే అని ఇద్దరికీ పెండ్లి చేస్తడు. బిడ్డతోటి సారె చీరెలు పని మనిషిని పంపిస్తడు.

భార్యను తీసుకొని రాజు తన ఊరికి పోతుంటడు. పోతుంటే ఒక అడివొస్తుంది. అడవిలకు పోంగనే రాత్రవుతుంది. ఆ అడవిలనే రాత్రి పూట పండు కుంటరు. నట్టనడిమి రాత్రి రాజు లేచి ఒక గవ్వను భార్య పక్కకు పెడ్తడు. ఆమెను, పనామెను ఇడిసి పెట్టి ఎవ్వరికి చెప్పకుండ యెల్లిపోతడు. రాజెల్లి పొయ్యినంక తెల్లారినంక రాజుబిడ్డ లేచి చూస్తే ఏముంది మొగడు లేడు పక్కన ఒక గవ్వ ఉంటుంది. పనామె ఉంటది. అయ్యో ఇదేంటి నన్నిట్ల ఇడిసి పెట్టి పోయిండు అని చింత చేస్తది. చింత చేసి చింతచేసి గవ్వను పనామెకు ఇచ్చిఊర్లకు పోయి నూకలు కొనుక్కరమ్మంటది. పనామె ఊర్లకు పోయి నూకలను తెస్తది. ఆ నూకలను రాజుబిడ్డ అడవిల సల్లుతది. పిట్టలు, నెమల్లొచ్చి వాటిని తింటయి. తిని వాటికున్న రంగుల రంగుల ఈకలన్నింటిని రాలుస్తయి అవ్వి రాల్చిన ఈకలను రాజుబిడ్డ, పనామె ఇద్దరు కల్సి ఏరుతరు. ఏరినంక రాజు బిడ్డ వాటితోటి ఇసన కర్రలను తయారు చేస్తది. తయారు చేసి ఇసనకర్రలన్నింటిని ఊర్లకు పోయి అమ్ముక రమ్మని పనామెను పంపిస్తది పనామె అన్నింటిని అమ్ముకొస్తది. అమ్ముకొచ్చిన పైసల్తోటి వాళ్ళకిన్ని బియ్యం, పిట్టలకిన్ని నూకలు తెస్తది. తెల్లారి మల్లా ఇసనకర్రలు చేసి పనామెతోటి అమ్మిస్తది. ఇట్లనే ఇట్లనే ఇసన కర్రల వ్యాపారం మస్తు పెద్దగైతది. రాజులు కూడ ఆమె దగ్గర ఇసనకర్రలను కొంటుంటరు. వచ్చిన పైసలతోటి అడవిల్లనే పెద్ద బంగ్ల కడుతది.

అక్కడ ఆమె భర్త పగ రాజుతోటి యుద్ధం చేస్తడు. రాజ్యం పోతది, డబ్బు దస్కం అన్నీ పోతయి. పేదోడు అయితడు, బిచ్చపోనోలే ఊర్ల తిరుక్కుంటూ, తిరుక్కుంటా అడవిలకొస్తడు. అడవిల బంగ్లను చూస్తడు. బంగ్లనుచూసి ఈ అడవిల ఇంత పెద్ద బంగ్లను ఎవ్వరు కట్టింద్రని అనుకుంటుంటడు. అప్పుడే బంగ్ల మీద నుంచి రాజు బిడ్డ భర్తను చూస్తది గుర్తు పడుతది.

ఇంట్లకొచ్చి పనామెను ఇంటి ముంగట ఉన్నాయనను ఇంట్లకు తీసుకరా, కొత్త బట్టలిచ్చి స్నానం చెయ్యమను, మంచి తిండిగినపెట్టు అని చెప్తది. ఆమె చెప్పినట్టే పనామె ఆయనకు బట్టలిచ్చి, తిండి పెడుతుంది. తిరిగి తిరిగి వచ్చినోడు కడుపునిండా తిండితినే సరికి నిద్రొస్తుంది, నిద్రపోతడు. నిద్రపొయ్యి లేచినంక పక్కనే ఒక కిస్తీ కనిపిస్తది. దానిమీద మఖమల్ బట్ట కప్పి ఉంటది. మఖమల్ బట్ట తీసి చూస్తడు. అండ్ల గవ్వకనిపిస్తది. గవ్వను చూడంగనే ఆయనకు అంతా యాదికొస్తది. నా భార్యను అడవిల ఒక్కదాన్ని ఇడిసి పెట్టి పోయిన. ఒక గవ్వనే పక్కనే పెట్టిపోయినా, ఆ గవ్వతోటి ఇంతపెద్ద బంగ్ల కట్టింది. నేనేమో ఉన్నదంతా పోగొట్టుకొని బిచ్చపోని లెక్క అయిన అనుకుంటడు. నా భార్య అన్నమాట చేసి చూపెట్టింది. నాకంటె తెలివి కలది, అని ఆమె తోటి సుఖంగా ఉంటడు.

ఈ కథలో రాజకుమార్తె ఆత్మాభిమానం, కళా నైపుణ్యం, ఆర్థిక స్వాతంత్ర్యాభిలాషలు వ్యక్తమవు తున్నాయి. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం అనే ఫెమినిస్టుల అభిప్రాయం సిద్ధాంత రూపంలో కన్పించదు. కానీ భావం మాత్రం జానపద సాహిత్యంలో కథా రూపంలో కన్పిస్తుంది.

కథల్లోనే గాకుండా వాస్తవ ప్రపంచంలో కూడా స్త్రీలపైన శారీరక, మానసిక హింసలు జరగని దేశం లేదు. ప్రపంచ పర్యాప్తంగా స్త్రీల పరిస్థితులపై ఐక్య రాజ్య సమితి జరిపిన అధ్యయన నివేదిక 2000 ప్రకారం అమెరికాలో ప్రతి 15 సెకండ్లకు ఒక స్త్రీ భర్తచేత దెబ్బలను తింటుంది. బ్రిటన్‌లో నిమిషానికొక స్త్రీ భర్త పెట్టె హింసనుండి కాపాడమని పోలిస్‌లకు ఫోను చేస్తుంది. దక్షిణాఫ్రికాలో ప్రతి 23 సెకండ్లకొక స్త్రీ పురుషుల దౌర్జన్యానికి గురువుతూనే ఉంది. మన రాష్ట్రంలో 2002 సంవత్సర నివేదిక ప్రకారం మగవారి దౌర్జన్యానికి బలైన వారి సంఖ్య 15617. వెలికి రానటువంటి అబలల సంఖ్య అసంఖ్యాకం.

ఈ మగవారి దౌర్జన్యాలను ఆధారం చేసుకొనే భారతదేశంలోని దాదాపు అన్ని భాషల్లోనూ భార్యలను కొట్టే భర్తలకు బుద్ధి చెప్పిన వారి కథలున్నాయి. తెలుగు జానపద కథలో కూడ పైసాసంపాదించని భర్త పెళ్ళి కాగానే భార్యను కొట్టబోతాడు. భార్య నన్ను పోషించే శక్తి లేని నీకు కొట్టే హక్కు లేదని అంటుంది. భర్తకది అవమానంగా తోచి సంపాదనకొరకు వెళ్ళి, మధ్యలో మోసగాండ్ర చేతిలో మోసపోతాడు. బందీ అవుతాడు. భార్య వెళ్ళి తన తెలివితో భర్తను బంధించిన వారినోడించి అతడ్ని విముక్తుని చేస్తుంది. భార్య తెలివికి, ప్రవర్తనకు భర్తలో పశ్చాత్తాపం కలుగుతుంది.

భర్తలనే కాకుండా, ఇతర కుటుంబ సభ్యుల ప్రవర్తనను కూడ స్త్రీలు తమ సౌశీల్యంతో, సత్ప్రవర్తనతో మార్చవచ్చని జానపద కథలు బోధిస్తుంటాయి.

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊర్ల ఒక ఇంట్ల ఒకాయనకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులకు ఏడుగురు భార్యలు. అంటే ఏడుగురు కోడండ్లున్నరు. అయితే మామ దొంగతనాలు చేస్తుండే టోడు. ఆయన అమ్మానితోటి అత్త- కోడండ్లకింత అన్నం పెట్టి ఓ రొట్టెలకూర పెట్టి ఇచ్చేది. ఇట్లనేవాళ్ళు నిమ్మలంగ సంసారం చేసుకుంటున్నరు. కొన్ని రోజులకు చిన్న కోడలుకు మామ దొంగతనం సేస్తున్నరు అని తెలిసింది. మామకు సెప్పింది. మామ మామ దొంగతనం సెయ్యకు, పాపం తగుల్తది. తలా ఇంత కష్టపడుదాం, మనకున్న భూమి దున్నుకుందాం, పంట పండుతే మనకింత కడుపు నిండుతది ఈ పాపపుపని ఒద్దంటది, కాని మామ ఇనడు.

చిన్న కోడలు మామ ఇనేటట్టులేడు అని ఆలోచన చేస్తది. మతిల ఏమి ఆలోచన ఒచ్చిందో ఎమో మేం ఏడుగురం కోడండ్లం తినబడితిమి ఇదంతా దొంగ సొమ్మాయె ఎవ్వరికీ ధర్మం, దానం చేస్తలేమైతిమి, ఎట్ల అని, ఇంట్లనైతే బిచ్చగాండ్లకు ఏమి మిగుల్తలేదు. నేను తినేదాంట్లకెల్లి పెడ్తనని అనుకుంది. అత్త ఇచ్చిన రొట్టెను రోజూ ఒక బిచ్చగానికి దానం ఇస్తది. అత్తపెట్టిన అన్నమేమో తనే తింటది. రొట్టెనేమో దానం చేసేది. బిచ్చగాడు నీ కడుపు సల్లగుండ అని దీవిచ్చుకుంట పోయెటోడు. ఇట్లనే యాడాది, రెండేండ్లు గడిసి పోయినయి.

మామనేమో "ఇదివరకు నేను దొంగతనం సేసి నప్పుడు పట్టు పడుతుంటి. ఈ రెండేండ్ల నుండి పట్టుపడుత లేను ఎందుకిట్ల అవుతుందని అని ఆలోచన సేసి, ఇంట్ల అందర్నీ పిలిసి 'ఇదివరకు దొంగతనాలు సేస్తూంటే పట్టు పడుతుంటి ఎవరన్న ఏమన్న దానం చేస్తున్నర, నేనిప్పుడు పట్టు పడుతలేను. ఎవ్వరన్న నన్ను పట్టుకోడానికొస్తె ధర్మ సత్రం అడ్డమొస్తుంది, ఎవ్వరిదో పుణ్ణెం నన్ను అడ్డుకుంటుంది' అడుగుతడు. మేమెవ్వరం ఏమి సేస్తలేం అంటరు. చిన్న కోడలును కూడా పిలుస్తడు. అమ్మ నువ్వు నాకు బిడ్డలాంటి దానివి, నెనొక్కటి అడుగుత చెప్పాలి అంటే, ఏంది మామ అడుగు తెలిస్తే చెప్త అని అంటది.

నేను అవతలికి పోయి దొంగతనం చేస్తుంటే, పట్టుపడితే ధర్మసత్రం లెక్క ఒక రొట్టె అడ్డం ఒస్తుంది. దాంతోటే నేనెవ్వరికి పట్టు పడుతలేను, నువ్వేమన్నా పుణ్యం చేస్తున్నావా నాకు నిజం చెప్పాలి అంటే, అవును మామయ్య నేను ఎవ్వరికీ చెప్పకుండ ఒక తప్పు చేస్తున్న, అత్తమ్మ నాకు అన్నం, కూర రొట్టె ఇస్తే, అన్నం కూర తిని రొట్టె దానం చేస్తున్న. అది పుణ్యమో, పాపమో తెల్వదు. మరికనేనైతే రొట్టె దానం సేస్తున్న అని చెప్పిందంట చిన్న కోడలు.

కోడలు మాటలిని మామ "అమ్మా నీ పుణ్యమే నాకు దక్కింది. నువ్వు మంచి పని చేస్తున్నవు. నీ కొంచెమంత పుణ్యమే నన్ను కాపాడుతున్నది. కొంచెం పుణ్యంతోటే నాకింత పుణ్యా మొస్తె, అందరం కలిసి దానధర్మాలు చేస్తే ఇంకెంత పుణ్యం వస్తుందో, ఏమో ఇన్ని రోజుల నుండి నువ్వు దొంగతనమొద్దంటే ఇనలేదు ఇప్పటి నుండి నేను దొంగతనానికి పోను. మన పొలం దున్ను కొని యగసాయం చేసుకుందాం మనం మంచిగ బతుకదం అని చెప్పిండు. అప్పటినుండి మామ దొంగతనం, దోపిల్లు మానెసిండు. ఇంట్ల అందరు మంచిగ బతికింద్రు. చిన్న కోడలు చెప్పినట్లే ఇన్నరు.

సమయం, సందర్భం, శ్రోతలననుసరించి చెప్పే జానపదకథలు మానవ సంబంధాలను పటిష్ఠం చేస్తూనే నీతి నియమాలను బోధిస్తాయి. వర్తమానంలో భవిష్యత్తులో కూడ సమాజం సక్రమమార్గంలో పయ నించడానికి కథలు దోహదం చేస్తుంటాయి. జానపదులకు కథలు జీవిత మార్గ దర్శకాలు, నీతి ప్రబోధకాలు.

మానవ సంబంధాలు మృగ్యమై, పగ ప్రతీకారాలు హింస, ప్రతిహింసలతో అన్యాయాలతో రగిలి పోతున్న నేటి సమాజంలో జానపద కథల ప్రచారం అవసరం.

1. జానపద నీతికథలు - జి.వి.డి. నరసింహారావు
2. కథకురాలు - విమల, హైద్రాబాదు
3. కథ సేకరణ - డా. పి. సరస్వతి.

బుడిగ జంగాల కథలు - పౌరాణిక మూలాలు

డా. చింతల యాదయ్య

భారతీయ సంస్కృతి చిరంతనమైంది. పురాతనమైంది. ఈ సంస్కృతికి మూలకందాలుగా నిలిచినవి రామాయణ, భారత, భాగవత గ్రంథాలు. స్థూలంగా రామాయణ భారతాలను ఇతిహాసాలుగాను భాగవతాన్ని పురాణంగాను పండితలోకం వర్గీకరించినా జనం దృష్టిలో అవి అన్ని ఒకటే. శివుడు ద్రావిడుడనీ, విష్ణువు ఆర్యుడనీ, రాముడు ఆర్యుడనీ, రావణుడు ద్రావిడుడనీ ఇటువంటి విద్వేష మూలకమైన స్వకపోల కల్పితమైన సిద్ధాంతాలు రాద్ధాంతాలు ఎన్ని ఉన్నా భారతీయ సాహిత్య మంత పౌరాణిక గ్రంథాల్లోని పవిత్ర బిందువులే. పండితులు వారి వారి స్థాయి కొద్ది కావ్య ప్రబంధాది భిన్న భిన్న ప్రక్రియలలో చెప్పింది, జానపదుల వారి స్థాయికి అనుకూలమైన, అనువైన అవగాహన మేరకు వారి వారి ప్రక్రియలలో చెప్పింది ఒకటే అంశం. స్త్రీలు పాడుకునే కలుపు పాటలు, రోకటి పాటలు, పెండ్లి పాటలైన, పురుషులు పాడుకునే శ్రామిక వ్యవసాయ గీతాల్లో నైన, వృత్తిగాయకులైన "బైండ్లవారు" జమిడిక వాయిస్తూ చెప్పుకునే కథల్లోనైన 'ఒగ్గువారు' ఒగ్గు వాయిస్తూ తమదైన బాణీలో చెప్పే కథల్లోనైన చిందులు తొక్కుతూ ప్రజలందరిలో ఆనందోత్సాహాలను చిందింప చేసే, చిందు కళాకారులు చెప్పే ఇతివృత్తాల్లోనైన, అలవోకగా జాలువారేవి, ఇంతకుముందు చెప్పినట్లు ఆ పౌరాణిక గంగలోని పవిత్ర బిందువులే. పౌరాణిక కథలు అన్నంత మాత్రాన సాంఘిక కథలు, చారిత్రక కథలు ఉండవని అనుకోరాదు. ఈ పరంపరలోని అంతర్భాగమే "బుడిగ జంగాలు".

'బుడిగె' అనే వాద్యాన్ని ఉపయోగించి తందానా కథలు చెప్పే వీరికి 'బుడిగె జంగాల'ని 'బుడిగె' పదమే తర్వాత కాలంలో 'బుడగ' బుడ్గగా ప్రచారంలోకి వచ్చింది.

బుడిగె - బుడగ - బుడ్గ అనే పదాలు రూపాంతరాలు. బుడిగెలతో కథలు చెప్పడం వలన 'బుడిగ జంగాలు' గా పేరు వచ్చింది.

'జంగమ' అంటే ఒక ప్రాంతంలో స్థిరంగా ఉండని వారని అర్థం. భక్తి ఉద్యమములో వచ్చిన సాహిత్యంలో 'శివున్ని' జంగమదేవరగా వర్ణించారు. శివుడు సంచారి. సంచారజాతులకు, ఆటవిక జాతులకు, అట్టడుగు వారికి ఆరాధ్యుడు. శైవమత ప్రచారమే ముఖ్య ఉద్దేశ్యంగా జరిగిన భక్తి ఉద్యమంలో ఉద్భూతంగా ముందుకు వచ్చిన వాళ్ళే ఈ జంగాలు. సాధారణంగా జంగాల్ని రెండు ప్రధాన తెగలుగా విభజించవచ్చు. అవి -

1. గణాయత జంగాలు 2. స్థావర జంగాలు

గణాయత జంగాలు : ముఖ్యంగా సంచార జీవన విధానాన్ని కలిగి ఉన్నవాళ్ళు.

2 స్థావర జంగాలు : ఒకేచోట స్థిరనివాసం ఏర్పరచుకున్న వాళ్ళు.

వీరివృత్తులు : నిత్యం ఈత చాపలు అల్లటం, వేటకు వెళ్ళటం, ఉపవృత్తులుకాగా, ప్రధాన వృత్తి కథాగానం. కథ యొక్క ప్రధాన ఉద్దేశ్యం సంతోషాన్ని కలిగించడమే. ఈ సంతోషంతో పాటుగా చారిత్రిక, సాంఘిక, మత, రాజకీయ, నైతిక విషయాలను ఆహ్లాదంతో కలిపి బోధించడమే కథ ప్రధాన ఉద్దేశ్యం.

ఈ బుడిగ జంగాలు చెప్పే కథల్లో ఒకటి రెండు గంటల్లో ముగిసేవి మొదలుకొని రోజుల తరబడిగా సాగిపోతాయి. ఆదరించి అక్కున చేర్చుకునే వాళ్ళు ఉంటే ఎంత రమ్యంగానైన చెప్పి, ఎన్ని రోజులైన చెప్పి, సంతోషింప జేసే సామర్థ్యం వారిలో ఉంది. సంతోష సమయాల్లో చెప్పడమే కాకుండ, ఎవరైన మరణించినపుడు వారి కర్మకాండ రోజుల్లో వీరిని పిలిపించి కథలు చెప్పుకొని తమ దుఃఖాన్ని మరచిపోతుంటారు.

జంగముల రూపురేఖలను కళ్ళకు కట్టిస్తున్న ఓ గేయ శకలాన్ని ఆచార్య బి. రామరాజు గారు ఉదాహరించారు.

"భారతమొక కథ చేయమనుచు నను ప్రార్థింపగ జూచి - నే రచియింపగ బూనితి జంగంవారికి నుపకృతిగా- నీటుగా విభూతి రేఖలు దీర్చియు నిల్వుటంగీ ల్డొడిగి - వేట రుమాలాల్ పెటు పాగాల్వ ల్లెపాటులొనరదాల్చి - జోడు గుమ్మెటల్ దట్టుచు వంతలు పాడుచు మరి యొకడు - పొడిమిగా చేబూని సితారా భుజమున ధరియించీ - గజ్జెలు మువ్వలు అందెలు పదముల ఘల్లుమని మ్రోయగనూ - తర్జుణుత తకయని నాట్యం సల్పుచు తంబుర మీటుచునూ - సంగతిగా సభవారికెల్ల ప్రసంగ పూర్వకముగా చెంగున దుముకుచు జంగం బులకున్ జీవనధనమనగా"

నుదుట విభూతి రేఖలు మెరుస్తుండగా, పొడవైన అంగరఖా ధరించి, పొడవైన ఉత్తరీయాన్ని భుజంపై, పొడవైన కండువ ధరించి, తంబూర మీటుచూ అందెలు రవళిస్తూ కాలిమువ్వలు గల్లుగల్లున మోగుతూ ఉండగా ఖంగుమనే కంచు కంఠంతో "బుడిగ జంగాలు" కథలు చెప్పుతూ ఉంటె తనువెల్ల చెవులు చేసుకొని విని, పరవశించని రసికులు ఉండరు.

బుడిగ జంగాల మీద పరిశోధన చేసిన డా॥ ఎన్.ఆర్. వెంకటేశంగారు, (86) ఎనభై ఆరు కథల వరకు బుడిగ జంగాలు చెప్పే కథలను గుర్తించారు. ఇందులో ఇటీవలి స్థానిక ఉద్యమకారుల జీవిత గాథలు ఉన్నాయి. అట్లాగే కాటమరాజు, సదాశివరెడ్డి, సర్వాయి పాపడు, బుడ్డా వెంగళరెడ్డి, ఇలాంటి చారిత్రక వ్యక్తుల వీర గాథలు చోటు చేసుకున్నాయి. ఆరె మరాఠీలు, కాంభోజరాజు, బాలనాగమ్మ లాంటి జానపద ఐతిహ్యాలు ఉన్నాయి. లక్ష్మమ్మ, కామమ్మ, లాంటి పేరంటాల కథలు ఉన్నాయి. గాంధారి కథ, జరాసంధుని కథ, నరకాసురుని కథ, నల చక్రవర్తి, బభ్రువాహన, మాంధాత, ఇలాంటి పౌరాణిక గాథలను బుడిగ జంగాలు జనరంజకంగా చెప్పి అలరిస్తారు. ఆనందింపజేస్తారు.

బుడిగె జంగాలు చెప్పే కథల్లోనైన, ఇతర జానపద వృత్తి గాయకులు చెప్పే కథల్లోనైన రామాయణ, భారత, భాగవతాల్లోని అంశాలు యధాతథంగా రావు. వారి వారి పరిసరాలకు అనుగుణంగాను, వారివారి స్థాయికి అనుగుణంగాను తగినన్ని మార్పులను, కూర్పులను, చేర్పులను చేసుకొని వాస్తవిక రీతిలో ఆత్మీయత ఉట్టి పడుతున్నట్లుగా ఉంటాయి. వారి వారి కోపతాపాలను దయా గుణాలను ప్రతిఫలింప జేస్తుంటాయి. అందుకే - సీతమ్మవారిపట్ల జాలిని కురిపించి సానుభూతిని ప్రకటిస్తారు. అగ్ని ప్రవేశం చేయమని, అడవులకు వెళ్ళమని ఆదేశించిన రాముని పట్ల ఆగ్రహాన్ని వ్యక్తీకరిస్తారు. కథను రంజింప జేయడానికి, ప్రజలలో మానవీయ గుణాలను ఉద్బుద్ధం చేయడానికి, శ్రీరాముడు సీతను అడవికి తీసుకెళ్ళి తలను ఖండించుమని ఆజ్ఞాపించినట్లు చిత్రిస్తారు. ఆ సంగతి సీతకు అయోధ్యలోనే తెలిసినా తప్పించుకోకుండ ధైర్యంగా లక్ష్మణుని వెంట అడవికి వెళ్ళుతుంది. రాజాజ్ఞకు బద్ధుడై, లక్ష్మణుడు సీతను సంహరించడానికి కత్తి ఎత్తి, చేతులు రాక, మూర్ఛిల్లి లేచి సీతను ఆ అడవిలోనే వదిలిపెట్టి, జింక కనుగుడ్లను ఆనవాలుగా రామునికి చూపిన లక్ష్మణుని చాతుర్యం అవాల్మీకమే అయినా బుడిగ జంగాల కథన చాతురికి నిదర్శనం. అడవిలో వదిలివేయబడిన సీత ఒంటరిగా ఆ జంతువుల మధ్యన్నే 'కుశున్ని' కంటుంది. ఆ పసిబిడ్డను ఎత్తుకొని వాల్మీకి వద్దకు వెళ్తుంది. జానపదుల వాల్మీకి పరివారంతో కూడిన తపస్సంపన్నుడైన మహర్షి కాదు. ఒక సాధారణుడైన కండ్లు కనిపించని ముదుసలి. అయితే ముదుసలికి శక్తి లేదని కాదు. సీత స్నానానికి వెళ్తూ, అక్కడి కోతులు తమ పిల్లలను ఒడిలో దాచుకోవడం గమనించి, సీత ఆశ్రమానికి తిరిగి మరలి వచ్చి నిద్రిస్తున్న వాల్మీకిని లేపి చెప్పకుండా 'కుశున్ని' తీసుకొని స్నానానికి పోతుంది. నిద్రలేచిన వాల్మీకి ఊయలలో శిశువు కనిపించక పోవడం గమనించి తన యెదమీద మట్టి తీసి, దానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి ఊయలలో పడుకో బెట్టాడు. కుశునితో కూడి సీత ఆశ్రమానికి తిరిగి వచ్చినపుడు జరిగిన విషయమంతా తెలుస్తుంది. విధి సంకల్పం ఈ రీతిగా ఉందని చెప్పి, అలా పుట్టిన బాలునికి 'లవుడు' అని పేరు పెట్టి పెంచుకున్నారు.

ధర్మానికి నిలబడిన వాల్మీకి రాముడు సీతను అడవుల్లోనే వదిలి రమ్మని అంటే ఏకంగా సీతను సంహరించమని చెప్పిన కఠిన చిత్తుడు, నిర్దయుడు, బుడిగ జంగాల రాముడు.

"వొళ్ళ తప్పులేదు వొంకన్యారము లేదు -
వైదేవి సీతమ్మానమ్మా ......
తప్పులేని తల్లిని తలగొట్టు మన్నాడు రామా ......
నీవదినా సీతమ్మ భూలోక మాతా
కాని తప్పులు జేసింది ఖండించి రారా ......
రారా నా తమ్ము డా రా లచ్చుమయ్యా"

అని లక్ష్మణుని సీతను సంహరించమని ఆదేశిస్తాడు. రామున్ని సేవించడమే పరమ గమ్యంగా వాల్మీకి లక్ష్మణుడు భావిస్తే, సీతను సంహరిస్తే ప్రజలే మను కుంటారో అని యుక్తాయుక్త విచక్షణను సంశయాన్ని వెల్లడించి రాముని చేత అవమానం పాలు అవుతాడు, బుడిగ జంగాల లక్ష్మణుడు.

"అన్నన్న శ్రీరామ అయ్యోజ్య రామా
తప్పు లేకనె సీత తలగొడ్తె అన్న
తల్లులు, పెద్దలు దగ దందురన్నా"

అని సీతను తలగొట్టడం సబబు కాదని అన్నటువంటి లక్ష్మణుని చూచి, రాముడు కోపంతో ఊగిపోతూ "అట్ల ఎప్పుడన్నావో తమ్మి లక్ష్మణ - సీతనువుగూడి ఏలు అయోజ్య" అంటూ కఠిన పలుకులు పలుకుతాడు. మాటల్లోని ఆంతర్యం సీత పట్ల జాలిని పుట్టించడం, రాముని పట్ల తమ ఆగ్రహాన్ని, నిరసనను వ్యక్తం చేయడమే. రాముని ఆజ్ఞను విధిలేని పరిస్థితులలో నిర్వర్తించవలసి వచ్చిన లక్ష్మణుడు సీతను చంపకుండ వదిలిపెట్టి జింక కళ్ళను ఆనవాళ్ళుగా రామునికి చూపెట్టడం వాల్మీకిలో ఊహించలేము. ఇంతటి లక్ష్మణుడు ఊరుకోలేదు. తాను రామాజ్ఞను విధిలేక పాటించినా, తప్పు చేసినట్లు కుంగిపోయాడు. ఈ సీతమ్మ తల్లి పాట్లకు తానే కారకుడుగా కుమిలి పోతాడు. ఏ రకంగానైనా వెళ్ళి, సహాయపడ్తే తప్ప తన పాపానికి నిష్కృతి లేదని వాపోయి, సీత తనను గుర్తించకుండ లక్ష్మణుడు బుడిగ జంగం వేషంలో వెళ్తాడు.

"ఈశ్వరుని వొద్దాకే ఎల్లే లక్ష్మాణ
శివుని శంఖు గంట చేతుల బట్టిండు
ఏదుమంత గంట, పందుమంత శంఖు
యీబూది రేఖలే దిద్దుకున్నాడు
పేరిణి బొంతను గట్టుకున్నాడు
ముందుకుఏసిండు మున్నురు జోలె
ఎనకంగ ఏసిండు ఎయినూరు జోలె"

ఇలా వేషంకట్టి వెళ్ళి తల్లిబిడ్డలకు కావలసిన మందులు, ఇతర వస్తువులు, అందించి వచ్చిన మానవతా మూర్తి లక్ష్మణుడు.

ఈ బుడిగ జంగాలుయక్షగాన రచనలను, తందాన కథలను, భాగోతాలుగా ప్రదర్శిస్తారు. మైరావణ చరిత్ర, శతకంఠరామాయణం, సుగ్రీవ విజయం. ప్రహ్లాద చరిత్ర, బాణాసుర వధ, మొదలైనవి చెప్పుకోవచ్చు. హరిశ్చంద్రుని కథలో సత్యంకోసం హరిశ్చంద్రుడు తనకు తాను వీర బాహునికి అమ్ముడుపోతాడు. వీరబాహుడు బుడిగ జంగమే, ఈ బుడిగ జంగమే కాటికాపరి. బుడిగజంగాలు ప్రధానంగా శివున్ని అర్చించే వారే అయినా, విష్ణుద్వేషులు కారు, 'విష్ణురూపాయ నమశ్శివాయ' అన్నట్లు హరిహరనాథ తత్త్వాన్నిభజిస్తారు.

పల్లవి :
ఎప్పుడేలే ధీరులూ-త్రిమూర్తులు-ధాత్రీలో పలుశూరులూ
ఎప్పుడెప్పుడు తప్పకను - నాకప్పుడే కని పించనైతే
మెప్పుగా గులాల్ బుక్క - గుప్పను గుప్పను జల్లనౌదు
॥ఎప్పు॥

చరణం :
రక్షింతువనినమ్మితీ ఓం నమశ్శివా - లక్ష్మీనాయక వేడితీ
వక్షమున సిరిగల్గువాడవు - రాక్షసాంతక పక్షివాహన
కుక్షిలో నెనరుంచినాపై - రక్షకుడవై బ్రోవరాదే
॥ఎప్పు॥

చరణం:
రంగనాయక రారా - ధారుణి- సింహాసన మైనావురా
రామతారక బ్రోవనేర్చిన - కావవే కైలాస నాయక
వరదుడా మార్తాండ తేజా - కరుణతో నను బ్రోవరాదా
॥ఎప్పు॥

అని పాడుతుంటారు. ఈ విధంగా పౌరాణిక మూలాలను ఆలంబనగా చేసుకొని - ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వాటితో సంబంధం పెట్టుకుని తమ పరిస్థితులకు, స్థాయికి, మనస్తత్వానికి, రాగద్వేషాలకు, అనుగుణంగా కథలను, పాటలను కల్పించుకొని పాడి పరవశిస్తారు. పరవశింప జేస్తారు బుడిగ జంగాలు.

ఈనాడు ప్రచారంలో ఉన్న "బుర్రకథ" అనే కళారూపానికి మూలం, ఆధారం ఈ బుడిగ జంగం కథలే. పద్మశ్రీ "షేక్ నాజర్"గారు చిన్నప్పటినుంచి బుడిగజంగాల కథలు విని విని గమనించి, పరిశీలించి ఆధునిక ఇతివృత్తాలతో బుర్రకథా ప్రక్రియను ప్రచారంలోకి తెచ్చారు. ఒక టి.వి. ఇంటర్వ్యూలో నాజరుగారు స్వయంగా ఈ విషయం చెప్పారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యము - డా. బి.రామరాజు
2. బుడిగె జంగాలు - భాషా సాంస్కృతికాంశాల పరిశీలన -డా. ఎన్.ఆర్. వెంకటేశం

సాహిత్య విద్య - సాహిత్య సంప్రదాయాలు

డా. పి. యశోదారెడ్డి

వినాసాహిత్య విద్యా పరత్ర
గుణః కథంచిత్ ప్రథతే కవీనామ్
ఆలంబతే తత్క్షణమంభసేవ
విస్తారమన్యత్ర న తైలబిందుః ॥ (మంఖకుడు)

సాహిత్యమూ సాహిత్య విద్య భారతీయులకు కొత్త విషయం కాదు. సత్య దర్శనులైన మన ప్రాచీనర్షులు సౌందర్య ద్రష్టలై, కావ్య సృష్టి కావించినారు. ఋగ్వేదంలో వాక్సంబంధి ఋక్కులల్లో ఉదాత్తభావసంపన్నమైన కవిత్వం శుచిరుజ్జ్వలమైన పదజాలంలో పొదుగబడి గోచరిస్తూ ఉంటుంది. ఈ రుచులే మన వేదర్షుల అలంకార భావనకూ రసనిర్భరతకూ, ఊహారామణీయ కతకూ అద్దం పడ్తూ సాహిత్య విద్యా వికాసానికి నాంది పలుకుతున్నాయి. ఉదాహరణకు -

"ఉతత్వః పశ్యన్నదదర్శవాచముతత్వః శృణ్వన్నశృణోత్యే
ఉతోత్వస్మైతన్వం విసస్రేజాయేవపత్య ఉశీత సువాసాః॥

అనే ఋక్కును పేర్కోవచ్చు. ఈ సందర్భంలో వాక్ప్రభావాన్ని సంపూర్ణంగా దర్శించిన కవి, ఆ వాక్కు కొందరికి కన్పించినా చూడలేరనీ కొందరికి విన్పించినా వినలేరనీ అయినా మరికొందరిని ఆమె అనురక్త ఐన భార్య భర్తను సువాసఐ సకల సౌందర్యాల ఆవిష్కరిస్తూ అలరించినట్లుగానే అలరిస్తుందని చెప్పినాడు. ఈ వాక్యాలు ఆధారంగా ఆలోచిస్తే ఉత్తమ సాహిత్యానికి హృదయా కర్షకాలైన సౌందర్య రామణీయకతలు అభిలషణీయాలైనట్లు గ్రహించవచ్చు, అంతేకాదు ఆ వాగ్రామణీ యకతను చూచి గ్రహించి ఆనందించడం అందరికీ సాధ్యపడదు, అది అర్హులూ, అధికారులూ ఐన కొందరికి మాత్రమే దక్కుతుంది అని తెలిసికోగలుగుతున్నాం.

కావ్యమీమాంస కర్త ఐన రాజశేఖరుణ్ణి పురస్కరించుకొని ఈ సాహితీ విద్య యశోదానందనుడైన శ్రీకృష్ణుని నుండే ప్రారంభమైంది. శ్రీ కృష్ణుడు ప్రథమాచార్యుడుగా బ్రహ్మ విష్ణు మొదలైన అర్వా నలుగురు శిష్యులకు ఈ సాహిత్య విద్యను ప్రదానం కావించినాడు. ఈ శిష్యులలో స్వయంభువుడైన బ్రహ్మ ఈ విద్యను తన మానసపుత్రులకు ఇచ్చినాడు. వీరందరిలో సర్వ శ్రేష్ఠుడైన సారస్వతేయ కావ్య పురుషుణ్ణి పురస్కరించుకొని బ్రహ్మ జగద్ధితరతితో ఈ కావ్య విద్యను లోకంలో ప్రవర్తింప చేయుమంటూ ఆజ్ఞాపించినాడు. ప్రజాపతిచేత ఆజ్ఞప్తుడైన ఈ కావ్యపురుషుడు ఈ విద్యను పద్దెనిమిది భాగాలుగా విభక్తం చేసి 18గురు శిష్యులకు దత్తం చేసినాడు. ఈ శిష్యులు వేరు వేరుగా కావ్యాంగాలను రచించి ఆ విద్యను సుసంపన్నం చేసినారు. వీరిలో

గ్రంథకారులు - గ్రంథవిషయానుక్రమణిక

1. సహస్రాక్షుడు - కవిరహస్యం
2. ఉక్తిగర్భుడు - ఔక్తికము
3. సువర్ణనాభుడు - రీతినిర్ణయము
4. ప్రాచేతసుడు - అనుప్రాసికం
5. యముడు - యమకము
6. చిత్రాంగదుడు - చిత్రం
7. శేషుడు - శబ్దశ్లేష
8. పులస్త్యుడు - వాస్తవం
9. ఔపకాయనుడు - ఔపమ్యం
10. పరాశరుడు - అతిశయము
11. ఉతత్థ్యుడు - అర్థశ్లేష
12. కుబేరుడు - ఉభయాలంకారికం
13. కామదేవుడు - వైనోదికం
14. భరతుడు - రూపకనిరూపణీయం
15. నందికేశ్వరుడు - రసాధికారికం
16. ధిషణుడు - దోషాధికరణం
17. ఉపమన్యుడు - గుణౌపదానికం
18. కుచుమారుడు - ఔపనిషదికం

అనే విషయాలపై గ్రంథాలను రచించినారు. (కా.మీ. ప్ర.అ. పుట - 3)

ఇంతేకాక రాజశేఖరుడు తన ప్రతిభా విశేషంతో కల్పనా చాతుర్యంతో ఈ సాహిత్య పురుష - సాహిత్య విద్యల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఒక సుందరమైన కథను కల్పించినాడు. ఇది ఐతిహాసికంగాకానీ, చారిత్రకంగా కానీ యథార్థం కాకపోయినా, పౌరాణిక దృష్టితో ఆలోచించినప్పుడు ఈ విద్య యొక్క ప్రాచీనతనూ ఈ విద్యకు దివ్య సంబంధంచేత సిద్ధించిన పూజార్హతలను స్థిరపరుస్తుంది.

పూర్వం బృహస్పతి శిష్యులు తమ ఎడ ప్రసన్నులైన గురుపాదులను పురస్కరించుకొని అడిగిన ప్రశ్నకు సమాధానంగా బృహస్పతి వారికి కావ్య పురుషోత్పత్తిని గూర్చిన కథను చెప్పినాడు. ఆ కథను అనుసరించి పూర్వం వాగ్దేవి పుత్రార్థినిఐ తుషారగిరిపై తపస్సు చేసింది. ఆమె తపస్సుతో సంతుష్టిని పొందిన బ్రహ్మ ఆమె కాంక్షను తీర్చ 'పుత్రంతేసృజామి' అంటూ కావ్య పురుషుణ్ణి సృష్టించినాడు. విరించి సృష్టించిందే తడవుగా బాల రూపిఐన ఆ కావ్య పురుషుడు లేచి నిలబడుతూ సరస్వతీదేవిని పురస్కరించుకొని ఛందస్వతి ఐన వాక్కులతో-

'యదే తద్వాఙ్మయం విశ్వ మర్థమూర్త్యావివర్తతే।
సోఽస్మికావ్య పుమానంబపాదౌవందేయతావాకౌ॥

(కా.మీ. అ 3.1)

అంటూ స్తుతించినాడు. కేవలం దేవలోక ప్రచలితమైన ఈ ఛందోమయ వాక్కు భాష (సంస్కృతం)లో కొత్తగా దర్శించిన వాగ్దేవి సంతుష్టఐ కావ్య పురుషుణ్ణి చూస్తూ వత్స! 'ఛందస్కాయా గిరః ప్రణేతా' అంటూ సంబోధించి చంకనెత్తుకొని నాయనా! ఛందోమయమైన ఈ నీవాక్కుతో సకల వాఙ్మయ రాశికంతటికితల్లినైన నన్నే వోడించినావు. నీ విజయం నాకెంతో ఆనందాన్ని పంచుతూ ఉంది. 'పుత్రాత్పరాజయోద్వితీయం పుత్ర జన్మ' అన్న అమేయమైన ఆనందాన్ని పొందు తున్నాను. నీకు పూర్వం ఉన్న విద్వాంసులందరూ గద్యమయి అయిన వాక్కునే చూడగలిగినారు, కానీ నీ వలె, ఛందోమయి అయిన పద్యరచన చేయలేదు. ఇందుకు నిన్ను నేను శ్లాఘిస్తున్నాను అని అంటూ ఇంకా ఆనందంతో నీకు శబ్దార్థాలు శరీరం సంస్కృతం నీ ముఖం, ప్రాకృతం నీకు చేతులు, అపభ్రంశం నీకు జఘనం, పైశాచీభాష నీకు పాదాలు, మిశ్రభాషనీకు వక్షస్థలం, నీవు సమ, ప్రసన్న, మధుర, ఉదార, మరియు ఓజో వంతుడవు. నీ వాక్కు ఉక్తిమంతము, రసం నీ ఆత్మ, ఛందం నీరోమకూపం, ప్రశ్నోత్తరప్రహేళికాదులు నీకువినోదాలు, అనుప్రాస ఉపమాద్యలంకారాలు నీకు సౌందర్య ప్రసాధనాలు, భవిష్యదర్థాభిధాత్రి ఐన శ్రుతి నిన్ను సంస్తుతిస్తుంది అంటూ దీవెనలు పెట్టింది.

ఇంతతో ఆగక సరస్వతీ దేవి-

'చత్వారిశృంగాస్త్ర యోఽస్య పాదాద్వేశీర్షేసప్తహస్తాసో7స్య
త్రిధాబద్ధోవృషభోరోరవీతి మహాదేవో మర్త్యానావివేశ॥

(కా.మీ.అ. 3.2)

(నాలుగు కొమ్ములూ మూడు పాదాలూ రెండు తలలూ ఏడు చేతులూ కలిగి మూడు ప్రకారాలుగా బంధింప బడ్డ భాషారూపమైన వృషభం రంకెవేస్తూ మహాదేవరూపంలో మర్త్య లోకాన్ని ప్రవేశించింది.)

అంటూ భాషాస్వరూపాన్ని గూర్చి సాకల్యంగా వివరిస్తూ కొడుకును చూచి నాయనా! నీవు బాలోచిత చేష్టలను మాని ప్రౌఢపురుషుని వలె ప్రాగల్భ్యాన్ని ప్రదర్శిస్తూ కర్మలు చేయుమంటూ హెచ్చరికలు పలికింది. ఈ విధంగా బుద్ధులు చెప్పిన తల్లి కొడుకును ఒక చెట్టు నీడన బండరాతిపై పదిలంగా పెట్టి తాను స్నానమాడ ఆకాశగంగకు వెళ్ళింది.

ఉశనుడు సాహితీ శిశువును కొనిపోవుట :

ఈ సందర్భంలో దర్భలూకుశలూ కొనిరా బయలుదేరిన ఉశనుడు (శుక్రుడు) మార్గ మధ్యంలో ఒంటరిగా ఎండవేడికి తల్లడిల్లుతున్న పసివాడిని చూచి ఎవరో అనాథ బాలుడంటూ కనికరంతో తన ఆశ్రమానికి కొని తెచ్చినాడు. ఆశ్రమంలో చేరి స్వస్థుడైన బాలుడు ఛందోమయమైన వాక్కులతో శుక్రునికి నమస్కరించి

నాడు. ఆస్తుతిని విన్న ఉశనుడు వెంటనే వాగ్దేవిని ఉద్దేశించి -

'యాదుగ్ధాఽపి నదుగ్ధేనకవిదోగ్ధృభి రన్వహమ్।
హృదినః సన్నిధత్తాం సాసూక్తిధేనుః సరస్వతీ॥

అంటూ స్తోత్రం చేసినాడు (ఏధేనువును ఎల్లప్పుడూ ఎందరు దోగ్ధలు అంటే కవులు పితికినా తరగనిపాల చేపులతో సదా సంపన్నమై ఉంటుందో అట్టి సూక్తిధేనువు సరస్వతి నా హృదయమందు సన్నిధత్తమై (సన్నిధిచేసి) ఉండుగాక లేదా నివసించుగాక)

ఆనాటి నుండే ఉశనుడు కవి అంటూ పిలువబడినాడు. అధ్యేతలందరికీ సుమేధసులనే పేరు స్థిరపడింది.

కవిశబ్దం సాధారణంగా కవృ - వర్ణనే అనే ధాతు నిష్పన్నమైంది. అందుకే వర్ణన అంటే 'కావ్యకర్మ'. అదే 'రచన' చేసేవారందరూ కవి శబ్ద వాచ్యులైకవులుగా సంకేతింపబడినారు. ఈ సామ్యం చేతనే కావ్య పురుషుడుకి కూడా కవి అనే సంజ్ఞ దక్కింది. కవికర్మ (కావ్యం)తో సమానుడైన కారణంతో సారస్వతేయుడు కావ్య పురుషుడైనాడు.

ఇంతలో ఆకాశగంగనుండి స్నాతఐ వచ్చిన సరస్వతీ దేవికి తాను బండపై విడిచిపెట్టి వెళ్ళిన కుమారుడు కనిపించక వ్యాకుల చిత్తఐ ఆక్రందనం చేసింది. ఈ సందర్భంలో కాకతాళీయంగా ఆ చోటికి చేరిన వాల్మీకి మహర్షి ప్రసంగవశాత్తు వాగ్దేవికి ఆమె పుత్రుని జాడ చెప్పి ఓదార్చుతూ ఆమెను భృగునందనుడైన శుక్రుని ఆశ్రమానికి తీసుకొని వెళ్ళినాడు. ఆ దేవి అక్కడ కొడుకును చూచి హర్షపులకిత ఐ పాలధారలు స్రవిస్తూ ఉండగా కొడుకును ఎత్తుకొని ముద్దాడుతూ, కృతజ్ఞతా సూచకంగా, ప్రాచేతసుడైన వాల్మీకి మహర్షికి కూడా ఆనందంతో చందోమయి అయిన వాక్కును వరంగా అనుగ్రహించింది. ఈ వరప్రభావమే వాల్మీకిని తొలి కావ్యకర్తగా చేసింది.

సాహిత్య విద్య లేదా అలంకార శాస్త్రోత్పత్తి :

పూర్వం ఒకప్పుడు వేదార్థవిషయమై బ్రహ్మర్షులకూ దేవతలకూ మధ్య వివాదం ఏర్పడింది. ఈ వివాదాన్ని పరిష్కరించడానికై సరస్వతీ దేవిని బ్రహ్మ- తన లోకానికి రమ్మంటూ వార్త పంపినాడు. బ్రహ్మ ఆదేశాన్ని పురస్కరించుకొని సత్యలోకాన్ని గూర్చి ప్రయాణ మౌతున్న తల్లి వెంట తానూ వస్తానంటూ కుమారుడైన కావ్య పురుషుడు మారాం చేస్తూ పయనమైనాడు. కానీ చతుర్ముఖుని ఆజ్ఞ లేనిదే నీవు సత్య లోకానికి రాకూడదు అంటూ కఠినంగా కొడుకును మందలిస్తూ కావ్య పురుషుడిని విడిచి వెళ్ళిపోయింది. తల్లి వెంట సత్యలోకానికి వెళ్ళలేని కావ్య పురుషుడు పెద్దగా రోదనం ప్రారంభించినాడు. అది చూచి అతని స్నేహితుడు పార్వతేయుడైన కుమారస్వామి కూడా శ్రుతికల్పుతూ ఏడ్పు అందుకున్నాడు. ఇది చూచిన పార్వతీదేవి కొడుకును ఏదో విధంగా ఓదార్చి కావ్య పురుషుణ్ణి కూడా ఓదార్చేందుకు మార్గాన్ని ఆలోచించింది. ఆ ఆలోచనా సందర్భంలో ఆమె మనస్సులో మెరుపు వంటి ఒక భావన ప్రకాశించింది. అదే ప్రేమానుబంధం.

సాధారణంగా ప్రాణభృతులందరికీ ప్రేమను మించిన బంధనం మరొక్కటి లేదు. అందుకే ఈ సారస్వతేయుణ్ణి బంధించేందుకు వశీకరణ యంత్రంగా ఒక స్త్రీని సృజిస్తాను అంటూ ఆలోచించి సాహిత్య వధువును సృష్టించింది. తన చేత సృష్టింపబడిన నవవధువును చూస్తూ పార్వతీదేవి 'తల్లీ నీకు ఈ కావ్య పురుషుడు భర్త, కానీ, ఆయన ఇప్పుడు కుపితుడై వెళ్లుతున్నాడు. అతణ్ణి ఏ విధంగా నైన మళ్ళించుకొని నీ పతిని నీవు దక్కించుకో అంటూ బుద్ధులు గరిపింది. ఆ తరువాత ఆదేవి మునులను ఉద్దేశిస్తూ

'మునులారా! మీరు కావ్య విద్యాస్నాతకులరు, మీ విద్యాప్రభావంతో ఈ ఇద్దరు దంపతులను స్తుతించండి' అంటూ ఆదేశిస్తూ చివరకు ఈ స్తోత్రమే మీకు 'కావ్య విద్యా సర్వస్వం' కాగలదు అంటూ అనుగ్రహించింది.

పార్వతీదేవి ఆదేశంతో సాహిత్య వధువు వివిధ వేషభూషాది అలంకరణలతో తన్నలంకరించుకొని అతని మనస్సునకు ఆహ్లాదాన్ని సమకూర్చే ప్రయత్నం చేస్తూ ఆ కావ్య పురుషుణ్ణి వెంబడిస్తు నలుదిక్కులా

పయనించింది. చివరకు సాహిత్య పురుషుడు ఈమెకు వశుడై కామదేవుని క్రీడాస్థానమైన వత్సగుల్మనగరంలో గాంధర్వ విధితో సాహితీ వధువును వివాహమైనాడు. ఆనాటి నుండే సాహిత్య విద్య ప్రారంభమైంది.

క్రియాకల్పం : ఈ సందర్భంలో సాహిత్య (కావ్య) పురుషుడు అంటే కావ్యకళ లేదా కవిత్వం. అతని భార్య, సాహిత్య విద్య, అదే విమర్శ, లేదా విమర్శ లక్షణం. ఇదే ఆధునికులు ఈ కాలంలో చెప్పుకునే 'Principles of Criticism. ఈ విద్యనే మన ప్రాచీనులు 'అలంకార శాస్త్రం' అంటూ పేర్కొన్నారు. విచిత్రంగా ఈ అలంకార శాస్త్రానికి 'క్రియాకల్పం' అనే పేరున్నట్లు ప్రాచీన గ్రంథాధారాల వల్ల తెలుస్తుంది. ఉదాహరణకు కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో వివిధ తత్త్వ దర్శనాలను అంటే వేద, శాస్త్ర, వ్యవసాయ, రాజనీతి అనే నాలుగు విద్యలను పేర్కొన్నాడు. ఈ నాల్గింటికి తోడుగా రాజశేఖరుడు 'సాహితీ విద్యను' కూడా చేర్చి 'పంచమీ సాహితీ విద్యా' అంటూ పేర్కొన్నాడు. అంతేకాక ఈ 'సాహితీ విద్య'కు అధిక ప్రాముఖ్యాన్ని కల్పిస్తూ ఈ విద్య నాల్గు విద్యల సారతత్వం, ఇదే ధర్మ సాధకం అంటూ ప్రకటించినాడు.[1]

వాత్స్యాయనుడు కామసూత్రంలో అరవై నాలుగు కళలను గూర్చి చెప్పే సందర్భంలో క్రియాకల్ప విధిని కూడా చేర్చినాడు. క్రియా కల్పం అనే ఈ పదాన్ని పురస్కరించుకొని శ్రీ రాఘవన్ "It is very likely Kriyakalpa is a subject related to literature and poetry అంటూ పేర్కొన్నాడు. కామసూత్ర టీకా కారుడైన జయమంగళుడు "క్రియాకల్ప ఇతికావ్య కరణ విధిః" అంటూ చెప్పి ఆ విద్యా స్వరూపాన్ని సాకల్యంగా వివరించినట్లుగా 'కావ్యాలంకార ఇత్యర్థః' త్రితయమపి (అభిధాన, ఛంద, అలంకార) కావ్య క్రియాంగం, పరకావ్యావబోధార్థంచ' అంటూ పేర్కొ న్నాడు. నిజానికి కావ్య రచనకు కానీ, ఇతరుల కావ్యాన్ని పరిశీలించి బాగోగులు నిర్ణయించేందుకు కానీ, అభిధాన విద్య, ఛందోజ్ఞానం, అలంకార శాస్త్ర పరిజ్ఞానం అనేవి మూడూ తప్పక ఉండవలసినవే. అందుకే ఈ అంశాలను కావ్య కరణ విధులుగా గుర్తించినాడు.

జయమంగళుని వ్యాఖ్యను పురస్కరించుకొని ఆలోచిస్తే 'కావ్యకల్పం' అంటే అలంకారశాస్త్రం అనీ ఈ శాస్త్రమే సాహిత్య విద్యగా, కావ్య లక్షణశాస్త్రంగా, ఆలోచనా శాస్త్రంగా గ్రహింపబడుతూ వచ్చిందని ఆలోచించుటకు తావున్నది. ఈ సందర్భంలో క్రియ అంటే 'కావ్యక్రియ', కల్పశబ్దాన్ని మనం 'విధి' అనే అర్థంలో స్వీకరిస్తే 'క్రియాకల్ప శబ్దా'నికి కావ్య క్రియావిధి' లేదా కావ్య లక్షణం' అంటూ గ్రహించవచ్చు.

శ్రీధరులవారు భాగవత వ్యాఖ్యారచన సందర్భంలో 'క్రియాకల్ప' శబ్దాన్ని పురస్కరించుకొని కేవలం వ్యాకరణ పరంగా అనుసంధించుకొని ధాతురూపాలు, వాటిపై చేరే ప్రత్యయాల వల్ల కలిగే మార్పులూ, ఏర్పడే వివిధ క్రియా స్వరూపాలుగా వివరించినారు. కానీ ఈ వివరణతో ఆధునికులైన ఆచార్యులు తృప్తిని పొందలేదు. వీరిలో ప్రధానంగా పి.కె. ఆచార్య అనే విద్వాంసుడు ఈ క్రియాకల్ప శబ్దాన్ని పురస్కరించుకొని 'Kriya Kalpi is not only the art of derivation and conjugation of verbs in various ways' అంటూ కొంత వైముఖ్యాన్ని ప్రదర్శించి, జయమంగళకారుడైన యశోధరుని భావంతో ఏకీభవిస్తూ క్రియాకల్పం అంటే కేవలం వ్యాకరణ సంబంధి ఐన ధాతురూపాలూ, దశవిధలకారరూపాలూ, ఇతర ప్రక్రియా విధులు మాత్రమే కావు, ఇందులో అలంకార శాస్త్రాన్ని కూడా చేర్చడం యుక్తం అంటూ భావించినారు.

తరుణవాచస్పతి కూడా దాదాపు జయమంగళ కర్తతో ఏకీభవించి నట్లుగా 'క్రియావిధి'ని 'రచన ప్రకారం' అంటూ గుర్తించినాడు.

వామనుని కావ్యాలంకార సూత్ర వృత్తిని పురస్కరించుకొని వ్రాసిన తిప్ప భూపాలుని కామధేను వ్యాఖ్యలో, భామహుడు ఇచ్చిన అరవైనాలుగు కళల పట్టికలో 'క్రియాకల్ప' శబ్దానికి బదులు కావ్య లక్షణాలను

[1]. పంచమీ సాహిత్య విద్యా సాహిచత్రసాణామపి విద్యానాం విస్యందః

అబ్ధిర్ధర్మార్థోయద్విద్యా తద్విద్యానాం విద్యత్వమ్ - కావ్యమీమాంస

చేర్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆధారాల ననుసరించి క్రియా కల్పం అంటే 'కావ్యలక్షణశాస్త్రం' అంటూ మనం గ్రహించవచ్చు.

వాల్మీకి రామాయణం ఉత్తర కాండలో శ్రీరామ చంద్రుని సభలో రామాయణగానాన్ని వినేందుకు అక్కడ కూడిన విద్వాంసులను పురస్కరించుకొని 'క్రియాకల్ప విదశ్చైవ జనాన్ పదాక్షర సమాసజ్ఞః, ఛందసిపరినిష్ఠి తాః , శబ్దవిదః' అంటూ వాల్మీకి స్పష్టపరచినాడు. ఈ సభాసదులలో ఆనాడు విద్వాంసులుగా పరిగణింపబడిన వారిలో పద అక్షర సమాసజ్ఞులైన వ్యాకరణ వేత్తలనూ, ఛందోలక్షణ విదులనూ వేరు చేయగా మిగిలిన వారు క్రియాకల్పవిదులుగా మనము గ్రహింపవచ్చు. ప్రకరణ శుద్ధిని పురస్కరించుకొని ఈ సందర్భంలో 'క్రియా కల్పం' అనగా 'అలంకారశాస్త్రం' అనే అర్థంలోనే ఆ శబ్దాన్ని గ్రహింపగలుగుతున్నాం. అందుకే క్రియాకల్ప విదులు అనగా కావ్యవిదులు, కావ్య శాస్త్రవేత్తలు లేదా కావ్య లక్షణ విదులు అంటూ మనం అర్థగ్రహణం చేయగలుగుతున్నాం. ఈ ఆధారాలవల్లనే రామాయణ రచనాకాలం నాటికే మన భారతీయులు కావ్య విద్యలో అంటే అలంకారశాస్త్రంలో బాగా పరిజ్ఞానం కలవారుగా కన్పిస్తున్నారు.

ఇట్లే లలిత విస్తారంలో ఇచ్చిన కళల పట్టికలో 'క్రియాకల్ప' శబ్దం ప్రయోగింపబడినట్లు పండితులు పేర్కొంటున్నారు.

ఆచార్య దండి తన కావ్యాదర్శంలో 'వాచాంవిచిత్ర మార్గాణాంనిబబంధుః క్రియావిధిమ్' అంటూ ప్రయో గించినాడు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆలోచిస్తే దండ్యాచార్యులకు క్రియాకల్ప శబ్దంతో బాగా పరిచయం ఉన్నట్లు గోచరిస్తుంది. ఈ కారణం వల్లనే ఆనాడు క్రియాకల్ప శబ్దానికి కావ్యశాస్త్రం అనే అర్థంలో ప్రాచుర్యం సిద్ధించినట్లు మనం భావించవచ్చు. అందుకే ఆచార్య దండి సయితం సంప్రదాయానుసారంగా కావ్యశాస్త్రా ర్థంలో స్వీకరించి క్రియావిధి అంటూ ప్రయోగించినట్లు గోచరిస్తుంది. నిజానికి 'కల్పం' అంటే విధి, లేదా శాస్త్రం అనే అర్థాలున్నవి.

ఈ క్రియా పదానికి ఆప్టే నిఘంటువునిస్తూ కాళిదాసకృత విక్రమోర్వశీయ, మాళవికాగ్ని మిత్ర నాటకాల్లో కనిపించే - 1. 'కాళిదాసస్య క్రియాం బహుమానః', 2. 'శృణుతమనోభిరవహితైః క్రియా మిమాంకాళిదాసస్య' (విక్ర 1.2) అనే సందర్భాలను పేర్కొని ఉద్ధరించినారు.

ఈ నిఘంటువు ననుసరించి 'క్రియా' శబ్దం 'కావ్యక్రియా'ర్థద్యోతకమైంది. ఇట్లే 'క్రియాకల్పం' అనే శబ్దానికి 'కావ్యకల్పం' అనే అర్థనిష్పత్తిని కల్పించుకోవచ్చు. ఈ ఆధారాలన్నిటిని అనుసరించి క్రియాకల్ప విధిలేదా అలంకార శాస్త్ర పరిజ్ఞానం మనకు ప్రాచీనకాలం నుండే సంక్రమించిన విద్యగా భావించే అవకాశం ఉంది.

క్రియాకల్ప వికాసం : సకల కవికులోపజీవ్యుడుగా ఆరాధింపబడుతూ ఆదికవిగా గుర్తింపబడిన వాల్మీకి మహర్షి ప్రథమ ఆలోచకుడుగా కూడా ప్రశంసలందు కున్నాడు. (రఘు. 14-70)

రామాయణ బాలకాండలో కన్పించే శ్లోకం ఆధారంగా రామాయణంలోనే ఆలోచనా శాస్త్రానికి బీజావాపం జరిగినట్లు భాసిస్తుంది. ఉదాహరణకు -

'సమాక్షరైశ్చతుర్భిర్యః పాదై ర్గీతో మహర్షిణా।
సోఽను వ్యాహరణాద్ భూయః శ్లోకః శ్లోకత్వమాగతః॥
(వా.రా.బాల.కా. 2-40)

అనే శ్లోకాన్ని పేర్కోవచ్చు. ఈ శ్లోకమే వాల్మీకిని మహాభావుకునిగా నిల్పింది. తరాల వెంబడివచ్చే తరాల కావ్య భావాభివ్యక్తికి మూల స్రోతస్విని ఐ ఉపకరిస్తూ వచ్చింది.

తరువాత మనకు ఉపకరించేవి శాసనాధారాలు. క్రీ.శ. 150నాటి గిరినారు శాసనంలో ఉల్లేఖింపబడిన విషయాలను పరిశీలించినప్పుడు రుద్రదాముని కాలం నాటికే కావ్యంలో స్పష్టత, కాంతి, మాధుర్య, ఉదారాది లక్షణాలు లేదా గుణాలు ఉండవలెనని సూచించినట్లు గోచరిస్తుంది.

విక్రమ శకప్రారంభానికి 300 ఏళ్లకు పూర్వం నుండే మన దేశంలో ఆలోచనా శాస్త్రానికి ఒక శాస్త్రీయమైన దృక్పథం ఏర్పడినట్లుగా ఆయా లాక్షణికుల గ్రంథాలూ వాటిపై వెలసిన వ్యాఖ్యానగ్రంథాలూ సాక్ష్యం ఇస్తున్నాయి.

కావ్యాదర్శ టీకాకారుని అనుసరించి 'కావ్యాదర్శ'కు పూర్వమే కాశ్యప, వరరుచి అనే విద్వాంసులు లక్షణ గ్రంథాలను రచించినట్లుగా తెలుస్తుంది. కేవలం ఈ టీకా కారుడే కాకుండా సింహళ ద్వీప నివాసిచే రచితమైన 'పియవసలకర' అనే గ్రంథంలో కూడా ఆచార్య కాశ్యపుని పేరు ఉల్లిఖితమై గోచరిస్తుంది. కశ్యప, బ్రహ్మదత్త, నందిస్వామి అనే ఆచార్యులు భామహ, దండ్యాచార్యులకు పూర్వమే అలంకార శాస్త్రకర్తలుగా గుర్తింపబడి ప్రసిద్ధులైనట్లు ఆధారాలున్నాయి.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో, రాజశాసన ప్రకరణంలో రాజాజ్ఞలను వ్రాసి ప్రకటించే సందర్భంలో అర్థక్రమ, పరిపూర్ణత, మాధుర్య, స్పష్టత, అనే గుణాలకు తావు కల్పిస్తూ వ్రాయవలసిందిగా ఆదేశించినట్లు కన్పిస్తుంది. ఈ మాటలు ఆధారంగా పరిశీలిస్తే ఆ కాలం నాడు పాటించే కావ్య గుణం లేదా లక్షణం మనకు కొంత తెలిసివస్తుంది. అంటే అర్థక్రమ, స్పష్టత, మాధుర్య, పరిపూర్ణతలనే నాలుగూ ఉత్తమ కావ్య రచనకు తప్పక కావలసిన కావ్య ధర్మాలు అని కౌటిల్యునిమతమైనట్లు మనం భావించవచ్చు. కానీ మనకు సర్వాంగ సుందరమైన సంపూర్ణ కావ్య విచారం తొలుత భరతుని నాట్య శాస్త్రం నుండే ప్రారంభమైంది. ఐనా ఈ ఆలోచనా సర్వస్వం నాటక సంబంధి ఐ సాగిన కారణంతో అలంకారశాస్త్రం ఒక ప్రత్యేక శాస్త్రంగా పరిగణింప బడక నాట్య శాస్త్ర అంతర్భాగంగానే స్వీకరింపబడింది.

అలంకార శాస్త్ర ప్రారంభం :

క్రీస్తుశకం ఐదవశతాబ్ది నుండే మనకు నిర్దిష్ట రూపంలో విధి విధాన సహితంగా అలంకారశాస్త్రం అనే కావ్య విధికి శ్రీకారం చుట్టబడినట్లు పేర్కోవచ్చు. ఈ అలంకారశాస్త్రమే కావ్యకల్పవిధిగా, క్రియా కల్ప విద్యగా, ఆలోచనా శాస్త్రంగా, కావ్య లక్షణ రూపంగా వ్యవహరింప బడుతూ వచ్చింది.

భామహుడు తొలుతగా తన భామహాలంకార గ్రంథంలో 'అవలోక్య మతానిసత్కవీనా మవగమ్య స్వధియా చకావ్య లక్ష్మ సుజనావగమాయ భామహేన ప్రథితం రక్రిలగోమిసూనునేదం" (భామ. అలం. 6/64) అంటూ వ్రాసి తన కన్నా పూర్వులైన ఆచార్యులు అలంకారశాస్త్రకర్తలుగా ఉండేవారనీ వారి గ్రంథాలన్నీ పరికించిన తరువాతనే భామహాచార్యుడు ఈ లక్షణ గ్రంథాన్ని వ్రాసినట్లు మనకు విదితం చేసినాడు. అట్టి ప్రాచీనాచార్యులలో మేధావి రుద్రుడొకడు. ఈయన అంధుడు. కేవలం ప్రతిభ వల్లనే మహాకవి కాగల్గినాడు. ఈ కారణం వల్లనే రాజశేఖరుడు ప్రతిభా నిరూపణ సందర్భంలో ఈయన పేరును ఉద్ధరించినాడు.

నిమి 'సాధు'ను అనుసరించి మేధావి రుద్రుడు కేవలం ప్రతిభామతి ఐన కవియే కాదు, లాక్షణికుడైన సాహిత్యా చార్యుడని కూడా తెలుస్తుంది. ఈ విధంగా భామహుని నుండి క్రమంగా సాహిత్య ప్రవర్తకుల పరంపర ప్రారంభమైంది. లాక్షణికులు తమ గ్రంథాలను అలంకారశబ్దంతోనూ సాహిత్య శబ్దంతోనూ సంకేతించడం ప్రారంభించినారు. ఉదాహరణకు - కావ్యాలంకార, అలంకార సర్వస్వ, సాహిత్య దర్పణ, సాహిత్య మీమాంస మొదలైనవి.

అలంకార శాస్త్ర సంప్రదాయం

కావ్య సాహిత్యం :

భామహుడు శబ్దార్థౌసహితౌ కావ్యం అన్నాడు. ఈ నిర్వచనం అనేక విధాలైన సాహిత్య సిద్ధాంతాలకు దారి తీసింది. ఈనాటి నుండే అలంకారశాస్త్రానుశీలనంలో నూతన సంప్రదాయ ప్రాదుర్భావం జరిగింది. కావ్య శరీర చర్చతో ప్రారంభమైన ఈ విద్య రాను రాను కావ్యాత్మను గూర్చిన వివేచనం ప్రారంభించింది. సాహిత్య పాథోరాసులని చెప్పదగిన మహావిద్వాంసుల మధ్య నెలకొన్న ఈ శాస్త్ర చర్చ అద్భుతమైన సాహిత్య సిద్ధాంతాలను స్థాపిస్తూ ఆ శాస్త్రానికి సర్వతో ముఖాభివృద్ధిని చేకూర్చింది.

అలంకార సర్వస్వ టీకాకారుడైన సముద్ర బంధువు ఆయా సంప్రదాయ ప్రారంభ వికాసాదులను నిర్మాణాత్మకంగా ప్రదర్శించినాడు. ఈ పండితుని అనుసరించి కావ్యం అంటే కేవలం వాచ్యవాచక (శబ్దార్థ) సంబంధం కాదు. అదొక విశిష్ట సంబంధం. విశిష్టశబ్దం - అర్థం కలిసి, కావ్యం కాగలుగుతుంది. అయితే ఈ శబ్దార్థాల యొక్క విశిష్టత మూడు విధాలుగా ఏర్పడుతుంది. 1. ధర్మం నుండి 2. వ్యాపారం నుండి 3. వ్యంగ్యం నుండి. తిరిగి ఈ మూడింటిలో ధర్మమూలమైన వైశిష్ట్యం నిత్య-అనిత్య భేదాలతో రెండు విధాలు. నిత్య ధర్మము గుణ సంబంధమై, అనిత్యధర్మం అలంకార సంబంధమై భాసిస్తుంది. ఈ విధంగా ఏర్పడే ధర్మ మూలక వైశిష్ట్య ప్రతిపాదక సంప్రదాయం 1. అలంకార 2. గుణ లేదా రీతి సంప్రదాయాలకు దారి తీసింది.

II. వ్యాపారమూలక వైశిష్ట్యం కూడా రెండు విధాలుగా విభక్తమైంది. 1. వక్రోక్తి 2. భోజకత్వ వ్యాపారం.

1. వక్రోక్తి వలన కావ్యానికి చమత్కారం సిద్ధిస్తుంది అని భావించే వారిలో కుంతకుడు అగ్రగణ్యుడు. ఈ ప్రాధాన్యం చేతనే ఆయన మతం వక్రోక్తి సంప్రదాయంగా ప్రసిద్ధిని సంతరించుకున్నది.

2. భోజకత్వవ్యాపారం: ఈ భోజకత్వవ్యాపార కల్పనం తొలి సారిగా భట్టనాయకునిచేత కావింపబడింది. కానీ తరువాతి ఆలంకారికులు ఈ మతాన్ని ప్రత్యేకంగా స్వీకరింపక భరతుని రససిద్ధాంతంలోనే అంతర్లీనం కావించినారు. ఈయన ఈ భోజకత్వ వ్యాపారాన్ని వేరుగా కాకుండా రసనిష్పత్తి సందర్భంలో జనించే ప్రత్యేకమైన ఒక రసానుకూల పరిస్థితిగా స్వీకరించినాడు. విభావ అనుభావ సంచారీభావ సంయోగం వల్ల కలిగే రసనిష్పత్తికి అనుకూలమైన వ్యాపారంగా ఈ భోజకత్వ వ్యాపారాన్ని పరికల్పనం చేసిన కారణంతో దీనికి ప్రత్యేకవ్యక్తిత్వం లేక రస సిద్ధాంతంలో ఒక భాగంగా కలిసి పోయింది.

3. వ్యంగ్య ముఖముతో వైశిష్ట్య సంపాదనం : ఈ విధానంలో పేరొందిన ఆచార్యుడు ఆనందవర్ధనుడు ఈతని సిద్ధాంతానికి ధ్వని సిద్ధాంతం అని పేరు.

రససంప్రదాయం : అలంకార సిద్ధాంతాలుగా వెలసిన ఆరు సంప్రదాయాలలో రస సంప్రదాయం అన్నిటికన్నా ప్రాచీనమైంది. కావ్య సిద్ధాంతాలన్నీ స్పష్టాస్పష్టరూపంలో ఈ రసవాదంపై ఆధారపడి ఉన్న కారణంతో ఈ సిద్ధాంత మాహాత్మ్యం అధికతరమైందిగా భావించవచ్చు.

రస నిర్వచనం: రసాస్వాదే అనగా రుచిని గ్రహించుట. 'స్వాదోరసగ్రహణే'. లౌకిక రసాలైన మధుర, ఆమ్లాదులను జిహ్వాద్వారా రసగ్రహణం చేయవచ్చు. అంటే రుచిని గ్రహించవచ్చు. కానీ అలౌకికాలైన శృంగారాదులను రత్యాది స్థాయీ భావాల వల్ల అభివ్యక్తమైన తరువాత మనస్సుతో ఆస్వాదించ వచ్చును లేదా రమింపవచ్చును. దీనికే రసచర్వణం అని పేరు.

రససిద్ధాంత ఆవిర్భావ వికాసాలు:

రసశబ్దం మొదలు ఋగ్వేదంలో కన్పిస్తుంది.

1. సోమరసం (దధానః కలశేరసమ్ యస్యతే మద్యం రసమ్ IX 65-15)

2. 'సాధోఃపిబప్రతికామం యధింతే రసా శిరః ప్రథమం సోమస్య' అంటూ నీళ్లకు సంకేతంగా రస శబ్దం ప్రయోగింపబడింది.

3. రసా దధీత వృషభమ్ VIII 72, 13. 4. భరద్ధేనూ రసవచ్ఛి క్రియేపయః V 44, 13

ఇక్కడ రసవత్ - అంటే కమ్మని వాసన, సువాసన అనే అర్థంలో గ్రహించవచ్చు. అధర్వవేదంలో - ఆహార్షం ధాన్యం రసమ్ - అంటూ కన్పించే రసశబ్దానికి sap of grain అనే అర్థాన్ని గ్రహించినారు. ఇక్కడ ఓషధీసారం, అనే అర్థమే కాని పాలూ, నీరు అనే అర్థంలో రసశబ్దం గ్రహింపబడలేదు.

రుచి అనే అర్థంలో ఈ రసశబ్దం 'తవ్రో రసోమధుప్పు చామరంగమ' అనే సందర్భంలో పర్యాప్తమై కనిపిస్తుంది. అంటే నాకు అత్యంతము తృప్తినీ రుచినీ ఇచ్చే పానీయం మధు మిళితమై నన్ను చేరుగాక అంటూ కోరినాడు ఆ మహానుభావుడు. ఇట్లే 'యోనోరసం పిప్సతి పిత్వో అగ్నే'

- ఇక్కడ ఓ అగ్నీ మేం ఆనిన మధువు రుచిని ఎవ్వడు భగ్నం చేస్తాడో చూసుకో అంటూ హెచ్చరికలు పలుకుతూ చేసిన వీరాలాపం కనిపిస్తుంది. ఉపనిషత్తులకాలంలో ఈరసశబ్దం ప్రధాన సారభూతం, సారం, ప్రధానం, అనే అర్థాల్లో ప్రచలితమైంది. తైత్తరీయంలో 'రసోవైసః రసంహి ఏవాయం లబ్ధ్వా నందీభవతి' అంటూ కన్పించే రసశబ్దానికి 'ఉత్తమరుచి', 'మేలైన', అనే అర్థాలున్నవి. అట్లే ఈ శబ్దం రాను రాను ప్రకృతి యొక్క సంపూర్ణా విష్కారం, తరగని ఆనందం అనే అర్థాలను సంతరించు కున్నది. అందుకే మన ప్రాచీనులు రసాన్ని సంపూర్ణమైన ఆనందానికి సంకేతంగా స్వీకరించినారు.

భావనిర్భరమైన హృదయం నుండి అకస్మాత్తుగా వాక్కు లయబద్ధమై వెడలినప్పుడు కవిత ఆవిష్కృత మౌతుంది. అందుకే Milton 'un premeditated song is a poetry' అన్నాడు. అటువంటి భావనిర్భరమైన కవితను వ్రాసినవాల్మీకి రససిద్ధాంతానికి ఆదిమ గురువైనట్లు పెద్దలు సంభావిస్తున్నారు.

కావ్యశాస్త్రాలల్లో ఈ రసశబ్దానికి ప్రయోగం వైజ్ఞానిక, దార్శనిక, ఆధ్యాత్మిక సిద్ధాంతాల్లో ప్రచలితమై కన్పిస్తుంది.

కామసూత్రాల్లో ఈ రసపదం ప్రీతి, వేగం, అనే అర్థాల్లోనే కాకుండా రాగ శబ్దానికి పర్యాయవాచిగా ఉండినట్లుగోచరిస్తుంది. కావ్య శాస్త్ర పరమైన ఈ రస శబ్దాన్ని ఆయుర్వేద పరంపర నుండి గ్రహించినట్లుగా కొందరు విద్వాంసులు భావిస్తున్నారు. వారు కేవలం రసశబ్దాన్నే కాక, భావం, భావన శబ్దాలను కూడా ఆయు ర్వేదము నుండి గ్రహింపబడినవిగానే భావిస్తున్నారు.

రసనిర్వచనం : భరతుడు తొలి సారిగా నాట్య శాస్త్రంలో రస ఇతిః పదార్థః అంటూ వివేచన ప్రారంభించి 'నహిర సాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే' అంటూ రస ప్రాధాన్యాన్ని స్థాపించి 'విభావాను భావ సాత్విక వ్యభిచారీ భావ సంయోగాద్ర ననిష్పత్తిః' అంటూ రస నిర్వచనం చేసినాడు. ఈ నిర్వచనమే అనేక సిద్ధాంతాలకు దారి తీసింది. అట్లే రస సంఖ్యలో కూడ ఏకతకుదరలేదు. కొందరు శృంగారాదులైన ఎనిమిది రసాలనే గ్రహిస్తూ తొమ్మిదవ రసంగా శాంతరసాన్ని స్వీకరించలేదు. తరువాతి లక్షణకారులు శాంతాన్నే కాకుండా మధురభక్తికి రసత్వాన్ని కల్పించినారు. మాయారసాన్ని వాత్సల్య రసాన్ని, ప్రేయోరసాన్ని అంగీకరించినారు. ఈ విధంగా చూస్తే కావ్య శాస్త్ర ఇతిహాసంలో రస సంప్రదాయం సర్వాధికమైన ప్రాచీన కావ్య సంప్రదాయంగా భాసిస్తుందని చెప్పవచ్చు.

రెండవది అలంకార సంప్రదాయం: అలంకారం అంటే ఏ పదార్థం లేదా తత్త్వంతో ఏదేని వస్తువు సుశోభితం చేయబడుతుందో లేదా దాని సౌందర్యానికి వృద్ధిని కల్పిస్తుందో అది అలంకారం అనబడుతుంది. అంటే శబ్దార్థరూప శరీరం కలిగిన కావ్యాన్ని అలంకరించే శోభాదాయక వైశిష్ట్యాలకు అలంకారాలని పేరు.

అలంకారాలు కేవలం కావ్యోత్కర్ష హేతువులై నప్పటికి చిత్ర విధానమూ బింబ విధానాలైన కావ్యరీతుల్లో కవులకు ప్రధాన సాధన భూమిగా ఉపకరించినాయి. ఇవి కవి మనోగతికి మానదండాలని చెప్పవచ్చు. ఈ అలం కారాలు అప్రస్తుత నియోజనంలో ఎంతో ఉపయుక్తకర మైన భూమికను నిర్వహిస్తున్నాయి. అలంకారాల్లో కల్పన యొక్క విచిత్ర విహారం గోచరిస్తుంది. అలంకార స్థానం కళామూలకశాస్త్రంలో చేరుతుంది.అందుకే రాజశేఖరుడు 'ఉపకారతత్వాత్ అలంకారః సప్తమ మంగమితి యాయవ రీయః' అంటూ సంభావించినాడు. సౌందర్యం కావ్యము యొక్క ప్రధాన లక్షణం. ఏ విధంగా ఉష్ణం లేకుండా అగ్నిని ఊహించ లేమో ఆ విధంగానే అలంకారం లేని కావ్యాన్ని ఊహించ లేము. అంటూ ప్రాచీనాలంకారికులు భావించినారు. ఈ అలంకార సిద్ధాంత ప్రథమ ప్రవర్తకుడు భామహుడు. ఇంతకు పూర్వం భరతుడు నాట్య శాస్త్రంలో కేవలం 1. అనుప్రాస, 2. ఉపమ 3. రూపక 4. దీపకం అనే నాలుగు అలంకారాలను మాత్రమే స్వీకరించినాడు. ఈ నాలుగు అలంకారాలే రాను రాను అంటే కువలయానంద గ్రంథకాలం నాటికి సంఖ్యలో 125 (నూటా ఇరవై ఐదింటికి) పెరిగినాయి. అట్లే అలంకార విభజన

కూడా ప్రారంభమైంది. తొట్ట తొలుత అలంకార విభజనకు ప్రయత్నించిన ఆలంకారికుడు రుద్రటుడు.

ఆలంకారికుల యోగదానం : ఆలంకారికులు భారతీయ దార్శనికులమతాన్ని ఖండిస్తూ వ్యంజన రూపమైన ఒక శబ్దశక్తిని స్వతంత్రంగా ప్రతిష్ఠింప గలిగినారు. ఇది ఎంతో శ్లాఘనీయమైన యోగదానము. నిజానికి స్ఫోట సిద్ధి కొరకు వైయా కరణులకు వ్యంజనా వృత్తికల్పనం చేయవలసి వచ్చింది. వీరి ఆధారంపైనే మన ఆలంకారికులు వ్యంజనా వృత్తిని స్థాపింపగలిగినారు.

ఆలంకారికులకు రసతత్త్వం తెలుసు : సాధారణంగా అలంకార మతానుయాయులైన ఆచార్యులకు రసత్తత్వం తెలియదు అనే అపవాదున్నది. కానీ అది సరిఐనది కాదు. అలంకార ప్రధానవాదులకు రసతత్వం తెలిసినా వారు దానికి స్వతంత్రమైన ప్రత్యేక స్థానాన్ని ఇవ్వక రసాన్ని అలంకారాదుల్లో ఒకటిగా చేర్చినారు. అంటే రసాన్నిరసవత్, ప్రేయస్, ఊర్జస్వీ, సమాహితా లనే అలంకారాల్లో అంతర్లీనం చేసినారు. ప్రాచీనాలంకారికులు కేవలం రస విషయంతోనే కాకుండా ప్రతీయ మానార్థంతో కూడా పరిచయం ఉన్న కారణంతో ఆ ప్రతీయమాన అర్థాన్ని సమాసోక్తి, ఆక్షేపాది అలంకారాలల్లో అంతర్భూతంకావించినారు. అలంకార సంబంధమైన ఈ విశిష్టానుశీలనమే వక్రోక్తి, ధ్వని సిద్ధాంత ప్రాదుర్భావాలకు శ్రీకారం చుట్టిందని మనం గ్రహించవచ్చు. ఎందరెందరో ప్రజ్ఞావంతులు అలంకార ప్రాభవాన్ని తగ్గించే ప్రయత్నం చేసినప్పటికీ నవనవో న్మేషంగా ఈ నాటికీ సాహిత్య క్షేత్రంలో ఉనికిని ప్రదర్శిస్తున్నది అలంకారం.

3. రీతి సంప్రదాయం : ఈ సంప్రదాయంలో తొలిసారిగా రసాన్ని బహిరంగాల నుండి అంతరంగాలకు కొనివచ్చే ప్రయత్నం జరిగింది. ఈ సంప్రదాయ ప్రతిపాదకుడు వామనుడు. ఈయన నుండే అలంకార శాస్త్రం కావ్య శరీర సౌందర్య చర్చ నుండి కావ్యాత్మ చర్చకు ప్రాధాన్యం కల్పించడం గోచరిస్తుంది. 'రీతి రాత్మా కావ్యస్య' అంటూ వామనుడు తొలి సారిగా రీతిని కావ్యాత్మగా ప్రకటించి నాడు. ఈ రీతి, పదముల విశిష్టరచన ద్వారా ఏర్పడు తుంది. రచనలో ఈ వైశిష్ట్యం గుణములవల్ల ఏర్పడుతుంది. అందుకే రీతి గుణములపై ఆధారపడి ఉన్నదని చెప్పవచ్చు. ఈ కారణం చేతనే రీతిసంప్రదాయాన్ని గుణ సంప్రదాయం గా కూడా వ్యవహరించడం జరుగుతుంది.

భామహుడు గుణ, అలంకారాలకు విభేదాన్ని చూపినాడు కానీ దండిని అనుసరించి కావ్యానికి గుణములు నిత్యధర్మాలు. ఇవి కావ్య శోభాజనకాలై వృద్ధి హేతువులుగా గ్రహింపబడ్డాయి. దండి కావ్య శోభా కారకాలైన అన్ని ధర్మాలను అలంకార వ్యాపక అర్థంలో సీమితం చేసినాడు. వామనుడు సూక్ష్మ దృష్టి కలవాడై శబ్దార్థభేదాలతో గుణాలను ఇరవైగా పరిగణించి నాడు. దండి మాధుర్యాదులైన దశగుణాలను పేర్కొని అవి వైదర్భీ మార్గానికి ప్రాణముల వంటివి అన్నాడు. వామనుడు దండిమతాన్ని మన్నిస్తూనే గౌడీరీతికొరకు ఓజోగుణం, పాంచాలీరీతి కొరకు మాధుర్య ప్రసాద గుణాలు అవసరం అంటూ భావించినాడు. వామనుడు కాంతిగుణంలో రసాన్ని ప్రవేశింపచేసినాడు. ఇట్లే వక్రోక్తిలో అవివక్షత వాచ్యధ్వనిని అంతర్భూతం కావించినాడు. ఈ కాలం నాటికి అలంకారశాస్త్రం లోతునూ విస్తృతినీ పుంజుకొన్నది. ధ్వని వాదులకు కూడా రీతిని స్వీకరింపక తప్పలేదు.

కుంతకుడు రీతిని కవిస్వభావ సంబంధముగా స్వీకరించి దాని ఆవశ్యకతను పెంచినాడు. ఇంతవరకు ప్రధానంగా కన్పిస్తున్న వైదర్భీ, గౌడీ, పాంచాలీ అనే మూడు రీతులకు తోడుగా కుంతకుడు 'రీతి'ని 'మార్గం' అనే పేరుతో వ్యవహరిస్తూ సుకుమార, వైదర్భీ, విచిత్ర, గౌడీ, మధ్యమ, పాంచాలీ అనే పేర్లతో ఆరు రీతులను అంగీకరించినాడు.

4. వక్రోక్తి సంప్రదాయం : కుంతకుడు వక్రోక్తిని కావ్యజీవితంగా స్వీకరించినాడు. వక్రోక్తిజీవితం అనే గ్రంథంలో వక్రోక్తి యొక్క వివిధ భేదాలను సాంగోపాంగంగా వివరించినాడు. ఈయన దృష్టిలో వక్రోక్తి అంటే 'వైదగ్ధ్యభంగీభణితి' అంటే సర్వ సాధారణంగా

ప్రయుక్తమయ్యే వాక్యం కన్నా విలక్షణంగా చెప్పేవిధానం (వక్రో. జీ. 1-11). ఈ ఆచార్యుడే వక్రోక్తిని వివరిస్తూ, వైదగ్ధ్యం అంటే కవికౌశలం అనీ, భంగి అంటే విచ్ఛిత్తి విన్యాణం, నేర్పు, అనీ స్పష్ట పరచినాడు. ఈ వివరణను పురస్కరించుకొని వక్రోక్తి అంటే కవికౌశలసిద్ధమైన కావ్యవక్రత. అదే విచ్ఛిత్తి (చమత్కారం) అంటూ గ్రహింప వీలున్నది. కుంతకుని వక్రోక్తి శబ్దచమత్కారయుక్తి కథనం అంటూ చెప్పవచ్చు. ఇదే అలౌకిక చమత్కారయుక్త కథనంగా మనం భావించవచ్చు. అందుకే ఈ ఆచార్యుడు వక్రోక్తిని సర్వాలంకారజీవనదాయకంగా భావిస్తూ

"సైషాసర్వత్రవక్రోక్తి రనయాఽర్థో విభావ్యతే।
యత్నోఽస్యాకవి నాకార్యఃకోఽలంకారోఽనయాపినా" అంటూ ప్రశంసించినాడు.

భామహుడు వక్రార్థాలైన శబ్దాలవల్ల కావ్యంలో అలంకారం ఉత్పన్నమౌతుందని భావించినాడు. ('వాచాం వక్రార్థశబ్దోక్తిరలంకారాయ కల్పతే') లోచన కారుడు ఈ వాక్యాన్ని పురస్కరించుకొని "శబ్దస్యహి వక్రతా అభిధేయస్య చ వక్రతా లోకోక్తి ర్నైవ రూపేణా వస్థానమ్" అంటూ చెప్పి శబ్దార్థాల వక్రత లోకోత్తర చమత్కార రూపంలోనే అవస్థితిని పొందుతుంది అన్నాడు. దండి కూడా వాఙ్మయమంతటిని 1వక్రోక్తి, 2 స్వభావోక్తి రూపంలో రెండుగా విభక్తం చేసినాడు.

కుంతకుడు ధ్వని సిద్ధాంతంతో పరిచయమున్నవాడే కానీ ఉదాత్తమైన వక్రోక్తి కల్పనలో 'ధ్వని' సమస్త రూపాలను అంతర్భూతం చేస్తూ ప్రదర్శించినాడు. కుంతకుడు ఈవక్రోక్తిని ఆరు విధాలుగా విభాగించి నాడు. 1. వర్ణవక్రత 2. పదపూర్వార్ధవక్రత 3. ప్రత్యయ వక్రత 4. వాక్యవక్రత, 5. ప్రకరణ వక్రత, 6. ప్రబంధవక్రత.

ఈ ఆలోచకుడిని అనుసరించి ధ్వనిసమస్త భేదాలు ఉపచారవక్రతలో సంక్రమితమై గోచరిస్తాయి. కానీ ఈ ఆలంకారికునికి అనుయాయులంతగా లేని కారణంతో ఈ సిద్ధాంతం నిలకడగా నిలదొక్కుకోలేదు. ఈ కారణంతో వక్రోక్తి కావ్య జీవితంగా కాక ఒక అలంకారమాత్రంగా స్థిరపడింది. కానీ ఈతని శైలి విదగ్ధపూర్ణమై అత్యంత రమణీయకంగా ఉంటుంది. ఈయన ఆలోచన కూడా అలోకసామాన్యమై అతని భావుకతను చాటుతూ ఆహ్లాదజనకంగా కన్పిస్తుంది.

5. ధ్వని సంప్రదాయం :

ధ్వని సిద్ధాంతం ఆనంద వర్థనాచార్యునిచే ప్రతిష్ఠింప బడింది. అయినా అతడు ఈ సిద్ధాంతాన్ని క్రొత్త సిద్ధాంతంగా పరిగణింపలేదు. ఈయన గ్రంథ ప్రారంభంలోనే 'సమామ్నాతపూర్వమ్' అనే సంజ్ఞతో ప్రారంభించి ఈ కారికను వ్యాఖ్యానిస్తూ వ్యాఖ్యాతలు 'పరంపరయా యః సమామ్నాత పూర్వమ్ సమ్యక్ ఆసమంతాద్ ఆమ్నాతః ప్రకటితః, అంటూ చెప్పినారు. ఈ వాక్యాలను పురస్కరించుకొని ధ్వని సిద్ధాంతం పూర్వ కాలమందే ప్రచలితమైనట్లు తెలుస్తోంది.

ఆనందవర్ధనుని అనుసరించి సాహిత్యక్షేత్రంలో మొదటి విద్వాంసుడు వైయాకరణుడే అన్న విషయాన్ని ఈయన 'శ్రూయమాణవర్ణో' అనే వాక్యంలో ధ్వని సంకేతం చేసినట్లు పేర్కొన్నాడు.[1] ధ్వని టీకాకారుడైన అభినవగుప్తుడు ఈ విశ్వాసాన్నే దృఢపరుస్తూ, దానికి సాంగోపాంగమైన వ్యాఖ్యను నిర్మించినాడు. భర్తృ హరి కూడా తన వాక్య పదీయంలో స్ఫోట సిద్ధాంత స్థాపనా వసరంలో ఈ విషయాన్ని పేర్కొన్నాడు. అయినా ఆనందవర్ధనాచార్యునికి పూర్వం లిఖితమైన గ్రంథం కానీ, ఆచార్యుల పేర్లు కానీ లభించడంలేదు. ధ్వని సిద్ధాంత స్థాపకుడైన ఆనందవర్ధనాచార్యుని గూర్చి రాజశేఖరుడు-

ధ్వనినాతిగభీరణ కావ్య తత్త్వనివేశినా।
ఆనందవర్ధనః కస్యనాః సీదానందవర్ధనః॥

ధ్వని అనే అతిగంభీరమైన కావ్యతత్త్వనివేశనుడైన ఆనందవర్ధనుడు ఎవ్వరికి ఆనందవర్ధనుడు కాడు? అంటూ ప్రశంసించినాడు.

---

1. ప్రథమే హి విద్వాంసో వైయ్యాకరణః
వైయ్యాకరణమూలత్వాత్ సర్వవిద్యానామ్
తేచశ్రూయమాణేషు ధ్వనిరితవర్ణేషు ధ్వనిరితివ్యాహరంతి

ఈ ధ్వని వస్తు, అలంకార, రసరూపాదులను పురస్కరించుకొని మూడు విధాలు 1. వస్తుధ్వని 2. అలంకారధ్వని 3. రసధ్వని. ఈ మూడింటిలో రసధ్వని ఉత్తమోత్తమమైంది.

నిజానికి ఈ ధ్వని సిద్ధాంతము రససంప్రదాయానికి విస్తృతరూపం అని చెప్పవచ్చు. రసము ఎప్పుడూ వాచ్యము కాక వ్యంగ్య రూపంలో ప్రతీయమాన మౌతుంది. ఈ అంతస్సూత్రాన్ని ప్రధానంగా స్వీకరిస్తూ ఆనందవర్ధనుడు కావ్యానికి వ్యంగ్యార్థం అంటే ధ్వని ప్రధానం అంటూ చెప్పినాడు. ఈ సందర్భంలో అంటే, ధ్వని ప్రతిపాదన విషయంలో ఆలంకారికులు వైయా కరణులకు ఋణపడి యుండవలసిందే. వ్యాకరణ శాస్త్రాచార్యులు స్ఫోట నిరూపణ సందర్భంలో స్ఫోట రూపమైన ముఖ్యార్థాన్ని అభివ్యక్తం చేసే శబ్దానికి 'ధ్వని' అనే సంకేతం ఉంచినారు. ఆలంకారికులు ఈ సామ్యం తోనే ధ్వని శబ్దాన్ని స్వీకరించి దాని అర్థానికి విస్తృతిని కల్పించినారు. ఆనంద వర్ధనాచార్యుడు తన యుక్తులతో ఎదుటివారి వాదాలను ఖండిస్తూ వాచ్యార్థం కన్నా వ్యంగ్యార్థాన్ని వేరుగా నిరూపించినాడు.

ధ్వని విరోధులు ప్రధానంగా ధ్వనిని ప్రతిఘటిస్తూ చూపిన వాదాలలో 1. అభావవాదం 2. భాక్తవాదం 3. అగోచర వాదం అనే మూడు వాదాలు పేర్కొనదగినవి.

ధ్వని నిర్వచనం:

ఎచ్చట శబ్దము తన అర్థాన్నీ, అర్థము తననూ అప్రధానం కావించుకొని రమణీయమైన అర్థాంతరాన్ని బోధిస్తుందో అది ధ్వని. అంటే? ఏ విధంగా సొగసైన యువతులలో అలంకృతాలైన అవయవాలకన్నా వేరుగా లావణ్యం ఒకటి చూపరులకనువిందు చేసినట్లు కావ్యాల్లో కూడా గుణాలంకారాది ఉపస్కృతులకన్న వేరుగా ప్రతీయమానార్థం భాసిస్తూ ఉంటుంది, అదే వ్యంగ్యార్థం అదే ధ్వని అన్నారు.

ఈ ధ్వని ప్రధానంగా లక్షణామూల అభిధామూల (అవివక్షితవాచ్యము, వివక్షితాన్య పరవాచ్యము) అనే భేదాలతో రెండు విధాలు. తిరిగి ఈ రెండు వర్గాలు సూక్ష్మ సూక్ష్మ తరభేదాలతో విభక్తమై ధ్వని సంఖ్యను 5302 వరకు పెంచినవి.

ఆనందవర్ధనునిచేత ప్రతిపాదితమైన ఈ సంప్ర దాయం తరువాతి ఆలంకారికులైన అభినవగుప్త, రాజశేఖర, విశ్వనాథ, పండిత రాయల వంటి మహావిద్వాం సులచే స్వీకరింపబడి ఆమోదింపబడిన కారణంతో అలంకార సాహిత్య క్షేత్రంలో ఈ సిద్ధాంతం స్థిరపడి, కావ్యానికి ఆత్మ స్థానాన్ని సంతరించుకొన్నది.

6. ఔచిత్య సంప్రదాయం :

క్షేమేంద్రుడు 'ఔచిత్య విచారచర్చా' అనే గ్రంథంలో ఔచిత్యాన్ని కావ్య జీవితంగా ప్రతిపాదిస్తూ ఒక నూతన సంప్రదాయ ప్రవర్తకుడైనాడు. అయినా ఔచిత్యకల్పనం సాహిత్య జగత్తులో అతి ప్రాచీనకాలంలోనే ఉన్నట్లు సంభావింపబడింది.

భరతుని నాట్య శాస్త్రంలో ఈ ఔచిత్య ప్రశంస ఒక సిద్ధాంతరూపంలో కాకపోయినా ఒక విధి విధాన రూపంలో కన్పిస్తుంది. భరతుడు నాట్యాన్ని అనుకరణ ప్రధానకళగా స్వీకరిస్తూ, లోకంలో ఏ వస్తువూ ఏ వ్యక్తీ ఏ రూపంలో ఏ వేషంలో ఉంటారో ఆ వేష భాషాది విశేషాలన్నీ తూ.చ. తప్పకుండా అనుకరించవలసి ఉంటుంది. లేని నాడు మొలకు ధరించే వొడ్డాణాన్ని మెడలో వేసుకున్నంత హాస్యాస్పదమౌతుంది అంటూ స్పష్టపరచినాడు. (నాట్య శా. 23-67)

ఇట్లే ఆచార్య దండి కూడా తన కావ్యాదర్శలో ఉపమా దోష నిరూపణ సందర్భంలో ఔచిత్యం యొక్క అవసరాన్ని గుర్తించినట్లు కన్పిస్తుంది.

"నలింగవచనే భిన్నే న హీనాధికతాపినా
ఉపమాదూషణాలయం యత్రోద్వేగోన ధీమతామ్"

ఇట్లే ఆనందవర్ధనాచార్యుడు కూడా 'అనౌచిత్యా దృతేనాన్యద్రసభంగస్యకారణమ్''

అంటూ కావ్యంలో అనౌచిత్య ప్రవేశం కన్నా రస భంగానికి ఇతర కారణం అక్కరలేదంటూ చెప్పి ఔచిత్య మాహాత్మ్యాన్ని గుర్తించినాడు. అయినా నాటి ఆలంకారికు

లెవ్వరూ అంటే క్షేమేంద్రాచార్యుని వరకు ఔచిత్యాన్ని నిర్వచించి దాని ప్రాభవాన్ని ప్రదర్శించలేదు. క్షేమేంద్రుడే తొలిసారిగా ఔచిత్యాన్ని కావ్యాత్మగా స్వీకరిస్తూ సోదాహరణంగా ప్రతిపాదిస్తూ నిర్వచించినాడు. అందుకే లాక్షణికజగత్తులో క్షేమేంద్రునికి ఔచిత్య సంప్రదాయ ప్రతి స్థాపకుడుగా కీర్తి దక్కింది.

ఆ అలంకారశాస్త్రకర్తను పురస్కరించుకొని ఔచిత్యమే కావ్యరస సిద్ధికీ, దాని స్థిర జీవికకూ ప్రధాన హేతువుగా "ఔచిత్యం హి రససిద్ధస్యస్థిరం కావ్యస్య జీవితమ్" అనే వాక్యంలో పేర్కొన్నాడు. ఈ విద్వాంసుని అనుసరించి ఔచిత్యం గుణాలంకారాదులకన్నా భిన్నమైంది, అయినా ఈ ఔచిత్యం లేని గుణంకానీ, అలంకారంకానీ చివరకు రసంకానీ శోభించదూ, సంభావనీయం కాదు. ఈయన దృష్టిలో ఔచిత్యం అంటే ఉచితముల యొక్క భావం "ఉచితస్యయోభావస్త దౌచిత్యం ప్రచక్షతే" ఈ ఔచిత్యం యొక్క అవసరం కావ్యంలో ఒక్క చోట, ఒక్క సందర్భంలో అంటూ కాక బహు ముఖీనమై సర్వే సర్వత్రావ్యాప్తమై ఉంటుంది. అందుకే ఈయన ఔచిత్యాన్ని పద, వాక్య, అర్థ, శబ్ద, రస, కారక, కాల, దేశ, లింగ, వచన, పాత్ర, వస్తు, ప్రబంధాదులైన ఇరవై ఎనిమిది రూపాలుగా స్వీకరించినాడు.

క్షేమేంద్రుడు 'రసజీవిత భూతస్య' అంటూ ఔచిత్యాన్ని సకల కావ్య ప్రాణ భూతమైన రసానికే ప్రాణంగా పేర్కొని ఔచిత్యానికి అత్యంత పూజనీయమైన స్థానాన్ని కల్పించినాడు. అందుకే ఈతని తరువాతి ఆలంకారికులైన భోజ, మమ్మటాదులు ఈ ఔచిత్య మాహాత్మ్యన్ని అంగీకరిస్తూ సంభావించినారు. అయినా ఈ సిద్ధాంతం రస, ధ్వని సిద్ధాంతాలను అధిగమించి కావ్యాత్మగా ప్రాచుర్యాన్ని పొందలేక పోయింది.

ఉపసంహారం :

సాహిత్య విద్యకు వేదకాలం నాడే బీజావాపం జరిగినా ఆ విద్య ప్రరోహాన్ని పొందింది భరతుని కాలంనాడే. తొలి సారిగా భరతుడు నాట్య శాస్త్రంలో కావ్య లక్షణాలను ఏడింటిని పేర్కొన్నాడు.

"మృదులలిత పదాఢ్యం గూఢశబ్దార్థ హీనమ్
జనపద సుఖబోధ్యం యుక్తి మన్నృత్య యోజ్యమ్।
బహుకృతరసమార్గం సంధిసంధాన యుక్తమ్।
సభవతిశుభకావ్యం నాటక ప్రేక్షకానామ్ ॥ నాట్యశాస్త్ర. (11-117)

ఈయన పేర్కొన్న ఏడుగుణాలల్లో నృత్యోప యోగ్యత, సంధి యుక్తత అనే రెండు లక్షణాలు కేవలం నాట్య సంబంధిగా గోచరిస్తాయి.

ఈయన తరువాత దాదాపు 5వ శతాబ్ది అంటే భామహుని వరకూ సాహిత్య విద్యా ప్రవర్తకులు దాదాపు లేనట్లే కనిపిస్తుంది. ఒకవేళ ఉన్నా ఏ కారణంవల్లనో వారి గ్రంథాలు మాత్రం లభించడం లేదు. ఈ విధంగా సుప్త జాగ్రదవస్థలో అజ్ఞాతంగా ఉన్న ఈ సాహిత్యవిద్య భామహునినుండి క్రమపరిణామాన్ని చెందుతూ మేధావులైన విద్వాంసుల ఆలోచనారీతులవల్ల నవ్యతలను సంతరించుకొని నూతన సిద్ధాంతాలతో నవ్య సంప్రదాయాలను పుష్పించింది.

ఈ పరిణామ క్రమంలో ఆలోచిస్తే ఈ సాహిత్య విద్యను ప్రధానంగా కొన్ని యుగాలుగా విభజించుకోవచ్చు.

1. ఆదిమయుగం లేదా (పౌరాణిక యుగం): ఇందులో ఊహాజనితమైన శాస్త్ర కర్తల నిర్మాణం గోచరిస్తుంది. దేవీ సంబంధమైన ప్రతిపాదనలతో అలంకార శాస్త్ర సిద్ధాంతానికి రూపకల్పనం చేయబడింది.

2. అజ్ఞాత యుగం : ఈ యుగం భరతుని నుండి భామహుని వరకు, 5వ శతాబ్దం వరకు సాగింది. ఈ యుగంలో సాహిత్య శాస్త్ర సమాలోచనం జరిగినా చారిత్రకాధారాలతో రుజువు చేయలేము.

3. అలంకారశాస్త్ర సంప్రదాయకయుగం: ఈ యుగాన్ని కొందరు రచనాత్మక కాలంగా సంభావించినారు ఇది దాదాపు 250 సంవత్సరాల వరకు అంటే భానుహుని నుండి ఆనందవర్ధనాచార్యుని ప్రవేశం వరకు సాగినట్లు భావించవచ్చు. తిరిగి ఈ యుగాన్ని మనం

1. అలంకార సంప్రదాయ 2. రీతి గుణ సంప్రదాయ. 3. రససంప్రదాయ రూపాలతో త్రివిధంగా విభక్తం చేసుకోవచ్చు. ఇందులో - భామహ, ఉద్భట, రుద్ర టాదులు అలంకారమార్గ ప్రవర్తకులు.

దండి, వామనులు గుణరీతి సంప్రదాయ మార్గ స్థాపకులు.

లోల్లట, శ్రీశంకుక, భట్టనాయకులు రస సిద్ధాంత ప్రతిపాదకాచార్యులు.

4. దీనితరువాతి కాలాన్ని ధ్వని కాలంగా స్వీకరించవచ్చు. ఈ కాలం 9వ శతాబ్దంనుండి 11 వ శతాబ్దం వరకు సాగింది. ఇందులో ప్రధానులు ఆనందవర్ధన, మమ్మట అభినవగుప్తాదులు.

5. తరువాతి యుగాన్ని వ్యాఖ్యానయుగంగా పేర్కొన వచ్చు. ఇందులో ప్రధానంగా మమ్మట, రుయ్యక, విశ్వనాథ, హేమ చంద్ర, విద్యాధర, జయదేవ, అప్పయ, దీక్షితాదులు ధ్వనిమతానుయాయులు.

ఇట్లే శారదాతనయ, సింగభూపాల, భానుదత్త, రూపగోస్వామ్యాదులు రససిద్ధాంతానుయాయులు.

చివర ఆరవ విభాగంగా కవిశిక్షా యుగాన్ని పేర్కొన వచ్చు. ఇందులో రాజశేఖర, క్షేమేంద్ర, అరిసింహ, అమర చంద్ర, దేవేశ్వరాదులు ప్రధానులు. మరొక విధంగా ఆలోచిస్తే భారతీయ సాహిత్య విద్యా క్షేత్రంలో ధ్వని సిద్ధాంతానికి ప్రాభవం అధికంగా గోచరిస్తుంది. ఈ దృష్టితో దాన్ని కేంద్రంగా గ్రహిస్తూ యుగ విభజనం చేస్తే ధ్వని సిద్ధాంత పూర్వయుగం అనీ, ధ్వని కాలం అనీ, ఆనంతర ధ్వనికాలం అంటూ మూడు ప్రధాన యుగాలుగా విభజనం చేయవచ్చు. ధ్వని పూర్వకాలంలో రస, అలంకార, గుణ, రీతుల గూర్చిన వివేచన సాగింది. ధ్వని కాలంలో ధ్వని సంప్రదాయ స్థాపనంతో పాటు ధ్వని నిరాకరణ వాదాచార్యులైన లేక మహిమ భట్ట నాయకాదుల సిద్ధాంతాలనూ వారి వాదాలను ఎదుర్కొనే సందర్భంలో ప్రదర్శించిన యుక్తియుక్తులు ప్రతిభా పాండిత్య ప్రపూర్ణులై అలంకారవిద్యా జగత్తులో అపూర్వమూ అపురూపమూ ఐన శాస్త్ర సాహిత్యాన్ని ప్రభవింపచేసినవి.

మూడవది ఆనంతర ధ్వని కాలం. ఇందులో ఇతర కావ్యాంగాలపై రచన సాగింది. సంస్కృత సాహిత్యంలో వ్యావహారిక రూపమైన ఆవశ్యకతను పురస్కరించుకొని కోశనిర్మాణం కూడా జరిగింది. కోశ విద్య ప్రాచీన కాలంలో నిఘంటు రూపంలో ఉండేది. మనకు ప్రధానంగా 24 కోశముల పేర్లు వినవస్తున్నాయి. 1. అజయ 2. అమర 3. కాత్య 4. ఆధ్యాయన 5. ధరణి 6. భాగురి 7. మంగళ 8. మహేశ 9. మేదిని 10. రత్నకోశ 11. రంతిదేవ, 12. రభస 13. రుద్ర 14. వరరుచి, 15, వాచస్పతీ 16. విక్రమాదిత్య 17. విశ్వ 18. వైజయంతి 19. సాహసాంక 20. విశ్వప్రకాశ 21. శాశ్వత 22. వ్యాడి 23. హలాయుధ 24. హేమచంద్ర.

ఈ విధంగా సుసంపన్నమైన సాహిత్యవిద్య అలంకార శాస్త్రం అనీ, కావ్య క్రియాకల్పం అనీ, కావ్యజ్ఞశిక్ష అనీ, కావ్యలక్షణశాస్త్ర అనీ అనేక పేర్లతో పిలువబడుతూ ఉంది. ఈ విద్యకు ఎన్ని సిద్ధాంతాలు ఏర్పడినా, ఎన్నెన్ని వేరువేరు మార్గాల్లో పయనించినా చివరి గమ్యం మాత్రం ఒక్కటే. 'ఋజు కుటిలనానా పథజుషాంన్నృణామేకోగమ్యః' అన్నట్లుగా ఎన్ని మార్గాలు వెదికినా సాహిత్య ప్రయోజనం మాత్రం ఒకటే. అది రసానందం. కావ్యానందం. ఇది బ్రహ్మానంద సహోదరమైన అనిర్వచనీయానందం. ఇతిశివమ్.

అపూర్వం యద్వస్తు ప్రథయతి వినాకారణకలామ్
జగద్గ్రావప్రఖ్యం నిజరసభరాత్ సారయతి చ॥
క్రమాత్ ప్రఖ్యోపాఖ్యాప్రసరసుభగంభాసయతియత్।
సరస్వత్యాస్తత్త్వం కవిసహృదయాఖ్యం విజయతాత్

(అభినవగుప్త)

కావ్య క్రతువు

డా. తుమ్మపూడి కోటేశ్వరరావు

మానవ జీవితం వైరుద్ధ్యాల పుట్ట. సృష్టి కిందుకే ద్వంద్వమని పేరు. ద్వంద్వమంటే జంట. అంటే విరుద్ధ సూత్రాలు. మనిషికీ మనిషికీ ... వీడికీ ... సమాజానికీ, దీనికీ విశ్వానికీ, విశ్వానికీ భగవంతునకూ వైరుద్ధ్యమే. ఈ వైరుద్ధ్య సమన్వయమే సమత. దానిని సాధించుటకు యోగం. అదే కళా సూత్రమున్నూ, తనలో తనకే వైరుద్ధ్యమున్న జీవితం అశాంతిమయం. అవిశ్రాంత మానవుడు రాజకీయ దృష్ట్యా భవితవ్యాన్ని సృష్టిస్తా ననటం కంటే హాస్యాస్పదాంశం - వైరుద్ధ్యం మరొకటి లేదు.

ఈ వైరుద్ధ్య ద్వంద్వ విషయకంగా ఆధునిక మనస్తత్త్వ శాస్త్రం ఆధునిక మానవ సమాజ అవిశ్రాంత హేతువుగా పేర్కొని ఆసియా ఖండం సమన్వయ సూత్రాన్ని ప్రతిపాదించిందని అంటూ క్రీ. పూ. 3000 సంవత్సరాలక్రితమే చీనీ ఇన్ (చీకటి) యాంగ్ (వెలుగు) అన్న విశ్వద్వంద్వ సమన్వయాన్ని సాధించిందని తేల్చారు.

భారతం కర్ణపర్వంలో కర్ణార్జునుల యుద్ధాన్ని వర్ణిస్తూ అహోరాత్రాల యుద్ధంలాగా వుందన్నాడు. మహాకవి. ఈ అహస్సే పై యాంగ్. రాత్రే ఇన్. భారతదేశ సంస్కృతి ఒక్కటే సర్వరంగాల్లోనూ ఈ సమన్వయ సాధనే ధ్యేయంగా చెప్పింది. దానినే గీతాస్వామి సూత్రే మణిగణావివ - అని సూత్రీకరించాడు. మణులు వేర్వేరు వర్ణాలతో వున్నంతకాలం వాటికి హారత్వంలేదు. హారత్వ సిద్ధికి సూత్రముండాలి. ఆ సూత్రం 'తాను ' (ఆత్మ) అన్నాడు. దీనినంగీకరించి ద్వంద్వాన్ని సమన్వయించింది ఈ దేశం. ఆచార్యులు, ప్రభుత్వ యంత్రాంగం - గృహం - విద్యా సంస్థ - ఈ సమన్వయ సూత్రాధారంగా నిర్మించబడిన వ్యవస్థలు. మొదటిది మతం (మోక్షం). రెండవది వానప్రస్థం. మూడవది గార్హస్థ్యం (కుటుంబ వ్యవస్థ). నాల్గవది విద్యా (బ్రహ్మచర్యా) శ్రమం. ఈ సమాజ మంటే ఈ నాల్గు స్తంభాల సప్తస్వరనాట్య మండపం. ఊర్ధ్వ బిందువు (ముక్తి) దాని క్రింది ద్వంద్వ రూపసమాజ నిర్మాణమే ఈ భారతీయ శాస్త్రకర్తలు సాధించిపెట్టిన అద్భుత సమన్వయం.

ద్వంద్వ మంటే రెండు. లోకమంటే రెంటి మధ్య కామం - ధనం - ఊగిసలాట. ఉయ్యాల క్రీడోత్సవమైతే సమన్వయం. సమాజంలో మనిషి నిత్య అవిశ్రాంతంగా విక్రమిస్తాడు ధన సముపార్జనార్థం. అది క్రీడోత్సవంగా (సంసారం) పరిణమించిన స్థానం గృహస్థాశ్రమం. సమాజానికి కుటుంబ వ్యవస్థ పునాది. ప్రభుత్వ వ్యవస్థ కాదు. ఇది పశ్చిమ సంస్కృతి నుండి విరుచుకొని పడ్డ భూతం కనుకనే అక్కడి వారే అన్నారు. "నేటి సమాజంలో వివాహ కుటుంబ వ్యవస్థశయ్యా మందిరం కూటమే అన్న అర్థంలో పర్యవసించింది. ఈ భావననుండి జనించిన సంతానం వల్ల సమాజంలో నిత్య సంఘర్షణ సిద్ధించింది' అన్నాడు. (చూ. సమాజపునర్ని ర్మాణం - సొరాకిన్). కనుక కుటుంబాన్ని ప్రాచీనాచార్యుడు - కలాప్రధాన వ్యవస్థగా నిర్మించి కళా - సమాజ జీవన సూత్రంగా వ్యాఖ్యానించాడు. కుటుంబం అంతర్లోక (ఆనంద) బహిర్లోక (సమాజం) ద్వంద్వానికి గడప. ఇందుకే ప్రాచీన మహాకవి దానికే ప్రాధాన్య మిచ్చాడు. ఇందుకే తల్లి - తండ్రి మొదటి - రెండవ గురువులు శిశువునకు. విద్యార్థి దశలో మూడవ గురువు ఉపాధ్యాయుడు. చివరి మజిలీ లో శంకరులు (మతా చార్యులు ఎవరైనా సరే) కనుక విద్యాశ్రమంలో గురుశిష్య సమన్వయముండాలి. ఇందుకే అథాతో బ్రహ్మజిజ్ఞాసా- అని కూర్చున్న గురుశిష్యులు "మేము చదివిన చదువు లోక కళ్యాణ హేతువగు గాక మా యిద్దరి నడుమ శత్రుత్వం కలుగకుండుగాక" అని శాంతిపాఠం చదివారు. ఆ గురుశిష్య ప్రతీకలే అలనాటి యమనచికేతులు, కృష్ణార్జునులు; ఇల నేటి శ్రీరామకృష్ణ

- నరేంద్రులు. ఈ సమన్వయ మూలసూత్రం దైవం ఆత్మ పదార్థం.

అలాగే గృహస్థాశ్రమంలో స్త్రీత్వ, -పుంస్త్వ ద్వంద్వ సమన్వయమే దాంపత్యం. దానికి ప్రతీకలే (ఆర్కిటైప్సు) శివపార్వతులు -లక్ష్మీనారాయణులు - సీతారాములు. జానపద సాహిత్యంలో ఆకాశమంతపందిరి -భూదేవంత అరుగు - అన్న మాట పుట్టింది. దానికర్థం భూమ్యాకాశ సమన్వయం. భూమి పదార్థ జగత్తు (ఆధునిక విజ్ఞాన శాస్త్రాలు చెప్పింది). ఆకాశం బీజం - ఆత్మ స్వరూపం. రాముడు సూర్య వంశక్షత్రియుడు - సీత భూ సంజాత అంటే ఇదే. ప్రతిజంటా వారికి ప్రతీకలే.

పాశ్చాత్య మనస్తత్వశాస్త్రకారులంటున్నారు. 'ప్రతి స్త్రీ లో ఒక పురుషుడు - ప్రతి పురుషునిలో ఒక స్త్రీ ఉన్నారు. నీ లోపలి వ్యక్తి సమన్వయ సాధనార్థమే భౌతిక దాంపత్యం ప్రతీకగా ఏర్పాటు చేసుకొన్నా' మని. దీని రూపమే విరాడ్దశలో అర్ధనారీశ్వరం. దీని కోసమే ఒక్క ఈ దేశంలోనే వివాహం క్రతువైనది. క్రతువంటే అంత స్తత్త్వ సమన్వయార్థమై బయలు చేసుకొనే తంత్రం. అదొక సాధన యోగం. దీనికది పరమార్థం తప్ప దానికిదే పరమార్థం కాదు. ఐనస్థితిలో అది వ్యర్థమై తిరిగి ఈనాడు దాని పరమార్థ దృష్టి బహిర్గతం కావటానికి సాక్ష్యం. తత్సంబంధత గ్రంథ సంజాతం - జీవితమొక క్రతువు. అంటే పరమార్థ ప్రతీక తప్ప (Ritualistic) వాచ్యార్థ రూపమైన (Realistic) భౌతిక జీవితం కాదు. క్రతు సమాజం నుండి కళాసమాజం దీనినుండి వాస్తవిక సమాజమేర్పడటం -19వ శతాబ్దిలో పూర్తి కాగా మరలా చక్ర భూభ్రమణం సమాజావిర్భావంతో 20వ శతాబ్దంలో మొదలైనది. దానికి కారణం ఇక్కడి శ్రీరామ కృష్ణాదుల ఆవిర్భావహేతువుగా స్వామి వివేకానంద విశ్వ భ్రమణ ప్రేరణతో ఆత్మ ప్రస్థానం పాశ్చాత్య లోకంలో ప్రారంభం కావటం. 1903లో ప్రారంభమై 1925లో ఆత్మ ప్రస్థానంలో ఆధునిక మానవుడన్న - యూంగ్ గ్రంథంతో పూర్తి అయినది. ఈ భావ పరిణామాధారం స్వామీజీ విశ్వ భ్రమణం. ఇందుకే వారన్నారు స్వామి బ్రహ్మా నందంతో "నా తరువాత పాశ్చాత్యలోకంలో నేను చల్లిన విత్తనాలు వృక్షాలు కావడం చూస్తారు" అని. దీనికి సవాలక్ష ఉదాహరణలున్నాయి. అది వేరే విషయం. ఈ అంతర్గత స్త్రీ పురుష సమన్వయ క్రతువు వివాహం. కొన్ని చోట్ల బాహ్య క్రతువు అంతస్సమన్వయ సాధనగా పరిణమిస్తుంది. అదే ఆదర్శ దాంపత్యం. దీని కీర్తనమే ప్రాచీన కళాకారుడు చేసింది. ప్రబంధంలో శృంగార రసం దీనికి కళారూపం.

భౌతిక జీవితం సంఘర్షణాత్మకం. ఇదే కురుక్షేత్ర సంగ్రామం. అంటే దానికిది ప్రతీక. అదొక నిత్య - అవిశ్రాంత యుద్ధం. నేడు మనకిది సర్వత్రానుభూతమే. ఇది జాగ్రదవస్థ. గడప ఈవలి కథ. లోపలి కథ సమన్వ యాత్మక స్త్రీపురుష కేళీరూప యుద్ధం. (ఇలాంటి వర్ణనలు ప్రబంధాల్లో చూస్తాం) . ఒక పాశ్చాత్య మనస్తత్వ శాస్త్రవేత్త ఈ దివ్యానందక్రీడను వంచ నంధులుగా అభివర్ణించాడు. అంటే రసాత్మక నాటకంగా ప్రణయమంటే ఏమిటి? అన్న పుస్తకంలో. ఇది స్వప్నావస్థ. అందమైన కల. అది భారతం. ఇది రామాయణం. ఆ ఘర్షణ వీర రసమూలం. (అర్థ పురుషార్థం) నేపథ్యం. ఇది శృంగార క్రీడ - శృంగార రస మూలం. ప్రతి మనిషీ అనుభవించే భావాలను కళాత్మకంగా పర్యవసింప చేయటమే రసమంటే. ఈ రెండు బిందువులు. అర్థం (వీరం), కామం (శృంగారం) ఈ రసాన్న మణులకు భౌతికమైన బొగ్గులు. బొగ్గే రత్నంగా పరిణమిస్తుంది. లోకమే రసంగా పరిణమి స్తుంది. పక్షుల కూజితాలే సప్త స్వరమూలధాతువు లైనట్లు. అవి రెండూ వేర్వేరు. బొగ్గు రత్నం కాదు. కానీ రత్నానికది మూలభూత పదార్థం (మట్టి) ఈ రెండు మణులుగా మారటానికి కొన్ని వేల డిగ్రీల ఉష్ణశక్తి వుండాలి. అదే కవిత్వంగా పరిణమింప చేసే ప్రతిభా శక్తి. కనుకనే విశ్వనాథ మహాకవి "లలాటంతప రూక్ష చింతన నటన్మధుభారతి సస్యధారణిన్" అని కల్పవృక్షా

వతారికలో అన్నాడు. ఫాలం పగిలేటంత కఠినాలోచనతో మధుభారతి లాస్యం చేస్తే అది మహా కావ్యమని అర్థం. రూక్షచింతన పేరే నచికేతాగ్ని (చూ. కఠోపనిషత్తు) ఆ అగ్నిలో - వాస్తవిక లోకం జీవితం దగ్ధమై సువర్ణ ప్రతిమా రూప జానకిగా ఆవిర్భవిస్తున్నది. (సీతా ద్రౌపదులు యజ్ఞ సంభవలంటే భావమిదే కళా దృష్ట్యా. తత్త్వ దృష్ట్యా వేరు అయినా తాత్పర్య మొకటే) అంటే లౌకిక కామతృష్ణ బొగ్గు కాగా సాధ్యమైన శృంగార రసం మణి. ధనతృష్ణా మూలకమైన లౌకిక సంఘర్షణ బొగ్గు. సాధించిన మణి వీరరసం. ఇవే ధర్మశాస్త్రజ్ఞులు చెప్పిన కామ, అర్థ పురుషార్థాలు. కనుకనే ప్రాచీన కవులు న్యాయార్జిత విత్తమ్ము - అన్న మాట వాడారు. అప్పుడది పురుషార్థం తప్ప ధనం కోసమే ధనం - కామం కోసమే కామం కాదు. ధర్మ పురుషార్థ దృష్ట్యా కామ పురుషార్థం సాధ్యం. కనుక ఆలంకారికులు వీర రసమంగమనీ - శృంగారం అంగి - అనీ అనటంలోని తాత్పర్యం. ఈ సామాజిక నేపథ్యం - ఆ ధర్మశాస్త్ర నేపథ్యం.

ఈ రెంటికీ పురుషార్థ దృష్టిని ఆధానం చేసేది ఊర్ధ్వ బిందువు. తత్త్వం; ముక్తి స్థానం. విశ్రాంతి స్థానం. ఈ ఊర్ధ్వ ప్రస్థానంలో మొదటి మజిలీ వీరం (లోకం), రెండవ మజిలీ, శృంగారం (దాంపత్యం) సాధ్య బిందువు శాంతరస స్వరూపమైన ముక్తి. ఇదే భాగవతం. తనలో తానుపడే జీవుని వేదన. తపస్సు. ఏడురోజుల్లో మరణించబోయే జీవుని సుడి . ఏడు రోజులంటే / ఏడు జన్మలు. ఏడు భూమికలు యోగంలోని చక్రాలు. ఇదే వేరే విషయం. ఇది సుషుప్తి అవస్థ. ఇక్కడ నుండి లేచి ప్రక్కనే వున్న భార్యా /భర్త) బాహు బంధనంతో సంతాన శైశవ ముఖా స్వాదనతో మేల్కొని లోకంలోకి పోయి తిరిగి నిశావేళకు గృహ (విశ్రాంతి) స్థానానికి రావటం పేరే జీవయాత్ర. ఈ భౌతిక విశ్రాంతి స్థానం గృహం. దేనికి? ఆధ్యాత్మిక పరలోక గృహ విశ్రాంతికి. కనుకనే ఇల్లంటే -ఇదీ - అదీ అన్న అర్థంలో కవి వాక్యముంది.

ఈ విధమైన మానవ జీవన సంరంభం - జాగ్రద వస్థ - వీరరసం అర్థ పురుషార్థం. చక్రానికి అంచుగా చక్రంలోని అరలు. వ్యాస వ్యాసార్థమైన స్వప్నావస్థా స్వరూపమైన శృంగార రసంగా, ఇరుసు నిద్రావస్థా రూపమైన పరమశాంతి స్థానంగా (శాంతరసంగా) ప్రాచీనాలం కారికులు భావించి కవిలోక మార్గాన్ని విశదీకరించారు. ఈ వృత్తం పూర్ణ జీవితం. దీని కథే ఇతివృత్తం. ఈ త్రిరసరూప జీవనచిత్రమే పూర్ణజీవితం కాగా అదే వస్తువుగా నాట్య - కావ్య -కళా చక్రం పరిభ్రమిస్తుంది. ఈ కళ విశ్వకళ. (కాస్మిక్ ఆర్ట్) దేవాలయ వాస్తు శిల్పం. దానికాధ్యాత్మిక యోగ శాస్త్ర విద్యలు మూలస్తంభాలు. ఇక్కడ వైవిధ్యంతోపాటు ద్వంద్వానుభవంతో పాటు సమైక్య అద్వైతానుభవమూ వుంటుంది. ద్వంద్వ సమన్వయం పేరే మైథునం (ఇది తంత్ర పరిభాష) అది కళాత్మకం. కనుక మైథున కళ రసాత్మకం త్రివిధావస్థల - జీవితాల - ఏకీకృతి. అంటే కామ కళ ఇక్కడ జీవన శైలీ సూత్రం. అంతేకాని బూతు బొమ్మల కొలువు కాదు. ఈ మహా వృత్తాకార పరిభ్రమణమే గీతాకారుడు తాత్త్విక సూత్రంగా లోకానికనుగ్రహించినది.

ఏవం ప్రవర్తితం చక్రం నాను వర్తయతీహ యః

అఘాయుః ఇంద్రియారామో మోఘం పార్థస జీవతి (గీత. 3-16)

ఆ అధ్యాయంలో 10నుండి 15దాకా చక్రభ్రమణ రూపాన్ని చెప్పి దాని నిక్కడ ముగింపుగా చెప్పాడు. ఇదే సూత్రం ప్రభుత్వ యంత్రాంగంలోనూ - వున్నదని నిరూపించిన మహానుభావుడు ఆనంద కుమారస్వామి (చూ. Spiritual Authority and Temporal power in the Indian theory of Government - దానిననుస రించి వ్రాసిన నా శ్వేతచ్ఛత్రం)

భారతీయ సమాజం కేవలం ఐహికమూకాదు కేవలం ఆముష్మికమూ కాదు. (కొందరు పాశ్చాత్య పండితులు క్రితం శతాబ్దిలో ఇలా భావించారు. తప్పని భారతీయ ప్రజ్ఞ ఖండించిన గ్రంథాలనేకం.)

ఈవిశ్వనాట్యం కావ్యవస్తువుగా భారతీయుడా రాధించడమే కాక జీవన సూత్రంగా పరిణమింప చేశాడు. పాశ్చాత్య దేశాల్లో ప్లేటో - కాంట్ లాంటి తత్వవేత్తలు వేరుగా, సాధారణ ప్రజ వేరుగా బ్రతికితే ఇక్కడ ఆచార్యుడు సమాజంలోకి వచ్చి తన సిద్ధాంతా లను వారి కందించాడని కుమారస్వామి The Dance of Shiva లో అనటం శ్రీ శంకరుల జీవితం ద్వారా మనకుస్పష్టమే. బ్రహ్మసూత్రాది భాష్యాలు వ్రాసిన మహాచార్యుడు ఏక శ్లోకం ద్వారా అద్వైత సారాంశాన్ని ఇచ్చాడు. భజగోవిందంలాంటి సులభ స్తోత్రం ద్వారా లోకంలో ప్రచారం చేశాడు. ఇదే విషయం కవి - శిల్పి - చిత్రకారుడు - నటుడు - సంగీత విద్వాంసుడు లోకంలో ప్రచారం చేశారు.

భారతం లాంటి మహేతిహాసాల్లో జనన మరణాల నడిమిదే జీవితం కాదు. ఇది భౌతికార్థ వృత్తం. దానికి మరొక అర్థవృత్తం అదృశ్య రూపంలో వుందని కథ ద్వారా మనకందించారు. దానినే ప్రబంధకవులూ గానం చేశారు. ఇతి హాసమే తనను తాను హ్రస్వీకరించుకొని కళాత్మక రూపంగా అవతరించింది. అదే ప్రబంధం. ఇందులోనూ పూర్ణజీవనయాత్రను వర్ణించాడు మహాకవి. (కొందరు) లౌకిక మానవుని పూర్ణ మానవునిగా ఆవిర్భవింప చేసే క్రతువు కావ్యం (కళ).

దేవులపల్లి వారి 'శోభ'

శ్రీ దేవులపల్లి ప్రభాకరరావు

తెలంగాణ వైతాళికులలో అగ్రగణ్యులు స్వర్గీయ దేవులపల్లి రామానుజరావుగారు. తెలంగాణా జాగృతిలో, మూగవోయిన తెలంగాణ రతనాల వీణ చైతన్య వంతమయి అభ్యుదయ గీతాన్ని ఆలాపించడంలో ఆధునిక తెలంగాణ అవతరణలో రామానుజరావుగారు నిర్వహించిన పాత్ర అద్వితీయమయినది. అక్షరాల ఆయన జీవితము సారస్వత సేవకు, భాషామతల్లి అర్చనకు అంకితమయినది. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో స్వయంకృషితో అఖండ పాండిత్యం ఆర్జించిన విద్వన్మణి, విజ్ఞానఖని, మేధావి, సాహిత్యవేత్త, ఉత్తమకవి, రచయిత, విమర్శకుడు, సంపాదకుడు, రామానుజరావు. ఆయన బహుగ్రంథకర్త. అనర్గళ వక్త. సాహిత్య, సారస్వత, విద్యా, వైజ్ఞానిక సంస్థల నిర్వహణలో రామానుజరావు ప్రదర్శించిన శ్రద్ధాసక్తులు, అంకిత భావం, కార్య నిరతి, నిర్మాణ దక్షత, సామర్థ్యం, నిరుపమానమయినవి. ఓరుగల్లు నగరంలో శబ్దాను శాసనాంధ్ర భాషా నిలయం, హైదరాబాద్ నగరంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం తదితర విశ్వవిద్యాలయాలు, నగర కేంద్ర గ్రంథాలయం, తెలుగు అకాడెమీ, రాష్ట్ర శాసన సభ పారిభాషిక పదకోశ నిర్మాణ కమిటీ, గెజిటీర్స్ సంకలనం కమిటీ, ఉర్దూ భాషాభివృద్ధి సంస్థ (అంజుమన్ తరఖియె ఉర్దూ), ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడెమీ, రాజ్యసభ తదితర అనేక సంస్థలు రామానుజరావు అమూల్యసేవకు, ప్రతిభాప్రదర్శనకు విశాలవేదికలయినవి. 'ఆకాశవాణి' లో ఆయన ప్రసంగాలు అనర్ఘరత్నాలు. నిజామ్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ స్వాతంత్ర్య సమరానికి, విముక్తి ఉద్యమానికి, అనంతరం విశాలాంధ్ర ఉద్యమానికి అండగా నిలిచిన రామానుజరావు సామాజిక స్పృహగల సామ్యవాది. సోషలిస్టుపార్టీ అభ్యర్థిగా ఆయన మొదటి సాధారణ ఎన్నికలలో లోక్‌సభకు పోటీ చేసినారు. మదరాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఏ., నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి ఎల్.ఎల్.బి. డిగ్రీలు పొంది నప్పటికి రామానుజరావు ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలలో, పదవులలో ఆసక్తి చూపలేదు; ఆత్మ గౌరవానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన రామానుజరావు స్వేచ్ఛాజీవి, నిష్కామయోగి; ఎన్నడూ ఎవరికి తలవంచని అతి స్వతంత్రుడు ఆయన. రామానుజరావు వ్యక్తిత్వం సమున్నతమయినది, విశిష్టమయినది. నిజాయితీకి, నిరాడంబరత్వానికి నిర్భయత్వానికి ప్రతీక ఆయన నిష్కళంక జీవితం.

రామానుజరావు యశశ్చంద్రికలో ఒక ధవళ కిరణం సాహిత్య మాసపత్రిక ప్రచురణ. ఆలోచన అంకురించ డానికి ప్రేరణ కల్గించిన సంఘటన చరిత్రాత్మక మయినది, ఆసక్తి దాయకమయినది. హైదరాబాద్ నగరంలోని తమ స్వగృహం "ఆంధ్ర కుటీరం" లో ఒకరోజు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు గారు రామానుజరావుగారితో మాట్లాడుతూ నేడు తెలంగాణమున కున్న ముఖ్యమయిన కొరతలలో మాసపత్రిక ఒకటి అని అన్నారు. హనుమంతరావు మాట రామానుజరావుకు ఆదేశమయినది. తమ సంపాదకత్వం లో శోభ సాహిత్య మాసపత్రిక ప్రచురణకు అదే క్షణంలో సంకల్పించి అందుకు ఉద్యమించినారు. అది 1947వ సంవత్సరం వేసవికాలం. నిజామ్ నిరంకుశత్వం మతోన్మాదుల రజాకార్ల అరాజకత్వం హద్దులు దాటి తెలంగాణం ఒక అగ్ని గుండంగా మారిన గడ్డు రోజులవి. చట్టబద్ధపాలన, శాంతి భద్రతలు, పౌర హక్కులు మృగ్యమయిన అత్యంత క్లిష్ట పరిస్థితి ఉత్పన్నమయింది. తెలంగాణం అంతట భయానక వాతావరణం ఏర్పడింది. తెలుగు భాషకు, సాహిత్యానికి దిక్కులేని కాలం అది. ఆ క్లిష్ట పరిస్థితిలో రామానుజరావు శోభ సాహిత్య

మాసపత్రిక ప్రచురణ ప్రారంభించడం సాహసమే. రజాకార్ల రాక్షసకృత్యాలకు కేంద్రమయిన 'ఆంధ్రనగరం' ఓరుగల్లు నుంచి ఈ మాసపత్రిక ప్రచురణకు ఆయన నిర్ణయించడం మరింత సాహసం. రామానుజరావు సంపాదకత్వంలో, ఆయన నేతృత్వంలో ఓరుగల్లులో 1947 ఏప్రిల్ నెలది తొలిసంచిక. ఈ సంచిక అందమయిన ముఖపత్రం కొండపల్లి శేషగిరి రావు గీచిన రేఖాచిత్రం. వరంగల్లులోని అప్పటి ముక్రమ్‌జాహి రోడ్డులో పత్రిక కార్యాలయం. మాసపత్రిక వెల నాటి నిజామ్ సిక్కా ఎనిమిది అణాలు. సంవత్సర చందా ఆరు రూపాయలు. ప్రతినెల రెండవ తేదీన పత్రిక వెలువడింది. ప్రథమసంచిక ఉగాది పర్వదినం సందర్భాన వెలువడింది.

శోభ ప్రథమ సంచిక సంపాదకీయంలోని ఈ కిందికొన్ని వాక్యాలలో రామానుజరావుగారి అభిప్రాయాలు వ్యక్తమయినవి. "శోభ ప్రథమ సంచిక నీ యుగాది పండుగ ప్రొద్దున ఆంధ్రపాఠక లోకమున కర్పించగలిగినందులకు మిక్కిలి సంతసించుచున్నాము. ఈ సంతసము మమ్ములను పరవశుల జేయుట లేదు. శోభ యొక్క భావి నిర్వహణ కర్తవ్యభారము మా యానంద సలిల ప్రవాహమున కానకట్టగా వున్నది. ఈ బాధ్యత గురుతరమైనదను విషయము సుస్పష్టము. ఆంధ్ర సరస్వతి నారాధింపవలెనను ఉత్సాహమేమాయీ సాహసమునకు మూలకారణము.... ఒకనాడు ప్రసంగ వశమున నేడు తెలంగాణమునకున్న ముఖ్యమయిన కొరతలలో మాసపత్రిక యొకటియని ఆంధ్ర పితామహులగు మాడపాటి హనుమంతరావుగారు వచించి యుండిరి. ఆనాటి వారి యాదేశము మా యుత్సాహమునకు దోహద మొనరించినది. పూజ్యులగు శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు, మందుముల నరసింగరావు గారు, రాయప్రోలు సుబ్బారావుగారు మా యుద్యమమును ప్రోత్సహించి ఆశీర్వదించినారు. నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు శుభాకాంక్షలు చల్లినది. సాహితీ మేఖల, నల్లగొండ సారస్వత పరిషత్తు, సాధన సమితిపెట్టని కోటలయినవి. విద్వద్వర్యులు, రసిక శేఖరులునగు శ్రీ పర్సా వేంకటేశ్వరరావుగారు మాకు అండయై నిలచి ఉన్నారు..ప్రాత క్రొత్తల మేలి కలయికను సాధింపవలసిన యవసరము నేడు మనకున్నది. ప్రాత దానిని మరువక అభ్యుదయ మార్గముల ననుసరింప వలెను. రసప్రధానమగు సారస్వతముతో పాటు విజ్ఞాన ప్రబోధకమగు విశ్వవీణపై తెలుగు దనముతో ఆలపింప వలెను. మేము గ్రాంథికరచనలే స్వీకరింతుమని మడికట్టు కొనలేదు. వ్యావహారికము తప్ప అన్యము ప్రకటింపమను పట్టుదల మాకులేదు. సరళమై, సులభ గ్రాహ్యమై యుండుటయే మా ఆశయము.. కాలముతో పాటు సారస్వతము మారుచున్నది. ఆదరణ బాధ్యత ప్రజలకు సంక్రమించినది. ఇది ప్రజాయుగము, విజ్ఞాన యుగము, జాతీయ పునర్వికాస శుభోదయమునకు సేవయొనరించు ఆశయముతో మా 'శోభ' ఉదయించినది. 'శోభ'కు జన్మస్థానము ఆంధ్రనగరమగుట సందర్భశుద్ధియే కాదు, శోభావహము కూడ".

'శోభ' సచిత్రమాసపత్రిక ప్రచురణ తెలంగాణ సారస్వతలోకంలో, సాహిత్య రంగంలో వినూత్న ఉత్సాహాన్ని రేకెత్తించింది. తెలుగు భాషాభిమానాన్ని ఉద్దీపింపజేయడంలో శోభ అగ్రగామిగా నిలచి అపారంగా దోహదపడింది. తెలంగాణ యువకవులు, రచయితలు తమ గళం విప్పి విన్పించడానికి 'శోభ' కాహళిగా ఉపకరించింది. ప్రథమ సంచికలో ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు సంపాదకులు రామానుజరావుకు రాసినలేఖ ప్రచురిత మయింది. ఆ లేఖలోని వాక్యాలు: "మిత్రవర్యా, శోభయను పేర తెనుగు మాస పత్రికను విఖ్యాత చారిత్రక రంగమగు ఆంధ్రనగరము నుండి ప్రకటింప సాహసించిన తమ యుద్యమము ఉదాత్తమయినది. ఈ విషయమున తమరుత్యాగము నవలంబించుట గొప్ప విషయము. తమకు దైవానుగ్రహము వలన అలవడిన సారస్వదాభిరుచియు, తమ పాండిత్యమును, నిసర్గమును, ధారాళమునగు తమ శైలియు తమరు పూనిన కార్యమున కపరిమితముగా తోడ్పడి తమ యుద్యమమును విజయవంతముగా

జేయునని నమ్ముచున్నాను. తమరీపనిని పట్టుదలతో నిర్వహింతురు గాక!" శోభ ప్రచురణ కవుల కలాలకు పులకరింతలు కల్గించినది. "శోభయను మాట వీనుల సోకినంత పులకరించె తెలంగాణ పుణ్యభూమి, ఈ యుగాదియె తెలుగునాడింట యింట శోభ వెలయించి రసముల చూరలిచ్చు" అంటూ ధవళా శ్రీనివాసరావు (సాహితీ మేఖల) ఆనందంతో ఆలాపించిన గీతం ప్రథమ సంచికలో ప్రచురితమయింది.

సాహిత్య, సారస్వత రచనలతో పాటు సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, వైజ్ఞానిక విషయ సంపన్నతకు, వైవిధ్యానికి, సమకాలిక రాజకీయ పరిణామాలపై సంపాదకీయ వ్యాఖ్యలకు, విమర్శలకు ప్రాధాన్యం ఇస్తూ రామానుజరావు శోభను సచిత్రమాస పత్రికగా, సమగ్ర మాసపత్రికగా రూపుదిద్దినారు. వినూత్న సొబగులతో శోభ పాఠకులను అలరించింది. విలక్షణమయిన, ఉదాత్తమయిన పద్యాలు, గేయాలు, వ్యాసాలు, కథానికలు, గల్పికలు శోభ సంచికలలో ప్రచురిత మయినవి. కొండపల్లి శేషగిరిరావు రేఖాచిత్రాలు శోభ సంచికలో పేజీలకు కొత్త అందాలను, హవణికలను చేకూర్చినాయి. శోభ సంచికలను అవలోకిస్తున్నప్పుడు ఆంధ్రుల సాంఘిక జీవనంపై సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు, రెడ్డిరాజులకాలపు మత సంస్కృతులను వివరిస్తూ బూర్గుల రామకృష్ణారావు అందించిన రచన, ఆంధ్రుల ఆర్థికస్థితిపై గడియారం రామకృష్ణశర్మ విశ్లేషణ, ఎల్లకవి తిక్కన కవిత్వ ప్రాశస్త్యాన్ని ఖండవల్లి లక్ష్మీ రంజనం తెలియజెప్పిన తీరు, కురుగంటి సీతారామయ్య, అంబటిపూడి జరిపిన సాహిత్యవిమర్శ, పరామర్శ, అభ్యుదయకవిత్వం, కథానికా పరిణామం తదితర అంశాలపై సమాలోచనా వ్యాసాలు తలమానికాలుగా గోచరిస్తాయి. ఇంగ్లీషు, మరాఠీ భాషలనుంచి కాళోజీ నారాయణరావు తెలుగులోనికి అనువదించిన కథలు, రచయిత పేరులేకుండా ప్రచురితమయిన ఆచార్యుల కథలు, పొట్లపల్లి రామారావు లేఖిని నుంచి వెలువడిన సైనికుని జాబులు, నెల్లూరి కేశవస్వామి, ధరణికోట శ్రీనివాసులు, భాస్కర భట్ల కృష్ణారావు, కంచినేపల్లి వెంకటరామారావు, మానేపల్లి తాతాచార్య, నందగిరి ఇందిరా దేవి, ఇల్లిందల సరస్వతీ దేవి రచించిన కథలు, గల్పికలు తరాలు గడిచినప్పటికీ కమనీయత తరగ నట్టివి. ఆంధ్రోద్యమ వికాసంపై హనుమంతరావు, తెలంగాణంలో అభ్యుదయ రచనపై బూర్గుల రంగనాథ రావు పరిశీలనాత్మక వ్యాసాలు గణనీయమయినవి. కాళోజి నారాయణరావు నా గొడవ, దాశరథి కృష్ణమా చార్యుల అగ్నిధార కవితాసంకలనాలలో చేరిన కొన్ని గీతాలు మొదటశోభ సంచికలలో ప్రచురిత మయినాయి. వానమామల వరదాచార్యుల మధుర కవితలు శోభకు అలంకారాలయినాయంటే అత్యుక్తి కాదు. ఖాజీ నజరుల్ సలామ్ రచనలు శోభలో ప్రచురితం కావడం విశేషం.

పదలాలిత్యం,భావ ఔన్నత్యం, తెలుగు జీవన రామణీయకత తొణికిసలాడే కమ్మని కవితలల్లిన రామానుజరావు శక్తివంత గద్య రచనలో ఉద్దండులు. సాహిత్య సౌరభాలతో, రాజకీయ, సామాజిక విషయవిపుల పరిజ్ఞానంతో ఆయన రచించిన సంపాదకీయాలు, వ్యాఖ్యలు, గ్రంథ సమీక్షలు, ఇతర వ్యాసాలు 'శోభ' కు పరిపుష్టిని, పరిణతిని, ప్రామాణికతను సంతరింప జేసాయి. 'శోభ' నిర్వహణలో రామానుజరావు మహా మనీషిగా దర్శనమిస్తారు. తమ అమూల్య రచనలతో 'శోభ' ను అలంకరించిన కవులు, రచయితలు, పండితులు, పెద్దలు అనేకులు. వారిలో ముఖ్యులు సురవరం ప్రతాపరెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, బూర్గుల రామకృష్ణరావు, కాళోజి నారాయణరావు, దాశరథి కృష్ణమాచార్యులు, కురుగంటి సీతారామయ్య, నెల్లూరి కేశవస్వామి, ఆచార్య గోరా, పొట్లపల్లి రామారావు, అంబటిపూడి వెంకటరత్నం, ధవళా శ్రీనివాసరావు, గడియారం రామకృష్ణశర్మ, శిరిప్రగడ రాధాకృష్ణరావు, మారేపల్లి మాధవరావు, భాగీ నారాయణమూర్తి, వెల్దుర్తి మాణిక్యరావు, ధరణికోట శ్రీనివాసులు, వానమామలై వరదాచార్యులు, భాస్కరభట్ల కృష్ణారావు, బూర్గుల రంగనాథ రావు, కాంచినేపల్లి వెంకటరామారావు,

మాడపాటి హనుమంతరావు, కేశవపంతుల నరసింహ శాస్త్రి, నందగిరి ఇందిరా దేవి, ఇల్లిందల సరస్వతీ దేవి, మానేపల్లి తాతాచార్య, సంగిసెట్టి బాబూరావు, ప్రమోద కుమార్, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, ఖండవల్లి లక్ష్మీరంజనం, మద్దోజు సత్యనారాయణ, పులిజాల నరసింహా రావు, గౌరావఝుల వెంకట సుబ్బరామయ్య, డాక్టర్ చింతలపాటి శివరామశాస్త్రి. 'శోభ' ప్రచురణలో ఇతరులు అనేకులు సాహసంతో రామానుజ రావుకు అండగా నిలిచారు.

మతోన్మాద పైశాచికత్వం ప్రకోపించి పడగవిప్పిన భయంకర, బీభత్స వాతావరణంలో, క్లిష్ట పరిస్థితిలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ రామానుజరావు 'శోభ' ప్రచురణను అచంచలంగా నిలిచి కొనసాగించారు. రజాకార్ల రాక్షస కృత్యాలకు భీతిల్లి చాలమంది వరంగల్లు పట్టణం విడచి విజయవాడ తదితర సురక్షిత స్థలాలకు వెళ్ళిపోసాగారు. 1947 ఆగస్టునెల శోభ సంపాదకీయంలో రామానుజరావు మనోవేదన ఈవిధంగా వ్యక్తమయింది. -"గత మాసమున ఓరుగల్లు నందు జరిగిన విషాద సంఘటనల వలన శోభ ముద్రణము సకాలమునకే జరిగినను చందాదారుల కందించుటలో కొంచె మాలస్య మయినది.... నేడువరంగల్లు పట్టణమునందు అనేకులు ఇతర ప్రాంతములకు పోయియున్నారు. నగరము శోభా విహీనమయియున్నది. వ్యాపారము స్తంభించిపోయినది. ఈ పరిస్థితులు ఎంతకాలము ఇట్టులుండునో తెలియదు. ఏది ఎట్లున్నను ప్రజలందరు తిరిగి తమ నివాసమగు వరంగల్ పట్టణము చేరుకొనవలెనని మా విజ్ఞప్తి. తమ నివాసమును విడిచి పోవుట వలన యెట్టి ప్రయోజనము సిద్ధింపదు. ధైర్యముగా శాంతియుతముగా పరిస్థితుల నెదుర్కొనవలెను. నేడు దేశమున యెచ్చట జూచినను కల్లోలము, సంఘర్షణము, అశాంతియె గాను పించుచున్నవి. దుండగము చెలరేగుచున్నది. హత్యలు ప్రబలుచున్నవి. మానవుని యందు మానవత్వమే అదృశ్యమగుచున్నదేమోయను సందేహము కలుగు చున్నది...'' రామానుజరావుగారిది వజ్రసంకల్పం. అకుంఠిత కార్యదీక్ష. ఆయన బెజవాడ-గుంటూరు వైపు చూడలేదు. సురక్షిత స్థానంకోసం వెతకలేదు. వరంగల్లు మట్టివాడలో పట్టపగలు తమఇంటిపై రజాకార్లు బరిసెలు, కత్తులు, తుపాకులతో దాడి చేసినా రామానుజరావు భయపడలేదు. రాజీపడలేదు. వెనుకంజ వేయలేదు. అనితర ధైర్య సాహసాలతో, ఆశయ పటిమతో ఆయన 'శోభ' ప్రచురణ తపస్సు కొన సాగించారు. అదొక చరిత్ర. రామానుజరావుగారి డెబ్బయి అయిదు సంవత్సరాల మహత్తర జీవితంలో 'శోభ' ప్రచురణ ఒక ఉజ్వల ఘట్టం. తెలంగాణ పత్రికా రంగానికి తలమానికం 'శోభ'.

రాజమానసోల్లాసము (విజ్ఞాన కోశము)

డా. గడియారం రామకృష్ణ శర్మ

"స్థాణు ర్యస్యేచ్ఛయా జాతః
శరీరార్థ భృత్ ప్రియః,
అరిక్తశక్తయే తస్మై
నమఃకుసుమధన్వనే"

(ఎవని సంకల్పముతో స్థాణుని (శివుని) వంటి వాడు ప్రియురాలికి అర్ధశరీరాన్ని ఇచ్చే రసికుడయ్యెనో అట్టి అక్షయశక్తిగల కుసుమ బాణునికి నమస్కారము.)

ఈ స్తుతి చాళుక్య సోమేశ్వరుడు రాజమానసోల్లాసములో చేసిన అపూర్వమైన మన్మథస్తుతి.

భారత దేశములో విజ్ఞాన కోశములు - విజ్ఞాన సర్వస్వములు అనదగిన మహాగ్రంథాలు చాల ప్రాచీన కాలములోనే వ్రాయబడినాయి. మొట్టమొదటి విజ్ఞాన సర్వస్వము వేదము. తరవాతిది వ్యాసుని మహాభారతము. ఆ గ్రంథం ముగింపులో "యదిహాస్తి తదన్యత్ర। యన్నేహాస్తి న కుత్రచిత్" అన్నాడు అంటే ఇందులో ఏది ఉందో అది ప్రపంచంలో ఉంది. ఇందులో ఏదిలేదో అది ఇంకెక్కడా లేదు అని అర్థము. దాని తరువాత చెప్పదగినవి పురాణాలు. వాటిని కూలంకషంగా పరిశీలించిన శ్రీ హరప్రసాద్‌శాస్త్రి గారు గరుడ - అగ్ని - నారద పురాణాలు జ్ఞాన సంహితలన్నారు - ప్రత్యేకంగా అగ్ని పురాణాన్ని పరిశోధించిన హెచ్.హెచ్. విల్సన్ గారు ఇదొక విజ్ఞాన సర్వస్వం అన్నారు. మళయాళ పండితుడు కెట్టంమణి 'పురాణిక్ ఎన్‌సైక్లోపీడియా' అనే గ్రంథం వ్రాసినారు. ఇవి తరువాత - బృహత్సంహిత వంటి గ్రంథాలకు స్ఫూర్తి నిచ్చిఉంటాయి.

అప్పటి విద్వాంసులేకాక రాజులు, మహారాజులు కూడ విజ్ఞాన కోశాలను రచించినారు. అనేక శాస్త్ర గ్రంథాలు వెలువడినాయి. అప్పటి రాజకుమారులకు , ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజలకు చక్కని శిక్షణ ఇవ్వడానికి మేధావులు పూనుకున్నారు. అట్టి గ్రంథాలు రచింపబడినాయి.

(2) విజ్ఞాన కోశాలు

ఉత్తర భారతము 10, 11, 12 శతాబ్దులలో రాజకీయ సంక్షోభంలో పడి ఉండగా దక్షిణ భారతము, ధర్మపాలనతో సుభిక్షంగా ఉండి ఉత్తరదేశీయ పండితులను ఆకర్షిస్తున్నది. కాశీ-కాశ్మీరము వంటి ప్రాంతాలలో విధర్మీయుల అత్యాచారాలు భరింపలేక ఎందరో యువక పండితులు దక్షిణాది రాజాస్థానాలలో చేరుతున్నారు. అప్పుడు దక్షిణాది పండితులు కూడ సకల భారతంలో ప్రసిద్ధులై ఉన్నారు. ఇక్కడ అనేక విద్యాశాలలు, ఘటికాస్థానాలు, అగ్రహారాలు, జైన బసదులు, బ్రహ్మపురులు, శైవమఠాలు చక్కగా విద్యాబోధన చేస్తున్నాయి. మహారాజులలో చాళుక్య సోమేశ్వరుడు, భోజరాజు, క్షేమేంద్రుడు మొదలైనవారు విజ్ఞాన సర్వస్వాల వంటి మహాగ్రంథాలనురచించినారు. సోమేశ్వరుని 'రాజమానసోల్లాసము' భోజుని 'సమరాంగణ సూత్రధారము' దేవగిరి యాదవరాజు మహాదేవుని ఆస్థానంలోని హేమాద్రి పండితుని 'చతుర్వర్గ చింతామణి' కర్నాటకంలోని కళది సంస్థాన పాలకుడు బసవరాజు రచించిన 'శివతత్వ రత్నాకరము' విజ్ఞాన సర్వస్వాలు అనదగినవి.

ఆంధ్రదేశంలోని పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర, అయ్యలరాజు నారాయణా మాత్యుని 'హంసవింశతి', టేకుమళ్ళ రంగసాయి వ్రాసిన 'వాణీ విలాస వనమాలిక' అనే కావ్యాలు విజ్ఞాన సర్వస్వాలన దగినవే.

ఇటీవల పాశ్చాత్యుల ప్రభావంతో 'విజ్ఞాన సర్వస్వాలు, సంగ్రహ విజ్ఞానకోశాలు, ఆర్ష విజ్ఞాన కోశాలు ఆధునిక పద్ధతులతో వస్తున్నాయి.

(3) రాజమానసోల్లాస కర్త

చాళుక్య సోమేశ్వరుని రాజమానసోల్లాసమును పరిచయం చేయడమే ఈ రచనోద్దేశము.

ఈ గ్రంథాన్ని 'అభిలషితార్థ చింతామణి' అని కూడా అంటారు. కర్త సోమేశ్వరుడు కల్యాణి చాళుక్య వంశానికి చెందినవాడు. ఈ వంశము బాదామి చాళుక్య శాఖకుచెందినది. ఆ వంశం 8వ శతాబ్దిలో అస్తమించిన తరువాత అనేక శాఖలుగా చీలిపోయింది. కల్యాణి చాళుక్యులు, వేంగీచాళుక్యులు, ముదిగొండ చాళుక్యులు, వేములవాడ చాళుక్యులు గుజరాత్ లోని సోలంకీలు, ఆ మూల వంశానికి సంబంధించిన వారే.

10వ శతాబ్దిలో ఈ శాఖను తైలపుడు పునరుద్ధరించి నాడు. గుల్బర్గాజిల్లాలోని కల్యాణి వీళ్ళకు రాజధానిగా ఉన్నందున వీరు కల్యాణి చాళుక్యులైనారు. ఈ శాఖకు తైలపుడు మూలపురుషుడు. ఈ వంశంలో ఆహవమల్ల, త్రైలోక్యమల్ల బిరుదాంకితుడు ప్రథమ సోమేశ్వరుడు పరాక్రమశాలి. తంజావూరు చోళులను పారద్రోలి రాజ్యమును విస్తరింపజేసినాడు. ఇతని పెద్దకొడుకు భువనైకమల్ల ద్వితీయ సోమేశ్వరుడు. బంకాపురం రాజధానిగా తన భాగమును పాలించెను. రెండవ కొడుకు మహావీరుడు. త్రిభువనమల్ల బిరుదు వహించిన ఆరవ విక్రమాదిత్యుడు శకకర్త - 1076లో సింహాసనమెక్కి 1126 వరకు రాజ్యంచేసినాడు. ఇతనివల్ల చాళుక్య విక్రమవంశం మొదలైంది. వీరుడైనట్లే - మహాసరసుడు - ఇతని ఆస్థానములో 'యాజ్ఞవల్క్య స్మృతి'కి 'మితాక్షర' వ్యాఖ్యను వ్రాసిన విజ్ఞానేశ్వరుడు - ఈ రాజు చరిత్రను విక్రమాంక దేవ చరిత్ర పేరుతో మహాకావ్యాన్ని వ్రాసిన కాశ్మీర కవి 'బిల్హణుడు' ఉన్నారు. ఆ కవి 'విద్యాపతి' బిరుదు పొందినాడు. త్రిభువన మల్లుని కుమారుడు 'భూలోకమల్ల తృతీయ సోమేశ్వరుడు. తండ్రి తరువాత 1126లో పట్టాభిషిక్తుడై నాడు. ఇతడు మహావిద్వాంసుడు. సర్వశాస్త్ర పారంగతుడు ఇతనికి సర్వశాస్త్రార్థ 'సర్వస్వపాదోధి కల శోద్భవుడు', 'సర్వజ్ఞుడు' అనే బిరుదులున్నాయి. ఈ మహారాజు రచించినదే 'రాజమానసోల్లాస'మహాగ్రంథము.

4. రాజమానసోల్లాసము

ఈ గ్రంథము సమస్త శాస్త్ర విషయోపేతము కావున దీనికి "అభిలషితార్థ చింతామణి" అనే ఇంకొక పేరున్నది. గ్రంథారంభములో తనను గురించి, గ్రంథాన్ని గురించి కొంత చెప్పినాడు.

"చాళుక్యవంశతిలకః శ్రీ సోమశ్వర భూపతిః,
కురుతే మానసోల్లాసం, శాస్త్రం విశ్వోపకారకం"

(చాళుక్య వంశతిలకుడు సోమేశ్వరరాజు ప్రపంచానికి పనికి వచ్చే, మానసోల్లాసమనే శాస్త్రాన్ని రచిస్తున్నాడు)

"శిక్షకః సర్వ వస్తూనాం, జగదాచార్య పుస్తకః,
అభ్యస్యాయం ప్రయత్నేన, సోమభూపేన నిర్మితః॥

(సోమేశ్వరుడు రచించినది, సకలశాస్త్ర విషయాలను తెలిపేది, ప్రపంచానికి గురువు వంటిది అయిన ఈ గ్రంథాన్ని చదివి ప్రయోజనం పొందండి.)

గ్రంథంలోని ఆధారాన్ని బట్టి ఈ గ్రంథము శా.శ. 1052 సంవత్సరమున రచింపబడినదని చెప్పవచ్చును. ఆ శకవత్సరము క్రీ.శ. 1030-31 కాగలదు.

గ్రంథ స్వరూపము :

ఇందులో 5 ప్రకరణాలున్నాయి. ఒక్కొక్క ప్రకరణంలో 20 అధ్యాయముల ప్రకారము మొత్తము 100 అధ్యాయముల గ్రంథము.

(1) మొదటి ప్రకరణం : "రాజ్యప్రాప్తి కారణ వింశతి"

రాజ్యాన్ని సంపాదించడానికి సంబంధించిన 20 అధ్యాయాలున్నాయి. 'అసత్యం - పరద్రోహం - అగమ్యగమనం - అభక్ష్యభక్షణం- అసూయ - పతితుల మైత్రి - క్రోధం - ఆత్మస్తుతి- వీటిని పూర్తిగా పరిత్యజించ వలెను. దానం - ప్రియవక్తృత్వం - యజ్ఞాదుల ఆచరణం - వాపీకూప తటాకాదుల నిర్మాణం - దైవభక్తి - గోబ్రాహ్మణ తృప్తి - పితృదేవతారాధనం - అతిథి పూజ - గురుభక్తి - తపస్సు - తీర్థయాత్రలు - దీనానాథ బంధు భృత్యపోషణం - శరణాగతరక్షణం- వీటిని చేయవలెను.

(2) రెండవ ప్రకరణము : "ప్రాప్త రాజ్య స్థైర్య కారణ వింశతి"

సాధించిన రాజ్యాన్ని స్థిర పరచడానికి సంబం

ధించిన ఇరవై అధ్యాయాలున్నాయి. ప్రభుత్వ స్వరూప నిరూపణము - రసాయన ప్రక్రియ - సప్తాంగాలు - పురోహిత వర్గము - ప్రభు, మంత్ర, ఉత్సాహ శక్తులు - సంధి విగ్రహాలు - విజయయాత్ర- దానికి సంబంధించిన ముహూర్త శకునాలు - ఆసనం - ఆశ్రయం - ద్వైధీభావము - నాలుగు ఉపాయాలు, దండ భేదాలున్నాయి.

(3) మూడవ ప్రకరణం :"ఉపభోగ వింశతి"

రాజు అనుభవించు భోగాలకు సంబంధించిన 20 అధ్యాయాలు. గృహోపభోగము- నిర్మాణాది విచారము- మూర్తి నిర్మాణ కళా విధులు - స్నానోపభోగం - అనులేపనాలు - వస్త్ర- భూషణ- పాదరక్షా - పీఠ - చామర - ఆహార- పానీయ- తాంబూల - పాదాభ్యంగ - యాన - ఛత్ర - శయ్యా - ధూప - స్త్రీ భోగాదులు - సంతానము - 16 సంస్కారాలు చెప్పబడినాయి.

(4) నాలుగవ ప్రకరణం : "ప్రమోదజనక వినోద వింశతి"

ఆనందాన్నిచ్చే వినోదాలకు సంబంధించిన 20 అధ్యాయాలున్నాయి. శస్త్ర - వాజి -గజ- మల్లవినోదాలు - కోళ్ళు - లావక పక్షులు - మేకపోతులు- దున్నపోతులు - పావురములు - కుక్కలు - చేపలు- మొదలైన వాటి పందేలు - గీత - వాద్య -నృత్య - కథాప్రసంగ - చమత్కారాది వినోదాలున్నాయి.

(5) అయిదవ ప్రకరణము : "సుఖ కారకక్రీడా వింశతి"

ఇందులో క్రీడలకు సంబంధించిన 20 అధ్యాయాలున్నాయి. "పర్వత-వన-జలసంతరణాది క్రీడలు - పచ్చిక బయళ్ళు - పంట పొలాలు - వెన్నెల ఆటలు - ఇసుక తిన్నెలు - మద్యపాన గోష్ఠి - ప్రహేళిక - చదరంగము -పంచిక - దాగుడు మూతలు - తమిస్రభ్రమణము - వంటి విషయాలున్నాయి.

కొన్ని విశేష విషయాలు : దక్షిణ దేశ సంగీత నాట్య లాక్షణికులలో సోమేశ్వరుడే ప్రథముడని పండితులన్నారు. తన కాలానికి తెలిసిన సంగీత శాస్త్ర విజ్ఞానాన్ని ఆయన ఈ గ్రంథంలో చెప్పినాడు. నాలుగవ ప్రకరణంలో రెండు అధ్యాయాలలో సంగీత విజ్ఞానాన్ని తెలిపినాడు.

"సామవేదాత్ స్వరాఃజాతాః, స్వరేభ్యోగ్రామ సంభవః
గ్రామేభ్యోజాతయోజాతాః, జాతిభ్యోరాగ నిర్ణయః
రాగేభ్యశ్చతథాభాషా, తథై వాంతర భాషికాః"

(సామవేదంనుండి సప్త స్వరాలు, వాటినుండి గ్రామములు, గ్రామాల నుండి జాతులు, వాటినుండి రాగాలు - వాటినుండి భాషలు అందుండి, విభాషలు పుట్టినాయి అన్నాడు) ఈ క్రమంలో సంగీత పరిణామ చరిత్ర ఉంది. కొన్ని రాగాలకు లక్షణాలు చెప్పినాడు నృత్య వినోదము అధ్యాయములో 457శ్లోకాలున్నాయి

మరొక విశేషము తెలుసుకోవలసి ఉన్నది సోమేశ్వరుని కొడుకు రెండవ జగదేక మల్లుడు. అతన్ని ప్రతాప చక్రవర్తి అంటారు. 1134 సం॥ నుండి 1143 వరకు ఏలినాడు. ఇతడు సంగీత విద్వాంసుడు, "సంగీత చూడామణి" అనే గ్రంథాన్ని వ్రాసినాడు. అందలి 5వ అధ్యాయము నృత్యాధ్యాయము. ఇది ఆశ్చర్యకర విషయము.

సోమేశ్వరుడు మూడవ ప్రకరణంలో కంచు మొదలైన లోహాలతో విగ్రహాలను పోతపోయు అచ్చులను తయారు చేయు విధానము. అందులో వాడుకొనవలసిన వస్తువులు వివరించినాడు. దీన్ని "మధూచ్ఛిష్ట విధానము" అంటారు. ఈ పోతలో గట్టి విగ్రహాలు, బోలు విగ్రహాలు అని రెండు విధాలున్నాయి. ఈ రెండింటి అచ్చుల విధానాలను చెప్పినాడు.

ఈ మహారాజు నాట్య శాస్త్రవేత్త కూడ. తన రాజధానిలో జరిగిన ఒక ఉత్సవములో భిల్ల వనిత 'గొండ్లి' అనే జానపద నృత్యం చేసింది. దాన్ని చూచిన సోమేశ్వరుడు ఆ నృత్యానికి శాస్త్రీయ రూపమునిచ్చి శాస్త్రీయ నాట్యంగా స్థానం కల్పించినాడని కాకతీయ సేనాని 'జాయప' తన 'నృత్య రత్నాకరము'లో చెప్పినాడు.

(6) ఈ గ్రంథ ప్రచురణ :

ఇట్టి ఉత్తమ గ్రంథానికి వ్రాతప్రతులు బికనీరు -

పూనా - తంజావూరు - బరోడా - మైసూరు మొదలైన నగరాలలోని ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారాలలో అసమగ్రంగాను, శిథిలావస్థలోను ఉన్నాయి. బరోడా భాండాగారంలో పర్యవేక్షకులు శ్రీ గుండేకార్ మహాశయుడు ఈ గ్రంథాన్ని పరిష్కరించి ప్రకటించ సంకల్పించిరి. మూడు సంపుటాలుగా ముద్రించదలచిరి -ప్రథమ సంపుటం - మొదటి రెండు ప్రకరణాలతో 1925లో ప్రకటించబడింది. ద్వితీయ సంపుటం మూడవ ప్రకరణం, 4వ ప్రకరణంలోని 15 అధ్యాయాలతో 1938 సం॥లో వెలువడింది. నాల్గవ ప్రకరణంలోని 5 అధ్యాయాలు, అయిదవ ప్రకరణంతో తృతీయ సంపుటం ప్రకటించబడలేదు. అంతటితో ఆ పని ఆగిపోయింది.

మైసూరు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగార అధిపతి శ్రీ ఆర్. శ్యామా శాస్త్రిగారు మైసూరు విశ్వ విద్యాలయం పక్షాన ప్రకటింప ప్రయత్నించిరి. మొదటి - రెండవ - మూడవ ప్రకరణాలున్న ప్రథమ సంపుటి 1926 సం॥లో ప్రచురితమైంది. నాలుగు అయిదు ప్రకరణాలుండే ద్వితీయ సంపుటం ప్రకటించబడలేదు.

ఇట్టి మహాగ్రంథం సంపూర్ణంగా ప్రచురించబడక పోవడం జాతి దురదృష్టం. అయితే కొందరు ప్రత్యేక విషయాలలో శ్రద్ధ గలవాళ్ళు తమకు కావలసిన అధ్యాయాలను అనువదించి ప్రకటించినారు. ప్రఖ్యాత కళా పరిశోధకుడు 'కెంటిష్' ఆనంద కుమారస్వామి చిత్రలేఖనానికి సంబంధించిన భాగాన్ని ఆంగ్లంలోనికి అనువదించి ప్రకటించినారు. జంతు శాస్త్రజ్ఞుడు డా॥ హోరాగారు 'మత్స్య వినోదం' అనే భాగాన్ని సవిమర్శంగా ప్రకటించినారు. అట్లే ప్రసిద్ధ ఆంధ్రవైద్యులు డా॥ డి.వి. సుబ్బారెడ్డిగారు తమ "వైద్యక చరిత్ర పరిశోధనా శాఖ" పక్షాన కొన్ని వైద్య భాగాలను గ్రహించి శ్రీ శాస్త్రుల విశ్వనాథశర్మగారి చేత తెలుగు తాత్పర్యం వ్రాయించి 'వైద్యక భాగము' అనే పేరుతో1961 సం॥లో ప్రకటించినారు. ఈవిధంగా ఈ విజ్ఞాన సర్వస్వంలోని కొంత భాగమైనా తెలుగువాళ్ళు తెలుసుకునే భాగ్యం కలిగింది. డా. దండా వెంకట సుబ్బారెడ్డి గారికి ఆంధ్రలోకం ఋణపడి ఉన్నది.

ప్రభుత్వం గాని, విశ్వవిద్యాలయాలు గాని ఈ గ్రంథాన్ని సేకరించి పండితుల చేత పరిష్కరణ చేయించి తాత్పర్య - విశేషాలతో సంపూర్ణంగా ప్రచురిస్తే దేశానికి మహోపకారం కాగలదు. ఇది అత్యాశ కాదు కదా!

ఈ వ్యాసానికి ఆధారములు :

1. డా. డి.వి. సుబ్బారెడ్డిగారి ప్రచురణ
2. రత్నమాలిక
3. తెలుగు విజ్ఞాన సర్వస్వము, 14వ సంపుటం

విజ్ఞాన సర్వస్వాలు

డా. జి. చెన్న కేశవరెడ్డి

జ్ఞానం, విజ్ఞానం స్థూలంగా ఒకే అర్థంలో ప్రయుక్త మవుతున్నా, జ్ఞానమంటే బాహ్యావస్తువులపై ఇంద్రియాలు ప్రవర్తిల్లినపుడు కలిగే సామాన్యమైన ఎరుక లేదా తెలివి లేదా పరిచయాన్ని జ్ఞానంగా చెప్పుకోవచ్చు. దీనినే సామాన్య జ్ఞానం లేదా ప్రత్యక్షజ్ఞానం అని కూడా అంటారు. విజ్ఞాన మంటే విశేషరూపాలతో కూడిన జ్ఞానం. సమస్త వాఙ్మయానికి సంబంధించిన జ్ఞానాన్ని కలగజేసేది విజ్ఞానం. అటువంటి విజ్ఞానాన్ని సంకలితం చేసిన సంపుటమే విజ్ఞాన సర్వస్వం. విజ్ఞాన సర్వస్వం ప్రధాన ఆశయం సులభమైన పద్ధతి (అక్షర క్రమం)లో ప్రతి విషయాన్ని గురించి తగు మాత్రంగా తెలుసుకోవడం (To know some thing about every thing).

విజ్ఞాన సర్వస్వాన్నే ఆంగ్లంలో (Encyclopaedia) అంటారు. ఎన్‌సైక్లోపేడియా అంటే విజ్ఞాన చక్రం (Circle of learning). ఒక చట్రంలో సమస్త సమాచా రాన్ని పొందుపరచడమే విజ్ఞాన సర్వస్వం. ఎన్‌సైక్లో పేడియాకు సమానార్థకంగా 'విజ్ఞానసర్వస్వం' అనే మాటను తెలుగులో మొదట వాడిన వారు కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారే. ఈ మాటే తెలుగులో ప్రచారంలోకి వచ్చింది. అయితే ఇతర భాషలలో విజ్ఞాన కోశం, జ్ఞానకోశం, విశ్వకోశం, మహాకోశం, వంటి పదాలతో వ్యవహరిస్తున్నారు.

వివిధ శాఖలకు లేదా ఒక ప్రత్యేకమైన శాఖకు చెందిన విజ్ఞానాంశాలను ఒక సంపుటంలో గాని లేదా అనేక సంపుటాల్లోగాని అక్షర క్రమంలో నిబంధింపబడిన గ్రంథాలనే నేడు విజ్ఞాన సర్వస్వాలుగా వ్యవహరిస్తున్నారు. అనేక శాఖలకు సంబంధించిన విజ్ఞానాన్ని అందించే సంపుటాలు సాధారణ విజ్ఞాన సర్వస్వాలు (General Encyclopaedia) అయితే ఒక ప్రత్యేక శాఖకు సంబంధించిన విజ్ఞానాన్ని అందించే సంపుటాలు ప్రత్యేక విజ్ఞాన సర్వస్వాలు (Special Encyclopaedia) అంటారు.

పాశ్చాత్య విజ్ఞాన సర్వస్వాలు :

పాశ్చాత్య దేశాల్లో క్రీ.పూ. 3వ శతాబ్దికి చెందిన ప్లేటో మహాశయుని దగ్గరినుంచి విజ్ఞానసర్వస్వాలన దగిన గ్రంథాలు సంకలితమైనా, ఫ్రెంచి భాషలో వోల్టేర్, డిడిరో, డిఆలంబర్ట్ అనే మహారచయితలు రూపొందించిన ఫ్రెంచి ఎన్‌సైక్లోపేడియా ప్రకటనతో (1751) విజ్ఞాన సర్వస్వాల స్వరూప స్వభావాలు మారిపోయాయి. యీ విజ్ఞాన సర్వస్వం ఫ్రెంచి విప్లవం తలెత్తడానికి దోహదం చేసింది. అంతేకాదు ఈ నాటి ప్రామాణికమైన ఎన్‌సైక్లోపేడియా బ్రిటానికా నిర్మాణానికి ఊపిరు లూదింది. 'విజ్ఞానం శాఖోపశాఖలుగా పెరగాలి, మానవ జీవితం సుఖ సౌభాగ్యాలతో వర్ధిల్లాలి' (Let Knowledge grew from more to more and thus be human life enriched) అనే లక్ష్యంతో 1768లో బ్రిటానికా నిర్మాణం ప్రారంభమైంది. మొదట 3 సంపుటాలుగా వెలువడిన ఈ ఎన్‌సైక్లోపేడియా ఎప్పటి కప్పుడు నూతన విజ్ఞానాంశాలను మార్చుకుంటూ ఇప్పుడు 32 సంపుటాలుగా విస్తరించింది. ప్రపంచంలో ఆయా విషయాలలో నిష్ణాతులైన విద్యావేత్తలు, విజ్ఞానవంతులు అయిన రచయితల వ్యాసాలతో ఉన్నత ప్రమాణాలతో వెలువడిన విజ్ఞాన సర్వస్వం ఎన్‌సైక్లో పేడియా బ్రిటానికా. దీని తర్వాత చెప్పుకోదగినది ఎన్‌సైక్లోపేడియా అమెరికానా. ఇవి రెండూ కూడా సాధారణ విజ్ఞాన సర్వస్వాలే. పాశ్చాత్య దేశాలలో విజ్ఞాన సర్వస్వాల నిర్మాణం గణనీయంగా జరుగుతున్నది.

ముఖ్యంగా ఆంగ్ల భాషలో అనేక రకాలైన విజ్ఞాన సర్వస్వాలు, ఒక్కొక్క శాస్త్ర రంగానికి సంబంధించిన విజ్ఞాన సర్వస్వాలు, పిల్లలకు శ్రేణులవారీగా సచిత్ర విజ్ఞాన సర్వస్వాలు, అంధులకు బ్రెయిల్ లిపిలో విజ్ఞాన సర్వస్వాలు లెక్కకు మిక్కిలి వెలువడుతున్నాయి. కంప్యూటర్లు వచ్చిన తర్వాత విజ్ఞాన సర్వస్వాలు కూడా సిడిరామ్

డిస్కులలో వెలువడుతున్నాయి. వీటిని కంప్యూటర్ మానిటర్ తెరమీద చదువుకోవచ్చు, వినవచ్చు కూడా. వీటిని కదలికలతో కూడా చూడవచ్చును. ఉదాహరణకు అగ్ని పర్వతం (Volcano) ను గురించి తెలుసుకోవాలనుకుంటే, కీ బోర్డు మీద Volcano అనే అక్షరాలను టైపుచేస్తే Volcano ఆరోపానికి సంబంధించిన సమాచారం సచిత్రంగా తెరమీద కనిపిస్తుంది. చిత్రంలో అగ్నిపర్వతం లావా చిమ్ముతున్నట్లుగా కనిపిస్తుంది. రికార్డు చేసిన కంఠస్వరం ఆ సమాచారాన్ని చదివి వినిపిస్తుంది. దృశ్య శ్రవణ రూపంలో తయారైన విజ్ఞాన సర్వస్వాలివి. ఈ విధంగా నేటి కంప్యూటర్ యుగంలో విజ్ఞానసర్వస్వాల నిర్మాణం ఎన్నో వినూత్నమైన పోకడలను సంతరించుకున్నది.

భారతీయ భాషల్లో విజ్ఞాన సర్వస్వాలు :

వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు (ముఖ్యంగా అగ్ని, నారద, గరుడ), రామాయణ, మహాభారతాలు ఒక రకమైన విజ్ఞాన సర్వస్వాలే. కవులు కొందరు తమ కావ్యాల్లో కథాసందర్భాలను బట్టి తమ సమకాలీన విజ్ఞానాన్నంతటినీ గుదిగ్రుచ్చి చెప్పిన కావ్యరచనలు లేకపోలేదు. వాటిలో దండి దశకుమార చరిత్రను, బాణుని కాదంబరిని ప్రధానంగా చెప్పుకోవచ్చు. పూర్తిగా వైజ్ఞానికాంశాలను క్రోడీకరించినవి వరాహమిహిరుని 'బృహత్సంహిత', సోమేశ్వరదేవుని 'అభిలషితార్థ చింతామణి' విజ్ఞానసర్వస్వాలే. తెలుగులో పండితారాధ్య చరిత్ర, బసవపురాణం, కాశీఖండం, భీమఖండం, క్రీడాభిరామం, శివరాత్రిమాహాత్మ్యం, సింహాసన ద్వాత్రింశిక, శుక సప్తతి వంటి అనేక కావ్యాలలో కథా సందర్భాన్ని బట్టి ఎన్నో విజ్ఞానవిశేషాలను పొందుపరిచినవి ఉన్నాయి. ముఖ్యంగా కథకంటే సమకాలీన వైజ్ఞానిక విశేషాలను చెప్పడానికే ప్రాధాన్యమిచ్చిన కావ్యాలు హంసవింశతి, వాణీ విలాస వనమాలిక. 14వ శతాబ్ది చివర మాధవాచార్యుడు రచించిన 'సర్వదర్శన సంగ్రహం' అనే గ్రంథం, 15వ శతాబ్ది చివర సుల్తాన్ షాహి ఏర్పరచిన పండితమండలి భారతీయ సంగీతంమీద రూపొందించిన 'సంగీత శిరోమణి' అనే గ్రంథం కూడా విజ్ఞాన సర్వస్వం కోవకు చెందినవే.

అయితే ఆధునిక పద్ధతిలో అకారాది క్రమంలో కూర్చిన విజ్ఞాన సర్వస్వాలు మొదట బెంగాలీ భాషలో ప్రారంభమయ్యాయి. ఫిలిక్స్ కేరీ 1819-1821 మధ్య కాలంలో 'విద్యాహారావలీ' అనే విజ్ఞాన సర్వస్వాన్ని బ్రిటానికా పద్ధతిలో నిర్మించడానికి ప్రయత్నం చేశాడు. అయితే రెండు సంపుటాలు మాత్రమే వెలువడ్డాయి. నరేంద్ర బసు సంపాదకత్వంలో 1911లో వెలువడిన 'బెంగాలీ విశ్వకోశం' అనే 22 సంపుటాల విజ్ఞాన సర్వస్వం చెప్పుకోదగింది. ఇది పూర్తిగా బ్రిటానికా పద్ధతిలో అకారాది క్రమంలో కూర్చబడిన విజ్ఞాన సర్వస్వం. దీనినే మొదటి ఆధునిక విజ్ఞాన సర్వస్వంగా భావించవచ్చు. బెంగాలీ విశ్వకోశ్‌నే హిందీ భాషలో 30 సంపుటాలుగా అనువదింపజేసుకొన్నారు. మరాఠీ భాషలో ఎస్.వి. కేత్కార్ ఆధ్వర్యంలో 20 సంపుటాల 'మరాఠి విశ్వకోశ్' వెలువడింది. దీనినే గుజరాతిలోకి, హిందీలోకి అనువదింప జేశారు. 1980లో వాయీ అనే ఊళ్ళో మహారాష్ట్ర స్టేట్ బోర్డ్ ఫర్ లిటరేచర్ అండ్ కల్చర్ సంస్థనుండి స్టేట్ బోర్డ్ ఫర్ ప్రొడక్షన్ ఆఫ్ మరాఠా విశ్వకోశ్ ను స్థాపించారు. ఈ సంస్థ 20 సంపుటాల ప్రణాళికను రూపొందించి, దాదాపు పూర్తి చేసింది.

తదనంతర కాలంలో అనేక భారతీయ భాషలలో క్రమంగా విజ్ఞానసర్వస్వాల నిర్మాణం జరిగింది. ముఖ్యంగా దక్షిణ భారతీయ భాషలలో తమిళంలో విజ్ఞాన సర్వస్వ నిర్మాణం 1947 లో ప్రారంభమైంది. తమిళ వలర్చి కజగం (Tamil development council) స్థాపితమై 1947 - 68 నాటికి 10 సంపుటాల బాలల విజ్ఞాన సర్వస్వం ప్రకటించారు. తమిళ విశ్వవిద్యాలయం 35 సంపుటాల ప్రణాళికతో ఇప్పటికి 23 సంపుటాలు ప్రచురించింది. దీనిని మరింత విస్తరించి, వివిధ విజ్ఞాన శాస్త్ర రంగాలకు చెందిన విజ్ఞాన సర్వస్వ సంపుటాలను (108 సంపుటాలు) ప్రచురించాలని భావిస్తున్నది.

కన్నడ భాషలో 1968లో కన్నడ విశ్వకోశాన్ని నిర్మించడానికి మైసూరు విశ్వవిద్యాలయం ప్రణాళికను తయారు చేసింది. ఇప్పటి వరకు 10 సంపుటాలను ప్రచురించింది. 1969-1975 మధ్యకాలంలో 'జ్ఞాన గంగోత్రి' అనే బాలల విజ్ఞాన సర్వస్వం 7 సంపుటాలలో వెలువడింది. 30 సంపుటాల 'కన్నడ విషయ విశ్వకోశం' కూడా 1969 నాటికి హానూనాయక్ సంపాదకత్వంలో వెలువడింది. ఇది కాక బ్రిటానికా పద్ధతిలో కన్నడ విజ్ఞానకోశం 14 సంపుటాల పనికూడా పూర్తి అయింది.

దక్షిణాది భాషలలో చిన్న రాష్ట్రమైన కేరళ విజ్ఞాన సర్వస్వ నిర్మాణ రంగంలో అన్నిటి కంటె మిన్నగా వ్యవహరిస్తున్నది. 1955లో మాథ్యూ యన్ ఖజుదేళీ ఆధ్వర్యంలో 14 సంపుటాలుగా ప్రణాళికను రూపొందించుకున్న విజ్ఞాన సర్వస్వం 8 సంపుటాల వరకు ప్రచురితమైంది.

పి.డి. భాస్కర్ ఫణిక్కర్ ప్రధాన సంపాదకత్వంలో 10సంపుటాల విజ్ఞాన సర్వస్వం1966 నాటికి వెలువడింది. కె.ఎన్. జార్జి ముఖ్యసంపాదకుడిగా 1969 -1990 వరకు 9 సంపుటాల కేరళ విశ్వకోశం వెలువడింది. యస్. పి.సి.ఎస్. కొట్టాయం సంస్థ నిర్మించిన 12 సంపుటాల 'సర్వ విశ్వకోశం', కొట్టాయంలో డి.సి. బుక్స్ అనే సంస్థ నిర్మించిన 'అఖిల విజ్ఞాన కోశం' (4 సంపుటాలు) భారత విజ్ఞాన కోశం 2 సంపుటాలు, దేశబంధు పబ్లికేషన్స్ వారు తయారు చేసిన కేరళ విజ్ఞానకోశం, కేరళ విశ్వ విద్యాలయంలో తయారైన మలయాళ లెక్సికాన్ వంటి ఎన్నో విజ్ఞాన సర్వస్వాలు మలయాళంలో వెలువడ్డాయి. The State Institute of Children's Literature అనే ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో బాలల విజ్ఞాన సర్వస్వం సంపుటాలు వెలువడ్డాయి. వెట్టంమణి నిర్మించిన 'పురాణిక్ ఎన్‌సైక్లోపేడియా' ఒకే సంపుటమైనా చెప్పుకో తగినది. కేరళ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞాన సర్వస్వ సంపుటాల నిర్మాణానికి 'ది స్టేట్ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఎన్ సైక్లోపేడియా పబ్లికేషన్స్' అనే సంస్థను ఏర్పరచింది. ఈ సంస్థ బ్రిటానికా పద్ధతిలో 20సంపుటాల ప్రణాళికను ఏర్పరచుకొని ఇప్పటికి 15 సంపుటాలు ప్రచురించింది. ప్రపంచ సాహిత్యంపై పది సంపుటాలు వెలువరించాలనే ప్రణాళికను కూడా చేపట్టింది.

తెలుగు విజ్ఞాన సర్వస్వాలు

తెలుగులోనే కాదు ఆధునిక దాక్షిణాత్య భాషలలో ఆధునిక విజ్ఞానసర్వస్వాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన వారు కొమర్రాజు లక్ష్మణరావు పంతులుగారు. ఆయన సంపాదకత్వంలో 1915లో ప్రథమ సంపుటం (అ నుంచి అధ్వర్య వరకు) 1916లో రెండవ సంపుటం (అన్ నుంచి అశ్విని వరకు) 1917లో మూడవ సంపుటం (అ[హ్రి]వరకు) వెలువరించారు. కొమర్రాజుగారు తలపెట్టిన విజ్ఞాన సర్వస్వ నిర్మాణం పూర్తిగా కొనసాగి ఉంటే బ్రిటానికా స్థాయిలో తెలుగువారికొక ప్రామాణిక విజ్ఞాన సర్వస్వం వెలువడి ఉండేది. ఆయనమరణంతో ఏర్పడిన కొరత ఈ నాటికీ తీరకపోవడం దురదృష్టకరం.

కొమర్రాజు తర్వాత కందుకూరి బాల సూర్యప్రసాద రాయ భూపాలుడు 'ఆంధ్ర విజ్ఞానము' అనే పేరిట 7 సంపుటాల విజ్ఞానసర్వస్వం వెలువరించారు. దీనికి రచయిత కూడా ఆయనే. ఒక వ్యక్తి చేతుల మీదుగా తయారైన మొదటి విజ్ఞాన సర్వస్వం ఇది. ఆ తర్వాత 1947లో మద్రాసులో'తెలుగు భాషా సమితి' ఏర్పడి 16 సంపుటాల ప్రణాళికతో విషయపరమైన (Subject Wise) విజ్ఞాన సర్వస్వ ప్రణాళికను తలపెట్టి 14 సంపుటాలను ప్రచురించ గలిగింది. తెలుగు భాషా సమితి కొత్తరీతిలో విజ్ఞాన సర్వస్వ సంపుటాలు వెలువరించింది. 'బుక్ ఆఫ్ నాలెడ్జ్' విధానాన్ని, బ్రిటానికా విధానాన్ని సమ్మిశ్రమం చేసినపద్ధతి అది. గ్రంథ రచనా ప్రణాళికను అనుసరించి అందులో సమీకరించదలుచుకొన్న విజ్ఞానాంశాలను ఆయా శాఖలకు సంబంధించిన విషయాన్ని విహంగ వీక్షణం(Birds eye view) లో విశ్లేషించి ఒక క్రమపద్ధతిలో కూర్చడం జరుగుతుంది. ఇది సమీక్షాభాగం. రెండవ విభాగంలో విహంగ వీక్షణంలో పొందుపరిచిన ఆయా విజ్ఞానాంశాలకు సంబంధించిన విషయాల ఆధారంగా అకారాది క్రమంలో

ఆరోపాలను ఏర్పరచుకొని సంక్షిప్తంగా వివరించడం జరుగుతుంది. తెలుగు భాషాసమితి 1986లో తెలుగు విశ్వవిద్యాలయంలో విలీనమై, 'కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వ కేంద్రం'గా ఏర్పడింది. ఈ కేంద్రం తెలుగు భాషా సమితి విధానాన్నే కొనసాగించి 24 విషయాలకు సంబంధించి, 38 సంపుటాల ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ కేంద్రం ఇప్పటికి పరిష్కృత, పునర్ముద్రణ సంపుటాలను నాలుగింటిని ప్రచురించింది. ప్రస్తుతం ఈ కేంద్రంలో పది సంపుటాల నిర్మాణం వివిధ దశలలో కొనసాగు తున్నది.

1953 సంవత్సరంలో ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు 'సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం' ప్రకటించారు. లక్ష్మీ రంజనంగారే ఆంధ్రరచయితల సంఘం సంస్థ పక్షాన 'ఆంధ్ర దేశచరిత్ర భూగోళసర్వస్వం' అనే పేరుతో మూడు సంపుటాలు ('అ' నుంచి 'ఉ' వరకు) ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు 1976లో 'విజ్ఞాన దీపిక' అనే పేరుతో మానవీయ విజ్ఞాన శాస్త్రాలకు (Humanities) ఒక సంపుటాన్ని, విజ్ఞాన శాస్త్రాలకు (Sciences) ఒక సంపుటాన్ని ప్రచురించారు. ఇవి లఘు విజ్ఞాన సర్వస్వాలు . ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు "ప్రపంచ రాజ్య సర్వస్వం" అనే గ్రంథాన్ని 1977లో ప్రచురించారు. ప్రపంచ దేశాలు, ఆయా దేశాలు వివిధ రంగాల్లో చేసిన కృషి, సాధించిన ప్రగతి మొదలైన అనేక రంగాలకు చెందిన విజ్ఞానాంశాలతో కూర్చిన గ్రంథమిది. 1942లో ముద్రణ పొందిన 'ఆంధ్ర సర్వస్వం'లో 32 అధ్యాయాలలో వివిధ అంశాలను పొందుపరచడం జరిగింది. ఇందులో ఆంధ్ర జాతి ఒక ప్రత్యేక దేశంగా రూపొందినప్పటి నుంచి ఆధునిక ఆంధ్ర దేశం వరకు సంబంధించిన అనేక విషయాలకు ఇందులో చోటు కల్పించడం జరిగింది.

సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర సంస్కృతులకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వాలే కాక ఆయా జిల్లాల (మండలాల) విజ్ఞాన సర్వస్వాలు కూడా వెలువడ్డాయి. వీటిలో మొదటిది విక్రమ సింహపురి (నెల్లూరు) మండల సర్వస్వం. దీనికి సంపాదకుడు నల్లపురెడ్డి చంద్రశేఖరరెడ్డి. బి.యన్. శాస్త్రిగారిసంపాదకత్వంలో నల్లగొండ మండల సర్వస్వం, ఆదిలాబాద్‌సర్వస్వం, మహబూబ్‌నగర్ జిల్లా సర్వస్వం వెలువడ్డాయి. దుర్గం రవీందర్‌గారు మొత్తం 23 జిల్లాల విజ్ఞాన సర్వస్వాలు తయారు చేసి, విడుదలకు సిద్ధం చేశారు. శాస్త్రుల రఘురామశర్మగారు తమ సంపాదకత్వంలో మెదక్‌జిల్లా విజ్ఞానసర్వస్వం వెల యించారు. మండల విజ్ఞాన సర్వస్వాలను రూపొందించిన బి.ఎన్. శాస్త్రిగారే బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ (కుల) రాజ్య సర్వస్వాలు రూపొందించారు.

బాలల విజ్ఞాన సర్వస్వాలు:

తెలుగులో బాలల విజ్ఞాన సర్వస్వాలు అంతగా వెలువడ లేదనే చెప్పాలి. పుదూరు సీతారామశాస్త్రులు రచించిన 'పెద్ద బాలశిక్ష'ను తొలి బాలల విజ్ఞాన సర్వస్వంగా నిడుదవోలు వెంకటరావుగారు అభి వర్ణించారు. ప్రత్యేకంగా ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ అనే సంస్థ 1956లో మహమ్మద్ కాసింఖాన్ సంపాదకత్వంలో బాలల విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించింది. పుస్తకమహల్ సంస్థవారు Children's knowledge Bank ఆధారంగా డా॥ యం. వి.శాస్త్రిగారి సంపాదకత్వంలో మూడు సంపుటాల బాల విజ్ఞాన సర్వస్వం ప్రచురించారు. బి.గోపాలం, వసంతరావు వెంకటరావు, డి. చంద్రశేఖర్, సాంబశివరావు అనే రచయితలు ఆంగ్లభాషలోని సచిత్ర విజ్ఞాన సర్వస్వాన్ని అనువదించి ప్రచురించారు. హామ్లిన్ ప్రచురణ సంస్థకూడా 'బాలల విజ్ఞాన సర్వస్వాన్ని' తెలుగులోకి అనువదించి జేసింది. బాలల విజ్ఞాన సర్వస్వాలలో బుడ్డిగ సుబ్బరాయన్ గారు రచించిన 'విజ్ఞాన సర్వస్వం (సంస్కృతి విభాగం)' ఒక సంపుటం మాత్రమే వెలువడినా ఎన్నదగినది.

ఇక ఒక అంశాన్ని తీసుకొని సమగ్రంగా రచించిన గ్రంథాలు కూడా సర్వస్వం అనే పేరుతో వెలువడు తున్నాయి. తెలుగు హరికథా సర్వస్వము, శతక వాఙ్మయ సర్వస్వము, ఆంధ్ర వ్యాకరణ సంహితా సర్వస్వం వంటి

గ్రంథాలు కూడా ఉన్నాయి. తెలుగు అకాడమీ వారు తెలుగు సాహిత్యాన్ని గ్రంథాలు, గ్రంథ కర్తల పేర్లతో కోశపద్ధతిలో, అకారాదిలో 'తెలుగు సాహిత్య కోశము' అనే పేరుతో రెండు సంపుటాలుగా వెలయించారు. ఈ ధోరణిలోనే ఛందస్సు, వ్యాకరణం, సాహిత్య పరిభాషా పదాలతో ఛందః పదకోశం, వ్యాకరణ పదకోశం, సాహిత్య పదకోశం వంటి పదకోశాలను నిర్మింపజేశారు. ఇవి నిఘంటువులకు విజ్ఞాన సర్వస్వాలకు నడుమ నిలిచేవి. మొత్తం మీద తెలుగులో ఇంతవరకు వెలువడిన విజ్ఞానసర్వస్వాలను, విజ్ఞాన సర్వస్వాలను పోలిన గ్రంథాలను కింద ఒక పట్టికగా ఇస్తే దిఙ్మాత్ర దర్శనం కలుగుతుంది.

1. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం
2. ఆంధ్ర విజ్ఞానం
3. విజ్ఞాన సర్వస్వాలు (తెలుగు భాషా సమితి - 14 సంపుటాలు)
4. విజ్ఞాన సర్వస్వాలు (తెలుగు విశ్వ విదాయలయం - 38 సంపుటాల ప్రణాళిక)
5. సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం
6. విశ్వ విజ్ఞాన దర్శనం
7. విజ్ఞాన దీపిక
8. పురాణ నామ చంద్రిక
9. వర్ణన రత్నాకరం
10. ఆర్ష విజ్ఞాన సర్వస్వం
11. ప్రపంచ రాజ్య సర్వస్వం
12. పూర్వ గాథాలహరి
13. శ్రీ కృష్ణ దేవ రాయాంధ్ర సాహిత్య విజ్ఞాన సర్వస్వం
14. ఆర్ష విజ్ఞాన సర్వస్వం
15. మహాభారతం - విశ్వ విజ్ఞాన కోశం
16. హంస వింశతి - విజ్ఞాన సర్వస్వం
17. ఆంధ్రవ్యాకరణ సంహితా సర్వస్వం
18. బాల ప్రౌఢ వ్యాకరణ సర్వస్వం
19. శతక వాఙ్మయ సర్వస్వం
20. సంగీతసంప్రదాయ ప్రదర్శిని
21. తెలుగు హరికథా సర్వస్వం
22. వేదాంత సర్వస్వం
23. వస్తుగుణ దీపిక
24. వస్తుగుణ ప్రకాశిక
25. వస్తుగుణ చంద్రిక
26. తెలుగు సాహిత్య కోశం (2 సంపుటాలు)
27. సాహిత్య పదకోశం
28. వ్యాకరణ పదకోశం
29. ఛందః పదకోశం
30. జిల్లా సర్వస్వాలు - మండల సర్వస్వాలు
31. ఆంధ్ర సర్వస్వం
32. ఆంధ్రదేశ చరిత్ర - భూగోళ సర్వస్వం
33. ఆంధ్ర ప్రదేశ్ దర్శిని
34. బాలల విజ్ఞాన సర్వస్వాలు
35. ఎమెస్కో వారి విజ్ఞాన సర్వస్వాలు (3 సంపుటాలు, గణితం)

ఇన్ని రకాల విజ్ఞాన సర్వస్వాలు వెలువడినా ఇతర దాక్షిణాత్య భాషలతోపోల్చి చూస్తే తెలుగు చాలా వెనుకబడి ఉందనే చెప్పాలి. చాలా విజ్ఞాన సర్వస్వాలు పునర్ముద్రణకు, పరిష్కరణకు నోచుకొక అలభ్యాలుగా ఉన్నాయి.ఉత్తమ విజ్ఞాన సర్వస్వం అంటే అందులో ఎప్పటికప్పుడు తాజా సమాచారం మంచినీటి ఊటలో చేరుతూ ఉండాలి తరుచూ పరిష్కృత మవుతూ ఉండాలి. ప్రామాణికమైనది, ప్రతిష్ఠాత్మకమైనదిగా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా స్వతంత్ర ప్రతిపత్తితో ఒక సంస్థ ఒక యంత్రాంగం తగిన ఆర్థికవనరులతో ఏర్పడి ఉండాలి. ఏమైనా తెలుగులో ప్రామాణికమైన బాలల విజ్ఞాన సర్వస్వం, బ్రిటానికా పద్ధతిలో అకారాదిక్రమంలో కూర్చిన సమగ్రమైన సాధారణ విజ్ఞాన సర్వస్వం (General Encyclopaedia) లేదనే చెప్పాలి. ఈ లోపాన్ని ఆంధ్రులు ఎప్పుడు తీర్చుకొంటారో తెలియదు.

రూపకం - లక్షణ

డా. కె. కె. రంగనాథాచార్యులు

యూరప్, అమెరికాలనుంచి మనకు పరిచయం అవుతున్న సమకాలీన సాహిత్య సిద్ధాంతాలకు భాష కేంద్ర బిందువుగా కనిపిస్తుంది. సాహిత్యం భాషా కళ కావడంవల్ల ఇది సహజం. ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంనుంచి వచ్చిన, వస్తున్న సాహిత్య సిద్ధాంతాలు, రూపవాదం, నిర్మాణవాదం, ఉత్తర నిర్మాణవాదం, వినిర్మాణవాదం, పాఠకాశ్రిత విమర్శ, రూపక ప్రధాన విమర్శ, అంతర్వాచకత ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాషా వినియోగ పరిశీలనకు సంబంధించినవే. వీటిలో రూపవాదం రష్యానుంచి ప్రచలితమైంది. రూపవాద, నిర్మాణవాద సిద్ధాంతాలకు ప్రతినిధి, ప్రాగ్ భాషా శాస్త్రజ్ఞుడు అయిన రోమన్ యాకొబ్ సన్ సాహిత్య శాస్త్రం భాషా ప్రయోగ సమస్యల్ని చర్చిస్తుందని, భాషా శాస్త్రం భాషా నిర్మాణానికి సంబంధించిన ప్రపంచవ్యాప్త శాస్త్రం కాబట్టి సాహిత్య శాస్త్రం కూడా భాషా శాస్త్రంలో భాగం అవుతుందని అంటాడు. సాహిత్య విమర్శకు అనివార్యమైన సహాయక శాస్త్రమనీ అంటాడు. సర్వవిజ్ఞాన శాస్త్రాలూ గణిత శాస్త్రాన్ని తప్పించు కోలేనట్లుగానే, సాహిత్య విమర్శ భాషా శాస్త్ర సహాయం లేకుండా నిలువ లేదని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. సాహిత్య విమర్శ ఒక దశలో పూర్తిగా సాంకేతికం కావడం, నిస్సారమై సామాజిక కోణాన్ని విస్మరించడం భాషా కేంద్రిత సాహిత్య సిద్ధాంతాలకు సంబంధించిన వారిలోనే కొందరి విమర్శకు గురి అయింది. సాహిత్యంలో భాషా వినియోగానికి ఉండే ప్రాధాన్యాన్ని గుర్తిస్తూనే సామాజి కతను జోడించి సాహిత్య విమర్శను విస్తృతం చేసిన వాళ్ళూ ఉన్నారు.

సమకాలంలో వస్తున్న సాహిత్య సిద్ధాంతాలను పరిశీలిస్తే భారతీయ సాహిత్య సిద్ధాంతాలతో మౌలికమైన పోలికలు కనిపిస్తాయి. పోలికలేకాదు, సుమారు రెండువేల సంవత్సరాల చరిత్ర గల సాహిత్య లక్షణ శాస్త్రాలలో పరిణామక్రమంలో వచ్చిన సిద్ధాంతాలు యథాతథంగా దిగుమతి అయ్యాయేమో అనిపిస్తుంది. వ్యాకరణ, సాహిత్యాలకు నిర్దిష్టమైన స్పష్టమైన సంప్రదాయం భారత దేశానికి ఉంది. ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభంలో రూపం తీసుకున్న వర్ణనాత్మక భాషాశాస్త్ర సిద్ధాంతాలకు ప్రాచీన వ్యాకరణశాస్త్రంలో నమూనాలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆధునిక భాషా శాస్త్రజ్ఞులు గుర్తించారు. ఇదే అంశం సాహిత్య సిద్ధాంతాలకు కూడా వర్తిస్తుంది. సాహిత్య నిర్మాణంలోని మౌలికాంశాలకు భారతీయ లక్షణ శాస్త్రంలో నమూనాలు ఉన్నాయి. స్థల, కాలాదుల కారణంగా సంస్కృత, ప్రాకృత సాహిత్యాలు ప్రాతినిధ్యం వహించే సమాజానికి ఆధునిక సమాజానికి తప్పని సరిగా తేడా ఉంటుంది. ఈ కారణంగా వస్తుగతంగా సాహిత్యంలో భేదాలు కనిపించవచ్చు. భాషలూ వేరు కావచ్చు. సాహిత్య సృజన ప్రక్రియ మౌలికాంశాలలో సామ్యాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇతర సామాజిక దృగ్విషయాలు. జీవితం మారినంత వేగంగా భాషా మౌలిక వ్యవస్థ మారకపోవచ్చు. ప్రత్యేక సాంస్కృతిక వాతావరణంలో వచ్చిన సాహిత్యం, సాంస్కృతికాంశాలు, ప్రాచీన సాహిత్య లక్షణ శాస్త్రంలోని లక్షణాలకు లక్ష్యాలు. నిశ్చలం, సరళం, పరిమితులు, అంచెల నిర్మాణం గల సమాజం ఆనాటిది. విస్తృతి, వైవిధ్యం, సంక్లిష్టత, దాన్ననుసరించిన కొత్త భావనలు, భావజాలం, ఆధునిక సమాజం లక్షణాలు. సాహిత్యమూ దీనికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రయోగంలో, అన్వయంలో, అభివ్యక్తీకరణలో కూడా ప్రాచీన సాహిత్యంతో పోల్చినప్పుడు విస్తృతి, వైవిధ్యం, గాఢత, సంక్లిష్టత కనిపిస్తుంది. ప్రాచీన కవి సమయాలను దాటి ఎప్పటి కప్పుడు కొత్త ఉపమానాలను కవులు స్వీకరిస్తున్నారు. పారిశ్రామికయుగం నుంచి ఎలక్ట్రానిక్ యుగంవరకు తనచుట్టూఉన్న వస్తు ప్రపంచం నుంచి ఉపమానాలను, జీవితానుభవంనుండి వస్తువును కవి/ రచయిత గ్రహిస్తున్నాడు. ఉత్పత్తి విధానంతోపాటు

ఉపరితలాంశాలలో వస్తున్న మార్పులకనుగుణంగా వస్తువు మారుతూ వస్తుంది. అలాగే పద స్వరూపాలూ, అర్థాలూ మారవచ్చు. కొత్త భావనలకు అనుగుణంగా కొత్త పరిభాషలు,పద బంధాలు ఏర్పడవచ్చు. దానితో పాటు అంతవేగంగాను భాషా వ్యవస్థ మౌలికాంశాలు మారకపోవచ్చు. దాన్ని అనుసరించి ఉండేవే సాహిత్య ఘటకాలలోని మౌలికాంశాలు కూడా.

ప్రాచీన సాహిత్య లక్షణకారులు తమ సాహిత్య సిద్ధాంతాలకు నమూనాలు భాషాసిద్ధాంతాలలో ఉన్నట్టు చెప్పారు. సాహిత్య శాస్త్రాలు భాషకు సంబంధించిన అంశాలను చర్చించాయి. సామాన్య వ్యవహారం కంటే సాహిత్య భాష ఎలా భిన్నమైందో వివరించాయి. సుమారుగా సాహిత్య శాస్త్ర గ్రంథాలన్నీ శబ్దార్థాలకు గల సంబంధాన్ని ఇతర శాస్త్రాలతో పోల్చి చర్చించాయి. వైయాకరణులు అన్ని స్థాయిలలోను అర్థాన్ని బోధించే శబ్ద శక్తిగా అభిధావృత్తిని మాత్రమే పేర్కొన్నారు. వైదిక సాహిత్యాన్ని వ్యాఖ్యానించే క్రమంలో మీమాంసకులు, లోకవ్యవహారాన్ని అనుసరించి నైయాయికులు అభిధేయార్థాన్ని కాక అన్యార్థాన్ని బోధించే లక్షణావృత్తిని ప్రవేశపెట్టారు. సాహిత్య వేత్తలు సాహిత్యంలో విశిష్ట భాషా వినియోగంలో భాగంగా అభిధా, లక్షణల ఆధారంగా మరో అర్థాన్నిచ్చే శక్తిగా వ్యంజనా వృత్తిని ప్రవేశపెట్టారు. ఆనందవర్ధనుడు ధ్వని సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ

'....సధ్వని రితి సూరిభిః కధితః' అన్న మాటల్ని ఇలా వివరిస్తాడు. ప్రథమే హి విద్వాంసోవైయాకరణాః, వ్యాకరణ మూలత్వాత్ సర్వవిద్యానాం. తేచశ్రూయ మాణేషు వర్ణేషు ధ్వనిరితివ్యవహరన్తి. తథైవాన్యైస్తన్మతాను సారిభిః కావ్యతత్త్వార్థదర్శిభిః వాచ్య వాచక సమ్మిశ్రః శబ్దాత్మా కావ్య మితి వ్యపదేశ్యో వ్యంజకత్వ సామ్యాద్ధ్వ నిరిత్యుక్తః'

అన్ని విద్యలకీ వ్యాకరణం మూలం. అందువల్ల విద్వాంసులలో వైయాకరణులు ముఖ్యులు. వైయాకరణులు వినిపించే వర్ణాలను 'ధ్వని' అని వ్యవహరిస్తారు. వైయా కరణులు అనే మాటను స్ఫోటవాదులను ఉద్దేశించింది. వర్ణాలకు అతిరిక్తమై, వర్ణాలతో అభివ్యక్తం అయ్యే అర్థాన్ని చెప్పే నిత్యమైన శబ్దమే స్ఫోట. 'వర్ణాతిరిక్త, వర్ణాభివ్యంగ్యః అర్థప్రత్యాయకోనిత్యశ్శబ్దః స్ఫోటః' అని స్ఫోట నిర్వచనం. శ్రూయమాణ వర్ణాలు అర్థాన్ని అభివ్యక్తం చేస్తాయి. మరో రూపంలో అర్థాన్ని చెప్పే శబ్దాన్ని కూడా. ఈ రూపంలో స్ఫోట వాచ్య, వాచకాలను రెండింటిని ఉద్దేశిస్తుంది. వ్యంజకత్వం అనే భావం ఆధారంగా కావ్యంలో ధ్వని సిద్ధాంతాన్ని ప్రతిపాదించా నని చెప్పాడు ఆనందవర్ధనుడు. స్ఫోటకు చెప్పిన వివరణ నమూనాలోనే ధ్వని వివరించాడు. ధ్వనిస్తుంది కాబట్టి ధ్వని; వాచ్యం, వాచక శబ్దం రెండింటినీ ధ్వనిస్తుంది అని అర్థం ధ్వనింపజేయ బడుతుంది కాబట్టి వ్యంగ్యం కూడా ధ్వని అవుతుంది. భాషా సిద్ధాంతమైన 'స్ఫోట'కి సాహిత్య సిద్ధాంతమైన ధ్వనికి వ్యంజకత్వంలో సామ్యం ఉంది.

ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలో వర్ణనాత్మక (descriptive) భాషాధ్యయనానికి దారులు వేసినవాడు స్విస్ భాషా శాస్త్రవేత్త ఫర్దినాద ససూర్. ఆధునిక సాహిత్య సిద్ధాంతాలపైన ససూర్ ప్రభావం చాలా ఉంది. భాషా విషయకంగా ససూర్ ప్రవేశపెట్టిన ముఖ్య అంశం Language and Parole అనే ద్వివిధ విభజన. దీన్ని భాషః భాషణం అనవచ్చు. భాష అంటే భాషకు సంబంధించిన మౌలిక వ్యవస్థ. భాషలోని మూలకాలు పదం, వాక్యం, వ్యాకరణం, నిర్మాణసూత్రాలు మొదలైనవన్నీ ఇందులో ఇమిడి ఉన్నాయి. భాషణం వాస్తవ భాషా వ్యవహారం. భాషా వ్యవహారాన్ని సాధ్యం చేసేది భాషా వ్యవస్థ. భాష అమూర్తం. భాషణ మూర్తం. సంస్కృత సంప్రదాయంలోని స్ఫోటః ధ్వనికి స్థూలంగా దీనితో పోలిక ఉంది. స్ఫోటమైన అమూర్త (నిత్య)మైన నిర్మాణ వ్యవస్థ. ధ్వని దాని ఉచ్చారణ, వ్యవహారం. రష్యన్ రూపవాదం, నిర్మాణ వాదం, ససూర్ భాష : భాషణం నమూనాలో వచ్చిన సాహిత్య సిద్ధాంతాలు. సాహిత్య సృజనను సాధ్యం చేసే సాహిత్య వ్యవస్థ మౌలికాంశా లను సాహిత్య సిద్ధాంతాలు ప్రతిపాదించాయి.

ససూర్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు భారతీయ సంప్రదాయ సిద్ధాంతాలు అనేకాలతో కలుస్తాయి. ససూర్ భాష సంకేతాలు (sign) వ్యవస్థ అంటాడు. అర్థగ్రహణానికి సంకేతం మూలం. సంకేతంలో సంకేతకం (signifien సంకేతితం (signified) అనే రెండు కోణాలు

ఉన్నాయి. సంకేతకం శ్రవ్యంగాని, లేఖనరూపంలో దృశ్యంగాని అయిన శబ్ద ప్రతిరూపం (word image). సంకేతితం మానసిక భావన (mental concept) సంకేతకం, సంకేతితం రెండూ కలిసినదే సంకేతం. విశ్లేషణ స్థాయిలో మాత్రమే సంకేతక, సంకేతితలను వేరుగా చూడడం జరుగుతుంది. వివేచన స్థాయిలో ఆ రెండూ ఒకే నాణానికి రెండు పార్శ్వాలు. 'వాచ్య వాచక సమ్మిశ్రః శబ్దాత్మాత' అన్న ధ్వనికారుడి వాక్యం ఈ విషయాన్నే చెప్తుంది. 'ఏకో. నవయువశ్శబ్దః','ఏక న్యైవా..త్మనో భేదే శబ్దార్థావపృధక్ స్థితే" అని వాక్య పదీయం చెప్తుంది. కాళిదాసు కూడా 'శబ్దార్థా వివ సంపృక్తౌ.....' అంటాడు. సంకేతక, సంకేతితల మధ్య సంబంధం యాదృచ్ఛికం అని ససూర్ ప్రతిపాదన. ఈ రెండింటి మధ్య విడదీయరాని సంబంధం ఏమీలేదు. శబ్దార్థాల మధ్య సంబంధం లోక వ్యవహారం (convention) మీద ఆధారపడి ఉంటుంది. భారతీయ సంప్రదాయంలో కూడా ఈ అభిప్రాయాలే కనిపిస్తాయి. ఒక దశలో శబ్దార్థాల సంబంధం ఔత్పత్తికమని, సహజమని, 'అస్మాత్పదాదయమర్థో బోద్ధవ్య ఇతి ఈశ్వర సంకేత శ్శక్తిః' అని ఈశ్వర సంకేతమే శక్తి అనే ఆలోచన లుండేవి. నవ్య నైయాయికులు ఈ విషయాలను అంగీకరించలేదు. ఈశ్వరేచ్ఛా నశక్తిః కింత ఇచ్ఛైవ అని స్పష్టం చేశారు. ఈశ్వరేచ్ఛ సంకేతం అయితే భిన్న భాషలలో భిన్న సంకేతాలు ఎలా ఉంటాయనేది ప్రశ్న. సిద్ధే శబ్దార్థ సంబంధే లోకతః.....అన్న వైయాకరణుల మాటలు శబ్దార్థాల మధ్య సంబంధం లోక వ్యవహారమీద ఆధారపడి ఉందని చెప్తాయి.

సాహిత్యపాఠా (text)ల ప్రభావాన్ని అధ్యయనం చేయడం సాహిత్యాధ్యయనానికి గల శాస్త్రీయ భూమికను నిరూపించడం రూపవాద (formalism) నిర్మాణ వాదా (Structuralism)ల లక్ష్యం. రూపవాదం భాషా సాధారణ వ్యవహారం కంటే సాహిత్య భాష ఎలా భిన్నమో చెప్తుంది. మౌఖిక భాషకు, ఇతర భాషా వ్యవహారాలకు అంతర్గతమైన భాషా వ్యవస్థే సాహిత్య నిర్మాణానికి కూడా మూలం. కవి మొదట స్వీయ భాషా వ్యవహర్త. పాఠకుడు కూడా తన భాషా వ్యవస్థను జీర్ణించుకున్నవాడే. సాధారణ భాషా వ్యాకరణం పరిధిలోనే ప్రత్యేకమైన వ్యూహాలను, యుక్తులను అనుసరిస్తాడు కవి. సాహిత్యేతర రచనలనుండి సాహిత్య భాషను వేరుగా చూచే విధానం, ఒక రచన సాహిత్యం కావడానికి కారణాలను వివరించ డం, ఏ పద్ధతుల వల్ల నిత్యవ్యవహారంతో పోల్చినప్పుడు సాహిత్య భాష భిన్నమైనదో, విశిష్టమైనదో చెప్పడం రూపవాదం చేసే పని. పాఠాన్ని కేంద్రీకరించు కొని భాషా ప్రయోగ శిల్పాన్ని విశ్లేషించడం రూపవాద విమర్శ చేస్తుంది. రూపవాదుల దృష్టిలో సాహిత్య విమర్శ లక్ష్యం సాహిత్యం కాదు. అందులోని సాహిత్యత (literary-ness). ఒక రచన సాహిత్యం ఎందుకు అయిందో చెప్పడం. రచనను సూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలించడం ధ్వని, పద, వాక్య స్థాయిలలోఉండే శిల్పాన్ని బట్టి రచన ప్రమాణాలను నిరూపించడం, వాటికి సంబంధించిన నమూనాలను గుర్తించడం, రూపవాదలిఖిత భాషతో పోల్చినపుడు సాహిత్యభాషకి, సాహిత్య భాషతో పోల్చినప్పుడు కవిత్వ భాషకి ప్రత్యేకత, విశిష్టత, సంక్లిష్టత ఉంటాయనే ప్రాథమికమైన అవగాహనతో రూపవాదం పనిచేస్తుంది. సాహిత్య సాహిత్యేతర రచనలలోని భేదాన్ని స్పష్టం చేస్తుంది. ప్రాచీన భారతీయ లాక్షణికులు కూడ సాహిత్య, సాహిత్యేతర భాషాభేదాన్ని గురించి చర్చించారు. 'నచ కావ్యేశాస్త్రాది వదర్థప్రతీత్యర్థం శబ్ద మాత్రం ప్రయుజ్యతే' అంటాడు వ్యక్తి వివేక టీకాకారుడు. శాస్త్రాదులలోలాగా కావ్యంలో కేవలం అర్థ ప్రతీతి కోసమే శబ్దాలను ప్రయోగించడం జరగదు అని దీని అర్థం. శోభాతిశయంలేని వస్తు మాత్రమే కావ్య వ్యప దేశానికి అర్హం కాదు. 'వస్తు మాత్రంచ శోభాతియ శూన్యం న కావ్య వ్యపదేశమర్హతి' అంటాడు వ్యక్తి వివేకకారుడు. ఇరవయ్యవ శతాబ్దపు తొలిదశలో వచ్చిన నవ్య విమర్శ (New criticism) కూడా పఠకేంద్రీకృత విమర్శే. ఆ విమర్శలో తాత్కాలికత, వైయక్తికతల వల్ల శాస్త్రీయత లోపించిందనే అభిప్రాయం ఉంది. భాషాశాస్త్ర భూమిక రూపవాదానికి శాస్త్రీయతను సంతరించిందని రూపవాదు లంటారు. సాహిత్యంలో భాషా ప్రయోగ శిల్పాన్ని అధ్యయనం చేయడం మాత్రమే కాక చాలా దూరం వెళ్ళిపోయారు రూపవాదులు. సామాజికాంశాలు,

భావజాలం, వాస్తవికత, ఉద్వేగాలు సాహిత్యంలో సాహిత్యతను నిర్ణయించడంలో ఏ మాత్రం ప్రాధాన్యం వహించవని స్పష్టంగా చెప్పారు రూపవాదులు. కవులు, రచయితలు కూడ లేరు. పాఠం ప్రధానం. పాఠంలో అనుసరించిన శైలీపరక వ్యూహాలు ముఖ్యం. వ్యూహాలు వాటికదే సాహిత్యం. పూర్వ సోవియట్ రష్యాలో పందొమ్మిది వందల ముప్పైలలో రూపవాదం, రూప వాదులు అనే మాటని నిందార్థకంగా ఉపయోగించే వారు. రూపవాద విమర్శ రచన వచ్చిన సందర్భంనుండి దూరం చేసి పరిశీలిస్తుందనేది ప్రధానమైన విమర్శ. అనంతర రూపవాదులలో భాషా ప్రయోగపరిశీలనను నిరాకరించ కుండానే సామాజిక సందర్భంలో సాహిత్యాన్ని పరిశీలించే పద్ధతులను అనుసరించినవారున్నారు. సాహిత్య సృజనలో భాషా వినియోగశిల్పం ఒక్కటే మార్గం కాదు. అనేకాంశాలలో అది కూడా ఒకటి. ప్రధానమైంది కూడా. రూపవాదంచెప్పిన సాహిత్య భాషా వినియోగ పద్ధతులలో సాహిత్య పరిశీలనలో సామాజికాద్యంశాల భూమికపైన అన్వయించుకోవడానికి వీలుంది.

భాషని, సాహిత్యాన్ని నిర్మాణాలుగా అధ్యయనం చేయడం నిర్మాణవాదం. భాషాశాస్త్రం లక్ష్యం కేవల భాషావ్యవహారం కాక ఆ వ్యవహారాన్ని సాధ్యం చేసిన భాషాంతర్గత వ్యవస్థ, నిర్మాణ సూత్రాలను, సంకేతాలను పరిపాటులను గుర్తించి క్రోడీకరించడం. నిర్మాణ వాద సాహిత్య విమర్శ ప్రత్యేక రచన పైననే కాక రచనలకు ఆధారమైన సాహిత్య నిర్మాణ విధానాలపైన, సూత్రాలపైన దృష్టిని కేంద్రీకరిస్తుంది. నిర్మాణవాదం రచనని ఐక్య నిర్మాణంగా చూస్తుంది. నిర్మాణం కొన్ని మూలకాల కలయిక. కొన్ని సూత్రాలు, సంకేతాలు వాటిని నియంత్రిస్తాయి. రచనలోని మూలకాల (elements) కు ఇతర మూలకాలతో ఉండే సంబంధాన్ని నిర్మాణవాదం పరిశీలిస్తుంది. మూలకాల పరస్పర సంబంధం వల్లనే ప్రతి మూలకానికి అర్థం ఉంటుందని, సార్థకం చేస్తుందని చెప్తుంది. సాహిత్య కృతి దానికది సర్వసమగ్రం. ప్రతి సాహిత్య నిర్మాణాన్ని సూక్ష్మంగా పరిశీలించడం ద్వారా సాధారణ సాహిత్య నిర్మాణ సూత్రాల్ని గుర్తించడం, వాటిని సామాన్యీకరించడం నిర్మాణవాద విమర్శలోని ముఖ్యాంశం. నిర్మాణ సూత్రాలు స్థిరాలు, నిర్జీవాలు కావు. అవి గతిశీలాలు. రచనా నిర్మాణంలోని మూలకాలన్నీ ఒక కేంద్రం చుట్టూ తిరుగుతాయి. రచన నిర్మాణ పరిశీలనలో ఆ కేంద్రాన్ని గుర్తించడం కూడా ముఖ్యమైన అంశం. సాహిత్యకృతిని ఒక వ్యవస్థగా, నిర్మాణంగా పరిశీలించి నమూనాలను పద్ధతులను వింగడించి మూలకాల పరస్పర సంబంధాన్ని గుర్తించి దాని ద్వారా కేంద్రీ భూతమయిన అర్థాన్ని వెలికి తీయడం నిర్మాణవాదం. ప్రత్యేక కృతి పరిశీలన కృతిలోని మూలకాల పరస్పర సంబంధం, సామాన్య సూత్రాలు, ఒక కృతికి ఇతర కృతులతో గల సంబంధం ఇవి స్థూలంగా నిర్మాణ వాదంలోని అధ్యయనాంశాలు.

రష్యన్ రూపవాదం ప్రవేశపెట్టిన ముఖ్యమైన భావన అపరిచయీకరణం (Defamiliarization). తెలిసిన దాన్నే కొత్తగాను, నవనవోన్మేషంగాను, అపరిచితంగాను, భిన్నంగాను చేయడం. అపూర్వత, ఆకస్మికత దీని గుణాలు. కృతి నిర్మాణం పైన పాఠకుడి దృష్టిని మళ్లించే మార్గాలలో అపరిచయీకరణం ముఖ్యమైంది. రచనా సంవిధానంమీద దృష్టి మళ్ళించడం ద్వారా పరిచితమైన విషయాన్ని అపరిచిత విషయంగా ముందుకు తీసుకు రావడమే సాహిత్యంలో ముఖ్యమైన శిల్పం. అనూహ్యమైన అసంఖ్యాకమైన భాషాప్రయోగం ద్వారా ఇది సాధ్యం. అపూర్వ వస్తునిర్మాణం, లోకోత్తర చమత్కార కారిత్వం లోకోత్తీర్ణత అపరిచయీకరణ లక్షణాలే. అవే పదాలు, అవే అర్థాలు, పదార్థాలు, గ్రథన కౌశలంవల్ల నవ్యమై కావ్యమవుతుంది అన్న ఆలంకారికుల మాట స్థూలంగా ఈ భావనలతో సంవదిస్తుంది.

తఏవ పదవిన్యాసాస్తా ఏవార్థవిభూతయః
తథా..పికావ్యంభవతి నవ్యం గ్రథన కౌశలాత్

గ్రథనకౌశలం అంటే శైలీవిన్యాసం. ఈ విషయాలు ప్రధానంగా కవిత్వానికి అన్వయిస్తాయి. రూపవాదం నుంచి వచ్చిన శైలీ శాస్త్రంలో ప్రముఖంగా కవిత్వాన్ని దృష్టిలో పెట్టుకున్న అంశాలే కనిపిస్తాయి. వచన కల్పనా సాహిత్యంలో కూడా అపరిచయీకరణం ఉంటుంది. అది కథా కథన పద్ధతుల ద్వారా జరుగు తుంది.

పురస్కరణం (foregrounding) రూపవాదులు ప్రవేశపెట్టిన మరో ముఖ్యమైన భావన. ప్రత్యేకమైన యుక్తులద్వారా, శిల్పంద్వారా అభివ్యక్తిని ముందుకు తోయడం పురస్కరణం. ఈ ప్రక్రియలో సాహిత్యభాష పాఠకుడి దృష్టిని తన వైపుకు లాక్కుంటుంది. ప్రతిగా తాను ప్రాతినిధ్యం వహించే వాస్తవికత వైపు దృష్టి మళ్ళిస్తుంది. పురస్కరణం అపసరణం (deviation) ద్వారా జరుగుతుంది. దీనినే లాక్షణిక పరిభాషలో వక్రత అనవచ్చు. సాధారణ భాషా వ్యవహారానికి భిన్నమైన విలక్షణమైన భాషని ఉపయోగించడం వక్రత. వక్రత పాఠకుడి మనస్సుని ప్రభావితం చేస్తుంది. వక్రతవల్ల కలిగే మానసిక ప్రభావమే పురస్కరణం. పురస్కరణం భాష, వస్తువు, భావం, దృష్టికోణం, దృక్పథం మొదలైన ఏ విషయంలో నైనా జరుగవచ్చు. శైలీ శాస్త్రజ్ఞులు ధ్వని, పద, పదాంశాలు, వాక్యం స్థాయిలలోను, పదజాలం, పదగుంఫన, అలంకారాలలోను పురస్కరణం జరిగే విధానాలను అనంతానంతంగా వివరించి చూపించారు.

సాహిత్య లక్షణ శాస్త్రంలో 'వక్రోక్తి' కి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. వక్రోక్తిని సాహిత్య నిర్మాణానికి సంబంధించిన మౌలికాంశంగా చాలామంది ఆలంకారికులు భావించారు. సాహిత్యశాస్త్రంలో కాక సృజనాత్మక మైన సాహిత్యంలో కూడా వక్రోక్తి అనే మాట కనిపిస్తుంది. భిన్నంగా చెప్పడం, విలక్షణంగా చెప్పడం అనే సామాన్యార్థంలో వక్రోక్తి పదాన్ని వాడారు కవులు. భామహుడు వక్రోక్తిని కావ్యభాష ప్రధానలక్షణంగా చాలా సందర్భాలలో చెప్తాడు. శబ్దంలోను, అర్థంలోను వక్రతసాధ్యం అంటాడు. అన్ని అలంకారాల్లోను వక్రత ఉందని, అది అర్థ సౌందర్యాన్ని పెంచుతుందని, కవు లందరూ వక్రోక్తిని సాధించడానికి ప్రయత్నం చేయాలని తన అభిప్రాయం ప్రకటించాడు భామహుడు.

సైషా సర్వైవ వక్రోక్తి రనయార్థో విభావ్యతే,
యత్నో స్యాం కవినా కార్యఃకోలంకారో నయావినా॥

భామహుడు వక్రోక్తిని ప్రత్యేక అలంకారంగా చెప్పలేదు. అన్ని శబ్ద , అర్థాలంకాలకి అది మూలం అని చెప్తాడు. వక్రోక్తి మూలకం కాక పోవడం వల్ల హేతువు, సూక్ష్మం వంటి అలంకారాలను అంగీకరించలేదు. తొలి తరపు ఆలంకారికులలో వామనుడు మాత్రమే వక్రోక్తిని ప్రత్యేక అలంకారంగా పేర్కొన్నాడు. దండి 'భిన్నం ద్విధా స్వభావోక్తిర్వక్రోక్తిశ్చేతి వాఙ్మయమ్' అని సాహిత్యాన్ని స్వభావోక్తి , వక్రోక్తి అని రెండు రకాలుగా విభజించాడు. ఈ విభజనవల్ల వక్రోక్తిని ప్రత్యేక అలంకారంగాకాక స్వభావోక్తీతర అలంకారాలన్నిటికీ ప్రాణభూతమైన లక్షణంగా భావించినట్లు కనిపిస్తుంది. వక్రోక్తినే కావ్య జీవితంగా ప్రతిపాదించిన కుంతకుడు వక్రోక్తిని వర్ణ, పద పూర్వార్థ, ప్రత్యయ, వాక్య, ప్రకరణ, ప్రబంధ గతాలుగా ఆరు రకాలుగా విభజించాడు. వాక్యవక్రతలో అలంకారాలు చేరుతాయి. సాహిత్య లక్షణ శాస్త్రంలోని వక్రోక్తి రూపవాదుల వక్రత, పురస్కరణం వంటి అంశాలతో సరిపోలుతుంది.

భాషా వ్యవస్థలోని లక్షణాలను తనకు అనుకూలంగా కవితా భాష ఎట్లా ఉపయోగించుకుంటుందో వివరిస్తూ యాకొబ్ సన్ కొన్ని ప్రతిపాదనలు చేశాడు. భాషా ప్రయోజనాలు ఏ విధమైన వాగ్వ్యవహారంలో నైనా ఉండే ఆరు అంశాల పైన ఆధారపడి ఉంటాయి. వక్త, శ్రోత, వక్తశ్రోతకు అందించే సందేశం, సందేశానికి అవసరమైన సందర్భంలేక ఉద్దిష్టం. వక్తశ్రోతల మధ్య భావప్రసారాన్ని సాధ్యంచేసే సంకేతం, ఇద్దరి మధ్య సంబంధం. సంకేతం అంటే భాషలేక భాషా వ్యవస్థ. సంబంధం భౌతికంగాని, మానసికంగాని కావచ్చు. మౌఖిక వ్యవహారంలో సామీప్యమే సంబంధం. దూర వ్యవహారంలో లేఖనాదులు సంబంధానికి సాధనాలౌతాయి, వక్తలేఖకుడు శ్రోత పాఠకుడు అవుతాడు. సాధారణ వ్యవహారంలో సందర్భం ముఖ్యం అవుతుంది. సందేశాన్ని అందించడానికి సంకేతం సాధనమవుతుంది. కవితా భాషలో సంకేతం ప్రధానమవుతుంది. పాఠకుడి దృష్టిని సంకేతం వైపు మళ్ళించడం కవిత్వం చేసే పని. సంకేతం సందేశం అవిభాజ్యాలవుతాయి. కవిత్వ భాషా వ్యవహారంలో సందర్భానికి ప్రాముఖ్యం లేదు. కొందరు సాహిత్య సైద్ధాంతికులు సాధారణ భాషకి, కవిత్వ భాషకి ఉండే భేదం సందర్భ విముక్తి అన్నారు. సందర్భ శూన్యతే కవిత్వ భాషా లక్షణం అన్నంతవరకు వెళ్ళారు.

భాషా వ్యవస్థ వికల్ప క్రమాత్మక/పదావళీ (paradigmatic) సంబంధ, విన్యాసక్రమాత్మక/వాక్యాత్మక (syntagmatic) అనే రెండు సంబంధాలపైన ఆధారపడి ఉందన్న సూత్రం భూమికగా సాహిత్య నిర్మాణ సూత్రాన్ని యాకోబ్‌సన్ ప్రతి పాదించాడు. ఈ రెండు సంబంధాలు చయనం (selection) సంయో జనం (arrangement) అనే రెండు ప్రక్రియలపైన ఆధారపడి ఉంటాయి. వాక్యంలో ఉద్దిష్ట విషయం, ఉద్దిష్ట విషయాన్ని గురించి చెప్పే ఆఖ్యాతం ఉంటాయి. మొదటిది ఉద్దేశ్యం. రెండవది విధేయం. ఉద్దేశ్యం వ్యక్తి, వస్తువు , భావం ఏదైనా కావచ్చు. ఉద్దిష్ట విషయాన్ని సూచించే సమాన పదాలలో ఒక దానిని ఉద్దేశ్యంగా ఎన్నుకోవడం జరుగుతుంది. ఆఖ్యాతం క్రియాబంధం, కొన్ని భాషలలో నామబంధం కూడా కావచ్చు. ఉద్దేశ్యంతో యోగ్యత కలిగిన అర్థం ఉండి, అదే అర్థం ఇచ్చే సమాన క్రియా పదాలలో ఒక దాన్ని ఆఖ్యాతంగా ఎన్నుకోవడం జరుగుతుంది. చయనం సమానత (equivalence), సాదృశ్యం(similarity), విషమత (disimilarity), పర్యాయత (synonymity) , విపర్యాయత (antonymity), ఆధారంగా జరుగుతుంది. వీటి సంయోజనం ఆసత్తి (contiguilty) ఆధారంగా వరుస క్రమంలో జరుగుతుంది. చయనంలో ఉండే సమానత సంయో జనంలో కూడా ఉంటే కవిత్వభాష అవుతుంది. సామాన్య భాషకి, కవిత్వ భాషకి ఉన్న ప్రధాన భేదాలలో ఇది ఒకటి.

యాకొబ్ సన్ చేసిన మరో ముఖ్యమైన ప్రతిపాదన సాహిత్య భాషను కవిత్వ భాషగా, వచన సాహిత్య ప్రక్రియల భాషగా విభజించడం. కవిత్వ భాషలో మెటఫర్ (metaphor) ముఖ్యం, వచన భాషలో మెటానిమీ (metonymy) ప్రధానం. ఒక వస్తువు లక్షణాలను గుణాలను మరో వస్తువు మీద ఆరోపించడం మెటఫర్. వాక్యంలో రెండవ వస్తువు మొదటి వస్తువులానే ప్రవర్తిస్తుంది. ఒక వస్తువును సూచించే పదాన్ని ఆ వస్తువుకు ఏదో ఒక రూపంలో సంబంధం ఉన్న వస్తువును సూచించే పదం స్థానంలో వాడడం మెటానిమీ. వాక్యంలో మొదటి వస్తువు రెండవ వస్తువులాగే ప్రవర్తిస్తుంది. అమెరికా అధ్యక్షుణ్ణి సూచించడానికి అధ్యక్షనివాసమైన వైట్ హౌజ్ అనే పదాన్ని వాడడం మెటానిమీ. మెటఫర్ చయనానికి సంబంధించింది. మెటానిమీ సంయోజనం వల్ల ఏర్పడు తుంది. మెటఫర్ సాదృశ్య మూలకం. మెటానిమీ సామీప్యాది (సామీప్యం, కార్యకారణ భావం, విశేషణ విశేష్యభావం, సాహచర్యం మొ॥) సంబంధ మూలకం. కాల్పనికత, ప్రతీకవాదం ప్రధానమైన కవిత్వానికి మెటఫర్, వాస్తవికత ప్రధానమైన వచన సాహిత్యానికి మెటానిమీ లక్షణాలు. ఈ రెండూకాక సినెక్ డొకె (Synecdoche) అనే మరో అభివ్యక్తీకరణ పద్ధతిని కూడా యాకొబ్ సన్ పేర్కొన్నాడు. అవయవిని సూచించడానికి దాని అవయవాన్ని సూచించే పదాన్ని లేదా ఒక వస్తువును సూచించడానికి ఆ వస్తువులో ఒక భాగాన్ని సూచించే పదాన్ని వాడడం సినెక్‌డొకె 'పడవనది దాటింది' అన్న సామాన్యభావాన్ని మూడు పద్ధతులలోను వరుసగా ఇలా అభివ్యక్తం చేయవచ్చు. 'పడవ నదిని దున్నింది', 'లోతు నదిని దాటింది', తెరచాపనదిని దాటింది' మొదటి వాక్యంలో దున్నింది దాటిందికి సదృశ్యార్థంలో, రెండవ వాక్యంలో పడవను సూచించడానికి దాని విశేషణమైన లోతు అనే పదాన్ని, మూడవ వాక్యంలో పడవలో భాగమైన తెరచాపను పడవని సూచించడానికి వాడడం జరిగింది.

భారతీయ సాహిత్య లక్షణ సంప్రదాయంలో శబ్దానికి, అర్థానికి ఉంటే సంబంధాన్ని చెప్పే శబ్ద శక్తులు మూడు. అవి అభిధా, లక్షణ, వ్యంజనలు. సాక్షాత్ సాంకేతితమైన శక్తిగా అభిధావృత్తిని అన్ని శాస్త్రాలు అంగీకరించాయి. వాచ్యార్థాన్ని కాక దానికి సంబంధించిన మరో అర్థాన్ని చెప్పే శక్తిగా లక్షణను మీమాంసకులు, నైయ్యాయికులు అంగీకరించారు. వ్యంజనావృత్తి సాహిత్య పరంగా ముఖ్యమైన శక్తి. వాచ్య, లక్ష్యార్థాలను అప్రధానం చేసి మరో అందమైన అర్థమిచ్చేది వ్యంజనాశక్తి లేక ధ్వని. కావ్య సౌందర్య కారకాలలో ముఖ్యమైంది. లక్షణను కావ్య సౌందర్య కారకంగా సాహిత్య శాస్త్రాలు చెప్పినట్లు కనిపించదు. లక్షణా వృత్తికి మూడు షరతులుండాలని లాక్షణికులు చెప్పారు.

ముఖ్యార్థ బాధే తద్యోగే రూఢితో..థ ప్రయోజనాత్,
అన్యో ర్థోలక్ష్యతే యత్సాలక్షణారోపిత క్రియా॥

1. ముఖ్యార్థ బాధ లేక అనుపత్తి, 2. ముఖ్యార్థంతో సంబంధం (సాదృశ్యం కాని, సామీప్యాదులు కాని) 3. రూఢిగాని, ప్రయోజనంగాని, అన్యార్థానికి కారణం అయి వుండడంవల్ల ఇవి లక్షణకు షరతులు. వాచ్యార్థం పొసగనప్పుడు మాత్రమే లక్షణా ప్రసక్తి వస్తుంది. లాక్షణికులు లక్షణను సాదృశ్యమూలక లక్షణ అని, సామీప్యాది సంబంధ నిబంధన లక్షణ అని రెండు రకాలుగా పేర్కొన్నారు. సాదృశ్య మూలక లక్షణ ప్రధానంగా రెండు రకాలు. ఉపమేయాన్ని ఉపమానాన్ని రెండింటిని పేర్కొని అభేదం చెప్తే సారోప లక్షణ. ఉదా. సింహోదేవదత్తః ఉపమేయాన్ని కప్పిపుచ్చి అభేదం ప్రతిపాదిస్తే సాధ్యవసాయ లక్షణ . ఉదా: సింహఃఅయం. సామీప్యాది సంబంధ నిబంధనలక్షణలో సామీప్యం, స్థానం, కార్యకారణ భావం, సాహచర్యం, విశేషణ విశేష్యభావం, ఆధారాధేయ సంబంధం, ధారణ, మానం, పరిణామం, సమవాయం, తాదర్థ్యం, స్వస్వామి భావం మొదలైన సంబంధాలెన్నిటినో లాక్షణికులుపేర్కొన్నారు. సామీప్యాది సబంధ లక్షణకు 'గంగాయాం ఘోషః' అన్నది ప్రసిద్ధమైన ఉదాహరణ: గంగలో పల్లె ఉండడం పొసగదు కాబట్టి సామీప్య సంబంధం వల్ల గంగాతటంలో అన్న అర్థం అపేక్షితం, గంగాశబ్దం గంగానది అనే అర్థాన్ని పూర్తిగా వదిలిపెట్టి గంగా తటం అనే అర్థాన్ని బోధిస్తున్నది. అందువల్ల జహత్స్వార్థ కుంతాఃప్రవిశన్తి అచేతనాలైన కుంతాలు గమనార్థక క్రియకు కర్తకాదు కనుక కుంత ధారులైన పురుషులు ప్రవేశించారని అర్థం చెప్పుకోవలసి ఉంటుంది. పురుషులతోపాటు కుంతాలూ ప్రవేశించాయి కనుక ఇది అజహత్స్వార్థ. ఇంతగా లక్షణను గురించి చెప్పడానికి కారణం మెటఫర్‌కి సాదృశ్య మూలక లక్షణకి, మెటానిమీకి సామీప్యాది సంబధ నిబంధన లక్షణకి గల సామ్యాన్ని స్పష్టం చేయడానికే. సినెక్ డొకేని కూడా సామీప్యాది సంబంధ లక్షణలో చేర్చ వచ్చు. ఫలితంగా సౌకర్యంకోసం మెటఫర్‌ని 'రూపకం' అని, మెటానిమీని 'లక్షణ' అని వ్యవహరించ వచ్చు.

ఆధునిక సాహిత్య సిద్ధాంతాలలో కవిత్వ భాషకు సంబంధించిన చర్చ చాలా జరిగింది. కవిత్వీకరణ వ్యూహంలో ప్రధానాంశంగా 'రూపక' చర్చ కూడా విస్తృతంగా జరిగింది. రూపవాదులు, నిర్మాణ వాదులలో కొందరు అనేక వక్రోక్తి విధానాలలో రూపకం ఒకటిగా భావిస్తారు. కొందరు అదే ప్రధాన వ్యూహమని చెప్తారు. రూపకీయతను ఆలంకారికతకు సమానంగా వాడడమూ ఉంది. ఆలంకారిత పాఠకుణ్ణి దిగ్భ్రాంతికి గురిచేసి వాస్తవానికి, జ్ఞానానికి, సత్యానికి దూరం చేస్తుందన్న వాళ్ళూ ఉన్నారు. వినిర్మాణవాదులు సాహిత్యభాష, సాహిత్యేతర భాష అనే ద్వైధీభావాన్ని నిరాకరిస్తారు. భాష పుట్టుకలోనే ఆలంకారికం, రూపకీయం అని వినిర్మాణ వాదులంటారు. రూపకాన్ని గురించిన చర్చ గ్రీక్ తత్త్వవేత్త అరిస్టాటిల్‌ని ఉటంకించడంతో మొదలవు తుంది. ట్రాజెడీకి సంబంధించిన ఆరు అంశాలలో భాషా శైలి, ఒకటిగా పేర్కొంటూ అందులో భాగంగా రూపక ప్రసక్తి తెస్తాడు అరిస్టాటిల్. ఒక వస్తువుకు సంబంధించిన లక్షణాలను మరొక వస్తువుకు మార్పిడి చేయడం రూపకమని సామాన్య లక్షణం చెప్పాడు. క్రీ.శ. ఒకటవ శతాబ్దికి చెందిన గ్రీక్ లాక్షణికుడు డెమెట్రియస్ శైలినిగురించి చెప్తూ రూపకానికి సంబంధించిన విస్తృత చర్చ చేశాడు. పోలికపై ఆధారపడిన అన్ని అలంకారాలలో రూపకానికే గ్రీక్ లాక్షణికులు ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తుంది. పాశ్చాత్య సాహిత్య సంప్రదాయంలో రూపక ప్రాధాన్యం కొనసాగింది. రూపకానికి విస్తరణే ఉపమ అంటాడు డెమిట్రియస్. సాదృశ్యం గురించి కూడా డెమిట్రియస్ విస్తృతంగా చర్చించాడు. అలంకారాలు వాడడంలో పరిమితులు ఉపమానాలు వాడడంలో ని మెళకువలను వివరించాడు. భారతీయ ఆలంకారికులలో చాలామంది ఉపమా లంకారానికే ప్రాధాన్యం ఇచ్చారు. ఉపమకు విస్తరణ రూపంగా తక్కిన అలంకారాలను పేర్కొన్నాడు. తొలిదశలో కొందరు రూపకానికి ప్రాధాన్యం ఇచ్చినవాళ్ళు న్నారు. భామహుడు 'రూపకాది రలంకార స్తత్రాన్యైర్బ హుధోదిత' అని రూపకంతోనే అర్థాలంకారాలను ప్రారంభిస్తాడు. ఉపమానాన్ని ఎలా ఎన్నుకోవాలో చర్చించిన వారిలో భామహుడు ముఖ్యుడు. అన్ని వస్తువులకు అన్ని వస్తువులతో సాదృశ్యం ఉండదని, ఉపపత్తిని బట్టి సారూప్యాన్ని గుర్తించి ఉపమానాలను ఎన్నిక చేసుకోవాలని అంటాడు. భావ తీవ్రతకు

అవసరమైన చోట్ల తప్ప అసంభావ్యమైన ఉపమానాలను వాడవద్దంటాడు. రూపకాన్ని భామహుడు ఇలా నిర్వచించాడు.

ఉపమానేన యత్త త్త్వ ముపమేయస్యరూప్యతే,
గుణానాం సమతాంద్రుష్ట్వా రూపకంనామ తద్విదు॥

తుల్యత్వంవల్ల కాక గుణసామ్యంవల్ల ఉపమేయానికి ఉపమానతత్త్వం ఆరోపించడం అన్న విషయాన్ని ప్రత్యేకంగా గమనించాలి. ఉపమలో రెండు విరుద్ధ వస్తువుల మధ్య గుణలేశ సామ్యం వల్ల పోలిక చెప్పడం ఉంటుంది. రూపకంలో పోలిక గుప్తంగా ఉంటుంది. ఉపమలో పోలిక వ్యక్తంగా ఉంటుంది. కాల్పనిక కవిత్వం మొదలుకొని ఆధునిక కవిత్వంలో రూపకానికి ప్రాధాన్యం ఉండడానికి కారణం కవిత్వంలో సాంద్రతకు అది ఉపకరించడమే కావచ్చు.

వామనుడు రూపంతో పాటు వక్రోక్తిని కూడా ప్రత్యేక అలంకారంగా చెప్పాడు. 'గుణ సామ్యం వల్ల ఉపమేయం పైన ఉపమానతత్త్వారోపం జరిగితే రూపకం' అని రూపకాన్ని నిర్వచించాడు. 'ఇయం గేహేలక్ష్మీః....' భవభూతి శ్లోకాన్ని ఉదహరించాడు. గౌణార్థం అలంకారం అయినట్టుగానే లాక్షణికం కూడా అలంకారం అవుతుందని అదివక్రోక్తి అని అంటాడు. సాదృశ్య మూలక లక్షణను వక్రోక్తిగా నిర్వచించాడు. 'సాదృశ్యా లక్షణా వక్రోక్తిః'. సమకాలంలో ఆలంకారికులు సర్వాలంకారాలకు, అభివ్యక్తులకు సామాన్య గుణంగా వక్రోక్తిని పేర్కొన్నారు. వామనుడు సాదృశ్యమూలక లక్షణకు వక్రోక్తి అని పేరు పెట్టడంద్వారా దానికి ఇచ్చిన ప్రాధాన్యం తెలుస్తుంది. వక్రోక్తికి వామనుడు ఇచ్చిన ఉదాహరణలు తత్త్వంలో ఆధునిక కవి ప్రయోగాలతో సరిపోలుతాయి. ఆమె శరీరాన్ని అలసత కౌగలించుకుంటోంది, 'ఆలస్యమాలింగతి గాత్రమస్యా' ఆవహించడానికి సమానంగా కౌగలించుకోవడం అనే క్రియను వాడడం జరిగింది. మరో ఉదాహరణ. 'మదయతిచ కేసరాణాం పరిణత మద గంధనిఃశ్వసితమ్' ముదిరిన తేనెవాసన గల పొగడపూల నిశ్వాసం మత్తెక్కిస్తోంది. ఇక్కడ 'నిఃశ్వసితమ్' పరిమళాన్ని వెదజల్లడం అనే అర్థంలో ఉంది. సాదృశ్య మూలకలక్షణను తప్ప సామీప్యాది సంబంధ నిబంధన లక్షణను అలంకారంగా వామనుడు అంగీకరించలేదు 'అసాదృశ్య నిబంధనాతు లక్షణా న వక్రోక్తిః' అని సూత్రవృత్తి. అపరిచయీకరణానికి, పురస్కరణానికి హేతువుగా సామీప్యాది సంబంధ నిబంధన లక్షణను గుర్తించలేదన్నమాట. ఆధునిక కవిత్వంలో సామీప్యాది సంబంధ నిబంధన లక్షణ కూడా వక్రోక్తి మార్గాలలో ఒకటిగా, కవిత్వీకరణ వ్యూహాలలో ప్రధానమైన అంశంగా పరిణామం చెందడం గమనించ వలసిన ముఖ్యమైన అంశం. నిశితంగా పరిశీలిస్తే సామీప్యాది సంబంధాలలో ప్రాచీనకావ్య సంప్రదాయంలో చెప్పినవికాక అనేకానేక సంబంధాలతో లక్షణా ప్రయోగాలు ఆధునిక కవిత్వంలో దొరకవచ్చు.

రూపకానికి సంబంధించిన చర్చలో మరో ప్రధానాంశం మృతరూపకాలు, సజీవ రూపకాలభేదం. మృత లేదా అరిగిపోయిన రూపకాలు నిత్యవ్యవహారంలో భాగమై వాచ్యార్థంతో సమానం అయిపోతాయి. సామాన్య వ్యవహారంలో కలిసిపోతాయి. నిఘంటువుల కెక్కుతాయి. నిత్యపరిచితాలై అవి అపరిచయీకరణకు ఉప యోగించవు. సజీవ రూపకాలు ప్రత్యేక ప్రయోజనంతో వక్రతను సాధిస్తాయి. కవిత్వీకరణ వ్యూహాలుగా పనిచేస్తాయి. లక్షణావృత్తి భేదాలలోని రూఢిభేదాలు అరిగిపోయిన రూపకాలు, లక్షణలే. పాల్ రికోఇర్ తన 'దిరూల్ ఆఫ్ మెటఫర్' అనే గ్రంథంలో రూపకం పరిణామాన్ని, రూపకం ప్రయోజనాలను చాలా విస్తృతంగా చర్చించాడు. పద, వాక్య, ప్రవచన/మహాకావ్య (discourse) స్థాయిలలో రూపకం పాత్రను, స్వభావాన్ని వివేచించాడు. సాహిత్య సిద్ధాంతాలలో సామాన్య భాషకు, కవిత్వ భాషకు భేదం చెప్తూ చెప్పిన అభిప్రాయాలను పరిశీలించాడు. సామాన్య భాషలో తార్కిక క్రమం ఉంటుందని, కవిత్వ భాషలో ఉండదని సామాన్య భాష సందర్భంలో ఒదిగి ఉంటుందని రూపకాద్యలంకృత కవిత్వ భాష సందర్భంనుంచి విముక్తం అవుతుందని సందర్భ రాహిత్యమే కవితా భాష అని సాహిత్య సైద్ధాంతికులు చెప్పిన అభిప్రాయా లకు తీవ్రంగా స్పందిస్తాడు రికోఇర్. రూపకీకరణలో సామాన్య సందర్భం పోయినా ఆ స్థానంలో మరో సందర్భం

ఉత్పన్నం అవుతుంది. ఒక సందర్భం పోతూనే మరో సందర్భం ఏర్పడుతుంది. ఒక స్థాయిలో అర్థానుపపత్తి మరో స్థాయిలో అర్థోపపత్తికి దారి తీస్తుంది. ఒక వాస్తవం మరో వాస్తవానికి జన్మనిస్తుంది. ఒక అర్థం దానికి సంబంధించిన మరో అర్థానికి పూర్వ షరతు. 'వాడు సింహం' అన్నప్పుడు మనిషి మరోజీవజాతికి చెందిన సింహం కావడం పొసగదు. కాబట్టి రెండో స్థాయిలో సింహానికి సంబంధించిన గుణాలు కలవాడుగా మరో అర్థం, సందర్భం పుడుతుంది. లక్షణలో ముఖ్యార్థం అనుపపన్నమై మరో అర్థానికి దారి తీయడం లాంటిదే ఇది. రూపకాల వ్యాఖ్యాత్మక వివేచన (hermaneutics) వాస్తవాన్ని పునర్నిర్మించడానికి సందర్భం సాధనంగా పనిచేస్తుందని రికో ఇర్ నిరూపించాడు. కవిత్వం వాస్తవానికి దూరం కాదనడానికి ఈ అభిప్రాయాలు ఉపయోగపడతాయి.

తెలుగులో వచన కవిత్వం ప్రారంభమైన తరువాత కొన్ని దశాబ్దాలు వచన కవిత్వానికి లక్షణ నిరూపణ చేయడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. గణబద్ధ ఛందస్సు గాని, మాత్రా బద్ధ ఛందస్సుగాని లేకుండా వచనం కవిత్వం ఎలా అవుతుందన్న విషయంలో చాలా చర్చలు జరిగాయి. వచనాన్ని కవిత్వం చేసే అంశాలేమిటో అనేక రకాలుగా వివరించారు. ఊపు, తూగు, విసురు, విరుపు, అంతర్లయ, భావలయ వచనకవిత్వ లక్షణాలుగా ప్రతిపాదించారు. పద్యం కాబట్టి పాద విభజన ఉంటుందనే అభిప్రాయంతో పండితుల మధ్య చాలా చర్చలు జరిగాయి. నిజానికి పద్యం అన్న దానికి అర్థం మారిపోయింది. పద్యం ఛందస్సుతో సంబంధం లేకుండా కవిత్వానికి పర్యాయ పదంగా వాడుకలోకి వచ్చింది. వచన కవిత్వాన్ని కూడా పద్యం అంటున్నారు. వచన కవిత్వం అనే మాట సుమారుగా వాడుకలోంచి పోయి కవిత్వం అనే మాటే మిగిలింది. ఛందస్సుకి ప్రత్యామ్నాయంగా వచన కవిత్వంలో ఏదో ఒక రూపంలో బాహిరలక్షణాలను నిరూపించాలనే ప్రయత్నంలోనే వచన కవిత్వ చర్చలు సాగాయి.

శ్రీశ్రీ వచనానికి కవిత్వానికి భేదం చెప్తూ "వచనం నడుస్తుంది. కవిత్వం పరుగిడుతుంది. వచనాన్ని పరుగెత్తిస్తే కవిత్వం అవుతుంది" అంటాడు.

వచనాన్ని పరుగెత్తించడం ఎలాగ?

'అనుప్రాసల వల్లను, ఒక మాట గాని, కొన్ని మాటలను పునశ్చరణ చేయడంవల్లను, యమకం వల్లను, వాక్య రూపాన్ని మార్చడంవల్లను, వచన కవిత్వంలో ఈ గుణాన్ని (వేగాన్ని) సాధించవచ్చును. ఇందుకు గాను కవికి మాటలయొక్క కొలత, బరువు, ఒరుపు (టెక్స్చర్) బాగా తెలియాలి. మాటలోనించి ఎంత అర్థాన్ని పిండడానికి వీలున్నదో అంతా అతను పిండుకో గలగాలి. వాటిని ఏ రకంగా అమర్చితే ఎక్కువ ఎఫెక్టు తీసుకొని రావచ్చునో తెలిసి ఉండాలి.

శైలీ శాస్త్రాన్నంతా క్రోడీకరించినట్టుగా ఉన్నాయి ఈ మాటలు. తొలినాళ్ళ వచన కవిత్వంలో అంత్య ప్రాసలు, లయాత్మకమైన నడక ఉండేది. అది పరిణామ దశ. ఇప్పటి (వచన)కవిత్వంలో అంత్యప్రాసలు, యమకాలు సుమారుగా కనిపించవు. కవిత్వం పరుగెత్తదు. వచనం లాగే నడుస్తుంది. వచన స్వభావం, కవిత్వ లక్షణం కలిస్తే వచన కవిత. వర్ణసంయోజనం, పదాల పదబంధాల స్థాయిలో కాక వాక్య, ప్రవచన స్థాయిలోనే కవిత్వీకరణ వ్యూహాలు సాగుతున్నాయి. రూపవాదులు వర్ణ సంయోజనంవల్ల ఏర్పడే లయాత్మ కతకి, రూపకాద్యలంకారాలకి సమప్రాధాన్యం ఇచ్చారు. యాకొబ్ సన్ ఛందస్సులో ఉన్న దంతా కవిత్వం కాదంటాడు. పూర్వ, మధ్య యుగాలలో శాస్త్రాలు ఛందస్సులో వచ్చాయి. ఛందస్సులో ఉన్నదంతా కవిత్వం కాదంటూ కవిత్వాన్ని వేరుచేసే లక్షణాలు చెప్పాడు. లయాత్మకతనుకూడా కవిత్వ లక్షణంగా ఆయన అంగీకరించినట్టు కనిపిస్తుంది. రూపకాన్ని కవిత్వ లక్షణంగా, లక్షణను వచన సాహిత్య లక్షణంగా పేర్కొంటాడు యాకొబ్ సన్. రూపకం కాల్పనికతకు ఆధారమని, లక్షణ వాస్తవికతకు ప్రాతినిధ్యం వహిస్తుందని కూడా అంటాడు. గానయోగ్యమైన కవిత్వంలో తప్ప సమకాలీన (వచన) కవిత్వంలో లయాత్మకతకు స్థానం లేదు. ఇప్పుడు కవిత్వంలోనూ వాస్తవికతకే ప్రాధాన్యం. రూపకంతో పాటు లక్షణ కూడా కవిత్వీకరణ వ్యూహాలలో ప్రముఖ

స్థానం ఆక్రమించింది. రూపకంతో పోలిస్తే లక్షణ ప్రయోగాలే ఎక్కువేమో కూడా. రూపకం, రూపక విస్తరణ రూపంలోని ఇతర ఆధునిక అలంకారాలు వాస్తవికతకే ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇప్పటి వచన కవిత అన్ని రకాల బాహిరరూపాలనుంచి విముక్తమైన శుద్ధ కవిత.

సాదృశ్య మూలక లక్షణను రూపకం (metophor) గాను, సామీప్యాది సంబంధన లక్షణను లక్షణ (Metonymy) గాను గుర్తించాం. కాబట్టి స్థాలీ పులాకంగా నైనా కొన్ని కవితా పంక్తులను ఉదహరించుకోవడం సముచితం. ఆధునిక కవిత్వంలో తొలినాటినుంచీ రూపకానికి ఉదాహరణలు వెతుక్కోనవసరం లేదు. "ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం." సారోపా లక్షణ రూపకానికి ప్రసిద్ధమైన ఉదాహరణలు. 'మాటలు కుడుతున్నాయ్, మనసులు బొబ్బలెక్కు తున్నాయ్' అన్న పంక్తులూ రూపకానికి ఉదాహరణలే. కుట్టడం, బొబ్బలెక్కడం బాధపెట్టడానికి సమానంగా వాడిన క్రియలు. (సాదృశ్యేతర) లక్షణకి కొన్ని ఉదాహరణలు చూద్దాం.

స్థాన సంబంధం: గ్రామాలు మేల్కొంటున్నాయ్, మనూరిప్పుడు అజ్ఞాతవాసంలో ఉంది. ఆధారాధేయ భావం. పసితనంలోనే నన్ను పరిహసించాయి.

పాఠ్యపుస్తకాలు : ఇక్కడ పాఠ్యపుస్తకాలు అందులో ఉండే పాఠాల్నీ, విషయాల్నీ చెప్తుంది.

కార్యకారణ భావం: నన్ను అబలను చేసిన పితృస్వామ్యపు అదృశ్యహస్తం పైట.

సంయోగం సంబంధం: గులాబి రాలిపోయింది. ఇక్కడ గులాబి సంయోగం వల్ల నెహ్రూ అనే అర్థాన్ని స్తుంది.

ధారణ సంబంధం: లాఠీలు విరుచుకుపడు తున్నాయ్. ఓల్గా ఘనీభవించెను. అడవి ఉప్పొంగిన రాత్రి లాంటి పంక్తులలో భిన్నస్థాయిలలో భిన్నమైన సంబంధాలతో లక్షణను అన్వయించు కోవలసి ఉంటుంది. ఈ ప్రయోగాలన్నిటికి ప్రవచన/మహావాక్య సందర్భంలోనే సార్థకత.

సంప్రదించిన గ్రంథాలు - వ్యాసాలు

సంస్కృతం

ఆనంద వర్ధన (1953) ధ్వన్యాలోకః
బనారస్ చౌఖాంబా సంస్కృతి సిరీజ్

కుంతక (1984) వక్రోక్తి జీవితం.
బనారస్, చౌఖాంబా సురభారతీ ప్రకాశనం

దండి (1981) కావ్యాదర్శః ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
హైదరాబాద్

భర్తృహరి (1887) వాక్యపదీయమ్,
బనారస్, మెస్సర్ బ్రజ్ దాస్ కంపెనీ

భామహ (1997) కావ్యాలంకారః
ఢిల్లీ, మోతీలాల్ బనారసీ దాస్ పబ్లిషర్స్

వామన (2003) కావ్యాలంకార సూత్రాణి
హైదరాబాద్, జయలక్ష్మి పబ్లికేషన్స్

తెలుగు

కుందుర్తి గోపాల చక్రవర్తి (1967) వచన కవిత, హైదరాబాద్, ఫ్రీవెర్స్ ఫ్రంట్

నారాయణరావు వెల్చేరు (1987) తెలుగులో కవితా విప్లవాలస్వరూపం, హైదరాబాద్, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్.

రామారావు, చేకూరి, సంపత్కుమారాచార్య, కోవెల వచన పద్యం లక్షణ చర్చ

ఇంగ్లీషు

Aristotle (1963) Poetics Translated by John warrington)

Dremetrius (1963) On style (Translated by T.A.Moxon)

Jakobson, Roman(1960) Linguistics and poetics in Thomas A Sebeok (Ed) Style in Language, Two Aspects of Language Cambridge. M.I.T.Press

Ricoeur, Paul(1986) The Rule of Metaphor, (Translated by Robert Ozerny,) London, Routledge

Saussure, Ferdenand de (1983) Course in General Linguisitics

Shklovsky Victor Art as Technique, Reprinted in Purbh Rice, patricia waugh (Ed)Modern Literary Theory, A reader London : Edward Arnold

Kunjunni Raja, K.(2000) Indian Theories of Meaning Chennai : The Adyar Library and Research Centre.

తెలుగు సామెతలు

డా. పి. నరసింహారెడ్డి

మనం ఎదుటివానితో మాట్లాడుతూ ఉంటాం. మన వాదాన్ని అంత ప్రతిభావంతంగా చెప్పలేక పోయామేమో అనే సందేహం మనకి వచ్చినపుడు సామాన్య వాక్యాలు ఆపేస్తాం . ఒక పోలిక వాక్యం తెస్తాం. అయితే ఆ పోలిక వాక్యం మనది కాదు. మనకల్పన కాదు. మన ఆలోచన కాదు. తరతరాలనుండి మనకు సంక్రమించిన పోలిక వాక్యం - అదే 'సామెత'.

మన ఎదురుగా ఒక గొప్పవాణ్ణి సజ్జనుణ్ణి, బలవంతుణ్ణి -ఒక అల్పుడైనవాడు, నీచుడు, బలహీనుడు తిట్టిపోస్తూ ఉంటాడు. అలా తిట్టేవానితో 1. ఒరేయ్! నీది తప్పు! 2. అలా తిట్టగూడదు 3. నీవు తిట్టేవాడు నీ కన్నా వేయిరెట్లు బలవంతుడు. 4. అతన్తో పోలిస్తే నీవు అల్పుడివి 5. అతడేమైనా అనుకుంటే నీ పని అయి పోయినట్టే 6. అతను గొప్ప మనసుతో నిన్ను పోనిస్తున్నాడు 7. నీవు తిట్టినా అతని గొప్పతనం, సజ్జనత్వం తరిగిపోదు 8. అతని పరువుపోదు అని ఎనిమిది వాక్యాలు చెప్పినా అతణ్ణి ప్రభావితం చేయలేకపోవచ్చు. ఈ అన్ని వాక్యాలకు బదులుగా ఒక సామెత చెప్పి అతణ్ణి చిత్తు చేయవచ్చు. ఆ సందర్భంలో 'ఏనుగు పోతూ ఉంటే కుక్కలు మొరిగినట్లుంది' నీ వరస! అని ముక్తాయించాం అనుకోండి. ఎదుటివాడు నోరు తెరిస్తే ఒట్టు.

సామెతలు చాల మట్టుకు జానపద వాఙ్మయంలోని వచన శాఖలో చేరతాయి. పొడుపు కథలు - జానపద కథల్తోపాటు 'సామెత' అనేపదం 'సామ్యత' నుంచి వచ్చిందని చిలుకూరి నారాయణరావుగారి పలుకులు.

సామెతలకే 'నానుడి' , జనశ్రుతులు, శాస్త్రములు, మాటులు, చాటువ, చాటవ, సాటువ, సాటవ, అనే పేర్లున్నాయి. నాడు+నుడి = నాణ్ణుడి = నానుడి, దేశంలో వ్యవహారంలో ఉండేమాట. సాటి అయింది 'సాటువ' అని, చాటుపెట్టి మాట్లాడేది 'చాటువ' అని వివరణలు.

జానపదులకు సామెతలు శాస్త్రాలంత విలువైనవి కాబట్టి శాస్త్రములు అనే పేరు సార్థకం.

తెలుగు సాహిత్యంలో సామెత అనే పదంతో పాటు లోకోక్తి, శ్లోకం, సామ్యం, జనవాదం, లోకహితోక్తి, కథ, నానుడి, నుడికారం అనే పదాలు వాడుకలో ఉన్నాయి.

సామెతలు - జాతీయాలు :

ఇంగ్లీషులో Proverbకి సమానంగా తెలుగులో 'సామెత' Idiom కి సమానంగా 'జాతీయం' అనే పదాలు వాడుకలో ఉన్నాయి. సామెతలు పోలికవాక్యాలు. జాతీయాలు శబ్ద పల్లవాలు. వీటిని వాక్యాల్లో ప్రయోగించవచ్చు. కైవ్రాలు, తూపొడుచు, విజయం చేయు లాంటివి జాతీయాలు. 'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' 'కండే కాంతి'; 'అడ్డంలేని గుర్రం అగడ్తలు దాటిందట' లాంటివి సామెతలు.

సామెతల సేకరణ కష్టం. జానపదకథల్ని, కథాగేయాల్ని, పొడుపు కథల్ని చెప్పమంటే జానపదులు చెప్పలేరు. సామెతల్ని అలా వరసగా చెప్పమంటే చెప్పలేరు. ఎందుకంటే అవి సందర్భంలో కలిసి పలికేవే గానీ సందర్భం లేకుండా చెప్పలేనివి. ఒక ఉదా. చెపుతాను.

ఒకసారి నేను కర్నూలులో వెళ్తూ వుండగా రాళ్ళు కొట్టే ఆయన చుట్టూ మూగే పిల్లల్తో 'రేయ్! ఎల్లండి ఎల్లండి! "రాళ్ళుకొట్టే కాడ పెండ్లాన్ని కొట్టేకాడ ఉండ కూడదు' అన్నాడు. ఆ సామెతను నేను యథాతథంగా రాసుకోవాలనుకొని - అదే దారిన తిరిగి వస్తూ, 'ఏం పెద్దాయనా! పిల్లల్ని అదిలిస్తూ అదేదో సామెత చెప్తివే, అదేందో చెప్పు' అని అడిగాను. అతడు 'ఏంది సామీ' అని వెర్రి మొగం వేశాడు. 'రాళ్ళుకొట్టేకాడ' అని సామెత మొదలు ఎత్తిస్తే మొత్తం సామెత చెప్పాడు.

సంభాషణల్లో అరుదుగా దొర్లే రత్నాలు సామెతలు. వాటిని అవిశ్రాంత, నిరంతర నిరీక్షణతోనే సాధించాల్సి ఉంది.

సామెత నిర్వచనాలు:

మొట్టమొదట సామెత నిర్వచనం అరిస్టాటిల్‌ది. 'A Proverb is a remnant from old Philosophy preserves amidst countless destrunctions by reason of its brevity and fitness for use' సంక్షిప్తత, ప్రయోగార్హత కారణాలుగా అసంఖ్యాకమైన కాలం ఆటుపోట్లకి ఎదురొడ్డి నిలిచిన ప్రాచీన జిజ్ఞాసా అవశేషమే సామెత' సామెత ప్రాచీన మానవుని తత్వాన్ని, కాలాతీతం కావడాన్ని తెలుపుతుంది. అంతేకాదు; కారణాలు సంక్షిప్తత, సంభాషణల్లో ప్రయోగార్హత అని కూడా తెలుస్తుంది.

సెర్వాంటెస్ సామెతని ఎంతో చక్కగా నిర్వచించాడు. 'Short sentences drawn from long experience' అ ని ఆయన నిర్వచనం. తరతరాల అనుభవం సృష్టించిన సంక్షిప్త వాక్యాలు సామెతలు - ఈ నిర్వచనం సామెతకు తరతరాల అనుభవం మూలం అని, సంక్షిప్తంగా ఉండాలని తెలుపుతుంది.

బేకన్ - నిర్వచనం చూడండి 'Edged tools of speech' పదునైన వాక్ పరికరాలు సామెతలు. అంటే భాషలో వాడిఅయిన వాక్యాలే సామెతలు అని తెలుస్తుంది.

రస్సెల్ నిర్వచనం ఇది 'The wisdom of many and the wit of one' అనేకమంది జ్ఞానం, ఒకని చమత్కారం సామెత. జ్ఞానం మనందర్లోనూ ఉంటుంది. ఎవడో ఒకడు చటుక్కున ఆ జ్ఞానాన్ని Capsule లోలాగా ఒక వాక్యంలో పెట్టి చమత్కారంగా ప్రయోగిస్తాడు. అది అందరి నోళ్ళల్లో నాని 'సామెత' అవుతుంది. 'హమిద్' అనే ఆయన 'A Proverb is to speech what salt is to food' అంటాడు. అన్నంలో ఉప్పు లాంటిది సామెత అని. ఉప్పులేకపోతే కూర ఎలా రుచి విహీనమో అలాగే సంభాషణ కూడా అని భావం.

ఈ అంశాన్ని 'సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు' అనే సామెత బోధ పరుస్తుంది.

సామెత అంటే 'జన వ్యవహార క్షుణ్ణమైన ఉక్తి' అని సంపత్ రాఘవాచారిగారు 'ఒక పిండితార్థాన్ని కొద్దిమాటల్లో చెప్పుంది సామెత' అని విశ్వనాథ సత్యనారాయణ గారు నిర్వచించినారు. ఇలా ఎన్నో నిర్వచనాల్ని చూసినపుడు సామెత లక్షణాలివి అని తెలుసుకోవాలి.

1. సామ్యం లేదా పోలిక: సామెత అనేపదమే 'పోలిక' అనేది ముఖ్య లక్షణం అని తెలుపుతోంది. మనం సంభాషణలో చెప్పున్న అంశానికి తెచ్చుకొనే పోలిక వాక్యమే సామెత. ఉదా: పిల్లవాడు ఎవడైనా 'నేను పరీక్ష సరిగానే రాసినా మాష్టారు మార్కులు వేయలేదు' అన్నాడనుకొండి. 'అవున్రా అబ్బాయ్' 'ఆడలేనమ్మ మద్దెల ఓడన్నదట' అని సామెత ప్రయోగిస్తాం. అయితే పోలిక వాక్యంగా తెచ్చుకున్న ఈ సామెత మన సృష్టికాదు. ఎన్నో తరాల కింద సృష్టించబడింది.

2. ప్రాచుర్యం : ప్రజల నాలుకల మీద నిత్యం మాటిమాటికీ సందర్భానుసారంగా ఆడేదే సామెత. ఒక అత్తకొత్త కోడలిపై కారాలు మిరియాలు నూరుతోందను కోండి. 'అత్తమెత్తన కత్తిమెత్తన లేవు', 'అత్తకొట్టిన కుండ అడుగోటి కుండ, కోడలు కొట్టినకుండ కొత్తకుండ' లాంటి సామెతలు వాడుతుంటాం. అయితే అన్ని సామెతలు ఇలా సార్వదేశికాలు కాకపోవచ్చు. కొన్ని కొన్ని ప్రదేశాల్లోనే ఉండవచ్చు. అలాంటి ప్రాదేశిక సామెతలకు ఒక ఉదా॥ వండాడి కొండంత కొండాలేదు, సాకి బండంత బండాలేదు' ఈ సామెత కడపజిల్లా రాయచోటి తాలూకా ప్రాంతంలోనిది.

3. తరతరాల అనుభవ మూలం : చాలామాత్రం సామెతలు వ్యక్తుల అనుభవం నుంచే పుడతాయి. 'అత్తలేని కోడలుత్తమురాలు కోడలు లేని అత్త గుణవంతు రాలు' అనే సామత అత్తాకోడళ్ళ అనుభవం నుంచి పుట్టింది. గ్రామ ప్రజల చేదు అనుభవం నుంచి 'కరణంతో కంటుపడితే కాడి కదలదు' అనే సామెత,

'కరక్కాయ కన్నతల్లి' అనేసామెత కరక్కాయ వల్ల ఆరోగ్యం బాగయిన వారి అనుభవం నుంచి పుట్టాయి.

4. సాంప్రదాయకత: ఆయాజాతుల తరతరాల సంప్రదాయాల్ని భద్రపరచుకున్న నిధులు సామెతలు. ఏ నాటివో వాటి వరసలు, ఆయా జాతులు సంప్రదాయాలు ఎన్నో సామెతలుగా రూపు దాల్చాయి. ఉదా: 'కులం చెడినా గోత్రం చెడకూడదు' అనే సామెత ఈనాటికీ పాటింపబడుతూంది. సగోత్రీకులు సోదర సంబంధం కలిగి ఉంటారు. కాబట్టి వావి చెడగూడదని ఈ సామెత చెప్తుంది. అలాగే నిషేధంగా ఉండే గోత్రాన్ని పాటించక పోతే చెడు జరుగుతుందనే నమ్మకం వల్ల గోత్రం ఖచ్చితంగా పాటించాలని పెద్దలు అంటారు. ఉదా: పాపిరెడ్డి వారికి రేగు పండ్లు గోత్రం. అవి జీవితాంతం నిషేధం. సామెతల్ని జానపదుల శాస్త్రాలు అని కూడా అంటారు. ఇవి వాళ్ళకి 'అలిఖిత చట్టాలు'.

5. సారవత్త- సంక్షిప్తత : సారవంతం అంటే ఏం సందర్భంలో సామెతను ప్రయోగిస్తామో ఆ సందర్భంలో ప్రభావోత్పాదకతనుకలిగి ఉండడం అంటే మనం ఎవర్ని ఉద్దేశించి మాట్లాడతామో అతనిపై సామెత ప్రభావం చూపడం అన్నమాట. ఇందుకు ముందు చెప్పిన 'ఏనుగులు పోతూ వుంటాయి. కుక్కలు మొరుగుతూ ఉంటాయి' అనే సామెత ఎదుటి వ్యక్తిని నిరుత్తరుణ్ణి చేస్తే ఆ సామెత ప్రభావోత్పాదకత కలిగి సారవంతం అయిందని భావం.

'అల్పాక్షరత్వం' అనే సూత్ర లక్షణం సామెతకు అక్షరాలా సరిపోతుంది. సామెతలు రెండుపదాల్లో కూడా ఉండవచ్చు. ఉదా: కండేకాంతి, మేపే రూపు, లాంటివి. ఇరవైపదాల కంటే ఎక్కువగా ఉంటే అవి సామెతలే కావు అని కూడా కొందరు విమర్శకుల అభిప్రాయం.

6. శ్రావ్యత: శ్రావ్యత చాలా సామెతలకు విడదీయరాని లక్షణం. రెండు పదాలున్నా, ఒకే పాదం ఉన్నా, రెండు పాదాలున్నా, మూడు పాదాలున్నా సామెతలో విరుపు, విరుపు వద్ద యతి, యతిప్రాస, అంత్యప్రాస లాంటి శ్రావ్యత గొలిపే అంశాలు ఉంటాయి.

ఉదా: కండే కాంతి

మేపే రూపు

అంగడి బియ్యం **తంగేడు** కట్టెలు

అంగట్లో అన్నీవున్నా అల్లుని నోట్లో శని

మబ్బువిడిచిన **ఎండ**

మొగున్నిడిచిన **ముండ**

పట్టివిడిచిన **మండ**

ఎత్తి విడిచిన **కుండ**

7. చమత్కారం : చమత్కారం లేకుంటే 'సామెత' కాదు.

ఉదా: అంగట్లో అన్నీ ఉన్నాయి అల్లుని నోట్లోశని'

అత్తకు నాకూ ఆరం బేరం

అత్తనెత్తుకుపో ముత్యాలమ్మా

ఆరుగాళ్ళ జీవం అర్పిస్తాను

'అత్త చచ్చిన ఆర్నెల్లకు నిట్టాడి గుంజ పట్టుకొని నిగిడి నిగిడి ఏడ్చిందంట' లాంటి సామెతలు చమత్కారానికి ఆనవాళ్ళు. జానపదుని చమత్కారం, హాస్యప్రియత్వం, ఎత్తిపొడుపు ఇవన్నీ సామెతల్లో అక్షరం అక్షరం దృశ్యమానం అవుతాయి.

సామెతల పుట్టుక - ఆధారాలు: సామెతలు ఆదిమ మానవుడు మాటలాడడం నేర్చిన నాటినుండే పుట్టాయి. ప్రాచీన గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, బైబిల్, ఖురాన్ లాంటి మతగ్రంథాల్లో సూక్తుల రూపంలో సామెతలు చోటు చేసుకున్నాయి.

సామెతలు అజ్ఞాత కర్తృకాలు, చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు సామెతల్ని 'బేవారసాస్తి' అన్నాడు.అంటే వారసుడు లేని ఆ ఆస్తిని ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. అంతేకాదు సామెతలు 'జాతి ఆస్తి' కూడా.

కుటుంబంతో, సంఘంతో వ్యక్తికి ఉండే సంబంధాలు ఆధారంగా సామెతలు పుట్టాయి. సమాజంలో కృతఘ్నుల్ని 'ఏరు దాటి తెప్ప తగలేసే వాళ్ళుగా',

డంబాలకు పోయేవాళ్ళని 'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీ మోతగాండ్లు' గా సామెతలు పరిహసిస్తాయి.

పురాణాలు చారిత్రక సన్నివేశాలనుంచి కూడా కొన్ని సామెతలు పుట్టాయి. సీత పుట్టి లంక చెడె అనే సామెతకు రామాయణం ఆధారం -కాగల కార్యం గంధర్వులే తీర్చారు అనే సామెతకు భారతం ఆధారం.

'ఏమి అప్పాజీ, అంటే కాలంకొద్దీ రాయజీ' అనేది రాయల కాలంనాటిది (1509-30). అటునుంచి నరుక్కు రమ్మన్నారు.' వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కాలం నాటిది (1761-1816). లోకం ఎలా ఉందిరా సిద్దా అంటే ఎవరిలోకం వాళ్ళదే గురూ' అనే సామెత పోతులూరి వీరబ్రహ్మంకాలం నాటిది(18వ శ.).

సన్నివేశాలు : సమాంతర సన్నివేశాలు ఆధారంగా సామెతలు పుడతాయి. ఉదా: సజ్జనుడు, బలవంతుడు అయినవాణ్ణి దుర్జనుడు - బలహీనుడు నిందించడం ఒక సన్నివేశం కాగా- 'ఏనుగు వెళ్తూ ఉంటే కుక్కలు మొరగడం' మరో సన్నివేశం. ఈ రెంటికీ పోలిక ఉంది కాబట్టి 'ఏనుగు వెళ్తూ ఉంటే కుక్కలు మొరుగుతూనే వుంటాయి' అనే సామెత పుట్టింది.

కథలు: జానపదుల కథలనుంచి సామెతలు పుడుతుంటాయి. ఆ కథ తెలియకపోతే సామెత అర్థంకాదు. 'చెల్లీచెల్లడములకు చెట్టి గారున్నారు' అనేది సామెత. అడవి దారివెంబడి ఇద్దరు బాటసారులు పోతున్నారు. ఒక దోపిడిదొంగ వచ్చి తన వద్ద ఉన్న నాణెం బంగారుదో కాదో చెప్పమన్నాడు. ఒక బాటసారి రెండోవాణ్ణి చూపి 'చెల్లీ చెల్లడములకు చెట్టిగారున్నారు' అన్నాడు చెట్టిగారి వద్దనున్న సొమ్మునంతటిని దొంగ దోచుకున్నాడు. ఈ కథ తెలియకపోతే ఈ సామెత అర్థం కాదు.

సూక్తులు : కొన్ని సూక్తుల్ని సామెతల్లాగా ఉపయోగిస్తూ ఉంటాం. అయితే సూక్తులు ప్రభు సమ్మితాలు. సామెతలు కాంతా సమ్మితాలు. 'అడుసు తొక్కనేల, కాలు కడగనేల'; 'నీతిలేనివాడు కోతికంటే బీడు' లాంటి సూక్తులు సామెతల్లాగా వాడుతూ ఉంటాం.

పరభాషలనుంచి వచ్చిన సామెతలు: సంస్కృతం నుంచి, ఆంగ్లం నుంచి కొన్ని సామెతలు వచ్చాయి.

'వాతాపిజీర్ణం - వజ్రశరీరం'

'అతివినయం -ధూర్తలక్షణం' లాంటివి.

'నిరస్తే పాదపోదేశే

ఏరందోపి ద్రుమాయతే' అనే సంస్కృతం లోకోక్తి నుండి 'చెట్టు లేనిచోట ఆముదపు చెట్టే మహావృక్షం' అనే సామెత వచ్చింది.

Grapes are sour నుండి అందని ద్రాక్ష పండ్లుపుల్లన, 'Nearer the kirk Church further the devotion' నుండి గుడి దగ్గరయే కొద్దీ గురుత్వం దూరం అవుతుంది. Better the devil unknow than the devil you don't know నుండి 'తెలియని దయ్యం కన్నా తెలిసిన దయ్యం మేలు' అనే సామెత ఉట్టాయి.

Carrying walls to new Castles ' రేపల్లెవాడలో పాలమ్మినట్లు' లాంటి సామెతలు పుట్టాయి.

నమూనా సామెతలు: టేకుమళ్ళ అచ్యుతరావు వీటినే 'మాదిరి సామెతల' అన్నారు.

'ముల్లు వచ్చి అరిటాకుమీద పడ్డా - అరిటాకు వచ్చి ముల్లుమీద పడ్డా అరిటాకుకే మోసం' దీనికి నమూనా 'కుండవెళ్ళి బిందెకు తగిలినా, బిందె వెళ్లి కుండకు తగిలినా కుండకే నష్టం' అనేది. చెప్పేవానికి వినేవాడు లోకువ, అనే సామెతను నమూనాగా 'సిగరెట్ తాగేవాడికి బీడీ తాగేవాడు లోకువ' అనే సామెత పుట్టింది.

సామెతల కాలనిర్ణయం: చాలా సామెతల కాల నిర్ణయం చేయలేం. అయితే కొన్ని సామెతల కాలాన్ని ప్రాచీన సాహిత్యం ఆధారంగా, చారిత్రక వ్యక్తుల ఆధారంగా పాతబడ్డ పదాలు ఆధారంగా వర్తక వ్యాపారాలు, కొలతలు, తూకాలు, నాణేలు ఆధారంగా ఆభరణాలు, పరభాషా పదాలు, ఆచార వ్యవహారాల ఆధారంగా పంటలు వస్తువుల ఆధారంగా కాలనిర్ణయం చేయవచ్చు.

ప్రాచీన సాహిత్యం : 'గతకాలము మేలు వచ్చు కాలము కంటెన్' అనే సామెత భారత ఆదిపర్వంలోనిది. కాబట్టి ఈ సామెత నన్నయ కాలం (11వ శ.) నుంచి ఉందని చెప్పవచ్చు.

చారిత్రక వ్యక్తులు : అక్కన్న మాదన్నలు అందలం ఎక్కితే సాటికి సరప్ప చెరువు కట్ట ఎక్కినాడట అనే సామెత తానీషా కాలం (17వ శ.) నాటిది.

ప్రాచీన పదాలు : వేములు వేస్తే భూములు పండును. వేము 1102 నాటి శాసనంలో ఉంది.

'దువ్వును చూసి నక్క వాతపెట్టుకున్నట్లు' ఇది నాచన సోముని కాలం (క్రీ.శ. 1350) నాటిది. దువ్వు అంటే చిరుతపులి తర్వాతికాలంలో పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లు అనే సామెత వచ్చింది.

వర్తక, వ్యాపారాల్ని తెలిపే పదాలు: 'సంతకు దొంగలయితే తోళ్ళెక్కడ అమ్ముకోను' 'సంత' అనే పదం 1364లో శాసనాల్లో కనిపిస్తుంది.

మతం - ఆచార వ్యవహారాల్ని బట్టి 'తాతాచార్ల ముద్ర భుజం తప్పినా వీపు తప్పదు' ఇది 16వ శతాబ్ది నాటిది వేణ్ణీళ్ళకు ఓర్వలేనమ్మ సాగుమానం చేస్తా నన్నదట' ఇది సతీసహగమనం వ్యాప్తిలో ఉన్న కాకతీయుల నాటిది (12వ శ).

కొలతలు -తూకాలు-నాణేలు: 'పండని నేల పుట్టెడు కంటే పండేనేల పందుంచాలు' పుట్యండు అనే కొలత క్రీ.శ. 1235 శాసనంలోఉంది.

'గవ్వన్నరకు గడ్డం గొరుగుతానంటే వెంట్రుకన్నర ఎంత అన్నాడట' 'గవ్వ' నాణెంగా క్రీ.శ.1277లో శాసనంలో ప్రయోగింపబడింది.

ఆభరణాలు : 'తనపిల్ల తవిటికి ఏడిస్తే లంజపిల్ల రావిరేకకు ఏడ్చిందట' రావిరేక' పిల్లలు నుదుట ధరించే ఆభరణం. పాల్కురికి సోమన (13శ) వాడాడు.

పరభాషా పదాలు : కోర్టుకు పోతివా కొల్లకు పోతివా', కోర్టులు 1801లో ఏర్పాటు అయ్యాయి.

పంటలు, వస్తువులు: 'గురువు లోరి పొగచుట్ట' పొగాకు 1600-1650 మధ్య పోర్చుగీసువారు భారత దేశంలో ప్రవేశపెట్టారు.

సామెతలు - జనజీవనం : సామెతలు సమాజాన్ని గురించి మానవజీవితంలోని వివిధ దృక్కోణాల్ని గురించి చెప్తాయి.

సామెతలు: సమాజంలోని వ్యక్తుల కుటుంబ జీవితాన్ని, మతాన్ని గురించి, కులాల్ని గురించి, వృత్తిని గురించి ఆహారపు అలవాట్లను గురించి వ్యాపారం, కొలతలు, నాణేలు, పరిపాలన, న్యాయం, విద్య, వైద్యం, కళలు, వినోద విలాసాలు , ఆటలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, వస్త్ర, భూషణ అలంకారాలు, మనస్తత్వం, ఇలా అన్ని అంశాల్లోను సామెతలకు పెద్ద పీట ఉంది

అత్త మెత్తన కత్తిమెత్తన ఉండవు. అల్లుడు అంటే వంకర తాడే లేచినుంచుందట. ఆడబిడ్డ అర్ధమొగుడు వచ్చిననాడు వరాచుట్టం - మరునాడు మాత చుట్టం - మూడోనాడు మురికి చుట్టం లాంటివి కుటుంబాన్ని గురించి చెప్పే సామెతలు .

కోటి విద్యలు కొంద్రకు లోకువే. గడ్డగడ్డకూ పుట్టెడు నీళ్ళు తాగినా రెడ్డే వ్యవసాయం చెయ్యాలి లాంటివి వృత్తిని గురించి చెప్పేవి.

ఏనుగులు తినేవానికి పీనుగులు పిండాకూడు. కోటి వంటల కన్నా కోటి తునకలు మిన్నలాంటివి ఆహారపు అలవాట్లను చెప్తాయి.

సెగలేనిదే అన్నం ఉడకదు- శ్రద్ధ లేనిది చదువు రాదు, ఆడేకాలు పాడేనోరు ఊరికే ఉండవు, కరక్కాయ కన్నతల్లి లాంటివి విద్య, కళలు, వైద్యానికి సంబంధించిన సామెతలు. అరవై ఆమడబోయి హరికథ వినాల. 'తొంభై ఆమడ పోయి అయినా తోలుబొమ్మ లాట చూడాల' అనే సామెత జానపద కళల్ని గురించి చెప్తుంది.

పొగాకు అడుక్కోవాలి అందలం బయట పెట్టరా, ఈదులకు పోయినవాడు ఇల్లుకాలినా రాదు తాళ్ళకు

పోయినవాడు తండ్రి చచ్చినా రేడు అనేవి దుర్వ్యసనాలకు సంబంధించిన సామెతలు .

'ఈడు చూసి పిల్లనియ్యి పిడి చూసి కొడవలియ్యి', 'పెళ్ళికి వెళ్తూ పిల్లిని చంకన బెట్టుకొని పోయినట్లు' ఆచార వ్యవహారాల్ని, నమ్మకాల్ని తెలిపే సామెతలు.

మనస్తత్వ చిత్రణ: తెలుగు సామెతలు మనస్తత్వ చిత్రణను అద్భుతంగా చేశాయి.

అదుపులేని తనాన్ని 'అంకె లేనికోతి లంకంతా చెడిచింది' అధికారి మెత్తదనాన్ని 'రౌతు మెత్తనయితే గుర్రం మూడు కాళ్ళ నడిచిందట' అసూయను 'గుర్రం గుగ్గిళ్ళు తింటూ ఉంటే గాడిద కడుపూది చచ్చిందట', గత వైభవాన్ని 'మాతాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి' అనే సామెత వ్యాఖ్యా నిస్తాయి.

సామెతల వాఙ్మయంపై పరిశోధన - సంకలనాలు: మొట్టమొదటి తెలుగు సామెతల సంకలనం కార్ ది. (1868) ఇందులో 2700 తెలుగు సామెతలున్నాయి.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీవారు వేసిన 'తెలుగు సామెతలు' మూడో కూర్పు (1974). 10511 సామెతలున్నాయి.

చిలుకూరి నారాయణరావుగారు, నేదునూరి గంగాధరం, నిడుదవోలు వేంకటరావు, విశ్వనాథ సత్య నారాయణ, సంపత్ రాఘవాచార్యులు, మరుపూరు కోదండ రామిరెడ్డి, డా. యశోదారెడ్డిగారు సంకలనాల్ని వెలికి దీయటంలో ప్రముఖ పాత్ర వహించారు. రాజేశ్వరరావు విశాలాంధ్ర తరఫున ఒక సంకలనం వేశారు.

తెలుగు సామెతలపై మొదటి పరిశోధన చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రిది. (ఆంధ్రా యూనివర్శిటీ)

తర్వాత ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు 'తెలుగు సామెతలు- సాంఘిక జీవితం'పై పోటీ గ్రంథ రచనపోటీ (1979-80) పెట్టారు. డా. పి. నరసింహారెడ్డి గ్రంథానికి అవార్డు వచ్చింది. అక్కిరాజు, జి.యస్.మోహన్ లాంటివాళ్ళు కూడా గ్రంథరచన చేశారు. డా. పి. నరసింహా రెడ్డి, డా. ఇ. చంద్రమౌళి, బంగోరె, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిలాంటివాళ్ళు సామెతల సేకరణ చేశారు.

వివిధ విశ్వవిద్యాలయాల్లో సామెతలపై పరిశోధన జరిగింది. జరుగుతోంది కూడా.

ద్రావిడ భాషలు - ఒక పరిచయం

డా. ఎ. మంజులత

ద్రవిడ పదానికి సంస్కృతంలో ద్రమిడ, ద్రావిడ అనే variants ఉన్నాయి. ద్రావిడ అనే పదాన్ని భాషా శాస్త్రంలో నరవర్గ శాస్త్రంలో, మానవశాస్త్రంలోనే కాక, భారతీయుల సాంస్కృతిక సామాజిక చరిత్రలో విస్తృతంగా వాడుతున్నారు. వీటిలో ద్రమిడ పదం ప్రాచీనమైనదని అంటారు. ఆర్యులు భారతదేశం వచ్చే నాటికి ఇక్కడ నివసిస్తున్న వివిధ ఆర్యేతర జాతుల వారిని పుండ్ర, శబర, పుళింద, మూతిబ నిషాద, కిరాత, మ్లేచ్ఛ మొ॥. వివిధ పేర్లతో వ్యవహరించారు. ఆర్యులు భారతదేశానికి వచ్చేనాటికే ఈ ఆర్యేతర జాతులలో పరస్పరం సమ్మేళనం జరుగుతోంది. ఆర్యుల రాక తరువాత ఆర్య జాతులతో కూడా వీరి సమ్మేళనం జరిగింది. దీని ఫలితంగా ఈ జాతుల్లో భిన్నత్వం ప్రాతిపదికమీదే, ఏకత్వం కూడా సాధ్యమయింది. ఈ ఏకత్వ ఫలితంగానే సుమారు 3000 సం॥క్రితం అంటే వేదకాలం చివరికి, భారత నాగరక ప్రపంచంలో కొన్ని సాధారణ లక్షణాలతో, భారతీయుడు అనదగ్గ వ్యక్తి రూపొందాడని పరిశోధకుల అభిప్రాయం. చరిత్ర పూర్వకాలంలోనూ వివిధ జాతుల సమ్మేళనమూ, వివిధ భాషల సంస్కృతుల సమ్మేళనం ఫలితంగా నాటి భారతదేశపు గడ్డమీద బాహిరంగా భిన్నత్వంగా, అంతర్గతమూ ఏకత్వమూ కలిగింది. ఈనాటి భారతీయుల్లో అధిక సంఖ్యాకులు మిశ్రమజాతికి చెందినవారు; నరవర్గ సంబంధమైన పరిమితులు పూర్తిగా వీరిని బంధించలేదు. మార్పులేని స్వచ్ఛమైన జాతీ, మార్పులేని స్వచ్ఛమైన భాష ఉండవు.

ఈనాటి భారతీయులు నాలుగు ప్రధాన భాషా కుటుంబాలకు చెందిన భాషలు మాట్లాడతారు. మొదటిది, Astro Asiatic కుటుంబం. ఈ భాషా కుటుంబం భారత దేశంలో అత్యంత ప్రాచీనమైంది. నేడు దీనికి చెందిన సుమారు 20భాషలకు పైగా మన దేశంలోని సంతాల్‌లు, ముండాలు, కురుఖ్‌లు, సవరలు మొదలైన ఆదివాసులు మాట్లాడుతున్నారు. వీరు నేటి తూర్పు ఆగ్నేయ భారతదేశ భాగాల్లో ఉన్నారు. రెండోది, సీనో - టిబెటన్ భాషా కుటుంబం. దీనిలో నేటికి సుమారు 98 భాషలు మాట్లాడేవారు మన దేశంలో అస్సాం, సిక్కిం, హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఉన్నారు. వీరు ఆర్యులకు పూర్వమే ఈ దేశం వచ్చినవారు. వీరినే కిరాతులన్నారు.

మూడోది, ద్రావిడ భాషా కుటుంబం, నాలుగోది ఇండో ఆర్యన్ కుటుంబం. భారతదేశంలోని నాలుగు, భాషా కుటుంబాలలో ఇండో ఆర్యన్; ద్రావిడ భాషా కుటుంబాలు ముఖ్యమైనవి. ఉత్తర భారతదేశంలో ఆర్య భాషలూ దక్షిణ భారతదేశంలో ద్రావిడ భాషలూ ప్రచురంగా వ్యవహరింపబడుతున్నాయని చెప్పవచ్చు.

ఇక ద్రావిడ భాషాకుటుంబానికి వస్తే, ఈ భాషల తులనాత్మక పరిశీలన చెయ్యగా, వాటిలో తరతమ సహజాత సంబంధాలను బట్టి ఈ భాషా కుటుంబాన్ని పరిశోధకులు 3 ఉపకుటుంబాలుగా విభజించారు, అవి: ఉత్తర ద్రావిడ భాషలు ఇవి 3 బ్రాహూయీ, మాల్తో, కురుఖ్‌లు. ఇవి బలూచీస్థాన్, బీహార్‌లలో వ్యవహారంలో ఉన్నాయి. మధ్యద్రావిడ భాషలు ఇవి 12, తెలుగు, గోండి, కొండ, పెంగొ, కోయ, మండ, కుయి, కువి, కోలామీ, నాయికి, పర్జి, గదబ, ఒల్లారి భాషలు. మూడో ఉప కుటుంబం దక్షిణ ద్రావిడ భాషలు. ఇవి 7, తమిళం, మలయాళం, కన్నడం, కోట, తొద, కొడగు, తుళు.

ద్రావిడ భాషలలో తమిళం, తెలుగు, కన్నడం, మళయాళ భాషలకు మాత్రం లిపులు ఉన్నాయి. అంతేకాక, ప్రాచీన లిఖిత సాహిత్యమూ, వ్యాకరణ రచనా సంప్రదాయమూ ఉన్నాయి. ఇవి నాగరక భాషలు. కొడగు,తుళు భాషలు ఈనాటి కర్ణాటక రాష్ట్రంలో నాగరక ప్రజలే మాట్లాడుతున్నా ఈ భాషలకు లిపి లేనందు వల్ల, వారికి కన్నడమే విద్యా మాధ్యమంగా ఉంది.

ప్రాచీన కాలంలోనే ఉత్తర భారతంలోని సంస్కృత భాష తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ భాషలపై, ఆయా సాహిత్య సంప్రదాయాలపై ఎంతగా ప్రభావం చూపిందంటే సంస్కృత భాషాధిక్యాన్ని ఈ భాషలు అంగీకరిస్తూ దాన్ని దేవభాషగా భావించారు. అంతేకాక, సంస్కృతమే తమ భాషలన్నింటికీ జనక భాషగా భావించారు. ఆర్య, ఆర్యేతర జాతుల, భాషల సమ్మేళనంలో సంస్కృత పదాలు ద్రావిడ భాషలలో అధికంగా చేరినా, ద్రావిడ భాషాపదాలు కూడా వేదభాష కాలం నుంచి కొన్నయినా సంస్కృతంలో చేరినాయని ఈనాటి పరిశోధకులు నిరూపించారు.

ద్రావిడ భాషలు ఒకే మాతృభాషనుంచి ఏర్పడిన సోదర భాషలని ఆధునిక శాస్త్రజ్ఞులు నిరూపించారు. ఆ మాతృభాష మూల ద్రావిడ భాష లేక ప్రాచీన ద్రావిడ భాష అంటారు. ఇదికేవలం వ్యవహార భాషగానే ఉండేదనీ కావ్య భాషగా పరిణతి చెందలేదనీ అంటారు.

ద్రావిడ భాషలు ఒక ప్రత్యేక కుటుంబానికి చెందినవిగా మొదట గ్రహించినవాడు ఫ్రాన్సిస్ ఎలిస్. ఈయన 1816లో ఎ.డి. కాంబెల్ రాసిన A Grammar of the Teloogoo Language కి రాసిన Notes to the Introductions లో ఈ విషయం పేర్కొన్నాడు. ఆ తరువాత డెన్మార్క్ దేశస్థుడైన రాస్మస్ క్రిష్టియన్ రాస్క్ కొన్ని ద్రావిడ భాషలను గురించి తెలుసుకొని, ఇవి ప్రత్యేక భాషా కుటుంబానికి చెందినవని, వీటిని 'మలబారిక్ భాష'లన్నాడు.

ద్రావిడ భాషలు ఒకే కుటుంబానికి చెందినవనే సిద్ధాంతాన్ని సమగ్రంగా చర్చించి సోదాహరణంగా నిరూపించిన వాడు రాబర్ట్ కాల్డ్వెల్. ఈయన 1856లో ప్రచురించిన A comparative Grammar of the Dravida Law or South Indian family of Lnaguage అనే గ్రంథం ద్రావిడ భాషలకి మొట్టమొదటి విపులమైన తులనాత్మక వ్యాకరణం. కాల్డ్వెల్ 12 ద్రావిడ భాషలు గుర్తించి వాటి ప్రత్యేక లక్షణాలను వివరించి, ఆ భాషలు సంస్కృత జన్యాలు కావని నిర్ణయించాడు. ఆ కుటుంబానికి ద్రావిడ భాషా కుటుంబమని మొదట పేరు పెట్టినవాడు ఈయనే. ఈయన్ని అనుసరించే తరువాతి పండితులు కూడా ఈ పదాన్నే వాడారు. ఆ తరువాతి గ్రియర్సన్ అనే శాస్త్రజ్ఞుడు 14 ద్రావిడ భాషలని పేర్కొన్నాడు. 1961లో టి. బరో. యం.బి. ఎమినో శాస్త్రజ్ఞులు ద్రావిడ భాషలు ఈనాటికి తెలిసినవి 24 అని పేర్కొన్నారు.

మూలద్రావిడ భాషనుండి మొదట తమిళం, తరువాత కన్నడం ఆ తరువాత తెలుగు స్వతంత్ర భాషలుగా విడివడ్డాయని భాషా వేత్తల అభిప్రాయం. తెలుగుక్రీ.శ. 6 వశతాబ్ది నాటికే మూలభాషనుంచి విడివడి ఒక స్వతంత్ర భాషగా మొదలైంది. సాహిత్య చరిత్ర విషయానికి వచ్చేసరికి ద్రావిడ భాషలన్నింటిలో ప్రాచీన లిఖిత సాహిత్యం, వ్యాకరణం క్రీస్తు పూర్వం నుంచి తమిళ భాషకే లభిస్తున్నాయి. మళయాళ భాష తమిళ మాండలికంగానే క్రీస్తు తర్వాత చాలాకాలం కొనసాగింది. కన్నడ సాహిత్యం క్రీ.శ.10వ శతాబ్దినుంచి తెలుగు సాహిత్యం క్రీ.శ.11వ వతాబ్దినుంచి, మళయాళ సాహిత్యం 14వ శతాబ్దినుంచి మనకు ఇప్పటికి లభిస్తున్నాయి.

భాషలన్నీ పరిణామ క్రమంలో ఎన్నో మార్పులు పొందుతాయి. అయినా మాతృభాషా లక్షణాలు కొంతవరకైనా నిలుపుకొంటాయి. అందువల్లే సోదర భాషల మధ్య పోలికలు కనిపిస్తాయి.

ద్రావిడ భాషల మధ్య సోదర సంబంధాన్నీ ఏక కుటుంబతను నిరూపించే లక్షణాలలో కొన్ని ఇవి.

1. ద్రావిడ భాషల్లో అర్థ భేదం సూచించడానికి ధాతువు పైన మరోధాతువు, పదంపైన మరో పదం చేరుతుంటాయి. సంస్కృతంలో మాత్రం అర్థ భేదం సూచించ డానికి ఒక పదానికి ఉపసర్గలుకాని, ప్రత్యయాలు చేర్చే సంప్రదాయం ఉంది. (తెలుగులో ప్రత్యయాలు చారిత్రకంగా ఒకప్పుడు స్వతంత్ర పదాలు. అంటే ద్రావిడ భాషలు Morphological classifications లో agglutinatice stage కి చెందుతాయని పరిశోధకులంటారు.

2. ద్రావిడ భాషల్లో అన్నింట్లోనూ కనబడే హ్రస్వ 'ఎ'కార , 'ఒ'కారాలూ శకటరేఫం సంస్కృతంలో లేవు. ప్రాచీన ద్రావిడంలో ఉన్నా ఈనాటి తెలుగు, కన్నడ భాషల్లో లుప్తమైన ' ఴ ' అక్షరం తమిళ మళయాళ భాషల్లో ఇప్పటికీ ఉంది. ఈ అక్షరం సంస్కృతంలో లేదు.

ద్రావిడ భాషల్లో ప్రాచీన కాలంలో మహాప్రాణాలూ, శషసహ అక్షరాలూ లేవు. ఇవి సంస్కృత భాష ప్రభావం వల్ల ద్రావిడ భాషల్లో తరువాతి దశలో చేరాయి. తమిళంలో ఇప్పటికీ మహాప్రాణాల్ని సూచించే సంకేతాక్షరాలు లేవు.

3. ద్రావిడ భాషల్లో కొన్ని నామపదాలకూ క్రియా పదాలకూ భేదం ఉండదు. ఒకే ధాతువు నామవాచకం గానూ క్రియాపదంగానూ వాడతారు. కట్టుక పండు/ కట్టు

4. ద్రావిడ భాషల్లో నామానికి ముందు ప్రయోగించడం వల్ల మరో నామం విశేషణంగా మారు తుంది. (మామిడిపండు). ఈ విశేషణాలకి లింగ, వచన భేదం ఉండదు. సంస్కృతంలో విశేషణానికీ దానికి సంబంధించిన విశేష్యానికీ లింగవచన విభక్తులలో ఏకరూపత ఉండాలనే నియమం ఉంది. సుందరః పురుషః సుందరీ స్త్రీ; సుందరం వనం

5. ద్రావిడ భాషల్లో స్వరసామ్యం (Vowel hormony) ఉంది. అంటే ఒక పదంలో పక్కపక్కనున్న అక్షరాల్లోని అచ్చులు ఒకదానికి అనుగుణంగా మరోటి మారడం అన్నమాట (కత్తి+లు= కత్తులు) (లక్ష్మికు లక్ష్మికి) దీన్ని assimilation of vowels అని కూడా అంటారు.

6.ద్రావిడ భాషా ధాతువులు సాధారణంగా ఏకాచ్చులు గలవి (monosyllabic). సంయుక్తాక్షరాలు చాల తక్కువ. కావ్యభాషలో సంయుక్తాక్షరాలు సంస్కృత ప్రభావం.

7. ద్రావిడ భాషల్లో సంధి సామాన్యంగా పర రూపసంధి. (రెండచ్చుల మధ్య జరిగే సంధిలో పూర్వపదం చివరి అచ్చు లోపించి పరపదం మొదటి అచ్చు నిలు స్తుంది. సంధి జరగనప్పుడు 'య' కార 'వ' కారాలు ఆగమాలుగా వస్తాయి) సంస్కృతంలోని వృద్ధి సంధి, గుణసంధి, సవర్ణ దీర్ఘసంధి వంటివి లేవు.

8. ద్రావిడ భాషల్లో ఏక, బహువచనాలు రెండే ఉన్నాయి. సంస్కృతంలో లాగా ద్వివచనం లేదు.

9. ద్రావిడ భాషల్లో లింగ వివక్ష (gender) అర్థాన్ని బట్టి ఏర్పడింది. (తెలుగులో ఈ విభజన మహత్తులు అమహత్తులు అని ఉంటుంది) సంస్కృతంలో శబ్దాన్ని బట్టి లింగ వివక్ష ఉంది.(ఉదా: దారా; పుం; భార్యా; స్త్రీ; కళత్రమ్ నపుం ఏకార్థ బోధక పదాలు; వృక్షం పుం)

10. సర్వనామాల విషయంలో ద్రావిడ భాషల కొక ప్రత్యేక లక్షణం ఉంది. (ఉత్తమ పురుష బహువచనం) I person plural form, రెండు విధాలుగా ఉంటుంది. మేం, మనం రూపాలు (inclusive, exclusive) ఇటు వంటి భేదం ఇండో యూరోపియన్ భాషల్లో లేదు.

11. ద్రావిడ భాషల్లో భూత భవిష్యద్వర్తమాన కాలాలు మూడే ఉంటాయి. సంస్కృతంలో లాగా క్రియల కాలాన్ని తెలపడానికి దశవిధలకార ప్రక్రియ వీటిలో లేదు.

12. (ద్రావిడ భాషల్లో వ్యతిరేకార్థం రూపొందడ మనేది పదానికి అంతర్గతంగా జరిగేమార్పువల్ల జరుగు తుంది.) అంటే ధాతువుకి వ్యతిరేకార్థక ప్రత్యయం చేర్చితే వ్యతిరేకార్థకం ఏర్పడుతుంది (చెయ్+అ+ను). సంస్కృతంలో దాని జన్యభాషల్లో ప్రత్యేక పదంతో వ్యతిరేకార్థకం తెలుపుతారు (న+కరోమి).

13. వాక్య నిర్మాణంలో కర్మణి ప్రయోగం Passive voice ద్రావిడ భాషలకు సహజం కాదు. (కర్మకు ప్రాధాన్యమిచ్చి కర్తతో పనిలేకుండా వాక్యం నిర్మించడం కర్మార్థక ప్రయోగం) ఇది సంస్కృత ప్రభావం వల్ల ద్రావిడ భాషల్లో వచ్చింది. ('పడు' ధాతువు కర్మార్థక ప్రయోగంలో వాడటం జరుగుతోంది)

14. యత్, తత్ శబ్దాలతో వాక్యనిర్మాణం ద్రావిడ భాషల్లో సహజం కాదు. క్రియాజన్య విశేషణాలు వాడుతూ వాక్య నిర్మాణం చెయ్యడం ద్రావిడ భాషలకు సహజం. (యత్; తత్ శబ్దాల నిర్మాణం సంస్కృత భాషా

ప్రభావం) కృషి చేసేవాడు ఫలితం పొందుతాడు. ఎవడైతే కృషి చేస్తాడో వాడు ఫలితం పొందుతాడనే వాక్యం అసహజం. ఇది సంస్కృత భాష ప్రభావం వల్ల వచ్చినది.

15. కొన్ని సామాన్య వాక్యాలు క్రియా రహితాలుగా ఉండటం ద్రావిడ భాషల ప్రత్యేకత. ఇది సంస్కృతంలో తత్ జన్య భాషలలో ఉండదు (ఇది బల్ల. ఈవిడ టీచరు.)

16. ద్రావిడ భాషలుక్రియాంత భాషలు. అంటే వాక్య నిర్మాణంలో క్రియచివరన వస్తుంది. క్రియకు సన్ని హితంగా ఉండే పదానికి అర్థ ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని సామాన్య వాక్యాలు క్రియారహితంగా ఉండటం కూడా ద్రావిడ భాషల ప్రత్యేకత.

17. సంఖ్యావాచకాలు ద్రావిడ భాషల్లో 1 నుంచి 10 వరకు ఉన్నాయి. తరువాత నూరు సంఖ్య ఉంది. పది తరువాత వాటిని చెప్పేటప్పుడు మొదట పదుల స్థానం చెప్పి ఒకట్లను చెబుతారు. (19,23) సంస్కృంలో మొదట ఒకట్లస్థానం చెప్పి తరువాత పదుల స్థానం చెబుతారు ఉదా: అష్టాదశ, ఏకాదశ మొదలైనవి.

18. ద్రావిడ భాషల్లో బంధు వాచక పదాలు ఎప్పుడూ బహువచన సర్వనామాలతో కలిసి ఉంటాయి. మా చెల్లెలు, మా ఆవిడ.

ద్రావిడ భాషల నుంచి సంస్కృతం అనేక పదాలు ఆదానం పొందింది. ఈనాడు మనం, సంస్కృత పదాలని భావిస్తున్న మయూర, ఫల, బల, అణు, కుట, పుష్ప, రాత్రి, మొదలైన 20 పదాలు వేదకాలం నాటికే సంస్కృతంలో చేరాయని బరో, చటర్జీ పండితులు పేర్కొన్నారు. మీన, కేతకి, తాళ, తరువాత కాలంలో చేరినవి.

ద్రావిడ భాషల ప్రత్యేక లక్షణాలలో ఇవి కొన్ని మాత్రమే. ద్రావిడ జాతి ప్రారంభం గురించి, ద్రావిడ భాషలకు ప్రపంచ భాషా కుటుంబాలతో దేనితో ఎక్కువ సంబంధ బాంధవ్యాలున్నాయి, సన్నిహితత్వం ఉందనే విషయాల మీద తులనాత్మక పరిశోధన కొంత జరిగింది. కాల్డ్వెల్ మొదలుకొని భారతీయులు , దక్షిణ భారతీయ శాస్త్రవేత్తలు పరిశోధన జరిపారు. ద్రావిడ భాషలకు సంబంధ బాంధవ్యాలు సిధియన్ భాషలతో Ural Atlantic నీగ్రో ఆఫ్రికన్ భాషలతో, చివరికి సుమేరియన్ సంస్కృతితో వివిధ శాస్త్రజ్ఞులు ప్రతి పాదించారు. గాని, ఇంతవరకూ ఈ విషయంలో అపరిష్కృతంగానే ఉంది.

అయితే ద్రవిడ భాషా సంస్కృతుల అధ్యయనం జానపద సాహిత్యంమీద, స్థలనామాలు, వ్యక్తి నామాల మీద పరిశోధన విస్తృతంగా జరగవలసి ఉంది. వీటిలో ఎంతో చరిత్ర దాగి వుంది. దీని వల్ల చరిత్ర పునర్ని ర్మాణంలో తెలిసే అనేక అంశాలు ఈనాటి సాంఘిక సమస్యలకు పరిష్కారం చూపవచ్చు.

మాతృభాషా దేవోభవ!

డా. పరుచూరి గోపాలకృష్ణ

మనిషి మనిషితో మాట్లాడుతున్నాడు. కొన్ని వేల సంవత్సరాల క్రితం మాట్లాడేవాడుకాదు. సైగల ద్వారా, చర్యల ద్వారా తన మనసులోని భావాన్ని ఎదుటి వ్యక్తికి తెలియజేసేవాడు. జంతువు అరిచేది, మనిషీ అరిచేవాడు. జంతువు ఇప్పటికీ అరుస్తోంది. మనిషి మాట్లాడు తున్నాడు. ఈ పరిణామం ఎప్పుడో మొదలయ్యింది. చైనా జాతీయుడు మన దగ్గరకువచ్చి మాట్లాడుతుంటే మనకి అర్థం కాదు. అంతెందుకు మనదేశంలోని గుజరాతీ, అస్సాం, నాగా ఇలా కొందరికి హిందీ, ఇంగ్లీషుతో సహా అర్థం కాదు. మాట్లాడే దాన్ని భాష అంటే, అది ఎవరికి వారికి ఉండడం నైసర్గిక రీతి. తమిళనాడులో తమిళం, కర్నాటకలో కన్నడం, కేరళలో మళయాళం, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు మాతృభాషలు.

మాతృభాష అంటే అమ్మనేర్పిన భాష. మనపిల్లలే అమెరికాలో పెరిగితే ఆంగ్లం నేర్చుకుంటారు. ఆంధ్ర దేశంలో పెరిగితే తెలుగు నేర్చుకుంటారు. అందుకే మాతృమూర్తి ఎంత గొప్పదో మాతృభాష అంత గొప్పదయ్యింది.

బహుశా ప్రపంచంలో ఫలానా భాషామాట్లాడే ప్రజలకు ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని 58 రోజులు నిరాహారంగావుండి ఒక మహానుభావుడు అసువులు అర్పించిన సంఘటన లేదు గాక లేదు. బంగ్లా దేశీయులు పోరాడిన సంగతి గుర్తుండీ ఈ మాట ఎందుకు చెబుతున్నా నంటే మన రాష్ట్రం ఏర్పాటు కావటానికి ప్రాణాలర్పించినటువంటి పొట్టి శ్రీరాములుగారికి నివాళి అర్పించటానికి.

అయితే 1921 నుంచి నిజాం రాష్ట్రంలో తెలుగు భాష మీద మమకారాన్ని తెలుగు ప్రజలు చాటి చెబుతూనే వున్నారు. మాడపాటి హనుమంతరావుగారిని, బూర్గుల రామకృష్ణారావుగారిని ఈ సందర్భంగా తలుచుకోకపోతే క్షమార్హం కాదు కదా....!

1053వ సంవత్సరంలోనన్నయగారి చలువతో రాజ రాజనరేంద్రుడి ఆశీస్సుతో తెలుగు భాషకొక అమూల్య మైన కానుక రూపంలో శ్రీమదాంధ్ర మహా భారత రచన ప్రారంభమయ్యింది. ముప్పై ఆరు అక్షరాల తెలుగు భాష యాభైఅయిదు అక్షరాల ఆంధ్ర భాషగా వికసించింది. అనేక సంస్కృత పదాలు తెలుగు పదాలుగా ప్రఖ్యాతి పొందాయి. భాషా విస్తరణ జరగడంతో ప్రపంచంలో వున్న ఆరువేల భాషల్లో ఆరో స్థానంలోనూ, భారత దేశంలో మాట్లాడేవారి సంఖ్య ప్రకారం చూస్తే రెండవ స్థానంలోనూ తెలుగు భాష ఉండం తెలుగువారు గర్వించదగిన విషయం.

అయితే ఇప్పుడు ప్రపంచంలో 2900 భాషలు మాత్రం ఉపయోగంలో ఉన్నాయి. మిగిలిన 3100 భాషలు మృత భాషలయ్యాయి అంటున్నారు. మనిషి చనిపోతాడు. భాష చనిపోవడం ఏమిటి? అవును! ఏ భాషయినా మాట్లాడినంత మాత్రాన బ్రతికి వుండదు. రాయాలి.. చదవాలి... అది లేనప్పుడు భాషకు అంతరించే ప్రమాదం మొదలయినట్లే.

అనధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికి విద్యాలయాల్లో 21 శాతం విద్యార్థులు తెలుగు ఒక అంశంగా చదువుకోవడం మానేశారు అని చెబుతున్నారు. ఇది నిజమయితే తెలుగుభాషకు ప్రమాద ఘంటికలు మోగడం మొదలు పెట్టినట్లే ! ఎందు కంటే 33 శాతం ప్రజలు ఏ భాషను రాయనూ, చదవనూ ఆపేస్తారో ఆ భాష కాలక్రమేణా అంతరించి మృతభాషగా మారిపోతుం

దని భాషాశాస్త్రజ్ఞుల ఉవాచ! 'తస్మాత్ జాగ్రత్త' అన్న హెచ్చరిక అన్నమాట.

స్వపరిపాలన సుపరిపాలనగా ఉండాలంటే పరిపాలనా భాష స్వభాష అయి వుండాలన్న నిర్ణయం 1966లో తీసుకున్నా 1974లో అధికార భాషా సంఘాన్ని నియమించినా , ఉద్దండులు అధ్యక్ష స్థానంలో కూర్చున్నా, అనుకున్నంత మేరకు ఉద్దేశం సానుకూలం కాలేదన్నది సుస్పష్టం.

దీనికి కారణాలు శోధిస్తే ముఖ్యంగా ఈ మూడు కారణాలు కనిపించాయి.

1. తెలుగు మాధ్యమంలో కంటే, ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందన్న విద్యార్థినీ విద్యార్థుల, వాళ్ళ తల్లిదండ్రుల నిర్ణయం.

2. ఒకప్పుడు ఒళ్ళో బిడ్డకి 'అత్త, తాత, అమ్మ' అంటూ భాషనేర్పిన మాతృమూర్తి, మాతృభాషను వదిలి, ఆంటీ, మమ్మీ, డాడీ, అంకుల్ అంటూ నేర్పడం.

3. అనేక పదాలు ఇప్పటికే తెలుగు భాషలో కలిసిన విధంగా కొన్ని వందల ఆంగ్లపదాలు, టీవీ మాధ్యమం ద్వారా, సినిమా మాధ్యమంద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసేవారు గానీ, ఇతరంగా చదువుకున్న వారి ముఖతా ప్రచారంలోకి వచ్చిన పదాలు గాని, ఇప్పుడు సామాన్య మానవుడి నాలుకపై నాట్యం చేస్తూ రక్తంలో కలిసిపోయి వుండడం.

పైవాటికి తోడు అనువాదంలో వచ్చే ప్రమాదాలను అధిగమించటానికి ఆంగ్లంలోనే రాస్తే పోలా అన్న ఉద్యోగుల విశ్వాసం, ఆంగ్ల పదాలు కలిపి తెలుగు మాట్లాడటం ఒక నవనాగరికత అన్న భావం కొందరిలో కలగడం ఇవి కూడా కారణాలే.

చట్టాలు ప్రభుత్వాలు చేస్తాయి. ఆచరణ ప్రజలు చేస్తారు. చట్టం వ్యభిచారాన్ని నిరోధించింది. వరకట్నాన్ని నిషేధించింది. పేకాట ఆడకూడదు అన్నది. అయినా, అనేక చట్టాలు ఉల్లంఘించబడుతున్నాయి అన్నది సత్యదూరంకాదు. కాబట్టి ఆ చట్టాన్ని ప్రజలు ఆదరించాలి. ప్రేమించాలి. అప్పుడే తెలుగు భాష కూడా ఆదరణకు నోచుకుంటుంది.

ఈ మధ్య అధికార భాషా సంఘం 'ఆంగ్లపదం లేకుండా తెలుగులో మాట్లాడండి' అని ఒక నూతన ప్రక్రియను ప్రారంభిస్తే అది బహుళ ప్రజాదరణ పొంది కొన్ని ప్రసార మాధ్యమాల వాళ్ళుకూడా అనుసరించి సామాజిక ప్రయోజనాన్ని అందించటానికి ప్రయత్నిస్తున్నారు. వారికి అభినందనలు తెలియజెయ్యకుండా ఉండలేం. అయితే దీని మూలంగా లాభం ఏమిటి అన్న విమర్శ కూడా లేకపోలేదు. లాభం ఏమిటో పైన చెప్పాను. ముందు భాషమీద ప్రేమ కలిగించడానికి పూనుకోవడం. ఈ ప్రక్రియద్వారా మనం మాట్లాడే భాషలో ఎన్ని ఇతరాలు ఉన్నాయో తెలుసుకుని కించిత్తు చిన్నతనంగా భావిస్తే, అందులో నుంచి తెలుగుభాషా సేవకు 'నేను సైతం' అన్న ఉన్నతమైన ఆలోచన ఆయా వ్యక్తుల్లో కలుగుతుందని ఆశ! అది నిరాశే అంటే అధికార భాషా సంఘం అజాగళస్తనంతో సమానం అన్న వారింట్లోనే వీరికీ ఒక గది కేటాయించడం తప్ప ఏం చేయగలం!

మానవుడు ఆశాజీవి! భాష చచ్చిపోతోందని విమర్శించడం కంటే ఇలా బతికించవచ్చు అని సూచించిన వ్యక్తి గొప్పవాడు. ఎందుకంటే అరవై సంవత్సరాల క్రితం తెలుగు భాష మీద మమకారంతో నేగా ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రారంభమయ్యింది. షష్టిపూర్తి ఇష్ట పూర్తిగానే జరిగింది కాని కష్టంగా పూర్తి కాలేదు గదా. ఈ అరవయ్యో వేడుక ఎందరో అజ్ఞానాంధకార జీవులకు వెలుగు చూపాలి. తెలుగు భాషను కాపాడే రీతిలో నాది ఈ నీతి అని ప్రతి తెలుగువాడూ పూనుకోవాలి.

ఆ రోజు వచ్చిందనే నేను నమ్ముతున్నాను. తెలుగు భాషకు జరుగుతున్న అన్యాయం మేధావులు గుర్తించాలి. ఒక పేదవాడి రోదన కంటే ఒక మేధావి మౌనమే చాలా

ప్రమాదం. అందుకే మేధావులందరినీ కోరుతున్నా.... ఇలాచేస్తే తెలుగు భాషను ఇంకా అభివృద్ధి చెయ్యవచ్చని సూచించండి. సూచించే హక్కు తప్ప శాసించే హక్కులేని ఈ అధికార భాషా సంఘానికి మీ సూచనలు కొత్త టానిక్‌లాంటివి.

ఒకరు ప్రారంభిస్తే మొదలయ్యింది కాదు ఆంధ్ర మహాసభ, ఒకరు ప్రారంభిస్తే ప్రారంభమయ్యింది కాదు ఆంధ్ర సారస్వత పరిషత్తు. అందుకే అందరి ఆశీస్సులు తెలుగు భాష కోరుకుంటోంది. అందరి సహకారం కోరుకుంటోంది.

కలంపట్టిన ప్రతివ్యక్తీ ఒక సిరాచుక్క తెలుగు భాషాభివృద్ధికి వాడితే...ఇంతింతై వటుడింతై అన్నట్లుగా మళ్ళీ తెలుగుభాష గత వైభవాన్ని సంతరించుకుంటుంది ఆ రోజు కోసం ఎదురుచూస్తూ....

జానపద సాహిత్యం - కొన్ని భాషా విశేషాలు

డా. నాయని కోటేశ్వరి

భాషలో ఏకత్వం ఎంత ముఖ్యమో వైవిధ్యం కూడా అంతే ముఖ్యం. ఈ వైవిధ్యం సాంఘిక భేదాలను ఆశ్రయించీ, ప్రాంతభేదాలను ఆశ్రయించీ ఉంటుంది. కాలక్రమంలో భాషలో వచ్చిన మార్పుల వల్ల ఈ భేదాలు ఏర్పడతాయి. ప్రజల వ్యవహారంలో ఉన్న ఏ భాషా వైవిధ్యం లేకుండా లేదు. మానవ నిర్మితమైన ఈ భాషా నిర్మాణంలో మార్పు సహించే లక్షణం ఉంది, కాబట్టి మార్పు జరుగుతూ ఉంది. భాష నియత లక్షణం కలిగి ఉంటుందంటారు. అయినా ఉచ్చారణలోనూ వ్యాకరణం లోనూ ఈ నియతి తప్పినప్పుడు కూడా అర్థావబోధనకు ఆటంకం కలగని సందర్భాలున్నాయి.

భాషా వైవిధ్యానికి కారణమయిన అనేక ప్రమాణాలలో చదువు ఒకటి. చదువుకున్నవారి భాషకు, చదువురాని వారి భాషకు భేదం ఉంటుంది. ఇదే విధంగా లిఖిత సాహిత్యభాషకూ, మౌఖిక సాహిత్యభాషకూ కూడా భేదం ఉంటుంది. మౌఖిక సాహిత్యాన్ని జానపదసాహిత్యమంటున్నాం. ఈ సాహిత్య స్రష్టలు జానపదులు. చదువుకున్నవారు కారు. చదువుకున్నవారి ఉచ్చారణకు, జానపదులు ఉచ్చారణకు భేదం ఉంటుంది. సాంఘిక ప్రాంతీయ మాండలికాలలో ప్రధానంగా గుర్తించదగిన భేదం ఉచ్చారణకు సంబంధించినదే. ఒక్కొక్క మాండలికంలో ఒక భావాన్ని వ్యక్తం చేయడానికి భిన్న పదాలు ఉండవచ్చు. వీటి సంఖ్యకొంత పరిమితంగానే ఉంటుంది. కాని ఒకే పదాన్ని వాడుతున్నా దాన్ని ఒక్కొక్క మాండలికంలో ఒక్కొక్క విధంగా ఉచ్చరించడం కనిపిస్తుంది.

జానపదుల పాటలను ఇప్పుడు రికార్డు చేస్తున్నాం. పాటలే కాదు ఇతర సాహిత్య ప్రక్రియలను కూడా రికార్డు చేయడమూ, ప్రచురించడమూ జరుగుతూ ఉంది. జానపద సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూ ఉంది. ఆ సాహిత్యంలోని సాంఘికాంశాలను, సాహిత్యాంశాలను అధ్యయనం చేస్తున్నారు. సామెతలు, జాతీయాలు, కథన విశేషాలు, ప్రదర్శనా రీతులు, సంగీత సాధనాలు,నమ్మకాలు గ్రామ దేవతలు మొదలయిన అంశాలుపరిశోధనా వస్తువులవు తున్నాయి. జానపద సాహిత్యానికి సంబంధించిన ప్రతి అంశమూ అధ్యయనం చేయవలసినదే.

జానపద సాహిత్యంలోని భాషా విశేషాల అధ్యయనం ఈపరిశోధనలలో ఒకప్రధాన అంగం. భాషా పరిశీలనకు జానపద సాహిత్యం చాలా ఆసక్తి దాయకంగా ఉంటుంది. ఉత్పత్తి తెలియని ఎన్నో దేశ్య పదాలు జానపద సాహిత్యంలో కనిపిస్తాయి. నిమాళము (పాడె), పెనిమిటి (భర్త), తబుకు (పళ్ళెము), చిలుకు (గొళ్ళెము), మొదలయినవి ఉదాహరణలు.

మాటలను ప్రకృతి ప్రత్యయాలుగా విభజించడం కూడా కొన్ని సందర్భాలలో క్లిష్టంగా ఉంటుంది. దాసంగం, ఉల్లిత్తు, వుబ్బట్లు వంటి మాటల్లో ఇటువంటి విభజన కష్టం.

మన వ్యాకరణాలలో కృత్తిద్ధిత ప్రత్యయాలనెన్నిటినో చెప్పారు. అయినా జానపదభాషలో కొత్తప్రత్యయాలు కనిపిస్తూనే వుంటాయి. వాలవలో 'వ', మసుగురు 'రు' మందు పొందులలో 'దు' ప్రత్యయాలు. పందిరిలో 'ఇరి' జంగిడిలో 'ఇడి' ప్రత్యయాలు. వ్యాకరణాలలో చెప్పిన ప్రత్యయాలనే భిన్న ధాతువుల మీద ప్రయోగించడం కూడా కనిపిస్తుంది. శాతుబడి, పోలిమి, కొలిపిడి అన్న మాటలలో ఇటువంటి ప్రయోగం చూడవచ్చు.

ప్రాచీన కావ్యభాషలో అన్యదేశ్య పదాల సంఖ్య చాలా తక్కువ. ప్రబంధయుగం తర్వాత అన్యదేశ్యాల

వాడుక కొంత పెరిగింది. జానపద సాహిత్యంలో అన్యదేశ్యాలను యధేచ్ఛగా ప్రయోగించారు. ఫార్సీ, అరబ్బీ, ఉర్దూ, ఇంగ్లీషు, పోర్చుగీసు, మరాఠీ, హిందీ, తమిళం, కన్నడం మొదలయిన దేశ విదేశ భాషలనుండి ఎన్నో పదాలు జానపదవాఙ్మయంలో చేరాయి. పడు, ఉండు, ఉంచు వంటి అనుబంధాలతో అన్యదేశ్యపదాలను క్రియలుగా వాడడం కనిపిస్తుంది. ఉదా: హయిరాను చేయు, ఖుషాల పడు, పర్వా ఉండు, పర్వా ఉంచు మొ॥వి. ఇంచు ప్రత్యయం చేరి క్రియలుగా ప్రయుక్తమయిన మాటలెన్నో ఉన్నాయి. ఉదా: అటకాయించు, సముదాయించు మొ॥వి.

దేశ్య శబ్దాలతో అన్య దేశ్యాలు కలసి ఏర్పడిన సమాసాలు కూడా ఉన్నాయి. ఉదా: నమ్మక హరామ్. నమ్మకం అన్నది తెలుగుమాట. హరామ్‌తో దీనికి సమాసం చేయడం జరిగింది. విశ్వాస ఘాతకుడని అర్థం. ఈ నమ్మక శబ్దానికి నమక్ 'ఉప్పు' అని అర్థం చెప్పుకోవడం జానపద నిరుక్తి.

దేశ్యపదాలు, తత్సమపదాలు కూడా అనేక వికృతులు పొంది కొన్ని సందర్భాలలో గుర్తుపట్టకుండా తయారవడం కనిపిస్తుంది. బల్లెము అనే మాటకు బల్లియము అన్న రూపాంతరం ఉంది. జానపదభాషలో బల్యము అన్న రూపం కూడా ఉంది. హారం అంటే దండ. ఆహారమనే మాట హారమనే రూపం పొంది జానపద భాషలో ఆహారమన్న అర్థంలోనే ప్రయుక్త మయింది. ఉచ్చారణలో ఆహారం, హారమయిందన్న మాట.

ఆధారము (ఆదరువు) అన్నమాట భస్మం అన్న అర్థంలో ప్రయుక్తమయింది. తత్సమపదాలు వాటి నైఘంటికార్థంలోకాక కొత్త అర్థాలలో వాడడం జానపద భాషలో విస్తారంగా ఉంది. కర్మి అంటే కర్మచేసేవాడు కాని, దుష్టుడు అన్న అర్థంలో ప్రయుక్తమయింది. సామాన్యము అన్నమాట బలం అన్న అర్థంలో ప్రయుక్త మయింది.

కొన్ని నామవాచకాలు బహువచన ప్రత్యయంతోనే జానపద భాషలో కనిపిస్తాయి. అగ్గజములు, అవుస్తలు దూపలు వంటివి. తడవళ్ళువంటి మాటల్లో ఏకవచన రూపాన్ని వేరుచేయడం కూడా కష్టమే.తడవళ్ళకు ఏకవచన రూపం తడవరియా? తడవడియా?

ద్విరుక్త టకారంతో కూడుకొన్న మాటలు, బట్ట, తట్ట, కట్ట వంటి వాటి బహువచన రూపాలు బట్టలు, తట్టలు , కట్టలుగా ఉండాలి. అయితేజానపద గేయాలలో బట్ట+లు = బట్లు వంటి రూపాలు కనిపిస్తాయి. చెట్టు+లు = చెట్లు మొదలయిన చోట్ల జరిగిన ప్రక్రియయే ఇక్కడా జరిగింది .

క్రియాపదాలలో కూడా అనేక మార్పులు కనిపిస్తాయి. 'దూయు' ధాతువు క్త్వార్థకరూపం ' దూసి'. కాని జానపదభాషలో 'దుస్సి' అనే రూపం కూడా కనిపిస్తుంది. ఇక్కడ హల్లు ద్విరుక్తం కావడమూ పూర్వాచ్చు హ్రస్వం కావడమూ జరిగింది. వాడుకభాషలో చేయడం, చెయ్యడం వంటి పర్యాయ రూపత ఉంది. కాని అసమాపక క్రియలలో సకార ద్విరుక్తత సాధారణం కాదు. ఇటువంటి విశేష ప్రయోగాలు జానపద గేయాలలో అధికంగా కనిపిస్తాయి.

జడియుకు వ్యతిరేక రూపం జడవక, దీని వ్యతిరేక విధిరూపం జడవకు. జానపదగేయాలలో ఇందులో వకారంలోపించి జడకు అన్న ప్రయోగం కనిపిస్తుంది.

ఒకే అర్థాన్నిచ్చే రెండు మాటలతో సమాసం జానపద గేయాలలో విస్తృతంగా కనిపిస్తుంది. ఇటువంటి సందర్భాలలో సాధారణంగా ఈరెండుమాటలూ రెండు భాషలకు చెందినవిగా ఉంటాయి. ఏకభాషా పదాలతో కూడా ఇటువంటి సమాస పదాల కూర్పు జానపద సాహిత్యంలో అరుదేమీ కాదు.

ద్వార వాకిలి, ద్వారవాకిళ్ళు లో ద్వారం తత్సమం, వాకిలి దేశ్యం, సంస్కృత దేశ్యపదాలతో సమాసం జరిగింది. రెండు మాటలకూ అర్థం ఒకటే. తల శిరస్సు,

క్షత్రియ గొడుగు(క్షత్రియ - ఛత్ర/ఛత్రి), వ్యాఘ్రపులులు, సప్తమేడలు, వంటి సమాసాలు సంస్కృతాంధ్ర మిశ్రాలు. తఖ్తుబల్ల, జాబు కమ్మలు, గాడి బండ్లు, జాడపత్తులు మొదలయినవి అన్యదేశ్యపదాలు దేశ్యపదాలతో మిశ్రమైనవి. తాలుపొల్లు, సగ్గొమ్ములు, నూనెసమురు, లావు సత్తువ వంటివి రెండు మాటలూ దేశ్యాలు కాని, ఒకటి దేశ్యమూ మరొకటితద్భవమూ కాని అయినవి. రూపాకారం, కష్టబాధ, మృగ జంతువు వంటివి రెండూ తత్సమ పదాలే అయినవి. ఆ రెండి అడవి, దగా దూప మొదలయినవి రెండూ తద్భవాలే అయినవి. బాసప్రమాణాలు వంటివి తద్భవ తత్సమ మిశ్రాలు.

జానపద సాహిత్యంలో సమాస నిర్మాణం విశిష్టంగా ఉంటుంది. సాధారణంగా మనం విశేషణంగా వాడని నామపదాలు ఇక్కడ విశేషణాలుగా ప్రయుక్తమవుతాయి. ఉదాహరణకు పగ శబ్దంతో దళం అన్న తత్సమ పదాన్ని కలిపి పగదళం అని సమాసం చేశారు.

కొన్ని పదబంధాలు జాతీయాలయి పోయాయి. అటువంటి వాటిలో ఇంటిదీపం ఒకటి. ఇంటిదీపం అంటే మగబిడ్డ అని అర్థం. దీనికి తోడు పరఇంటిదీపం అన్నమాట ఏర్పడింది. పరఇంటి దీపం ఆడుబిడ్డ. కూతురయితే పెళ్ళిచేసుకొని మరోయింటికి వెళ్ళి ఆ యిల్లు చక్కబెడుతుంది. కాబట్టి ఆమె పర ఇంటి దీపం.

క్రియా పదాల వాడుకలో కూడా ఎన్నో విశేషాలు కనిపిస్తాయి. పగతీర్చుకొను అన్న అర్థంలో పగలిచ్చు అని ప్రయోగించారు. దూషగించు, దుఃఖసిల్లు, దుఃఖపోవు, రాగడిల్లు, పూర్వించు వంటి అపూర్వ ప్రయోగాలు జానపద సాహిత్యంలో కనిపిస్తున్నాయి.

దేవతలు మానవుల కంటే ఎంతో అధికులని జానపద భావన. దేవతలకు సంబంధించినవన్నీ గొప్పవే అయి వుంటాయి. పరిమాణంలో పెద్దవయి ఉంటాయి. దేవశబ్దానికి పెద్ద అన్న ఈ అర్థం జానపదుల కల్పనయే. దీన్ని విశేషణంగా వాడి వస్తుతత్వాన్ని బోధించే ప్రయత్నం చేశారు. దేవదివాణం అంటే పెద్ద దివాణం. దేవదూరం అంటే చాలా దూరం. దేవదుర్గం అంటే పెద్దకోట.

కనక శబ్దం కూడా ఇటువంటిదే కనకం అంటే బంగారం. బంగారం విలువైనది. శ్రేష్ఠమయినది. కాబట్టి ఒక వస్తువు శ్రేష్ఠమయినది, పెద్దది, గొప్పది అని చెప్పడానికి కనక శబ్దాన్ని విశేషణంగా వాడారు. కనక డేరాలు, కనక తప్పెటలు, కనక నివ్వాళి, కనక తాంబూలము, కనక తరువులు, కనక మేడలు, కనక బాణాలు మొదలయినవి ఇటువంటివే.

చిలుక ఆకుపచ్చగా ఉంటుంది కాబట్టి ఆకుపచ్చని వస్తువులకు విశేషణంగా చిలుక శబ్దాన్ని ప్రయోగించారు. చిల్క తాళిహారము, చిల్కతుర్వాయి, చిల్కతాళీలు మొదలయినవి.

ఇటువంటిదే బారా శబ్దము. ఎత్తయిన, పొడవైన, విశాలమయిన అన్న అర్థాలలో దీనికి ప్రయోగం కనిపిస్తుంది. బారాకోడి, బారాగుర్రం, బారాచాప , బారా సావిటి మొ॥నవి.

కొలతలకు శరీరావయవాలను వాడడం సహజమే. జానెడు, బెత్తెడు, మూరెడు, పిడికెడు, జిట్టెడు ఇవన్నీ జానపద సాహిత్యంలో కనిపించేవి. బారెడులోని బారఅన్నిటిలోనూ పొడుగయినది. ఇదే విశేషణమై బారాకోడి వంటి ప్రయోగాలలో కనిపిస్తుంది.

పరభాషకు మరుభాష అన్న ప్రయోగం కనిపిస్తుంది. లింగ్విస్టిక్ సిస్టమ్‌కు భాషాయంత్రమని వాడడం ఆశ్చర్యకరం.

పదాలలో ఎన్నో ధ్వని పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఉచ్చారణలో వైవిధ్యం ఎన్నో మార్పులకు కారణమవుతుంది.

వర్ణసమీకరణం :

కంబడి - కమ్మడు

మంచె - మచ్చె

అర్ధమరాత్రి - అద్దమరాత్రి

అక్షయపాత్ర - అచ్చపాత్ర

వర్ణవ్యత్యయం :

గుండె బగులు - గుండెబలుగు

పగల జీరు - పలగజీరు

గుబులు - బుగులు

వర్ణాగమం :

అండము - అండ్లము

నాథుడు - నాదరుడు

ధరించు - ధరణించు

కంఠము - కండ్లము

లోపదీర్ఘత :

అహమిక- ఆమిక

వివరము - యీరము

బియ్యము - బీము

స్వరభక్తి :

ఏబ్రాసి - ఏపరాసి

రక్తము - రగతము

చంద్రవంకలు - చందుర వంకలు

ఆర్తి - ఆరితి

జానపద సాహిత్యాల్లో కృతక ప్రామాణిక రూపాలు కూడా ఎక్కువగానే కనిపిస్తాయి. ఎకారాది పదాలను వకారాది పదాలుగా చేయడం మహాప్రాణాలు కాని వాటిని మహాప్రాణాలు చేయడం, ఒత్తి పలికే ప్రయత్నంలో హకారాన్ని చేర్చటం కనిపిస్తుంది.

ఉదా : ఎగతాళి - వెగతాళి

తాంబాళము - స్థాంబాళము

ఎముకలు - వెంకలు

గుడారములు - గుడహార్లు

గుర్రాలు - గురహాలు

వ్యుత్పత్తి తెలియక పోవడం వల్లకొన్ని మాటలలో అక్షరాలను మార్చి కొత్త వర్ణక్రమాన్ని ఏర్పరచడం కూడా జానపదులకు మామూలే. ఆ పద్ధతిలోనే వింజామర ఇంజామణి అయింది.

స్వాతిమొగులు - చేటమొగులు

వ్యాఘ్రము - యాగ్రుహం

స్నానపానములు - స్థానపానములు మొ॥వి ఇటువంటివే.

అర్థపరిణామం కూడా భాషా పరిణామంలో ఒక భాగం. జానపద సాహిత్యంలో కూడా అర్థ పరిణామం పొందిన పదాలు కనిపిస్తాయి. 'పండించు' అన్న క్రియను పంట పండించు అన్న అర్థంలో వాడతాం. కాని జానపద గేయాలలో దహనం చేయు అన్న అర్థంలో ఈ క్రియను వాడారు. ఇక్కడ ఈ పదానికి అర్థాపకర్ష కలిగింది. లక్ష్మీవిలాసం అంటే పందిరిమంచం. లక్ష్మీ విలాసుడయిన శ్రీ మహావిష్ణువు శయ్య ఆది శేషుడు. ఆది శేషుని వంటి పానుపు అన్న అర్థంలో పందిరి మంచాన్ని లక్ష్మీవిలాసం అన్నారు.

కడుపుబోయు అంటే పొట్టపోసికోవడం, ఎలబోవు అంటే పెండ్లాడడం, శతమానం అంటే మంగళ సూత్రం, చావుపుండు అంటే రాచపుండు లేదా రాచ వ్రణం, కాన్సరు.

జానపదులు ఎన్నో కొత్త పదాలను కల్పించారు. సంతానం అనడానికి సంక సాటు అన్న మాటను కల్పించారు. ఏక సంతానం అనడానికి ఒంటి నలుసు అన్నారు. పరవారి దీపం అంటే ఆడపిల్ల. ఇంటి దీపం అంటే మగపిల్లవాడు. కూటముచేయు అంటే సంభోగించు. కైకలి అంటే మత్తు. యత్నంచేయు అన్న మాటను మోసం చేయు అన్న అర్థంలో ప్రయోగించారు. ప్రవతిబెట్టు అంటే నమస్కరించు అని అర్థం. లేఖను వ్రాలాకు అని అనువదించారు. పూజారిని వేల్పులోడు అన్నారు. గాజులు పెట్టడం అంటే సీమంతం చేయడం.

జానపద గేయాలలో అన్యదేశ్యాలను అనువాదం చేసుకున్న సందర్భాలు కూడా ఎక్కువే.

ammunition boxes	-	మందులపెట్టెలు
witness box	-	ధర్మ పెట్టె
witness table	-	ధర్మ బల్ల
brassiere	-	రొమ్ము చిప్పలు
cartridge cases	-	గుండ్ల తిత్తులు
living room	-	మనుసాల
maiden war	-	కన్నెకయ్యం

వీటిలో కొంత ప్రతిపదానువాదం ఉన్నప్పటికీ అనువాదం చేసుకోవడంలో జానపదుల ప్రతిభ ద్యోతకమవుతుంది. నూతన పద కల్పనకు ప్రయత్నించ కుండా అన్యదేశ్యాలను యధాతథంగా వాడుతున్న మనకంటే జానపదులు భాషాసంపద అభివృద్ధికి మేలైన కృషి చేస్తున్నారనడంలో విప్రతి పత్తి లేదు.

జానపద సాహిత్యంలో ఆంధ్ర దేశంలో ధరించే నగల పేర్లు, పండే పరిధాన్యంలోని రకాలు, యుద్ధాలలో ఉపయోగించిన ఆయుధాలు, నోచుకొనే నోములు, ఆడుకునే ఆటలు, వాయించే వాద్యాలు విస్తృతంగా వర్ణితమయ్యాయి.

నగల పేర్లు చూడండి :

పులుగు పూసల పేరు
గిరిగాజులు
కర్ణ పువ్వులు
కుంటెన కుచ్చులు
నాగబంధపు సరాలు
చంద్ర సూర్యుల జోడు
గిలక సరిపేడులు
ముంగా మురుగులు
అనంత గంటీలు మొ॥వి.

వడ్లలో రకాలు చూడండి :

నిక్కపచ్చడాలు
మల్లె సన్నాలు
నీలకంటెలు
రాజసరులు
గౌరి కుంకుమలు
చిటి కిన్నెరలు
రామ సాగరాలు
కృష్ణ ప్రయాగలు
చిట్టి మల్లెలు మొ॥వి.

చిగురు కండెలు, ముక్కమ్మ కుంతములు, చందురు వంకలు, చీకటి మిణుగుర్లు, వంకిణీలు, కొంగవాక కత్తులు, గన్నెరీటెలు, చిప్ప కత్తులు మొ॥వి ఆయుధాలు

మనవారు నోచుకొనే నోములు ఎన్నో .

ఏకబాణ నోము
విష్ణుకాంత నోము
సంధ్యావర్తినోము
కామేశ్వరి నోము
కేదార గౌరి నోము
కేదారేశ్వర నోము
అట్ల తద్దె నోము
దేవగిరి నోము
చెన్న కేశవ నోము
చల్ల చిత్తనోము
గరుడ పంచమినోము
పచ్చవిల్లను వ్రతము
గజనిమ్మ నోము
మూగనోము మొ॥వి.

గుంతమాడలు, చతురుచాల, పోకలాట మొ॥వి ఆటలు

చీర లెన్నో రకాలు. చీమకండికల చీర, కోట

బొమ్మంచు చీర, ముంత సరిగ చీర, హంసల చీర, గంగసరాల చీర, ముళ్ళ చీర, కరకంచు చీర మాంధాళి చీర మొ॥వి. రవికలూ పలురకాలు. పూసల రవికె, బొందె రవికె, గొల్లపోత రవికె, అద్దకం రవిక, పసరుమొగ్గల రవికె మొ॥వి.

ఆవులకు, ఎద్దులకు , గుర్రాలకు పేర్లు పెట్టుకొని పిలచుకొనే వారు. చంద్రిక, లేతమామిడి, కల్ప వృక్షము, ఆకాశ గంగ మొదలయినవి ఆవుల పేర్లయితే పున్నమ చంద్రుడు, గేదంగి రేకు, నడిమింటి డేగ,సంపెంగ పూవు మొదలయినవి గుర్రాల పేర్లు.

తెలుగువారి జీవన విధానానికి, సంస్కృతికి అద్దం పడుతుంది జానపద సాహిత్యం. అట్లాగే తెలుగువారి జనపదాలలో వాడుకలో ఉన్న తెలుగు భాషా మాధుర్యాన్ని చవిచూడాలంటే జానపద సాహిత్యమే దిక్కు. భాషా ప్రయోగంలో సామాన్యుల అసామాన్యత, కల్పనా చాతురి, సంభాషణా చమత్కారం, వర్ణనా సామర్థ్యం జానపద సాహిత్యంలో వెల్లడవుతాయి. భాషా పరిశోధకులకు తరగని గని జానపద సాహిత్యం.

ధ్వని, అక్షరం, వర్ణం : సమస్యలు, సూచనలు

డా. ఎ. ఉషాదేవి

ప్రతిభాషా సమాజంలోనూ పుట్టి పెరిగే పిల్లలు సుమారు ఒక సంవత్సరం వయసు వచ్చినప్పటినుండీ, ఆరు, ఏడు సంవత్సరాల వరకు ఆయా సామాజిక పరిసరాల భాష(ల)ను సహజంగా నేర్చుకుంటారు. కానీ ఆ పిల్లలే పాఠశాలల్లో చేరి ఆయా భాషల్ని అభ్యసిస్తున్నప్పుడు అవి కష్టంగా ఉన్నట్లు చెప్తుంటారు. అంటే సామాజికంగా సహజంగా అబ్బే భాష(ల) కూ, పాఠశాలల్లో కానీ ఇతరత్రా కానీ ప్రణాళికా బద్ధంగా నేర్పే / నేర్చే భాషకూ మధ్య ఏవో తేడాలున్నా యనీ, వాటివల్లనే ఆ కష్టం ఏర్పడుతోందనీ అర్థం అవుతుంది. మాట్లాడే భాషలకు సంబంధించి రెండు నైపుణ్యాలనూ, రాసే భాషకు సంబంధించి మరో రెండు నైపుణ్యాలనూ కలిసి, లిఖిత రూపాలున్న భాషలకు "నాలుగు నైపుణ్యాలను" సంపాదించాల్సి ఉంటుందన్న మాట. 'అక్షరాస్యత' ప్రధానంగా ఈ నైపుణ్యాలను సంపాదించ టానికి సంబంధించిందే.

ప్రపంచవ్యాప్తంగా మాట్లాడే భాషలు వేల సంఖ్యలో ఉన్నప్పటికీ, లిఖిత భాషలు మాత్రం చాలా కొద్ది సంఖ్యలోనే ఉన్నాయి. ఉదాహరణకు ద్రావిడ భాషా కుటుంబంలో ఇరవై నాలుగు భాషలున్నా, లిఖిత రూపాలున్నవి నాలుగైదు మాత్రమే. వాటిలో తెలుగు కూడా ఉందని వేరే చెప్పాల్సిన పనిలేదు. లిఖిత భాషలు మౌఖిక భాషల కన్నా "అభివృద్ధి" చెందినవిగా వర్ణించటం పరిపాటి. దీనికి ఆరు ముఖ్యమైన కారణాలున్నట్లు Olson పేర్కొన్నారు. (Olson, David, 1994 - P 3-7) అవి:

1. రాయటం మాట్లాడే భాషకు ప్రతిలేఖనం (writing is the transcription of speech)
2. మాట్లాడే భాషకన్నా రాసే భాష ఎక్కువ. (The superiority of writing to speech)
3. అక్షర మాలా విధానంలో రాయటం సాంకేతిక ఔన్నత్యం (The technological superiority of the alphabetic writing system)
4. సామాజిక ప్రగతిలో అక్షరాస్యత ప్రధానాంగం (Literacy as the social organ of social progress)
5. సాంస్కృతిక, శాస్త్రీయ అభివృద్ధి పరికరంగా అక్షరాస్యత (Literacy as an instrument of cultural and scientific development)
6. జ్ఞానాభివృద్ధి పరికరంగాఅక్షరాస్యత (Literacy as an instrument of cognitive development)

ఇలాంటి వాదనలతో లిఖిత భాషలూ, సమాజాలూ మిగిలిన వాటికన్నా అభివృద్ధి చెందిన వనే అభిప్రాయాలు ఎక్కువ ప్రాచుర్యం పొందినప్పటికీ, అది నిజంకాదనే వాదనలూ ఉన్నాయి. (Levi-Strauss, 1961; Clanchy, 1979) ఈ వాదన ఒక రకంగా నిజమేననిపిస్తుంది కూడా. ఎందుకంటే ప్రాచీన గ్రీకు, సంస్కృత సంప్రదాయాలు ప్రధానంగా మౌఖికమైనవే కావన్నది సత్యమే నని చెప్పాల్సిన అవసరం లేదు కదా! అరిస్టాటిల్, ప్లేటో కూడా ఇదే విషయాన్ని గుర్తించారు. [1]

మాట్లాడే రాసే భాషల మధ్య భేదాలపై ఇంగ్లీషులో చాలా పరిశోధనలు జరిగాయి. (Ong, 1982; Finnegan, 1982). తెలుగు భాషపై చేకూరి రామారావు గారు (2001) కొన్ని ముఖ్యమైన భేదాలను గుర్తించి ప్రతిపాదించారు. మున్ముందు ఈ రంగంలో జరగాల్సిన పరిశోధనలకు ఇవి స్ఫూర్తినిస్తాయి.

మాండలిక, ప్రామాణిక భేదాల పైన భద్రిరాజు కృష్ణమూర్తిగారి ప్రతిపాదనలే (1962, 1974, 2000) నేటికీ స్వీకార్యంగా ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి పదాల క్షేత్ర పర్యటనల సర్వే ఆధారంగా ఆయనతెలుగు

మాండలికాలను వర్గీకరించారు. ఇప్పటికీ ఈ అంశాలపై ఆవిధమైన శాస్త్రీయ పద్ధతులలో పరిశోధనలేవీ (40 ఏండ్లుగా) రాలేదు, ఆయన వర్గీకరణను సమర్థించేం దుకైనా, పునర్వ్యవస్థీకరించేందుకైనా.

తెలుగు అకాడెమీ కృషిలో భాగంగా జిల్లా మాండ లికాల పైనా తెలుగు ధ్వని, లిపి సంబంధంపైనా బూదరాజు రాధాకృష్ణ (1990)గారి పరిశీలనలూ, వ్యాఖ్యలు కూడా ఈ రంగంలో విస్తృత కృషికి ప్రేరేపిం చేవే. అలాగే తెలుగులో ధ్వని, లిపి పరిణామాలపై తిరుమల రామచంద్ర(1957)వడ్లమూడి గోపాల కృష్ణయ్య (1956)గార్ల కృషి దాదాపు అర్ధశతాబ్దం గడిచినా కూడా భాషాధ్యయనం చేసే వారికి తప్పకుండా విలువైన సమాచారాన్ని ఇస్తాయి. వాటిలో కొన్ని ఆలోచనలు భాషా శాస్త్రపద్ధతులకు భిన్నమైనప్పటికీ, అది ప్రస్తుత వ్యాస పరిధిలోకి రానందువల్ల వదిలివేయటం జరుగుతోంది.

ఇటీవలి కాలంలో తెలుగు భాషా సాహిత్య రంగాల లోని చాలా మంది ప్రముఖులు తెలుగు భాషలోని వివిధ అంశాలపై ముఖ్యంగా ధ్వని, లిపి, ఉచ్చారణ, లేఖన విధానాలపై చేసే వ్యాఖ్యలలో, పరిశీలనల్లో, సూచనల్లో వ్యక్తమయ్యే వైయక్తిక అభిప్రాయాలు కొన్ని శాస్త్రీయ పద్ధతులకు భిన్నంగా కనిపిస్తాయి.[2]

ఈ వ్యాసం రాయటానికి నన్ను ప్రేరపించిన అంశాలు కొన్ని . 1. రేడియో, టి.వి. సినిమా మొదలైన ప్రసార మాధ్యమాలలోని ప్రముఖుల, కార్యక్రమ నిర్వాహకుల ఉచ్చారణల్లో లోపాలు ఉన్నాయన్న వాదనను అంగీకరిస్తే ఆ లోపాలేమిటి? ఎందువల్ల అలా జరుగుతోంది? వాటిని సవరించి సరియైన ఉచ్చారణ కోసం ఏం చేయాల్సి ఉంటుంది? అన్న విషయాలు గుర్తించటం.

2. ఒకటో తరగతి నుండి ఇంటరు వరకు తెలుగును పాఠ్యాంశంగా చదువు తున్నప్పుడు విద్యార్థుల ప్రశ్న పత్రాల సమాధానాలలోను ఉక్త లేఖనాల్లోనూ ఏ 'దోషాలు' ఎక్కువగా కన్పించాయో (అనూరాధ 1992, విజయశ్రీ 2003). స్నాతకోత్తర సిద్ధాంత వ్యాస రచనా స్థాయిలో కూడా తెలుగు ప్రత్యేక అంశంగా చదివివచ్చిన విద్యార్థులు కూడా ఇంచుమించు అవే 'దోషాలు' చేయటం కనిపిస్తోంది. గత 15, 20 ఏళ్ళుగా వీటిని గమనించటం జరిగింది. ఆ దోషాలు ఏమిటి? ఎందువల్ల అలా జరుగుతున్నాయి అన్న ప్రశ్నలకు సమాధానాలు వెతకటం.

3. వివిధ పత్రికల్లో అచ్చు తప్పులుగా కొన్ని వదిలేసినా ఎక్కువగా కనిపించే కొన్ని 'లేఖన దోషాలు' ఏమిటో, ఎందువల్ల అవి జరుగుతున్నాయో గుర్తించి ఈ పైన పేర్కొన్న వాటిని సవరించుకొనే మార్గాలేవైనా ఉన్నాయేమో శాస్త్రీయంగా ప్రతిపాదించటం.

పై అంశాలనూ, భాషా సాహిత్యవేత్తలు గుర్తించిన వాటినీ పరిశీలిస్తే, తెలుగు మాట్లాడటంలోనూ రాయటం లోనూ ఉచ్చారణ, లేఖన లోపాలు/ దోషాలు కొన్నింటిని స్పష్టంగానే గుర్తించవచ్చు. (ఉషాదేవి 2002)

మాట్లాడటంలో :

(అ) మహా ప్రాణాలను అల్పప్రాణాలుగా ఉచ్చరించటం కొన్నిసార్లు లేనిచోట మహాప్రాణాన్ని చేర్చటం ఉదా : కటినం (కఠినం), ముక్యం (ముఖ్యం), ఖటిన శిక్ష (కఠిన శిక్ష).

(ఆ) శ, షలలోని తాలవ్య , మూర్ధన్య ఉచ్చారణ భేదాలను ఒక్కటిగానే పలకటం లేదా తారుమారు చేయటం. (వీటిని కొందరు భాషా వేత్తలు ప్రాంతీయ మాండలిక ఉచ్చారణలుగా చెప్తారు. కానీ, వాటికి ప్రాయోగికమైన, సోపపత్తికమైన, సాధికారికత లేదు)

(ఇ) దంత్య (లేదా దంత మూలీయ) తాలవ్య చ, జ లలోని ఉచ్చారణల్లో భేదాన్ని పాటించకుండా ఒకే విధంగా ఉచ్చరించటం (నిజానికి తెలుగు వ్యవహర్తలు ఈ భేదాన్ని సహజంగానే నేర్చుకుంటారు. కానీ ఆధునికంగా పట్టణాలలో ఈ భేదం పాటించటం లేదు)

(ఈ) అనునాసిక ఉచ్చారణలో కనిపించే మూడు భేదాలలో (న, మ, ణ) మూర్ధన్య ణకారాన్ని ఉచ్చరించక

పోవటం.

(ఉ) పదాది ఇ, ఈ, ఎ, ఏ, లను 'య'కారం తోనూ, పదాది, ఉ, ఊ, ఒ, ఓ లను 'వ'కారంతోనూ పలకటం.

(ఊ) 'ళ', ను 'ల' గా పలకటం

(ఎ) దుఃఖం, అంతఃకరణం, మొదలైన మాటల్లోని విసర్గను హల్లుతో కలిపి ద్విత్వంగా పలకటం (దుక్కం దుఖ్ఖం, అంతక్కరణం మొ॥.)

(ఏ) దీర్ఘాచ్చుగా రాసే 'ఆ' ను కొన్ని మాటల్లో కొందరు (ఆ) గా పలకటం, మరికొందరు దీర్ఘంగా పలకటం.

రాయటంలో :

1. ఒత్తులు : (మహాప్రాణం) ఉన్నచోట రాయక పోవటం లేనిచోట ఉంచటం (ఉదా: భోదన (బోధన) భాద / భాధ (బాధ) షష్ఠిపూర్తి (షష్టి పూర్తి) ఉచ్ఛారణ (ఉచ్చారణ)

2. పదాదిన ఇ, ఈ, ఎ, ఏ, లకు బదులు 'య' కారంతో రాయటం. ఉదా: యెవరు (ఎవరు), యిల్లు (ఇల్లు); ఉ, ఊ, ఒ, ఓ లకు బదులు 'వ'కారంతో రాయటం వూరు (ఊరు), వొకరు (ఒకరు)

3. ఋత్వంతో రాసేవాటిని క్రావడితో, క్రావడితో రాయవలసిన వాటిని ఋత్వంతో రాయటం. ఉదా: క్రుషి (కృషి), క్రిష్ణ (కృష్ణ), కౄర (క్రూర)

4. స, శ, షలలో ఒకదానికి బదులుగా మరొకటి రాయటం. ఉదా: మహేష్ (మహేశ్) శీల (షీల), చేశి (చేసి)

5. ఆజ్ఞ, జ్ఞాపకం మొదలైన వాటిని ఆగ్న, గ్యాపకం/ గ్నాపకం అని రాయటం, వాఙ్మయం వంటి మాటల్ని వాంగ్మయం అని రాయటం.

6. విసర్గ రాయవలసిన చోట రాయకపోవటం

ఇవన్నీ ఇవాళ కొత్తగా గుర్తించినవీ కాదు. ఇవి ఇటీవలి కాలం నాటివీ కాదు. శాసనాల కాలంనుండి వీటిలో కొన్నికనిపిస్తూనే ఉన్నాయి. తెలుగు నేర్చుకుని తెలుగు వ్యాకరణ, నిఘంటువులు రాసిన పాశ్చాత్యు లందరూ వీటిని గుర్తించారు (ఉషాదేవి 2001)). శాసన భాషపైన పరిశోధన చేసిన వారూ లేఖన రూపాలలోని భేదాలనూ, దోషాలనూ కూడా పేర్కొన్నారు. (కందప్ప చెట్టి, బూదరాజు రాధాకృష్ణ, రంగనాథాచార్యులు, తెలుగు భాషా చరిత్రలో 1974) ఇటీవల వెలువడ్డ 'మన భాష' పుస్తకంలో రాతలో దొర్లే పొరపాట్లకింద పేర్కొన్నవీ ఇంచుమించుగా ఇవే (చంద్రశేఖరరెడ్డి 2001)

ఈ రకమైన ఉచ్చారణా, లేఖన సంబంధమైన పొరపాట్లో లేక దోషాలో ఎందుకు జరుగుతున్నాయి? వాటిని నివారించడం ఎలా? అనే ప్రశ్నలకు జవాబులు చెప్పుకునే ముందు తెలుగులోని పదావళి గురించీ, తెలుగు భాషా ధ్వని, అక్షర, వర్ణ (phoneme) స్వరూపం గురించీ తెలుసుకోవాల్సి ఉంటుంది.

తెలుగుభాషలో పదావళి (Vocabulary in Telugu):

తెలుగు భాషలోని పదావళి అంతా తెలుగుదే కాదు. శతాబ్దాల పూర్వమే తెలుగులో సంస్కృత, ప్రాకృత పదాలువచ్చి చేరాయి. శాసన కాలంనుండీ లభ్యమవు తున్న లిఖిత రూపాలన్నింటిలోనూ అప్పటికే వ్యాప్తి చెంది కలగలసిపోయిన ఈ పదావళి కనిపిస్తుంది. తర్వాత 13, 14 శతాబ్దాల నాటికి పర్షియన్ అరబిక్ మాటలూ, 17, 18 శతాబ్దులనాటికి ఇంగ్లీషుతో పాటు కొన్ని పోర్చుగీస్, డచ్, ఫ్రెంచ్ మాటలు కూడా తెలుగులో చేరిపోయాయి. ఇవి కాక తమిళ, కన్నడ, ఒరియా, మరాఠీ భాషల పదాలు కూడా తెలుగులో కలిసిపోయాయి. అందువల్లనే కేతన మొదలు కొని చిన్నయసూరి వరకూ, ఆ తరువాతి కాలంలో పాశ్చాత్యులూ, ఆధునిక భాషావేత్తలూ అందరూ కూడా తెలుగు పదావళిని నాలుగైదు భాగాలుగా విభజించి, వర్ణించటం జరుగుతోంది. వీటిలో తత్సమాలంటే సంస్కృత, ప్రాకృత సమాలనీ, తద్భవాలంటే ఆరెండింటి వికృతి రూపాలనీ, దేశ్యాలు 'అచ్చ' తెలుగులూ అసలు తెలుగు మాటలనీ, అన్యదేశ్యాలంటే సంస్కృత ప్రాకృతాలు కాని ఇతర భాషల

మాటలనీ గ్రామ్యమంటే లిఖిత రూపంలోకి అనుమతించబడని వ్యవహారమనీ ఎక్కువమంది ఆమో దించే వర్గీకరణే. అయితే, సంస్కృత, ప్రాకృతాలు కూడా 'అన్య'మే కదా, మరి వాటిని అన్యదేశ్యాలలో ఎందుకు చేర్చలేదనే ప్రశ్న ఉదయిస్తుంది. "వాడుకలోకి వచ్చిన ఉర్దూ, పర్షియన్ పదాలు అన్యదేశ్యాలయినా 'అచ్చ' తెలుగే అయితే, వేల సంవత్సరాలుగా మన భాషను ప్రభావితం చేసిన సంస్కృత ప్రాకృతాలు. ఎందుకు 'అచ్చతెలుగు' మాటలు కావో ......" (రాధాకృష్ణ, 1990 - పు. 94) అని ఆశ్చర్యం ప్రకటించినప్పటికీ, రాధాకృష్ణ గారి లాంటి వారికి అసలు కారణం తెలియదని కాదు. ఎందుకంటే ఏ భాషలోనుండి మరే భాషలోకయినా పదావళి ఆదాన ప్రదానాలు భాషా సంపర్కాల వల్ల జరుగుతాయని అందరికీ తెలిసిందే అయినా, వాటి వల్ల ఆయా భాషలకున్న వ్యాకరణ వ్యవస్థలో అన్యభాషా వ్యాకరణ వ్యవస్థలోని అంశాలు చేరవు. కేవలం పదావళిని తెచ్చుకుని, స్వంతవ్యాకరణంలోకి వాటిని చొప్పించు కుంటారు.

కానీ సంస్కృతం నుండి తెలుగులోకి కేవలం పదావళి మాత్రమే వచ్చి చేరలేదు. వాటితోపాటు సంస్కృత వ్యాకరణ పద్ధతులు కూడా ప్రవేశించాయి. అందుకే తెలుగు "నేర్చుకునే" వారు సంస్కృత సంధులు, సమాసాలు మొదలైనవెన్నో నేర్చుకోవాల్సి ఉంటుంది. అలాగే సంస్కృత ధ్వనులు, ఉచ్చారణలూ కూడా. ఉర్దూ, పర్షియన్ మొదలైన అన్యదేశ్యాలను గురించి "మౌనం వహించిన" (రాధాకృష్ణ పై. పు.94) బాలప్రౌఢ వ్యాకర ణాలలో తెలుగు వ్యాకరణమైన బాలవ్యాకరణం "సంస్కృతమునకు వర్ణము లేబది" అని ప్రారంభ మౌతుంది. అందువల్ల తెలుగు ధ్వని,వర్ణాలకంటే ముందుగా కంటికి కనిపించే తెలుగు అక్షరాల సంగతి చూద్దాం.

తెలుగు అక్షరాలు (Telugu Alphabet) : ఇంగ్లీషు అక్షరాలెన్ని అని అడిగినపుడు ముక్త కంఠంతో '26' అని చెప్పిన ఇంగ్లీషు మీడియంలో తెలుగు పాఠ్యాంశంగా ఒకటో తరగతి నుండి చదివే తెలుగుపిల్లల్ని 'తెలుగులో అక్షరాలెన్ని' అని అడిగినప్పుడు తడబడి, వేళ్ళతో లెక్కిం చటం మొదలు పెట్టి, వాళ్ళల్లో వాళ్ళే వాదులాడుకోవడం నేను స్వయంగా చేసిన పరిశీలనలో జరిగింది. ఋ ఉందని ఒకరు, లేదని మరొకరు ఌ కూడా (ౡ) ఉంటుందని ఇంకొకరు, లేదని మరొకరు - మొత్తం మీద పిల్లలు ముక్తకంఠంతో చెప్పడానికి సరియైన ఒకే సంఖ్య వారికి తెలియదని అర్థం అయింది. కనీసం మేము చదువు కునే రోజుల్లో '56' అని అందరం ఒకే సంఖ్య చెప్పగలిగే వారం. వివిధ రకాల ప్రయోగాలు, సంస్కరణలు, అభిప్రాయాలు చేర్చి తెలుగు పాఠ్య పుస్త కాల రచయితలు, సంపాదకులు తెలుగు అక్షరాలకు ఒక స్పష్టమైన సంఖ్యను నిర్దేశించడంలో విఫలమైనట్లు కనిపిస్తోంది. ఈ విషయంలో చిన్నయసూరి నాలుగు సూత్రాలు రాసారు. సంస్కృతానికి వర్ణాలు 50 అనీ, ప్రాకృతానికి 40 అనీ, తెలుగుకు 36 అనీ, మూడు సూత్రాలలో చెప్పి, నాలుగవ సూత్రం సంస్కృతం నుండి వచ్చి చేరిన అక్షరాలు "సంస్కృత సమంబుల"తో గూడి తెలుగులో వ్యవహరింపబడతా యని స్పష్టం చేశాడు. (బాల వ్యా. సంజ్ఞ 1 -4)అయితే ప్రౌఢవ్యాకర్త 'ఆంధ్ర భాషకు వర్ణము లేబదియైదు" అని నిష్కర్షగా చెప్పాడు. అయినప్పటికీ "బాల వ్యాకరణాన్ని" తెలుగుకు ఉన్న ఒకే ఒక్క వ్యాకరణంగా పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల పండితులు పరిగణించడం వల్ల మిగిలిన వ్యాకరణాలపై సరియైన దృష్టి పెట్టలేదని అర్థం అవుతుంది. సంస్కృత వ్యాకరణ, పరిభాషల ప్రభావాలతోనే తెలుగు వ్యాకరణాలు వచ్చినా, వాటిలో వలె తెలుగులో ధ్వని సంబంధమైన విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపించదు. అయినప్పటికీ, అక్కడక్కడా "దంత్య తాలవ్యంబు లయిన చజలు సవర్ణంబులు" (బాల. వ్యా. సంజ్ఞ -7) అనీ, "యకారంబును వువూవొవోలును తెలుగు మాటలకు మొదట లేవు" (పై. సంజ్ఞ - 17) అనీ ఉచ్చారణ సంబంధమైన విషయాలపై సూత్రాలున్నాయి. చిన్నయ సూరి ఈ సూత్రాలకు ముఖ్యంగా రెండో

సూత్రానికి కారణం పాశ్చాత్య తెలుగు వ్యాకరణ, నిఘంటు కారులు పదాది యకార, వకార ప్రయోగాలను గుర్తించి, అంగీకరించడమే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

కావ్య/గ్రాంథిక భాషకు 56/ లేదా 55 అక్షరాలనైనా తెలుస్తోంది కానీ, వ్యవహార, ప్రామాణిక తెలుగులో ఎన్ని అక్షరాలన్న విషయమే తేలని సమస్యగా మిగిలింది. దీనికి తోడు తెలుగును ద్వితీయ భాషగా నేర్పే భాషా వేత్తలు సంప్రదాయ అక్షరమాలను వదిలి 'రూపసామ్య పద్ధతి'లో అక్షర బోధన ప్రవేశపెట్టారు. ఇలాంటి గందరగోళ పరిస్థితి ప్రపంచంలో ఏ ఇతర భాషల్లోనూ కనిపించదు. రష్యన్, జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్ లాంటి విదేశీ భాషలను నేర్పే భారతీయ విద్యాసంస్థలలో ఏ పాఠ్యపుస్తకాలలోనూ ఆయా భాషలకున్న అక్షరమాలలను భిన్నమైన పద్ధతిలో నేర్పడం కన్పించదు. ఇంగ్లీషులో కూడా రూపసామ్యమున్న అక్షరా లున్నాయి. కానీ వాటిని కూడా ఆ పద్ధతిలో నేర్పడం కనిపించదు.

ఇంతకీ తెలుగులో ఎన్ని అక్షరాలను ఈ ఆధునిక భాషలో గుర్తించి నేర్పాలి? అన్న ప్రశ్నకు సమాధానం అవసరమే. తెలుగుకు వ్యాకరణం రాసిన ఎ.డి. క్యాంబెల్ (1816) తెలుగు నేర్చుకోవాలంటే అక్షరాలూ, గుణింతాలూ అన్నీ కలిపి దాదాపు 81 గుర్తులు నేర్చుకోవాల్సి ఉంటుందని చెప్పాడు. సి.పి. బ్రౌన్ తన నిఘంటువులోనూ, వ్యాకరణంలోను తెలుగు పండితులు అనవసరమైనా, ఎప్పుడూ, ఎక్కడా భాషలో కనిపించని హల్లు గుణింతాలనూ, సంయుక్తాలనూ నేర్పుతూ చాలా సమయం వృథా చేస్తారని విసుక్కున్నారు. భాషల్లో అక్షరాలన్నింటికీ సమాన ప్రతిపత్తి లేదు. కొన్ని అక్షరాలు (లేదా వాటి సంబంధమైన ధ్వనులు) తరచుగా కనిపిస్తే, మరి కొన్ని అరుదుగా కనిపిస్తాయి. ఉదాహరణకు తెలుగులో అత్యంత విస్తృతంగా కనిపించే అచ్చు 'ఉ' దీనికి వచ్చి చేరే గుణమూ, జారిపోయే గుణమూ రెండూ అధికమే. అందుకే అరువు తెచ్చుకున్న అనేక మాటలకు (కొన్నింటిని వదిలేస్తే) 'ఉ' చేర్చి తెలుగు మాటలుగా మార్చుకోవచ్చు. సంధిలో జారిపోయే పూర్వాచ్చు ఎక్కువగా ఇదే. 'ఉ' తర్వాత ఎక్కువగా వచ్చేవి 'అ, ఇ,' లే వీటి తర్వాతే ఎ, ఒ, అచ్చులు. ఎ, ఒ, లతో అంతమయ్యే మాటలను తెలుగులో వేళ్ళమీద లెక్కించవచ్చు. అయినప్పటికీ, తెలుగు రాయటం నేర్పేటప్పుడు అన్ని అచ్చు అక్షరాలూ నేర్పాల్సిందే; వాటి గుణింతాలతో సహా. ఎందుకంటే ప్రాథమిక అక్షరాల కన్నా, అచ్చు గుణింతాల ప్రాచుర్యం భాషలో అధికం. మరి మౌలికంగా అచ్చులు వదిలి, వాటి గుణింతాలు మాత్రమే నేర్పడం చాలా అసహజం. అందుకే, విలియం బ్రౌన్ (1818) తెలుగులో, 'అ, ఆ'లు తప్ప మిగిలిన అచ్చులను తీసివేసి, తన నిఘంటువులో ఇల్లు మొదలైన ఇ, ఈ, ఎ,ఏలతో చూపించాల్సిన మాటలను ఉచ్చారణ విధేయంగా 'య' కారంతోనూ, ఉ, ఊ, ఒ, ఓలతో ప్రారంభమయ్యే మాటలను 'వ'కారంతోనూ చేర్చి చూపినప్పుడు అతని వాదన నిజమే కదా అనిపిస్తుంది. అయితే మరి గుణింతాలు, సంధికార్యాల సంగతేమిటి? వాడు + యెక్కడ 'వాడెక్కడ' అవదు కదా? 'య' లోపాన్ని సూత్రీకరించినా, 'ఎ' రూపం భాషలో అంతకుముందు ఎక్కడా చూపకుండా, ఎక్కణ్ణుంచి తెచ్చి పెట్టడం? ఆ తర్వాత దాని గుణింతమైన ' ె ' ని 'య' కు భిన్నంగా దేనికి సమానమైనదిగా చూపించడం? కేవలం మాట్లాడే భాషకూ అందునా కేవలం 4,5 వేల పదాలకూ పరిమితం కావడం వల్ల విలియం బ్రౌన్ నిఘంటువు లోని అక్షర నిర్దేశం మనల్ని అంతగా బాధించదు. కావ్య భాషను కూడా పరిశీలించిన సి.పి. బ్రౌన్ ఎ.డి. క్యాంబెల్ పదాది 'య' 'వ'ల ఉచ్చారణను గుర్తించినా వాటిని పరిహరించ లేదు. రాసే భాషతో పనేమీ లేదని భావించుకున్న గెలటీ తెలుగుకున్న లిపిని, లేఖనాన్నీ వదిలి, రోమన్ లిపిలో తన నిఘంటువును రాసాడు. అయితే అతను గుర్తించిన ధ్వని భేదాలు ఎంతో విలువైనవి. వాటిని గురించి ధ్వని వర్ణంలో వివరించటం జరుగుతుంది. కావ్యభాషను అభ్యసించి, ఎన్నో కావ్యాలను వెలుగులోనికి తెచ్చిన, అధ్యయనం చేసిన సి.పి. బ్రౌన్ (1852) హల్లులలో స్పర్శాలలోని పరుషాలు సరళాలుగా మారటాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేక (తోవ, దోవ అనీ, కోరు, గోరు అనీ పులి- బెబ్బులి అనీ రెండేసి రూపాలలో తెలుగు మాటలు

కనిపిస్తున్నాయి కాబట్టి తన నిఘంటువులో అవన్నీ కలిపానని చెప్పి, తన నిఘంటువును వర్గాక్షరాలతో (అంటే క, ఖ, గ, ఘ,లు ఒక్కచోట, పఫబభలు ఒక్కచోట) రూపొందించాడు.

అందువల్ల తెలుగు అక్షరాలు నేర్పేందుకై బహుశా కింద సూచించిన పద్ధతిని పాటించవచ్చేమో ఆలోచించాలి.

1. ఒకటో తరగతినుండి పదవ తరగతి వరకు

అచ్చులు : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ఎ, ఏ, ఐ, ఒ,ఓ,ఔ, అం అః = 15

హల్లులు :

క, ఖ, గ,ఘ, ఙ

చ, ఛ, జ, ఝ, ఞ

ట, ఠ, డ, ఢ, ణ,

త, థ, ద, ధ, న

ప, ఫ, బ, భ, మ

య,ర, ల, వ, శ, ష, స, హ, ళ, క్ష = 35

అంటే తెలుగుకు 50 అక్షరాలని తెలిపి, వెంటనే చిన్నయ సూరి రచించిన విధంగా "ఋ, ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ధ,భ, ఙ,ఞ, శ, షలు విసర్గా కూడా సంస్కృత సమ పదాలలో మాత్రమే వస్తాయనీ, కానీ తెలుగులో సంస్కృత పద బాహుళ్యం చాలా ఎక్కువ కాబట్టి వాటిని తప్పనిసరిగా నేర్చుకోవాలని, లేనట్లయితే వ్యవహార నష్టం ఏమీ జరగకపోయినా, భాషకు సంబంధించిన లిఖిత, ప్రామాణిక, అక్షరాస్యతా లక్షణాలను సరిగ్గా నేర్చుకోలేక పోవడం జరుగుతుందనీ వివరించాల్సి ఉంటుంది. వ్యవహారహాని జరుగనప్పుడు అవినేర్చుకోక పోతే ఏం? అనే ప్రశ్నకు ఒక్క భాషకు మాత్రమే సంబంధించి కాకుండా, ఆ భాషా వ్యవహర్తల సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక వారసత్వాల ఉనికిని కోల్పోవడంగా గుర్తించాల్సి ఉంటుందనీ చెప్పాల్సి ఉంది. వ్యవహారంలో అవసరం లేదు కదా అని ఇంగ్లీషు లోని అనేక మాటలకున్న స్పెల్లింగులను ఆ భాషా వ్యవహర్తలు తిరస్కరించలేదు కదా? దేనినైనా తిరస్కరించటం, కోల్పోవడం చాలా సులభం; కానీ పునరుద్ధరించడం మాత్రం చాలా కష్టం. ఇప్పటికే తెలుగు జాతి 5 -11 శతాబ్దాల మధ్య కాలంలోని 700 ఏళ్ళ సాహిత్యాన్ని ఎంతో కోల్పోయింది. బ్రౌన్ శ్రద్ధ వహించి, స్ఫూర్తి ఇవ్వకపోతే ఇప్పుడు లభ్యమవుతున్న సాహిత్యమూ మిగిలేది కాదు. భాషా, సాహిత్య, సాంస్కృతిక, జాతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలనే ఉద్దేశం లేకపోతే, వాటి ఉనికీ, మనుగడా కోల్పోవడానికి సిద్ధపడాల్సి ఉంటుంది.

తెలుగు ధ్వనులూ, వర్ణాలూ (Sounds and Phonemes) : ఈ వ్యాసం మొదటి భాగంలో చెప్పుకున్నట్లు అక్షరాలు కేవలం సంకేతాలు; సాంకేతిక ప్రగతికి పరికరాలు మాత్రమే. అక్షర రూపానికీ, భాషకూ పారస్పర్య సంబంధం ఏమీ లేదు. 'లిఖిత రూపాలు' కాలానికి నిలిచి, తరం తర్వాత తరానికి అందించే వారసత్వ సంప్రదాయంలో ఒక భాగం మాత్రమే. మౌఖిక రూపాల్లో ఉన్న భాషలూ, సంస్కృతులూ ఆయా జాతులు నశిస్తే నశించిపోతాయి; లిఖిత రూపాలు లేకపోయి నట్లయితే! అయితే ఒక భాషా సమాజంలోని వ్యవహర్త లందరూ ఆభాషను ఒకే విధంగా వ్యవహరించరు. అందువల్ల భాషలోని ధ్వని ఉచ్చారణల్లోనూ, పదాల లోనూ, వాటి అర్థాలలోనూ భిన్నత్వం, వైవిధ్యం ఏర్పడు తాయి. అవి భౌగోళికంగానూ, సామాజికంగానూ, వైయక్తి కంగానూ భిన్నరూపాల్లో వ్యక్తమవుతాయి. అయినప్పటికీ, భాషనూ, సమాజాన్నీ, 'ఒక్కటి'గా చూపించే లక్షణాల ద్వారా ఆయా భాషలనూ, సమాజా లనూ ఇతరాలనుండి 'వేరు' చేస్తాం. ఆ లక్షణాలనే ధ్వని మొదలుకొని వాక్యం వరకూ వర్ణించడం ద్వారా భాషా వ్యాకరణాల రచన జరుగుతుంది. అందువల్ల ధ్వనులను, వర్ణాలనూ, లిపి సంబంధమైన అక్షరాలనుండి వేరు చేసి చూడాలి.

అన్ని భాషల్లోని ధ్వనులూ నోటిలోని వివిధ భాగాల లో వివిధ రకాలుగా ఉచ్చరించటం ద్వారా ఉత్పన్న మయ్యేవే. 'వడ్ల గింజలు' కథలో వలె పరిమిత ధ్వనుల నుండి అపరిమిత అనంత భాషోత్పత్తి జరుగుతుంది. ఒక భాషలోని పరిమిత ధ్వనులు కూడా అన్నీ ఆ భాషలో

అర్థభేదక సామర్థ్యం గల వర్ణాలుగా (Functional Phonemes) పరస్పర సంబంధం కలిగి వుండవు. వర్ణం కొన్ని 'ధ్వని సామ్యం' గల ధ్వనుల సమాహారం కావచ్చు. లేదా ఒకే 'ధ్వని' కూడా కావచ్చు. ధ్వనులు ప్రవర్తించే తీరు మాత్రం ఏ భాష కాభాషకే విడివిడిగా ఉంటాయి.

తెలుగుభాషలోని ధ్వనులు చాలా వరకు (ఆ మాట కొస్తే చాలా భారతీయ భాషల్లో కూడా) రాసే అక్షరాల ఉచ్చారణతోనే ఉంటాయి. అంటే ఇంగ్లీషులోని 'సి' అనే అక్షరానికీ, మాటల్లో దాని ఉచ్చారణకీ చాలా భేదం ఉంటుంది. కానీ, తెలుగులో క, త, ట, ప మొదలైన వాటికి ఉన్న ఉచ్చారణ ధ్వనిని పోలి వుంటుంది. చ, జలు మాత్రం రెండేసి ఉచ్చారణలు కలిగి ఉంటాయి. అలాగే రెండు వేర్వేరు ధ్వనులూ, అక్షరాలు అయిన శ, షలు చాలా సందర్భాలలో ఒకే ఉచ్చారణను కలిగి ఉంటాయి. అలాంటప్పుడు క, త, ట, ప ల వలె అవి విడివిడి వర్ణాలు (ఫోనీమ్స్) కావు. (Phonemes అంటే అక్షరాలు కావు. అవి అమూర్తమైనవీ, భాషల్లో తమవైన ప్రత్యేక విధులు కలిగినవీ.) ఏ రెండు భాషల్లో నైనా'ప' అనే స్పర్శ, ఓష్ఠ్య, శ్వాస ధ్వని ఉండవచ్చు; కానీ ఇంగ్లీషు లో ప వర్ణానికి ప / ఫ అనే రెండు సవర్ణాలు (allophones) ఉన్నాయి. తెలుగులో 'ప' అనే వర్ణానికి 'ప' అనే ధ్వని ఒక్కటే. చిన్నయసూరి పేర్కొన్న 'సవర్ణ' మనే పరిభాషా, భాషా శాస్త్రంలో ఉపయోగించే 'సవర్ణ' పరిభాషా ఒకటి కాదని దీనివల్ల తేలుతోంది. అయినప్పటికీ లేఖనం లోనూ, ధ్వని ఉచ్చారణలోనూ చ, జలు సవర్ణాలే. ! 'థ' అనేధ్వని (స్పర్శ, దంత్య, శ్వాస, మహాప్రాణం)ని ఆధునిక తెలుగులో వర్ణంగా గ్రహించనక్కర్లేదని భద్రిరాజు కృష్ణమూర్తి గారు (2000) ప్రతిపాదించినా అది ఎక్కువ మంది అంగీకారం, ఆమోదం పొందలేదు. విలియం బ్రౌన్ తెలుగులో మూడు రకాల ఉచ్చారణకు ఒక్కటే అక్షరం 'వ' ఉందని తన నిఘంటు పీఠిక (1818)లో తెలిపారు. వయసులో [V]గానూ, వత్తిలో [W] గానూ, వూరులో [UU] గానూ, (ఆరోజుల్లో ఊని [OO] గా రాసేవారు.) ఆ ఉచ్చారణా భేదం ఉంటుందన్న ఆయన గ్రహింపు సరి అయినదే. అలాగే తెలుగులో తాటాకు, మేక మొదలైన మాటల్లోని దీర్ఘోచ్చారణ ఇంగ్లీషులోని Cat bank మొ॥న వాటిలోని ఉచ్చారణ వలె వుంటుందని (ఆ భాషలో కూడా ఆ ధ్వనికి అక్షర రూపం లేదు) పాశ్చాత్యులు చేసిన పరిశీలన సరియైనదే. 4

ఇలా చూసినప్పుడు తెలుగు ధ్వని, వర్ణాల గురించి చేకూరి రామారావు (2002, పు. 91 - 101) పి.ఎస్. సుబ్రహ్మణ్యం (1977) గార్ల ప్రతిపాదనలను తెలుగు అక్షరాల బోధనలో తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. అయితే హిందీ /ఉర్దూ, ఇంగ్లీషు నుండి వచ్చిన [f] ధ్వని, ఉచ్చారణ గల మాటలకు వేరే గుర్తు ఏమీ ప్రత్యేకంగా ప్రవేశపెట్టవలసిన అవసరం కనిపించదు. భాషలో ఇప్పటికే అది 'ఫ' అక్షరంతో రాయబడుతోంది. అయితే వీరు సూచించని 'ఋ' ధ్వని ఉచ్చారణా దాని అవసరము, అలాగే క్షమ, క్షీణించు వంటి సంస్కృత పదాలలో వచ్చే 'క్ష' ఉచ్చారణని కూడా నేర్పాల్సి వుంటుంది. నిజానికి ధ్వని, వర్ణ శాస్త్రాల అవగాహనతో 'అక్షరాలు' నేర్పితే, ఉచ్చారణా లేఖన దోషాలనూ, పొరపాట్లనూ పరిహరించ వచ్చు. తెలుగు భాషా బోధకులకు (పండిట్, బిఎడ్ మొ॥) ఇచ్చే కోర్సులలో ఈ అంశాలను ప్రవేశ పెట్టడం ద్వారా వారికి శిక్షణ ఇవ్వడంద్వారా దాన్ని సాధించవచ్చు.

తెలుగు అచ్చులలో అక్షరరూపం లేని ధ్వని ఉచ్చారణ (æ) కు వర్ణస్థాయి ఉందని కొందరూ, లేదని కొందరూ వాదించటం పరిపాటి. ఇలాంటి ఏకాభిప్రాయం లేని ధ్వనుల విషయమై క్షేత్ర పర్యటన ఆధారంగా సేకరించిన ఎక్కువ మంది వ్యవహర్తల ఉచ్చారణలను విశ్లేషించడం ద్వారా నిర్ణయించటం సరియైనది. వ్యక్తిగత అభిప్రాయాలు, ఎలాంటి శాస్త్రవేత్తలవైనా వ్యక్తిగతమైనవిగానే పరిగణించాల్సి ఉంటుంది; సోపపత్తికం అయితేనే సమ్మతించాలి.

ఇంగ్లీషులో ధ్వనులపై (సామాజిక మాండలిక భేదాలతో సహా ప్రత్యేక గ్రంథాలూ, నిఘంటువులూ వచ్చాయి. అలాగే ఇంగ్లీషు 'వర్ణ' (Phonology) వ్యవస్థపైనా ఉచ్చారణ (Pronunciation) అక్షర మాల (Spelling) పైనా ఎన్నో గ్రంథాలు వచ్చాయి. తెలుగులో

కూడా ఇలాంటివి వస్తే భాషా బోధనలో అభ్యసనంలో ఆధునిక కాలంలో ఏర్పడ్డ సమస్యలను - పరిష్కరించ వచ్చు.

నిజానికి భాషా వ్యవహర్తలు కొంత శ్రద్ధ వహిస్తే సరియైన ఉచ్చారణ నేర్చుకోవడం కష్టం కాదు. మహా ప్రాణం లాంటి తెలుగుకి సహజం కాని ధ్వని ఉచ్చారణ లను ప్రత్యేకంగా నేర్చుకోవాల్సిందే. దాదాపు 16, 17 వందల ఏళ్లుగా మరి అవి వచ్చి తెలుగులో స్థిర పడి పోయాయి. వాటినిప్పుడు పారదోలడం సాధ్యమూ కాదు; ఒకవేళ అలా చేసినా మిగిలే తెలుగు జాతికి ప్రయోజనకారీ కాదు.

భాష(ల)ను ముఖ్యంగా మాతృభాషను సరిగ్గా నేర్చుకోని (వలసల వల్ల వలస సామ్రాజ్యాలవల్లా) సాహిత్యం చదవని వారిలో ఎక్కువమంది నేర చరితు లుగా మారినట్లు ఇటీవలి భాషా శాస్త్ర పరిశోధనల్లో వెల్లడయింది. తెలుగువారు వివిధ కారణాల వల్ల తమ భాషాపటుత్వాన్ని కోల్పోతే, అది మన జాతి మనుగడకే ముప్పు అంటే అతిశయోక్తికాదు.

అధ స్సూచికలు :

1. a) written words are the signs of words spoken - Aristotle

   b) 'Smile when you say that; how do you smile in writing?' "you attribute to letters a fortune that they cannot possess" - Plato

2. వాడుక భాషే రాస్తున్నామా? అన్న రంగ నాయ కమ్మ గారి పుస్తకం, తెలుగులో (æ) (f), మొదలైన ధ్వనులకు నియమిత సంకేతాలను కొత్తగా కల్పిం చుకోవాలన్న బూదరాజు రాధాకృష్ణ గారి సూచనా (1962 పు - 20) ఈ కోవకు చెందుతాయి. అలాగే (æ) ను వర్ణంగా గుర్తించాలనే వాదన కూడా.

3. బాలవ్యాకరణంలోని సంజ్ఞాపరిచ్ఛేదంలో మొదటి సూత్రం "సంస్కృతమునకు వర్ణము లేబది", రెండో సూత్రం "ప్రాకృతమునకు వర్ణములు నలువది". మూడవ సూత్రం "తెనుగునకు వర్ణము లు ముప్పది యాఱు", నాలుగవది 'ఋ ౠ, ఌ ౡ, విసర్గ ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ, శ, ష, లు సంస్కృత సమంబులను గూడి తెలుగున వ్యవహరింపబడు.

4. శ్రీరమణ, 'ధ' గురించి 'ఒత్తు ధ' అని ఒక మంచి కథ రాసారు.

5. గురజాడ అప్పారావు కన్యాశుల్కంలో ఈ ఉచ్చా రణ ఉండే చోట్ల లిఖితపదాలపై కొన్ని రకాల గుర్తులుంచాడు. (వాటిని diacritical marks అంటారు. అలా ఎందుకు చేసాడో గ్రంథం పీఠిక లో ఇంగ్లీషులో రాసాడు. గిడుగుగారు పాఠ్య పాఠాంతర భేదాలు పరిష్కారాలను వ్యతి రేకించిందీ సరియైన ధ్వని, అక్షర నిర్ణయాలపై వాటి నన్నింటినీ అలాగే ముద్రించాలన్న కారణంతో, అలా జరక్క పోవడంవల్ల తెలుగు భాష చాలా నష్టపోయిందని చెప్పుకోవచ్చు,.

ఉపయుక్త గ్రంథ సూచి :

అనూరాధ, జె. : 1992. పిల్లలు తెలుగు రాయటం నేర్చు కోవడం, ఒక పరిశీలన, ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం.

కృష్ణమూర్తి, భద్రిరాజు : 1962. వ్యవసాయ వృత్తి పద కోశం (పీఠిక), హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ -

1974. తెలుగు భాషాచరిత్ర, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ -

2000. భాష, సమాజం, సంస్కృతి హైదరాబాద్, నీల్‌కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్.

గోపాల కృష్ణయ్య, వడ్లమూడి : 1956. ధ్వని, లిపి,

పరిణామం లేక ప్రాచీన వాఙ్మయంలో వ్యావహారిక భాష

చిన్నయసూరి, పరవస్తు : 1858 బాల వ్యాకరణము, వ్యాఖ్యానం బొడ్డుపల్లి పురుషోత్తం, 1993 నరసరావు పేట స్టూడెంట్స్ ఫ్రెండ్సు.

చంద్రశేఖరరెడ్డి, డి. : 2001. మనభాష, హైదరాబాద్, మీడియా హౌస్, పబ్లికేషన్సు,

బూదరాజు రాధాకృష్ణ : 1990. భాష శాస్త్ర వ్యాసాలు, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

రామచంద్ర తిరుమల : 1957. మనలిపి పుట్టు పూర్వోత్తరాలు

రామారావు చేకూరి : 2002. తెలుగు వాక్యం, పదవర్ణ సహితం; మొదటి ముద్రణ : 1975, హైదరాబాదు, రచయిత -

2000. భాషాంతరంగం, హైదరాబాదు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం -

2001. భాషానువర్తనం, హైదరాబాదు.

విజయ శ్రీ.బి. : 2003. తెలుగు భాషా లేఖన దోషాలు - విశ్లేషణ, అముద్రిత ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం.

సుబ్రహ్మణ్యం. పి.ఎస్. : 1984. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు, హైదరాబాదు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం -

1977. ద్రావిడ భాషలు, అన్నామలై నగర్, అన్నామలై విశ్వవిద్యాలయం

References :

Brown, C.P - 1852 (1st Edn.) Telugu - English Dictionary, New Edn. Hyderabad; P.S. Telugu University.

Brown, William, 1818 (18th edn.) Telugu - English Nighantuvu, Madras; Cultural Books Ltd., (2nd Edn.) (originally named as "A Vocabulary of Gentoo and English).

Campbell, A.D A Grammar of Teloogoo Language commonly termed as the Gentoo (3rd Edn.) New Delhi; Asian Educational Services.

Clanchly, M.T. 1979. From memory to written record, England, 1066 - 1307. Oxford, Blackwell. (1993 2nd edition)

Finnegan, R. 1988. Literacy and Orality; studies in the technology of communication. Oxford; Blackwell.

Galletti, A. de Cadillac. 1935. Galletti's Telugu Dictonary, New Delhi; AES publications.

Levi-Strauss, C. 1966. The Savage mind, Chicago, University of Chicago press.

Olson, D.R. 1994. The World on paper. Cambridge; Cambridge university press.

Ong, W. 1982. Orality and Literacy : The technology of the word - London; Metheun.

Usha Devi, A. 2001. Phonetic and Phonological problems of Learning Telugu as identified by bilingual laxicographers. International Journal of Dravidian Linguistics. Vol. XXXII No. 2 PP 197-206

మన తెలుగు

డా. అందె వేంకటరాజము

ఒక జాతి సంస్కృతిలో భాషకు విశిష్ట స్థానం ఉంటుంది. ఇతర జీవరాశులకు లేని భాష మానవునికి వరంగా పరంగా విరాజిల్లి సంస్కృతికి, నాగరికతకు, విజ్ఞాన వినోదాలకు, అభ్యుదయ పరంపరలకు హేతువై జీవధారగా అలరారుతుంది. మృగప్రాయుడైన ఆదిమ మానవుని క్రమ పరిణామ దశలలో భాష ఉద్భవించి వికసించిన తీరులో అనేక జాతుల వలెనే అనేక భాషలేర్పడి అభివృద్ధి గాంచినవి. వేలకొలదిగా ఉన్న ప్రపంచ భాషలను భాషా కుటుంబాలుగా వింగడించిన విషయం, అట్టి వాటిలో మన తెలుగు దక్షిణ భారతంలోని ద్రావిడ భాషల కుటుంబానికి చెందిన విషయం ప్రాజ్ఞవిదితమే. ప్రపంచ, భారతీయ భాషలలో తెలుగునకు గల వైశిష్ట్యం, దానిని మనం ఉపయోగించుకుంటున్న తీరు వివరించడమే ఈ వ్యాసోద్దేశం.

ఆంధ్రభాషా వైశిష్ట్యం :

ఆరువేల వరకు గల ప్రపంచ బాషలలో తెలుగు ఆరవ స్థానంలో ఉన్నదనీ, భారతీయ భాషలలో రెండవ స్థానమలంకరించినదనీ విజ్ఞులు తేల్చిన వాస్తవం. మనదేశంలో హిందీ తర్వాత అధిక జనులు ఏడు కోట్లమంది జనులు మాట్లాడేభాష తెలుగే. మన తెలుగునకు అంతర్జాతీయంగా గొప్ప గుర్తింపు గౌరవం ఉన్నవి. ప్రపంచ భాషలలో క్రమంగా వ్యవహారంలో లేని సగం భాషలు మృతభాషలుగా పరిగణించబడుతూ లిపి సారస్వతం లేక కేవలం మౌఖికంగా వాడుకలో ఉన్న భాషలు అనాగరికంగా పేరు పెంపు లేకుండా ఉన్నవి. లిపి సారస్వతాలు గల నాగరిక జీవద్భాషలలో తెలుగు ప్రశస్తి గాంచినది. ఈ భాషకు రెండువేల సంవత్సరాల చరిత్ర, సాహిత్యానికి వేయి సంవత్సరాల ఘన చరిత్ర ఉన్నది. నన్నయ నుండి చిన్నయ వరకు, చిన్నయ నుండి సి. నారాయణరెడ్డిగారి వరకు దివ్యగంగవలె భవ్యంగా సాగిన సాహిత్యమున్నది. ఇంకా అవిచ్ఛిన్నంగా అజరామరంగా అనన్య వైభవంగా సాగగలదు.

తెలుగింత గొప్ప భాషగా వెలుగొందడానికి అనువైన కారణాలనేకం. ఈ భాషకు గల పర్యాయపదాలలో ఆంధ్రం, త్రిలింగం అన్నవి ప్రాంతాన్ని బట్టి ఏర్పడినవి. అందులో మూడు సుప్రసిద్ధ లింగ క్షేత్రాలు మూడు మూలలలో గల దేశమన్న త్రిలింగనామం మన దేశానికి భాషకు పవిత్రతను ప్రశస్తిని ఆపాదిస్తున్నది. తెనుగు, తెలుగు అనే పదాలు భాషకు గల మాధుర్యాన్ని, సౌష్ఠవ సౌందర్యాన్ని గుబాళింపజేస్తున్నవి. ప్రాజ్ఞుల వివరణాను సారం తేనె+అగు = తెనుగు అనీ, తేనె + అలుగు = తెలుగు అనీ బోధపడి అనుభవానికి వచ్చినవి. తెన్ను + అగు = తెనుగు అనీ మరొక వివరణ. అంటే ఉత్తర భారతీయులకు దక్షిణ భారతీయులకు మధ్య గల తెలుగు భాష (దేశం) దారి - కూడలి అని భావం. అంటే ఉత్తరాదిలోని హిందీ, బెంగాలీ, గుజరాతీ,మరాఠీ, మున్నగు భాషల సౌష్ఠవం దక్షిణాదిలోని కన్నడ తమిళ మలయాళ భాషల మార్దవం తనలో సమన్వయంగా సమ్మిళితం చేసుకొని ఒక చక్కని చిక్కని భాషగా తెలుగు పరిణతి చెంది బహుభాషా జనుల మెప్పు గాంచినదని దీని సారాంశం.

తెలుగు భాషకీ మృదుమధుర సౌందర్యం సమకూరడానికి ఇంకా ఎన్నో కారణాలున్నవి. ద్రావిడ భాషా కుటుంబంలో ఉద్భవించిన తెలుగు సంస్కృత భాషా సాహిత్యాల సాహచర్య సంపర్కాలతో సమ్యగ్వికాసం చెంది పరిఢవిల్లినది. ఇతర భాషలకూ, సంస్కృతానికి కూడా లేని ఏబది ఆరు అక్షరాల విపుల వర్ణమాలతో అలంకృతమైనది. అందువల్ల తెలుగు సమస్త ధ్వనులను పలికించగలిగి సుస్పష్టమైన ఉచ్చారణకు సమర్థమై యున్నదని విద్వదభిప్రాయం. ఇది అజంత భాష కావడం

వల్ల మరింత మృదుమధురమై సంగీతానికెంతో అనువైనదిగా వినుతించబడినది. త్యాగయ్య రచించి పాడిన తెలుగు కృతులను తెలుగు రాని తమిళ కర్ణాటక గాయకులు ఆకర్షితులై గానం చేస్తున్నారు.

తెలుగు భాష సంతరించుకున్న మృదుమధుర సౌభాగ్యానికి హర్షించి అభినుతించిన మహనీయుల సూక్తులను ప్రస్తావిస్తాను. సాహితీ సమరాంగణ చక్రవర్తి కృష్ణదేవరాయలు 'దేశభాషలందు తెలుగు లెస్స' అన్న ప్రశస్త ప్రస్తుతి సుప్రసిద్ధమైనదే. అయ్యప్ప దీక్షితుడనే మహాసంస్కృత పండితుడు ' ఆంధ్రత్వ మాంధ్రభాషాచ నాల్పస్య తపసఃఫలమ్, అని ముక్తకంఠంతో కొని యాడినది పండిత విదితం. ఇంక తెలుగువారు తెలుగు భాషకు చేయనంత సేవచేసిన బహుభాషా పండితుడు బ్రౌన్‌దొర ఆంధ్ర భాషాసౌందర్యమాధుర్యాల నాస్వాదించి ఆనందించి 'Telugu is Italian language of the east' అని ప్రశంసించినది యోగ్యతాపత్రం. విశ్వకవి, నాదో పాసకుడైన రవీంద్రుడు తనకాలంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా పిలువ బడి వచ్చి ఆంధ్రభాషా ప్రసంగాలు విని ఆంధ్రం తెలియ కున్నా శ్రుతికి ఇంపనిపించి "Is it a music or language" అని ప్రస్తుతించినది మనకు గర్వకారణం. భావకవితా యుగ కవియైన రాయప్రోలు సుబ్బారావు

"ఏ ప్రపుల్ల పుష్పంబుల నీశ్వరునకు
పూజ చేసితినో ఇందు పుట్టినాడ
కలదయేని పునర్జన్మ కలుగుగాక
మధుర మధురంబయిన తెన్గు మాతృభాష"

అని మురిసిపోయిన విషయం తెలుగు వారికాదర్శ ప్రాయమైనది.

ఆంధ్రభాషా వినియోగం :

విశిష్ట గుణాలతో విశ్వవిఖ్యాతమైన మన తెలుగు ఎంతవరకు ఏవిధంగా వినియోగపడుతున్నదో పరి శీలిస్తాము.

ఏ భాషయైనా స్థూలంగా నాలుగు విధాలుగా ఉపయోగపడుతుంది. 1. శాస్త్ర భాష 2. అధికార భాష 3. కావ్య భాష 4. వ్యవహార భాష ఈ నాలుగు వర్గాల భాషా వినియోగాన్ని క్రమంగా చర్చిస్తాను.

1. శాస్త్రభాష :

శాస్త్ర భాషలో శాస్త్రాలకు కళలకు ఆయా విద్యా విజ్ఞానాలకు చెందిన పరిభాషా పదాలు - సాంకేతిక పదాలు ప్రాధాన్యం వహిస్తాయి. దీనినే విద్యా బోధనా భాష (బోధనామాధ్యమం) అంటారు. ప్రపంచంలో ఆయా భాషలలో ఈ బోధనా భాషకు పెద్ద చరిత్రా సమస్యలూ ఉన్నవి. సాధారణంగా రాజసత్తాక రాజ్యాలలో ప్రత్యేకించి విదేశీయుల పాలనలో పాలకుల భాషలోనే విద్యాబోధన జరిపించి నారన్నది చరిత్ర చెప్పిన సత్యం. మన భారతదేశంలో స్వదేశీయులైన హిందువుల రాజ్యాలలో పూర్వకాలంలో సంస్కృతంలో తర్వాత ప్రాకృత భాషలలో ఆ పిదప విదేశాలనుండి దండయాత్రలు చేసి ఈ దేశంలో పరిపాలన చేసిన ముస్లింలు తమ భాషయైన పార్సీలో, తర్వాత పరిణామంగా రూపొందిన సైనిక భాష ఉరుదూలో విద్యా బోధన చేయించినారు. ఆ తర్వాత వచ్చి పరిపాలించిన బ్రిటిష్‌వారు తమ ఆంగ్లభాషలో విద్యా బోధన ప్రవేశపెట్టినారు. ఆంధ్రప్రదేశ్‌లోనైతే కాలగతిలో ఆంధ్రలో ఆంగ్లం, హైదరాబాదు రాష్ట్రంలో ఉరుదూ బోధనాభాష ఐన విషయం సువిదితమే. ఇప్పుడు స్వాతంత్ర్యం వచ్చిన పిదప ప్రజాస్వామిక ప్రభుత్వాలలో ప్రజల భాషలోనే బోధించవలసిన అవసరం కర్తవ్యం అన్నది కాదనరానిది. దేశంలోని రాష్ట్రాలలో, ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రజల భాషలలో విద్యా బోధన చేయించడానికి ప్రభుత్వాలు పూనుకొని కృషి చేస్తున్నవి. ఐతే ఇది ఎంతవరకు ఇక్కడ సఫలమైన దంటే కొంతవరకే అన్నది బాధాకర సత్యం.

ప్రభుత్వాలు పట్టుదలతో శాసనం చేసి అమలుకు చిత్తశుద్ధితో దృఢదీక్షతో కృషి చేసినప్పుడు ప్రజలు సానుకూలంగా స్పందించి, సహకరించినప్పుడు కార్యసిద్ధి

కలుగుతుంది. కాని ఈ విషయం ఇరువైపుల నుండి లోపమున్నందున అనుకొన్న లక్ష్యం సాధించలేక పోతున్నాము. ఈ కార్యసాధనలో అవసరమైన వాటిని, ప్రతి బంధకాలను పరిశీలిస్తాము.

I.తెలుగులో శాస్త్ర సాంకేతిక గ్రంథాలను సిద్ధం చేయడం:

దీనికి ప్రభుత్వం తెలుగు అకాడెమీ స్థాపించి ఆంగ్లం నుండి తెలుగులోనికి అనువాదం చేయిస్తూ పాఠ్య గ్రంథాలను సిద్ధం చేయిస్తున్నది. కాగా శాస్త్ర పరిభాషా పదాలను ఆంధ్రీకరించడంలో కష్టమౌతున్నది. ఇది లోప భూయిష్ఠంగా ఉండి అధ్యాపకుల, విద్యార్థుల విమర్శలకు, నిరసనలకు తావిస్తున్నది. దీనికి నిపుణులైన శాస్త్రజ్ఞులు భాషావేత్తలు తగుమార్గాలు సూచిస్తూ పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. ఆంధ్రీకరణకు పటిష్ఠమైన సమర్థమైన సంస్కృత పదాలున్నవి. అవి సరిగా లభించకపోతే కొంత కాలం ఆంగ్లపదాలనే తెలుగు లిపిలో వాడవచ్చును. ఈ లోపాలతో అర్థక్లిష్టతతో తెలుగులో చదవడ మేమిటని ముక్కువిరిస్తే ప్రయోజనం లేదు.

ఇంగ్లాండులో 16వ శతాబ్దివరకు శాస్త్రాలు కళలన్నీ మూలభాషలైన లాటిన్, ఫ్రెంచి భాషలలో చదివే వారు. అంతకు ముందు 'ఆంగ్లో సాగ్జన్' అని అతిపరిమితమైన ఆంగ్ల భాష అచ్చ తెలుగు వంటిది మాత్రమే ఉండెడిది రెండవ ఎలిజబెత్ రాణి కాలంలో షేక్స్పియరు వంటి మహారచయితల సహకారంతో నానా భాషల పదాలను చేర్చుకొని ఆంగ్లానువాదంతో శాస్త్రాలనుబోధించడం ప్రారంభించినారు. అప్పుడు శాస్త్రపరిభాషా పదాలన్నీ మనం సంస్కృతంనుండి తీసుకొంటున్నట్లు లాటిన్, ఫ్రెంచి, గ్రీకు భాషలనుండి తీసుకొన్నారు. ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి పదాలన్నీ ఆ భాషలవే కాని ఇంగ్లీషువి మాత్రం కావు. ఆంగ్లాను వాదంలో మనకు వలెనే వారికి క్లేశం, అపరిపక్వత ఎదురైనవి. 'ఎన్సైక్లోపేడియా బ్రిటానికా' గ్రంథంలో మొదటి కూర్పులో ప్రచురించిన పరిభాషా పదాలు తర్వాతి కూర్పులలో మార్పులతో ప్రచురించినారు. ఇంగ్లీషులో వైద్య శాస్త్రం చదివితే వారు రోగులను చంపేస్తారు వైద్యం చేయలేరని అవహేళన చేసేవారు. వాటన్నిటినీ ఓర్చి పట్టుదలతో కృషి చేసి సఫలమైనారు. వారికున్న దేశభాషాభిమానం నిరుపమాన మైనది. మనసుంటే మార్గముంటుందన్నది నిజం. కావున దీక్షా దక్షతలతో కృషి చేస్తే తప్పక నెరవేరుతుంది. కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులుగారు 'దేశభాషలలో శాస్త్ర పఠనం' అనే వ్యాసంలో ఈ విషయాలన్నీ విపులంగా చర్చించి విలువైన సూచనలనిచ్చియున్నారు.

II. ప్రాంతీయ భాష తెలుగులో డిగ్రీలు సంపాదిస్తే ఇక్కడ గాని ఇతర రాష్ట్రాలలో ఇతర దేశాలలో గాని ఉద్యోగాలు లభిస్తాయా? అన్యభాషీయులతో ఎట్లా వ్యవహరించేది అన్నది రెండవ సమస్య. దీని గురించి మాతృభాషలో విద్యా బోధన సాగుతున్న రాష్ట్రాలవారు దేశాలవారు ఎట్లా పరిష్కరిస్తున్నారో తెలుసుకొని పాటించ వలసి యున్నది. దీనికి త్రిభాషా సూత్రం ఉండనే ఉన్నది. మనం మాతృభాష తెలుగు, జాతీయ భాష హిందీ, అంతర్జాతీయ భాష ఇంగ్లీషు నేర్చుకుంటూనే ఉన్నాము. దీనితో మనం దేశంలో ఇతర రాష్ట్రాలలో విదేశాలలో విజయవంతంగా వ్యవహరించగల అన్యభాషీయులతో మాట్లాడేటప్పుడు దుబాసీలు అనువదించి చెబుతారు. కనుక బాధ లేదు. రష్యా వంటి కొన్ని దేశాలలో ఆంగ్లం తప్పనిసరి విషయం కాదు. ఐచ్ఛికంగానే ఉంటుంది. ఐనప్పుడు ఇంగ్లీషు చదువక పోతే బ్రతుకలేము ప్రగతి గాంచలేము అన్నది అర్థరహితం ఆధారరహితం. రష్యావంటి అగ్ర రాజ్యాలు దేశ భాషాభిమానం, కఠిన పరిశ్రమ వంటివాటి చేత ప్రగతి సాధించినవే కాని ఇంగ్లీషు వాడుక చేసి కాదు.

చాలా సంవత్సరాల క్రిందట ఫ్రాన్స్‌లో అంత ర్జాతీయ వైజ్ఞానికుల మహాసభలు మూడు రోజులు జరిగినవి. పాల్గొన్న వైజ్ఞానికులు తమ దేశభాషలలోనే ప్రసంగించి పత్రాలు సమర్పించినారు. ఆరు దేశాల వారు మాత్రం ఇంగ్లీషు వాడినారు. అందులో బ్రిటన్ అమెరికా వంటి ఆంగ్ల భాష స్వభాషగా గలవారు కాగా ఇంకా మూడు దేశాల అన్యభాషీయులలో భారతీయులున్నారు. స్వభాషాభిమానం మనకే స్థాయిలో ఉన్నది? ఇట్లా సాగిన

సభలు దుబాసీల అనువాదాలతో విజయవంతంగా ముగిసినవి. ఇంగ్లీషు వాడకపోతే శాస్త్ర జ్ఞానం రాకుండా ఉండదు, సభలు విజయవంతం కాకమానవన్నది ఈలాంటి వాటివల్ల రుజువౌతున్నది. ఇప్పుడైతే కంప్యూటర్ యంత్రాలు ఏ భాషలో మాట్లాడినా అవసరమైన అన్యభాషలలో వెంటనే అనువదించి చెప్పే సౌకర్యం ఏర్పడినది.

ఇక ఉద్యోగాల విషయం తెలుగులో చదివిన వారికి ఇంగ్లీషులో చదివినవారికివలె ఉద్యోగాలివ్వడం, ప్రోత్సాహ కాలు ప్రకటించడం, రిజర్వేషన్ల వంటి గట్టి చర్యలు అమలు పరచవలసి యున్నది.

III. ప్రజల సానుకూల స్పందన, సహకారం:

తెలుగులో విద్యా బోధనకు ప్రజల సహకారం కూడా అంతంత మాత్రంగానే కాదు వ్యతిరేకంగా కూడా ఉన్నది. దీనికి ప్రబల కారణం ఇంగ్లీషును వదిలితే గతి స్థితి యేమిటన్న అపోహ. ఇంకా చెప్పవలెనంటే స్వాతంత్ర్యో ద్యమ కాలంలో పొంగి పొరలిన దేశభక్తి, జాతీయత, స్వదేశి భావన, స్వవేష భాషాభిమానం స్వాతంత్ర్యా నంతరం క్రమంగా సన్నగిల్లి అంతరించే దుస్థితికి చేరు కొంటున్నది. ఇంగ్లీషుమీద వల్లమాలిన దురభిమానం శివమెత్తుతున్నది. తెలుగుబిడ్డలకు తల్లిదండ్రులు మమ్మీడాడీలతో మాటలు నేర్పి ఎల్.కే.జీ., యు.కే.జీ.లలో విద్యా బోధన ప్రారంభింప జేస్తున్నారు. తెలుగు రాష్ట్రం రాజధానిలో తెలుగు పిల్లలకు తెలుగులో చదువుకోవ డానికి స్థాయిగల విద్యాసంస్థ లేదంటే మన సంస్కృతి సభ్యతలేపాటివో విదిత మౌతుంది. అర్థంలేని మోజుతో వేల రూపాయలు వెచ్చించి ఇంగ్లీషు బోధన విద్యాలయా లలో కాన్వెంటులలో చదివిస్తారు. విదేశాలకు పంపిస్తారు. తెలుగు భాషా భివృద్ధికి కృషిచేయవలసిన బాధ్యతగల ఉన్నత పదవులలో ఆదర్శంగా ఉండవలసిన నాయకులు అధికారులు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివిస్తారు. చెప్పేదొకటి చేసేదొకటి ఇదేమిటని అడిగితే అది ప్రభుత్వ విధానం ఇది మా వ్యక్తిగత విషయం అంటారు. ఇదీ మన సంస్కృతి. యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః....' అన్న గీతాసూక్తి ననుసరించి పెద్దవారిని ఆదర్శంగా తీసుకొని సామాన్య జనులు ఇంగ్లీషుకెగ బడడం వలన ఇంగ్లీషు మాధ్యమంగల విద్యాలయాలు పుట్టగొడుగులవలె పుట్టుకొస్తున్నవి.

మాతృభాషలో, అన్యభాషలో బోధించడం వల్ల కలిగే ఫలితాలు :

మాతృభాష తల్లి పాలవలె సహజమైనదనీ, అన్యభాష పోత పాలవంటిదనీ మనస్తత్వవేత్తలు తెలుపుతుంటారు. మాతృభాషలో విద్యాబోధన వలన చిన్నారులకు సహజంగా స్వాభావికంగా త్వరగా బుద్ధివికాసం కలిగి విద్యావిజ్ఞానాలు ప్రశస్తంగా శోభిల్లగలవు. అన్యభాష ఇంగ్లీషులో బోధన వలన అసహజంగా మనోబుద్ధుల వికాసం మందకొడిగా జరుగుతుంది. అంతేకాక తొలుత ఇంగ్లీషు నేర్చి ఆ భాషలో శాస్త్రాధ్యయనం చేయడం వలన రెండు రెట్లు శ్రమ అవుతుంది. కాలం వృధా అవుతుంది. ఇది ద్రావిడ ప్రాణాయామం వంటిది. రెండవది భాషకు, మతధర్మ సంప్రదాయాల సంస్కృతికి నాగరికతకు అవినాభావ సంబంధం ఉన్నది. తెలుగు వదలి ఇంగ్లీషులో చదివితే తెలుగువారి సంస్కృతికి దూరమై ఇంగ్లీషు వారి మతాచార విశ్వాసాల సంస్కృతి నాగరికత పుట్టురంగు గాక పూత రంగుగా కృత్రిమంగా అలవడుతాయి. ఇట్లా ప్రాచ్యుడు కాకుండా అప్రాచ్యుడు కాకుండా పోతాడు. ఇక అన్య భాషా వినియోగం వలన స్వభాష అణగారే ప్రమాదం ఉండనే ఉన్నది.

2. అధికార భాష :

దీనినే పరిపాలన భాష అంటారు. ఇది కూడా బోధనా భాషవలెనే పాలకుల భాషలోనే సాగుతూ వచ్చినది. మనం తెలుగువాళ్ళం. మనది తెలుగు భాష కావున ప్రజల భాషలోనే తెలుగులోనే పరిపాలన సాగవలెను. ఈ విషయంలో కూడా ప్రభుత్వం కృషి చేస్తున్నది. 1974లో అధికార భాషా సంఘం ఏర్పడి పాటుపడుతున్నది. వావిలాల గోపాలకృష్ణయ్య, సి. నారాయాణరెడ్డి గారి వంటి మహామహులు సంఘా ధ్యక్షులై యధాశక్తి యధావకాశం కృషి చేసినారు. చేస్తున్నా రు. కాని దీని ఫలితం కూడా బోధనా భాష వలెనే

అసంతృప్తిగా ఉన్నది. క్రింది స్థాయిలో కొంత తెలుగు అమలవుతన్నా పై స్థాయిలో నామమాత్రంగానే ఉన్నది. శాస్త్ర బోధన వలెనే ప్రభుత్వ కార్యకలాపాల్లో తెలుగు వాడకానికి తగిన పదాలు ఇంకా సమకూర్చుకోవలసి యున్నది. సమస్యలను సాధక బాధకాలను పరిష్కరించి ఫలవంతం చేయవలసిన అవసరం ఇంకా ఎంతో ఉన్నది.

3. కావ్యభాష :

కావ్యభాష ఆలంకారిక వచనానుసారం శైలీ రామణీయకమైన రసోదంచితమైన విధంగా ఉంటుంది. ఆ విధంగా మనకు మహాప్రశస్తమైన కావ్య సాహిత్య సంపద ఉన్నది. దీని గురించి ఇక్కడ చర్చించే అవసరం లేదు.

4. వ్యవహార భాష :

జన వ్యవహారంలో తెలుగు తగు పాటిగా ఉన్నది. ఐనా ఆంగ్ల భాషా వ్యామోహం ఆవేశిస్తూనే ఉన్నది. గౌరవంగా సభ్యతగా ఉంటుందన్న భ్రమలో ఇంగ్లీషులో మాట్లాడడం, తెలుగు మాటల నడుమ ఇంగ్లీషు పదాలను తరచుగా ప్రయోగించడం, ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించడం, సభలలో, సమావేశాలలో ఇంగ్లీషులో ప్రసంగించడం చర్చించడం జరుగుతున్నది. పానుగంటి వారి ఒక సాక్షి వ్యాసంలో ఆంగ్ల ప్రసంగం చేసినవానిని జంఘాల శాస్త్రి నిరసించిన విషయం సాహితీ పరులకు తెలిసినదే. ఇలాంటి దుర్ఘటనలు తరచుగా జరుగు తుంటాయి. పట్టణాలలోనే కాదు కుగ్రామాలలో సైతం పేర్ల పలకలు, పెండ్లి పత్రికలు, ఆహ్వాన పత్రికల వంటివి ఇంగ్లీషులో వేసి గొప్పతనమని మురుస్తుంటారు. ఏమిటి ఈ దుర్గతి?

మన తెలుగు జాతి భాష సంస్కృతి గొప్పవని చెప్పు కుంటారు. ఆవేశంతో ప్రగల్భాలు పలుకడంలో ఉన్నంత ప్రజ్ఞ ఆచరణలో వేషభాషాభిమానంలో లేదుకదా! పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ వల్ల ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా ఏర్పడినది. భాషా ప్రయుక్త రాష్ట్రాలకు మనదే మొదలు. కాని తెలుగు వాడకంలో ఎంతో వెనుకబడి యున్నాము. బెంగాలీలకు, మరాఠీవారికి తమిళుల కున్నంత భాషాభిమానం మనకులేదు. ఆ రాష్ట్రాలలో స్వభాషలోనే ఫలకాలు రాస్తారు. అన్య భాషలు తెలిసినా స్వభాషలోనే మాట్లాడుతారు. ఉదాహరణకు మహారాష్ట్ర లో వాహక్, (driver) చాలక్ (conductor), ప్రసాధన గృహ (toilet room), ఇత్యాదిగా మరాఠిపదాలనే వాడుతున్నారు. మనకు తెలుగు రాష్ట్రం రాజధానిలో అంతటా ఇంగ్లీషు అక్షరాలే. తెలుగు అక్షరాలకు వెదక వలసినదే.

మాతృభాషాభిమానం:

మహనీయులెందరో తమ దేశధర్మ వేషభాషాదులపై అభిమానం ఉండడం ఉత్తముల బుద్ధిమంతుల లక్షణ మన్నారు. "స్వస్థాన వేషభాషాభిమతాస్సంతో రసప్రలుబ్ధ ధియ:" అని నన్నయ ఆంధ్ర శబ్దచింతామణిలో సెల విచ్చాడు. నెహ్రూ ప్రధానిగా ఉండగా పండిట్ విజయలక్ష్మి రష్యాకు రాయబారిగా వెళ్ళి ఇంగ్లీషులో పత్రంరాసి ఇస్తే మీకు మీ భాష లేదా? అన్నప్పుడు సిగ్గుపడి హిందీలో రాసి ఇచ్చిన ఉదంతం ఉన్నది. నీలం సంజీవరెడ్డిగారు రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ముఖ్యాతిథిగా వచ్చి తెలుగులో ప్రసంగం చేస్తే సభికులు ఇదేమి విడ్డూరమని ఆంగ్లంలో గొణుగుకున్నారు. అది గమనించి అయ్యా! తెలుగువాణ్ణి తెలుగు రాష్ట్రంలో ఎక్కడ తెలుగులో ప్రసంగించేది? అంటే సిగ్గుతో తలవంచుకున్న విషయం వెలుగులోనికి వచ్చినది. ప్రజాకవి కాళోజి నారాయణరావుగారు నా గొడవలో 'ఆంధ్రుడా!' గేయంలో

ఏ భాషరా నీది ఏమి వేషమురా
ఈ భాష ఈ వేష మెవరికోసమురా
ఆంగ్లమందున మాటలాడనేర్వగనే
సంతోష పడియెదవు సంగతేమిటిరా?
దేశభాషల యందు తెలుగు లెస్సయటంచు
తెలుగు బిడ్డా! ఎపుడు తెలుసుకొందువురా?
నీ భాష దీనతకు నీ వేష దుస్థితికి

అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా?

అని గట్టిగా మందలించినాడు.

ఎడారిలో జలాశయాల వలె కొన్ని సంస్థలు ఆంధ్ర భాషా సాహిత్యాల ప్రగతికి ఎంతోకృషి చేస్తున్నవి. అందులో ఆంధ్రసారస్వత పరిషత్తు ఎంతో గణనీయమైనది. కాగా ప్రభుత్వం, ప్రజలు అందరూ ఆంధ్ర భాషాభ్యుదయానికి పాటుపడవలసి యున్నది. అమృత భాష తెలుగు మృతభాష కాగూడదు. అన్యభాషలెన్ని నేర్చినా స్వభాషలోనే వ్యవహరించాలి. అన్యభాషా దాస్యం అవమానకరమే గాని గౌరవప్రదం కాదు. తల్లి భాషను మరచిన వాడు తల్లిని మరచినట్లే. కాగా స్వభాష యెడ సదభిమానమే కాని దురభిమానం నిరభిమానం పనికిరాదు. ప్రస్తుతం మన తెలుగు దుస్థితికి వగచి అందరూ 'మాతృభాష నా జన్మహక్కు' అని గర్జించి ప్రతిన బూని దాని పునరుద్ధరణకు, పురోభివృద్ధికి త్రికరణశుద్ధిగా ఉద్యమించాలి .

జయ తెలుగు తల్లీ!

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక జ్ఞాపకం ఒక ఆలోచన

శ్రీ జ్వాలాముఖి

"ఆంధ్రుల ఉత్సాహం నిజంగా కార్య రూపం దాలిస్తే
భారత భూమికి ఆంధ్రులొక్కరే స్వరాజ్యం రాబట్ట గలరు"

- గాంధీజీ

'క్విట్ ఇండియా' (1942) ఉద్యమ కాలంలో నాయకులంతా జైళ్ళపాలైనప్పుడు తెలుగునాట రాజకీయ నాయకత్వాన్ని నిర్వహించింది "ఆంధ్ర సర్క్యులర్". బిట్రగుంటనుండి బెజవాడవరకు రైలుమార్గం ధ్వంసం అయింది. పోలీసు స్టేషన్లు ప్రజల దాడులనుండి రక్షించు కోలేని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పై కొటేషన్ ఆలోచించాలి.

స్వాతంత్రోద్యమంలో భాగంగా గ్రంథాలయోద్యమం చైతన్య వికాసానికి పూర్వరంగంగా పనిచేసింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు గ్రంథాలయోద్యమాన్ని చైతన్య వికాసంగా తీర్చిదిద్దారు.

నిజాం రాష్ట్రంలో నిజాం దృష్టినుండి తప్పించు కోవడానికి రాజుల పేరిట గ్రంథాలయాలు వెలిశాయి. హైద్రాబాదులో శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం, ఓరుగల్లులో రాజరాజనరేంద్ర భాషానిలయం ఉనికిలోకి వచ్చాయి.

"నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం" 12 నవంబరు నాడు 1921లో జరిగిన సభలో ఆలంపల్లి వెంకటరామా రావు తెలుగులో మాట్లాడితే హేళనకు గురయ్యారు. తత్ఫలితంగా "ఆంధ్ర జనసంఘం" ఏర్పడింది.

ఆ తర్వాత 1922లో ఫిబ్రవరి24 నాడు 'రెడ్డి వసతి' గృహం ఏర్పడింది.

ఈ పూర్వరంగంలోంచి రాజకీయ చైతన్యంగా ఊపిరిపోసుకున్న రాజకీయ ఉద్యమమే "ఆంధ్రమహా సభ" - మెదక్‌జిల్లా జోగిపేటలో 1930, మార్చి మూడవ తేదీనాడు సురవరం ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతన "ప్రథమాంధ్ర మహాసభ" జరిగింది. నిజాం అను మానాలు పెరగ సాగాయి.

సమాజంలో ఏదీ దాని అవసరానికి భిన్నంగా రాదు. వచ్చిందల్లా సమాజ అవసరాన్ని పూర్తిగా ప్రతిబింబిం చదు. ప్రతిబింబించినా అది అలాగే వుండిపోదు - చరిత్ర గతిలో పెరిగే చైతన్య వికాసంలో సంస్థలు ఉద్యమాలుగా మనగలిగి నప్పుడే బతుకుతాయి. ఆ పాత్రను నిర్వహించడంలో ఆ సంస్థలు విఫలమయితే వాటిని కుబుసాల్లా వదిలేసి మరో అవసరమైన సంస్థ ఉద్యమ రూపాన్ని ధరిస్తుంది. ముందుకు పోతుంది.

"ఆంధ్ర మహాసభ" తెలంగాణాలో (1930) ఆవిర్భవించడం సాంస్కృతిక రంగాన్ని రాజకీయ రంగం చేసింది. అంతకు పూర్వమేర్పడ్డ గ్రంథాలయోద్యమ సంస్థలు, రెడ్డి వసతి గృహంలో నాటి రాజకీయ పరిమితిని చీల్చుకొని ముందుకు పోయాయి. 1930 నుంచి 1946 దాకా వరుసగా 13 ఆంధ్ర మహాసభలు ముందుకు సాగాయి. "జీ హుజూర్" స్థాయి నుండి "పారాహుషార్" స్థాయిదాకా "ఆంధ్ర మహాసభ" రాజకీయంగా ఎదిగింది. కారణం పోరాడే ప్రజలు సంస్థల శిష్టత్వాన్ని లాగిపారేసి సమాజ అవసరాల్ని ముందుకు తెచ్చారు.

1937లో నిజామాబాద్‌లో మందుముల నరసింహా రావుగారి అధ్యక్షతన జరిగిన 'ఆంధ్రమహాసభ' "బాధ్యతా యుతమైన ప్రభుత్వం తమఆశయమ"ని ప్రక టించింది. 1943లో హైద్రాబాదులో జరిగిన 10వ "ఆంధ్రమహాసభ" అతివాద మితవాదాలుగా విడిపోక తప్పలేదు. 1944లో రావి నారాయణరెడ్డిగారి అధ్యక్షతన భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్ర మహాసభ చరిత్ర గతినే మార్చివేసింది. పోరాడే ప్రజల్లో వున్న రాజీలేని "వర్గ విభజన" (polarisation) ఆకాంక్ష "ఆంధ్రమహాసభ"ను శిష్టుల చేతుల్నుండి బయట పడేట్లు చేసింది. పదకొండవ "ఆంధ్ర మహాసభ" తెలుగు ప్రజల మానాభిమానాల్ని

కాపాడడంతో బాటు "ఆర్థిక మనుగడ" ను కూడా ముందుకు తెచ్చింది. "వెట్టి చాకిరి నిర్మూలన", "భూ సంస్కరణలు" ప్రధానాంశా లయ్యాయి . నిజాంపోయి తాము ఆ స్థానంలోకి రావాలనే వారు 'శిష్టులు'గా వుండిపోయారు.

సరిగ్గా ఈ 11వ ఆంధ్ర మహాసభ ఘట్టంలో "ఆంధ్ర సారస్వత పరిషత్తు" ఆవిర్భావం ఒకరాజకీయ అవసరంగా వచ్చింది (1943). మనకు తెలియకుండానే చరిత్ర గతిలో మనచే కొన్ని కర్తవ్యాలు నిర్వహింప బడతాయి. అవి ఒక చారిత్రిక సందర్భంలో రాజకీయ పాత్రను నిర్వహిస్తాయి. రాజకీయ సమాజంలో ఏదీ రాజకీయాల కతీతంగా వుండదు.

"ఆంధ్ర సారస్వత పరిషత్తు" మొదట తెలుగు భాషాభిమానానికి ప్రాణం పోసింది. అందుకు సాహిత్య వ్యాసంగాన్ని, ప్రైవేటుగా భాషా పరీక్షల్ని, ప్రచురణల్ని మాధ్యమంగా చేసుకుంది. భాషా సాహిత్యాల బోధనకు సంబంధించిన ఏర్పాటు ఎందరినో చైతన్యవంతుల్ని చేయడమేగాక ఆ తర్వాత పాఠశాలలకు తెలుగు పండితులు తయారుకావడానికి వ్యవస్థనిచ్చింది. ప్రచురణలు, పాఠ్యాంశాలు, పరీక్షలు, సభలు, సమావేశాలు, ముఖ్యంగా చర్చా వేదికలు, పూర్వ సాహిత్య సమీక్షలు ప్రజల్లో "కదలిక" ను పెంచాయి. "మహాభారతో పన్యాసాలు", అష్టదిగ్గజోత్సవాలు" పుస్తకావిష్కరణ సభలు సాహిత్యాభిమానాన్ని పెంచాయి.

1953లో ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం (కర్నూలు రాజధాని) 1956లో ఆంధ్ర ప్రదేశ్ అవతరణ మధ్య కాలం చాలా కీలకమైంది.

తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం గ్రామ గ్రామాల్లో కలిగించిన చైతన్యానికి తెలుగు భాషా సాహిత్యాభిమానం ఒక 'అభివ్యక్తి' నిచ్చింది. అందుకు మధ్యతరగతి వారికి సారస్వత పరిషత్తు పరీక్షలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. 'ఆలంపూరు సభలు' చాలా ముఖ్యమైనవి. ఈ సభలు తెలుగు భాషా సాహిత్యాభిమానులకు వేదికలయ్యాయి.

1953 - 56 మధ్యకాలంలో "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" అంతటా వినిపించిన తెలుగు మాట్లాడే వారి భవిష్యత్తు - ఒక సమగ్ర సాంఘిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక ప్రణాళిక - తెలుగు వారందరూ ఒకచోటికి రావాలనే చిరకాల వాంఛ కార్యరూపం ధరించే ఉద్యమ కాలం. ఈ కాలంలో చదువుకున్న తెలంగాణా మధ్యతరగతి వారిలో "ఆంధ్రప్రదేశ్" ఏర్పడడానికి "అనుకూల వాతావరణాన్ని" ఏర్పాటు చేయడంలో, "ఆంధ్ర సారస్వత పరిషత్తు" పట్టణాల్లో సృష్టించిన "పూర్వరంగం" చరిత్రాత్మకం. ఒక వైపు "అలిగినవారు" తమ ప్రాబల్యంకోసం వేర్పాటువాదాన్ని మండిస్తుంటే, మరోవైపు తెలుగువారంతా ఒక రాష్ట్రంలోకి వస్తే తెలుగు వారి చిరకాల స్వప్నం నిజమవుతుందని అభ్యుదయ శక్తులు పోరాడుతుంటే, మరోవైపు తెలుగు వారిని ఏకం చేసే భాషా సంస్కృతుల కార్యక్రమాల్ని నిర్వహించి, "సమైక్యరాష్ట్రం" ఏర్పడడానికి పూర్వ రంగాన్ని సిద్ధం చేసింది ఆంధ్ర సారస్వత పరిషత్తు. ఇది నిర్వహించిన పాత్ర 'నిశ్శబ్ద ఉద్యమం" లాంటిది. ఆ తర్వాత వచ్చిన "సాహిత్య అకాడమీ" ల స్వరూప స్వభావాలకు ఆంధ్ర సారస్వత పరిషత్తు గుణాత్మకమైన నేపథ్యాన్నిచ్చింది.

"విశాలాంధ్రలో ప్రజారాజ్యం" విజయవంతం అయ్యుంటే తెలుగువారే మొత్తం దేశానికి నాయకత్వం వహించేవారు అన్ని విధాలా. ఉత్సవ విగ్రహాలుగా కొందరు ప్రముఖులు కనపడ్డా వారి ప్రభావం సంఘటనల మీద ఉంటే ఉండవచ్చు కాని చరిత్ర మీద శూన్యం.

తెలుగు అజంత భాష -కాని "ఆంధ్ర ప్రదేశ్" హలంత ప్రాతినిధ్యంగా రాష్ట్రానికి నామకరణం కావడం, "విశాలాంధ్రలో ప్రజారాజ్యం" రాకుండా జాగ్రత్త పడటంలాంటిదే.

ఏది ఏమైనా నన్నయగారు, పోతనగారు కలిశారు గురజాడ అప్పారావుగారు అంతటా వెలిశారు - శ్రీశ్రీ "మరో ప్రపంచం" సుదూర విముక్తిగీతంలో వినిపించింది.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వేదికకు ఏనాడూ వివక్ష లేదు. ఏనాడూ ప్రాంతీయ దురభిమానాలు కనిపించలేదు.

విశ్వనాథ వారి "కల్పవృక్షం" ఎంత నీడనిచ్చిందో వానమామలై వరదాచార్యుల వారి "పోతన చరిత్రము" అంత ఆత్మీయతనిచ్చింది. శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని ఎంతగా స్వాగతించిందో కాళోజీ "నా గొడవ"ను అంతగా ఆలింగనం చేసుకుంది. వానమామలై పద్యవిద్య నాదరించినట్లుగానే కుందుర్తి వారి "వచన కవిత్వాన్ని" ఆదరించింది ఆంధ్ర సారస్వత పరిషత్తు.

తెలంగాణాలో దాశరథి (సీనియర్) సి. నారాయణ రెడ్డి కాళోజీలు గ్రామ గ్రామాన తెలుగు అభిమానానికి నారు పోసి నీరు పోశారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తుమొదటి దశాబ్దం చరిత్రాత్మకమైనది. భాషా సాహిత్య చైతన్య వికాసాలకు అది నేపథ్యాన్నిచ్చింది. ఎందరో కవులు, పండితులు, ఉపాధ్యాయులు ఈ వేదిక మీద స్నాతకులయ్యారు. ఈ చారిత్రకతను నిలబెట్టడం నేటి సమస్య.

"ప్రపంచీకరణ" పుణ్యమా అని ఆంగ్ల భాషాభిమానం మధ్య తరగతిలో సవతితల్లిలా వచ్చి అసలు తల్లి నోరు మూయిస్తున్నది. బయటి దేశాలకు పోయేవారి ఆయువు పట్లన్నీ ఆంగ్లంలోనే వున్నాయి "భాషా రాష్ట్ర" సూత్రానికాధారంగా ఏర్పడ్డ "ఆంధ్రప్రదేశ్", భాషను మరిచి రాష్ట్రాన్ని ఊరేగించడంలో చిరునామాను కోల్పోయింది.

మాతృభాషలో విద్యా బోధనవల్ల "అభివృద్ధి" చెందని సమాజాల్లో "మౌలికమైన జ్ఞానం" వికసించడానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. జనచైనాలో మాతృభాషలో విద్యాబోధనను అనివార్యం చేసి జనచైనా అర్ధశతాబ్దంలోనే అగ్రరాజ్యాల్ని అన్నిరంగాల్లో ఢీ కొనగలుగుతున్నది.

అభివృద్ధి అనేది భాషా సంస్కృతులకు సంబంధించిన కీలకాంశం - దాన్ని విస్మరించి "మార్కెట్ల అభివృద్ధి" కి పరిమితంకావడం తిరోగమనానికి దారి తీయడం అవుతుంది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే అభివృద్ధి. ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ప్రజలు అన్ని ఉత్పాదక రంగాల్లో క్రియాశీలంగా పాల్గొనక తప్పదు. ప్రజల సృజనశీలతకు, క్రియాశీలతకు ప్రాణం భాషా సంస్కృతులు. వాటి వికాసంలోనే భౌతిక వికాసం ఒక సంస్కృతిగా అలరారుతుంది.

ఇప్పుడు, యంత్రం, కంప్యూటర్, సమాచార ప్రగతి అంగళ్ళ నిర్వహణ, యుద్ధసామగ్రి ఉత్పాదన, ప్రభుత్వ పరిశ్రమల బాధ్యతల్ని ప్రైవేటుపరం చేయడం, చేతి వృత్తుల అభివృద్ధిని నిలిపి వేయడం, ఆయుధ పోటీ రూపాయి కొనుగోలు శక్తి క్షీణించడం వగైరా సమాజ జీవితంలో "అశాంతి" ని సృష్టిస్తున్నాయి. ఆపై ప్రసార మాధ్యమాల దురాక్రమణ, సినిమాల దిశాహీనత.

ఈ దశలో మానవుడు మన తెలుగువాడు "వెసులు బాటు"గా పాటనాశ్రయించాలి. కీర్తననాశ్రయించాలి, పదాల్ని పాడాలి, పొడుపు కథల్ని చెప్పుకోవాలి, తత్వాలు, పాడుకోవాలి తద్వారా పొలంగట్టున, మగ్గం పక్కన, ఊరట పొందాలి. పొలం దెబ్బ తీసినా "ఆత్మహత్య" చేసు కోకుండా ఆత్మవిశ్వాసాన్నిచ్చే "పాట" ను 'పదాన్ని' కనీసం "గొంతుకలో కొట్లాడ" నీయాలి. ఆ సౌకర్యం ముందు తరాలకు లేకుండా చేస్తున్నది మాతృభాషేతర విద్యా బోధన.

ఏ ప్రాంతం ప్రజలకి ఆ ప్రాంతం ప్రజల భాషలో ప్రభుత్వ వ్యవహారాలు నడవాలనేది వారి భాషా సంస్కృతులను ఆ మేరకు "అభివృద్ధి" చేయాలనేది, "భాషా రాష్ట్రాల ఏర్పాటు" మౌలిక సూత్రం. రాష్ట్రం ఏర్పడి అర్ధశతాబ్దం కావస్తున్నా తెలుగులో ప్రభుత్వ ఉత్తర్వులు (జీ.వోలు), కోర్టు తీర్పులు, కలెక్టర్ల ఆదేశాలు, శేషప్రశ్నలు. అధికార భాషగా తెలుగు 50 సంవత్సరాలుగా విలసిల్లి వుంటే "వేర్పాటు ధోరణులు" అంతగా చెలరేగేవి కావు. చెలరేగినా, "భాషా సంస్కృతులు" కట్టిపడేసేవి. అలా 1950వ దశకంలో 60వ దశకంలో "వేర్పాటు ధోరణులు" విపరీతంగా వచ్చినా "భాషా బంధాలు" తెగించనీయలేదు.

50 సంవత్సరాల నిర్వాకంవల్ల తెలుగు భాషను పట్టించుకోకపోవడం వల్ల, ఆర్థిక సంక్షోభం పెరగడంవల్ల అసమానతలు స్పష్టంగా కనపడడంవల్ల, 'అభివృద్ధి'

ఏకపక్షం కావడంవల్ల, "వేర్పాటు ధోరణులు" చాలా సహజంగా రంగప్రవేశం చేస్తున్నాయి. ఇతరేతర కారణాలూ వుండవచ్చు. "భాషా సంస్కృతుల్ని" వేరు చేసి ఆలోచించడంవల్ల "అభివృద్ధి" ఏకపక్షంగా కొట్టొచ్చి నట్లు కనపడుతూ వుంది. అల్లరి చేసినవారికి కొన్ని పదవులు, ప్రాంతాలవారీగా, కులాలవారిగా పడేస్తే సమస్యలు తీరవు. వాయిదా పడవు.

భాషాసంస్కృతుల వికాసం, పాడిపంటల వికాసంలో చేతివృత్తుల మనుగడలో, పరిశ్రమల ఉత్పాదకతలో పరిఢవిల్లాయి. "సాహిత్య ప్రక్రియలు" ఎదుగుతాయి. నూతన ప్రక్రియలు రంగ ప్రవేశం చేస్తాయి. సమాజం ప్రతిదశలోనూ జనజీవాలతో వుండాలంటే భాషా సంస్కృతుల్ని వాటిని ప్రేమించే ప్రజల ఆకాంక్షల్ని పాలకులు పట్టించుకోవాలి. భవనాలు, విశ్వ విద్యాలయాలు, సంస్థలు ఏర్పాటు చేస్తే సరిపోదు. అభివృద్ధి చెందే "ఉత్పత్తి శక్తులకు", "సమాజగతి'కి, "ఆర్ద్రమైన ముడి" వేయడమే భాషాసంస్కృతుల వికాసం, ఆ పని కొంత మేరకు ప్రజలు చేసుకుంటారు. కానీ వారు ఆర్థిక సంక్షోభంలో "వలసలు" పోతున్నారు. ఉనికిని కోల్పోతున్నారు. తాగునీరు సాగునీరు లేక మానవ బృందాలు, దిక్కులేని పక్షుల్లా స్థానభ్రష్టం అవుతున్నాయి. ఈ దుర్దశలో వారి ఆర్తిని ఓదార్చేవి భాషా సంస్కృతులు.

ఏ వ్యవస్థ భాషా సంస్కృతుల్ని విస్మరిస్తుందో

ఆ వ్యవస్థ నిర్జీవమై అభివ్యక్తిని కోల్పోతుంది.

ప్రభుత్వాల ప్రయోజనాలు వేరు. ప్రజల ప్రయోజనాలు వేరు. ప్రజల ఆకాంక్షలకు అభివ్యక్తినీయడమే సంస్కృతి. అది ఉద్యమం ద్వారానే సాధ్యం.

వట్టికోట ఆళ్వార్ స్వామిగారి నవల తెలంగాణా ప్రజల అభివ్యక్తిని అక్షర బద్ధం చేసింది. ఉన్నవ వారి "మాలపల్లి" కూడా (1922) ఆ పనే చేసింది. తీరాంధ్ర ప్రాంతంలో అంతటి 'నవల' ఈనాడు కనుమరుగవుతున్నది. లేదని కాదు "తడి"ని పట్టుకోలేని పరాధీనత. అభివృద్ధి చెందుతున్న సమాజంలో పాత(ఫ్యూడల్) సమాజంలోని ఉత్తమమైన మానవ సంబంధాలకోసం పాటుపడే సంస్కారమే "నవల".

"ఆంధ్ర సారస్వత పరిషత్తు" ఒకనాడు ఉద్యమం. ఈనాడు సంస్థ తన పని తాను చేసుకుంటున్నది. మాతృభాషా వికాసోద్యమంలో "సారస్వత పరిషత్తు" తిరిగి ఉద్యమం కావాలి.

బోధన, శిక్షణ, ప్రచురణ, సభలు, సమావేశాలు, చర్చలు, ఉత్సవాలు, యధావిధిగా సాగుతున్నాయి. ఎందరో ప్రభావితులవుతున్నారు.

'మాండలికం' పేర ఒకరు తమను తాము వేరనుకుంటున్నారు. అధికులమనుకుంటున్నారు. మరో మాండలికాన్ని (సినిమాల్లో సీరియళ్ళలో) "నీచభాష" గా ప్రవేశపెడుతున్నారు. ఆనందిస్తున్నారు. "హాస్యం" కింద పోషిస్తున్నారు. ఈ 'వక్రబుద్ధి'ని దురాలోచనను, తద్వారా వేరుచేసే లేక వేరుపడే ధోరణి గురించి, అందలి సాంస్కృతిక (మాండలిక) అంశాల గురించి ఈ సంస్థలు శాస్త్రీయంగా ఆలోచించేటట్లు చేయాలి. విశ్వ విద్యాలయాల పరిశోధనలు "అకడమిక్" పరిమితుల్ని దాటవు. ప్రభుత్వాలకు ప్రధానాంశం కాదు. ఇక పట్టించుకోవాల్సింది రచయితలు, సంస్థలు, ఉద్యమాలు, (మలయశ్రీ ప్రసంగ వ్యాసం, మాండలికం గమనార్హం)

'ప్రపంచీకరణకు' నిశ్శబ్ద దురాక్రమణతో బడుగు దేశాల సమాజాలు ప్రాంతాల మనుషులు, జాతులు, భాషలు, ఏకంకావడం చారిత్రక కర్తవ్యం. ప్రాంతం కులం, మతం భాషవిబేదాలు చరిత్రకు సంబంధించిన గత అవశేషాలు. అవి చరిత్రను జ్ఞాపకం చేస్తాయి కాని, పునరావృతం చేయవు. గతం గుణపాఠం కావాలి కాని భారం కారాదు. భారంగా మోసినా సమాజ గతి ఇముడ్చు కోదు.

అందువల్ల భాషా సాహిత్యాల పాత్ర మారుతున్న ప్రపంచీకరణ వ్యవస్థలో సంస్థలు క్రియాశీలక పాత్ర వహించక తప్పదు.

చాల ఓపిక, చాల నిర్మాణ దక్షత, భిన్నాభిప్రాయాల్ని ఆదరించి సమన్వయం చేసే ఉత్తమ సంస్కారం వున్న బాధ్యతగల వ్యక్తుల(నాయకుల)అవసరం చాల కనిపిస్తుంది. దేవులపల్లి రామానుజరావు గారు జ్ఞాపకం వస్తారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన కాలం, అకాడమీలు వెలుస్తున్న కాలం, అంతా జమిలిగా కలిసిపోతున్న భాషా సంస్కృతుల వైవిధ్యాలు విచ్చుకుంటున్న సందర్భంలో, ప్రాచీన అర్వాచీన ఉద్రిక్తతల్లో అందర్నీ కలుపుకుపోయిన సమన్వయ శేముషి దేవుల పల్లి రామానుజరావు 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' అంతవరదాకా సాధించిన విజయాల్లో కొత్తగా వచ్చే అవసరాల మేరకు "రూపాంతరం" చెందేట్లు చేశారు. Transfer of cultural responsibility సాంస్కృతిక బాధ్యతల మార్పిడి అకాడమీవారి వృత్తి పదకోశాల నిర్మాణం వగైరా.

బోధన, శిక్షణ, ప్రచురణలు, సభలు, చర్చా గోష్ఠులు, యధావిధిగా కొనసాగినా, "ఆంధ్ర సారస్వత పరిషత్తు"ను ఒక Deemed విశ్వవిద్యాలయంగానో లేక CIEFL లాగా Institute గానో "స్వయంసత్తాక ప్రతిపత్తి", (Autonomous) గల సంస్థగా అభివృద్ధి చేస్తే బాగుంటుందనిపిస్తుంది. మౌలికమైన పరిశోధనలు భాషా సాహిత్యాల్లో సాంఘిక శాస్త్రాల ఆధారంగా చేయించడం ఈనాడు చాల అవసరం.

కనీసం 40 సంవత్సరాలుగా చాలా దగ్గరగా ఈ సంస్థ కార్యకలాపాల్ని కార్యక్రమాల్ని చూసి నేర్చుకున్నది చాలా వుంది. ఆ జ్ఞాపకం ఈనాడు సింహావలోకనం అయింది. గతంపైన, సంస్థలు, వ్యక్తులు, చివరకు మహాత్ములూ ఎక్కువ కాలం వుండలేరు. సామాజిక అవసరాల కనుగుణంగా వర్తమానంలో నిర్వహించే పాత్ర వల్లే వ్యక్తికిగాని సంస్థకు గాని ప్రాసంగికత వస్తుంది. నిలుస్తుంది. చరిత్ర గతికి దోహదపడుతుంది.

ఆ పని ఇదివరకు ఆంధ్రసారస్వత పరిషత్తు చేసింది. ఇప్పుడు కూడా చేయాలనేదే సవినయ ప్రార్థన. తగిన వారసులున్నారు. భయం లేదు.

తరతరాల మిశ్రమ సంస్కృతి

శ్రీ జి. వెంకట రామారావు

చరిత్రలోని ముఖ్య భాగమే సంస్కృతి. మన చరిత్ర ఏ విధంగా మార్పులు చెందుతూ వచ్చిందో మన సంస్కృతి కూడా ఆ విధంగానే మారింది. సంస్కృతిని బాగా ప్రభావితం చేసే మరో అంశం మతం. బౌద్ధ మతం, హిందూమతం, ఇస్లాం, క్రైస్తవ మతాలు మన సంస్కృతిని ఉద్దీపింపచేశాయి. అందుకనే మనది మిశ్రమ సంస్కృతి అయింది. ముస్లిం పాలకుల కాలంలో ఉత్తరాదినుండి వచ్చిన వారి కారణంగా మన సంస్కృతి మరింత విశాల రూపం ధరించింది. హైదరాబాద్ సంస్కృతిని 'పంచవేణీ సంగమంగా' పేర్కొన్నారు. ఆ సంస్కృతిలో పుట్టి పెరిగిన డా. బూర్గుల రామకృష్ణారావు. తరతరాల మన సంస్కృతి పట్ల విహంగదృష్టిని ప్రసరించడమే యీ వ్యాసం ముఖ్యోద్దేశం.

మహాభారత యుద్ధానంతరం ఉత్తర భారతంలో అనేక చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. అంతవరకూ గంగా, యమునా నదీ తీరాలలో నివసిస్తూ వచ్చిన అనేక తెగలు దక్షిణ దిశకు కదిలిపోసాగాయి. ఆంధ్రులు, కళింగులు, అలనాటి తెగలలో ప్రధానమైనవి. ఆ విధంగా ఉత్తర భారతదేశంలోకి తరలి వచ్చిన ఆంధ్రులు వింధ్యకు దక్షిణాన స్థిరపడ్డారు. నగరాలు నిర్మించుకున్నారు. రాజ్యాలు స్థాపించారు. ఈ నగరాలు దక్షిణ మహా రాష్ట్రనుండి తెలంగాణ వరకు వ్యాపించి ఉన్నాయి. వీరి రాజధాని ప్రతిష్ఠానపురము. ఇది ఔరంగాబాద్‌కు 35 మైళ్ళ దూరంలో ఉన్నది. ప్రస్తుతం దీని పేరు పైఠన్. రాష్ట్రాల పునర్నిర్మాణానికి పూర్వం ఈ ప్రతిష్ఠానపురం నిజాం రాష్ట్రంలోనిది. దీన్ని పాలించిన రాజులు శాతవాహనులు.

ఉత్తర హిందుస్థానము నుండి వచ్చిన ఆంధ్రులు, ప్రాచీనులైన నాగ, యక్ష తెగలతో కలిసిపోవడం ప్రారంభించారు. బృహత్కథ రచించిన గుణాఢ్యుడు, నాగజాతికి చెందిన తండ్రికి ఆంధ్రులలోని బ్రాహ్మణ కన్యకు ఉద్భవించిన వాడు. వివిధ తెగలు, సమ్మిశ్రణము చెంది నూతన జాతి ఏర్పడటం ప్రారంభమైంది. అంతేకాదు. పైఠాన్‌లో దక్షిణ మహారాష్ట్ర ప్రాంతాల పీఠభూములలో, దినదినాభివృద్ధి చెందే జనసంఖ్యకు అక్కడి ఆహార పదార్థాలు సరిపడలేదు. పత్తిపంట వారి ప్రధాన వృత్తి. ఆహార పదార్థాల కొరత వల్ల ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళడం తరచు జరిగేది.

ఈ పరిణామాల క్రమంలో దక్షిణ మహారాష్ట్రలోని ఆంధ్రులు కృష్ణ, గోదావరీ తీరాల వెంబడి నడిచి నేటి ఆంధ్రప్రదేశ్‌నంతా ఆక్రమించుకున్నారు. ప్రాచీనులైన నాగ, యక్షతెగలతో సంపూర్ణంగా విలీనమైపోయారు. మహాభారత యుద్ధంతో ప్రారంభమైన యీ వలస శాత వాహనరాజుల కాలంలో అంతమైంది. ఒకే ప్రాంతంలో సుస్థిరంగా నివసించనారంభించిన ప్రజలే క్రమంగా ఒక జాతిగా ఏర్పడుతారు. ఆంధ్రుల యీ చారిత్రక పరిణామం శాతవాహనుల కాలంలో జరిగింది. 'సామ్రాజ్యం' అనేది కూడా మన రాష్ట్రంలో శాతావాహన యుగంతోనే ప్రారంభమైంది.

సామ్రాజ్యాన్ని మనం ఇష్టం వచ్చినట్లు నిర్వహించ వచ్చు. కానీ సామ్రాజ్యవాదమనే పదాన్ని వాడినప్పుడు ఒక ప్రజగాని, దేశముగాని, రాజ్యమును గాని జయించి, వారిపైన రాజ్యాధికారాన్ని చెలాయిస్తూ ఉండే విధానమనే చెప్పుకోవాలి. ఆ విధానం స్థాపించిన స్థితిని సామ్రాజ్య మంటారు. కృష్ణానదీ తీరమువరకు అశోక చక్రవర్తి సామ్రాజ్యం ఉప్పెనవలె విస్తరించి ఆ వెంటనే తిరిగి వెళ్ళి పోయింది. కనుకనే మౌర్యసామ్రాజ్యప్రభావం ఆంధ్రులపై పడలేదు. మొదట అశోకునికి సామంతులుగా ఉండి, అటు తర్వాత స్వతంత్రులైన శాతవాహన రాజులు, స్వయం సంపూర్ణగ్రామ వ్యవస్థను మరింత దృఢతరం చేశారు.

వ్యవసాయాన్ని శాతవాహనులు ప్రోత్సహించారు.

వివిధవృత్తులవారు ఏర్పరచుకున్న శ్రేణులకు ధన సహాయం చేశారు, వర్తక వాణిజ్యాలు విస్తారంగా వృద్ధి చెందాయి. శిల్పకళ, సాహిత్యము వికసించింది. ఆంధ్ర ప్రజలలో వేరూనిన బౌద్ధమతాన్ని, సంస్కృతిని ఆ రాజులు ఆదరించారు. కులభేదాల కాఠిన్యం తగ్గింది. స్వయం సంపూర్ణ గ్రామ వ్యవస్థ, సుస్థిర నివాసం, వివిధ తెగల సమ్మేళనం - ఈ మూటిని సాధించిన ఒక చారిత్రక బాధ్యతను పూర్తి చేసినందువల్లనే, శాతవాహన యుగం ఆంధ్ర చరిత్రలో ఒక స్వర్ణయుగంగా ఎంచ బడింది. సంచార తెగల దశనుండి మారి ఆంధ్ర ప్రజలు సుస్థిర జాతిగా పరిణామం చెంద ప్రారంభించారు.

శాతవాహనుల కాలం సంస్కృతికి సంబంధించిన విశేషాలు తెలంగాణాలో కొన్నిచోట్ల లభ్యమైనవి. కరీం నగరు జిల్లాలోని కోటి లింగాల క్షేత్రం త్రవ్వకాలలో ఆనాటి ఆధారాలు లభించాయి. ఆ కాలంలో మురుగు నీటి సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందాయి. స్నానాల గదిలోని నీళ్ళు బయటకు పోయి, ఒక కూడలి స్థలంలో కలుసు కోవడానికి వీలుగా క్రమపద్ధతిలో డ్రైనేజీ పద్ధతి అభివృద్ధి చెందింది. బావుల చుట్టూ ఇటుక గోడలు నిర్మించారు. ఇనుప ఆయుధాలు కూడా దొరికాయి. గొలుసు కట్టిన ఒక ముళ్ళ ఇనుపబండి కూడా దొరికింది. దీనిని బట్టి అప్పటి రాజులు ఎంత ప్రమాదకరమైన ఆయుధాలు ఉపయోగించేవారో విదిత మవుతుంది.

ఇక మెదక్‌జిల్లాలోని కొండాపురం దిబ్బల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇవి ఆనాటి ఆంధ్ర నాగరికతకు శిథిల చిహ్నాలు. మెగస్తనీస్ క్రీ.పూ. 300 సంవత్సరాల కింద వ్రాసిన ఆంధ్రుల ముప్పయి పట్టణాలలో కొండా పురం ఒకటి. దిబ్బను త్రవ్వగా దొరికిన నాణాలను బట్టి, ఆ ప్రాంతాలలో గౌతమీ పుత్రుడు, పులోమావి రాచరికాన్ని నడిపారని తెలుస్తున్నది. ఇక్కడ బంగారు నాణేలు దొరికాయి. అందులో కొన్ని రోమన్ నాణేలు, ఒకటి బంగారపుది. ఈ బంగారపు నాణెంపై రోమన్ చక్రవర్తి అగస్టిన్ రాచరిక చిహ్నాలున్నాయి. ఇతడు క్రీ.పూ. 37వ సంవత్సరం నుంచి క్రీ.శ. 14వ సంవత్సరం వరకు పాలించాడు. నాణేలలో కొన్ని రాగివి. కొన్ని సీసపువి. ఇవి క్రీ.పూ. 300 నుండి క్రీ.శ. 200 సం.ల మధ్యన పాలించిన ఆంధ్ర రాజులవి.

తెల్లమట్టితో చేసిన అనేక విగ్రహాలు కొండాపురంలో దొరికాయి. ఆ బొమ్మలకు రంగులు కూడా పూసేవారు. చేతిలో 'త్రి రత్న' చిహ్నం కలిగి ఉన్న విగ్రహాలు, చేతిమీద చిలుకనో, పావురాన్నో ఎక్కించుకుని ఉన్న బొమ్మలు - స్త్రీ పురుషులవి అనేకం దొరికాయి. త్రిరత్నం చిహ్నం బౌద్ధ మతస్థులు ధరించేవి. బుద్ధుడు - ధర్మం - సంఘం మూడు కలిసి త్రిరత్న అవుతుంది. బహుశా యీ ప్రాంతంలో హీనయాన బౌద్ధమతం వ్యాప్తిలో ఉండి ఉంటుంది. సింహాలు, ఎడ్లు, పొట్టేళ్ళు, కుక్కలు, చిలుకలు, గుర్రాలు కొండాపురం దిబ్బలో దొరికాయి. అక్కడ పింగాణి పరిశ్రమ కూడా ఉండేదని, మంచి అభివృద్ధి లోకి వచ్చిన పరిశ్రమ కూడా అయి ఉంటుందని తోస్తుంది. అంతటి మహోన్నతమైన కొండాపురం మత విద్వేషాగ్నిలో పడి బుగ్గి అయినట్లు చారిత్రకాధారాలు కనిపిస్తాయి. స్తూపాలు, త్రిరత్న చిహ్నాలు, విహారాలు దొరికాయి. కనుక యీ ప్రాంతం చాలాకాలం బౌద్ధమత కేంద్రంగా ఉండేది. కానీ తరువాత బౌద్ధమతానికి శత్రువులైన ఆంధ్ర రాజులు వచ్చారు. ముఖ్యంగా గౌతమీ పుత్రుడు (క్రీ.శ. 78-102) బౌద్ధమతద్వేషి. ఇతని పుత్రుడు పులోమావి (క్రీ.శ.102-130) తండ్రి క్రింద సామంతుడుగా ఉండి తన పేరుతో నాణేలు వేయించు కున్నాడు. అవే నాణేలు కొండాపురంలో దొరికాయి. బహుశా కొండాపురంలో బౌద్ధమతాన్ని తుడిచి వేసి వర్ణాశ్రమ ధర్మాన్ని నిలపడానికి గౌతమీపుత్రుడు, పులోమావి దండయాత్రలు చేసి ఉంటారు. ఆ దండయాత్రలలో, బౌద్ధమతాన్ని తుడిచి వేయలేక కొండాపురాన్ని విడిచి వేశారేమో!

ఆచార్యనాగార్జునుడు శాతవాహనులకాలంవాడే. నాగార్జునుడు తన విజ్ఞానాన్ని వ్యాప్తి చేయడానికి ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించి దానిలో జాతి కులమత విచక్షణ లేకుండా అందరికి ప్రవేశం కలిగించాడు. చైనా, టిబెటు, కాశ్మీరు, సింహళం దేశాలనుండి వచ్చిన విద్యార్థులు ఇక్కడ చదువుకునేవారు. విద్య బ్రాహ్మణుల

సొత్తు మాత్రమే కాదని, అందరికి సమానంగా విద్యార్హత గలదని బౌద్ధమతం భావ విప్లవాన్ని తెచ్చింది.

ప్రాకృతం శాత వాహనుల రాజభాష. శాసనాలు, గ్రంథాలు, రాజ్యాంగ వ్యవహారాలు అన్నీ ఈ భాషలోనే జరిగేవి. ఈ ప్రాకృతభాష ఒక రూపమే పాళీ భాష. ఈ పాళీ భాషలోనే బౌద్ధ మతగ్రంథాలు రచించ బడ్డాయి.ఆ సమయంలోనే సంస్కృత భాష ప్రవేశించింది. సంస్కృత, ప్రాకృత భాషలు రెండూ ఒకే భాషాకూటమికి చెందినవి. ఈ రెంటికి గల తేడా గ్రాంథిక, వ్యావహారిక భాషకు గల తేడా మాత్రమే. కనుకనే ఆంధ్ర దేశంలో ప్రాకృతాన్ని అతిత్వరగా తొలగించి సంస్కృతం ఆ స్థానాన్ని ఆక్ర మించింది. పల్లవ రాజుల కాలంనుండి ఆంధ్ర దేశంలో సంస్కృతమే రాజభాష అయింది.

చాళుక్యుల కళాభిరుచికి అనువుగా నిర్మితమైన ఆలయాలు ఆంధ్రప్రదేశ్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలోనే తప్ప మరెక్కడా కానరావు. కోటి లింగాల క్షేత్రమని కూడా వ్యవహారితమయ్యే అలంపూరులోని ఆలయాలు విభిన్న రీతుల్లో ఉన్నాయి. భూదేవి, ప్రక్కన జోగులాంబ ఆలయాలు ఉన్నాయి. వాటి గోడలపై గంధర్వ జంటలు, విహరిస్తున్న అప్సరసలు, ఇతర శిల్పాలు, బొమ్మలు ఆ నాటి రాజుల కళాభిమానానికి మచ్చుతునకలు. దేవాల యాలపై నిలువెత్తు దేవతా విగ్రహాలున్నాయి. నట రాజు, అష్టదిక్పాలకులు, త్రిపురాసురమర్దని మొదలైన విగ్రహాలు మలచ బడ్డాయి.

హిందూ మతపునరుద్ధరణ: భక్తి మార్గాలు:

ఏడవ శతాబ్ది ప్రారంభానికే దక్షిణ భారతదేశంలో బౌద్ధమతం దాదాపు అంతరించి పోయిందనే చెప్పాలి. అయినప్పటికీ హిందూమతస్థులు బౌద్ధ, జైన మతాల ముందు తమమతం ఏమవుతుందోనని భయపడేవారు. ఈ నిస్పృహ మతోద్రేకానికి కారణమై భక్తి ఉద్యమానికి దారి తీసింది.

హిందువులకు ముఖ్యమైన ఆరాధ్య దేవతలు శివ, విష్ణువులు. నిర్గుణారాధన స్థానాన్ని సగుణారాధన ఆక్రమించింది. ఈ యుగ లక్షణ ఆవేశానికిలోనైన యోగులు, మహాభక్తులు అనేకులు పుణ్యక్షేత్రాలకు యాత్రలు చేస్తూ భక్తి గీతాలను గానం చేసేవారు. దయా మయుడు, మానవుని దుఃఖాలను తక్షణం నివారించే వాడు, అఖండమైన ఆనందాన్ని ప్రసాదించేవాడు, అయిన ఇష్టదైవంపట్ల గాఢమైన భక్తి ఉప్పొంగింది. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించిన ఆచార్యులు తమకు ప్రతిస్పర్థులైన జైనులతోను, బౌద్ధులతోను మత విషయమైన చర్చల్లో స్వయంగా పాల్గొనేవారు. హిందు వులలోని శైవ, వైష్ణవ శాఖలు రెంటిలోను భక్తి ఉద్యమం బయలు దేరిందీ విధంగా.

పన్నెండవ శతాబ్దంలో ఆంధ్ర, కర్నాటక దేశాలలో ఉదయించిన వీర శైవం లేక లింగాయతు పూజ హిందు సంఘ సంస్కరణలో మరొక శాఖ. క్రీ.శ. 1156లో కల్యాణి చాళుక్యుల రాజ్యాన్ని వశపరుచుకున్న బిజ్జలుని ప్రధాన మంత్రి బసవేశ్వరుడు ఈ మతాన్ని స్థాపించాడు. ఈ మతంలో శివుడే దేవ దేవుడు. ఈ మత సిద్ధాంతాలకు 28 శైవ ఆగమాలు మూలాధారం. వీర శైవులకు నాయనార్లు మార్గోప దేశిష్టులు. చైతన్య ప్రదాతలు అయితే వీర శైవానికి ఇతర మతాలంటే ఎంత మాత్రం కిట్టదు. అది వేదాలను తిరస్కరించింది. వర్ణవ్యవస్థను త్రోసిరాజన్నది. వీరశైవంలో మరొకశాఖ ఆరాధ్యశైవం. ఇది ఆంధ్ర దేశంలోనే ఎక్కువ కనపడుతుంది. బసవేశ్వరునికి సమకాలికుడైన పండితారాధ్యుడు దీన్ని ప్రవేశపెట్టాడు. 'వీరశైవ సిద్ధాంత శిరోమణి' లో 'భవిని' గూర్చి ఇట్లా చెప్పబడింది. మద్యపానం చేసేవాడు, మాంసం తినేవాడు, శివేతర దైవాలను పూజించేవాడు, లింగాన్ని ధరించనివాడు, శాస్త్ర విరుద్ధాచారం కలవాడు. ఈ అయిదుగురు భవులు. ఆ భవిని తాకినా, కనీసం చూసినా పంచ మహాపాతకాలు చుట్టుకుంటాయన్నాడు పండితారాధ్య చరిత్ర రచయిత పాల్కురికి సోమ నాథుడు.

భక్తి ఉద్యమం ప్రభావంగా మన సాహిత్యంలో దేశి కవిత ప్రచారంలోకి వచ్చింది. తెలుగులో ద్విపద, మంజరి, జాజర, చందమామలు, కోయిల, చిలుక, తుమ్మెద పదాలు, లాలి, సువ్వి, గొట్టి, ఉయ్యాల, జోల జోజో

తందానలు, చాంగబళాలు ఒక్కటేమిటి? దేశి కవితా కమలం వేయి రేకులతో వికసించింది. భక్తికీ, సంగీతానికి అవినాభావ సంబంధం ఉందని నిరూపించింది దేశి కవిత.

మనకు తెలిసినంతలో మొదట ఆంధ్రసాహిత్యంలో మార్గదేశీ కవిత్వ విభాగాన్ని తెచ్చి సాహిత్య పరంగా సమన్వయ పరిచిన వాడు నన్నె చోడుడు. ఇతడు 1040 ప్రాంతం వాడని పెద చెరుకూరు శాసనాన్ని ఆధారంగా చేసుకుని జయంతి రామయ్యపంతులుగారు నిర్ధారించారు. సూటిగా, తేటగా కవిత చెప్పాలంటే జాను తెనుగుకు దీటులేదని చాటినవాడు పాల్కురికి సోమనాథుడు. వీధిమానిసి మాట్లాడుకునే తెనుగును అపౌరుషేయాలైన వేదాల సరి బంతిలో నిలపడం పాల్కురికి గుండె ధైర్యానికి నిదర్శనం.

భక్తి ఉద్యమం వల్ల వైష్ణవమతంలో కూడా పరివర్తన కలిగింది. వైష్ణవ యోగులు పాటలద్వారా జన సామాన్యంలో భక్త్యావేశాన్ని రగుల్కొలిపారు. వైష్ణవగురు పరంపరలో విశిష్టస్థానం పొందినవారు నమ్మాళ్వారు. ఈయన రచించిన పాశురాలు (పాటలు) నాలాయిర ప్రబంధంలోని 'తిరువాయ్ మొడి'. విష్ణువు కోసం భక్తుడు పడే ఆవేదనంతా ఆ కమ్మని కవిత్వంలో కనిపిస్తుంది. పెరియాళ్వార్ కూతురు ఆండాల్. ఈ యుగంలోని వైష్ణవ యోగినులలో విశిష్ట స్థానం ఆమెది. ఆమె రచించిన 'తిరుప్పావై' వైష్ణవలోకంలో అనుదినం పారాయణ గ్రంథం. పదోశతాబ్ది చివరలో మతోద్యమంలో వికాస హేతువైన ఆధ్యాత్మికత సన్నగిల్లింది. ఆళ్వార్ల స్థానాన్ని ఆచార్యులా క్రమించారు. ఈ నవీన మార్గాన్ని లేవదీసిన వారు రంగనాథాచార్యులనే నాదముని. విశిష్టద్వైత వేదాంతంపై న్యాయతత్వం అనే గ్రంథాన్ని ఈయన రచించారు. ప్రపత్తి అనే భక్తి సిద్ధాంతాన్ని అందులో ప్రతిపాదించారు. ఆళవందార్ అనే నామాంతరం గల యామునా చార్యులు ఈయన మనమడు.

బహమనీ సుల్తాన్ల పరిపాలనలో (1347-1527) పర్షియా నుంచి వచ్చి స్థిరపడిన వారి సంఖ్య ఎక్కువ. అలా వచ్చిన ఆఫాకీలు, హాబాషీలు షియామతస్థులు. సుల్తాన్లు వీరి ఎడల ఆదరణ చూపేవారు. గొప్ప గొప్ప ఉద్యోగాలిచ్చే వారు. వీరు దక్కనుకు వచ్చి సూఫీమతాన్ని అవలంబించారు. ఇస్లాంలోని సాత్వికమత ధోరణికి వీరు ప్రతినిధులు. ఢిల్లీసుల్తాన్ల ప్రతినిధులుగా వచ్చి దక్కనులో స్థిరపడినవారు సున్నీలు. వీరికి మతద్వేషం హెచ్చు. సున్నీ, షియాల పోరాటాల ఫలితమే బహమనీ సల్తనత్ విచ్ఛిన్నం.

కాకతీయులు పోషించిన సమైక్య సంస్కృతి:

11, 14 శతాబ్దాలమధ్య దాదాపు రెండు వందల సంవత్సరాలకు పైగా ఓరుగల్లు రాజధానిగా తెలుగునాడును ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించినవారు కాకతీయులు. ఆంధ్రుల చరిత్ర, సంస్కృతికి సంబంధించినంతవరకు కాకతీయ రాజుల పరిపాలనాకాలం స్వర్ణయుగమని భావించవచ్చు.

తెలుగు ప్రజలను తరతమ భేదం లేకుండ ఒక సమాజంగా భావించి ఆదరించిన ఘనత కాకతీయులకే దక్కుతుంది. వారు మన సంఘీభావ స్ఫూర్తికి ప్రతీకలు, కళలు, సాహిత్యం, తెలుగు భాషా వికాసం కాకతీయుల కాలంలో అభివృద్ధి చెందినంత మరేకాలంలో అభివృద్ధి చెందలేదు. కాకతీయులు ఎంతో ప్రణాళికా బద్ధంగా నిర్మించిన లక్నవరం, గనపురం, రామప్ప, పాకాల చెరువులు నీటితో వరంగల్ జిల్లా ప్రజలు నేటికీ తమ భూములను సాగుచేసుకుంటున్నారు. కాకతీయుల కాలంలో సంగీతం, సాహిత్యం, నృత్యం, శిల్పకళ, చిత్రలేఖనం, విద్యా చతుష్షష్టి కళలు మూడుపువ్వులు, ఆరుకాయలుగా వికసించాయి. కాకతీయులు శైవులైనా శైవంతో పాటు బౌద్ధ, జైనమతాలపట్ల అభిమానం ప్రదర్శించారు.

ఈ యుగంలో దేవాలయ నిర్మాణం విరివిగా జరిగి తెలుగువారి శిల్ప కళావిన్యాసం ఆ నల్లని కఠిన శిలలపై వెన్నెలలా ప్రవహించింది. కాకతీయ దేవాలయాలు సాధారణంగా త్రికూట నిర్మాణాలు. ప్రధానాలయం సరసనే మరో రెండు చిన్న దేవాలయాలుండడమనేది సాధారణ విషయం. ప్రధానాలయం శివుని కంకితం

కాగా మిగిలినవి ఇతర దేవతల కుద్దేశించినవి. కాకతీయ శిల్పాల్లో ఏ మూర్తి కూడా నిశ్చలంగా నిల్చునే ఉండదు. చివరకు చామరధారులు సైతం కదలికను సూచించే ఏదో ఒక భంగిమలోనే చూపబడినారు. శిల్పానికి గాను, చిత్రానికిగానీ విలువను తెచ్చేది ఇట్టి జీవ చైతన్యమే. హంసకూడ యీ కాలపు శిల్పంలో విరివిగా ఉపయోగానికి వచ్చింది. కాకతీయుల హంసలన్నీ ఠీవిగా నిలబడి వంపులు తిరిగిన అందమైన పింఛాలతో బారులుగా సాగిపోతాయి. పద్మం కాకతీయ శిల్పుల చేతిలో ఒక ప్రత్యేక వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నది. ఖాళీలున్న చోటల్లా ఒక ప్రమాణిక రూపంలోనున్న పద్మాన్ని అసంఖ్యాకంగా సృష్టించి వదిలారు. హనుమకొండలోని వేయి స్తంభాలగుడి, పాలంపేటలోని రామప్పగుడి, నగరంలోని బ్రహ్మాండమైన కోట మొదలైనవన్నీ కాకతీయుల ఘనతను చాటుతున్నాయి.

ఆంధ్ర రాజులు పులకేశి నెదిరించింది నల్లగొండ దగ్గరనే. బహమనీ సుల్తాన్‌తో పోరాడిన జలాల్ ఖాన్‌కిది రాజధాని. భువనగిరి రాతికోట, పద్మనాయకుల కోటలు- దేవరకొండ రాజుల వైభవ ప్రతీకలు. పానుగల్లు, పిల్లలమర్రి, నాగులపాడు దేవాలయాలకు ఎంతో చరిత్ర వుంది. దేవరకొండ కొంట ఏడు కొండల నడుమ ఉంది. వెలమ రాజులకాలం నాటిదని ప్రతీతి. కాకతీయ ఉదయాదిత్యుని కాలంనాటి మూడు దేవాలయాలు ఇక్కడ ఉన్నాయి. మహాభారత, రామాయణ గాధలు చెక్కిన 66 స్తంభాల దేవాలయం వీటిలో ఒకటి. భువనగిరికి 20 మైళ్ళ దూరంలో ఉన్న కొలనుపాక జైనుల పవిత్ర యాత్రా స్థలం.

వైభవోపేతమైన విజయనగర సామ్రాజ్యం:

మధ్య యుగంలో దాదాపు మూడున్నర శతాబ్దాల కాలం హిందూ ధర్మ పరిరక్షణానికి కంకణం కట్టుకున్నది విజయనగర సామ్రాజ్యం . ఒక్క తెలుగు దేశమే కాదు - ఆంధ్ర, కర్నాటక, కేరళ, ద్రావిడ సామ్రాజ్యంగా వెలిగి దక్షిణాది నంతట తన సాంస్కృతిక వెలుగుల వైభవం ప్రదర్శించింది. పారశీక చక్రవర్తి, షాఫారుఖ్ తన రాయబారి అబ్దుల్ రజాక్‌ని ప్రౌఢ దేవరాయల కాలంలో (1443)లో విజయనగర యాత్రకు పంపించాడు. అతడు విద్యానగర సామ్రాజ్య వైభవాన్ని కనులకు కట్టినట్లు వర్ణించాడు.

విజయనగరంతో సమానమైన నగరం ఆ రోజుల్లో ప్రపంచంలో మరెక్కడా లేదని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు. ఏడు ప్రాకారాల మధ్యకోటైన ఈ నగరం శత్రు దుర్భేద్యమైనది. ఏడవ ప్రాకారం మధ్యలో రాయలు కొలువు కూటములు, కచ్చేరీలు ఉండేవి. రాజవీధులు అతి విశాలంగా ఉండి, ఇరు పక్కల వివిధ పుష్ప విక్రయ శాలలుండేవి. ఆ రోజులలో ధనికులు తమ నివాస భవనాలను చంద్రకాంత శిలలతోను, గరుడపచ్చలతోను కట్టుకున్నారు. విజయనగర రాజులకాలంలో, ప్రాచీన చాళుక్య, కాకతీయ, హొయసల శిల్పాలతో ద్రవిడ పద్ధతి కలిసిపోయింది. తుంగభద్ర నీరును రాతి కాలువల ద్వారా రాచనగరుకు తెచ్చారు. విజయనగర సామ్రాజ్య రాజధాని హంపిలో అలనాడే చక్కని నీటి సరఫరా సంప్రదాయం ఉండేది. విజయనగర హైడలిక్ ఇంజనీరింగ్ విధానం గురించి చక్కటి పరిజ్ఞానం కలిగి వుండేవారు. నిత్యా వసరాల నిమిత్తం ప్రజలు రాయచెల్ కాలువనుండి నీటిని ఇక్కడికి తెప్పించుకున్నారు.

నాటి ప్రజలు సామాన్యంగా భోగ పరాయణులు, స్త్రీ లోలురు. శృంగారము శృతిమించిపోయింది. సౌందర్యోపాసన పరమావధి అయింది. దానికి కారణం నాటి సాంఘిక పరిస్థితులు. మహమ్మదీయుల సంపర్క, సావాసములతో నాటి ప్రజాభిరుచులు మారినవి. అన్నిటా వారిని మించి పోవాలన్న కోరిక కలిగింది. భోగ పరాయణులైన మహమ్మదీయులతో సమానంగా భోగాభిలాష హెచ్చింది. రెడ్డి రాజులు, పంజాబు, పారశీక మొదలైన దేశాలనుండి జావా, సుమత్రా మొదలైన దేవులనుండి కస్తూరి, కర్పూర, సుగంధ ద్రవ్యాలను దిగమతి చేసుకునేవారు. భోజనము షడ్రసోపేతము, తాంబూల సేవనము సార్వజనీనము. ఆనాడు స్త్రీ పురుషులు రత్నాలు ధరించేవారు. అంగళ్ళలో రత్నాలు రాసులు పోసి విక్రయించేవారు. రసికులు నడుముకు బంగారు మొలతాడు, చేతులకు రత్నకంకణాలు,

భుజాలకు కేయూరాలు, మెడలో రత్న హారాలు, చెవులకు రత్నాలు పొదిగిన బంగారు మకరకుండలాలు వేసుకునే వారు. కంఠానికి తులసిపూసలు వేసుకొని పద్మ మాలికలు తిప్పేవారు. శైవులు సిగలలో శివలింగాలు ధరించి ఫాల భాగాన విభూతి దిద్ది రుద్రాక్షమాలలు వేసుకునేవారు. ఆనాడు తాంబూలసేవనం ఎంత ముఖ్యమో పుష్ప ధారణకూడా అంత ముఖ్యమే. దేవతలనే కాదు మరెవరిని పూజించాలనుకున్నా పూలతోనే పూజించే వారు. అంత పుష్ప ప్రీతికలవారు కనుక ప్రతి యింటా పూలతోటలను పెంచేవారు. పురుషులు నీర్కావి ధోవతులు, ఉత్తరీయాలు ధరించేవారు. స్త్రీలు వివిధ రంగుల చీరలు ధరించేవారు.

ఆకాలంలో పురుషులు బలశాలురు. శౌర్య, ధైర్య సాహసాలు గలవారు. పుష్టికరమైన ఆహారం తిని శరీర వ్యాయామం చేసేవారు. మల్లులు పోటీలుపడి బల ప్రదర్శన లిచ్చేవారు. ఆనాడు తెలుగు భాష గోదావరి తీరంనుండి కన్యాకుమారి వరకు వ్యాపించింది. తెలుగు రానివాడు నాగరికుడుకాడు అనేంతవరకు అది వర్ధిల్లింది. తెలుగున నుడులతోను, పలుకుబడులతోను వైష్ణవ భక్తి భరితాలైన శృంగార కీర్తనలు రచించిన పదకవితా పితా మహుడు అన్నమయ్యను సత్కరించిన రాజు సాళువ నరసింహ రాయలు. సంగీత నాట్య కళలు విజయ నగరంలో పురివిప్పి నాట్యం చేశాయి.

విజయ నగర రాజుల కాలంలో స్థానిక పరిపాలన వ్యాప్తిలో ఉండేది. గ్రామ పరిపాలన పంచాయితీ సభల ద్వారా జరిగేది. పంచాయితీ ఎన్నికలు ఏటా జరిగేవి. ఎన్నికైన పెద్దలే పన్నులు వసూలు చేసే వారు. చోరుల బాధనుండి గ్రామాలనురక్షించే పని తలారులది. దొంగలను పట్టుకొని రక్షక భటులు పంచాయితీలకు అప్పగించేవారు. విచారణ సభలు దేవాలయాలలోను, రచ్చకట్టులలోను నిర్వహించేవారు. ప్రజలు పాపభీతిగల వారై తప్పుడు సాక్ష్యాలకు దూరంగా ఉండేవారు. న్యాయ బుద్ధితో నేరాల పరిశోధన జరిగేది. అధికారులలో లంచగొండి తనం ఆశ్రిత పక్షపాతంలేకపోవడం వలన ప్రజలకు వారి ఎడల గౌరవం వుండేది. విజయనగర రాజులుప్రాచీన పద్ధతిలోనే పరిపాలన జరిపారు.

సకల కళలకు, సకల సంపదలకు నిలయంగా భాసించింది విజయనగరం. హిందువులు స్థాపించిన చివరి గొప్ప రాజ్యంగా చరిత్రలో దాని పేరు స్థిరపడి పోయింది.

తెలుగదేలయన్న, దేశంబు తెలుగేను
తెలుగు రేడ నేను తెలుగొకండ
ఎల్లవారు వినగ ఎరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగు లెస్స' అని చెప్పిన సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు. తెలుగు సాహిత్యంలో ప్రబంధ యుగమంటే రాయల యుగమే.

ముస్లిం పాలకుల మత సహనం:

ఆంధ్ర ప్రదేశ్‌లో 8వ శతాబ్దంలోనే ముస్లింలు నివసించినట్లు చెప్పబడుతున్నది. అజ్మీరు నుండి చాలా మంది సూఫీ ఫకీర్లు వచ్చి దక్షిణా పథంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వారిలో గుల్బర్గాలో స్థావర మేర్ప రచుకున్న క్వాజా బంద్ నవాజ్, కర్నూలులోని షాహుసేన్, విశాఖపట్నంలోని హిస్మక్ మదీనా, పిఠాపురం లో నివాస మేర్పరచుకున్న అఖిల్ అలీషా, నాగూర్‌లో నివసించిన మీర్జా అలీ వుండేవారు. వీరిలో ఖాదర్ వలీ వంటి అనేకుల గోరీలు ఈనాటి వరకూ యాత్రా స్థలాలుగా ప్రసిద్ధి చెంది వున్నవి. దేశంలో జరిగిన అనేక యుద్ధాల సందర్భంగా మహమ్మదీయ సైనిక కుటుంబాలు ఎన్నెన్నో వచ్చి తెలుగుదేశంలో స్థిరపడి పోయినవి. దక్కనులో మహమ్మదీయ పరిపాలన ప్రారంభం కావడంతో సహజంగానే మతవ్యాప్తికి కూడ కొంతవరకు ప్రోద్బలం కలిగింది. కాని మొగల్ సామ్రాజ్యంమీద తిరుగుబాటు దారులైన ఇక్కడి మహమ్మదీయ రాజులకు స్థానిక ప్రజలతో సత్సం బంధాలు పెంపొందించుకొనుట అవశ్య కర్తవ్యమైనది. అందువల్ల వారు బలవంతపు మతాంతరీకరణకు అనుమతించలేదు. అంతేకాదు, వారు ముస్లిం సంస్థలతో పాటు హిందూ దేవాలయాలు, ధర్మసంస్థలకు కూడ దాన ధర్మాలు చేశారు. తద్వారా మతసహనాన్ని సమానత్వాన్ని నిలబెట్ట గలిగారు.

పదునారవ శతాబ్ది ఆదినుంచి పదునేడవ శతాబ్ది చివరివరకు అఖిలాంధ్రాన్ని పాలించిన వారు గోలకొండ కుతుబ్‌షాహీ నవాబులు. కుతుబ్‌షాహీలు సూఫీ వర్గీయులు. సూఫీ భక్తి తత్త్వానికి ప్రేరణ కలిగిస్తుంది. కనుక కుతుబ్‌షాహీల పాలనలో హిందూ ముస్లిం మతాచారాలు, నాగరికతలు, వేడుకలు, వినోదాలు విడదీయ రానంతగా కలిసిపోయినై .

కుతుబ్ షాహీలు మహమ్మదీయులై హిందూ దేవాలయాలను పోషించారు. కుతుబ్‌షాహీ సుల్తాన్లలో చివరి వాడైన అబుల్ హసన్ తానీష కాలంలో భద్రాచలం ప్రాంతంనుండి తహసీల్దారుగా వున్న కంచెర్ల గోపన్న భద్రాచల రామాలయ నిర్మాణానికి ప్రభుత్వ ధనాన్ని వినియోగించి సీతారాములకు అనేక అమూల్య ఆభర ణాలు తయారు చేయించాడు. ఈ అపరాధానికి **14** సంవత్సరాలుజైలు శిక్ష అనుభవించాడు గోపన్న. ప్రభుత్వ సంపదంతా భద్రాచలం ఆలయంలోనే రత్నా భరణాల రూపంలో ఉందని తెలుసుకున్నా దాన్ని పడగొట్టించక పోవడం తానీష మత సహనానికి తార్కాణం. ఇలాంటి ఉన్నత సంప్రదాయం మన చరిత్రలో మరొక చోట కానరాదు.

గోలకొండ కోట నిర్మాణం అడుగడుగున ఎన్నో ప్రత్యేకతలు కనిపిస్తాయి. ఈ కోట రక్షణకై దాని నిర్మాణ కర్తలు తీసుకున్న జాగ్రత్తలు మనల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తి వేస్తాయి. శత్రువులు యుద్ధ సమయంలో కోటలని బాలాహిసార్ గేటును ఏనుగులతో పగుల గొట్టించి లోనికి ప్రవేశించకుండా నిరోధించడానికి సమున్నతమైన రాతిగుమ్మంమీద నుండి మరిగే నూనెను, కరుగుతున్న లోహాన్ని శత్రువుల పైకి పోయడానికిగాను ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇక శత్రువుల కదలికలను జాగ్రత్తగా గమనించి తగు చర్యలు తీసుకొనడానికి గాను కర్టెయిసీవాల్ అనే తెరవంటిగోడ నిర్మించారు. ఇకపోతే కింది భాగంనుండి పైభాగానికి చప్పట్లద్వారా శత్రువుల రాకను తెలియచెయ్యడానికి గాను 'వైబ్రేషన్' ఏర్పాటు ఆనాటి సాంకేతిక విజ్ఞానానికి చక్కని ఉదాహరణ. దర్బారహాల్ లోకి ప్రవేశిస్తే ఎయిర్ కండిషన్ హాల్‌లోకి ప్రవేశించినట్లు ఉంటుంది.

ఇబ్రహీం కులీకుతుబ్ షా మల్కిభరాముడైనాడు. ఇతడు తెలుగు కవులను ఆదరించి తెలుగు భాషను పోషించాడు. కవి అంటే సరి చెవి తెగగోసుకునే అభిరుచితో ఈ గోల్కొండ నవాబు రాజ్యమంతా తన కవులను సృష్టించాడు. కవిత్వం రాని వారుకూడా అనేక మంది ఈతని ముందు జిలిబిలి అల్లికలు అల్లి 'వల్లె' అనిపించుకుని 'ముల్లెలు' సంపాదించుకునేవారు. అటువంటి కవులిద్దరు ఒకప్పుడు మాల్కిభరామ్‌ని గూర్చి

'యరలవ మదనస యనుచును
బరువడి నీయక్షరములు భయనయతతులన్
నిరతమును వ్రాయ నేర్చిరి
మఱి మఱి నీ పుత్రులెల్ల మల్కిభరామా!'
(చాటువు)

అని ప్రశంసించి నవాబు నుంచి గౌరవమును పొందారు.

ప్రపంచ కవితా చరిత్రలో ప్రసిద్ధ స్థానం సంపా దించుకున్న భారతీయ భాషలు మూడేమూడని ప్రసిద్ధ రచయిత కుష్వంత్ సింగ్ అభిప్రాయం. అవి సంస్కృతం, బెంగాలీ, ఉర్దు, భాషల విషయానికి వస్తే స్వచ్ఛత అంటూ అంటకట్టకూడదు. అన్యభాష సౌందర్యపు తళుకులను, బెళుకులను సరిగా కలగలుపుకొని ప్రత్యేకతను తెచ్చు కుంటే భాష వెలుగుతుంది. దీన్ని ఉర్దూకవులు గుర్తించారు. హుతుబ్ షాహీ సుల్తాన్లందరూ సాహిత్య ప్రియులే. పార్శీ, ఉర్దూ, తెలుగుభాష సంగమంగా వర్ధిల్లింది గోలకొండ. మహమ్మద్ కులీ కుతుబ్‌షా అక్బర్ చక్రవర్తికి సమకాలికుడు. ఇతడే హైదరాబాద్ నగర నిర్మాత. ఇతడు పార్శీలోను, ఉర్దూలోను, తెలుగులోను కావ్యాలు రచించాడు. కాని ఇతని తెలుగు కవిత లభ్యం కాలేదు. భాషాచరిత్రకారులు ఇతడు తెలుగు కవి అని కూడా వ్రాసినారు. ఇతని ఫార్సీ, ఉర్దూ దీవాన్‌లు (కావ్యసంపుటాలు)1800 పేజీలు యాభై వేల పంక్తులు కలిగి ఉన్నాయి. భక్తి, శృంగారాలను సాంఘిక పరి స్థితులను ఇతడు తన కవితలో చిత్రించాడు. దక్కనీ భాష (ఉర్దూ) అంటే పార్శీ దుస్తులు ధరించకముందు ముస్లిం సేనానులు దక్షిణానికి తీసుకొని వచ్చిన భాష

అని అర్థం. ఈ భాషలో తరువాత హిందీ, మరాఠీ, తెలుగు మొదలైన దేశీయ భాషల పదాలు విరివిగ కలిసి పోయినై. ఈ భాషనే గోల్కొండ సుల్తాన్లు పోషించారు.

జాతీయ పండుగలలో ఈ సుల్తాన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. హిందువులకు సంబంధించిన సంవత్సరాది పండుగ నాడు మహమ్మద్ కులీకుతుబ్‌షా తను కూడ రాచనగరులో పండుగ జరిపించుకునేవాడు. ఆ రోజులలో హిందూ ముస్లిం భేదభావం లేదు. ముస్లింల ముఖ్యమైన పర్వదినం మొహర్రం. ఇదే పీర్ల పండుగ. ముస్లింల వలె హిందువులు కూడా పీర్లకు దట్టీలు కట్టేవారు. ఊదు, బెల్లం, కందూరులు చల్లడం, మవాద తినడం, అగ్ని గుండాలను తొక్కడం పులి వేషాలను వేసుకుని ఆడటం జరిపేవారు.

క్రైస్తవ మతం :

18వ శతాబ్దం ప్రారంభంలో క్రైస్తవమతం మన రాష్ట్రంలో ప్రప్రథమంగా తలెత్తింది. మతాంతరీకరణ ప్రధాన ఆశయ మైనప్పటికీ, మిషనరీలు మామూలుగా శాంతియుతమైన ప్రచారంద్వారానూ. సాంఘిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన ద్వారాను దీనిని ప్రారంభించారు. కొన్ని కొన్ని ప్రసిద్ధమైన విద్యాసంస్థలను కూడా వారే ప్రారంభించి నిర్వహించారు. విద్యావంతులు, నిశిత బుద్ధులైన కొందరు భారతీయులు క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. వీరివల్ల క్రైస్తవమతానికి బలం చేకూరింది. తద్వారా అనేక జిల్లాలలో గ్రామాలకు గ్రామాలు క్రైస్తవ మతప్రభావానికిలోనై, తమ మతవ్యాప్తికి కేంద్ర పీఠాలుగా పని చేయడం ప్రారంభించారు. ఈనాడు ఒక్క చర్చి అయినా లేని మండలం లేదు. క్రైస్తవ మిషనరీల నిర్వహణలో గల విద్యా సంస్థగానీ, వైద్య సంస్థగానీలేని జిల్లా లేదు. దేశంనుండి క్రైస్తవ పాలన వెళ్ళిపోయినా, ఆర్య సమాజ్ మొదలైన దేశీయ సంఘాలు ఎంతగా ఎదుర్కొన్నప్పటికీ, క్రైస్తవ మిషనరీలు, ప్రశాంత చిత్తంతో, ఓర్పుతో వీటిని తట్టుకుంటున్నాయి. వారు నిర్మించిన సంస్థలన్నీ దినదిన ప్రవర్ధమానమవుతూ, భారతీయ సాంఘిక జీవనంలో భాగస్వాములై ప్రముఖపాత్ర నిర్వహిస్తున్నాయి. క్రైస్తవ మిషనరీలు స్థాపించిన పెద్ద సంస్థలలో గుంటూరులో ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ, ఒక శతాబ్దిన్నర క్రింద హైదరాబాద్‌లో ఏర్పరచిన గ్రామరు స్కూలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో అనేకంగాఉన్న ఉన్నత పాఠశాలలు, ఆస్పత్రులు మొదలైనవి ముఖ్యమైనవి.

జాగీర్దారీ విధానం :

నిజాం ప్రభువుల 224 సంవత్సరాల పాలనలో జాగీర్దారీ విధానం ఉచ్చదశలో ఉండేది. జాగీర్దార్లకు జాగీరుగా గ్రామాలలోని డబ్బు కొల్లలుగా వచ్చిపడేది. వారి ప్రధాన వృత్తి. కడుపులో చల్ల కదలకుండా ఒక్క చెమట బొట్టయినా రాల్చకుండా వచ్చిన ఆ ధనరాసులని ఎంత త్వరగా ఖర్చుపెట్టడమన్నది ప్రశ్న. ఆ డబ్బును హారతి కర్పూరంలా ఎలా కరిగించి వేయాలన్నదే సమస్య. పెద్ద పెద్ద దేవిడీలను నిర్మించుకున్నారు. అందమైన గాజు సామగ్రిని, వెండి బంగారు వస్తువులను, రకరకాల పింగాణీ పాత్రలను, శిల్పాలను, చిత్రాలను, కళా ఖండాలను సంపాదించి పెట్టుకున్నారు. విదేశాలనుంచి తివాచీలు, విచిత్రమైన వస్తువులు తెప్పించుకున్నారు. వారి విలాస ఆర్భాటాలే వేరు. బాగా తిని త్రాగటమే వారి పని. స్కాచ్, విస్కీలను నీటిలా ప్రవహింపజేసేవారు. నిరంతరం అదే పనివారిది.

వీరికి స్త్రీ లోలత్వంతోపాటు మృగయా వినోదం కూడా ఒక వ్యసనమే. వీరికి బాల్యంలోనే తుపాకులు ఉపయోగించడం నేర్పేవారు. ఇంట్లో కావలసినన్ని పులిచర్మాలు, అడవిమృగాల తలలను పెట్టుకునేవారు. మృగయా వినోదానికి వెళ్ళినప్పుడే తమ గ్రామాలకు వెళ్ళేవారు. ప్రజలిచ్చిన వినతి పత్రాలను స్వీకరించేవారు. ప్రజలు తమ ఏలిక వస్తున్నాడని తెలియగానే ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేసి ఆదరించేవారు. నవాబుల వెంటవారి పరివారం. ఆరితేరిన వేటగాళ్ళు వచ్చేవారు. గ్రామపెద్దలు, పటేల్ - పట్వారీలు మంగళ వాయిద్యాలతో ఎదురేగి అతిథ్యాన్నిచ్చి ఎంతో ఆదరంగా సేవించేవారు. అలాకొన్ని రోజులు వినోదాలతో పల్లె సీమలలో గడిపి తిరిగి వచ్చేవారు.

ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ బహాదుర్ ఎంతో సంపన్నుడైనా నిరాడంబర జీవితం గడిపాడు. ఆతని నిరాడంబరత గురించి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి.

ఒకసారి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ హైదరాబాద్ సంస్థాన పర్యటనకు వచ్చాడు. నిజాం నవాబు ఆయనకు నాంపల్లి స్టేషనులో స్వాగత మిచ్చాడు. నిజాం చేతిలో ఉన్న చేతికర్ర మధ్యలో కొంత విరిగి పోయింది. దాన్ని చూసి నవ్వుకున్న వైస్రాయ్ 'హిజ్ ఎగ్జాల్టెడ్ హైనెస్! మీ చేతిలోని చేతికర్ర మధ్య భాగంలో విరిగినట్లుంది. మీరు చూసుకోలేదా? అని అన్నాడు. నిజాం తన చేతికర్ర వైపు చూసుకొని ఏమీ ఎరుగనట్లు 'మహాప్రభూ! బాగు చేయించు కోవాలి' అని అన్నాడే కాని ఆ కర్రను మార్చేసుకుంటానని అని అనలేదు.

ఒకసారి బిరారు యువరాజు (నిజాం జ్యేష్ఠ పుత్రుడు) తండ్రిగారిని "రెండణాలు కావాలని" అడిగాడు. 'రెండణాల విలువ నీకు తెలుసా?" అని ప్రశ్నించాడు నిజాం. రెండణాలతో రెండు డజన్ల అరటి పండ్లు తెప్పించాడు. ఒక్కొక్క అరటిపండు ఒక్కో నవాబుకి పంపించాడు. రాజుగారు బహుమతి పంపితే ప్రతి బహుమానం పంపడం రివాజు. అలా మూడువేల రూపాయల నజరానా (బహుమతి)గా వచ్చాయి. 'చూసావా? రెండణాల విలువ ఎంతో? ' అని కొడుక్కి గుణపాఠం నేర్పాడు.

పోలీసు చర్యకు ముందు కె.ఎం. మున్షీ హైదరాబాద్ లో రెసిడెంట్-జనరల్‌గా ఉన్న రోజుల్లో తన కింగ్ కోఠీలోని సేవకుల టిఫిన్ డబ్బాలు హఠాత్తుగా విప్పి నిజాం చూసేవాడు. తానిచ్చే జీతానికి వారు జొన్న రొట్టెలే కాని గోధుమ రొట్టెలు తినలేరని ఆయనకు తెలుసు. ఒకోసారి ఆకస్మాత్తుగా విప్పి చూసే సరికి అన్ని జొన్న రొట్టెలే కనబడ్డాయి. 'మున్షీసాబ్ (గారు) మీకేమి లంచం ఇవ్వ లేదన్న మాట' అని నిజాం సంతృప్తి ప్రకటించాడు.

నవాబులందరూ వ్యసనపరులని చెప్పడం సరికాదు. 1936వ సంవత్సరంలో సంస్థాన ప్రధానమంత్రి మహారాజా సర్‌కిషన్ పర్షాద్ బహాదుర్ పర్భనీ పర్యటన పెట్టుకుని స్పెషల్ సెలూన్‌లో వెళుతున్నారు. పర్భనీ స్టేషన్‌లో రైలు ఆగింది. ఆయనరైలు దిగి ప్లాట్ ఫారమ్ పైకి వచ్చాడు. సైనిక దళాలు ఆయనకు గౌరవవందనం సమర్పించాయి. ఆయన మళ్ళీ సెలూన్‌లో ప్రవేశించారు. గార్డు ఈల వేయడం, పచ్చ జెండా చూపడం జరిగింది. రైలు పరుగుప్రారంభించింది. ఈలోగా దూరంగా ఒక కుంటివాడు కనిపించాడు. రైలును మళ్ళీ ఆపవలసి వచ్చింది. ఆ వికలాంగునికి ప్రధానమంత్రి పంపిన బహుమానం అందిన తరువాతనే రైలు కదిలింది. నిజాం పరిపాలన ఉర్దూ భాషకుస్వర్ణయుగం.

బ్రిటీష్ వారు మన పరిశ్రమలపై చావుదెబ్బ తీశారు. ఎంతో పేరుగల పరిశ్రమలు బ్రిటన్ వారి తాకిడికి దెబ్బతిని పోయాయి. పద్దెనిమిదో శతాబ్దంలో విశాఖపట్నంలో ఇరుగుడు కర్రమీద దంతపు పని చేసిన ఎనిమిది కుర్చీలు లండన్‌లో పదహారు వేల పౌన్లకు అంటే సుమారు మూడు లక్షల రూపాయలకు అమ్ముడు పోయినట్లు బేబిన్ హెల్లియర్ తన పుస్తకంలో రాశాడు. హైదరాబాద్ సంస్థానంలోని నారాయణపేటలో నేసిన జరీబట్టలు, నాందేడ్‌లో తయారైన సన్నని మల్‌మల్ బట్టలు, దౌలతాబాద్‌లోతయారైన కాగితం నాణ్యతలో మంచి పేరు తెచ్చుకున్నాయి.

ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందినవి వరంగల్ తివాచీలు. వీటిని 1851లో లండన్‌లోని గ్రిస్టల్ ప్యాలస్‌లో జరిగిన పారిశ్రామిక ప్రదర్శనలో ప్రదర్శించినప్పుడు అవి ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి.

సంగీతం :

భారతదేశ సంగీత క్రమపరిణామ చరిత్రలో ఆంధ్రుల కృషి అనన్య సామాన్యమైనది. దక్షిణ భారత దేశ సంగీత చరిత్రలో 1750 వరకు అత్యంత ప్రధానమైన యుగం. ఈ యుగంలో స్వతంత్ర ధాతు కల్పనా త్మకమైన కీర్తనలతో దక్షిణ భారతదేశ సంగీతానికి అఖండ పరివ్యాప్తి చేకూర్చిన అవతార పురుషులైన వాగ్గేయకారులు ముగ్గురు.

త్యాగరాజు (1767 -1847): తన కృతులలో శిష్ట వ్యవహారికాన్ని వాడాడు. తన కాలంలో త్యాగరాజు

కున్నంత శిష్య గణం మరొకరికి లేదు. బహుధారి, చెంచు కంభోజీ, దీపకం, దేవామృతవర్షిణి, గంభీరవాణి, నాద స్వరావళి, గరుడధ్వని, జనరంజని, కోకిలధ్వని, మయూర ధ్వని, నభోమణి, నాదతరంగిణి, నవరస కన్నడ, ఫలమం జరి, సారమతి, ఉమాభరణం, సుపోషిణి, విజయశ్రీ వంటి అపూర్వ రాగాలతో ప్రాచీన సంగీత లక్షణ కర్తలకు కూడ తెలియని నూతనరాగాలతో ఎంతో నైపుణ్యంతో కృతులను రచించాడు త్యాగరాజు. ఇవన్నీ కర్నాటక సంగీతానికి అమూల్య నిధులైనాయి.

శ్యామ శాస్త్రులు (1782 -1827) : పూర్వీకులు కర్నూలు జిల్లావారు. తర్వాత వారు తమిళ దేశానికి పోయారు. ఆయన ఆనందభైరవి రాగంలో ఎక్కువ కృతులు చేశారు.

ముత్తు స్వామి దీక్షితులు (1776-1835): సంస్కృత భాషా ప్రయోగంలో అసాధారణ దీక్ష కనబరిచారు. కర్నాటక సంగీత చరిత్రలో యీ ముప్పురు త్రిమూర్తులు.

సంస్కరణలు :

భారతదేశంలో 19వ శతాబ్దం ఒక పునర్జాగృత యుగం. భారతీయుల జీవితానికి చెందిన విభిన్న రంగాలు నూతన శక్తిని పుంజుకున్న రోజులివి. పాశ్చాత్యులతో ఏర్పడిన ఉత్తేజకరమైన సంబంధమే దానికి ముఖ్యకారణం. అట్టడుగున పడ్డ దేశాన్ని పైకెత్తటానికి జాగరూకతతో కూడిన ప్రయత్నాలు దేశమంతా ప్రారంభమైనాయి.

ఆధునిక భారతదేశంలో సాంఘిక సంస్కరణల ఆరంభం రాజారామమోహన రాయ్‌నుండి జరిగింది. ఆధునిక భారతదేశ సంస్కరణల పిత ఆయనే. సతీ సహగమనాన్ని నిర్మూలించడానికి మహోపకరణంగా కృషి చేసిన వాడూ ఆయనే. అనేక దశాబ్దాలుగా దేశాభ్యుదయ కరమైన అన్ని ఉద్యమాలకు మార్గదర్శకమైన బ్రహ్మ సమాజాన్ని స్థాపించిన వాడూ ఆయనే. 19వ శతాబ్దంలో వంగదేశంలో ఏ ఉద్యమం ఉద్భవించినా తెలుగుదేశంలో ముందుగా వచ్చేసేది వంగీయులకు, తెలుగువారికి చాలా పోలికలున్నాయి. వారు ఆదర్శాలతో ఉత్తేజితులవుతారు. ఆవేశాలతో ముందుకు పరుగు లిడుతారు.

సాంఘిక దురాచారాలలో అతి దుర్భరమైనది వైధవ్యం. దీనిపై కత్తికట్టిన మహోదయుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. ముక్కుపచ్చలారని బాలికలకు యావజ్జీవ బ్రహ్మచర్యాన్ని, అంతులేని బాధను కలిగించే బృహత్తర మానవత్వ సమస్య యిది. వితంతు వివాహాల అనుమతికి మార్గం పరిశీలించడానికి శ్రమ అనకుండా హైందవ మత గ్రంథాల లోతుకు పోయాడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్. హైందవ మతగ్రంథాలను దాటి ఆయన ముందుకు పోదలుచుకోలేదు. ఎందుకంటే సమకాలీన సంఘదృష్టిలో అది ఒక మహత్తర పరివర్తనంగా గోచరించేది. హైందవ శాస్త్రాల పరిధిలో అంతర్గత పరిష్కారాన్ని కనుగొని దాన్ని అత్యధిక హిందువులకు ఆమోదయోగ్యం చేయడమే ఆయన అభిలాష. ఈ విషయంలో విద్యాసాగర్ తీవ్రమైన అధ్యయనం చేశాడు. చివరకు 'పరాశర సంహిత' లో ఒక శ్లోకం దొరికింది. దాన్ని ఆధారంగా చేసుకుని కొన్ని పరిస్థితులలో వితంతు వివాహం శాస్త్ర సమ్మతమే అనే పూర్వపక్ష వాదాన్ని నిర్మించాడు.

పరాశర మతానుసారం సహగమనమూ, యావజ్జీవ బ్రహ్మచర్యమూ, ప్రశంసార్హములే కాని, భర్త దగ్గరనుంచి ఏ వార్త రానప్పుడు, అతడు నపుంసకుడైనప్పుడు, అతడు మరణించినప్పుడు, విధవా పునర్వివాహం సమ్మతమే అని కూడ పరాశరుడు ప్రవచించాడు. చట్టరీత్యా సతీ సహగమనం నిషిద్ధమైనది. కనుక కలియుగ స్త్రీలు యావజ్జీవితం బ్రహ్మచర్యం పాటించడం కష్టం కాబట్టి వితంతు పునర్వివాహం శాస్త్రాదేశాలతో ఏకీభవించినదే.

రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులు ప్రప్రథమంగా పూర్వాచార పరాయణులమీద తిరుగుబాటు లేవదీశాడు. మత, సంఘ, సంస్కరణోద్యమాన్ని తీవ్రతరం చేశాడు. ఛాందసులు పెట్టే బాధలను భరించాడు. వివేకవర్ధనీ మొదలైన పత్రికలు పెట్టి జాతిని మేల్కొలిపాడు.

ఆంధ్ర దేశంలో సంఘ సంస్కరణ కోసం తన కలాన్ని

ఖడ్గ సదృశంగా వాడిన మహాపురుషుడు వీరేశలింగం. వాచకాలు మొదలుకొని ఆంధ్ర కవుల చరిత్రవరకు వ్రాసిన ప్రజ్ఞాశాలి. తన కలంతో లంచగొండి తనాన్ని బజారున కీడ్చాడు. వేశ్యావృత్తి నిర్మూలనకు పాటు పడ్డాడు. వర్ణాంతర వివాహాలు, వితంతు వివాహాలు జరిపించాడు. అన్నింటిలో కందుకూరి వీరేశలింగమా? విస్ఫులింగమా అనిపించాడు. ఆంధ్రలో జీవిత ప్రవాహాన్ని వీరేశలింగం కొత్తదారి మళ్ళించాడు. ఈ కృషిలో ఆయనకు మార్గ దర్శకులు లేరు. ఆయనతో పోల్చదగిన అనుయాయులు లేరు.

ఈ రంగంలో కృషి చేసిన మరొక మహాపురుషుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు. హిందువులు క్రైస్తవమతంలో కలిసిపోకుండ వారి ధర్మ జిజ్ఞాసను భారతీయ సంస్కృతి సంప్రదాయాలవైపు మరలించిన వ్యక్తి. హరిజనోద్ధరణ, కళావంతుల సంస్కరణ, స్వదేశీ వస్తు వినియోగం మొదలైన నిర్మాణ కార్యక్రమాలలో నాయుడుగారు కృషి చేశారు.

హైదరాబాద్ రాష్ట్రంలో సాంఘిక సంస్కరణలకు నాంది పలికినవాడు భాగ్యరెడ్డివర్మ. హరిజనుడైన భాగ్యరెడ్డి ఆర్య సమాజ్ దీక్షబూని, యజ్ఞోపవీతం ధరించి, వర్మ బిరుదు పొందాడు. బాలబాలికలకు నైతిక విద్య గరపడం, శుభాశుభ కార్యాలలో మద్యమాంసాలు నిషేధించడం, బాల్య వివాహాలను నిరసించడం, మొదలైన అనేక కార్యక్రమాలు ఆయన చేపట్టాడు. జీవరక్ష ప్రచారక మండలి స్థాపించి హింసానిరోధానికి గొప్ప కృషి చేశాడు. దేవదాసీల పద్ధతిని మాన్పించి బక్రీద్ పండుగ రోజు గోవధను నిషేధించే శాసనాన్ని నిజాం ప్రభుత్వం చేత ఆయన జారీ చేయించాడు. ఈ మార్గంలో రాజా బహదుర్ వెంకట్రామారెడ్డి కృషి కూడా చాలానే ఉంది.

ముప్పయ్ ఒకటవ అఖిల భారత కాంగ్రెస్ మహా సభల సమావేశాలు 1916సం. డిశెంబరు నెల 26నుండి 30వ తేదీలలో లక్నోలో అంబికా చరణ్ మజుందార్ అధ్యక్షతన జరిగాయి. తన అధ్యక్షోపన్యాసంలో మజుందార్; "హిందూ -ముస్లిం మత ఘర్షణలు బ్రిటిష్ ఇండియాలోనే చూస్తున్నాం. సంస్థానాలలో హిందూ ముస్లింలు సోదరభావంగానే ఉంటున్నారు. ముస్లిం సంస్థానమైన హైదరాబాద్‌లో దాదాపు 80శాతం జనాభా హిందువులదే. అక్కడ గోహత్యకు సంబంధించిన ఘర్షణలు గానీ, మొహర్రం అలజడులు గానీ జరుగవు" అని అన్నారు. ఈ ఉన్నత సంప్రదాయాన్ని కాపాడు కోవడం మన కర్తవ్యం.

సంస్కృతి (Culture) ని గురించిన కొన్ని ఆలోచనలు

డా. ముక్కామల రాధాకృష్ణశర్మ

ఎలన్ రయాన్ తన "ప్రపంచ సంస్కృతి వృద్ధి" (The growth of a global culture) అనే వ్యాసంలో 20వ శతాబ్దంలో సంస్కృతి చరిత్రను సమీక్షించాడు. ఆయన చెప్పిన కొన్ని విషయాలు నేడు ఆంధ్రప్రదేశ్‌లో గాని, భారతదేశంలోగాని సంస్కృతిగా వ్యవహరిస్తున్న అంశాలను అవగాహన చేసుకోవటానికి వాటిని అర్థం చేసుకోవటానికి ఉపయోగపడతాయి. చివరగా ఆయన తేల్చిందేమిటంటే, విశాలప్రపంచం అతిచేరువైనా జాతీయ సంస్కృతులు తమ విశిష్టతను గుర్తింపును వదులుకోవటానికి అంగీకరించవు అని "as the world becomes truly a global village, we can expect its different national households to be as insistent as ever on what distinguishes each of them from all the others" జాతీయ స్థాయికి వర్తించే యీ వివరణ ప్రాంతీయ స్థాయికి గూడ వర్తిస్తుంది.

అంటే ప్రపంచీకరణ కారణంగా ఆంధ్రప్రదేశ్ చారిత్రక, సాంప్రదాయిక సంస్కృతి వన్నె తరగకుండా కొన సాగుతుంది. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవానికి శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, వివిధ చాళుక్యులు, చాళుక్యచోళులు, కాకతీయులు, గాంగులు, రెడ్లు, పద్మనాయకులు, విజయ నగరాధీశులు, కుతుబ్ షాహీలు, ఆసఫ్‌జాహీలు ఆయా కాలాల సామాన్యప్రజలు చేసిన సేవ చిరస్థాయిగా వుంటుందన్న మాట. దీన్ని వివరించటానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖ ఆకర్షణలుగా రూపుదిద్దుతున్న అంశాలను ప్రదేశాలను పేర్కొందాం :

హైదరాబాద్: చార్మినార్, కుతుబ్ షాహీ సమాధులు, సాలార్‌జంగ్ మ్యూజియం, రాష్ట్ర మ్యూజియం, మక్కా మజీద్, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల భవనము, నిజాం మ్యూజియం, గోల్కొండ దుర్గం, హుస్సేన్ సాగర్ సరస్సు,

వరంగల్ : వేయి స్తంభాల గుడి, భద్రకాళి గుడి, వరంగల్ కోట, రామప్ప దేవాలయం, రామప్ప సరస్సు, పాఖాల్ సరస్సు,

నాగార్జున కొండ

విశాఖపట్టణం: సింహాచలం అప్పికొండ, బొర్రా గుహలు, బలిఘట్టం, అన్నవరం, శంకరం, బావికొండ, తొట్ల కొండ, పావురాళ్ళ కొండ,

తిరుపతి : తిరుమల, తిరుచానూరు, చంద్రగిరి, శ్రీ కాళహస్తి.

విజయవాడ : కనకదుర్గ ఆలయం, సెయింట్ మేరీ చర్చ్, విక్టోరియా మ్యూజియం, హజ్రత్ బాల్ మజీదు, మొగలు రాజపురం గుహలు, ఉండవల్లి గుహలు, మంగళగిరి, కొండపల్లి కోట, కూచిపూడి, అమరావతి, భట్టిప్రోలు, గోలి, గుంటుపల్లి, ఘంటసాల, చిన్న గంజాం.

పర్యాటక శాఖ పవిత్ర స్థలాల పర్యటన Pilgrim tourism పై ప్రత్యేకంగా తన దృష్టిని కేంద్రీకరించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ శ్రేణికి చెందిన స్థలాలు అహోబిలం, అలంపూర్, అరసవిల్లి, అన్నవరం, బాసర్, భద్రాచలం, ద్రాక్షారామం, కీసరగుట్ట, కనిపాకం, కొలనుపాక, లేపాక్షి, మహానంది, మంత్రాలయం, మెదక్ చర్చి, పానగల్, పుట్టపర్తి, పాలంపేట, రామతీర్థం, సింహాచలం, శ్రీకాళహస్తి, శ్రీశైలం, యాదగిరి గుట్ట, యాగంటి.

ఆంధ్రదేశంలో సుమారు క్రీ.పూ. 500 నుంచీ క్రీ.శ. 500 దాకా, 1000 సంవత్సరాలు బౌద్ధం వర్ధిల్లింది. పురావస్తు తవ్వకాలు బౌద్ధ క్షేత్ర అవశేషాలను వెలికి దెచ్చాయి. ఇవి దేశ, విదేశీ యాత్రికులను విశేషంగా ఆకర్షిస్తున్నవి.

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమైన బౌద్ధక్షేత్రాలు: అమరావతి, అనుపు (నాగార్జున కొండ)బావికొండ, భట్టిప్రోలు, బుద్ధం, చందవరం, ధూళికట్ట, ఘంటసాల, గోలి, గుంటుపల్లి, జగ్గయ్యపేట, మలకొండ, పావురాళ్ళ కొండ,

రామతీర్థం, శంకరం, సాలిహుండం, తొట్లకొండ.

పర్యాటకుల నాకర్షిస్తున్న లలితకళలు, చేనేతి వస్త్రాలు, హస్తకళలు ఇవి : కూచిపూడి నృత్యం, జానపద నృత్యాలైన వీరనాట్యం, బుట్టబొమ్మలు, డప్పు, చిందు భాగవతం, తప్పెటగుళ్ళు, లంబాడీ, బోనాలు, ధింస; వెంకటగిరి, ధర్మవరం, గద్వాల్, పోచంపల్లి, నారాయణ పేట చేనేత చీరెలు; ఏలూరు, వరంగల్ తివాచీలు, నూలు జరీలు, లక్కపని, తుంగ చాపలు; సిద్ధిపేట చెరియాల్, బంజారా, హిమ్రూ, కలంకారీ కళా ఖండాలు; బిద్రి, దోర్న కంబళ, పెరుమాళపల్లి, ధవళేశ్వరం, కరీంనగర్, పెంబర్తి, వరంగల్ హస్తకళలు; కొండపల్లి, నిర్మల్, ఏటికొప్పాక, తిరుచానూర్ బొమ్మలు; నిమ్మలకుంట, డిచ్‌పల్లి, మాధవపట్నం తొలుబొమ్మలు; హైదరాబాదీ గాజులు, ముత్యాలు; తిరుపతి మాధవమల, శ్రీకాళహస్తి, భోన్‌గిరి, ఉదయగిరి చెక్క వస్తువులు; గొల్లపల్లి, బొబ్బిలి, నూజివీడు, సంగీత వాద్యాలు; దుర్గి, ఆళ్ళగడ్డ రాతి విగ్రహాలు, నిర్మల్ చిత్రలేఖనాలు.

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకతకు నిదర్శనంగా జరుపు కుంటున్న పండుగలు, జాతరలు, సాంస్కృతిక వుత్సవాలు: సంక్రాంతి; ఉగాది; శ్రీరామనవమి; వినాయక చతుర్థి; దసరా; దీపావళి; మహాశివరాత్రి; రంజాన్; మిలాద్; ఇదుల్‌జుహా; క్రిస్టమస్; మహావీర్ జయంతి; బుద్ధపూర్ణిమ; సమ్మక్క- సారమ్మ జాతర; అంతర్జాతీయ గాలిపటాల వుత్సవం; వరంగల్‌లో కాకతీయ వుత్సవాలు; మాదాపూర్‌లో అఖిల భారతీయ కళలు; హస్తకళల; వుత్సవాలు, కుతుబ్‌షాహీ సమాధుల వద్ద దక్కన్ వుత్సవాలు; బుద్ధపూర్ణిమనాడు లుంబినీ వుత్సవాలు; విశాఖ - రిషి కొండ వుత్సవాలు; చంద్రగిరిలో విజయనగర వుత్సవాలు; అరకులోయ బొర్రాగుహలలో అఖిల భారతీయ గిరిజన వుత్సవాలు; రాజమండ్రిలో చాళుక్య, గుంటూరులో శాతవాహన వుత్సవాలు.

ఆంధ్రప్రదేశ్ వంటకాలకు ప్రత్యేక రుచులు వున్నాయి. ఈ వంటకాలు : ఆవకాయ,గోంగూర, చేపల పులుసు, రొయ్యల వేపుడు, ఎండ్రకాయల పులుసు; అరిసెలు; ఉగాది పచ్చడి; కుడుములు, క్షీరాన్నం; వడపప్పు, పానకం; బూరెలు, బొబ్బట్లు; జొన్నరొట్టె, కుర్మా, రాగి సంకటి, చేపల పులుసు; హైదరాబాదీ బిరియానీ, ముర్గ్ ఆలు కూర్మా, షాయి కుర్మా, దమ్ కా ఘోష్ట్, దమ్ కా ముర్గ్, హలీమ్; మిర్చి కాసలన్; డబుల్ కామీఠా; కుభానీ కా మీఠా, బగారా బేగన్.

ఇంతవరకు పేర్కొన్న పర్యాటక ఆకర్షణలన్నీ 2500 సంవత్సరాల చరిత్ర, సంస్కృతి ఆంధ్రప్రదేశ్‌కు అందించిన వారసత్వం. పర్యాటకులు ప్రత్యేకతల కోసం అన్వేషిస్తుంటారు. కాబట్టి, రాష్ట్రపర్యాటక శాఖ ఈ అంశాలపైన ప్రదేశాలపైన దృష్టిని కేంద్రీకరించింది. రాబోయే రోజుల్లో మరుగునపడి వున్న అనేక ప్రత్యేకతలు వెలికి వస్తాయి. హైదరాబాదులోని శిల్పారామం,శిల్పకళా వేదిక, లలిత కళాతోరణం,రవీంద్ర భారతి, త్యాగరాజ గానసభ, నెక్లెస్ రోడ్ మొదలైనచోట్ల జరిగే సాంస్కృతిక వుత్సవాలలోని సంగీతము, నృత్యము వంటి అంశాలను విశ్లేషిస్తే చాలావరకు అవిపైన చెప్పిన వారసత్వానికి సంబంధించినవే. అందుకనే ఎలన్ రయాన్ చెప్పినట్లు "as the world becomes truly a global village, we can expect "Andhra Pradesh to be as insistent as ever on what distinguishes it from all the others"

సంస్కృతి పై ప్రపంచీకరణ ప్రభావాన్ని గురించి విశేషమైన పరిశోధనలు జరుగుతున్నాయి. హీథర్ వాయిసీ, టిమ్ ఓరియార్డన్ Globalization and Localization విషయాన్ని గురించి వ్రాసిన మాటలను మనం జాగ్రత్తగా విశ్లేషించుకోవాలి.

"Cultural globalization refers to the homogenization and hybridization of world wide culture (Allen 1995, P.113).The basis of this is supposedly the new technologies of communication . These are said to unsettle and loosen more traditional cultural ties, influences and established lifestyle codes,thereby exposing localities to different consumer styles,with the message that to consume is to be part of one (western) world. Demand is produced by the global marketing of cultural styles and symbols and is met by global standardisation of products. But such a homogenizing view of a global culture is false in

two main ways. First, it is presented in a monolithic manner: we do not all understand and value consumer products or American entertainment in the same way (Allen 1995, P.117). Second, rather than eroding local differences global consumerism has to work through them, exploring local differences in order to market them on a wider scale"

వ్యాసం ప్రారంభంలో వేయాల్సిన ప్రశ్నను, వ్యాసం చివరలో ప్రస్తావిస్తున్నాను. సంస్కృతి అంటేఏమిటి? అనేది ప్రశ్న. ఆంగ్లపదమైన Culture సమపదంగా సంస్కృతిని వాడుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా Culture అనే పదాన్ని వివిధ అర్థాలతో నేడు వాడటం జరుగు తుంది. ఇందులో ప్రధానమైనవి నాలుగు.

1. 'a general process of intellectual, spiritual and aesthetic development'. అతడు Cultured వ్యక్తి, అంటే సాధన, లేక కృషితో పొందినది అని.

2. 'a particular way of life, whether of a people, a period or a group,' - a way of life that is informed by a common spirit'

ఈ ప్రయోగంలో Culture వ్యక్తులకు సంబంధించిందిగా కాక జాతులకు, సంఘాలకు సంబంధించి వాడినది.

మానవ శాస్త్రంలో Cultureకు చెప్పే ప్రధాన అర్థం ఇ ది. ఈ ప్రయోగానికి మూల పురుషుడు 18వ శతాబ్ది జర్మన్ తాత్త్వికుడు John Herder. He argued that each people -each society , each ethnic group, each linguistic community could be distinguished by a whole way of life, by common customs, ways of thinking and ways of being. He argued that each way of life is informed by a 'common spirit'.

3. 'the works and practices of intellectual and especially artistic activity'

సామాన్యంగా Culture ను ఈ అర్థంతోనే వాడు తారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, సాహిత్యం, శిల్పం, నాటకం, సినిమా వీటికి సంబంధించిన సంస్థలు కార్యక్రమాలు ఈ ప్రయోగం కిందే వస్తాయి.

పూర్వం High Art వున్నతస్థాయి సాహిత్య కళలను మాత్రం పరిగణనలోకి తీసుకుంటే, నేడు జనప్రియ సంస్కృతినంతటిని popular Culture, mass media సంస్కృతిగా చెప్తున్నారు.

4. 'the signifying system though which necessarily (through among other means) a social order is communicated , reproduced, experienced and explored'

ఈ ప్రయోగంలోCulture ప్రత్యేకరంగం కాక ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాలన్నిటికి సంబంధించి నదిగా పరిగణించ బడుతుంది.

నానాటికి విస్తరిస్తూ , ప్రాముఖ్యత పెరుగుతున్న Culture (సంస్కృతి) ని వివిధ కోణాల నుంచి పరిశీలించి అధ్యయనం చేయటం ఎంతైనా అవసరం.

BOOKS CONSULTED:

1. Michael Michael and WM Roger L ouis Edited : The History of Twentieh Century, 1998
2. Glenn Jordan and Chris Weedon : Cultural politics , 1995
3. Tim and Oriordan Edited : Globalisation, localism and Identity.
4. Tourism Development, Government of Andhra Pradesh : Discover Andhra Pradesh The Kohinoor of India.

ఆంధ్ర సారస్వత పరిషత్తు - ఆర్ష సంస్కృతి

డా. కె. కమల

"యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః"

భగవద్గీత - II-46

ఒకడు మంచి నీటి బావివద్దకు నీటికోసము పోతాడు. దాహము తీర్చేది, ఉదపానము అంటే పాన యోగ్యమైన నీరుండే బావి అని అర్థము. నాలుకలు కోసుకొనిపోయే ఉప్పు నీటి బావి అని అర్థము కాదు. ఆ ఉప్పునీటికి దాహము తీరదు సరికదా పప్పు ఉడకదు, సబ్బు నురగరాదు - నీరంటే మంచి నీరే శ్రేష్ఠము. ఆ మంచినీటి బావివద్దకు పోయిన వానికి ఆశ్చర్యం కలిగింది. కేవలం బావి మాత్రమే కాదు. అంతా జలమయంగా తాగినంత నీరు చేతికి అందుబాటులో ఉన్నది. ఈ చిన్న మంచి నీటి బావి ఆ విశాలజలాలలో అంత ర్భాగమై పోయింది. ఇంకా నీరే నీరు - అదేవిధంగా వేదా ధ్యయనము జ్ఞాన పిపాసను తీరుస్తుంది. నిజమే ఏ మాత్రము సందేహము లేదు - అయితే జ్ఞాని అయిన బ్రాహ్మణునికి అతనికి కలిగిన అనుభవములో ఆ వేదజ్ఞానము అంతర్లీనమయిపోయింది అని గీతా చార్యుడు జగద్గురువు అయిన శ్రీ కృష్ణుడు భగవద్గీత రెండవ అధ్యాయము సాంఖ్యయోగములో బోధించెను. ఈ ఉదాహరణ ఆంధ్ర సంస్కృత సాహిత్యముల చేత ప్రతిష్ఠితమయిన ఆర్షసంస్కృతికి బాగా సరిపోతుంది.

ఋషి అంటే దర్శనమున్న వాడని అర్థము. "ఋషిర్దర్శనాత్" దర్శనము కొత్త భావాలకు స్వాగతం పలుకుతూ నిత్య నూతనంగానే ఉంటుంది. అభ్యుదయ మార్గంలోనే ప్రయాణం చేస్తూ ఉంటుంది. ఋషి అంటే పాతచింతకాయ పచ్చడి వంటి భావాలున్న వాడు, బూజు కొట్టుకొని పోయిన మట్టి ముద్ద వంటి బుద్ధికలవాడు అనే అపోహ సంఘంలోనుండి పోవాలి. ఆర్థిక సమానత్వాన్ని సాధించగలిగిన ఒక సమసమాజాన్ని మనో నేత్రంతో దర్శించినవాడు "మార్క్స్ మహర్షి" కడుపుకే తిండి లేనివానికి వేదాంత మెట్లా బోధపడుతుందని స్వామీ వివేకానంద నేరుగా ప్రశ్నించి భారతీయులకు తిండి, భౌతిక విజ్ఞానము క్రీడలతో పుష్టిగా వుండే శరీరము అవసరమని, పాశ్చాత్యులకు ఆలోచనలను రేకెత్తించే తత్త్వ జ్ఞానమవసరమని ప్రతిపాదించినవాడు.

ఎప్పుడూ కొత్త భావాలకు నివాళులెత్తే ఋషులు ప్రతిష్ఠించిన సంస్కృతి ఆర్ష సంస్కృతి. ఈ ఆర్ష సంస్కృతిలో భౌగోళికములు, రాజకీయములు అయిన ఎల్లలకు స్థానము లేదు. ఎక్కడ ఏది మంచిగా ఉంటే ఆభావాన్ని గ్రహించమని వేదముద్ఘోషిస్తున్నది.

"ఆనోభద్రాఃక్రతవో యంతు విశ్వతః" అని కదా ఋషులు చెప్పినారు.

అందుకే వేదనింద చేసినవారు, దేవుడే లేడు, వేద వాక్యాలు ప్రమాణములే కావు అనే చార్వాకులను గూడా ఋషులుగా పూజించిన సంస్కృతి ఇది.

"యావజ్జీవేత్ సుఖం జీవేత్ ఋణం కృత్వాఘృతం పిబేత్,
భస్మీ భూతస్య దేహస్య పునరాగమనం కుతః"

జీవించినంతకాలం సుఖంగా జీవించాలి. అప్పుచేసి అయినా పప్పు కూడు తినాలి. అందులో చారెడు నెయ్యి పోసుకుని తినాలి. దేహం పిడికెడు బుగ్గి అయిపోతుంది కాలిపోయిన తరువాత. అది తిరిగి జన్మించేది లేదు అని చార్వాకులు ప్రతిపాదించిన తత్త్వము. అది ఆ ఋషులకు కల్గిన దర్శనమేనని సనాతనులు వారిని గౌరవించినారు. సనాతనులలో ఈ సహనము లోపించి నప్పుడు విప్లవాలు విధ్వంసాలు జరిగి నాయి. అభ్యుదయ వాదులు తమకన్నా పూర్వమున్నది

అంతా వ్యర్థమే అని పూర్వ సంస్కృతిని ధ్వంసం చేస్తే కావాలనుకున్నప్పుడు తిరిగి దొరుకుతుందా? కోపంతో ముక్కు తెగనరికితే తిరిగి అతికించడం ఎంత కష్టము? పరస్పరంగా వుండే ఈ అసహనమే అన్ని విప్లవాలకు, విధ్వంసాలకు కారణమయింది.

భగవద్గీతలో "త్రైగుణ్య విషయా వేదాఃనిస్త్రైగుణ్యో భవార్జున" అని

"త్రైవిద్యామాంసోమపాఃపూతపాపాః,
యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రాప్ను వంతి;
తేపుణ్య మాసాద్య సురేంద్ర లోక
మశ్నంతి దివ్యాన్ దివి దేవభోగాన్" అని

చెప్పిన వాక్యాలు వేదవిరుద్ధాలు కావు. వేదం పరతత్వంలో లీనమైపోతుంది. వేదంలోని జ్ఞానకాండములో కర్మకాండ అంతర్భావాన్ని పొందుతుంది అని భావము.

ఆంధ్ర సారస్వతము వెయ్యి సంవత్సరములుగా ఊడలు దిగి విస్తరించిన పిల్లలమఱ్ఱిచెట్టు. ఏ శాఖ దేనితో పెనవేసుకుపోయిందో, తమిళ, కన్నడ భాషలతో మళయాళీ భాషలతో ఏ రెమ్మలు కలిసిపోయినాయో, ఏకొత్త ఊడలు పార్శీ, అరబ్బీ సాహిత్యాలతో, సాంస్కృతులతో కలిసిపోయినాయో, ఏ ఊడలలోనికి ఆంగ్లేయ సంస్కృతి, భాషా , సాహిత్యం , సాహిత్య ప్రమాణాలు తమ రసాన్ని అందించినవో రసజ్ఞుల కందరకు కొంతవరకు తెలుస్తూనే ఉన్నది. తెలుసు కోవలసిన తథ్యాలు ఇంకా ఎన్నో వున్నాయని అనిపిస్తుంది. ముఖ్యంగా తెలుగు ఛందస్సుకు ప్రాకృతభాషలలోని మాత్రాఛందస్సుకు చాలా సంబంధం ఉండవచ్చునని నా స్థూల బుద్ధికి తోస్తుంది. రెండు ఛందస్సుల పరిజ్ఞానం ఎక్కువలేని దాన్ని కాబట్టి ఈవిషయంలోకోవెల సంపత్కుమారా చార్యులవారు, చేకూరి రామారావుగారు కృషి చేయగల సమర్థులని నా కనిపిస్తుంది. "ప్రాకృత పైంగలమ్" వంటి గ్రంథాలు ఉపయోగ పడవచ్చును. అసలు తెలుగు ప్రాకృత భాషల సంబంధాలను గురించి తెలుసు కోవలసిన విషయాలు చాలా వున్నాయని తోస్తున్నది. దీనికి బహుభాషాజ్ఞానము, బహు శ్రుతత్వమూ కావాలి. సంస్కృతం తెలిస్తే ప్రాకృతం తెలుస్తుంది. ఈ ప్రాకృత పదాలు వాటి అర్థ చ్ఛాయలు, పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి కన్నడ, తమిళ భాషల గంథం కూడా వుండాలి. ఇదంతా సాధ్యమా? సాధ్యమే! సాధించిన మహాపురుషులు వున్నారు. పరవస్తు రామానుజస్వామి, పుట్టపర్తి నారాయణాచార్యులు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, తిరుమల రామచంద్ర గారు ఈ కోవకు చెందిన వారే.

ఈవిధంగా ఆలోచిస్తే ఆంధ్ర సారస్వతం బృహత్తరమైన భారతీయ సాహిత్యము, అంతకన్నా విస్తృతమైన ఆర్షసాహిత్యంలోనూ భాగమే అనితోస్తుంది.

ఉర్దూ సాహిత్యసంస్కృతులు ఉచ్చదశలో ఉన్న ఆసఫ్ జాహీల పరిపాలనలో నిజామ్ రాజ్యము. మూడు పువ్వులు ఆరుకాయలుగా విలసిల్లుతూ ఉండే రోజులవి. 20వ శతాబ్దము ఆరంభదశలో జాతీయోద్యమము భారతదేశమంతా విస్తరించిన కాలంలో భారతీయ భాషల పునరుజ్జీవనానికి ఏప్రాంతంలోని వారక్కడనే శ్రమించ వలసి వచ్చింది. స్కూళ్ళు ఏర్పాటయి, పిల్లలను బడికి పంపించిన తల్లులు తెలుగు నజం నేర్చుకోమంటే వినడం లేదు పిల్లవాడు అని ఫిర్యాదు చేసినారు. నజం అంటే ఉర్దూభాషలో పద్యం అని అర్థం. ఇది ఉర్దూభాషమీద విరుద్ధ భావంతో వ్రాసిన మాట కాదు. తెలుగును విస్మరించరాదని మాత్రమే జ్ఞప్తికి తెచ్చే విషయము.

అప్పుడు తలయెత్తిన భాషోద్యమంలో అంగాలుగా ఆంధ్ర విద్యాలయం,ఆంధ్ర బాలికల ఉన్నతపాఠశాల, రెడ్డి వసతి గృహము, వేమన శ్రీకృష్ణ దేవరాయల ఆంధ్ర భాషా నిలయాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు, కన్నడ, మరాఠీ శాఖా విభాగాలు, వీటికి పుష్టిని కలిగించే సంస్కృత విభాగము, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ ఏర్పడ్డాయి. ఆంధ్ర

సారస్వత పరిషత్తుకు బొగ్గులకుంటలో ఉన్న భవనము కట్టకముందు హనుమాన్ టేకిడీలో ఎక్కడనో బహుశః మాడపాటి హనుమంతరావుగారి ఇంటి దగ్గర ఒక కార్యాలయం ఉండేది. ఇక్కడినుండి వరంగల్, నిజామాబాద్, మెదక్‌జిల్లాల్లో మూలమూలపల్లెల్లో పరీక్షా కేంద్రాలు నెలకొల్పి తెలుగు పరీక్షలను ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించేది. నాకు తెలిసినంతవరకు మాడపాటి హనుమంతరావు గారు, పులిజాల హనుమంతరావుగారు, మహనీయులు దేవులపల్లి రామానుజరావు గారు, ఆదిరాజు వీరభద్రరావుగారు, బహుశః బిరుదురాజు రామరాజు గారు, పల్లా దుర్గయ్యగారు, బిదురు వేంకట శేషయ్యగారు ఈ ఉద్యమాన్ని నడిపించిన ప్రముఖులు. మా నాయనగారు శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారు పల్లెలకు పోయి పరీక్షలు నిర్వహించినట్లు నాకు చిన్నతనంలో లీలగా గుర్తు. ఆంధ్ర సారస్వత పరిషత్తుకు వజ్రోత్సవం జరుగుతున్నది కదా! అరువది వసంతాల నాటిమాట. తొలిదశలో నాకు ఏడెనిమిది సంవత్సరాలు ఉన్నప్పుడు ప్రాథమిక, మాధ్యమిక, విశారద పరీక్షలకోసం పాఠ్య పుస్తకాలను తయారు చేయవలసి వచ్చినప్పుడొక చిన్న ఆంధ్ర వ్యాకరణ గ్రంథాన్ని మా నాయనగారు వ్రాసినట్లు గుర్తు. ఈ మధ్యలో వరంగల్ జిల్లా బచ్చన్నపేట వాస్తవ్యురాలు శ్రీమతి లక్ష్మమ్మగారు మా నాయనగారిని తలుచుకుంటూ "శాస్త్రుల్లవారు పరీక్షలుపెట్టటానికి మా వూరికి వస్తే మా యింట్లో భోజనము నేను వారికి వడ్డించినాను" అని చెప్పినారు. ఇదే సందర్భంలో మెదక్ జిల్లా శివంపేటలో గీతా జయంతి ఉత్సవాలు జరగడం మా నాయనగారు పోయిరావడం నాకు గుర్తు. ఈ శివం పేట మెదక్ ప్రాంతం వారే శాస్త్రుల విశ్వనాథశాస్త్రిగారు ఆనాటి గీతా జయంతి ఉత్సవాల స్ఫూర్తితో వారు అయిదు శాస్త్రాలలో ఆచార్యత్వము వహించి, గవర్నమెంటు ఉద్యోగాన్ని వదులుకొని సంస్కృత విద్యా ప్రచారానికి తన యింటినే కేంద్రంగా చేసి ఎందరో విద్యార్థులను, విద్వాంసులను తీర్చిదిద్దిన అక్షరశిల్పి, అమరజీవులు, ధన్యులు.

అందుకే అన్నాను ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈ అరువది సంవత్సరాలలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ నిరక్షరాస్యులకు కూడ భాషాభిమానం కలిగేటట్లు చేసిన సేవ ఈ సంస్థతో పాటే ఎదిగి తమ జీవనలతను పెనవేసుకున్న పాండు రంగయ్యాగారు వంటి వారెందరెందరో చేసిన సేవను ఏ కొలమానంతో కొలవగలము?

దేవులపల్లి రామానుజరావుగారికి ఇల్లంటే సారస్వత పరిషత్తే వారి యిల్లు. వారి సేవను ఏమని పొగడగలము? సంస్థకు, ప్రభుత్వానికీ మధ్య వారధిగా నిలబడి సారస్వత పరిషత్తుకు భవనప్రాంగణాన్ని, లీజునుండిభవనం సొంత ఆస్తిగా మార్చగలిగిన ఆచార్య సి. నారాయణరెడ్డిగారి సామర్థ్యాన్ని, సేవాతత్పరత్వాన్ని, దానికి తగిన ద్రవ్యదానము పదునైదు లక్షల రూపాయల దానాన్ని చేయగలిగిన మనసున్న "రెడ్డి లేబరేటరీస్" అధినేత శ్రీ అంజిరెడ్డిగారిని ఏమాటలతో ప్రశంసిస్తే సరిపోతుంది.

భాస మహాకవి ప్రతిజ్ఞా యౌగంధరాయణ నాటకంలో యౌగంధరాయణ మంత్రి నోట దూతను గూర్చి అన్న ఒకమాట గుర్తుకు వస్తున్నది.

"యాస్యతి బలవాన్, యస్యాస్తిసౌహార్దమ్" అని ప్రతిజ్ఞ.

1వ అంకం.

దూతగా పోగలిగినవాడు సమర్థుడై ఉండాలి. అతనికి సుహృద్భావము కూడా ఉండాలి. తెలుగు భాషను తపస్సు చేసి స్వాయత్తం చేసుకొన్న రససిద్ధులు వీరంతా. ఇది భాష ఎడల ఉండే భావము. వీరి మాటను గవర్నమెంటు వారు విన గలగాలి. అది సామర్థ్యము. వ్యక్తిత్వ విశేషము. అందుకే కాళిదాస మహాకవి

"భవంతి సామ్యేZపినివిష్టచేతసాం
వపుర్వి శేషేష్వతి గౌరవా:క్రియా:"

కుమార సంభవము - 5వ సర్గ.

అని అన్నాడు. అందరి ఎడల సామ్యభావమున్న వారికి గూడా విశిష్ట వ్యక్తుల ఎడల గౌరవము ఎక్కువగా ఉంటుంది. దానికి వారు సర్వదా అర్హులు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు అనేమంచినీటి బావి. జిజ్ఞాసువుల పిపాస (దప్పిక)ను తీరుస్తూ విశ్వమంతా జరుగుతూ వున్న తత్వాన్వేషణలో అంతర్లీనమై పోయింది గదా! శాస్త్ర గ్రంథాలు తెలుగులో ఇంకా రావాలని, శాస్త్రజ్ఞులు తెలుగులో ఆలోచించి రచనలు చేయాలని ఆ రచనలు కేవలాను వాదాలు కారాదని, అట్లాంటి గ్రంథాలను సారస్వత పరిషత్తు, తెలుగు అకాడెమీ వంటి సంస్థలు ప్రచురించాలనీ, వజ్రోత్సవ సందర్భంలో మనము నమ్ముతున్నాము. అమృతోత్సవం నాటికి అదినిజమని నిరూపించబడాలి. ఈ దేశంలో గ్రాస్ రూట్ లో ఉన్న విజ్ఞానం పైకి రావాలి. తెలుగులో వ్రాసిన విజ్ఞాన గ్రంథాలను ఇంగ్లీషులోనికి అనువదించే రోజులు రావాలి. ఆ గ్రంథాలను సారస్వతపరిషత్తు వంటి సంస్థ ప్రచురించాలి. ఇంకా ఎన్నో. ఎన్నో ప్రాచ్య విద్యారంగంలో కృషి మొదలయింది. 1956-57 సం॥లలో నల్లకుంటలో ఓరియంటల్ కాలేజీ. ఆ తరువాత బొగ్గులకుంటలో సారస్వత పరిషత్తు ప్రాంగణంలో మరో ఓరియంటల్ కాలేజీ ఏర్పడింది. ఈ కృషి ఎంతటి మహనీయమైనది ఈ కృషికికారకులయిన మహామహులందరికీ నమో వాకములు.

"ఓం నమః పరమ ఋషిభ్యః పరమ ఋషిభ్యః"

భారతీయ సంస్కృతి - జాతీయ సమైక్యత

శ్రీ యం. యస్. రాజలింగం

సంస్కృతిని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు తను వ్రాసిన ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి అనే గ్రంథంలో ఈ క్రింది విధంగా నిర్వచించారు. "సంస్కృతి యననేమి? ఒక జాతి అభివృద్ధి మార్గమున నడచిన రీతిని సంస్కృతి యనుచున్నారు. వ్యక్తి చేయు అభివృద్ధి యత్నమును సంస్కారము అనవచ్చును. అతడు సంస్కారి యనగా సంస్కారము కలవాడు. చక్కని మనో వికాసము కలవాడు అన్నమాట. ఆర్య సంప్రదాయము ప్రకారము సంస్కారి అనగా ఆహితాగ్ని, ద్విజునకు చెప్పబడిన కర్మలను యధావిధిగా నిర్వహించు దీక్షాపరుడు అని పూర్వ సంకేతము. ఇప్పటి పరిభాషలో సంస్కారి యనగా సంఘమందలి దురాచారములను సవరించుటకో, నిర్మూలించుటకో కృషి చేయువాడు. వీరేశలింగము పంతులు సంఘ సంస్కారి. సంస్కృతి, సంస్కృతము, సంస్కరణము, సంస్కారము మొదలగు పదములన్నియు ఒక కుదుట బుట్టినవి. వీటన్నిటికి ఒకే యర్థము - హీనదశ లేక ప్రాథమిక దశనుండి ఉత్తమ దశను చేరుటకై చేయు ప్రయత్న పరంపర. సంస్కృత భాషకు ఆ పేరెట్లు వచ్చినదో అరయుడు. ప్రాకృత దశ నుండి అనగా జనసామాన్య వ్యవహార పుటవస్థనుండి శిష్టజన వ్యవహారము చేతను, వ్యాకరణాది నియమముల చేతను శుద్ధమైన భాష సంస్కృతభాష. అట్లేజాతులు కాని, సంఘములు కాని భౌతికముగను, మానసికము గను, ఉచ్చదశ నొందుటకై చేయు నిరంతర యత్నమే వారి సంస్కృతియని చెప్పనగును"

ఏటుకూరి బలరామమూర్తిగారు అనాగరికత నుండి నాగరికతకు అజ్ఞానం నుండి విజ్ఞానానికి పశుప్రవృత్తి నుండి మానవతకు సాగే పరిణామమే సంస్కృతి అని ఉటంకించారు. 'గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై గురవేనమః' అనే పెద్దల నుడి మన సంస్కృతిలో ఊయలలో ఉన్న పసిపాపనుంచి పెద్దలవరకూ తల్లులు, పెద్దలు నేర్పుతున్న మాట. అది జీర్ణించుకున్న భారతీయుడు అదృష్ట వంతుడు. అంతేగాక అతను భారతీయ సంస్కృతి నిలబెట్టుటకు తోడ్పడు విజ్ఞాని, మేధావిగా పరిగణింపవచ్చు. అతనే భారతీయ సంస్కృతికి ఒక వాహికగా పనిచేయు సాధకుడు అని కూడా అనవచ్చు. ఈ గురు భావము, ఈ శిక్షణే ప్రజలను భక్తి మార్గాన పెట్టింది. నైతిక విలువలను పెంచింది. ఈ ప్రాతిపదికయే స్వయంపోషక, స్వయం నిర్ణయ, స్వయం సమృద్ధి సూత్రాలను, అందరి నైతిక విలువలను కాపాడుతూ వచ్చింది. గ్రామ స్వరాజ్యాన్నీ, గ్రామ ఐక్యతను జాతి ఐక్యతను పోషించి పెంపొందించినది.

ఈ ప్రవృత్తి మన సంస్కృతి మరువరాని ముఖ్యాంశము. ఈ ప్రవృత్తియే వ్యక్తి క్రమశిక్షణకు, జాతిక్రమశిక్షణకు దారితీసింది. ప్రతి వ్యక్తి తన పరిధిలో ఆత్మ పరిశీలన చేసుకుని తన చర్యలు సత్య సమ్మతము, న్యాయ సమ్మతము, అయ్యేటట్లుగా బహుళప్రజల శ్రేయస్సుగూర్చి తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకొనేటట్లుగా చేసింది. హక్కులతోపాటు బాధ్యతలను గుర్తించి, శాంతి సమాజాన్ని ఏర్పరచుకొనే అవకాశాన్ని ఇచ్చింది. సహజీవనానికి తోడ్పడినది. పారమార్థిక తనకు అనువగు దారి చూపినది. Caeser's wife should be above Board అనే ప్రజా ఆశయానికి తోడ్పడినది. పని నిర్వహించుటలో వ్యక్తి లాభదృష్టి కాక సామాజిక శ్రేయస్సుదృష్టి అధికముగా ఉండునట్లు చేసినది.

సహజీవన సిద్ధాంతాన్ని ఆకళించుకున్న భారతీయ సంస్కృతిస్వాతంత్ర్యోద్యమంలో హిందూ ముస్లిం క్రైస్తవ ఇత్యాది విభేదాలు లేకుండా బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఏకదృష్టితో పడగొట్టు మనస్తత్వము భారతీయ సంస్కృతికి అబ్బినది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఎంతగా

'విభజించి - పాలించు' అనే వైఖరి అవలంబించినా మూల సూత్రములలో ఒకటైన ఆత్మగౌరవము, Live and let live (బ్రతుకు - బ్రతకనీ) అనే సాధారణ సూక్తికి ఎంతేని తోడ్పడింది. ఈ తత్వమే క్రమ వికాసము చెంది జాతి ఐక్యతకు, అంతర్జాతీయ ఐక్యతకు యుద్ధ నివారణకు దారితీసి పంచశీల సిద్ధాంతము అగ్రరాజ్యాలకు అంద జేయు శక్తి, కీర్తి రెండూ మన దేశమునకు లభ్యమైనవి.

వేదాధ్యయనము 'మానవాళి క్రమ వికాస చరిత్ర' అధ్యయనము చేయు సందర్భములో భగవంతుడు ఈ సృష్టిలో ఇంతటి విభిన్న తత్త్వములను, వస్తువులను , ప్రవృత్తులను ఎందుకు ఏర్పరిచారు? అని తట్టడం సహజం. చీకటి,వెలుగు, అగ్ని,నీరు, అందని ఆకాశము, అందిన భూమి, నదులు,సముద్రము, ఇందులకు ఉదాహరణము. ఒకసారి భగవంతుణ్ణి ఈ ప్రశ్న అడిగితే బహుశాః అది నా ఇష్టము నా చేతనయింది నేను చేశాను. నీ ఈ ప్రశ్నకి సమాధానం ఇవ్వవలసిన అవసరం లేదు. మీకు జ్ఞానము కూడా ఇచ్చాను. మీరు దానిని ఉపయో గించుకుని ఆనందించండి అది చెబుతాడని పిస్తుంది. ఈ భగవత్ సృష్టిలో ఉన్న విభిన్నతే సృష్టిలోని మానవుడు తన విజ్ఞతతో కొన్ని సిద్ధాంతములను కొన్ని ఆశయము లను పొందుపరిచినట్లు కనిపిస్తుంది. ఈ విభిన్న తత్త్వమే రాజకీయాలలో సాంఘిక ఆర్థిక, సంస్కరణలలో వేరు వేరు రూపములలో ప్రతిబింబించింది. సమాజాన్ని జాతిని విడదీసేందుకు దారితీస్తుంది. అట్టివాటి వల్ల వచ్చు దుష్పరిమాణాలను నిర్మూలించి సమాజంలో సమభావం తెచ్చుటకే సంఘ సేవకులు, రాజకీయ నాయకులు తదితర వృత్తి సాంకేతిక నిపుణులు కృషి చేయాలి. వారి విజ్ఞతే దేశ కళ్యాణము నకు, జాతి కళ్యాణమునకు, నైతిక విలువలు నిలబెట్టుటకు మానవాళి సేవచేయుటకు దారితీస్తున్నది.

విజ్ఞతతోపాటు కేవలం ఆర్థిక, రాజకీయ , సాంఘిక ఇబ్బందులు తొలగించుటే కాక భారతీయ సంస్కృతిలో ఇమిడి వున్న అపరిగ్రహ సిద్ధాంతాన్ని పోషిస్తున్నది. అందలి నైతిక విలువలను పాటించుటకై పాపభీతిని పెంచినది. అరిషడ్వర్గాల వల్ల వచ్చు ఇబ్బందులను చూపి మనిషిని మనిషిగా చేయు ప్రవృత్తిని పెంచినది. కేవలము ఐహిక సుఖమునే పోషింపక, వేదాంత తత్త్వ సారమును మానవునికి మోక్షప్రాప్తికై ఆదిశంకరాచార్యుల వంటి మహనీయులు కృషి సలిపినారు. ఈ తత్త్వము ఆది శంకరాచార్యుల

"పునరపి జననం పునరపి మరణం
పునరపి జనని జఠరే శయనం
ఇహ సంసారే ఖ లు దుస్తారే" లో వ్యక్తమవుతుంది.

ఇదే దృక్కోణంలో త్యాగరాజు శాంతము లేక సౌఖ్యము లేదుఅనే కీర్తనను గానం చేశాడు.

ఇవన్నీ మన జాతి జీవన ప్రవంతిలో ఒక భాగం. వీటిని విశ్లేషించినప్పుడు మాత్రమే ఆ జాతి గొప్పతనము తెలుస్తుంది. ఇలాంటి మహత్తరమైన ఆదర్శ సూత్రాలతో ఎల్లకాలమూ మరవరాని మరువలేని సజీవ పోకడలతో నిండియున్న మన భారతీయ సంస్కృతిని ఎవరు చెల్లా చెదురు చేయదలచినా అది సాధ్యం కాని పని. జాతీయ సమైక్యతను పాడు చేయుటానికి దుష్ట శక్తులు విజృంభించినా వారివల్ల కానిపని. అందులకే మన దేశము, మన సంస్కృతి యావత్ ప్రపంచమునకు ఆదర్శమై ప్రపంచ శాంతికి వెలుగు చూపిస్తున్నది.

మన నాయకులైన బాల గంగాధర తిలక్, గోఖ్లే, అరవిందుడు, స్వామి వివేకానంద, పండిత నెహ్రూ, తదితరులనేకులు విదేశీ చదువులు, చదివి అచటివారితో కలిసి మెలసి ఉండికూడా రక్తంలో జీర్ణించుకున్న మన ఆదర్శ సాంప్రదాయాలను మరువలేదు. అందువల్లనే భారత రాజ్యాంగ చట్టమును రూపొందించిన రాజ్యాంగ పరిషత్తులో, భారత రాజ్యాంగ చట్టము యొక్క Aims & Objects ఆశయాలు, ఉద్దేశాలనుగురించి పండిట్ జీ ప్రతిపాదించిన తీర్మానంలోని చివరి భాగం మన

సంస్కృతిలో నిబిడి యున్న విశ్వమానవ కల్యాణం, విశ్వశాంతి అక్షరబద్ధం చేయబడి యున్నవి.

"The ancient land attains its rightful and honoured place in the World and make its full and willing contribution to the promotion of world peace and welfare of mankind " దీని తాత్పర్యం "కృణ్వంతో విశ్వ మార్యం" అనే సందేశమే. 13 డిసెంబర్ 46 నాడు రాజ్యాంగ పరిషత్తులో చేయబడిన తీర్మానంలో భారతీయ సంస్కృతి సంపూర్ణంగా ప్రతిబింబిస్తున్నది అని చెప్పవచ్చు.

ఇదే రాజ్యాంగ పరిషత్తులో 14వ ఆగస్టు 1947న బాబు రాజేంద్ర ప్రసాద్ తన అధ్యక్షోపన్యాసము ఇస్తూ, "Let us then assure all countries of the world, that we proposed to stickon to our historic tradition to be on terms of friendship and amity with all, that we have no designs against any one and hope that none will have any against us. We have only one ambition and desire that is to make our contribution to building of freedom for all and peace to the mankind' అంటూ ప్రసంగించారు.

"ఈ విధముగా ప్రపంచ దేశాలన్నింటికి మన చారిత్రిక సంప్రదాయాలను మరువకుండ అందరితో స్నేహ సుహృద్భావాలను పెంచుకుంటామని హామీ ఇస్తున్నాము. అంతేకాక మనకు ఎవరిపట్లను దురాలోచనలు లేవని, యితరులు కూడా అదేవిధముగా వుంటారని ఆశిస్తున్నాము. మనకు వున్నది ఒక్కటె ఆశయము, కోరిక. అది అందరికి స్వాతంత్ర్యము వుండాలి. శాంతికి పరోపకారానికి, యావత్ మానవాళి తోడ్పడాలనే వాంఛ"

ఈ విధముగా విశ్వ శాంతికి తోడ్పడుతూ హామీలు యిస్తున్న భారతదేశము స్వతంత్రము వచ్చి యేబది సంవత్సరాలు పైబడినా, ఆచరణలో కూడా ఈ విషయం రుజువు చేసుకొన్నది. అందుకే అన్య దేశస్థులు వారి వారి దేశము యొక్క యెల్లలను భౌగోళిక సార్వభౌమత్వాన్ని (Territorial Soverignity) రక్షించుకొను విషయములో మన తోడ్పాటుకై వాంఛిస్తున్నారు. మనతో ఏకీభవించని పాకిస్తాను విషయంలో కూడా భౌగోళిక సార్వభౌమాధికారానికి భంగము కల్గకుండా వ్యవహరించటము జరుగుచున్నది. ఇందులకై చేయు ప్రయత్నములే మన జాతీయ సమైక్యతను రక్షిస్తున్నవి. అదే మన సంస్కృతి యొక్క గొప్పతనము.

మరొక గొప్ప విషయం మన సంస్కృతిలో గురువు పట్ల ప్రాముఖ్యత విధేయత దీనికి ముఖ్యకారణం. 'గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః' అను ప్రబోధము చిన్ననాటినుండి మన నరనాడులలో జీర్ణించుకుపోయిన సంస్కృతి మనది.

గాంధీజీ మన దేశానికి జాతికి రాజకీయ గురువు. ఆయన అనుంగు శిష్యులలో పూజ్యవినోబాజీ, ప్రజా నాయకులు పండిట్‌జీ యిత్యాది ప్రముఖులున్నారు. గాంధీజీ వ్యక్తి సత్యాగ్రహం 1940లో నడిపినప్పుడు, వినోబాజీని పిలిచి మిమ్ములను మొదటి సత్యాగ్రహిగా ఎంపిక చేసాను. ఈ సత్యాగ్రహానికి సిద్ధమగుటకు ఎంత సమయము కావాలి అని అడిగారు. దానికి జవాబుగా 'బాపు మీ ఆదేశమే కాలం నిశ్చయించింది. నేను ఈ నిమిషానికే సిద్ధముగా వున్నా'నని అన్నారు. వినోబాజీ పలుకులు శిష్య ధర్మాన్ని గుర్తు చేస్తున్నాయి. భారతీయ క్రమశిక్షణ స్వభావ స్వరూపాలు సంస్కృతి విశిష్టతను తెల్పుతుంది. గురుభక్తి తోపాటు ఎంతపెద్దవాడైనా భారతీయ సంస్కృతిలో నమ్రత నిమిడియున్నది. 'అహం' అనే శబ్దానికి తావు తక్కువ. ఒకవేళ వున్న, దాని ప్రకారం తగ్గించుకోవాలనే పెద్దల ప్రబోధం వ్యక్తులలో మార్పు తెస్తుంది. వ్యక్తిగత అభిప్రాయాలు గురువాజ్ఞ ముందర లేక నాయకుని ఆదేశాల ముందర ఎందుకు పనికి రావు. ఇందుకు ఉదాహరణగా పండిట్ జీని తీసుకోవచ్చును.

వ్యక్తి సత్యాగ్రహంలో గాంధీజీ పండిట్‌జీని రెండవ

సత్యాగ్రహిగా ఎంపిక చేశారు. ఆ సందర్భంగా పండిట్‌జీ అన్న మాటలు యివి. "It was not to give expression to our individual views. We are symbols who spoke minds of India in the name of India. As idividual we have counted for little. But such symbols and representatives we counted for a great deal".

ఈ వాక్యాలలో నేనే దేశము దేశమే నేను అనునది స్పష్టమవుతున్నది. ఈ అద్వైత సిద్ధాంతమే, భారత సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యత వహించింది. అహం బ్రహ్మాస్మి అద్వైతాన్నిచెప్పకనే చెప్పుతుంది.

భారతీయ సంస్కృతిలో ప్రేమ, వాత్సల్యము, ద్వేష రాహిత్యము స్పష్టముగా కనబడుతున్నవి. అందుకనే అన్నిదేశాలు మన నాయకులపట్ల ఆదరణ చూపుటయే గాక మైత్రి కోరే దేశాలు మన నాయకులను గౌరవించుటయే గాక సలహా సంప్రదింపులు చేయుట సహజమైనది. కృశ్చేవ్ , పండిట్‌జీ పలుమార్లు కలవడం తటస్థించింది. ఆ సందర్భములో బ్రిటీష్ వారుమీకు వ్యతిరేకులైన మీరువారితో మైత్రిగా ఎలా వుండ గలుగు తున్నారని ప్రశ్నించారు. అంతేగాక రష్యా- ఇంగ్లండు మైత్రికి యత్నించమన్నారు. పండిట్ జీ అందులకు తప్పక సహాయం చేస్తానన్నారు, మీరు ఇంగ్లీషు వారి గురించి అసహ్యంగా (Nauty)గా మాట్లాడటం మానివేయమని పండిట్‌జీ సలహా యిచ్చాడు. అప్పుడు నా పని సులభతర మవుతుంది. పరుష వాక్యాలు పలుకుట మన సంస్కృతి హర్షించదు. విశ్వశాంతికై కోరు, మన సంస్కృతి ప్రజామోదమైంది. అది జాతిసమైక్యతకు తోడ్పడుటయే కాక యావత్ ప్రపంచానికి శ్రేయస్కరమైన పంచశీల సిద్ధాంతాన్ని రూపొందించగల్గింది. మన జాతీయ సమైక్యతకు తోడ్పడిన అంశములన్నీ గాంధీజీ చెప్పిన "అహింసా సత్యమస్తే యో బ్రహ్మ చర్యా సంగ్రహే, శరీర శ్రమ ఆస్వాదో, స్వదేశీ స్వర్శ భావన, సర్వ ధర్మ సమానత్వో, హి ఏకాదశీ వ్రత సేవాది, నమ్రతే కృత నిశ్చయాత్" అనే ప్రార్థనాపఠనంలో యిమిడి వున్నవి ఈ అంశముల పట్ల భారతీయుల విశ్వాసమే జాతీయ ఐక్యతకు తోడ్పడుచున్నది. మన దేశములో వివిధ సంస్కృతులున్నను, వాటన్నిటికి మూల సూత్రమైన సత్యం, అహింస, ప్రేమ, సహజీవన యిత్యాది సిద్ధాంతాలు అన్నిటికి వొక్కటిగానే వున్నవి. అందువలనే మన సంస్కృతి, జాతీయ సమగ్రతను, సమైక్యతను రక్షించు చున్నదని చెప్పుటలో అతి శయోక్తి లేదు.

హిందూ సమాజంపై బౌద్ధ మత ప్రభావం

డా. మలయశ్రీ

సిద్ధార్థ గౌతమ బుద్ధుడు (క్రీ.పూ. 566-486) మహాపురుషుడు, త్యాగధనుడు, బౌద్ధ సద్ధర్మ ప్రవర్తకుడు, ఆయన బోధించిన బౌద్ధధర్మం మన దేశంలో ఇంచుమించు 1500 ఏండ్లు వ్యాప్తిలో ఉంది, ఈ దేశంలోనే కాక ఆసియా అంతటా వ్యాపించింది. ఇప్పటికి జపాన్, బర్మా, థాయిలాండ్, శ్రీలంక మొ॥వి బౌద్ధ దేశాలు. రష్యా చీనాల్లో కమ్యునిజం కారణంగా బౌద్ధం మరుగున పడి పోయింది. టిబెట్టు వాళ్ళు ప్రవాసులై తమ బౌద్ధ మాతృదేశానికై కలలు కంటూ మన దేశంలోని కర్ణాటక (బౌళగొబ్బె), బీహార్, మధ్యప్రదేశ్ మొ॥ రాష్ట్రాలలో జీవిస్తున్నారు. ఇటీవల అఫ్ఘనిస్థాన్‌లో తాలిబాన్‌లు బామియాన్ బృహచ్ఛిలా బుద్ధ విగ్రహాలను కూల్చిన విషయం తెలుసుకదా. హిమాలయాల ప్రాంతంలో (లడక్) ఇప్పటికీ బౌద్ధులున్నారు. బుద్ధగయ మన దేశంలోని ప్రసిద్ధ బౌద్ధక్షేత్రం. ఈ దేశమంతటా వందల సంఖ్యలో శిథిల బౌద్ధ స్థూపాలు - చైత్యాలు కనిపించినవి. అజంతా, ఎల్లోరా, ఔరంగాబాద్, నాసిక్, కన్హేరి, కార్ల, కొండానె, గుంటుపల్లి మొ॥ బౌద్ధ గుహా చైత్యాలు ఇప్పటికీ దర్శనీయస్థలాలు - శిల్పాకళా శోభితాలు. ఆదిమ ధేర / స్థవిర వాద బౌద్ధం, బుద్ధా రాధనతో మహాయానమై శిల్ప చిత్రలేఖన సాహిత్యాల అద్భుత సృష్టికి కారణమైనా, దానితో భౌతికవాద బౌద్ధం దారి తప్పింది. హిందూ మతం పోటీవల్ల కావచ్చును. మహాయానం వజ్రయానమై మంత్ర తంత్రాలతో బౌద్ధాన్ని భ్రష్టు పట్టించి చివరకు పుట్టిన దేశంలోనే బౌద్ధం అంతరించి పోవుటకు కారణమైంది.

భారత స్వాతంత్ర్యం (15-8-1947) తర్వాత మన దేశ ప్రప్రథమ ప్రధాని జవాహర్‌లాల్ నెహ్రూ గారు, మే 56 నుంచి 57 వరకు బుద్ధుని 2500వ జయంతిని ఘనంగా జరిపించారు. అంటరానితనం నిర్మూలనకు, మానవ సమతకు తపించిన డా. బి.ఆర్. అంబేద్కర్‌గారు, వర్ణ వివక్షగల హిందూ మత విముఖత్వంలో అక్టోబరు 56లోనే నాగపూర్‌లో తన 4,5 లక్షల దళిత అనుయాయులతో బౌద్ధ ధర్మ దీక్ష తీసుకున్నాడు. వారిని నవబౌద్ధులు అని పిలుస్తున్నారు. బింబిసార, అశోక, శాతవాహన, కనిష్క, హర్షవర్ధన మొ॥ చక్రవర్తుల ఆదరం పొంది మన దేశంలో ప్రభ తగ్గి నామ మాత్రావశిష్టమైన బౌద్ధం, తిరిగి ఈ 20వ శతాబ్దిలో ప్రభుత్వ - ప్రజల ఆదరణ లభించి పునరుజ్జీవన దశ పొందింది. బౌద్ధ క్షేత్రాలు, కళలు, సాహిత్యం - పరిరక్షణ, సముద్ధరణ, పరిశోధనలకు నోచుకున్నవి. ఈ విషయంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నది. బౌద్ధ దేశాలు కూడా తోడ్పాటును అందిస్తున్నవి.

మన జాతీయ త్రివర్ణ పతాకం మధ్య ఉన్నది అశోక ధర్మచక్రం!? ప్రభుత్వ త్రిసింహ ముద్ర బౌద్ధపుదే. బౌద్ధం ప్రబోధించిన శాంతి, అహింసల వ్యాప్తివల్ల మన దేశం నిర్వీర్యమై విదేశీయుల ఆక్రమణలకు లోనైంది - అనేది ఒక ప్రవాదు. క్రీ.పూ. 327 నాటి అలెగ్జాండర్‌కు లోబడిన అంభికానీ, ఎదిరించిన పురుషోత్తముడు కానీ బౌద్ధులు కారు. భారత చారిత్రక మొదటి చక్రవర్తి చంద్రగుప్త మౌర్యుడు జైనుడు. అతని గురువు చాణక్యుడు వైదికుడు. చంద్రగుప్తుని మనుమడు అశోకుడు బౌద్ధుడు. మౌర్యుల తర్వాత మగధను పాలించిన శుంగులు, కాణ్వులు బ్రాహ్మణులు. ఆ తర్వాతి శాతవాహనులు (ఆంధ్ర) బౌద్ధాన్ని ప్రేమించినా యజ్ఞయాగాలు చేసిన హిందువులు. వారు బ్రాహ్మలనీ ప్రతీతి. శాతవాహనుల తర్వాతి గుప్తులు, ఇక్ష్వాకులు (క్రీ.శ. 4, 5 శతాబ్దులు) హైందవ ధర్మ రక్షకులు - దాని వ్యాప్తికి కారకులు 11, 12 శతాబ్దుల గజనీ, ఘోరీ మహ్మదుల దండయాత్రల కాలపు మన దేశపు రాజులు హిందువులే. బౌద్ధం

పిరికితనాన్ని, అనైక్యతను బలపరచలేదు. దైవాన్ని పురా కర్మఫల విశ్వాసాన్ని త్రోచిపుచ్చింది. ధైర్యాన్ని శాంతి సహజీవనాన్ని ప్రబోధించింది.

బౌద్ధ ధర్మం :

శాక్య శుద్ధోధన పుత్రుడు సిద్ధార్థ గౌతముడు జ్ఞానోదయం పొందిన తర్వాత బుద్ధుడు అయినాడు. ప్రపంచ దుఃఖ నివారణకు ఆరాజకుమారుడు స్వగృహాన్ని, భార్యా పుత్రులను, రాజ్య సంపదలను వదలి అడవులకు వెళ్ళి సన్యాసియై పలువురు మునుల, జ్ఞానుల ఆశ్రయించాడు. అనేక విధాలుగా కఠోర తపస్సు చేసి, చివరికి నిదానంగా ఆలోచించి సమ్యక్సంబుద్ధుడైనాడు. అతనికి జ్ఞానోదయమై సత్యం తెలిసింది. ఆయన ప్రబోధించిన నూతన ధర్మం బౌద్ధం. అది మొదట సామాన్య జనాదరణ పొందినా, ఆ తర్వాత రాజుల అభిమాన పాత్రమైంది. భారత దేశమందే కాక విదేశాల్లోనూ వ్యాప్తి పొందింది.

బౌద్ధ ధర్మ గ్రంథాలు సుత్త, వినయ, అభిధమ్మ - త్రిపిటకములు లుంబిని కపిలవస్తు (బుద్ధ జన్మ ప్రదేశం), బోధిగయ (జ్ఞానోదయం అయినస్థలం), సారనాథ్ (ధర్మ చక్రప్రవర్తన, మొదటి బోధ కావించిన చోటు), కుశినార (మహా పరినిర్వాణం - నేపాల్) బౌద్ధులకు పవిత్రాలు, బుద్ధ జననం, జ్ఞానోదయం, మహాపరి నిర్వాణం మూడూ వైశాఖ పూర్ణిమల నాడే కావడం యాదృచ్ఛికం. శ్రీ రాముని జననం కల్యాణం చైత్రశుద్ధ నవమినాడేనట కదా!

దైవ విశ్వాసాలు - ఆరాధనలు, యజ్ఞాలు - జంతు బలులు, కుల వర్ణ విభేదాలు నిరసించి, శాంత్యహింస కరుణల ప్రబోధించి, జన వ్యవహారభాష ప్రాకృతంలో నీతిబోధ - గ్రంథ రచన కావించి బౌద్ధం జనాన్ని విపరీతంగా ఆకట్టుకుంది. రాజ పూజితమైంది. విదేశాలకు వ్యాపించింది. 1000, 1500 వందల సంవత్సరాలు ఉన్నత దశలో వెలుగొందినవి. ఏడవ శతాబ్దిలో మనదేశం వచ్చిన చీనా యాత్రికుడు హ్యూన్‌త్సాంగ్ తన యాత్రా చరిత్ర గ్రంథంలో నాటి బౌద్ధ క్షేత్రాల గురించి రాశాడు. 12వ శతాబ్ది ద్రాక్షారామ మల్లికార్జున పండితారాధ్యుడు, చందోలులో బౌద్ధ పండితులతో వాదించి ఓడి తర్వాత తన శిష్యులతో చంపించాడు. 13వ శతాబ్ది కాకతీయ గణపతి దేవ చక్రవర్తి ఆస్థానంలో నెల్లూరి తిక్కన సోమయాజి జైనులతో వాదించి ఓడించి హింసకు గురిచేశాడు.

10వ శతాబ్ది తర్వాత బౌద్ధం క్రమంగా అంతరించింది. కర్ణుని చావుకు వలె అందుకు కారణాలు అనేకాలు.

బౌద్ధం చెప్పిన దేమిటి?

సత్యం - అహింస, జాలి-సేవ, ఆశాంత్యాహింసతోనే భారత స్వాతంత్ర్య పోరాట కాలాన గాంధీజీ 'సత్యాగ్రహం' సృష్టి జరిగింది. బౌద్ధంలో ఈ 'ఆగ్రహం' అనే ప్రసక్తి లేదు. వారిది శాంతి, సహనం, కరుణ, ప్రేమ, బుద్ధుని జ్ఞానోదయం ఏ అతీంద్రియ శక్తినో పొందుట కాదు. సమ్యగాలోచన - సత్య నిర్ణయం బుద్ధబోధ చతురార్య సత్యాల సారాంశం ఇది - ప్రపంచంలో దుఃఖం ఉంది. కోరికలే దుఃఖానికి మూలం. కోరికలను అదుపు చేసుకుంటే దుఃఖాలు అంతరిస్తాయి. అందుకు అష్టాంగసూత్రాల ఆచరణ ముఖ్యం. దుఃఖ రాహిత్యమే నిర్వాణం - మోక్షం.

అష్టాంగ మార్గాలు నీతి నియమాలు - సమ్యక్ వాక్కు, సమ్యక్ దృష్టి, మొ॥వి.

రాగభోగాలను కాదు, బౌద్ధం విరాగ త్యాగాలను ప్రబోధించింది. ఆర్య - బ్రాహ్మణ పదాల వాడుక బుద్ధుని సామరస్య ధోరణికి నిదర్శనం. బుద్ధుని తర్వాత ఆయన బోధనలు శిష్యులు క్రోడీకరించారు. అవే త్రిపిటకాలు.

తాత్త్వికంగా బౌద్ధం పదార్థవాదం. వేదాల యజ్ఞాల జంతుబలిని నిరసించింది. ఉపనిషత్తులు ప్రతిపాదించిన ఆత్మ - పరమాత్మ (బ్రహ్మం)లను కాదన్నది. పృథ్వీ ఆపస్తేజో వాయురాకాశ పంచభూతాలలో ఆకాశం

లేదన్నది. బౌద్ధులు నేల గాలి నీరు నిప్పు నాలుగు భూతాలనే అంగీకరిస్తారు. దైవం విషయంలో ఉన్నది లేదు అనని మూకీభావం. ఆ వాదన అనవసరం అని బుద్ధుని భావన. దేవుళ్ళనే ఒప్పనప్పుడు జపతపాలు - మంత్ర తంత్రాలు - వరాలు శాపాలు - పురా సంచితాలు పునర్జన్మల ప్రసక్తి ఎక్కడిది? బౌద్ధ పునర్జన్మ జీవాణువుల క్షణక్షణ మార్పు సంబంధి. జాతక కథలు నీతి బోధకు మహాయాన సృష్టి. వాటిని బుద్ధుడు చెప్పి ఉండడు. వివిధ దైవ విశ్వాసాలతో ఉన్న దేశీయులకు నచ్చి అవి వ్యాప్తి అయినై. చివరికి గౌతమ బుద్ధుడు హైందవ పురాణ విష్ణుమూర్తి, దశావతారాల్లోని నవమావతారంగా మార్చబడ్డాడు. బౌద్ధం ఎంతమారినా తన అస్తిత్వం మాత్రం కోల్పోలేదు. ఆధునిక విద్య, పరిశోధనల కారణంగా అది వికాసం పొందుతూ దాని తొలిరూపం వెలుగు చూస్తున్నది. ఇది శుభ పరిణామం!

బౌద్ధం ఆవిర్భవించిన కాలం నాటి భారత దేశ పరిస్థితులు:

అప్పుడు ఉత్తర భారతాన అన్నీ ఆర్యగణ రాజ్యాలు. చక్రవర్తులు లేరు. చతుర్వేదాలు - చాతుర్వర్ణ వ్యవస్థ వ్యాప్తిలో ఉంది. ఉపనిషత్తుల రచన జరిగింది చాలావరకు. త్రైవర్ణికులు వరుసగా పూజనీయులు. బ్రాహ్మణులది అగ్రస్థానం. వర్ణాలే కాక కులవ్యవస్థ ఏర్పడి వాటికి ఉచ్చనీచ స్థానాలు విలువలు ఆపాదింపబడినవి. రామాయణ మహాభారతాలు చిన్నగా నైనా వచ్చి ఉంటవి. పురాణాలు రాలేదు. గంగా సింధూ మైదాన ప్రాంతమే నాటి ఆర్యావర్తం. హిమాలయాల ప్రాంతం తూర్పు భారతంలో స్థానిక ఆటవిక జాతులు ఉండేవి. వింధ్యకు దక్షిణాన దండకారణ్యం - అంధాపథం. నాగులు, ద్రవిడులు మొ॥ ఇక్కడి స్థానికులు - అనార్యులు.

యజ్ఞ యాగాలు - పశుహింస, అతి కర్మకాండలతో సామాన్య జనులకు అధిక శిరోభారంగా ఉన్న కాలమది, వైదికానికి సమాంతరంగా చార్వాక లోకాయత భౌతిక వాద శ్రమణకులున్నా వారి సంఖ్యా బలం తక్కువ. అటువంటి పరిస్థితుల్లో క్షత్రియ కులాలనుంచి వచ్చిన తత్త్వవేత్తలు జైన వర్ధమాన మహావీరుడు, గౌతమ బుద్ధుడు. ఇది నాటి బ్రాహ్మణ్యానికి సవాల్, నిజానికి గీతాకృష్ణుడు కూడ బ్రాహ్మడు కాదు కదా.

ఆర్యుల రాక భారత దేశానికి ఇంచుమించు క్రీ.పూ. 2000 సరి నాడని చరిత్ర పరిశోధకుల నిర్ణయం. రుగ్వేదకాలం క్రీ.పూ. 1500-1000 మధ్య అంతకుపూర్వం క్రీ.పూ. 3 వేల నాటికి సింధూలోయది (మోహంజోదారో - హరప్పా) నగర సంస్కృతి అది ద్రవిడులది కాదన్నా ఆర్యులది మాత్రం కాదు. ఆర్యులు సంచార జీవులు - పశుపోషకులు. వారిది గ్రామీణ సంస్కృతి. వారు సింధూ నగరాల విధ్వంసం కావించి తమ గోచరమైదాన భూములుగా మార్చి ఆనందించినవారు.

సింధూ నాగరికతలో పశుపతి, అమ్మతల్లి విగ్రహాలు - ఆరాధనలు ఉన్నా వాటిని ఆర్యులు అనుసరించలేదు. అలనాటి ఆర్యేతర స్థానిక పుర-గిరి జనులకు అనేక దేవీ దేవతల విగ్రహాలున్నా వాటిని ఆర్యులు గుప్తయుగ పురాణాల రచనల వరకు ఆదరించలేదు. వారిది యజ్ఞ ప్రియత - అగ్ని పూజ. దేవతలకైనా అగ్నిహవిస్సుల ద్వారానే బలులు అందించేవారు. నాగులు శివునికి భూషణం, విష్ణుమూర్తికి పడక కావడం గరుడ వాహనం, రామభక్త హనుమాన్ - అర్జునుని జండాపై కపిరాజు ఆర్యుల అనార్యుల వీరి కలయికకు - వారి వారి విలువలకు సంకేతాలు.

ఆనాటి సమాజంపై బౌద్ధ ప్రభావం:

భారత హిందూ సమాజంపై బౌద్ధ ప్రభావం వివిధ రంగాలలో అమితంగా ప్రసరించింది. ఎవ్వరేమన్నా ఇది చరిత్రలో దాచేస్తే దాగని సత్యం - అని చెప్పక ఒప్పక తప్పదు.

భాష - విద్య :

ఆర్యులు సంస్కృత భాషను ఆదరించారు. అది గీర్వాణ భాష - అంటే దేవభాష. ఆర్యులు అంటేనే పూజ నీయులు అని అర్థం! సంస్కృతం అంటే సంస్కరించ బడినది (భాష) అని అర్థం. దేన్ని? ఆ నాటి స్థానిక

భాష(ల)ను అనుకోవాలి. మొదటి జన వ్యవహారంలో ఉన్న భాష ప్రాకృతం. బౌద్ధం ప్రాకృతాన్ని స్వీకరించింది. ప్రాకృతభేదమైన పాళీ భాషలో తన ధర్మబోధ కావించింది - గ్రంథ రచన సాగించింది. ఇది గొప్ప మార్పు. దానితో సామాన్య జనానికి విద్య చేరువైంది.

వైదిక గ్రంథాలు సంస్కృతంలోనే ఉన్నవి. వాటిని బ్రాహ్మణులకే బోధించారు. శూద్రులకు నేర్పలేదు. పైగా శూద్రులు సంస్కృతాన్ని వినకూడదని కూడ శాసించారు. ఆర్య వ్యవస్థలో బ్రాహ్మణ పుత్రులు, రాజకుమారులు మాత్రమే గురు కులాలలో బ్రాహ్మణ గురువుల వద్ద చదువుకునే వారు. వైశ్యులు గురుకులాలకు వెళ్ళిన ఆధారాలు లేవు. వ్యవసాయం పశుపోషణ వైశ్యుల బాధ్యతలు / ధర్మాలుగా మను స్మృతి పేర్కొంది. శూద్రులకు ఏ వృత్తీ లేదు. అసూయలేకుండా పై త్రైవర్ణికులకు సేవ చేయడమే వారి పని.

శూద్రులకు ఆటవికులకు ఆసక్తి ఉండి భక్తితో బ్రాహ్మణ గురువుల చేరి విద్య నేర్పండని అర్థించినా వారు అంగీకరించే వారు కాదు. పైగా శపించేవారు - శిక్షించేవారు. అందుకు నిదర్శనం భారతంలోని పరశురామ - కర్ణ, ద్రోణాచార్య ఏకలవ్య కథలు. బౌద్ధంతో ఆ పరిస్థితి మారిపోయింది. అన్ని కులాల వారికి విద్య దగ్గరయింది. బుద్ధుని ప్రధాన శిష్యులతో పలువురు నిమ్న జాతుల వారే.

ఆర్యుల వైదిక సంస్కృతిలో విద్యాలయాలు లేవు. మునుల ఆశ్రమాలే గురుకులాలు. ఆ తర్వాత దేవాలయాలు, ఆచార్యుల ఇళ్ళలోగిళ్ళే పాఠశాలలు - ముస్లింలకు మసీదుల వలె.

బౌద్ధులతోనే విద్యాలయాలు ఆరంభం. ఆచార్య నాగార్జునుని కాలపు శాతవాహనయుగ (కీ.శ. 2వ శతాబ్ది) నందికొండ పారావత విహారం గొప్ప విశ్వవిద్యాలయం. ఆ తర్వాత నలందా బౌద్ధ విశ్వ విద్యాలయం పేరెన్నిక కన్నది. అవి విదేశ విద్యార్థులను సైతం ఆకర్షించి విద్యాదానం చేసినై. అదీ విద్యావ్యాప్తిలో బౌద్ధం చూపిన శ్రద్ధ - ఉదారత. ఆ తర్వాత హిందూ రాజులకు కూడా అది మార్గ దర్శకమైంది.

సాహిత్యం:

బౌద్ధధర్మ గ్రంథాలు పాళీ భాషలో ఉన్నవి. ఆ ప్రభావంతోనే కాబోలు మన హాల చక్రవర్తి 'గాథా సప్తశతి'ని కూర్చాడు. గుణాఢ్యుడు పైశాచీ (స్థానిక భాషా భేదం) భాషలో బృహత్కథ రాశాడు. పోగా మిగిలిన దాని భాగాన్నే 10వ శతాబ్దిలో వేములవాడ చాళుక్యుల ఆస్థానకవి సోమదేవసూరి (జైనుడు) కథాసరిత్సాగరం పేర సంస్కృతంలోనికి మార్చాడు.

బౌద్ధ జాతక కథలు పాళీ భాషలో ఉన్నవి అవే విష్ణుశర్మ 'హితోపదేశ పంచతంత్ర కథ'లకు మార్గదర్శకం అనవచ్చు.

అశ్వఘోషుని - సౌందర నందం, బుద్ధచరిత్ర, వజ్రసూచి - (ఇతనితోనే సంస్కృతంలో బౌద్ధ రచనలు ఆరంభమైనవి. క్రీ.శ. 1వ శతాబ్ది.)

ఆచార్య రెండవ నాగార్జునుని - మాధ్యమిక వాదం, సుహృల్లేఖ, శూన్యతా సప్తతి మొ॥.

దిఙ్నాగుని - కుందమాల నాటకం (ఈతర్క పండితుని ప్రసక్తి కాళిదాసు - మేఘదూతం కావ్యంలోని ఓ శ్లోకంలో ఉంది.) ఇంకా బుద్ధఘోష, ఆర్యదేవ, ధర్మకీర్తి మొ॥ బౌద్ధ పండితుల రచనలు సంస్కృత సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. అవి బౌద్ధానికి దేశ - దేశాంతర వ్యాప్తి -కీర్తి సమకూర్చినవి.

దైవ ప్రసక్తి లేని ధర్మకావ్యం తమిళ 'తిరుక్కురళ్' కవి తిరువళ్ళువర్ 2 వశతాబ్ది జైనుడు. కరీంనగర్ వేములవాడలో జైన పంప మహాకవి రచించిన విక్రమార్జున విజయం కన్నడ తొలి కావ్యం - భారతం. అతనికి 110 సం॥ తర్వాత వేంగి నన్నయ భట్టుగారి శ్రీ మదాంధ్ర మహాభారతం - వ్యాస సంస్కృత మహాభారతానికి అనువాదం 'ఇవి ఏనున్ సతతంబు నాకు కరంబిష్టంబు'లని హైందవాభిమానంతో వచ్చింది.

అమరకోశం రాసిన అమరకవి బౌద్ధుడు. అందులో హిందూ పురాణ దేవతలైన శివ కేశవులకు మించిన పర్యాయ పదాలు బుద్ధునికి చూపటం అందుకు నిదర్శనం. ఆ తర్వాత మనవాళ్ళు దేవీ - దేవ నామ సహస్రాలు రాసినారనేది వేరులెండి.

బౌద్ధం ప్రభావంతో ప్రాకృత - సంస్కృత భాషలు -సాహిత్యం వృద్ధి - వ్యాప్తి చెందినై ఆ తర్వాత దేశ భాషల్లో సైతం బౌద్ధ సాహిత్యం ఒక అనివార్య భాగమైంది. బుద్ధ జీవితం - బోధ, జాతక కథలు అన్ని భాషల్లోనూ ఉన్నవి. సౌందరనందం, ధమ్మపదం వంటివి మన తెలుగులో చాల వ్యాప్తి పొందినై, ఉత్తర భారత ఆమ్రపాలి వంటి కథే తమిళ ప్రాచీన బౌద్ధ కావ్యం మణిమేఖలై.

శిల్పం - చిత్రలేఖనం :

వేద సంస్కృతి యజ్ఞాలకు విలువిచ్చింది. ప్రకృతి దేవతలను ఆరాధించింది. నానా దేవదేవతల భావన ఉంది. ఏకదైవ భావన లేదు. ఆత్మ - పరమాత్మల సృష్టి ఆ తర్వాతి ఉపనిషత్తుల కాలాన. వేదాల్లో త్రిమూర్తుల ప్రసక్తిలేదు. శివుడు ద్రవిడ దేవుడు, విష్ణువు అనార్య దేవుడేనట. విగ్రహారాధనలేదు. సింధూ నాగరికతను అది అనుసరించలేదు.

మన దేశంలో చారిత్రక కాలంలో జైనులు- బౌద్ధులు మొట్ట మొదటి సారిగా ప్రార్థనా మందిరాలు నిర్మించారు. మొదట కొండల సానువులను తొలచి గుహాలయాలుగా రూపొందించుకున్నారు. బౌద్ధ స్తూపాలు చైత్యాలు విహారాలు భారత దేశమంతటా విస్తరించుకొని ఉన్నవి. మన ఆంధ్రప్రదేశ్‌లోనే క్రీస్తుకు పూర్వకాలపు స్తూపాలు అమరావతి, నాగార్జున కొండ, భట్టిప్రోలు, ఘంటసాల, జగ్గయ్యపేట, ధూళికట్ట, న్యాలకొండపల్లి, శంకారం, శాలిహుండం, కోటి లింగాల మొ॥ ఇంకా అనేక ప్రదేశాలలో శిథిలమైనా ఉన్నాయి.

అమరావతి, నాగార్జున కొండ, ధూళికట్ట - అపూర్వ శిల్పకళాశోభితాలు. ఉత్తర భారత దేశంలోని సాంచి, సారనాథ్‌ల గురించి చెప్పేపనేలేదు.

అజంతా, ఎల్లోరా, నాసిక్ గుహాలయాలు జగత్ప్రసిద్ధాలు. ఇంకా కన్హేరి, కార్ల, కొండానె, గోలి, గుంటుపల్లి గుహలు గణనీయమైన బౌద్ధశిల్పంతో అలరారుతున్నవి.

శిల్పంలో బౌద్ధమే హిందూలయాలకు మార్గదర్శకమైంది. ఆ పరిణామ క్రమాన్ని ఎల్లోరా బౌద్ధ జైన గుహామందిరాల సరసన హిందూ గుహాలయాలు - కైలాసమందిరం నిర్మించబడడాన్ని చూసి చెప్పవచ్చు.

జైన తీర్థంకరులే శైవ వీర భద్రమూర్తులుగా మార్పు చెందినట్లు డా॥ దాశరథి రంగాచార్యుల కథనం (వార్త - దినపత్రికల వ్యాసం 'అయోధ్యారావణం' తేది 19-6-03). మోటుపల్లి, కొరవి వీరభద్రాలయాలు జైనులవే కావచ్చు. పశ్చిమాభిముఖ ఆలయాలన్నీ జైనులవే. హిందూ ఆలయాలు ప్రాగుత్తరాల్లో ఉంటవి. నెల్లూరు - రంగనాయక, వేములవాడ - బద్ది పోచమ్మ, కోరుట్ల - మహదేవుని గుడి, హన్మకొండ - పద్మాక్షి, భద్రకాళి, యాదగిరి - నరసింహ ఆలయాలు పశ్చిమాలవే. విజయవాడ ఉండవల్లి మూడంతస్తుల గుహావిహారంలోని బుద్ధ శయన మూర్తిని ఇటుకల సున్నం చేర్పు (ప్యాచ్‌వర్క్) పద్మనాభ విష్ణుమూర్తిగా అనంతర కాలాన మనవాళ్ళు ఎలా మార్పుచేసింది ఇప్పటికీ చూడవచ్చు. ఇటువంటి కాయోత్సర్గ బుద్ధ శయన విగ్రహం ఒకటి పెద్దది అజంతా 26వ, గుహలో ఉంది.

మన తొలితరం గుడి చేజెర్ల కపోతేశ్వరాలయం బౌద్ధ చైత్యంకాదా? అమరావతి - అమరేశ్వర, ద్రాక్షారామ భీమేశ్వర లింగాల పొడవులు చూడండి. అందుకు కారణాలని అల్లినకథలు వేరు. నిజానికి అవి బౌద్ధస్తూపాల ఆయక స్తంభాలు - ఛత్ర దండాలు! అదీ మన పూర్వుల సౌమనస్యం - మత సామరస్యం.

ఆలయ వాస్తూ బౌద్ధులదే, వైదిక వాస్తు యజ్ఞ వేదికల, పర్ణ శాలల నిర్మాణానికే పరిమితం. భవన - ఆలయ వాస్తు లేదు. ఈ పరిణామ క్రమానికి సజీవ సాక్ష్యం నాగార్జున కొండ శిథిల శిల్పాలు. బౌద్ధ స్తూపాల శిలా శిల్పఫలకలు అక్కడ అనేకం ఉన్నవి. అవి శాత

వాహన కాలపువి. ఆ తర్వాతి 3వ శతాబ్ది ఇక్ష్వాకుల కాలపు ఆలయం శక్తి, గణేశ, కార్తికేయ విగ్రహాలున్నవి. ఇవి భారత దేశపు తొలితరం హిందూ విగ్రహాలు, గుప్తుల యుగానికి సమాంతరపువి. వారి అశ్వమేధ యాగవేదిక, అవభృత స్నాన కుండం విజయపురి నుండి తరలించి కొండపై పునర్నిర్మాణం కావించారు.

అయితే, ఈ పురాణ - బౌద్ధ వైదిక సంస్కృతులకు పూర్వపు లోహయుగారంభకాల ఆదిమ నివాసుల బృహచ్ఛిలా సమాధులు కూడా అక్కడ కన్పించుట మరో విశేషం. అది ఆ కృష్ణానదీలోయ విశిష్టత - జన సంచార ప్రాచీనతకు ఆనవాలు. ఇన్ని వివరాలు చూపింది బౌద్ధ శిల్పం - వాస్తు హిందూ సమాజానికి దారి చూపిందనే. చిత్రలేఖనం విషయంలో మహారాష్ట్ర అజంతా గుహల కుడ్య వర్ణచిత్రాలు భారత దేశంలోనే ప్రాచీనాలు. తలమానికాలు. వీటికాలాన్ని, సౌందర్యాన్ని, కళా ప్రతిభను చూసి ప్రపంచమే నివ్వెర పోయింది. తర్వాతి స్థానం పితల్ ఖోరాది. అజంతా చిత్రలేఖనంలో, సాంచీ శిల్ప నిర్మితిలో మన తెలుగుల కుంచె వెలుగులు - ఉలిజిలుగులు ఉన్నాయనేది చారిత్రక సత్యం.

అజంతావి అపురూప అరుదైన ప్రాచీన చిత్రాలు. అయితే భాసుని ప్రతిమానాటకంలో రాజ విగ్రహాలు, అతని స్వప్నవాసవ దత్తలో, కాళిదాసు శాకుంతలంలో, భవభూతి ఉత్తరరామ చరిత్రలో చిత్రపటాల ప్రసక్తి మాత్రం ఉంది. మనకు కాకతీయకాలపు చిత్రాలు కనిపించలేదు కాని, విజయనగర చిత్రాలు దొరికినవి. లేపాక్షి -ఆలయ చిత్రాలు దేశికళవి. అవి అజంతా చిత్రాల మించవు. చాల తర్వాతివి.

ఇలా పరిశీలిస్తే హిందూ దేశ శిల్ప చిత్రలేఖన లలిత కళల మీద బౌద్ధుల ప్రభావం అధికం అని తెలుస్తుంది.

తాత్త్వికత:

వైదికం భావవాదం. ప్రపంచ ఆస్తిక మతాలన్నీ అంతే. అవి ఊహలు - విశ్వాసాలపై ఆధారపడినట్టివి. వాటి వ్యాప్తికి కారణాలు పెక్కులు. బౌద్ధానిది భౌతిక వాదం.

మనసుమూలం 'మంచి-చెడు'లకు అన్నింటికీ, అని వ్యక్తి సత్ప్రవర్తనకు స్వశక్తికి ప్రాధాన్యతను ఇచ్చింది బౌద్ధం. ఈ విషయాలు 'ధమ్మపదం' లో వివరంగా చూడవచ్చు.

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥

అని, ప్రబోధించిన భగవద్గీత శ్రీకృష్ణ వ్యాసవాణికి బౌద్ధనీతి ఎంతో భిన్నం, వినూతనం, ప్రగతిశీలకం, వాస్తవం. గుణకర్మల బట్టి వర్ణ విభాగాన్ని నిర్ణయించినట్లు గీతలో ఉన్నా అది సరికాదనే అనాలి. హిందువులకు పుట్టుకతోనే కులాలు సంక్రమిస్తున్నవి. బౌద్ధమే గుణకర్మలకు విలువిచ్చింది. ఆ ప్రభావం 'కులమెంచగా నేల గుణము కారణము' అని మన జానపదుల తత్త్వాల వరకూ సాగి వచ్చింది.

బౌద్ధుల తర్క శక్తీ అపారం. ఆ 'ప్రతీత్య సముత్పాద వాదం' ఇప్పటి వేదాంతులకే కాదు. భౌతిక - జీవ శాస్త్ర వేత్తలకూ గహనమే.

అంధవిశ్వాసం కాదు బౌద్ధం. అది సహేతుకం. బౌద్ధంతోనే మన భారతదేశంలో తత్త్వశాస్త్రం ఒక క్రమపద్ధతిలో శాస్త్రీయ విద్యగా అధ్యయనం - అభివృద్ధి చేయటం జరిగిందని విజ్ఞుల అభిప్రాయం. అంతకు ముందు పూర్వ మహర్షులందరూ తమ తపశ్శక్తి వల్ల దివ్యజ్ఞానాన్ని పొందిన వాళ్ళే కదా! దైవదత్తాలేనయ్యే. అద్వైతి ఆదిశంకరాచార్య - మాయావాదానికి, ఆచార్య నాగార్జునుని శూన్యవాదం మూలం. శంకరాచార్యను ప్రచ్ఛన్న బౌద్ధుడు అనీ అంటారు.

బౌద్ధం అట్లా కాదు. అది మానవ నిర్మితం. మత గ్రంథాలలోని బోధల సత్యాసత్యాల, ఔచిత్య అనౌచిత్యాల, పరిశీలించి చూసి 'అవును-కాదు' అనే సాహస పంథాను ప్రసాదించింది బౌద్ధం. గోమేధాలను పవిత్రంగా భావించి నిర్వహించిన హిందూ సమాజం గోవధ నిషేధ నినాదంతో గోరక్షణ కేంద్రాలను నిర్వహించడంపై బౌద్ధం భూతదయ ప్రభావం ఉందని చెప్పక తప్పదు.

వైద్యం :

వైద్యానికి బౌద్ధం విలువిచ్చింది. హిందువులు రోగనివారణకు దైవపూజలు, తీర్థయాత్రలు చేసేవారు. గిరిజనులకు వనమూలికలతో పాటు మంత్రతంత్రాల తతంగంపై నమ్మకం ఉంది. అయితే పామరులవి మూఢ విశ్వాసాలు, నాగరికుల పూజలు ధర్మ సమ్మతాలట! హిందువుల యజ్ఞాలు, క్రైస్తవుల స్వస్థతా కూటములు, ముస్లింల తాయెత్తులు - ఉపవాసాలు ఏమిటి? ఈ అన్నీ అన్నే. మతాల దన్నింటిదీ ఒకే దారి.

బౌద్ధం అంధ విశ్వాసాలకు లోనుకాక, ఔషధ సేవనానికి విలువిచ్చింది. బౌద్ధ భిక్షులు రోగులను ఆదరించి ఉచిత సేవ - చికిత్స చేసే వారు. దానితో మనదేశ వైద్యం వృద్ధి చెందింది.

ముగింపు :

నాడు హిందూ సమాజంపై బౌద్ధుల ప్రభావం ఎన్నో విధాలుగా అన్ని రంగాలపై పండింది. అయితే మనిషి సహజంగా స్వార్థ జీవి - స్వసుఖకామి - సౌలభ్యగామి. అందుకే చెప్పే దొకటి, చేసేదొకటిగా ఈ సమాజం ఎంతగానో మారిపోతూ దిగజారి పోతూ ఉన్నది. ఎటు చూసినా ఎన్నో కొరతలు - అశాంతి - అలజడులు. నాడే కాదు నేడు ఈ అధునాతన యాంత్రిక స్వార్థ కృత్రిమ ధన దాహ యుద్ధ వ్యామోహ ప్రపంచానికి బౌద్ధ నీతి మార్గం అవసరం. అయితే బౌద్ధంలో కొత్తగా చేరిన అనుచిత అద్భుత విషయాలను తొలగించుకొని విజ్ఞతతో ఆదిమ బౌద్ధధర్మాన్ని వ్యాప్తి చేయాలి, అనుసరించాలి.

బుద్ధం శరణం గచ్ఛామి,
ధర్మం శరణం గచ్ఛామి,
సంఘం శరణం గచ్ఛామి.

తెలుగు సంస్కృతి తీపి గురుతులు

శ్రీ టి . ఉడయవర్లు

తెలుగు సంస్కృతి తీపి గురుతులు మన శిల్పాలు. అవి ఆయా సమకాలీన సమాజానికి, వారి సంస్కృతికి అద్దం పడతాయి.

భారతదేశంలో శిల్పం, చిత్రలేఖనం దేవాలయ వాస్తువుకు పుట్టిన కవలబిడ్డలు. పురాతన కాలంలో విగ్రహశిల్పి ప్రాయికంగా చిత్రలేఖకుడు.

శిల్పం మూడు ఆయతనాలు (డైమెన్షన్స్) గల లలితకళ. చిత్రలేఖనం కేవలం దృశ్య రూపక మైనది. కాని శిల్పం - దృశ్యస్పర్శ రూపమైన కళ. శిల్పాలు - గుండ్రని శిల్పాలుగా, శిలా ఫలకాలుగా వుంటాయి. శిలామూర్తిలోని ఏ అవయవాన్నైనా చేతితో స్పర్శించ వచ్చు. సాధారణంగా శిలా నిర్మాణం అన్ని వైపులనుంచి చూచి సంభావించుటకు అనువుగా వుంటుంది. చిత్ర లేఖనంతో పోల్చితే శిల్పం ఆయుష్యం ఎంతో ఎక్కువ.

శిల్పం - శిల, మట్టి, కొయ్య, దంతం, లోహం తదితర పదార్థాలతో రూపొందిస్తారు. తొలిరోజులలో శిల్పకళ, చిత్రకళ - రెండూ దేవాలయాలను ఆశ్రయించి వుండేవి. వాటిలో వస్తువు - ఆధ్యాత్మికం; ప్రయోజనం - విశ్వశ్రేయం. నిజానికి ఆంధ్ర శిల్పకళ ఘనీభవించిన ప్రాచీన సంస్కృతి చరిత్ర.

పూర్వం దేవాలయంలేని ఊరే ఆంధ్రదేశంలో లేదు. దేవాలయం స్థానికుల సాంఘిక జీవితానికి ఆటపట్టు. ఆలయ నిర్మాణమేమో శిల్పకళకు నెలవు. ఈ కళ ఆంధ్రదేశ భౌగోళిక స్థితిని, ఆంధ్రచరిత్రను, ఆంధ్ర దేశంలో వర్ధిల్లిన వివిధ మతాలను నేపథ్యంగా చేసు కున్నది. తెలుగు మాట్లాడేవారున్న దేశమంతా ఆంధ్ర దేశంగా పరిగణిస్తే, అది - ఉత్తర, దక్షిణాలకు, ప్రాక్ పశ్చిమాలకు సంగమమైంది. అంతేకాదు సుదీర్ఘమైన తీరరేఖ వుండడంవల్ల విదేశాలనుంచి వర్తక వ్యాపార మార్గాలతో పాటు కళాసంబంధమైన ఇచ్చి పుచ్చు కోవడానికి అవకాశం ఏర్పడింది. ఆంధ్రసంస్కృతి వివిధ మతాలు, నాగరికతలు జీర్ణించుకుని సమరస రీతిలో స్వయం ప్రకాశాన్ని సంతరించుకున్నది.

ఆంధ్రదేశంలో సుమారు ఆరు శతాబ్దాలు బౌద్ధం వర్ధిల్లినా, చాళుక్యుల కాలంలో శైవానికి, అనంతరం వైష్ణవానికి పెద్దపీట వేసినా, శిల్ప కళలో మాత్రం - అంతర్లీనంగా సామాజిక జీవనం, వేషధారణ, నృత్య సంగీతాలు - ఒక్క మాటలో సమకాలీన చరిత్ర, సంస్కృతే ప్రతిబింబించింది.

ఆంధ్రశిల్పకళ శాతవాహనుల కాలంలో ఉచ్ఛస్థితిలో వుందంటే అంతకు ఎంతో ముందుగానే ఉద్భవించి వుండాలి మరి. పాటలీపుత్ర త్రవ్వకాలలో వెలుగులోకి వచ్చిన నాటి విగ్రహం ఆంధ్ర శిల్ప చమత్కృతికి మచ్చుతునక. ఈ కళాఖండం పాట్నా మ్యూజియంలో వుంది. ఈ శిల్పమే శాతవాహన శిల్పులకు ఒరవడి. పైగా దీన్ని ఆలంబన చేసుకునే గాంధారశిల్పం కొత్త పోకడలు పోయినట్టు విజ్ఞుల అభిప్రాయం.

శాతవాహనుల శిల్పసంపద రెండు మజిలీలలో వృద్ధి పొందిందని కూడా వర్గీకరిస్తారు. అందులో క్రీస్తుకు పూర్వం నాటిది ఒక ధోరణికాగా, క్రీస్తుకు తర్వాతది వేరొక సరణిలో రూపొందింది. ఇందులో మొదటి తరహాశిల్పం - అమరావతి, జగ్గయ్యపేట, నాసిక్, కార్లీ తదితర స్థలాల్లో కనిపిస్తుంది. ఈ శిల్పంలో అలంకరణ కానరాదు. సామాన్యంగా వుంటుంది. ఈ మూర్తులు తొలినాటి ఎల్లోరా శిల్పాలను పోలి వున్నాయి. అక్కడే కనిపించే క్రీస్తుకు తర్వాతి శిల్పంలో ఆభరణాలు, తలకట్టు లాంటి అలంకరణలు చోటు చేసుకున్నాయి.

శాతవాహనులు తమ రాజధాని అమరావతిలో

నిర్మించిన స్తూపం, చైత్యాలు ఆంధ్ర శిల్పకళకు మకుటాలు. అమరావతికి ధాన్యకటకం, ధరణికోట అనే పేర్లుకూడా వాడుకలో వున్నాయి. అమరావతి అన్న పేరును పద్దెనిమిదో శతాబ్దిలో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు పెట్టాడు. నాటి అమరావతి శిల్పాలు లండన్ మ్యూజియం ముఖద్వారంలో భద్రపరచి వున్నాయి. బ్రిటిష్ మ్యూజియంలోనే అమరావతి శిల్పాలు 121 వున్నాయి. మరికొన్ని శిల్పాలు జర్మనీ, ఫ్రాన్స్, అమెరికాలోని మ్యూజియంలలో, మద్రాసు, ఢిల్లీ, కలకత్తా ఇత్యాది నగరాల్లోని ప్రదర్శన శాలల్లో వున్నాయి. ప్రస్తుతం అమరావతిలోని ప్రదర్శన శాలలో వున్నవి కేవలం విరిగి పోయిన ముక్కలని చెప్పవచ్చు. అమరావతి స్తూపాన్ని పురావస్తు శాఖవారు త్రవ్వకముందే అందులో చాలా భాగం ఊరివారు త్రవ్వి, పాలరాతిని సున్నంక్రింద మార్చు కున్నారు.

గౌతమీపుత్ర శాతకర్ణి, వాసిష్ఠీపుత్ర పులమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి పాలనాకాలంలో నాణ్యమైన శిల్పాలు చెక్కించారు. శాతవాహనులు దాదాపు మూడువందల సంవత్సరాలు పాలించారు. వీరు ముఖ్యంగా బుద్ధుని జాతక కథలను కన్నులకు కట్టినట్టు చెక్కారు. గత శతాబ్ది చివర త్రవ్వకాలలో బయల్పడిన ఈ శిల్పాలలో స్థపతి ఉలి చిత్రలేఖకుని కుంచెలాగా అపురూపమైన విన్యాసాలు చేసింది.

గుంటూరు జిల్లా భట్టిప్రోలులో, కృష్ణాజిల్లా ఘంట శాలలో, ఇంకా జగ్గయ్యపేట, రామ తీర్థం, శాలిహుండం, గొజ్జన్నకొండ, అల్లూరు, గుమ్మడి దర్రు ఇత్యాదిచోట్ల లభించిన బౌద్ధశిల్పాలు, శాసనాలు మన సంస్కృతికి ప్రతీకలు. మన దేశంలోని మతాలన్నింటి లోను హైందవ మతం ప్రాచీనమైంది. అయినప్పటికీ ఆ మతానికి సంబంధించిన దేవాలయాలు గానీ, విగ్రహాలు గానీ తొలుత నిర్మాణం కాలేదు. క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దం నుంచి క్రీస్తు తర్వాత ఆరు, ఏడు శతాబ్దాల దాకా ఆంధ్రదేశంలో బౌద్ధమతం బాగా పాతుకుపోయి, ఎన్నెన్నో బౌద్ధ కట్టడాలు వచ్చిన తర్వాత క్రమంగా హైందవమత సంబంధమైన ఆలయాలు వచ్చాయి.

నిజానికి బుద్ధుని జన్మభూమి అయిన బీహార్‌లోను, దేశంలోని ఇతర రాష్ట్రాలలోను వున్న మొత్తం బౌద్ధ క్షేత్రాలకంటే కూడా ఆంధ్రదేశంలో మూడురెట్లు ఎక్కువగా వున్నాయని లెక్కలు చెప్పుతున్నాయి. అంతే కాదు -ప్రపంచంలోవున్న బౌద్ధతెగలు పద్దెనిమి దింటిలో-తొమ్మిది తెగలతో ఆంధ్రదేశానికి సంబంధం వుంది. ఆంధ్రబౌద్ధం అమరావతి స్తూప శిథిలావ శేషాలను బట్టి చరిత్రకారులు అశోకునికి పూర్వకాలపు నాటిదని నిర్ణయించారు. అమరావతి, నాగార్జున కొండలోని స్తూపాలలో బౌద్ధధాతువు దొరికింది. ఒకనాడు బౌద్ధ విహారాలు ఈ తెలుగునేల నాలుగు చెరగుల తామరతంపరగా విస్తరిల్లి వర్ధిల్లాయి. పురావస్తు వారి త్రవ్వకాలలో బయల్పడినవి కాక భూగర్భంలో మణిగి వున్న బౌద్ధవిహారాలు ఎన్నో వుండవచ్చు. క్రీస్తు పూర్వం **186** ప్రాంతంలో పుష్యమిత్రశుంగుని ధాటికి తట్టుకోలేక బౌద్ధమతం ఆంధ్ర దేశానికి వలస వచ్చింది. అయితే అప్పటి ఆ బౌద్ధుల ఆరామాలు చాలా వరకు ఆ తర్వాత శివాలయాలుగా మారిపోయాయి. భారతదేశంలో బౌద్ధమతం అంతరించడం ప్రపంచ చరిత్రలోని వింతలలో వింత. అంతకంటే కూడా గొప్ప వింత ఏమంటే - ఆంధ్రదేశంలో బౌద్ధమతం నిర్విశేషంగా అంతరించి పోవడం.

బౌద్ధకట్టడాలలో స్తూపం అంటే సమాధి. బుద్ధుని ఎముకలు, బంగారం, రాగి, వెండి, స్ఫటికాలు మొదలైనవి ఒక భరిణెలో పెట్టి దానిపై నిర్మించే కట్టడం ఇది. చైత్యం అన్నా కూడా చితాభస్మాన్ని ధరించిన కట్టడమనే అర్థం. శాతవాహనులు, ఇక్ష్వాకుల కాలంనాటి బ్రాహ్మీలిపి శాసనాల్లో చైత్యాలు అని ఈ కట్టడాలను పేర్కొన్నారు. అయితే నాగార్జున కొండ మీద స్తూపాన్ని మహాచైత్యం అని ఆ స్తూపంపైనున్న శాసనంలో ప్రస్తావించారు.

గౌతమబుద్ధుని నిర్యాణం తర్వాత ఆయన చితిలోని కాలిపోగా మిగిలిన ఎముకలను ఎనిమిది భాగాలు చేసి ఆయన శిష్యులకు సమంగా ద్రోణుడు పంచాడు. మగధరాజు అజాత శత్రువు, వైశాలిని పాలించే లిచ్ఛవులు, కపిలవస్తును పాలించే శాక్యులు, అలకప్పును పాలించే బులీలు, రామగ్రామానికి చెందిన కొలియులు, వేత ద్వీపానికి చెందిన ఒక బ్రాహ్మణుడు, పావకు చెందిన మల్లులు, కుసీనగరంకు చెందిన మల్లులు ఈ అస్థికలు స్వీకరించారు. పిప్పిలి నగరానికి చెందిన మౌర్యులు కొంచెం ఆలస్యంగా రావడం వల్ల వారికి చితాభస్మం మాత్రమే దొరికింది. ఇవి కాకుండా అస్థికలు కొలిచిన పాత్రమీద ద్రోణుడు ఒక స్తూపం నిర్మించాడు. ఇలా ఈ అస్థికలు, చితాభస్మం గ్రహించినవారు ఆయా చోట్ల మొత్తం పది స్తూపాలు నిర్మించారు.

మౌర్యచక్రవర్తి అశోకుడు కళింగయుద్ధం చేసిన తర్వాత - ఆయుద్ధంలో మరణించిన లక్షమందిని చూసి పశ్చాత్తాపం చెందాడు. శాంతికాముకుడై బౌద్ధమతం స్వీకరించాడు. బౌద్ధమత ప్రచారానికి నడుం బిగించి, కుసీనగరంలో నిర్మించిన స్తూపాన్ని ఊడదీసి, అందులోని బుద్ధుని అస్థికలతో వేరు వేరు ప్రాంతాల్లో 8400 స్తూపాలు నిర్మించాడు. ఆంధ్రదేశంలోని అమరావతి, భట్టిప్రోలు, ఘంటసాల, నాగర్జున కొండ మొదలగు చోట్లలోని స్తూపాలు అశోకుని కాలంలో నిర్మించినవో లేక పునర్మించినవో.

ఇలా క్రీస్తు పూర్వం రెండో శతాబ్ది నుంచి క్రీస్తుశకం రెండో శతాబ్దిదాకా వర్ధిల్లినకాలంలోని కృష్ణాతీరంలోని కళాసంపదను అప్పటి పాలకులైన శాతవాహనులపేరున పరిశోధకులు గుర్తించారు. ఈ కాలపు శిల్పాలలో బుద్ధుడు, అతని బోధలు, జాతక కథలు ఇతివృత్తాలు. ఈ కారణంచేత శాతవాహనుల కాలం నాటి శిల్పం - 'బౌద్ధశిల్పం'గా పరిగణించబడింది.

అమరావతి శిల్పాలు రాళ్ళ లోపల పూసిన పూల లాంటివి. బుద్ధుని ఆరాధిస్తున్నట్లు ఫలకంలో ప్రతిబింబించిన మహిళ శిల్పం ఒక అపూర్వ కళాఖండం. ఆ శిల్పంలోని జీవకళ, భంగిమలోని మనోహరత్వం అనిర్వచ నీయమైనవి. అలాగే అలంకరణకు సంబంధించిన మరో కళాఖండం కూడా అపురూపమైంది. అమరావతి శిల్పాల్లో కేవలం ధార్మిక అంశాలకే కాకుండా లౌకిక అంశాలకు కూడా దర్పణం పట్టారు. దేవతా మూర్తులకు బదులుగా ఈ శిల్పాల్లో నిత్య జీవితంలోని వివిధ అంశాలకు శిల్పాకృతిని ఇచ్చారు.

రకరకాల మానవమూర్తులు,వారి సుఖ సంతోషాలు, బాధలు, క్రీడలు, అలంకరణలు, ప్రేమద్వేషాలు, నృత్యగానాలు, జంతువులు, పక్షులు, వృక్షాలు, లతలు, పుష్పాలు, ఇతర రూపాలు ఈ శిల్పాల్లో కమనీయంగా చోటు చేసుకున్నాయి.

గౌతమబుద్ధుని తర్వాత మళ్ళీ అంతటివాడై రెండవ బుద్ధుడిగా పూజలు అందుకుంటున్న ఆచార్య నాగార్జునుడు 'వడాలి' అనే గ్రామంలో జన్మించాడు. చైనా యాత్రికుడు - హ్యూయన్ సాంగ్ వ్రాసిన దాని ప్రకారం నాగార్జునుడు దక్షిణకోసలలో జన్మించాడు. పూర్వం మహారాష్ట్రలోని నాగపూర్‌నుంచి ఆంధ్రలోని కరీంనగర్ జిల్లాను పదమూడు, పధ్నాలుగు శతాబ్దాల దాకా కోసలనాడుగా వ్యవహరించినట్టు దాఖలాలు వున్నాయి. దీన్నిబట్టి 'వడాలి' గ్రామం కరీంనగర్ జిల్లాలోనే వుండే అవకాశం కూడా వుంది. నాగార్జునుడు క్రీస్తుశకం రెండో శతాబ్దికి చెందిన శాతవాహన చక్రవర్తియజ్ఞశ్రీ శాతకర్ణికి సమకాలికుడు. ఇతడు రచించిన "మాధ్యమిక కారిక" ఆయన మేధాశక్తికి గీటురాయి వంటిది. ఈయన వ్రాసిన "సుహృల్లేఖ" బాలుర దగ్గర నుంచి వృద్ధుల దాకా పఠనీయమైన గ్రంథం - మహావక్త, తార్కికుడు, అధ్యాపకుడు, జ్ఞాని, వేదాంతి అనే పంచముఖ మేధావి నాగార్జునుడు. ఇంతటి అపార ప్రజ్ఞా విశేషాలు తనలో వున్నందునే బౌద్ధ వేదాంతాన్ని ఒక మలుపు తిప్పగలిగాడాయన. నాగార్జునుడి దోహదం వల్లనే బౌద్ధధర్మం భారతదేశ సరిహద్దులు దాటి చైనా, టిబెట్, భూటాన్, నేపాల్, బర్మా, థాయ్‌లాండ్, కొరియా, జపాన్ ఇత్యాది

దేశాలకు విస్తరించింది. ఆంధ్రదేశంలోని ఆయన కార్యక్షేత్రం -నాగార్జున కొండ.

అయితే 1926 సంవత్సరంలో ఈ నాగార్జున కొండకు సమీపంలోని నాగులవరంలో అధ్యాపకుడుగా కాలం వెళ్లబుచ్చుతున్న సూరపరాజు వెంకటరామయ్య నాగార్జునకొండలో ప్రాచీన శాసనాలున్న స్తంభాలు న్నాయని పురాతత్వశాఖ వారికి తెలిపే దాకా అది గొప్ప బౌద్ధక్షేత్రమనే విషయం ఎవరికీ తెలియదు. వెంకట రామయ్య చెప్పినమాటపై శాసన పరిశోధకుడు రంగస్వామి సరస్వతి పూనుకుని పరిశోధనలు చేసి నిజంగానే ఆచార్య నాగార్జునుని క్షేత్రమని తేల్చుకుని ప్రభుత్వానికి నివేదించాడు. ఈ నివేదిక ఆధారంగా 1927లో లాంఘర్స్ట్ అనే బ్రిటిష్ పురాతత్వ వేత్త నేతృత్వంలో అక్కడ త్రవ్వకాలు జరిగాయి. బౌద్ధ స్తూపాలు, విహారాలు, ఎన్నెన్నో శిల్పాలు ఈ త్రవ్వకాలలో బయటపడి చరిత్ర రచనకు ఆధారభూతమైనాయి.

నాగార్జున కొండలో మూర్తీభవించిన శిల్పాకళా ఖండాలన్నింటికీ ఇక్ష్వాకులు ప్రాణదాతలు. ఇక్ష్వాకులు బ్రాహ్మణులైనా, వారి సతీమణులు బౌద్ధులు కావడంవల్ల నాగార్జున కొండలో ఈ అపూర్వ కళాఖండాలు రూపు దిద్దుకున్నాయి. ఆచార్య నాగార్జునుడు స్థాపించిన సంఘా రామ విశ్వవిద్యాలయం కళలకు కాణాచి. నాగార్జున కొండ లోయలో సుమారు ముప్పైదాకా బౌద్ధస్తూపాలు, ఆరామాలు వెలుగులోకివచ్చాయి. అయితే బుద్ధుని అస్థికలపై నిర్మించిన 'మహాచైత్యం' చాలా ముఖ్యమైన నిర్మాణం. దీన్ని క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలోనే నిర్మించారు. నాగార్జునకొండలో లభించిన శిల్పాలలో బుద్ధుని ప్రతిమలు సర్వాంగసుందరమైనవి. ఈ శిల్పాలలో జాతక కథలు, మాయాదేవి స్వప్నం, శుద్ధోధనుడు అశోకవనానికి వెళ్ళడం, సిద్ధార్థోదయం కన్నుల కింపుగా చెక్కారు. ఇవి కాకుండా అలంకరణ, నాట్య సంగీత సంబంధమైన అంశాలు, ఇతర అనేక లౌకిక అంశాలకు ఈ శిల్పాలలో ప్రాధాన్యం ఇచ్చారు. ఈ శిల్ప సృష్టిలో వారు పాటించిన శరీర అవయవ నిష్పత్తి వారి రసదృష్టిని ద్యోతకం చేస్తుంది.

ఇక్ష్వాకుల అనంతరం పాలించిన శాలంకాయనులు, బృహత్ఫలాయనులు, విష్ణుకుండినుల కాలంనాటి చెప్పుకోదగిన శిల్పాలేవీ ఇంతవరకు లభించలేదు. ఒంగోలు నుంచి కాంచీపురం వరకు, కాంచీపురం నుంచి పుదుక్కోటవరకు విస్తరించి పల్లవులు క్రీస్తుశకం 225-340 మధ్య కాలంలో పాలించారు. వీరి కాలంలోనే ఏకశిలలోనే పూలుపూసినట్టుగా మహాబలిపురం ఆలయశిల్పాలు చెక్కారు. కోణార్క మందిరాన్ని సూర్యరథ స్వరూపంగా గాంగుల కాలంలో నిర్మించింది ఆంధ్ర శిల్పులే.

వీరి తర్వాత ఓరుగల్లు రాజధానిగా పాలించిన కాకతీయుల కాలంలో శిల్పం మనోహరమైన కళా ప్రక్రియగా విరాజిల్లింది. వారు శైవులైనందున అద్భుతమైన కళాసంపదతో కన్నులు చెదరగొట్టే శిల్ప రమణీయతతో శివాలయాలు నిర్మించారు. హన్మ కొండలోగల వేయిస్తంభాల దేవాలయం, పాలంపేటలో గల రామప్ప దేవాలయం మన సంస్కృతికి, కాకతీయుల శిల్ప కళావైభవానికి నిలయాలు.

ఇంకా కరీంనగర్ జిల్లా నగునూరు బెజ్జంకిలోని లక్ష్మీనరసింహ దేవాలయం, నల్గొండ, మహబూబ్‌నగర్, గుంటూరు, కర్నూలు, ఉభయగోదావరి జిల్లాల్లో అసంఖ్యాకంగా నిర్మించిన ఆలయ శిల్పంలోను అంతా కాకతీయ శిల్పమనే ఏకత్వం కనిపిస్తుంది. కాకతీయులు ఆలయ నిర్మాణాన్ని ఒక ఉద్యమంగా చేపట్టారని చెప్పవచ్చు. బౌద్ధ, జైన, తదితర మతాధిక్యతను తగ్గించి, శైవమత వ్యాప్తి చేయడం ఈ పాలకుల లక్ష్యంగా కన్పిస్తుంది. ఈ కాకతీయ శిల్పాన్ని నాలుగు ప్రధాన భాగాలుగా వర్గీకరించవచ్చు. కాకతీయుల ఆలయాల లోపలి భాగంలో అంటే పై కప్పుల మీద, గర్భాలయ ద్వారాలపైన చెక్కిన శివలీలలు, అందులోని ఇతర మూర్తులు వారి శిల్పకళా చాతుర్యాన్ని చాటుతాయి.

ఇకపోతే ఆలయం వెలుపల ద్వారాల పైన, లోపలి స్తంభాలపై ముచ్చట గొలిపే నర్తకుల శిల్పాలు మరొక విభాగానికి చెందినవి. వేరొక తరహావి ఆలయాల వెలుపల గోడలపై బారులు బారులుగా చెక్కిన అసంఖ్యాక అపురూప శిల్పాలు- నర్తకులు, వాద్యకారులు, ఇతర మానవ మూర్తులు, రుషులవి. ఇవి కాకుండా రూప శిల్పంతో సంబంధంలేని అలంకరణ శిల్పం ఆలయాల నిండా కన్పిస్తుంది. కాకతీయ శిల్పంలో ఏకత్వంలో ఇంత భిన్నత్వం వున్నప్పటికీ సామాన్యుడికి మాత్రం కాకతీయ శిల్పం అనగానే పాలంపేట ఆలయంలో అలంకరించిన నిలువెత్తు నగ్ననాగిని, ఇతర నర్తకుల రూపశిల్పాలే మదిలో మెదులుతాయి. లేదా సాంచీ స్తూప ద్వార తోరణాలను గుర్తుకు తెచ్చే స్వయం భూనాథ దేవాలయ ద్వారం - కాకతీయతోరణం, కోట శిథి లాలలోని కాకతీయ ప్రభువు - ప్రతాపరుద్రుడిగా భావించే శిరస్సు, వేయిస్తంభాల గుడిలోని నంది తది తరాలు స్ఫురిస్తాయి.

వీరి తర్వాత తుంగభద్రానదీ తీరంలో క్రీస్తుశకం 1336లో వెలసిన విజయనగర సామ్రాజ్యం సాహిత్యానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో, శిల్పానికి కూడా అంతే ప్రాముఖ్యత ఇచ్చింది. అందుకే మహాబలిపురంలోని ఏకశిలారథం ఒరవడిలో విరూపాక్షునిరథం నిర్మించారు. ఇక్కడ హజార రామ మందిర శిల్పాలు చెప్పుకోదగినవి.

శ్రీ కృష్ణదేవరాయలు - తంజావూరు, మధుర, కేరళలలో తన రాజప్రతినిధులను నియామకం చేసి నందున ఆయా చోట్ల ఆకాలంలో వెలసిన ఆలయాలు ఆంధ్ర శిల్పుల చేతి చలువే. వాటిలో ప్రతిబింబించింది మన సంస్కృతే. కర్ణాటకలోని హాలిబేడు, బేలూరు మొదలగుచోట్ల శిల్పానికి ఆంధ్రశిల్పులే ప్రేరణ.

విజయనగర కాలానికి చెందిన శిల్పాలు, చిత్రాలు లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో దర్శనమిస్తాయి. దేశంలోని మరే చోట కూడా లేని అరుదైన, అపురూప శిల్పాలు ఇక్కడ చెక్కారు. రాజులు, చక్రవర్తులు అంతా కళా ప్రియులు కావడం వల్ల ఆంధ్రదేశంలోని ప్రతిపల్లెలో, పట్నంలో - ఏదో ఒక చారిత్రక ప్రాధాన్యంగల, మన సంస్కృతికి అద్దం పట్టే శిల్పం కన్పిస్తూనే వుంటుంది. విజయనగర సామ్రాజ్యం మహ్మదీయుల హస్తగత మయ్యాక శిల్ప సంపదతో వర్ధిల్లిన ఆలయాల మూర్తుల చెవులు, ముక్కులు పగులకొట్టి, కాళ్ళు చేతులు విరిచి శిథిలం చేశారు. అయినా సంఖ్యాపరంగా ఎక్కువగానూ, మహ్మదీయుల దృష్టికి సోకకుండా మిగిలిపోయిన ఆలయాలు కూడా ఎన్నో లేకపోలేదు.

ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించే ప్రాజెక్టుల నిర్మాణపు త్రవ్వకాలలో లభించిన ప్రాచీన శిల్పాలను మ్యూజియంలలో భద్రపరచడంతో పాటుగా, ముంపుకు గురవుతున్న దేవాలయాలు భట్టిప్రోలు ఇత్యాదిచోట్ల పునః ప్రతిష్ఠ చేశారు.

శిల్పభూమిగా చరిత్ర ప్రసిద్ధికెక్కిన ఆంధ్రప్రదేశంలో ఈనాటికీ కొత్తగా ఏ దేవాలయం నిర్మించినా ఇక్ష్వాకులు, కాకతీయుల కాలం నాటి శిల్పశైలిలోనే రూపకల్పన చేయడం గమనించదగింది. వృత్తిరీత్యా శిల్పులైన వారు గుంటూరుజిల్లా పురుషోత్తమ పట్నంలో, దుర్గిలో, కరీంనగర్ జిల్లా రామడుగు తదితర గ్రామాలలోవున్నారు. విద్యాగంధం లేకపోయినా దేవాతామూర్తులను శాస్త్రీయ రీతిలో వీరు మలుస్తారు. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ జలాల్లోని జిబ్రాల్టర్ రాయిపై ప్రతిష్ఠించిన అరవై ఎనిమిది అడుగుల ఏకశిలాభారీ బుద్ధ విగ్రహానికి మాతృక నాగార్జున కొండలోగల తథాగతుడే.

రాయితోనే కాకుండా సిమెంట్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ధాతువు, కాంస్య తదితర పదార్థాలతో శిల్పాలు రూపొందించిన ఆధునికులలో సి.ఎస్.ఎన్. పట్నాయక్, వై. వి. లక్ష్మయ్య, పి.టి. రెడ్డి, లక్ష్మీనారాయణ, జి. బాలు మొదలయిన వారెందరో వున్నారు.

ఈ శిల్పంలోని దారుశిల్ప శాఖ మాత్రం ఇటీవలి కాలంలో కూడా మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది. ఆలయ శిల్పంతో పాటుగా ఆలయ దైవానికి ఉత్సవమూర్తిని ఊరేగించడానికి రథాలు,

పల్లకీలు, ఇతర వాహనాలు - ఏనుగులు, తురంగాలు, గరుత్మంతుడు మొదలయినవి రూపొందించడం జరుగుతున్నది. ఈ శిల్పులే దేవతల బొమ్మలతో పాటుగా వినోదం కలిగించే చెక్కబొమ్మలు చేయడానికి అలవాటు పడినారు. ఇవాళ్ల వారికి అదే జీవనోపాధి అయింది. తిరుపతిలో వెంకటేశ్వరస్వామి, అలమేలు మంగాదేవి, సీతారామలక్ష్మణుల చందనపు బొమ్మలు తయారు చేసే శిల్పులున్నారు. ఏటికొప్పాకలో కొయ్య, లక్కతో బొమ్మలు చేసే వారున్నారు. ఇంతటి కళాత్మకత కలిగినవే కాకుండా మన సంస్కృతికి, జీవకళను కలిగిన బొమ్మలను కొండపల్లి శిల్పులు, నిర్మల్ బొమ్మల కళాకారులు రూపొందిస్తారు. హిందూ దేవతల కంచు విగ్రహాలు చేసే డోర్నకంబాల, పెరుమాళ్లపల్లి, ధవళేశ్వరం శిల్పులు, పెంబర్తి ఇత్తడి రేకుల కళాకారులు, కరీంనగర్‌కు చెందిన వెండి నగిషీ నిపుణులు, విశాఖపట్నంలోని దంతపు కొమ్ముతో అలంకరణ వస్తువులు చేసే శిల్పులు, మదనపల్లిలో బుట్టబొమ్మలు, వరిగొండ, వేములవాడలో రంపపుపొట్టు బొమ్మలు, బందరులో కాగితం గుజ్జు బొమ్మలు, హైదరాబాద్ నగరంలో బిద్రీ కళా ఖండాలు రూపొందించే శిల్పులు వారి వృత్తులు చేసుకుంటున్నా ఆయా శిల్పాలు వారి కళాకౌశల్యానికే కాకుండా తరతరాల తెలుగుజాతి సంస్కృతి, సంప్రదాయాలకు ఆనవాళ్ళు.

నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమం

డా. ఎం.ఎల్. నరసింహారావు

భారతదేశంలోని దేశీయ రాజుల పరిపాలనలో ఉన్న సంస్థానాలన్నింటిలోనూ పూర్వపు హైదరాబాదు సంస్థానం చాలా పెద్దది. అప్పుడు దీని వైశాల్యం 82,698 చ.మైళ్ళు. ఇందులో తెలంగాణ భూభాగం సగానికి సగం. ఆనాటి బ్రిటిష్ ఇండియాలోని ఏ సంస్థానానికి లేని అధికారాలు సదుపాయాలు ఈ స్టేటుకు ఉండేవి.

సంస్థానంలో పౌరసత్వ హక్కులు మృగ్యం. సభలు సమావేశాలు జరుపుకోవటానికి కూడా ప్రభుత్వ అనుమతి అవసరమయ్యేది. వాక్స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం ఏ మాత్రం లేని అంధకారంలో ఉన్న రోజులవి. ఉర్దూ ప్రభుత్వ అధికార భాష, బోధనాభాషగా ఉండేది. మాతృభాషలో విద్యాభ్యాసానికి అవకాశాలుండేవి కావు.

తెలుగు భాషకు తెలుగు సంస్కృతికి ఆదరణ లేని ఇటువంటి రోజుల్లో 1901 సెప్టెంబర్ ఒకటవ తేదీన హైదరాబాదు నగరంలో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం అనే పేరుతో ఒక తెలుగు సంస్థ స్థాపించటం జరిగింది. ఈ సంస్థ వ్యవస్థాపకులలో ముఖ్యంగా పేర్కొనదగిన వారు శ్రీయుతులు మునగాలరాజా నాయని వెంకట రంగారావు, పాల్వంచ రాజా పార్థసారథి అప్పారావు, కొమర్రాజులక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, ఆదిరాజు వీర భద్రరావు, కొఠారు వెంకట్రావు నాయుడు మొదలైనవారు. తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి నాంది ఈ నిలయంతోనే జరిగింది. 1904లో హనుమకొండలో శ్రీ రాజరాజనరేంద్ర ఆంధ్రభాషానిలయం స్థాపించారు. ఆ తరవాత వరుసగా తెలంగాణ మంతటా అన్ని జిల్లాలలోనూ ఎన్నో గ్రంథాలయాలు స్థాపించటం జరిగింది.

ఇట్లా తెలంగాణ ప్రాంతంలో గ్రంథాలయాల స్థాపన వల్ల తెలంగాణ యువకులలో మాతృభాషాభి మానమూ, గౌరవము ఏర్పడినవి. స్వదేశ, వేష భాషాభిమానంతో పాటు తెలుగుచరిత్ర, పరిశోధనలపట్ల ఆసక్తి పెరిగింది. తెలంగాణలో గ్రంథాలయోద్యమంతో పాటు ఆంధ్రోద్యమానికి కూడా నాంది జరిగింది. 1922లో ఆరంభమైన ఆంధ్రోద్యమం తెలంగాణమంతటా అతి త్వరలోనే వ్యాప్తి చెందటానికి గ్రంథాలయాలు మార్గాన్ని సుకరం చేసినవి. తెలంగాణలో ప్రారంభమైన ఆంధ్రో ద్యమం ధ్యేయం వేరు. అప్పటి మదరాసు రాష్ట్రంలో అంతర్భాగమైన ఆంధ్రప్రాంతంలో ఉద్యమం లక్ష్యం వేరు. ఆంధ్ర ప్రాంతంలోని ఉద్యమం ప్రధానంగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం జరిగింది. తెలంగాణలోని ఆంధ్రోద్యమం హైదరాబాదు సంస్థానంలోని ఎనిమిది జిల్లాలలో నివసించే తెలంగాణ ప్రజల మాతృభాషను పునరుజ్జీవింప చేసి, తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధిని సాధించటానికి తెలుగు ప్రజల సాంఘిక రాజకీయ, ఆర్థిక, హక్కులను సాధించటానికి, ఇక్కడి ప్రజలలో చైతన్యం కలిగించటానికి ఉద్దేశించబడింది.

ఆనాడు తెలంగాణ ప్రాంతం అన్ని రంగాలలో వెనుకబడి ఉండేది. హైదరాబాదు నగరంలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ నగర ప్రజా జీవితంలో వారికి స్థానం లేదు. 1918లో స్థాపించబడిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉర్దూ భాషకు మాత్రమే ప్రాముఖ్యతనిచ్చి, ఆ భాషనే అభివృద్ధి పరచింది. ఇక్కడి ప్రాంతీయ భాషలైన తెలుగు, మరాఠీ, కన్నడ భాషలను పూర్తిగా నిర్లక్ష్యం చేయటం జరిగింది. నిరాశాజనకంగా ఉన్న ఇటువంటి పరిస్థితిలో శ్రీ మాడపాటి హనుమంత రావు పంతులు గారు తెలుగు భాష వ్యాప్తికి, ప్రజలలో చైతన్యం కలిగించటానికి గ్రంథాలయాలు చేయగల సేవ అమూల్యమైనదని స్వానుభవంవల్ల తెలుసుకొని గ్రంథాలయాల పెంపుకు

కృషి చేశారు. అయితే తెలుగు ప్రజల సర్వతోముఖాభి వృద్ధికి అవసరమైన ఉద్యమమే రాలేదు.

ఈ పరిస్థితిలో ఒక చిన్న సంఘటన వల్ల ఆంధ్రో ద్యమానికి హైదరాబాదు నగరంలో అంకురార్పణ జరిగింది. 1921 నవంబరు 12వ తేదీన గౌలీగూడా ప్రాంతంలోని వివేకవర్ధనీ థియేటర్‌లో హిందూ సంఘ సంస్కరణ మహాసభ జరుగుతూ ఉన్నది. మహా సభా ధ్యక్షుడు పూనాకు చెందిన ప్రముఖ సంఘసేవకుడు, భారతదేశంలో మొట్టమొదటి మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడూ అయిన ధోండే కేశవ కర్వే పండితుడు. సభకు హాజరైన వారిలో ఎక్కువమంది మహారాష్ట్రులే. ఆ రోజుల్లో ప్రజాహితరంగంలో, విద్యాసంస్థలలో వారిదే పై చేయిగా ఉండేది. సభలో ప్రవేశ పెట్టిన ఒక తీర్మానంపై హైకోర్టు వకీలు ఆలంపల్లి వెంకట్రామారావు తెలుగులో ప్రసం గించబోగా సభలో ఉన్నవారు ముఖ్యంగా మహా రాష్ట్రులు తెలుగు ప్రసంగం వినటం ఇష్టంలేక చప్పట్లు చరచి కేకలు వేయసాగారు. దానితో వెంకట్రామారావు గారు తమ ఉపన్యాసం మధ్యలోనే ఆపివేయవలసి వచ్చింది.

ఆ సభలో ఉన్న ఆంధ్ర ప్రముఖులు ఈ అవమానం వెంకట్రామారావు గారికి కాక ఆంధ్ర భాషకు ఆంధ్ర జాతికి జరిగినట్లు భావించారు. సభలో ఉన్న కొందరు ఆంధ్ర ప్రముఖులు ఎంతో బాధపడి సభ ముగియక ముందే బైటికి వెళ్ళి పోయినారు. ఆ రాత్రే వారు హైకోర్టు న్యాయవాది టేకుమాల్ రంగారావు గారి ఇంట్లో సమావేశమై తెలుగువారికి జరిగిన ఈ అవమానాన్ని గురించి భావి కర్తవ్యాన్ని గురించి చర్చించారు. ఆ చర్చల ఫలితంగా 'ఆంధ్రజన సంఘం' ఆవిర్భవించింది.

ఆనాటి సమావేశంలో పాల్గొన్న ఆంధ్ర ప్రముఖులు పన్నెండు మంది. వారు శ్రీయుతులు మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, టేకుమాల్ రంగారావు, బోయిన పల్లి వెంకట రామ నరసింగరావు, మందుముల రామచంద్ర రావు, బూర్గుల నరసింగరావు, పందిటి రామస్వామి నాయుడు, నడింపల్లి జానకిరామయ్యా, మిట్టా లక్ష్మి నరసయ్యా, కొమ్మవరపు సుబ్బారావు, ఆదిరాజు వీరభద్రరావు. 'ఆంధ్ర జనసంఘం' పేరుతో ఏర్పడిన ఈ సంఘానికి బారిస్టర్ ఆర్. రాజగోపాలరెడ్డి గారిని అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. కార్యదర్శి మాడపాటి హనుమంతరావు పంతులు.

ఆంధ్రజన సంఘం ఆశయాలు:

నిజాం రాష్ట్రంలోని ఆంధ్రులలో సంఘీభావం కలిగించడం, మాతృభాషా వ్యాప్తికి కృషి చేయటం, గ్రంథాలయాలు స్థాపించి ప్రజలలో జాగృతి కలిగించడం, పాఠశాలలు స్థాపించటం, తెలుగు విద్యార్థులకు సహాయపడి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సహించటం, విద్వాంసులను సన్మానించటం తెలుగు రాజుల చరిత్ర, పరిపాలనపై పరిశోధనలు జరపటం, తాళపత్ర గ్రంథాలు పరిష్కరించి వాటిని అచ్చు వేయించటం తెలుగులో కరపత్రాలు, లఘుపుస్తకాలు ప్రచురించి వివిధ విషయా లపై తెలుగు ప్రజలకు ముఖ్య సమస్యల గురించి సమాచారం అందజేయటం, విజ్ఞానాభివృద్ధికి కృషి చేయటం మొదలైనవి. ఈ విధంగా జాతి, మత, వర్గ, వృత్తి, కుల, వివక్షత లేకుండా తెలంగాణ ప్రాంతంలో సాంస్కృతిక పునరుజ్జీవ నానికి కృషి చేసే లక్ష్యంతో ఆంధ్రోద్యమం ఆరంభింప బడినది.

రాష్ట్రంలో పలుచోట్ల ఆంధ్ర జన సంఘాలు ఏర్పడినవి. కొన్ని రోజుల తరువాత ఆంధ్ర జన సంఘం కార్యకలాపాల పరిధిని పెంచడం అవసరమని భావించిన పంతులుగారు తెలంగాణ ప్రాంతానికంతటికీ వర్తించే ఒక సమిష్టి అభిప్రాయాన్ని నిర్మించే సంస్థ అవసరమనే నిర్ణయానికి వచ్చారు. కొందరు పెద్దలు ప్రముఖులు, విద్యా వంతులతో సంప్రదించారు. తత్ఫలితంగా నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ ఆవిర్భవించింది. నిజాం రాష్ట్ర ప్రథమ ఆంధ్ర మహాసభ ప్రఖ్యాత పరిశోధకులు

గోలకొండ పత్రికా సంపాదకులు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారి అధ్యక్షతన మెదక్‌జిల్లా జోగిపేటలో జరిగింది. "ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకమ్ము" అనే గేయంతో మహాసభ ఆరంభమైంది. తెలంగాణాలోని అన్ని జిల్లాలనుంచి ప్రతినిధులు వచ్చి ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభలో 32 తీర్మానాలు చేయబడినవి. అన్నీ సంఘ సంస్కరణ, సాంఘిక సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, మద్యపాన నిషేధం, మహిళాభ్యు దయం మొదలైన రాజకీయాలతో సంబంధంలేని తీర్మానాలు ఆమోదించటం జరిగింది.

నిజాం రాష్ట్ర రెండవ ఆంధ్ర మహాసభ 1931లో దేవరకొండలో శ్రీ బూర్గుల రామకృష్ణారావు గారి అధ్యక్షతన జరిగింది. మూడవ మహాసభ ఖమ్మంలో పులిజాల వెంకట రంగారావు గారి అధ్యక్షతన, నాలుగవ మహాసభ సిరిసిల్లలో మాడపాటి హనుమంతరావు గారి అధ్యక్షతన, అయిదవ మహాసభ మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో శ్రీ కొండా వెంకట రంగారెడ్డి గారి అధ్యక్షతన జరిగినవి. 1937లో నిజామాబాదులో జరిగిన ఆరవ ఆంధ్ర మహాసభకు శ్రీ మందుముల నరసింగ రావు అధ్యక్షత వహించారు.

1940లో మల్కాపురంలో జరిగిన మహాసభకు మందుముల రామచంద్రరావు అధ్యక్షులు. 1941 చిలుకూరులో జరిగిన మహాసభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. 1942లో ధర్మవరంలో శ్రీ మాదిరాజు రామకోటేశ్వర రావు అధ్యక్షత వహించారు. 1943లో హైదరాబాదులో జరిగిన మహాసభకు శ్రీ కె.వి. రంగారెడ్డి అధ్యక్షత వహించారు. 1944లో భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్ర మహాసభకు శ్రీ రావి నారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ మహాసభలోనే ఈ సంస్థ పూర్తిగా కమ్యూనిస్టు భావాలుగల వారి చేతిలోకి పోయింది. 1945 నాటికి ఆంధ్ర మహాసభ, రెండుగా చీలి పోయింది. ఒకటి జాతీయాంధ్ర మహాసభ, రెండవది కమ్యూనిస్టు ఆంధ్ర మహాసభ. 1946లో మెదక్‌జిల్లా కందిలో సర్దార్ జమలాపురం కేశవరావుగారి అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభ చివరిది.

స్టేటు కాంగ్రేసుపై నిషేధం తొలగించిన తరువాత ఆంధ్ర మహాసభ కాంగ్రేసులో లీనమైంది, అట్లాగే కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో గల కమ్యూనిస్టు ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీలో కలిసి పోయింది.

తెలంగాణ ఆంధ్రోద్యమానికి ప్రజాభిమానం లభించటానికి కారణం ఆంధ్ర మహాసభ ప్రజా జీవితంలో అన్ని వర్గాల వారికి సంబంధించిన ఆర్థిక, సాంఘిక సమస్యలను చేపట్టి వాటిని గురించి తీర్మానాలు చేసి ఆ తీర్మానాలు ప్రభుత్వదృష్టికి తెచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించటానికి నిరంతరం కృషి చేయటమే. ఈ ఉద్యమం సంఘ సంస్కరణోద్యమంగా కూడా సాగింది. ఈ సంస్థ తెలంగాణాలో ఆంధ్ర భాషాభివృద్ధికి సాహిత్య వికాసానికి అవిరళ కృషి జరిపింది.

తెలంగాణలో ఆంధ్రోద్యమానికి పునాదులు వేసిన ఘనత ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంత రావుకే దక్కుతుంది. తెలుగు భాషకు ఒక గౌరవ స్థానం కలిగించి, తెలంగాణ ప్రజలలో చైతన్యం కలిగించిన ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు చిర స్మరణీయులు.

ప్రాచీన ఆంధ్ర సంస్కృతి

డా. వి.వి. కృష్ణశాస్త్రి

మానవ సంస్కృతి రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి భావ సంస్కృతి రెండవది భౌతిక సంస్కృతి, వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు ఇతరగ్రంథాలు భావ సంస్కృతికి చెందినవి. భౌతిక సంస్కృతినే వస్తు సంస్కృతిగా చెప్పవచ్చు. మానవ నిర్మితమయిన వస్తు సముదాయం గురించిన చర్చ గాబట్టి వస్తు సంస్కృతి అని చెప్పాలి. ఒక దేశ లేక ప్రాంత ప్రజలు తమ జీవితాలను ఏ విధంగా గడిపారు, వారి గ్రామాలను పట్టణాలను ఏ విధంగా నిర్మించుకున్నారు, ఏయే ధాన్యాలు పండించేవారు, వారి నీటి అవసరాలకు బావులు చెరువులు ఏ విధంగా నిర్మింపబడ్డాయి, వారు ఏయే లోహాలను కనుగొన్నారు, ఆ కాలంలో ఏయే వస్తువులు వాడకంలో ఉండేవి మొదలయిన విషయాలు వస్తు సంస్కృతికి చెందుతాయి. పురాతత్త్వ పరిశోధనలు భావ సంస్కృతి పరంగాను భౌతిక సంస్కృతి పరంగాను ఉంటాయి.

నాగావళి, వంశధార, గోదావరి, కృష్ణవేణి, తుంగభద్ర, పినాకిని, స్వర్ణముఖి మొదలయిన నదీ నదాలతో పునీతమై సారవంతమయిన భూములతో సస్యశ్యామ లమయి గృహ తదితర అవసరాలకు కావలసిన శిలా సంపద కల్గి, ప్రశస్తమయిన వజ్ర, వైడూర్య, మరకత, గోమేధిక పుష్యరాగ రత్న సంచయాన్ని గర్భాన దాల్చిన లక్షల సంవత్సరాల నాటి ప్రాచీన శిలాయుగాలకు చెందిన మానవ సంఘ పురోగమనంతో వేళ్ళూని, వేద, ఉపనిషత్, ఇతిహాస పురాణాది కాలాల్లో శాఖోపశాఖలుగా విస్తరించిన తెలుగు జాతిసంస్కృతి భారతదేశ కీర్తికిరీటంలో కలికి తురాయి వంటిది. ఏ విషయం ఉత్కృష్టమయినదని చెప్ప బడిందో, తలంపబడిందో అదే సంస్కృతి. సంస్కారం నుండి ఆవిర్భూతమయిన ఆలోచనలు ఆచరణ రూపం దాల్చి ఆటవిక దశనుండి నాగరికత వైపు పయనింప చేస్తాయి. సంగీత, నృత్య, సాహిత్య, వాస్తు, శిల్ప, శాస్త్ర సాంకేతిక విజ్ఞాన అభిష్యందమే ఆ సంస్కృతి వృక్షపు శాఖోపశాఖలు.

మహాటవులలో క్రూర మృగాల మధ్య తన ఉనికిని కాపాడుకుంటూ కొండగుహల్లోనో, చెట్లనీడల్లోనో నివాసం చేస్తూ చెట్లను ఛేదించడానికి, జంతువులను వేటాడడానికి తయారు చేసి కొన్న ప్రత్యేక రూపాలుగల రాతి పనిముట్ల తోనే మానవ వస్తు సంస్కృతి వికాసమారంభ మయిందని చెప్పవచ్చు. వేలు, వందల సంవత్సరాలు నదీ గర్భంలో నీటి రాపిడికి మారిన గుండ్రాళ్ళను చేతిగొడ్డళ్ళుగాను, బాడిసలుగాను, గోకుడు పనిముట్లు గాను మార్పులు చేసిన దాఖలాలు తెలుగు నాట అనేక ప్రాంతాలలో లభ్యమయినాయి. కరీంనగర్ జిల్లా గోదావరిఖని, కృష్ణాతీరంలోని నాగార్జున కొండ, అమరావతి, నల్గొండ జిల్లాలోని ఏలేశ్వరం, కర్నూలు, కడప, చిత్తూరు, మెదకు జిల్లాలో మంజీరా పరీవాహక ప్రాంతంలోను, మెహబూబ్ నగర్ దింది, చంద్రవాగు కత్తువవాగు ప్రాంతాలలో ఆదిమ మానవుని ఉనికిని రుజువు పరచే అనేక రాతి పనిముట్లు లభించాయి.

రాతియుగాలలోని జీవన విధానాలలోను రాతి పనిముట్ల నైపుణ్యంలోను వచ్చిన మార్పులను బట్టి పాత, మధ్యమ, ఉత్తర, సూక్ష్మరాతి యుగాలుగా వర్గీకరింప బడ్డాయి. ప్రాతరాతియుగంనాటి మానవులు గుండ్రాళ్ళ నుండి పెచ్చులను తీసి పని ముట్లను తయారు చేసేవారు. మధ్య రాతి యుగంలో గుండ్రాళ్ళ నుండి వేరు చేసిన పెచ్చులతో అనేక రకాల పనిముట్లు ఆయుధాలు చేసే వారు. ఉత్తరరాతి యుగంలో మరింతగా సాంకేతిక నిపుణత పెరిగి ఒక విప్లవానికి నాంది పలికింది. పూర్వరాతి యుగాలలో వాడిన విధంగా ఒకే రకపురాయికి బదులు అనేక రకాల రాళ్ళు వాడబడటం, రాళ్ళతోను చంపితినగా మిగిలిన ఎముకలతోను బాణపుములుకులను తయారు చేసి బాణాలను ఆయుధాలుగా వాడటం మొదలయింది. బరిశతో సామీప్యంలోని జంతువును వేటాడగలిగితే ఈటెలు విసిరి కొన్ని అడుగుల దూరంలోని జంతువును నిర్జించగలడు. కాని బాణాలతో కొన్ని గజాల దూరంలోని

జంతువునుగాని శత్రువునుగాని తునుమాడవచ్చును. నేటికి వెనుక పదిలేక పన్నెండు వేల సంవత్సరాలనాడు ఉత్తర రాతి యుగంలో ఆరంభమయిన బాణాల వాడకం క్రీస్తుశకం 16-17 శతాబ్దాల దాకా అంటే తుపాకులు వాడకంలోనికి వచ్చే వరకు కొనసాగింది. రాను రాను ధనుర్విద్య ఒక ముఖ్య శాస్త్రంగా పరిగణింపబడింది.

ఉత్తర రాతియుగపు అవసాన దశలో సూక్ష్మరాతి యుగమనే సంధియుగ మొకటి ఉన్నది. ఈ సంధి యుగంలో కొన్ని ముఖ్యమయిన మార్పులు వచ్చాయి. రాతి పనిముట్ల తయారీలో నిపుణత పెరిగింది. పరిమాణం కుంచించుకుపోయింది. చిన్న చిన్న బ్లేళ్ళు, సూది మొనల బాణపు శిరాలు, త్రికోణాకారపు గోకుడు పనిముట్లు చంద్రవంక ఆకారపు పనిముట్లు అనేక రకాల రాళ్ళతో చేయబడ్డాయి. రాగులు, సద్దలు, యవలు మొదలయిన కొండ ధాన్యాలను చంద్రవంకాకారపు బ్లేళ్ళతో చేయబడ్డ పని ముట్లతో కోసి, ధాన్యాలను రెండు చేతులలో అమరే చిన్న చిన్న తిరగళ్ళతో పిండి చేసి వండుకు తినడం మొదలయింది. దాహార్తికి, గృహ అవసరాలకు కావల్సిన నీటిని నదుల నుండి సేకరించి నిలువ చేయడానికి అవసరమయిన మట్టి పాత్రల తయారీ కూడా ప్రారంభం అయింది. ఈ సంధి యుగాన్ని ప్రాచీన నవశిలాయుగమని పిలుస్తారు (Proto neolithics).

ఈ భూమండలం మీద మానవుని ఉనికి కొన్ని లక్షల సంవత్సరాలు గడిచి నప్పటికీ గృహోపయోగాలకు అవసరమయిన పాత్రల తయారీగాని వాడకం గాని 4-5 వేల సంవత్సరాల నుండే జరిగింది.

ఏ ప్రాంతపు ప్రజలయినా నదులు, ఉపనదులు వాగులు, వంకలు మొదలయిన నీటి వసతులున్న ప్రాంతాలలో నివసించే వారు. నివాస ప్రాంతాలలో చిన్న చిన్న గుంటలు త్రవ్వి నీటిని నిలువ చేసుకునేవారు. చేతికందిన పండ్లనో, కంద మూలాలనో, వేటాడిన జంతువులనో భుజించి జీవనాన్ని సాగించిన కాలమది. ఆ పద్ధతినే ఆహార సేకరణ విధానమని అంటారు. మృత దేహాలను ఖననం చేసినట్లుగాని దహనం చేసినట్లుగాని ఆధారాలు లేవు. అలాగని పూర్వ రాతి యుగాల ప్రజలందరు నరమాంస భక్షకులని చెప్పడానికి వీలులేదు. ఆదిమ మానవుల కాలం నుండి ఉత్తర రాతి మానవుల వరకు జంతువులను వేటాడి కాల్చిన మాంసాన్ని భక్షించేవారే కాని పచ్చి మాంసం ఆరగించ డానికి మానవశరీరం అనుకూలంగా లేదు. చనిపోయిన జంతువులను కాల్చిన విధంగానే మానవ మృత దేహాలను కాల్చి బూడిద చేసి వుంటారని ఊహించవచ్చు.

తెలుగుదేశంలోను భారత దేశ తదితర ప్రాంతాల లోను క్రీస్తు పూర్వం నాలుగు వేల సంవత్సరాల మొదలు క్రీస్తుపూర్వం 800-900 ప్రాంతంవరకుగల మధ్యకాలాన్ని నూతన రాతి యుగ మంటున్నారు. ఈ యుగం సాహితీ పరంగా వేద, ఉపనిషత్, ఇతిహాస యుగానికి సమ కాలీనం. ఈ యుగంలో సంభవించిన మార్పులు ఆధునిక యుగానికి పునాదుల వంటివి.

ఈ యుగ వాతావరణంలోను ప్రకృతిలోను పెను మార్పులు వచ్చాయి. అనుగుణంగా మానవ ప్రకృతిలో మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమై విపరీతమైన వర్షాలు కురవడం చేత నదులు పొంగి క్రొత్తనదులు ఏర్పడ్డాయి. అనేక రకాల వృక్షాలు, మొక్కలు, ఓషధులు ఉత్పన్న మయినాయి. స్త్రీలలో సంతానోత్పాదకశక్తి పెరిగింది. ఫలితంగా జనాభా వృద్ధయింది. క్రమక్రమంగా మానవులు ఆహార అవసరాలకు వలసలు పోయే పద్ధతి పోయి స్థిర నివాసాలు ఏర్పడ్డాయి. అత్యాశ, స్వార్థపరత్వం పెరిగి అన్నింటిని స్వంతం చేసికోవాలనే తృష్ణతో చుట్టూ ఉన్న ఫలసాయాన్ని భూములను తమ స్వాధీనంలోనికి తెచ్చుకోవడం మొదలయింది. ఒక ఋతువులో పెను గాలులు ఒక ఋతువులో కటిక చలి, ఒకప్పుడు తాపం కలుగడం చేత అంతకుముందు నీడ లేకుండా తిరుగాడే మానవులు మొదట్లో శరీరాలను ఆకులతో కప్పుకునే వారు. కొండల మీదనో, చరియలమీదనో నదీ తటాల మీదనో గృహనిర్మాణాలు ప్రారంభమయినాయి. ఆనాటి గృహాలు వృక్షా కారంలో ఉండేవి. వీటినే శాలలు అనే వారు. వాటిని ఆకులతో ఆచ్ఛాదనం చేయడం చేత పర్ణ శాలలయినాయి. మానవులలో దురాశ, క్రోధం ఆవహించి

బలవంతంగా చదరపు నేలలను, నదీ తటాలను, కొండలను, అడవులను ఆక్రమించటం జరిగింది. దురాక్రమణకు జన సమీకరణ అవసర మయింది. జన సమీకరణ వల్ల గ్రామాలు ఏర్పడ్డాయి. గ్రామాలలో వృత్తుల పరంగా తెగలు ఏర్పడ్డాయి. తెగల వల్ల గోత్రాలు ఏర్పడ్డాయి. వ్యక్తులకు వ్యక్తులకు మధ్య సంఘర్షణ లేర్పడి కోట్లాటలు యుద్ధాలు మొదలయినాయి. తెగలకు నాయకులయినవారు తమ అనుచరుల ద్వారా విత్తనాలను ప్రోగు చేసి పొలాల్లో చల్లించి పంటలు పండించడం ఆరంభించారు. ఈ విధంగా వ్యవసాయ మనే వృత్తి ప్రారంభమయింది. పై చెప్పిన తెగలలో వారి వారి వృత్తుల ననుసరించి నాలుగు ముఖ్య కులాలే ర్పడ్డాయి. సూక్ష్మంగా ఇవి ఆ యుగ లక్షణాలు.

ఆ యుగంలో అగ్నికి ప్రాధాన్య మివ్వడం చేత సాహిత్యంలో త్రేతాయుగమని పిలువబడింది. అగ్నులు మూడు విధాలు. 1) ఆహవనీయ 2) గార్హపత్య 3) దక్షిణాగ్ని. క్రొత్త రాతి యుగంలో కూడా అగ్నికి ప్రాధాన్యం ఇవ్వబడింది. వ్యవసాయ విస్తరీకరణకు అవసరమయిన భూమిని చదును చేయడానికి అడవులు నరకబడ్డాయి. నరికిన వృక్షాలను దహింపచేసి బూడిదను పొలాల్లో చల్లి పంటలు పండించేవారు.

నిప్పు ఆరిపోకుండా నరికిన చెట్లకు నిప్పుపెట్టి సెగళ్ళు వేసి నిప్పును నిలువ చేసేవారు. పెద్ద పెద్ద నిప్పుకణికలను చిల్లులు చేయబడ్డ పెద్ద పెద్ద గాబులలో వేస్తూ గూడా నిప్పును నిలువ చేసేవారు. అగ్న్యా ధేయం అనే యాగం నిప్పును నిలువ చేయడానికే నిర్దేశింప బడింది. రాను రాను అది వైదిక పరమయింది.

పండిన పంటను ఇళ్ళకు అంగళ్ళకు చేర్చడానికి పశుసంపద అవసరమయింది. బళ్ళు తిరగడానికి మట్టి పాత్రలు చేయడానికి చక్రం వాడుకలోనికి వచ్చింది. చక్ర నిర్మాణం మానవ చరిత్రను మరొక మలుపు త్రిప్పింది. కుండలు చేసే కుమ్మరికి మరొక పేరు చక్రి. అనేక రూపాలకుండలను మట్టిబొమ్మలను సృష్టి చేస్తాడు కాబట్టి కుమ్మరిని బ్రహ్మ అని పిల్చేవారు. కుమ్మరి తరువాత వడ్రంగిది రెండవ స్థానం. వ్యవసాయ పనిముట్ల తయారీ, గృహ నిర్మాణం, శకట, రథ నిర్మాణం అతడి ముఖ్య విధులు.

క్రొత్త రాతియుగ మధ్య కాలంలో రాగి, బంగారము వాడుకలోనికి వచ్చాయి. లోహాలను కరిగించి వస్తువులను తయారు చేయడానికి కంసాలి వృత్తి ప్రారంభమయింది. వీరు బంగారు, రాగి వస్తువులు తయారు చేసి ఊరూర తిరిగి అమ్ముకునే వారు. రమారమి క్రీస్తు పూర్వం 2000-1500 సంవత్సరాల కాలం నాటికి రాగి, బంగారు లోహాలు వాడుకలోనికి రావడం చేత క్రొత్త రాతి యుగానికి కొంచెం పరావర్తనం చెంది తామ్ర శిలా యుగమని పేరొచ్చింది.

నవ్య తామ్ర - శిలా యుగమునాటి, రాగి వస్తువులు తెలుగు నాట అనేక ప్రాంతాలలో లభ్యమయినాయి. మెహబూబునగర్ జిల్లాలోని చిన్న మారూరు అనే గ్రామంలో క్రీస్తు పూర్వం 1500 - 1200 సంవత్సరాల నాటి తామ్ర శిలా యుగానికి చెందిన శ్మశానాన్ని త్రవ్వడం జరిగింది. అయిదు మృత దేహాలను వరుసగా పండబెట్టారు. కొన్నింటి చేతులకు రాగి గంటాకంకణాలు, చెవులకు అండాకారపు లేత ఎర్రరాతి పూసలు ఉన్నాయి. కంకణాలతో గంటలు వాడటం క్రీస్తుపూర్వం 2000-1500 సంవత్సరాలనాటి క్రొత్త రాతి యుగపు వారసత్వమే. నేటికీ పండిత సత్కారానికి గంటా కంకణాలు గౌరవ సూచకంగా నిలబడ్డాయి. దేవతా విగ్రహాల చేతులలో చూపబడే ఆయుధాలలో గంటగూడ ఒకటి.

రాగితో చేయబడ్డ మొదటి మానవ ఆయుధం ఖడ్గం, రాగి - శిలాయుగానికి చెందిన ఖడ్గానికి రెండు వైపులా పదు నుండి మధ్యలో కత్తి పొడుగునా బుడిపె, ఏంటినా వంటి రెండు పిడులుండటం చేత వీటికి ఏంటినా ఖడ్గాలు అని పేరొచ్చింది. ఈ మాదిరి ఖడ్గాలు అంటే రమారమి క్రీ॥ పూర్వం 2000-1500 సంవత్సరాల నాటివి మెదకు జిల్లా రిమ్మన్న గూడెంలోను, గుంటూరు జిల్లా గుత్తికొండ బిలంలోను, రాయచూరు జిల్లా రాజన్న కల్లూరు లోను లభించాయి.

రాగి - రాతి యుగానికి చెందిన రాగి వస్తు

సంచయాలు లభించిన ప్రదేశాలు ఉత్తర భారత దేశంలో వందకు పైగా ఉన్నాయి. దీనికి "రాగి పాతర్ల" సంస్కృతి అని పేరుంచారు. రాగి రేకులు లేక రాగి పోతతో చేయబడ్డ అనేక రకాల వస్తువులను మానవ శరీరాన్ని దహనం చేయగా మిగిలిన అస్థిసంచయం కల్గిన మట్టి పాత్రలతో పాటు భూమిలో నిక్షిప్తం చేసేవారు.

నవ్య శిలాయుగంలోనే చనిపోయిన వ్యక్తులు తిరిగి జన్మిస్తారనే నమ్మకం ప్రారంభమయిందని భావించాలి. వీరి మృతదేహాలను ఇంటి ఆవరణలోనే సమాధి చేసేవారు. ఆ సమాధులకు మృతుల వర్ధంతి దినాలలో జయంతి దినాలలో అలంకారాలు చేయడం, వారి ఆత్మలకు ఆహుతులివ్వడం జరిగేది. అనంతపురం జిల్లా హలికల్లు అనే గ్రామంలో ఈ సంస్కృతికి చెందిన మృతులను గృహ ప్రాంగణంలోనే సమాధి చేసి సమాధులలో ఆహార పదార్థాలతో నిండిన కుండలు, రాతి గొడ్డళ్ళు మొదలయినవి పూడ్చి పెట్టారు. చనిపోయిన చిన్న పిల్లల దేహాలు, కుండలలో పెట్టి పాతి పెట్టారు. ఒక శిశువును ఖననం చేసి కుండతోపాటు మట్టుగల మట్టి పాత్రలో ఆహార పదార్థాలను అర్పించారు. ఆ పాత్రతో బాటు బొడ్డు తాడును ఛేదించడానికి ఉపయోగించిన చంద్రవంక ఆకారపు రాగి బ్లేడును గూడ ఉంచారు.

రాగి పాతరల సంస్కృతిలోని రాగి రేకులు మానవాకారాలుగా చేయబడినాయి. అశాశ్వతమైన మానవ శరీరం కంటె తామ్ర రూపంలోని శరీరం శాశ్వతమనే నమ్మకంతో మానవాకారపు రాగి రేకులను చేసి ఉంటారు. ఆ రోజుల్లో మృతి చెందిన వ్యక్తులకు శిరోభాగంలో దీపాలుంచిన ఆధారాలున్నాయి. మృత దేహాలను పుష్పాలతో అలంకరించడం మహారాష్ట్రలో గమనించడం జరిగింది.

క్రీస్తు పూర్వం వేయి సంవత్సరాలు మొదలు క్రీస్తు పూర్వం 400-300 సంవత్సరాల మధ్య కాలంలో లోహయుగం నడిచింది. ఇనుమును గృహావసరాలకు ఆయుధాల తయారీకి విరివిగా వాడడం, మృత దేహాలకు పెద్ద పెద్ద సమాధులు నిర్మించడం, ఆ సమాధులలో ఎఱుపు - నలుపు రంగులు కల మృణ్మయ పాత్రలు నిక్షిప్తం చేసి సమాధులచుట్టూ పెద్దపెద్ద బండరాళ్ళ చక్రాలను అమర్చడం ఈ యుగపు ముఖ్య లక్షణాలు. ఈ కాలం నాటి సమాధులు తెలంగాణా అన్ని జిల్లాలలోను కోస్తా ఆంధ్రలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలోను రాయలసీమలో అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలలోను వేల కొద్దీ గమనించడం జరిగింది.

ప్రాంతీయులు ఈ సమాధులను రాకాసి గుడులనీ, పాండవుల గుడులనీ పిలవడం పరిపాటి.

వీటిని స్థూలంగా గుంట సమాధులు, పెట్టె సమాధులు, తొట్టె సమాధులుగా వర్గీకరింపవచ్చును. వ్యక్తి మృతి చెందిన తరువాత లోతైన గుంటను త్రవ్వి అడుగు భాగాన మృత దేహాన్ని ఉంచి ఎఱుపు - నలుపు, పూర్తి నలుపు, లేత ఎఱుపు రంగులు గల మట్టి పాత్రలలో ఆహార పానీయాలను నివేదించి, ఆ సమాధిని త్రవ్విన మట్టితోనే పూడ్చి ఉపరితలంలో పెద్ద పెద్ద బండరాళ్ళను చక్రాకారంగా పేర్చేవారు. చనిపోయినవ్యక్తి జీవిత కాలంలో ఉపయోగించిన ఇనుప ఆయుధాలను మృత దేహంతో పాటు ఖననం చేసేవారు.

రాను రాను కుటుంబ సమాధుల నిర్మాణం మొదలయి ఒకే కుటుంబంలో చనిపోయిన వ్యక్తులందరిని ఒకే సమాధిలో ఖననం చేయడం ఆచార మయింది. తరతరాలుగా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులను ఒకే సమాధిలో ఖననం చేయడానికి సమాధిలో స్థలం పరిమితం కావడం చేత మృత దేహాలను ఎత్తైన వేదికలమీదగాని, నేల మాళిగలవంటి తొట్టెలలోగాని ఎండబెట్టగా కాకులు, గ్రద్దలు, పురుగులు తినగా మిగిలిన ఎముకలను ప్రోదిచేసి కుటుంబ సమాధులలో ఖననం చేసేవారు. రాను రాను మృత దేహాలను ఎండ బెట్టే పద్ధతి పోయి దహనం చేసే ఆచారం వచ్చింది. దహనం చేయగా మిగిలిన ఎముకలను కుటుంబ సమాధిలో నిక్షిప్తం చేసేవారు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం తరువాత ఆర్థిక కారణాల మూలంగానో, సాంఘిక, మతైక మార్పుల కారణంగానో కుటుంబ సమాధుల ఆచారం కనుమరు

గయి మృతదేహాలను దహనం చేయగా మిగిలిన అస్థి సంచయాన్ని నదీనదాలలో విసిరివేసే ఆచారం మొదలయి నేటికీ నిల్చి పోయింది.

ఈ లోహ యుగం నాటి సమాధులలో అనేక రకాల ఇనుప ఆయుధాలు, పనిముట్లు లభించాయి. వీటిలో ఖడ్గాలు, బరిశలు, శూలాలు, చురకత్తులు, బాణపు శిరాలు, దీపపు ప్రమిదలు, వీటిని వేలాడ దీసిన కొక్కె ములు, త్రిశూలాలు, కొంకి కత్తులు, కొడవళ్ళు, గండ్ర గొడ్డళ్ళు, పాఱలు, ముక్కాలి పీటలు, గుఱ్ఱపు టెక్కాలు (stir-rups), గుఱ్ఱపు అస్థిపంజరాలు, కలుపు తీసే గసికలు, మొదలయినవి ఉన్నాయి.

కరీంనగర్ జిల్లా కదంబాపూర్ సమాధులలో అడుగులు కోసిన శంఖాలను ముంజేతులకు గాజులుగా తొడిగిన స్త్రీ కంకాళం త్రవ్వకాలలో లభించింది. ఆమె చెవులకు బంగారపు వర్తులాలున్నాయి. ఆమె పాదాలు నరకబడి ఉండటం చేత ఆమె శిక్షననుభవించిన స్త్రీగా భావింపబడ్డది. నిజామాబాద్ జిల్లా పోచంపాడు సమాధులలో రాగి పిడిగల చురకత్తులు, లేడి ఆకారంలోని మట్టి బొమ్మలు లభించాయి. ఖడ్గాలు, బరిశలు, గండ్రగొడ్డళ్ళు, శూలాలు, మొదలయినవి యుద్ధ ప్రవృత్తికి నిదర్శనాలయితే, కొడవళ్ళు, గసికలు, పాఱలు ఆకాలం నాటి వ్యావసాయిక జీవనానికి ప్రతిబింబాలు.

లోహయుగం నాటి ప్రజలలో కొందరు వేటపైన, పశుపాలన పైనా ఆధారపడగా మరికొందరు వ్యవసాయాన్ని ముఖ్యాధారంగా ఎంచుకొన్నారు. అనేక ప్రాంతాలలో ఈ సమాధులకు సమీపాన బ్రహ్మాండమయిన సరస్సులు, చెఱువులు నిర్మింపబడ్డాయి. మెదకు జిల్లా హుస్నాబాదులోని లోహయుగపు సమాధులకు సమీపంలో కలికి చెఱువు అని ఉన్నది. కరీంనగర్‌లోని కదంబాపూర్ సమాధులు మానేరునదీ తీరంలో నిర్మింపబడ్డాయి. మెహబూబ్‌నగర్ జిల్లా అలంపురం తాలూకాలో గొందిమళ్ళ, పైడి గుట్ట మొదలయిన చోట్ల గల వేలకొద్ది సమాధులు కృష్ణానదీ తటం మీదనే నిర్మింపబడ్డాయి. నల్గొండ జిల్లా ఆమంగళంలోని వందల సంఖ్యలోని సమాధులు ఒక బృహత్తటాక సమీపాన నిర్మింపబడ్డాయి. వరంగల్ జిల్లాతొఱ్ఱూరులోని సమాధులకు సమీపంలో బ్రహ్మాండమయిన తటాకముంది. నేడు మనకగుపించే అనేక తటాకాలు, చెఱువులు లోహ యుగం నాటివేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఈ కాలం నాటి లోహకారులు ఇనుపఖనిజాన్ని సేకరించి, చితగ్గొట్టి చిన్న చిన్న బట్టీలలో కాల్చి స్వచ్ఛమయిన దుక్క ఇనుమును ఉక్కును తయారు చేయడంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలు క్రీస్తు పూర్వం 800-700 సంవత్సరాల నాటికే లోహ పరిశ్రమకు ముఖ్య కేంద్రాలయినాయి. కరీంనగర్ జిల్లాలో 90 కి పైగా గ్రామాలలో ప్రాచీన లోహపరిశ్రమ కేంద్రాలను గమనించడం జరిగింది. క్రీస్తుశకం ఒకటి రెండు శతాబ్దాల నాటికి తెలుగు వారి ఉక్కు ఊజ్ అనే పేరు తెచ్చుకుని మధ్యాసియా, యూరప్ దేశాలకు, రోమన్ సామ్రాజ్యానికి ఎగుమతి అయి ప్రతిఫలంగా కొన్ని వేల రోమన్ బంగారు వెండి నాణాలు దిగుబడి అయ్యాయి. ఆనాటి ఆర్థిక వ్యవస్థలో పెనుమార్పులు వచ్చాయి. ఆర్థిక స్థితిని బట్టి గొప్పవారు, పేదవారు అనే భేదాలు ఏర్పడ్డాయి. గ్రామాల లోను పట్టణాలలోను అర్థబలం అంగబలం కలవారు ఆయా ప్రాంతాలకు నాయకులు అయినారు. ప్రాంతీయ నాయకులను లొంగ దీసిన వారు మహానాయకులయిన వారు. వీరి పైన మహాతలవరులు, మహాదండనాయకులు, మహా సేనాపతులు ఆధిపత్యం వహించారు. వారిపైన సామంత రాజులు వారిపైన చక్రవర్తులు వెలిశారు.

క్రీస్తు పూర్వం వెయ్యి సంవత్సరాలు మొదలు క్రీస్తు పూర్వం 400 సంవత్సరాల వరకు భారతదేశం చిన్న చిన్న గణతంత్ర రాజ్యాలుగా ఉండేది. చిన్న రాజ్యాలను జనపదాలని పెద్ద రాజ్యాలను మహాజన పదాలని పిలిచేవారు. బుద్ధునికాలంలో 16 మహా జనపదాలుండేవి. వాటిలో అస్సాక, మూలక, కళింగ జన పదాలు తెలుగు దేశానికి చెందినవి. అస్సాక జనపదమే నేటి తెలంగాణ. 'మూలక' అనే పదం మహిషకగా మారింది. అదే కృష్ణా గోదావరి పెన్నానదుల పరీవాహక ప్రాంతం.రాజ మండ్రికి

ఉత్తర భాగమంతా కళింగ లేక ముక్కళింగగా వ్యవహరింపబడేది.

లోహయుగంలో అవతరించిన జనపద, మహాజన పదాలు క్రీస్తుపూర్వం నాలుగు అయిదు శతాబ్దాలకు సామ్రాజ్యాలుగా రూపొందాయి. చరిత్రకు తెలిసిన ప్రథమ సామ్రాజ్యం నంద వంశం వారిది. వారి తరువాత మౌర్యులు, శుంగులు కాణ్వులు శాతవాహనులు వరుసగా భారతావనిని ఏక సామ్రాజ్య ఛత్రం క్రిందికి తెచ్చారు. ఆంధ్రశాతవాహన వంశ మూల పురుషుడు శ్రీముఖుడు దక్షిణ కోసల నుండి పాలన ప్రారంభంచేశాడు. అతడి కుమారుడు శాతకర్ణి మగధ వరకు రాజ్య విస్తరణ చేశాడు. కరీంనగర్, మెదక్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలు దక్షిణ కోసలలోని అంతర్భాగాలే. క్రీస్తు శకం మొదటి శతాబ్దంలో కుషానులు ఉత్తర భారతాన్ని ఆక్రమించిన తరువాత శాతవాహన చక్రవర్తుల పరిపాలన పూర్తిగా దక్షిణ భారతానికి పరిమిత మయింది.

నందవంశపు పరిపాలనా చిహ్నాలు తెలుగు నాట అంతగా అగుపింపకపోయినా మౌర్య చక్రవర్తి అశోకుని శిలాశాసనాలు, గుంటూరు, కర్నూలు, బళ్ళారి జిల్లాలలో లభ్యమయినాయి. ఇవేగాక అశోకుని ఆధ్వర్యంలో నిర్మింపబడ్డ బౌద్ధస్థూపాలు ఆరామాలు ఆంధ్ర దేశంలో అనేకం ఉన్నాయి.

మౌర్య, శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండిన, శాలంకాయన, పల్లవ రాజుల పరిపాలనా కాలాన్ని ప్రాక్చరిత్రగా పరిగణిస్తారు. ఈ కాలం నాటి నివేశన స్థలాలు, కోటలు, శాసనాలు తెలుగునాట అనేక జిల్లాలలో గుర్తింపబడ్డాయి. కరీంనగర్ జిల్లాలోని పెద్దబంకూరు, చిన్న బంకూరు, ధూళికట్ట, కోటిలింగాల, లేమునూరు, కప్పారావు పేట, కాచా పూరు, బోడగుట్ట, బొంపల్లి, రాచపల్లి, పైడి చింతలపల్లి, ఖదీంకనగర్తి నిజామాబాద్ జిల్లాలోని బోధన్, వడ్లూరు, వరంగల్లు జిల్లాలోని కొలకండ్ల, పోలకొండ, మెదకు జిల్లాలోని కొండాపురం మొదలయినవి ప్రాక్చరిత్ర కాలంలో గ్రామాలు, పట్టణాలుగా ఉండేవి.

కరీంనగర్ జిల్లాలో గోదావరి నది దక్షిణ తటాన వెలసిన కోటిలింగాల అని ప్రస్తుతం పిలువబడే గ్రామం ప్రాక్చరిత్రకు చెందిన సువిశాలమయిన రాజధానీ నగరం. అక్కడ లభించిన నాణాల ఆధారంగా క్రీస్తు పూర్వం 6-5 శతాబ్దాల నాటికే పట్టణం ఏర్పడిన దృష్టాంతాలున్నాయి. ఆ నగరానికి చుట్టూ ఉన్నత మయిన కోట, దానికి దక్షిణ, పశ్చిమ దిశలయందు లోతైన అగడ్త, ఉత్తరాన గోదావరి నది పొడవునా కొన్ని వందల అడుగుల పొడవైన కోటగోడ, ఆ గోడను ఛేదించి నిర్మింప బడ్డ నీటి ద్వారాలు, కోటకు నలుదిక్కులా బురుజులు ఉన్నాయి.

దక్షిణ భారతావనిలో అత్యంత ప్రాచీన మైన కోటలలో ఇది ఒకటి. లేక ఇప్పటి వరకు జరిగిన పరిశోధనల ననుసరించి ఇదే అతిప్రాచీన దుర్గం కావచ్చు. మౌర్య చక్రవర్తి అశోకునికంటె అంటే క్రీస్తు పూర్వం 3వ శతాబ్దికి ముందు కాలానికి చెందిన బౌద్ధస్తూప అవశేషాలు ఇక్కడ లభ్యమయినాయి. ఆంధ్రకు బౌద్ధాగమనం తరువాత ప్రథమంగా వెలసిన బౌద్ధ స్తూపాలలో కోటి లింగాలలోనిది ఒకటి. కోటిలింగాలకు నైరుతిదిశగా పాశిగాం అనే గ్రామ శివార్లలోని గుట్టమీద మరొక స్తూప శిధిలాలు లభ్యమయినాయి. పెద్దపల్లికి 10 కిలోమీటర్ల దూరంలోని ధూళికట్ట గ్రామంలో మరొక బౌద్ధస్తూపం కనుగొనబడి త్రవ్వ బడింది. అక్కడ లభించిన శాసనాల ఆధారంగా ధూళికట్ట స్తూపం క్రీస్తుపూర్వం 3-2 శతాబ్దాల కాలంలో నిర్మింప బడిందని నిర్ధారిత మయింది.

పూర్వ చరిత్రకు చెందిన మరొక కోటగల పట్టణము కరీంనగర్ జిల్లాలోని ధూళికట్ట. కోటలోపల అనేక తరాలకు చెందిన రాజభవనాలు, బావులు, ధాన్యాగారాలు, ప్రాకారాలు బయటపడ్డాయి. బావులు ఇటుకలతో నిర్మింపబడ్డాయి. మౌర్య అశోకుని కాలానికి చెందిన పంచ్ మార్క్డ్ వెండినాణాలు, శాత వాహన నాణాలు దొరికినాయి. ఇవేకాక ఇనుప ఆయుధాలు, పనిముట్లు, కాల్చిన మట్టి బొమ్మలు, దంతపుదువ్వెన, ఒక దంతపు ముద్రిక, వేరు వేరు అవసరాలకు ఉపయోగించిన మృణ్మయ పాత్రలు లభించాయి.

మౌర్య - శాతవాహన బౌద్ధ శిల్పాలు, శాసనాలు, ఆనాటి గ్రంథాలయిన కథాసరిత్సాగరం, గాథాసప్తశతి,

లీలావతి వంటి గ్రంథాల ద్వారా నాటి సాంస్కృతిక, సాంఘిక, మతైక పరిస్థితులను గ్రహించవచ్చును. ఆ కాలంలో గృహయజమానిని గహపతి లేక గృహపతి అనే వారు. గ్రామ పెద్దకు గ్రామికుడని, అనేక గ్రామాలకు ఆధిపత్యం వహించే వారికి మహాగ్రామికుడని బిరుదు లుండేవి. చిన్న చిన్న పట్టణాలను కాపురమని పిల్చేవారు. వీటికి కోటలుండేవి కావు. వ్యాపారకేంద్రాలయిన పెద్ద పట్టణాలను పురాలని పిల్చేవారు. రాజకీయ రీత్యాను, వ్యాపార రీత్యాను ముఖ్య మయిన నగరాల చుట్టూ కోటలు నిర్మించేవారు. కోటల చుట్టూ అగడ్తలు త్రవ్వి త్రవ్వగా వచ్చిన మట్టి అగడ్త లోపలి వైపు పోసి మట్టి గోడలు నిర్మించిన తదుపరి దానిలోపల ఇటుకలతో మరొక గోడను నిర్మించేవారు. ఇటుక గోడలు 10 అడుగుల మందం కలిగి రాత్రి సమయాలలో భటులు పహారా తిరుగడానికి వీలుగా ఉండేవి. అగడ్తలు చాలా లోతుగా ఉండి నీటితో నింపబడి ఆ నీటిలో మొసళ్ళను పెంచేవారు.

ఆటపాటల్లో పండుగ సంరంభాలలో ఆడమగ అనే తారతమ్యం లేకుండా అందరూ పాల్గొనేవారు. నేటికంటే నాటియువతులకు ఆర్థిక, సాంఘిక, మతైక విషయాలలో ఆధిపత్యం ఉండేది. ఉన్నత కుటుంబీకులయిన స్త్రీలు అనేక దానధర్మాలు చేసేవారు. నాగార్జునకొండలోని విజయపురిని పాలించిన ఇక్ష్వాకు రాజవంశంలోని స్త్రీలకు పురుషులకంటె ఆధిక్యం ఉండేది. అక్కడి మహాస్తూప పునరుద్ధరణకు చేయూతనిచ్చినవారందరు స్త్రీలే. ఇక్ష్వాకు రాజవంశ స్త్రీలలో శాంతిశ్రీ మహాధార్మికురాలు. ఆమె సర్వసాధువత్సల, మహాదానపతిని, దీనానుగ్రహ మొదల యిన బిరుదులు ధరించింది.

మౌర్య, శాతవాహన ఇక్ష్వాకు రాజుల కాలాలనాటి శిల్పాల ద్వారాను, మట్టి బొమ్మల ద్వారాను అలనాటి స్త్రీలు పురుషులు అనేక రకాల ఆభరణాలను ధరించే వారని తెలుస్తుంది. వాటిలో చూడామణి, మకరిక, వివిధ రకాల కుండలాలు, హారాలు, కంఠెలు, ఫలకావలయాలు, మణిబంధాలు, మేఖలలు, రసనలు, మంజీరాలు, అంగుళీయకాలు ఉన్నాయి. స్త్రీ దేవతలు ముత్యాల యజ్ఞోపవీతాలు ధరించినట్లు చూపబడేవారు.

ప్రజలు నూలుతోను పట్టుతోను ఉన్నితోను నేయబడ్డ దుస్తులు ధరించేవారు. నడుమునుండి భుజాలమీదుగా వేసుకునే వస్త్రాన్ని ఉత్తరీయమని, బొడ్డునుండి కిందకు ధరించే వస్త్రాన్ని అంతరీయమని పిల్చేవారు. స్త్రీలు కంచుకాలుగాని ఉత్తరీయాలు గాని ధరించిన ఆధారాలు లేవు. కాబట్టి శరీర పైభాగాన్ని నగ్నంగానే ఉంచుకునేవారని తోస్తుంది. వివిధ కాలాల నాటి శిల్పాలలో స్త్రీలు రవికలు గాని ఉత్తరీయాలు గాని ధరించినట్లు చూపలేదు.

స్త్రీలు జుత్తును చాలా ఆకర్షణీయంగా ముడులు వేసుకునేవారు. వీటికి జటలని, ప్రవేణియని, కేశపాశమని, కచభరమని, కేశబంధమని, ధమ్మిల్లమని పేర్లున్నాయి. పురుషులుగూడా స్త్రీల వలెనే పొడుగైన జుత్తు పెంచి ముడులు వేసికునే వారు. చారిత్రక త్రవ్వకాలలో దంతంతో చేయబడ్డ దువ్వెనలు అనేకం లభించాయి. ఈ దువ్వెనలు పై భాగాన రెండు వైపులా స్త్రీలు కేశాలంకరణ చేస్తున్న దృశ్యాలు చెక్కబడ్డాయి. జుత్తుకు సువాసనల నూనెలు, శరీరాలంకరణకు సుగంధలేపనాలు వాడేవారు. మంచి గంధం, పునుగు, జవ్వాది మొదలయిన సుగంధ ద్రవ్యాలతో శరీరానికి పూతలు పూసుకునేవారు.

ప్రేమ సందేశాలను పంపేందుకు ఇళ్ళల్లో శారికలను మచ్చిక చేసికొన్న దృశ్యాలు అనేక శిల్పాలలో చూపబడ్డాయి. ఆనాటి ప్రజా జీవనంలో మధుపానం నిషేధం లేని నిత్యాభ్యాసం, హంసతూలికాతల్పాలతోను, వేణు, శంఖ, పటహ, తప్పెట, సితార వంటి సంగీత వాద్యాలతోను, జూదపుఫలకాలతోను, కుర్చీలు, కాలిపీటలు మొదలయిన గృహసామగ్రితోను ఆనాటి గృహసీమలు స్వర్గ సీమను మరిపించేవిగా ఉండేవి. కౌముదీ జాగరణ, ఉదక స్వేదన, సహకార భంజిక, కందుక కేళిక, మదనోత్సవాలతో నాగరిక యువతీయువకులు స్వప్నజగత్తులో విహరించేవారు.

తెలుగు శిల్పుల చరిత్ర, సంస్కృతి

- డా. ఈమని శివనాగిరెడ్డి, స్థపతి

ఆంధ్ర దేశ చరిత్రలో బృహత్ శిలాయుగం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొంది. ఎందుకంటే క్రీ.పూ. 800ల ప్రాంతంలో ముడి ఇనుప ఖనిజాన్ని కరిగించి, ఇనుప పనిముట్ల తయారీ ప్రారంభమై జీవన విధానంలో పెనుమార్పుకు దారితీసింది. చనిపోయిన వారిని భూమిలో పాతిపెట్టి, గుంటను పూడ్చి చుట్టూ పెద్ద పెద్ద గుండురాళ్ళను గుండ్రంగా నాటడం వల్ల ఈ యుగాన్ని బృహత్ శిలా యుగమనీ, అలాగే ఇనుము వాడకంలోకి రావడం వల్ల ఇనుపయుగమనీ పిలుస్తారు. మరణించిన వారికి సమాధులు కట్టే ఆచారమున్న ఆనాటి ప్రజలు, సమాధుల ముందు చనిపోయినవారి ఆకారాలను రాతిలో చెక్కి పాతిపెట్టారు. వరంగల్ జిల్లా కాటారం, ఖమ్మం జిల్లా గలభగూడెం వద్ద క్రీ.పూ. 5వ శతాబ్దికి చెందిన శిలువాకారపు శిల్పాలను ఇటీవల కనుక్కోవడం జరిగింది. అయితే, మహబూబ్ నగర్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని చిన్న మారూరు వద్ద ఒక సమాధిరాతిపై చనిపోయిన వ్యక్తిని పాతిపెట్టేముందు తాళ్ళతో కట్టినట్లున్న బొమ్మను చెక్కిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. ఇది క్రీ.పూ. 8-5 శతాబ్దాల నాటి బొమ్మ. ఇలా ప్రారంభమైన స్మారక శిల్పం, చారిత్రక తొలియుగంలో బౌద్ధ గాథా శిల్పాలను చెక్కడానికి దోహదం చేసింది.

శిల్పులు కేవలం రాళ్ళమీదేకాక, మట్టి కొయ్య, లోహం, సున్నం మొదలైన ధాతువులతో అపురూపమైన కళాఖండాల్ని సృష్టించి ఆంధ్ర దేశ చరిత్ర సంస్కృతులను అధ్యయనం చేయటానికి ఆధారాలనందించి ఎంతో సేవచేశారు. శిల్పులు శాసనాలను చెక్కిన శాసన శిల్పులు, బొమ్మలు చెక్కిన శిలా శిల్పులు, వివిధ లోహాలతో బొమ్మలు చేసిన లోహ శిల్పులు, కొయ్యతో రథాలు, మొదలైన వాటిని తీర్చి దిద్దిన దారుశిల్పులు సున్నంతో బొమ్మలు చేసిన సుధా శిల్పులుగా శిలా, తామ్ర శాసనాల్లో పేర్కొన బడ్డారు. అంతేకాదు, శిల్పులు సంఘాలుగా ఏర్పడి, వివిధ హోదాలు పొంది సమాజంలో గౌరవాన్ని దక్కించుకొన్నారు. రాజులు, రాణుల కోరిక ప్రకారం ఆలయాలను నిర్మించి, శిల్పాలను చెక్కి నాటి సంస్కృతికి అద్దం పట్టి చూపిన శిల్పులు కూడా తమకంటూ ఒక చరిత్రనూ, వారిదైన సంస్కృతినీ కలిగి వుండి, ఆంధ్ర దేశ చరిత్ర, సంస్కృతుల్లో ఒక భాగంగా మిగిలిపోయారు. ప్రతిభను కనబరిచి, ఎన్నో బిరుదులు కూడా పొందిన తెలుగు శిల్పులు తమ కులాన్ని, గోత్రాలనూ, వారు ఆరాధించిన దేవతలనూ చెల్లించిన పన్నులు, పన్నులు ఎక్కువనిపించినపుడు తిరగబడిన తీరు, పనులు కొరవడినపుడూ, ఇతరుల ఆహ్వానం మీద దూర ప్రాంతాలకు వలసలు పోయిన వైనాలు శాసనాల్లో ఉన్నాయి.

శాసన లేఖకులు :

సింధు నాగరికతలో దొరికన ముద్రికలపై గల లిపిని మినహాయిస్తే క్రీ.పూ. 3వ శతాబ్దంలో అశోకుడు వేయించిన రాతి శాసనాలే మనదేశపు తొలిశాసనాలు. మన రాష్ట్రంలో అమరావతి [1], ఎర్రగుడి[2], రాజుల మందగిరి[3] వద్ద అశోకుని శాసనాలున్న సంగతి తెలిసిందే. శాసనాలను చెక్కే వాళ్ళను శాసన లిపికారులనీ, రాజశాసనాలను చెక్కిన వారిని రాజ లిపికారులనీ, రాజలేఖకులనీ పిలిచేవాళ్ళు. క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన ఒక అమరావతీ బ్రాహ్మీశాసనంలో రాజలేఖకుడైన బాలకుని ప్రస్తావన ఉంది[4]. అలాగే గుంటుపల్లి గుహాలయాల వద్ద గల క్రీ.పూ. 1వ శతాబ్దికి చెందిన శాసనంలో చుల్లగోమకుడనే మరో శాసన లేఖకుని పేరుంది[5]. అటు తరువాత క్రీస్తు శకం 8-9 శతాబ్దాల దాకా,శాసన శిల్పుల పేర్లు శాసనాల్లో కనిపించక పోవటం గమనించాల్సిన విషయం.

విజయవాడ ఇంద్ర కీలాద్రి శాసనాన్ని క్రీ.శ. 9వ శతాబ్దంలో విజయాచార్యుడనే శాసనశిల్పి చెక్కాడు.[6]

క్రీ.శ. 1076 నాటి చేబ్రోలు శాసనాన్ని గుండోజు[7], క్రీ.శ. 1097 నాటి వొల్లాల శాసనాన్ని సూత్రధారి జువ్వపాచార్యుడు[8] అనే శిల్పులు మలిచారు. రాజశాసనాలను భద్రపరిచే వారిని అక్షపటలికులనీ, అక్షశాలినులని పిలిచేవారు. క్రీ.శ. 12వ శతాబ్దికి చెందిన కొర్ని, చిన్న బాదాం రాగిరేకు శాసనాన్ని వంశ పరంపర శాసన లేఖకులైన మహాక్షశాలి వల్ల మోజు, అతని కొడుకు మాంకన చెక్కారు[9]. నన్నయ రాసిన నందంపూడి శాసనాన్ని గుండా చార్యుడనే ఆస్థాన శిల్పి చెక్కాడు. [10]ముదిగొండ చాళుక్య రాజు కుసుమాయుధుని కుక్కునూరు రాగిరేకు శాసనాలను బేతాచారి అనే శాసనశిల్పి మలిచినట్లు క్రీ.శ. 13వ శతాబ్ది శాసనం తెలియజేస్తుంది[11]. అటు తరువాత బయల్పడిన నారాయణపురం, ముఖలింగం, అమరావతి, పాలకొల్లు, ద్రాక్షారామం, చాళుక్య భీమవరం, తిరుపతి , శ్రీకూర్మం మొదలైన చోట్లగల శాసనాలు, పై దేవాలయాల్లో పారంపర్య హక్కు గల శాసన శిల్పులుండేవారని తెలియజేస్తున్నాయి. వరుసగా నారాయణపురంలో ప్రోలాచారి, ముఖాలింగంలో లోకాచారి, అమరావతిలో నలపాచార్య, పాలకొల్లులో సరణోజు, రామాచారి, సర్ప వరంలో కూనాచారి, ద్రాక్షారామంలో డాకరేమి సూరాచారి, పెద్దనాచార్య, బేతనాచార్య,వీర రాజేంద్ర చోడాచార్య, చాళుక్య భీమవరంలో నాగోజు, శ్రీశైలాచారి, శ్రీకూర్మంలో శంకరుడనే శాసన శిల్పులు ఉద్యోగులుగా చలామణి అయినారు. చివరగా పేర్కొన్న శ్రీకూర్మంలోని వాంకలపూడి శంకరుఢనే శిల్పి చక్కటి కవిత్వాన్ని చెప్పి, పద్యాలు కూడా రాయగల లిపికారుడని అక్కడి శాసనం చెబుతుంది[12]. కేవలం శిలా శిల్పులేకాక, ఇతర ధాతువులపై బొమ్మలు చేయగల శిల్పులు కూడా శాసనాలు చెక్కిన ఆధారాలున్నాయి. క్రీ.శ. 1504 నాటి చాంగాడు రాగిరేకుల్ని ఆ గ్రామంలోని దారుశిల్పి మల్లనాచార్యుడు[13] క్రీ.శ. 1518నాటి కోకటం శాసనాన్ని అగసాల (బంగారు పనిచేసే) బైరోజు [14]క్రీ.శ. 1545నాటి వేల్పు చర్ల శాసనాన్ని వడ్ల కాణాచికాండుతిన్నోజు[15] మలిచినట్లు నాటి ఆయా శాసనాలు తెలియజేస్తున్నాయి.

శిలా శిల్పులు

రాతిపై బొమ్మను చెక్కేవాళ్ళను శిలా శిల్పులనీ కొండలు, బండలనుంచి రాతిని వేరుచేసే వాళ్ళను పాషా(సా)ణికులనే వాళ్ళు. అమరావతిలోని క్రీ.పూ. 2వశతాబ్దికి చెందిన ఒక శాసనంలో పాసానికుని ప్రస్తావన ఉంది.[16] ప్రాచీనాంధ్ర శాసనాల్లో శిలా శిల్పులలోని వివిధ వర్గాలను తెలిపే అనేక ఆధారాలున్నాయి. కొంతమంది పాసానికుల పనులను పర్యవేక్షించే శిల్పుల్ని ఆవేశను లంటారు. బౌద్ధస్థావరమైన జగ్గయ్యపేట శాసనంలో సిద్ధార్థ, నాగచంద్ర అనే ఆవేశనుల గురించి ఉంది.[17] స్ఫటికం, రత్నం, వజ్రం మొదలైన వాటిపై పని చేసేవారిని మణికారులంటారు.[18] అమరావతి, భట్టిప్రోలులో లభించిన స్ఫటిక బౌద్ధధాతుపేటికలను క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన మణికారులు చేశారు. రాళ్ళను కట్టడాలకు అనువుగా మలిచేవాళ్ళను శిలావద్దకులనే వాళ్ళు. బొమ్మలను చెక్కేవాళ్ళను శిలాకమ్మికులనీ, వీరి పర్యవేక్షకుల్ని శిలా కమ్మాంతికులనీ, అలాగే కట్టడాల మరమ్మతులు చేసేవారిని నవ కమ్మికులనీ, వీరి పర్యవేక్షకుల్ని మహానవకమ్మికులనీ, నవ కమ్మిక ప్రధానులనీ శాసనాలు పేర్కొంటున్నాయి. అమరావతి బౌద్ధ స్తూప, విహారాల మరమ్మతులను చేపట్టిన బౌద్ధ, రక్షిత అనే నవ కమ్మికుడు, ఆదిత్య[20] ధమ్మరక్షితులనే మహానవ కమ్మికులు, చంద[22] అనే ప్రధాన నవకమ్మికుల వివరాలను క్రీ.శ. 1-2 శతాబ్దాల నాటి అమరావతి శాసనాలు వెల్లడిస్తున్నాయి. నాగార్జున కొండలోని బౌద్ధ కట్టడాల నిర్మాణ, జీర్ణోద్ధరణ పనులు ఆనంద[23], చంద ముఖి,[24] ధమ్మనంది[25], విధికులనే[26] నవ కమ్మిక, శిలావద్దకుల పర్యవేక్షణలో జరిగాయి.

హైదరాబాద్ సమీపంలోని కీసరగుట్ట వద్ద క్రీ.శ. 4వ శతాబ్దికి చెందిన 'తొలచువాన్రు' అనే శాసనం రాతి శిల్పులను సూచిస్తుంది.[27] ప్రకాశం జిల్లా భైరవకొండ గుహాలయాలను తొలచిన శిల్పుల్లో వేలుగుంట ఆచార్లు కుఱవది ఆచార్లుగా అక్కడున్న క్రీ.శ 7 వశతాబ్దపు శాసనాలు తెలియ జేస్తున్నాయి. [28]

రాతిపై పనిచేసే శిల్పులను కాసెవారనీ, కాశాచార్లనీ శాసనాలుపేర్కొంటున్నాయి. క్రీ.శ. 9వ శతాబ్దపు సంగమేశ్వరం శాసనంలో యాగోజు కాశాచారి,[29] క్రీ.శ. 12వ శతాబ్దపు వలివేరు శాసనంలో కాసె ... మోజుల[30] ప్రస్తావన వుంది. వాస్తు, శిల్ప శాస్త్రాల్లో ప్రావీణ్యముండి, చేతిలో సూత్రం (దారం) ధరించే ఆలయ నిర్మాణం పర్యవేక్షకుల్ని సూత్రధారులంటారు. క్రీ.వ. 1097 -1202 సం॥ల మధ్యకాలపు వొల్లాలి, మాచర్ల, పానగల్లు, ముక్కామల, జలాల్‌పురం శాసనాల్లో వరుసగా జువ్వపా చార్య, నాగాచార్య, తిప్పోజు, బమ్మోజు, బొమ్మలయ్య, కాసెమల్లోజు లనే సూత్రధారుల గురించి చెప్పబడింది. ఈ సూత్రధారులు తమ అదుపు ఆజ్ఞలకు లోబడి పనిచేసే తక్షకి, వర్ధకుల పనులను పర్యవేక్షిస్తూ, స్థపతుల ఆదేశాలను అమలు చేస్తుండే వాళ్ళు.

శిల్పుల్లో స్త్రీలు :

మిగతా వృత్తి పనుల్లో లాగే స్త్రీలు కూడా ఆలయ నిర్మాణం, శిలా శిల్పాలు చెక్కటంలో మగవారికి సహకరించినట్లు తెలిపే శాసనాధారాలు లభించాయి. కృష్ణా జిల్లా గణపవరంలోని క్రీ.శ. 12 వశతాబ్దపు శాసనంలో గణపేశ్వర మహాదేవుని ఆలయ నిర్మాణంలో కాశాచారి మాగుటూరి మల్లి కార్జునుడనే శిల్పికి అతని కొడుకు అక్కా బత్తునితోపాటు భార్య వీరమ్మ కూడా సహకరించినట్లు చెప్పబడింది.[31]

స్థపతి

స్థపతి అనే సంస్కృత పదానికి స్థాపనార్హత కల్గిన శిల్పి అని అర్థం. గుంటూరు జిల్లా మల్కాపురం లోని క్రీ.శ. 1261వ సం॥పు శాసనంలో బంగారం, రాగి, రాయి, దారు, ఇనుము ధాతువులతో పాటు మట్టితో కుండలు చేసే కుమ్మరులను కూడా శిల్పులుగానూ, స్థపతులు గానూ పేర్కొనటం జరిగింది.[32]

తెలంగాణా పుర శిల్పులు :

శిల్పులు, మత, భాషాతీతంగా కూడా వ్యవహరించి నట్లు తెలుస్తుంది. క్రీ.శ. 1418వ సం॥పు తెల్లాపూర్ శాసనంలో స్థానిక శిల్పులైన మైలోజు, అయిలోజులు, బహమనీ సుల్తాను ఫిరోజ్ షా భార్యకు, తాము బంగారు పూలు, గాజు పూసలతో చేసిన కంఠాభరణాన్ని బహూకరించినట్లుంది.[33] బి హెచ్ఇఎల్ సమీపంలోని తెల్లాపూర్‌లో దొరికిన ఈ శాసనంలో తెలంగాణా పురమనే ప్రస్తావన ఉంది. ఈ శాసనంలోని తెలంగాణా పురమే నేటి తెల్లాపూర్. తెలంగాణా అన్న పదాన్ని అందించినతొలిశాసనం తెల్లాపూర్ శాసనమే.

కమ్మఱ్లు

ఇనుముతో ఉలులు, శానాలు, గూటాలు తయారు చేసి శిల్పులకు సహకరించేవారిని కమ్మఱ్లంటారు. క్రీ.శ. 1518వ సం॥ శాసనంలోఅక్కడి వీరేశ్వరాలయాన్ని నిర్మించిన కాసెవారిని ప్రస్తావిస్తూ వారికి వడ్ల బసువాబత్తుడు, కాకాని అమ్మెనలు సహకరించినట్లూ, రాళ్ళను వేరుచేయటానికి ఇనుపగూటాలు, శిల్పాలను చెక్కటానికి ఉలులను తయారుచేసి మొనలుపెట్టి ఇచ్చిన కంమఱి పుట్టా బత్తునికి ప్రతిఫలంగా కొంత భూమిని దానం చేసినట్లు చెప్పబడింది.[34] శిల్పులతో పాటు వారికి ఉలులను చేసిచ్చిన కమ్మర్లను పేర్కొనటం ఈ శాసనం ప్రత్యేకత.

ఇతర కుల శిల్పులు :

కేవలం విశ్వకర్మీయులే కాక ఇతర కులాలు వారు కూడా ఆలయ నిర్మాణాన్ని చేపట్టిన ఆధారాలు దొరికాయి. క్రీ.శ. 1529నాటి వరికుంట శాసనంలో ఉప్పర తిప్పన బోయ అనే శిల్పి స్థానిక కేశవాలయ నిర్మాణానికి 120 రూకలను కట్టు గుత్తగా పొందినట్లు చెప్పబడింది.[35] ప్రకాశం జిల్లా పురుషోత్తమ పట్నం, చీమకుర్తి, గుంటూరు జిల్లా తురకపాలెంలలో ముస్లింలు ఆలయ నిర్మాణ పనుల్లో చురుగ్గా పాల్గొంటున్న సంగతిని ఇక్కడ పేర్కొనాలి. శిల్పులను శిప్పియార్‌లనీ, తిరుప్పణి పిళ్ళైలనీ, పంచాలత్తార్‌లనీ తిరుమల - తిరుపతిలోని క్రీ.శ. 15-16 శతాబ్దాల శాసనాలు పేర్కొంటున్నాయి.[36]

లోహ శిల్పులు

వివిధలోహాలతో కళాఖండాలను తయారుచేసే వాళ్ళను, లోహకార శిల్పులంటారు. కరీంనగర్ జిల్లా

ధూళికట్ట వద్ద బయల్పడిన క్రీ.పూ. 2వ శతాబ్దపు హారీతి కంచు బొమ్మ. అమరావతి, బుద్ధాం, నాగార్జున కొండ, నేలకొండపల్లి వద్ద బయల్పడిన బుద్ధుని కంచుబొమ్మలను కాసకారులనే లోహ శిల్పులు తయారుచేశారు. ప్రాకృత శాసనాల్లోని కాసకార శబ్దమే తెలుగు, సంస్కృత శాసనాల్లో 'కాంస్యకార' గామారింది. కంచర, కంసాలిగా కూడా పిలువబడింది. మధ్యాంధ్ర యుగ శాసనాలు స్వర్ణకారుల్ని అగసాలి, (అక్షశాలి) అక్కసాలులని పేర్కొంటున్నాయి. క్రీ.శ. 11వ శతాబ్ది పులిమామిడి శాసనంలో అక్కశాల పోటోజు,[37] చాళుక్య భీమవరం శాసనంలో అకసాల పోతోజు,[38] క్రీ.శ. 1300 నాటి నడిగూడెం శాసనంలో అగసాలదేవోజు [39]క్రీ.శ. 1518 నాటి కోకటం శాసనంలో అగసాలమల్లోజుల గురించి చెప్పబడింది.

రథకార శిల్పులు:

ఆలయ ఉత్సవాల సందర్భంగా ఊరేగించే రథాలను చేయటంలో నిపుణులైన వారిని రథకార శిల్పులంటారు. క్రీ.శ. 1763 సం॥ శ్రీకూర్మం శాసనంలో రామతీర్థం గ్రామానికి చెందిన రథకారుడైన శంకరుడు శిలాశిల్పాలు, శాసనాలను చెక్కటమేకాక, రథాలు తయారు చేయటంలో కూడా సిద్ధహస్తుడని చెప్పబడింది[41] అంతేకాదు. శాసన పాఠాన్ని చక్కని తెలుగులో రాయగల ప్రజ్ఞాశాలిగా కూడా ఆ శాసనం పేర్కొంటుంది.. రథాలను మరమమ్మత్తు చేసేవారిని తిరుప్పకాశి పిళ్లైలంటారని తిరుపతి శాసనాల్లో ఉంది.

శిల్ప సంఘాలు :

ఆంధ్ర దేశంలో ఆలయ, గోపుర నిర్మాణాలను శిల్పులు వ్యక్తిగతంగానే కాకుండ, సంఘాలుగా ఏర్పడి చేపట్టినట్లు తెలిపే శాసనాధారాలు దొరికాయి. వీటిలో సరస్వతీ గణం, పంచానం వారు, సంఘాలు ముఖ్యమైనవి. తూర్పుగోదావరి జిల్లా చాళుక్య భీమవరంలోని క్రీ.శ. 1097 నాటి శాసనంలో విద్దాచారి, మల్లాచారి అనే శిల్ప సోదరులు, సరస్వతీ గణమనే శిల్పుల సంఘ పాద పంకజ భ్రమరులనీ, సరస్వతీ గణ మనోరంజకులుగానూ పేర్కొనటమైంది.[42]కర్నాటక రాష్ట్రంలోని పాసవూరు[43] శాసనంలో క్రీ.శ. 11 శతాబ్దపు శిల్పి పద్మోజు తాను సరస్వతీగణ పాదపంకజ భ్రమరున్నని చెప్పుకోవటంచేత సరస్వతీగణమనే శిల్పుల సంస్థ తన కార్య కలాపాలను కర్నాటక నుంచి ఆంధ్ర దేశానికి విస్తరించిందని చెప్పవీలవుతుంది.

శాసనాలు పేర్కొన్న మరో శిల్పుల సంఘం పేరు "పంచాణం వారు". ఇనుము, ఇత్తడి, బంగారం, కొయ్య, రాయి అనే ఐదు ధాతువులతో కళాత్మక వస్తువులను చేసే శిల్పుల్ని పంచాణం వారు అంటారు.[44] ఈ సంఘం మధ్యాంధ్ర యుగంలో ఎన్నో ఆలయాల నిర్మాణం చేపట్టింది. భీమవరం, పంచదార్ల, సింహాచలం, శ్రీకూర్మం, అమరావతి, నాగులపాడు, దొంగలసాని, ఉదయగిరి, పాలకొల్లు శాసనాలు పంచాణం వారిని పేర్కొన్నాయి. వీరిని పంచాదులు, పంచాది, పంచాణులు, పంచకర్ములు అని పిలిచారు. కర్నాటక శాసనాలు వీరిని పాంచాలులనీ, వీరి పాంచాలులనీ,[45] తమిళ నాడులో పంచాలత్తార్, అంజివణ్ణత్తార్, పంచకమ్మలార్[46] లనీ పేర్కొనటమైంది. అమరావతిలోని క్రీ.శ. 1494 నాటి శాసనంలో పంచానన వారికి పెందోట కార్యస్థావరమనీ, వీరిని పెందోట పురవరాధీశ్వ రులనీ, ప్రస్తావించ బడింది.[47]

పంచాణం వారి ప్రశస్తి శాసనాలు :

రాజ్యాలేలిన రాజులకే కాక వివిధ కళల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించిన పంచాణం వారి గుణగణాలనువెల్లడించే ప్రశస్తి శాసనాలు కూడా ఉన్నాయి. అమరావతి[48] బెడదకోట[49], నందేలంపేట[50] ప్రశస్తి శాసనాలను పరిశీలిస్తే వీరుత్రిభువనాలను నిర్మించిన వారనీ, అనన్త శబ్దశాస్త్ర, పురాణాలను బాగా చదివినవారనీ, సప్తసాగర నిర్మాత లనీ, అష్టదిక్పాల , అష్టదిగ్గజ ప్రతిమలకు రూపశిల్పులనీ, గంభీర ధైర్య ధారణులనీ, జగద్ధితకారులనీ ప్రస్తుతించ బడినారు.

శిల్పుల కుల గోత్రాలు :

శాసన, సాహిత్యాల ప్రకారం, శిల్పుల మూలపురుషుడు విరాట్ విశ్వకర్మ. శాసనాల్లో శిల్పులను విశ్వ కర్మ

వల్లభులనీ, విశ్వకర్మ ఋషులనీ, విశ్వకర్మ కులభూషణులనీ, విశ్వకర్మ ఋషివంశోద్భవులనీ, పేర్కొనటం జరిగింది. క్రీ.శ. 1118 నాటి చేబ్రోలు [51], క్రీ.శ. 1141 నాటి నాదెండ్ల[52], క్రీ.శ. 1417-18 నాటి తెల్లాపూర్ (తెలంగాణా పురం) శాసనాలు[53] శిల్పులను విశ్వకర్మ కులాన్వయులుగా ప్రస్తావిస్తున్నాయి.

శిల్పుల గోత్రాలను పేర్కొన్న శాసనాలు క్రీ.శ17వ శతాబ్దం వరకూ వెలికి రాలేదు. క్రీ.శ. 1606 నాటి తిరుపతి శాసనంలో ఆలయ ప్రసాదాలను పొందే వారిలో సుపర్ణ గోత్రానికి చెందిన ఒక స్వర్ణకార శిల్పి ప్రస్తావన ఉంది.[54] క్రీ.శ. 1748 నాటి నందేలం పేట శాసనంలో పంచాణం వారు విశ్వకర్మ ఐదు ముఖాలనుండి ఉద్భవించారనీ, సానగ, సనాతన, అహభూన, ప్రత్న, సుపర్ణ గోత్రాలు ఋషుల పేర్ల మీదుగా లభించాయనీ, అవివరుసగా ఇనుము, కొయ్య, రాగి, రాయి, బంగారం పై పనిచేసే శిల్పులకు వర్తిస్తాయని పేర్కొనబడింది.

శిల్పుల సొంత దేవుళ్ళు, దేవతలు :

ఎంతోమంది దేవుళ్ళను చిత్రించి, శిల్పాలుగా తీర్చిదిద్దిన శిల్పులకు మాత్రం ప్రత్యేకంగా దేవుళ్ళున్నట్లు శాసనాలు, సాహిత్యాలను పరిశీలిస్తే తెలుస్తుంది. శిల్పులు లేక పంచాణం వారికి కంమతేశ్వరుడు, కాళికాదేవి లేక కమ్మటేశ్వరీ దేవి ఆరాధ్య దేవతలు. క్రీ.శ. 1494 నాటి అమరావతి శాసనం[56] వీరిని కమ్మటేశ్వరారాధకులుగానూ, క్రీ.శ. 1748 నాటి నందేలం పేట శాసనం వీరిని శ్రీమత్కాలికాదేవి, కమటేశ్వరీ దేవి పాదపద్మారాధకులుగా పేర్కొంటున్నాయి.[57] క్రీ.శ. 11-13 శతాబ్దాల కర్నాటక శాసనాల్లో నాణేలను పోతపోసే వారిని కమ్మటులనీ, వీరి అధి దేవత కమ్మటేశ్వరుడనీ ఉంది. ఆంధ్ర దేశంలో కమ్మటేశ్వరునికి కూడా ఆలయముంది. మహమ్మదు ఖులీ ఖుతుబ్‌షా ఆజ్ఞలపై జుత్తికలో పెద్దరాజు అనే స్థానికుడు ఆలయాన్ని నిర్మించి కమ్మటేశ్వరుణ్ణి ప్రతిష్ఠించినట్లు క్రీ.శ. 1583 నాటి జుత్తిక శాసనంలో చెప్పబడింది.[58]

ఉన్నత పదవుల నలంకరించిన శిల్పులు :

అన్ని వర్గాల ప్రజల అవసరాలను తీర్చిన శిల్పుల్ని సమాజం ఎంతగానో గౌరవించింది. అర్హతలను బట్టి అత్యున్నత పదవులను కూడా కట్టబెట్టింది. కొండపడమటి రాజైన ఎర్రమంద కొలువులోనున్న విశ్వకర్మ కుల భూషణుడైన సూరడు, బెజవాడ యుద్ధంలో వీరోచితంగా పోరాడి, మహాప్రధాని పదవిని పొందినట్లు క్రీ.శ. 1118 నాటి చేబ్రోలు శాసనం చెబుతుంది.[59] అలాగే కులోత్తుంగ గొంకరాజు కొలువులో ప్రసిద్ధ పౌరుష నిరతుడైన, విశ్వకర్మ కులానికి చెందిన నూకాండి దండ నాయక పదవిని పొందినట్లు క్రీ.శ. 1141 నాటి నాదిండ్ల శాసనంలో ఉంది.[60]

సమాజంలో శిల్పుల హోదా :

ఆలయ నిర్మాణం, శిల్పాల తయారీ, యాన, శయన, వ్యవసాయ పనిముట్ల తయారీ చేపట్టిన శిల్పులు సమాజంలో మంచి హోదానే పొందారు. ఆలయాల్లో ప్రసాదాల పంపిణీలో వారికి ప్రత్యేక స్థానముండేది. అలాగే రథోత్సవాల సమయంలో ఉచితరీతిన సత్కారాల నందుకొన్నారు. ఉదయగిరిలోని రఘునాయకుల రథోత్సవ సమయంలో ఉలులు చేతబూనిన శిల్పులు రథానికి ముందుగా నడిచే హోదాని సంపాదించినట్లు క్రీ.శ. 16వ శతాబ్దపు ఉదయగిరి శాసనంలోఉంది.[61] దాదాపు అదే కాలపు మరోశాసనంలో ఆసక్తికరమైన సమాచారముంది. కడప జిల్లా సిద్ధవటం శాసనంలో[62] రథోత్సవ సందర్భంగా శిల్పులు రథంపై ఎక్కి ఊరేగే పాత సంప్రదాయాన్ని బ్రాహ్మణులు వ్యతిరేకించినట్లూ, శిల్పుల విన్నపం మేరకుప్రభువైన మట్లి అనంత భూపాలుడు, వారికి రథంపై ఎక్కి ఊరేగే అర్హత ఉందని తీర్పు చెప్పి, వారి గౌరవాన్ని ఇనుమడింప చేసినట్లు పేర్కొనబడింది.

శిల్పుల లాంఛనం:

పంచాణం వారు ప్రత్యేక పతాక లాంఛనం కలిగి ఉన్నట్లు క్రీ.శ. 1748నాటి నందేలం పేట శాసనంలో ఉంది.[63] ఇందులో వీరు హనుమధ్వజలాంఛనులని కీర్తించబడినారు.

దాదాపు ఇదే కాలంలో రచించబడిన 'యోగసక్తా పరిణయం' లో శిల్పులకు ఈ హనుమద్ధ్వజం ఏ విధంగా లభించిందో వివరించబడింది.[64] అంతేకాదు శిల్పులు గ్రామ పరిపాలనలో కూడ భాగస్వాములని తెలిపే శాసనాధారాలుకూడా లేకపోలేదు. క్రీ.శ. 14వ శతాబ్దపు నాగులపాడు,[65] క్రీ.శ. 16వ శతాబ్దపు ఆదోని శాసనాల్లో[66] గ్రామ పరిపాలన చేపట్టిన అష్టాదశ సమయాల్లో పంచాణం వారు కూడా సభ్యులని పేర్కొనబడింది.

బిరుద శిల్పులు :

శిల్పులు తమతమ నైపుణ్యాన్ని బట్టికొన్ని బిరుదులను కూడా పొందారు. క్రీ.వ. 7వ శతాబ్ది మందుగల శాసనంలో స్థానిక జలపేశ్వరాలయాన్ని నిర్మించిన శిల్పికి 'కల్గారా భరణాచార్య' , పంచరథ ప్రియ' అనే బిరుదులున్నట్లు పేర్కొనబడింది.[67] కల్‌గార, కల్‌కార అనే పదాలకు రాతిపై చెక్కే శిల్పి అని అర్థం. రాతి పనిచేసేవారికి ఆభరణం లాంటి వాడని పై పదాన్ని వివరించుకోవచ్చు. క్రీ.శ. 1118 నాటి చేబ్రోలు శాసనంలో[68] సూరనికి 'విశ్వకర్మ కులభూషణుడని' వైరి నరేంద్ర భీషణుడ'నీ, క్రీ.శ. 1141 నాటి నాదిండ్ల శాసనంలో నూకాండిని కర్మరాభరణుడ'నీ క్రీ.శ. 1763 నాటి శ్రీకూర్మంశాసనంలో రథకార శంకరుని 'సర్వోత్తమ శిల్పి' అని[70] బిరుదులున్నట్లు పేర్కొనబడింది. చాళుక్య భీమవరంలోని క్రీ.శ. 1097 నాటి శాసనంలో విద్దాచారికి బిరుద రూవారి[71] అనే బిరుదుంది. కన్నడ శాసనాల్లో చక్కగా శిల్పాలు చెక్కే శిల్పులకు బిరుదుప్రదానం జరిగేదని, శిల్పులని రూవారులని పిలిచేవారనీ, బిరుదుపొందిన శిల్పులను బిరుదు రూవారులని పేర్కొనేవారని ఉంది.

శిల్పుల ప్రతిభ :

శిల్పులు ధాతులక్షణం, వస్తు గుణం, గణితం, చిత్రలేఖనం, చరిత్ర, పురాణాలు, భౌగోళిక విషయాలతో పాటు సాంస్కృతిక విషయాలైన వేష, భూషణాలు, నాట్యం , వాద్యపరికరాలు మొదలైన అన్ని విషయాల్లోనూ పరిజ్ఞానం కలిగి ఉండేవారు. క్రీ.శ. 1111 నాటి మాచర్ల శాసనంలో[72] శిల్పికాచార్య తిప్పోజు కుటుంబీకులంతా శిల్పులేనని, శివలింగాలు ప్రతిమల తయారీలోనూ సుందర మందిర నిర్మాణాల్లోనూ రాళ్ళు, ప్రతిమలు చెక్కటానికి అవసరమైన వివిధ పనిముట్ల తయారీలోనే కాక, వాటిని ఏయే పనులకుఎపుడు వాడాలో కూడా తెలిసిన నిపుణులని చెప్పబడింది. అతని కుటుంబ సభ్యులైన నాగాచారి, బాణాచారి, పోతనలు నాలుగు రకాలైన ప్రాసాదాల నిర్మాణంలో నిపుణులనీ, వాస్తు శిల్పవిషయాల్లో ఎప్పటికపుడు కొత్తకొత్త ప్రయోగాలతో సృజనాత్మ కతను మేళవించటంలో సాటిలేని శిల్పులని కూడా మాచర్ల శాసనం తెలియ జేస్తుంది. చివరగా ఏయే ప్రదేశాల్లోని భూములు నిర్మాణాలకు అనువైనవో, కావో తెలిసిన వాస్తు క్షేత్ర విదులని ఆ శిల్పుల గురించి పేర్కొంటుంది.

దానాలు పొందిన శిల్పులు :

క్రీ.శ. 6వ శతాబ్దికి చెందిన పృథ్వీమూలుని గోదావరి తామ్రశాసనంలో, గుణపాశపురంలో ఒక మహావిహారాన్ని నిర్మించిన నవకమ్మాధిర్థాయునికి, హరివర్మ కట్టుచెరువు అనే గ్రామాన్ని దానంచేసి నట్లుంది.[73] ఇంకా గుంటూరు, కొప్పరం, మల్కాపురం, జలాల్‌పురం, వలివేరు, నాదిండ్ల శాసనాల్లో ఆలయ నిర్మాణం, జీర్ణోద్ధరణ పనులు చేపట్టిన శిల్పులకు లభించిన భూదాన వివరాలున్నాయి.

శిల్పులకూ తప్పని 'పన్ను' పోటు :

సకల కళావేత్తలుగా కీర్తించబడిన శిల్పుల నుంచి కూడా ప్రభుత్వాలు ముక్కుపిండి వృత్తి పన్నును వసూలు చేసినట్లు మధ్యాంధ్రయుగ శాసనాలు వెల్లడి స్తున్నాయి. శిల్పులు చేపట్టిన వృత్తిపై ప్రభుత్వం 'పంచాలి' అనే పన్నును వసూలు చేసింది. ఒక్కోసారి ఈ పన్నుపోటు అధికమై, ప్రతిఘటించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇందుకు అనంతపురం జిల్లా కనగానపల్లెలోని క్రీ.శ. 1533 నాటి శాసనంలోని వివరాలను ఉదహరించవచ్చు[74]. 32 గ్రామాలకు చెందిన పంచాణం

(శిల్పులు) వారు, పన్నులు ఎక్కువై నందువల్ల ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టి, చాలా దూరంలోనున్న ఇప్పటి చిత్తూరు జిల్లా పాకాల, కుంద్రుపి సీమలకు వలస వెళతారు. పంచాణం వారు గ్రామాల్లో లేనందువల్ల, గృహ, వ్యవసాయ, ఆలయ సంబంధ పనులకు కావలసిన ఉపకరణాలు చేసేవారు లేక అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రజల మొరవిన్న ఆ 32 గ్రామాల రెడ్లు, కరణాలు, మళ్ళీ వలసవెళ్ళిన పంచాణంవారి దగ్గర కెళ్ళి, పెంచిన పన్నులు తగ్గించినట్లు తెలిపి, వారిని బతిమిలాడి వారి స్వగ్రామాలకు తిరిగొచ్చేట్లు చేశారని ఆ శాసనంలో ఉంది.

వృత్తిరీత్యా శిల్పుల వలసలు :

క్రీ.శ. 6వ శతాబ్దంలోనే ఆంధ్ర శిల్పులు కర్నాటకకు, క్రీ.శ. 10 -11 శతాబ్దాలలో తమిళ, కన్నడ శిల్పులు ఆంధ్ర ప్రాంతానికీ, తరువాత ఆంధ్రదేశంలోనే ఒక చోటునుంచి మరో చోటికి పనులను బట్టి, వలసలు వెళ్ళిన శాసనాధారాలు దొరికాయి. క్రీ.శ. 6 శతాబ్దంలోనల్లగొండ జిల్లా ఏలేశ్వర శిల్పులైన సాధుమంచి , రేవమంచి, సింగమంచి, నందిమంచి, శంభుమంచి స్థానిక శివాలయ నిర్మాణం జరిగిన తరువాత మొదటి పులకేశి ఆధ్వర్యంలో జరిగిన బాదామి కోట నిర్మాణంలో కూడా పాలు పంచుకోవడం విశేషం.[75] అలాగే కర్నాటకలోని పట్టడకల్ లోని ఒక ఆలయం లోని క్రీ.శ. 6వ శతాబ్దపు శాసనంలో[76] ఆంధ్రదేశంలోని వేంగినాడుకు చెందిన వెలనాటి గుండయ అనే శిల్పి పేరుండటం మరింత ఆసక్తికరంగా ఉంది. పనితనంగల శిల్పులను రాజులు తమ ఏలుబడిలోని ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి రప్పించిన ఆధారాలు కూడా ఉన్నాయి. మహారాష్ట్రలోని బోకర్థన్ కార్యస్థావరంగా ఉన్న శ్రీ ఉత్పత్తి పిడుగు అనే శిల్పుల సంస్థ, అలాగే కర్నాటక రాష్ట్రంలోని పొసవూరుకు చెందిన 'సరస్వతీగణ'మనే శిల్పుల సంస్థలు, ఇంకా తమిళనాడు శిల్పులైన వీర రాజేంద్ర చోళాచారి (ద్రాక్షారమంలో పనిచేశారు) ఆంధ్రదేశానికి వలస వచ్చి తమ కప్పగించిన పనులను చక్కదిద్దిన వివరాలు పరిశోధనకు ఉపకరిస్తాయి.

రిఫరెన్సులు:

1. ఐ.కె. శర్మ, స్టడీస్ ఇన్ఎర్లీబుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ అండ్ బ్రాహ్మీ ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్ర దేశ, నాగపూర్, 1988 పే.8
2. " పే. 3
3. ॥ పే. 4
4. సి. శివరామమూర్తి, అమరావతీ స్కల్ప్చర్ ఇన్ మద్రాస్ గవర్నమెంట్ మ్యూజియం, మద్రాస్, 1942, పే. 277
5. ఆర్. సుబ్రహ్మణ్యం, ది గుంటుపల్లి బ్రాహ్మీ ఇన్స్క్రిప్షన్ ఆఫ్ ఖారవేల హైదరాబాదు, 1968, పే.2.
6. సౌత్ ఇండియన్ ఇన్స్క్రిప్షన్స్ (ఎస్.ఐ.ఐ.) వా. 10, శాసనం 33, పే. 15.
7. ॥ వా. 6. శా.109.
8. పి.వి. పరబ్రహ్మశాస్త్రి, ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్, నల్లగొండ డిస్ట్రిక్ట్, హైదరాబాద్- 1993, వా.2, పే. 35 - 42
9. ఎం. సోమశేఖర శర్మ, చిన్న బాదాము ప్లేట్స్ ఆఫ్ అనన్తవర్మచోడగంగ, ఎపిగ్రాఫియా ఆంధ్రికా, (ఎ-ఆ) వా.2, హైద్రాబాద్ 1974, పే. 72
10. కీ.శే. చీమకుర్తి శేషగిరిరావుగారిచ్చిన సమాచారము.
11. బి.హెచ్. లక్ష్మీనారాయణ, 'కుక్కునూర్ ప్లేట్స్ ఆఫ్ కుసుమాదిత్య' ఎ.ఆ.,వా. 2, పేజీలు. 40-49
12. ఎస్.ఐ.ఐ. వా. 5. శాసనం. 1203.
13. కీ.శే. డా. ఎన్. ముకుందరావుగారిచ్చిన సమాచారం
14. ఎన్. వెంకటరమణయ్య, ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఎ.పి : కడప డిస్ట్రిక్టు, వా. 2. శా. 78, పే.96.
15. ॥ శా. 175, పే. 214.

16. సి. శివరామమూర్తి, 1942, శా. 119, పే. 302
17. లూడర్స్‌లిస్ట్ (లూలి) శా. 1202, 1206
18. లూలి, శా. 1005
19. సి. శివరామమూర్తి,1942 శా. 33, పే278
20. ॥ శా.33, పే. 278
21. ॥
22. ॥ శా.11
23. ఎపిగ్రాఫియా ఇండికా (ఎ.ఇ.) వా.20, పే. 17
24. ॥
25. ॥
26. ॥ పే.22
27. వి.వి. కృష్ణశాస్త్రి, 'శైవైట్ వెస్టిజెస్ ఎట్ కీసరగుట్ట, కె. తిమ్మారెడ్డి (సం), శైవిజమ్ ఇన్ ఆంధ్రదేశ, హైదరాబాద్, 1994, పే. 45
28. ఎస్.ఐ.ఐ. వా. 10, శా. 47, 54, పేజీలు 18-19
29. యాన్యువల్ రిపోర్ట్ ఆన్ఎపిగ్రఫీ ఇన్ ఏపీ, 1966 - 67, హైద్రాబాద్, పే. 24
30. ఎస్.ఐ.ఐ. వా. 10, శా. 61.
31. ॥ వా 9, శా. 949
32. ॥ వా 10, శా. 395
33. ఈమని శివనాగిరెడ్డి, తెలంగాణా పదప్రయోగం: తెల్లాపూర్ శాసనం, 'ఆరాధన, వా. 41, సం. 6, హైద్రాబాద్ 1996, (జూన్), పేజీలు 16-17.
34. ఎస్.ఐ.ఐ. వా. 4, శా. 602, పే 226
35. ఐ.ఎ.పీ. కడపడిస్ట్రిక్టు, వా.2. శా. 107
36. టి.టి.డి. ఇన్స్క్రిప్షన్స్ వా. 4, శా. 67, 396
37. రాష్ట్ర పురావస్తు శాఖ, శాసనం విభాగంలోనున్న శాసనం
38. ఎస్.ఐ.ఐ. వా.5, శా. 80
39. ॥ వా10, శా. 489
40. ఐ.ఏ.పి. కడప డిస్ట్రిక్టు; వా.2. శా. 267
41. ఎస్.ఐ.ఐ. వా. 5. శా. 166
42. ఈమని శివనాగిరెడ్డి, గిల్డ్స్ ఆఫ్ స్కల్ప్టర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ ఇన్ ఆంధ్ర' జెఏ హెచ్ ఆర్ఎస్, వా. 39, 1995, పే. 177 -182.
43. ఎపిగ్రాఫియా కర్నాటిక వా. 7, శా. 1080
44. ఎన్. ముకుందరావు, 'పంచానం వారు -పంచాలి' ఇతిహాస్ వా. 28, నం. 2 హైదరాబాద్, 1993, పే. 35 -42
45. ఎపిగ్రాఫియా కర్నాటికా వా. 9, బి.యన్. 12.
46. ఇహెచ్ థర్స్టన్ , కాస్ట్స్ అండ్ ట్రైబ్స్ ఆఫ్ సౌతిండియా వా. 3, పే 216
47. ఎస్.ఐ.ఐ. వా. 6, శా. 219
48. ॥
49. ఈమని శివనాగిరెడ్డి, 'పంచాణం వారి బెడదకోట శాసనం' మూసీ, వా. 10. పే. 1999
50. ఐ.ఎ.పీ కడప డిస్ట్రిక్టు , వా. 3, శా. 161
51. ఎస్ఐఐ వా. 6 శా117, పే.55 -56
52. ॥ శా. 673 , పే.206
53. ఈమని శివనాగిరెడ్డి, 1996, పే. 16
54. సాధు సుబ్రమణ్యశాస్త్రి, (సం), టి.టి.డి. ఎపిగ్రఫికల్ సీరీస్ రిపోర్ట్ ఆన్ ది ఇన్స్క్రిప్షన్ ఆఫ్ ది దేవస్థానమ్, మద్రాస్ 1930, పే. 316
55. ఐఎపీ కడప డిస్ట్రిక్టు వా. 3. శా. 161
56. ఎస్.ఐ.ఐ. వా. 6, శా. 219
57. ఐ.ఎ.సీ కడప డిస్ట్రిక్టు వా.3 శా. 161
58. ఐ.ఎ.పీ. వా. 10, శా. 749
59. ॥ వా. 6 శా. 117.
60. శా. 673.
61. ఎస్.డి.ఐ. వా. 1 శా. 44

62. ఐ.ఏ.పి: కడప డిస్ట్రిక్టు, వా. 3 శా.142.

63. ॥ వా. 3, శా. 161.

64. కపిలవాయి లింగమూర్తి పరిష్కరించిన మద్ది పట్ల అప్పన్న శాస్త్రి, కొట్రవెంకట రాయుడు రచించిన యోగాసక్తా పరిణయము, హైదరాబాదు, 1986.

65. శా.నం. 48/1991. శాసన విభాగం, శాసన విభాగం పురావస్తు శాఖ, హైదరాబాద్.

66. ఏఆర్ఇ 1918 శా. 18, అపెండిక్సు A, పేరాలు 84 -85.

67. కె. సుందరం, ఇన్ ఎపిగ్రాఫియాకా ఆంధ్రికా, వా. 5, పే. 33

68. ఎస్.ఐ.ఐ. వా. 6, శా .117

69. ॥ శా. 673

70. ॥ వా 5, శా 1203.

71. ఈమని శివనాగిరెడ్డి, 1995, పే. 177 -182.

72. ఎస్.ఐ.ఐ. వా. 10. శా. 66

73. నేలటూరు వెంకట రమణయ్య, విష్ణు కుండినులు, హైద్రాబాద్, 1975 పే. 66

74. ఎస్.ఐ.ఐ. వా. 10. శా. 66

75. ఎస్.వి పాడిగర్, కన్నడ యూనివర్శిటీ ధార్వాడ్ ఇచ్చిన సమాచారం.

76. సి. శివరామమూర్తి, ఈస్టర్న్ చాళుక్యన్ స్కల్ప్చర్ మద్రాస్ గవర్నమెంట్ మ్యూజియం 1965, పే. 11

మరపురాని మనస్వి

డా. ఎల్లూరి శివారెడ్డి

హైదరాబాదు నగరానికి నడిబొడ్డు ఆబిడ్సు. ఆబిడ్సు నుంచి ఒక రోడ్డు గత చరిత్రను నెమరేసు కుంటూ కాచిగూడా స్టేషన్ వైపు తిన్నగా సాగిపోతోంది. ఆబిడ్సు నుంచి కొంతదూరం సాగిపోతే కుడివైపు ఆంధ్ర దేశంలో మహనీయంగా వెలిసిన ఒక సాహితీసంస్థ ఠీవిగా కనిపిస్తుంది. ఆ సంస్థలోనికి ప్రవేశిస్తే ఎడమవైపు మూల గదిలో పత్రికలు పారచూస్తూనో, సందర్శకులతో సంభాషిస్తూనో, గ్రంథావలోకనం చేస్తూనో, కార్యాలయ వ్యవహారాలను సమీక్షిస్తూనో, ఒక విశిష్ట వ్యక్తి దర్శని మిస్తారు. మనిషి పొట్టిగా ఉన్నా మనస్సు మంచుమలతో పోటీచేసే వ్యక్తి ఆయన. డెబ్బది అయిదు వసంతాలు మీదపడ్డా ఆయన ఉత్సాహం తగ్గలేదు. కార్యదక్షత మొక్కపోలేదు. ఆయన పాద ధ్వనులకు, కంఠధ్వనులకు పరువం తగ్గలేదు. వారే డా॥ దేవులపల్లి రామానుజరావు గారు. ఆ సంస్థే ఆంధ్ర సారస్వత పరిషత్తు.

రామానుజరావు గారు గొప్ప మేధావి. ప్రముఖ సాహితీవేత్త. పత్రికా నిర్వహణదక్షులు. సంస్థా సక్రమ నిర్మాణ శీలురు. వాగ్మి. ప్రోత్సాహకులు. సాంస్కృతిక విజ్ఞాన చక్షువులు. తెలంగాణ వైతాళికులు.

వారి జన్మస్థలం ఓరుగల్లు మండలం. 1917 ఆగస్టు 25 నాడు జన్మించారు. హనుమకొండలో పాఠశాల విద్య పూర్తి చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులయ్యారు. యల్.యల్.బి. పట్టా నాగపూరు విశ్వవిద్యాలయం నుంచి పొందారు. ఆ తరువాత శోభ పత్రిక నడిపారు. 1941లో వరంగల్లులోని శబ్దాను శాసన ఆంధ్ర భాషా నిలయానికి కార్యదర్శిగా ఉండి దిగ్విజ యంగా రజతోత్సవాన్ని జరిపించారు.

1945-46లో వరంగల్లులో యువజన కాంగ్రెసుకు అధ్యక్షులుగా వున్నారు. రామానుజరావుగారి దక్షత గమనించి సురవరం వారు గోలకొండ పత్రికకు ఉప సంపాదకులుగా రమ్మని ఆహ్వానించారు. దానికి అంగీకరించి ఆ పత్రికతో ప్రగాఢ సంబంధం ఏర్పరచు కున్నారు. ఇలాగ తొలిదశలోని ఉత్సాహం తరువాత జీవన ప్రణాళికకు పునాదిగా నిలిచింది. కార్యరంగం హైదరా బాదుకు మారింది. తరువాత వారు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ కార్యదర్శిగా, అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా, విశ్వవిద్యాలయాలు, తెలుగు అకాడెమీ పాలనామండలి సభ్యులుగా, ప్రపంచ తెలుగు మహాసభలకు కోశాధికారిగా, నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులుగా ఎంతటి సేవలందిం చారో అందరికీ తెలుసు. వారు నిర్వహించిన తక్కిన పదవులు, బాధ్యతలు అపారం. ఇక్కడ ఏ సంస్థ పచ్చగా ఉన్నా అందులో రామానుజరావుగారి హస్తోదకం ఉంది. వారి సూచనల అభిసేచనం ఉంది.

రామానుజరావుగారు రచించిన గ్రంథాలు, సంపాద కత్వ బాధ్యతలు స్వీకరించిన గ్రంథాలు ఇరవై అయిదు దాకా వున్నాయి. వారి రచనలో వైవిధ్యం ఉంది. పచ్చతోరణం వంటి కవితారచనలో 'ప్రకృతి రామణీ యకము, పడతి కామనీయకము సరళ రమ్యముగా చిత్రితమైన' వని ఆచార్య సి. నారాయణరెడ్డిగారు అన్నారు. వారి రచనలకు ప్రతిధ్వనులున్నాయి. కాని వారి రచనలలో ప్రతిధ్వనులుండవు. వారి సారస్వత నవనీతము సాహిత్య విమర్శ అనుభవసంపుటి. తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము తెలంగాణ పడ్డపాట్లకు, పొందిన వెన్నుపోట్లకు సాహితీరూప దర్పణం. వారి "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" చదివి ఆనందింప దగినవి. అధ్యయనం చేసి ఆలోచింపదగినవి. వారి రచనలు స్వయం సమగ్రాలు. వారి అభ్యుదయ దృక్ప థానికి సూచకాలు. వారి విజ్ఞానానికి కేతనాలు.

రామానుజరావుగారి వ్యక్తిత్వానికి సమయపాలన, నియమపాలన రెండు కళ్ళు. వారు సాంస్కృతిక రంగంలో అడుగు వేసిన నాటినుంచి చేపట్టిన ప్రతి పని నిర్ణీత సమయ పరిధిలో పూర్తి కావలసిందే. ఏ పనికైనా సమయ

పాలన దక్షులైన వ్యక్తుల్నే నియమిస్తారు. రామానుజరావు గారికి నియమాలంటూ ప్రత్యేకంగా ఏమీ లేవు. క్రమశిక్షణే వారి నియమం. క్రమశిక్షణలో వారు మధ్యందిన మార్తాండులు. సంస్థల వినాశనానికి క్రమశిక్షణ రాహిత్యం అసలు కారణం అని అంటుంటారు. ఈ విషయం చాలామందికి తెలిసినా పాటించి, ఆచరింప జేయటంలో శ్రద్ధచూపరు. కాని ఈ విషయంలో వీరికి గట్టి పట్టుదల. ఉత్తరాలకు బదులు రాయటం మొదలుకొని, విశ్వ విద్యాలయ పాలనామండలి సభ్యులుగా వ్యవహరించే విషయందాకా ఏ విషయం తీసుకున్నా. వారికి క్రమ శిక్షణలో రాజీలుండవు. సంస్థలకు సంబంధించిన సొమ్మును ఖర్చు చేయడంలో మాడపాటి వారి పద్ధతిని ఎన్నో సార్లు గుర్తు చేస్తారు. వారికి ప్రమాణాల మీదనే కాని పరిమాణాల మీద విశ్వాసంలేదు.

దేవులపల్లివారు సురవరం ప్రతాపరెడ్డిగారికి ఆప్తులు. ఏ సభకు వెళ్ళినా సందర్భం చూసుకొని సురవరం వారి పేరు ప్రస్తావించక మానరు. ప్రతాపరెడ్డిగారు మరణించి సుమారు నలభై యేళ్ళు దాటాయి. వారి రచనలు చాలావరకు అలభ్యం. సురవరం ప్రతాపరెడ్డిగారి ప్రథమ కుమారులు శ్రీయస్.యస్. రెడ్డిగారి సహకారంతో రామానుజరావు గారు ప్రతాపరెడ్డిగారి గ్రంథాలు పన్నెండిటిని 'సురవరం ప్రతాపరెడ్డి వైజయంతి' పేరిట ముద్రించటంలో అత్యంత శ్రద్ధ తీసుకున్నారు. రెండేళ్ళ సమయంలో ఈ పన్నెండు పుస్తకాలు ప్రచురించటానికి వారి సమయపాలన వ్యగ్రత మొదటి కారణం. ప్రతాపరెడ్డి గారికి వారుచేసిన సేవ విలువ కట్టరానిది. ప్రతాపరెడ్డి గారి పేరిట ఏదైనా ఎవరైనా చేస్తే అది వారే చేశారు.

దేవులపల్లి వారి అభిరుచులు, ఆశయాలు ఉదాత్త మైనవి. వారి వ్యక్తిత్వానికి వన్నె తెచ్చింది అపారశేముషీ వైభవం. ఎన్నో విషయాలు వారు చెబుతూ వుంటే ఎదుట ఉన్నవారు చకితులై వింటారు. భారత జాతీయ నాయకుల వ్యక్తిత్వాలను తెలిపే సంఘటనలు, సూక్తులు పుంఖాను పుంఖంగా ఉదాహరిస్తూ గంటల కొద్దీ సంభాషిస్తారు. సాంస్కృతిక విషయాలను విశ్లేషించి సమదృష్టితో విషయాల్ని బేరీజు వేస్తారు. సాహిత్య విషయాల్లో వారి అభిప్రాయాలు నిగ్గుదేలినవి. పండితులకే పరిమితమైన ఛందో వ్యాకరణా లంకార విషయావగాహన ఒక్కటే విమర్శ కాదని వారి అభిప్రాయం. మనో వికాసా నికి, జాతి జాగృతికి, పేదల, దళితుల ఉద్ధరణకు పనికి వచ్చే అంశాల ప్రాముఖ్యాన్ని ఒత్తి చెబుతారు. తెలుగు విమర్శకుల్లో రాళ్ళపల్లి వారంటే అమితమైన అభిమానం. రాళ్ళపల్లివారి వ్యక్తిత్వం వారిని ఎంతగానో ఆకర్షించింది. వారిలాగా విషయతత్వం చెప్పటం విమర్శ పరమార్థమని రామానుజరావుగారి అభిప్రాయం. రచనల వెనుక భిత్తికగా నిలిచిన చారిత్రక, సాంస్కృతిక విషయాల్ని వారు అనుశీలించి చూపుతూవిషయాలు వివరిస్తారు. ప్రాచీన సాహిత్యాన్ని గురించి చేసేప్రసంగాల్లో అందులోని చారిత్రిక విషయాన్ని విశ్లేషించి చూపుతారు. ఆంగ్ల, హిందీ, ఉర్దూ రచనలు అధ్యయనం చేయటం వల్ల వారి దృష్టి బహు విషయాల్ని ప్రస్తరించి చూపుతుంది. వారికి సంస్కృత సాహిత్యాన్ని గురించిన సమ్యగవగాహన ఉంది.

ఏ విషయం మీదనైనా సాధికారంగా, సందర్భోచితంగా ప్రసంగించడంలో వీరికి ప్రత్యేకత వుంది. ప్రతిచిన్న సంఘటనకు సంబంధించిన తేదీలను కూడా గుర్తుంచు కొని విషయాన్ని సమగ్రంగా ఉదహరిస్తారు. రామానుజ రావుగారి కంఠధ్వనికి కూడా ప్రత్యేకత వుంది. వారు వక్తృ కంఠీరవులు. వారి గళానికి ఠీవి, భాషకు దర్జా ఉన్నాయి. ఈనాడు తెలుగు రాజధానిలో విద్వత్సభలకు, సాంస్కృతిక సభలకు అధ్యక్షులుగానో, ముఖ్య అతిధులుగానో సారథ్యం వహించే వారిలో డా॥ రామానుజరావు గారు, ఆచార్య సి. నారాయణరెడ్డిగారే అగ్రేసురులు. రామానుజరావుగారి భాషణలో విషయ ప్రాధాన్యం, విషయ వివేచనం సరిపాళ్ళలో ఉంటాయి. వారి ఉచ్చారణలో ఒక సౌందర్యం ఉంది. ప్రామాణిక తెలంగాణా భాషకు ప్రథమోదాహరణం వారిదే. తెలంగాణ తెలుగులోని తీయదనం, నుడికారపు సొంపువారి భాషలో తొణికిసలాడుతుంది. వారు ఏ గ్రంథాన్ని గురించి అభిప్రాయం ఇచ్చినా దాని నేపథ్యాన్ని తెలుపుతారు. ఆంగ్లంలో అనర్గళంగా భాషించగలరు. ఉర్దూలో ఉరకలు వేసే ప్రసంగాలు చేయగలరు.

తెలుగులో తేటగా ఉపన్యసించగలరు. వారు ఎంత చదువుతారో అంతకన్న ఎక్కువగా ఆలోచిస్తారు. ఏ రాజకీయ సిద్ధాంతాలకు వారు బద్ధులు కారు. విశాల మానవీయ దృక్పథం వారిది. నేటి సమస్యలేవో వారికి తెలుసు. వాటికి పరిష్కారాలేవో తెలుసు. నేటి సామాజిక రుగ్మతలను గురించి ఆవేదన చెందుతారు. అన్ని స్థాయిలలోని అవినీతిని తలచుకొని బాధపడతారు. విద్యాసంస్థలోని ప్రమాణాలను గురించి సాధికారంగా మాట్లాడగలరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయాల పాలనా మండలులలోని అనేక సంవత్సరాల అనుభవం ఆ విశ్వ విద్యాలయాలకు వారిచ్చే సూచనలలో, సలహాల రూపం లో చక్కని ఫలితాల నిస్తుంది. వారు ఏ సంస్థలో ఉంటారో అక్కడ ఆ సంస్థకు ఎంతో ఉపకారం జరుగుతుంది. వారి సేవను మన ప్రభుత్వం ఈ నాటికి ఎంత ఎక్కువగా వినియోగించుకో గలిగితే అంత ఉపకారకం, ప్రయోజనకరం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చేసిన పని రామానుజరావుగారి దక్షతకు గొప్ప దృష్టాంతం.

రామానుజరావుగారికి సమకాలికులైన తెలుగు పండితులు, కవులందరితో గాఢ పరిచయం ఉంది. విశ్వనాథ సత్యనారాయణగారు రామానుజరావుగారి అభిమాని. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారంటే వీరికి అంతులేని అభిమానం. గంటల కొలది వారితో సంభాషిస్తూ రామానుజరావుగారు పరవశించేవారు. వట్టి గాలిని పోగు చేసేమాటలు వీరికి నచ్చవు. ఇచ్చకాలకు బహుదూరం. సత్యాన్ని కచ్చితంగా చెప్పడంలో, హితాన్ని మృదువుగా చెప్పటంలో సవ్యసాచిత్వం వీరిది. ప్రముఖ ఉర్దూ పత్రికా సంపాదకులు శ్రీ ఆబిద్ అలీఖాన్ గారు వీరికి ఆప్తమిత్రులు. హైదరాబాదులోని ప్రజాస్వామిక దృక్పథం కలిగిన ముస్లిం ప్రముఖులకు ఆత్మీయులు వీరు. వారికి చెందిన అనేక సంస్థలలో వీరు సభ్యులుగా, ఆహూతులుగా ఉంటారు. ఉర్దూ భాషలోని ఎన్నో విషయాలు వీరికి వాచోవిధేయాలు. ప్రసిద్ధ రచయిత్రి డా॥ జీనత్ సాజిదాగారు వీరితో కలిసి ఒక నవలను తెలుగులోనికి అనువదించారు. శ్రీ ఆబిద్ ఆలీఖాన్ గారు ఒకచోట వీరిని గురించివ్రాస్తూ "Shri D. Ramanuja Rao is a shining example of the world famous "Hyderabad Culture" - a culture of love and tolerance with all communities; of amity and friendship; of affection and thoughtfulness" అని వివరించారు. ఒకో తరం, ఒకో జాతి కొందరు మహావ్యక్తుల విజ్ఞానకాంతిలో జీవితంలోని విలువైన విషయాలను గ్రహించటం జరుగుతుంది. ఆ మహా వ్యక్తులు ఏదిచేసినా సమాజం కోసమే. వారిని వరించే పదవులుంటాయి. వారు పొందదగిన సంపదలుంటాయి. వారు నిర్మించుకోగలిగిన సుఖ సాధాలుంటాయి. కాని ఈ అన్నింటినీ కాదనుకొని, జాతికి, భాషా సాహిత్యాలకు, సంస్కృతికి తమ జీవితాలు వెచ్చించిన వారే త్యాగ జీవులు. ధన్యజీవులు. ఈనాటి తెలుగువారిలో అలాంటి ప్రముఖులలో అద్వితీయులు డా॥ దేవులపల్లి రామానుజరావుగారు.

రామానుజరావుగారు పరిషత్తుకు చేసిన సేవ ఆంధ్రులు మరువరానిది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పరిషత్తు ప్రమాణ సహితమైన సేవ చేసింది. నిజాం పాలనలో గుడ్డి దీపంలాగా ప్రకాశించే తెలుగును ఉజ్వలంగా వెలిగే జ్ఞాన సూర్యునిలా తీర్చిదిద్దిన ఘనత పరిషత్తుకు దక్కుతుంది. పరీక్షలు నిర్వహించటం, సాహిత్య ఉపన్యాసాలు ఏర్పాటు చేయడం, ఉపన్యాసాలను ఉత్తమ గ్రంథాలను ప్రచురించటం, పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహించడం, పరిశోధకుల కోసం ఒక గ్రంథాలయాన్ని నడపడం పరిషత్తు ఆశయాలు. ఈ పని కొన్ని దశాబ్దుల నుంచి సక్రమంగా నిర్వహించటం సులభమైన పనికాదు. పరిషత్తు వెన్నెముక రామానుజరావు గారు. వారి నిరంతర కృషివల్లనే ఇవన్నీ సక్రమంగా సాగిపోతున్నాయి. పరిషత్తు అభ్యుదయానికి తమ జీవితంలోని సుఖాల్ని ధారపోశారు.

వారు తెలంగాణాలో 'తెలుగుదీపం ఆరిపోకూడదనే ఆశయంతో, భాషా స్రవంతి ఇంకిపోరాదనే తపనతో భాషాభివృద్ధి ఉద్యమంలో పాల్గొన్నారు. అయితే పాండిత్య భేషజం వైపు వారి బుద్ధి ప్రసరించలేదు. వీరేశలింగం

గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీలు వారి మనస్సును ఆకట్టుకున్నారు. "తిక్కన రచన - లేదా కవిత్రయ భారతం, చదివితే చాలు, ప్రబంధాలు అధ్యయనం చేయవలసిన అవసరం లేదు" అని వారి అభిప్రాయం. అయితే ప్రబంధాలను తిరస్కరిస్తూ ఆ మాట అనరు. ప్రబంధాలనుంచి ఎన్నో పద్యాలు వారు ఉదహరిస్తూనే ఉంటారు. ఇది వారి ఆర్జవమైన అభిప్రాయం. వారి అభిప్రాయాలన్నీ స్వచ్ఛందంగా ఆర్జవంగా ఉంటాయి. 'హింసాత్మక ఉద్యమాలు నేను ఇష్టపడను' అని అంటారు. "కవి స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచించాలి. గుండె పలికిన పలుకులు చెప్పగలగాలి" అని భరోసా యిస్తారు.

రామానుజరావుగారి జీవితాన్ని ప్రభావితం చేసిన వాళ్ళున్నారు. వారికి నచ్చిన పుస్తకాలు ఉన్నాయి. వారి రుచిరాభిరుచిని గురించి తెలుసుకోవటానికి శ్రీ ఆచార్య తిరుమల, శ్రీమతి సీతాశరచ్చంద్రగారు నిర్వహించిన "ముఖాముఖి" లో నుంచి ఉదాహరిస్తాను.

"నేను అఖిల భారత స్థాయి నాయకులచే ప్రభావితమైనాను. ఉదాహరణకు గాంధీ యుగానికి చెందిన నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఆచార్య నరేంద్ర దేవ్ గోఖలే, తిలక్, ప్రేంచంద్, గాలిబ్ ప్రముఖులు నా సాహిత్య ప్రజా జీవితాల్ని ప్రభావితం చేసారు".


"భారతం, భాగవతం శకత వాఙ్మయం - ప్రత్యేకంగా వేమన, తాళ్ళపాక కృతులు, త్యాగరాజ కృతులు, క్షేత్రయ పదాలు, వీరేశలింగం, చిలకమర్తి, పానుగంటి వారి కొన్ని రచనలు, గురజాడవారి ముత్యాలసరాలు, కన్యాశుల్కం, రాయప్రోలు వారి తృణకంకణం, ఆంధ్రావళి, తెనుగుతోట, విశ్వనాథవారి ఏకవీర, కిన్నెరసాని పాటలు, వేయిపడగలు, మహాప్రస్థానం, చలం కథలు, ముద్దుకృష్ణ సంకలనం వైతాళికులు, ఉన్నవగారి మాలపల్లి - తెలుగు వాళ్ళు తప్పక చదువాల్సిన పుస్తకాలు".

వారితో సంభాషిస్తే చాలు ఉత్తేజాన్ని పొందవచ్చు. వారి జీవితం ఎంత గొప్పదో రచనలంత గొప్పవి. ఈనాడు తెలుగుభాషా సాహిత్యాలకు పెద్దదిక్కు డా॥ రామానుజరావుగారు. వారు ఉదాత్తజీవితానికి ప్రతీక. సంస్కృతి - సాహిత్యపోషణకు ఆధార భూమిక. వారు సౌజన్య భూషితులు - సంస్కార విభూషితులు.

- డా॥ దేవులపల్లి రామానుజరావు గారి
అభినందన సంచిక నుంచి (1992)

DRAVIDIAN UNIVERSITY

KUPPAM 517 425



The Dravidian University, established in 1997 With the objective of promoting Dravidian Studies and Indigenous Science and Technology is Situated at Gudupalle Mandal near Kuppam, Chittoor District, Andhra Pradesh. The Campus Spread about 1094 acres, at the tri-junction of Andhra Pradesh, Karnataka and Tamil Nadu is a place of assimilation of Dravidian sub-cultures. The University is conceived as a collaborative academic venture involving the four southern states. viz. Andhra Pradesh, Tamil Nadu, Karnataka and Kerala and the Union Territory of Pondicherry. Housed in four Magnificent buildings named after Vemana, Thiruvalluvar, Narayanaguru and Basava, the campus is in the midst of silvan surroundings in a serene atmosphere.

The International Bodies like the United Nations Organisation (UNO), World Bank, etc. are bringing the nations all over the globe closer at present to comprehend the common features of different cultures and philosophies which will help to unite humanity. This is one of the main objectives of the Dravidian University.

The details of the Courses and Publications:

Courses

I. M.Phil. Ph.D Courses
(full tme / part time)
- (i) Comparative Dravidian Literature
- (ii) Dravidian Philosophy
- (iii) Folalore and Tribal Studies
- (iv) History, Archaeology and Culture

II. M.SC. Computer Science

III. M.A. in History

IV. M.A in Folklore and Tribal Studies

V. B.Sc. Course
- (i) Computer Science, Mathematistics
- (ii) Mathematcs, Physics and Chemistry
- (iii) Botany, Chemistry, Biotechnology

VI. B.com. Course

VII. B.B.M. Course

VIII. B.A. Course
- (I) History, Economics and Politics
- (ii) History, Philosophy and Telugu

IX. Certficate Course
(Duration - six months)
- (i) Computer Application
- (ii) Spoken English
- (iii) Yoga

Publication

1. Tirukkural of Tiruvalluvar in Telugu
2. Vemana Kavitatatvam (the phillosophy of Vemana's poetry)
3. Dravida Sahitya Sethuvu (Bridge of Dravidian Literature: Professor Challa)
4. Dravidian Folk and Tribal Lore (Seminar Proceedings)
5. Vemana Vachanangal (Translation of vemana's verses to Malayalam)
6. Word Structure in Dravidian (Seminar Proceedings)
7. Major Genres and Trends in Dravidian Classical Literature (Seminar Proceedings)
8. Pre and proto - Historic Andhra Pradesh upto 500 B.C (Telugu and English Versions)
9. Telugu Desya Vyutpatti Nighantuvu (Etymological Dictionary of Native Telugu)
10. Dravidian Studies-Quarterly Research Journal

Sd/-
REGISTRAR



పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

ప్రచురణలు

తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు	- 40.00	గోపీనాథ రామాయణం	- 100.00
పర్యావరణ పరిజ్ఞానం	- 85.00	విశ్వ సాహితి (విజ్ఞాన సర్వస్వం)	- 100.00
మలయమారుతాలు	- 50.00	భారత భారతి (విజ్ఞాన సర్వస్వం)	- 100.00
పాణినీయం- శాస్త్ర లక్షణాలు	- 120.00	సి.పి.బ్రౌణ్య ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు	- 250.00
భాషాంతరంగం	- 40.00	లలిత సంగీత చరిత్ర	- 40.00
తెలుగుభాష చరిత్ర	- 60.00	చిత్రకళ	- 40.00
కథానికా లక్ష్యం-లక్షణాలు	- 50.00	మిమిక్రీ	- 30.00
రాష్ట్రస్థాయి జానపద కళోత్సవాల సంచిక	-100.00	సంగీత సంప్రదాయ ప్రదర్శిని(1)	- 70.00
తెలుగు శాసనాలు	- 120.00	సంగీత సంప్రదాయ ప్రదర్శిని(2)	- 70.00
పల్నాటి వీర చరిత్ర	- 40.00	సంగీత సంప్రదాయ ప్రదర్శిని(4)	- 90.00
తెలుగుభాష స్వరూపం	- 60.00	ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర(1)	- 100.00
రంగనాథ రామాయణం	- 63.00	ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర(2)	- 80.00
యయాతి చరిత్ర	- 140.00	సాత్వికాభినయం	- 70.00
చంద్రిక పరిణయం	- 150.00	హస్తాభినయం	- 85.00
అనర్ఘ రాఘవం	- 80.00	తెలంగాణా ఆంధ్రోద్యమం	- 42.00
శివరాత్రి మహత్మ్యం	- 70.00	రాజమండ్రి చరిత్ర	- 40.00
కాటమరాజు కథ	- 270.00	హైదరాబాద్ నగర చరిత్ర	- 65.00
పండితారాధ్య చరిత్ర	- 45.00	బసవ పురాణం	- 85.00
వందేమాతరం నుండి జనగణమనవరకు	- 70.00	విశ్వనాథభారతి	- 60.00
తెలుగు జానపదవిజ్ఞానం-సమాజం-సంస్కృతి-సాహిత్యం	- 70.00	సాహిత్య వ్యాసాలు (1999)	- 50.00
పాశ్చాత్య సాహిత్య-చరిత్ర విమర్శ సిద్ధాంతాలు	- 48.00	సాహిత్య వ్యాసాలు (2000)	- 40.00
ఆంధ్ర మహాభారతం (నాలుగు సంపుటాలు)	- 340.00	సాహిత్య వ్యాసాలు (2001)	- 60.00

పై గ్రంథాలు హైదరాబాద్‌లో విశ్వవిద్యాలయ ప్రచురణల విక్రయశాలలో లభిస్తాయి. అన్ని పని దినాల్లో ఉదయం 11 గం॥ నుండి సాయంత్రం 4 గంటల వరకు తీసుకోవచ్చు.

ఇతర వివరాలకు : డైరెక్టర్, ప్రచురణల విభాగం, **పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,** పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్- 4. ఫోన్. 23230435.

ఆచార్య టి. గౌరీశంకర్
రిజిస్ట్రారు

674

అగ్రేసర

భాషా సాహిత్య సాంస్కృతిక సంస్థ

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్, హైదరాబాద్

వికాసాభ్యుదయాలను కాంక్షిస్తూ

అభినందనలతో . . .



సారిపల్లి కొండలరావు

అధ్యక్షులు

డా. అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్తు

హైదరాబాదు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

శ్రీ వేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి

'దేవాలయం దేవుని ప్రతిరూపం'

